# ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ.ప్ర.)

గుంటూరు, ఆంధ్రప్రదేశ్

Vol. : 26 Issue : 2 (2) Spl. Edition డిసెంబర్ - 2022 ISSN No. : 2457-0796


Azadi Ka Amrit Mahotsav

## అంతర్జాతీయ అంతర్జాల సదస్సు

# జాతీయోద్యమం - అనుభవాలు, జ్ఞాపకాలు, సాహిత్యం

## "National Movement – Experiences, Memories, Literature"

10 & 11 ఆగస్టు, 2022


UGC APPROVED JOURNAL

మూసీ ప్రత్యేక సంచిక

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాస పత్రిక




నిర్వహణ

తెలుగు శాఖ

ప్రభుత్వ మహిళా కళాశాల, (స్వ.ప్ర.) గుంటూరు




75
అంతర్జాతీయ అంతర్జాల సదస్సు
అంశం : జాతీయోద్యమము
అనుభవాలు-జ్ఞాపకాలు-సాహిత్యం
వేదిక - ZOOM



వ్యవస్థాపకులు
**శ్రీ బి.ఎన్.శాస్త్రి**



# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

సంపుటి : 26 సంచిక : 2(2) డిసెంబర్ - 2022

**సంపాదకులు** (EDITOR)
సాగి కమలాకర శర్మ
**SAGI KAMALAKARA SHARMA**

**సహ సంపాదకులు** (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
**Dr. DATTAIAH ATTEM**

**Printed and Published by**
**B. Anantha Laxmi**
*Type Setting at :*
**Kavyasree Graphics**
**Ph: 934 797 1177**

**Printed at : Sri Sai Process Ph. 27563075**

**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 200/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
**(పది సంవత్సరాలు మాత్రమే)**

చెక్కులు, డి.డి.లు **'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine)** పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : **మేనేజర్, మూసీ మాసపత్రిక,**
2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013

**ఈ పత్రికలోని వ్యాసాలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,**
3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

# అంతర్జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక

# జాతీయోద్యమం - అనుభవాలు, జ్ఞాపకాలు, సాహిత్యం

**10 - 11 ఆగస్టు, 2022**

**మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక**

**ప్రథమ ముద్రణ** : డిసెంబర్, 2022

**ప్రతులు** : 500

**కాపీలకు** : **ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ.ప్ర.), గుంటూరు, ఆం.ప్ర.**

**గమనిక :** ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయాలతో సంపాదక వర్గానికి సంబంధం లేదు.

**ఎడిటోరియల్ చిరునామా**

మేనేజర్, **మూసీ మాసపత్రిక,**

2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట,

బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013

ఫోన్ : 934 797 1177

**email : editormusi@gmail.com**

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 13 హైదరాబాద్ డిసెంబరు - 2022

# ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ.ప్ర) గుంటూరు

## జాతీయోద్యమం - అనుభవాలు, జ్ఞాపకాలు, సాహిత్యం

**10 - 11 ఆగస్టు, 2022**

ప్రధాన సంపాదకులు

**డా. కట్టెపోగు సురేష్ కుమార్**

సహాయ సంపాదకులు

**డా. యస్. దివిజాదేవి**

సంపాదక సభ్యులు

డా. వి. భవాని

డా. డి. ధాత్రికుమారి

డా. పి. విజయలక్ష్మి

**తెలుగు శాఖ**

**ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ.ప్ర.)**

**గుంటూరు**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 13 హైదరాబాద్ డిసెంబరు - 2022
UGC Care List Approved Journals




Commissionerate of Collegiate Education
Government of Andhra Pradesh
స్వాతంత్ర్య అమృత మహోత్సవం
Estd. 1942
ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ.ప్ర.), గుంటూరు
అంతర్జాతీయ అంతర్జాల సదస్సు
అంశం : జాతీయోద్యమము
అనుభవాలు-జ్ఞాపకాలు-సాహిత్యం
10&11 ఆగష్టు, 2022
11.08.2022 - సమాపనోత్సవం(రెండవ రోజు కార్యక్రమం, మ. 3.00 గం. ల నుండి.)
వేదిక - ZOOM
కీలకోపన్యాసకులు
ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు
తెలుగుశాఖాధిపతి, కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్
సదస్సు అధ్యక్షులు,
డా. వి.ఆర్. జ్యోత్స్న కుమారి
ప్రాచార్యులు & ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, గుంటూరు
ముఖ్య అతిథి
డా. ఎస్. వి. కృష్ణారావు.
తెలుగు శాఖాధిపతి,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం. గుంటూరు.
ప్రత్యేక అతిథి
డా. తోటకూర ప్రసాద్
ఆత్మీయ అతిథి
డా. జె. అప్పారావు
తెలుగుశాఖాధిపతి, ఆంధ్రవిశ్వవిద్యాలయం
విశాఖపట్నం.
ఆత్మీయ అతిథి
డా. ఇ. మాధవి
తెలుగుశాఖ ఆచార్యులు,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.
ఆత్మీయ అతిథి
డా. వి. శ్రీదేవి
ప్రాచార్యులు, చేబ్రోలు కళాశాల
ఆత్మీయ అతిథి
డా. బూసి వెంకటస్వామి
తెలుగు శాఖ, ఆంధ్రవిశ్వవిద్యాలయం, విశాఖపట్నం
ఆత్మీయ అతిథి
డా. కోయికోటేశ్వర రావు
అసిస్టెంట్ ప్రొఫెసర్ తెలుగు సిటీ కళాశాల, హైదరాబాద్.
సదస్సు సంచాలకులు
డా. కె. సురేశ్ కుమార్
అధ్యక్షులు, తెలుగు శాఖ
సదస్సు సమన్వయ కర్త
డా. యస్. దివిజాదేవి
సహ సంచాలకులు
డా. డి. ధాత్రికుమారి
సహాయ సంచాలకులు
డా. వి. భవాని,
శ్రీమతి పి. విజయలక్ష్మి

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | సందేశం | – డా. పోలా భాస్కర్, (ఐఏఎస్) | viii |
| 2. | అభినందన | – డా. వి.ఆర్. జ్యోత్స్న కుమారి | ix |
| 3. | ముందుమాట | – డా. కట్టెపోగు సురేష్ కుమార్ | x |

| | | | |
|---|---|---|---|
| 1. | జాతీయోద్యమం సాహిత్యం | – ఆచార్య తుమ్మల రామకృష్ణ | 12 |
| 2. | జాతీయోద్యమం మన సంస్కృతి | – ఆచార్య పి. వరప్రసాదమూర్తి | 14 |
| 3. | జాతీయోద్యమ నాయకులతో నా జ్ఞాపకాలు | – ఆచార్య ఆర్.వి.యస్. సుందరం | 17 |
| 4. | జాతీయోద్యమం అనేది ఒక నిరంతర స్ఫూర్తి | – ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు | 21 |
| 5. | ఆంధ్రదేశంలో జాతీయోద్యమ పాత్ర | – ఆచార్య విస్తాలి శంకర రావు | 33 |
| 6. | జాతీయోద్యమం – నా అనుభవాలు | – డా. కూరెళ్ల విఠలాచార్య | 35 |
| 7. | టంగుటూరి ప్రకాశం పంతులు – నా జ్ఞాపకాలు | – టంగుటూరి శ్రీరామ్ | 37 |
| 8. | పింగళి వెంకయ్య గారు – జ్ఞాపకాలు | – డా. జి.వి.యస్. నరసింహం | 40 |
| 9. | జాతీయోద్యమం – గేయం | – డా. తోటకూర ప్రసాద్ | 42 |
| 10. | జాతీయోద్యమం – నిషేధ గేయాలు | – ఆచార్య ఎన్. వి. కృష్ణారావు | 45 |
| 11. | జాతీయోద్యమం | – డా. ఇ. మాధవి | 48 |
| 12. | స్వాతంత్ర్యోద్యమ కవయిత్రి శ్రీమతి తల్లాప్రగడ విశ్వసుందరమ్మ | – డా. వెలువోలు నాగరాజ్యలక్ష్మి | 51 |
| 13. | అనంతజిల్లాలో గాంధీజీ జ్ఞాపకాలు – అనంతవాసుల అనుభవాలు | – డా. వి. శ్రీదేవి | 59 |
| 14. | స్వాతంత్ర్య ఫలం | – డా. తొట్టెంపూడి శ్రీ గణేష్ | 63 |
| 15. | జాతీయోద్యమం | – డా. బూసి వెంకటస్వామి | 65 |
| 16. | దేశాభిమాని త్యాగశీలి శ్రీ కోపల్లె హనుమంతరావు | – మణినాథ్ కోపల్లె | 67 |
| 17. | తెలుగులో జాతీయోద్యమ సాహిత్యం | – డా. కట్టెపోగు సురేష్ కుమార్ | 75 |
| 18. | ధీర వనిత ఉన్నవ లక్ష్మీబాయమ్మ | – డా. వాసిరెడ్డి భవాని | 78 |
| 19. | జాతీయోద్యమ స్త్రీల కథలు – విశ్లేషణ | – డా. దోమల ధాత్రికుమారి | 82 |
| 20. | జాతీయోద్యమంలో స్త్రీ చైతన్యం | – డా. యస్. దివిజాదేవి | 87 |
| 21. | జాతీయోద్యమంలో కనుపర్తి వరలక్ష్మమ్మ | – డా. పరుచూరి విజయలక్ష్మి | 93 |
| 22. | జాతీయవాదిగా ఆచార్య తిరుమల | – డా. కాకుమాని శ్రీనివాసరావు | 98 |
| 23. | ఆదర్శ మహిళ శ్రీమతి ముసునూరి కస్తూరి దేవి | – డా. వై. శ్రీలత | 102 |
| 24. | 'స్వాతంత్ర్య సిద్ధి' కావ్య వైశిష్ట్యం | – డా. కానుకొల్లు బాలకృష్ణ | 105 |
| 25. | తెలుగు సాహిత్యంలో జాతీయోద్యమ భావనలు – ఒక పరిచయం | – డా. రత్నశేఖర్ కట్టెపోగు | 112 |
| 26. | జాతీయోద్యమ కవిగా మంగిపూడి | – డా. కె. కరుణశ్రీ | 116 |
| 27. | జాతీయోద్యమం భారత స్వాతంత్ర్య వీరాంగన కనకమ్మ | – డా. గోపవరం పద్మప్రియ | 122 |
| 28. | భారత జాతీయోద్యమం – 'కథ' పాత్ర | – డా. కె. ఎన్. సుందరేశ్వర రావు | 126 |
| 29. | జాతీయోద్యమం – మహిళల సాహిత్యం | – డా. చింతల రాకేశ్ భవాని | 129 |

| | | | |
|---|---|---|---|
| 30. జాతీయోద్యమం – తెలుగు కవులు | – | రాఘవేంద్ర రావు | 134 |
| 31. జాతీయోద్యమంలో సర్దార్ జమలాపురం కేశవరావు పాత్ర | – | నూనావతు పార్వతి | 137 |
| 32. జాతీయోద్యమ ప్రభావం – గిరిజన నవల నేపథ్యం | – | డా. జరుపుల రమేష్ | 143 |
| 33. మల్లాది రామచంద్రశాస్త్రి – జాతీయోద్యమ గేయాలు | – | దారపురెడ్డి కనకమహాలక్ష్మి | 151 |
| 34. జాతీయోద్యమ సాహిత్యం – కవుల పాత్ర | – | డా. బి. శ్రీనివాసరావు | 154 |
| 35. జాతీయోద్యమ కథలు | – | డా. కె. సుజాత | 156 |
| 36. తెలుగు కథల్లో జాతీయోద్యమం | – | డా. ఉషారాణి పిల్లి | 160 |
| 37. చలం – సుశీల | – | డా. గుంటుపల్లి గౌరి | 168 |
| 38. దేశభక్తి ప్రభోదం – గరిమెళ్ళ గేయాలు | – | డా. ఆంజనేయుడు | 171 |
| 39. ఆంధ్రాప్రాంతంలో జరిగిన జాతీయోద్యమంలో తెలుగు పత్రికలపాత్ర | – | డా. సి.వి.పవన్ కుమార్ | 176 |
| 40. జాతి కర్తవ్యమును ప్రబోధించిన 'దేశభక్తి' గేయం | – | డా. కె. శ్యామలాదేవి | 179 |
| 41. జాతీయోద్యమ దీప్తి – ప్రజల మనిషి నవల | – | పొన్నెకంటి స్వప్న | 182 |
| 42. తెలుగులో జాతీయ కవిత్వోద్యమం – తొలి దశ | – | డా. నల్లపనేని విజయలక్ష్మి | 187 |
| 43. తెలుగు నాటకం – స్వాతంత్ర్యోద్యమం | – | డా. నేలటూరి అనిత మార్గరేట్ | 191 |
| 44. విశ్వనాథ నవలలు – జాతీయోద్యమ స్ఫూర్తి | – | ఆతుకూరి వేంకటేశ్వర్లు (యోగి) | 194 |
| 45. ఉన్నవ వారి మాలపల్లి నవల – జాతీయోద్యమ దృక్కోణం | – | జి. రమేష్ బాబు, డా. కె. పుష్పమ్మ | 198 |
| 46. సంఘ సంస్కరణోద్యమం – కథా సాహిత్యం | – | వంకం భాస్కర్ | 201 |
| 47. జాతీయోద్యమం – దేశభక్తి కథలు పరిశీలన | – | లెంక సత్యనారాయణ | 204 |
| 48. తెలుగు నవల – జాతీయోద్యమ ప్రభావం | – | డా. ఎం. రమేశ్ బాబు | 208 |
| 49. జాతీయోద్యమ కవిత్వం | – | డా. కె. లక్ష్మీనారాయణ | 212 |
| 50. తెలుగులో జాతీయోద్యమ నవలలు – గాంధీజీ ప్రభావం | – | డా. హరీష్ కుమార్ శ్రీధర | 218 |
| 51. విరాట్ స్వరూపుడు | – | దామరాజు విశాలాక్షి | 223 |
| 52. ఆంధ్రప్రదేశ్‌లో జాతీయోద్యమ స్ఫూర్తి | – | డా. సముద్రాల ప్రిస్కిల్ల | 227 |
| 53. నిషేధిత జాతీయోద్యమ సాహిత్యం – నేపథ్యం | – | డా. టి. జాన్ కిరణ్ బాబు | 230 |
| 54. భారతదేశ సాతంత్రోద్యమం – దేశభక్తి గేయాలు | – | డా. జి. సుహాసిని | 234 |
| 55. జాతీయోద్యమ నవల – 'కొల్లాయి గట్టితేనేమి' | – | డా. పలివెల చిరంజీవిరావు | 237 |
| 56. తెలుగు నాటకాలు – జాతీయోద్యమం | – | ఎం.ఎల్.ఎస్. కుమారి | 242 |
| 57. జాషువా 'శివాజీ' కావ్యం – జాతీయోద్యమస్ఫూర్తి | – | డా. చాట్ల కిషోర్ | 245 |
| జాతీయోద్యమం – మరువరాని మలుపులు | | | |
| 58. స్వాతంత్ర్యపోరాటానికి క్రైస్తవుల తోడ్పాటు | – | డా. ప్రత్తిపాటి మాథ్యు | 251 |
| 59. జాతీయోద్యమం – ప్రజల మనిషి నవల | – | డా. ఎన్. నిశ్చల | 259 |
| 60. మాకొద్ది తెల్లదొరతనము – జాతీయోద్యమ గేయం అనుశీలన | – | డా. జి. అనిత | 263 |
| 61. జాతీయోద్యమం – గరిమెళ్ళ చైతన్యం | – | షేక్ షానాజ్ బేగం | 266 |
| 62. గరిమెళ్ళ గేయాలు – జాతీయ చైతన్యం | – | డా. గుండెమెడ శ్రీనివాసరావు | 270 |
| 63. జాతీయోద్యమంలో తెలుగు సాహిత్యం పాత్ర | – | డా. నాయని మల్లికార్జున | 278 |



## సందేశం

**డా. పోలా భాస్కర్ (ఐఏఎస్),** కమీషనర్ – కళాశాల విద్యాశాఖ,
అదనపు కమీషనర్ – సాంకేతిక విద్యాశాఖ, విజయవాడ, ఆం.ప్ర.

"భారత స్వాతంత్ర్య అమృతోత్సవాలు" లో భాగంగా గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాల, తెలుగు విభాగం వారు సందర్భోచితంగా "జాతీయోద్యమం – అనుభవాలు, జ్ఞాపకాలు, సాహిత్యం" అనే మంచి అంశాన్ని ఎన్నుకొని సదస్సును నిర్వహించారు. స్వాతంత్ర్య పోరాటంలో వీరోచితంగా పాల్గొని తమ సర్వస్వాన్ని అర్పించిన మహానుభావులను గురించి నేటి తరానికి పరిచయం చేయడం బాగుంది. ఆ తరం వారి వారసులను ఈ సదస్సుకు ఆహ్వానించడంచాలా సంతోషం. శుభ పరిణామం.

సాహిత్యం సమాజాన్ని ప్రతిబింబిస్తుంది. సాహిత్యానికి, సమాజానికి అవినాభావ సంబంధం ఉంది. డెబ్భై అయిదు వసంతాల స్వాతంత్ర్య భారతదేశం సామాజిక, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, సాంకేతిక రంగాలలో గణనీయమైన ప్రగతిని సాధించి, ప్రపంచదేశాలతో సమానంగా పయనిస్తుంది. సాహిత్యం ఇలాంటి విషయాలను నేపథ్యంగా తీసుకొని నూతన ప్రక్రియలతో సాహిత్య సృజన చేయాల్సిన అవసరం ఉంది.

"ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక" అంటారు. అలాంటి చైతన్య వంతమైన సాహిత్యం ఎంతో మందికి స్ఫూర్తినిస్తుంది. స్ఫూర్తివంతమైన ప్రసంగాలతో సాగిన ఈ సదస్సు జాతీయోద్యమానికి సంబంధించిన అనేక విషయాలను స్పృశించింది. నూతన కోణాలను ఆవిష్కరించింది. అలాంటి పరిశోధనా పత్రాలు ఒకచోట కూర్చి "యు.జి.సి. కేర్ జర్నల్ మూసి" లో ప్రచురించి భావి తరాలకు అందుబాటులోకి తేవడమనే బృహత్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన తెలుగుశాఖ అధ్యాపకుల సంకల్పం అభినందనీయం.

"శుభంభూయాత్".

**(డా. పోలా భాస్కర్) (ఐఏఎస్)**
కమీషనర్

## అభినందన

**డా. వి.ఆర్. జ్యోత్స్న కుమారి,** ప్రాచార్యులు, ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ.ప్ర.),
ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, గుంటూరు



గుంటూరు ప్రాంతంలో 1942లో స్త్రీల విద్యాభివృద్ధి కోసం THE LADY HOPE Municipal College అనే పేరుతో ఈ కళాశాల మొదలైంది. ప్రస్తుతం "Govt. College for Women (A) గుంటూరు" పేరుతో ఈ కళాశాల కొనసాగుతున్నది. అప్పటి నుండి ఎంతోమంది మహిళలకు. వెలుగు నిచ్చిన కళాశాల నేడు దాదాపు 3500 మంది విద్యార్థినులతో, ఆర్ట్స్, సైన్స్, కామర్స్, U.G, P.G కోర్స్‌లతో గుంటూరు పట్టణంలో మహిళలకు ప్రముఖ విద్యా కేంద్రంగా అన్ని సౌకర్యాలతో వర్ధిల్లుతోంది.

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' కార్యక్రమంలో భాగంగా మా కళాశాల అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుంది. అందులో భాగంగా తెలుగు శాఖ అధ్యాపకులను ఒక సదస్సును నిర్వహించండని, అది జాతీయోద్యమ నేపథ్యంతో ఉండాలని, స్వేచ్ఛా, స్వతంత్రతల విలువ నేటి తరానికి తెలియజేసేదిగా ఉండాలని సూచించాను. వెంటనే మా కళాశాల తెలుగుశాఖ అధ్యాపకులు 'అంతర్జాతీయఅంతర్జాల సదస్సు' ను "జాతీయోద్యమం అనుభవాలు –జ్ఞాపకాలు –సాహిత్యం" అనే అంశంపై నిర్వహిస్తామని ముందుకు వచ్చారు. దానికి అనుగుణంగా కార్యక్రమాన్ని రూపొందించుకున్నారు.

ఈ సదస్సులో ఆనాటి జాతీయ పోరాటంలో పాల్గొన్న వారి వారసులు తమ అనుభవాలను, జ్ఞాపకాలను మనతో పంచుకున్నారు. ఇంకా చాలామంది ఆచార్యులు, అధ్యాపకులు తెలుగు సాహిత్యంలో వచ్చిన వివిధ జాతీయోద్యమ సాహిత్యాన్ని ఈ సదస్సులో పరిశోధనా పత్రాలుగా సమర్పించారు.

'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఆశించిన ఫలితాలు ఈనాడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల వెనుక ఎందరో మహనీయుల త్యాగాలు, ఆనాటి వారి పోరాట స్ఫూర్తి, త్యాగనిరతి, దేశభక్తి, స్వేచ్ఛా భారతం కోసం కన్న కలలు, అనుభవించిన శ్రమలు నేటితరం తెలుసుకోవడానికి ఈ సదస్సు దోహదం చేసిందని భావిస్తున్నాము. ఈ రకంగా ఈ సదస్సు ఈ లక్ష్యాన్ని సాధించింది అనడానికి నిదర్శనం ఈ సదస్సులో సమర్పించిన వ్యాసాలు. వాటి నన్నింటిని 'యు.జి.సి. కేర్ జర్నల్' అయిన "మూసి" పత్రికలో ప్రచురించి అందరికీ అందుబాటులోకి తెస్తున్నందుకు మా కళాశాల తెలుగుశాఖ అధ్యాపకులు అందరికీ అభినందనలు.



**(డా. వి.ఆర్. జ్యోత్స్న కుమారి)** ప్రాచార్యులు



# ముందుమాట

**డా. కట్టెపోగు సురేష్ కుమార్,** సదస్సు కన్వీనర్,
ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ.ప్ర.), గుంటూరు

భారతదేశం బ్రిటీష్ వారి పాలన నుండి విముక్తమై 75 వసంతాలు అయ్యింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని దేశమంతటా 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' సంబరాలు ఘనంగా జరుపుకుంటున్నాం. ఇందులో భాగంగా నేటి తరానికి స్వతంత్ర పోరాట చరిత్ర, పెద్దల త్యాగాలు, స్వేచ్ఛా స్వతంత్రతల విలువ, జాతీయతాభావ ప్రాముఖ్యం, లౌకిక భావనలు మొ. తెలిపి, వారిలో జాతీయతా భావనా స్ఫూర్తిని రగిలించే కార్యక్రమాలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ.ప్ర.) గుంటూరు, తెలుగుశాఖ ఏర్పాటు చేస్తున్న 'జాతీయోద్యమం – అనుభవాలు, జ్ఞాపకాలు, సాహిత్యం' అనే 'అంతర్జాతీయ అంతర్జాల సదస్సు'పై లక్ష్యాలను చేరుకుంటుందని ఆశిస్తూ ఏర్పాటు చేయడం జరిగింది.

వేల సంవత్సరాల చరిత్ర కలిగిన భారతదేశం నేటికీ ప్రపంచ దేశాల్లో తలమానికంగా ఉంది. తన సనాతన అస్థిత్వాన్ని వీడలేదు. "మాతా పృథివీ పుత్రోహం పృథివ్యా" అని ఈ నేలను తల్లిగా పూజించారు. భిన్న భాషలు, భిన్న మతాలు, ప్రాంతాలు, జాతులు. ఎంతో వైవిధ్యం ఉన్నా మేమంతా భారతీయులం అనే భావన సర్వత్రా కనిపిస్తుంది. "రక్షతి బ్రహ్మేదం భారతం జనం" అంటూ వేద ఋషులు ప్రార్థించిన నాటికే భారతీయులు ఒకే జాతిగా ఉన్నారు. అయినప్పటికీ, అప్పుడప్పుడు కొన్ని కుదుపులు దేశాన్ని కదుపుతూనే ఉన్నాయి. దేశంలో ఇలాంటి కుదుపులు వేర్పాటు వాదం, ఆక్రమణలు, మొ. సంభవించినప్పుడు వాటిని సరిచేయడానికి, ఎందరో మహానుభావులు ఉదయించారు. అగస్త్యుడు, బుద్ధుడు, ఆది శంకరాచార్యులు లాంటి మహానుభావులు పుడుతూనే ఉన్నారు.

ఆధునిక కాలంలో భారతదేశం బ్రిటిష్ వారి కబంధహస్తాలపాలైంది. ఈ క్రమంలో జాతిని మేల్కొలుపుతూ దేశ విముక్తి కోసం ఎందరో మహనీయులు పోరాటం చేశారు. దేశమంతా స్వతంత్ర పోరాటం కొనసాగుతున్న వేళ, తెలుగు జాతి ఉధృతంగా ఈ పోరాటాన్ని కొనసాగించింది. "యావద్భారతమునకు కిరీట ప్రాయమైన యాంధ్రదేశమునకు గుంటూరు మండలము నాయకమణి" అని గుఱ్ఱం జాషువ చెప్పినట్లు దేశ వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు మొదలుపెట్టడానికి స్ఫూర్తి నిచ్చిన ప్రాంతం గుంటూరు. పన్నుల నిరాకరణ, సహాయనిరాకరణ, ఉప్పు చట్టాలు ఉల్లంఘించటం, స్వపరిపాలన, అస్పృశ్యతా నివారణ, స్త్రీ జనోద్ధరణ, సాయుధ పోరాటం...... ఇట్లా పలు అంశాలు – జాతీయ నాయకులకు స్ఫూర్తినిచ్చాయి. దేశవ్యాప్తంగా పోరాట కార్యక్రమాలు రూపొందించుకోవడానికి తోడ్పడ్డాయి. ఉదా: పల్నాడు పుల్లరిఉద్యమం. పెదనందిపాడు పన్నుల నిరాకరణ, చీరాల పేరాల ఉద్యమం, తెనాలి బాంబు కేసు, కోటప్పకొండ సంఘటనలు..... అందుకే "సీమలలోన పెఱసీమ గుంటూరు" అంటారు గుఱ్ఱం జాషువ.

రాజకీయ చైతన్యానికి, పోరాటాలకు పురిటిగడ్డ. విద్యలకు కేంద్రం. కళలకు కాణాచి. భాషా సంస్కృతులు పరిఢవిల్లి, వికసించిన ప్రాంతం. ప్రాచీనకాలం నుంచి మానవ నాగరికత వర్ధిల్లిన ప్రాంతం. శాతవాహనులపూర్వులు, శాతవాహనులు,

ఇక్ష్వాకులు, పల్లవులు, బృహత్పలాయనులు, ఆనంద గోత్రికులు, శాలంకాయనులు, విష్ణు కుండినులు, హైహయ వంశీయులు,తెలుగు చోడులు, రెడ్డి రాజులు ఇలా ఎన్నో రాజవంశాలు ప్రభవించిన నేల. వారికి రాజధాని ప్రాంతమై కళలు, సాహిత్యాల గొప్పతనాన్ని విస్తరింపజేసిన నేల గుంటూరు సీమ.

జాతీయోద్యమ కాలంలో తెలుగులో వచ్చిన సాహిత్యాన్ని, పోరాటంలో పాల్గొన్న వారి అనుభవాలను, జ్ఞాపకాలను ఈ సందర్భంగా నేటి తరానికి అందించడం ఎంతో అవసరం. ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ. ప్ర) గుంటూరు, తెలుగుశాఖ నిర్వహించిన "జాతీయోద్యమం – అనుభవాలు, జ్ఞాపకాలు, సాహిత్యం" అనే అంతర్జాతీయ అంతర్జాల సదస్సు ఆశించిన ప్రయోజనాలను సాధించిందని భావిస్తున్నాము. సదస్సు సాధించిన ప్రయోజనాలను అందరికీ అందుబాటులోకి తీసుకురావటానికి పుస్తకంగా తీసుకు వస్తున్నాము.

ఈ ప్రయత్నంలో మాకు సహకరించిన కళాశాల విద్య సంచాలకులు డా . పోలా భాస్కర్ IAS గారికి, కళాశాల ప్రాచార్యులు మరియు ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డా.వి.ఆర్. జ్యోత్స్నకుమారిగారికి, తమ తమ కార్యక్రమాల నిర్వహణలో తీరిక లేకుండా ఉన్నా అభిమానంతో మా ఆహ్వానాన్ని మన్నించి కార్యక్రమంలో పాల్గొన్న సుమనస్కులైన పెద్దలు ఆచార్య తుమ్మల రామకృష్ణ గారు, ఆచార్య వరప్రసాద మూర్తి గారు, ఆచార్య ఆర్. వి. యస్. సుందరం గారు, ఆచార్య దార్ల వేంకటేశ్వరరావు గారు, ఆచార్య విస్తాలి శంకరరావు గారు, ఆచార్య ఎన్.వి. కృష్ణారావు గారు, ఆచార్య మాధవి గారు, డా. జీవియల్. నరసింహం గారు, శ్రీ టంగుటూరి శ్రీరామ్ గారు, డా. కూరెళ్ల విఠలాచార్య గారు, డా. నాగరాజ్య లక్ష్మీ గారు, డా. కోయికోటేశ్వర రావు గారు, డా. తోటకూర ప్రసాద్ గారు, డా. తొట్టెంపూడి శ్రీగణేష్ గారు, డా. బూసి వెంకటస్వామి గార్లకు నమస్సుమాంజలులు.

'మూసీ' పత్రికలో మా సదస్సు వ్యాసాలను అచ్చువేయడానికి అంగీకరించిన పత్రిక సంపాదకులు ఆచార్య సాగి కమలాకరశర్మ గారికి, సహ సంపాదకులు డా. దత్తయ్య అట్టెం గారికి, ముద్రణలో సహకరించిన 'అమ్మనుడి' పత్రికా సంపాదకులు సామల రమేష్ బాబు గారికి, అందమైన కవర్ పేజీని అందించిన శ్రీమాన్ గ్రాఫిక్స్ యెల్చాల నర్సింలు గారికి, మా ఆహ్వానాన్ని మన్నించి సదస్సులో పాల్గొన్న అధ్యాపక మిత్రులకు, సదస్సు నిర్వహణలో తోడ్పడిన మా కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర మిత్రులందరికి మా తెలుగుశాఖ తరపున మనఃపూర్వక ధన్యవాదాలు. ❀

**(డా. కట్టెపోగు సురేష్ కుమార్)**
తెలుగు శాఖాధిపతి
ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ.ప్ర)
గుంటూరు

# జాతీయోద్యమం సాహిత్యం

**ఆచార్య తుమ్మల రామకృష్ణ,** ఉపకులపతి, ద్రవిడ విశ్వవిద్యాలయం, కుప్పం



జాతీయోద్యమం – అనుభవాలు, జ్ఞాపకాలు, సాహిత్యం అను ఈ అంశము రూపకల్పన అద్భుతంగా వున్నది. ఈ సదస్సులో జాతీయో ద్యమంలో పాల్గొన్న మహానుభావుల వారసులను భాగస్వామ్యం చేయడం ముదావహం. చరిత్ర – సంస్కృతి – రాజకీయం – సాహిత్యం అను ఈ నాలుగు అంశాలను విడివిడిగా చూడలేము. ఒకదానితో ఒకటి పెనవేసుకుని వుంటాయి. సాహిత్యం అర్థం చేసుకోవడానికి చరిత్ర తెలియాలి. చరిత్ర – సంస్కృతి – రాజకీయ ఉత్థాన పతనాలతో, మొదలవుతాయి. జాతీయోద్యమం ఎక్కడనుండి మొదలైంది అనేది. మనం ఆలోచిస్తే 16వ శతాబ్దంలో అబ్బక్క అనే మహిళ పోరాటం నుండి మొదలైనదా లేక 17వ శతాబ్దములో బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం వద్ద అంకురార్పణ జరిగినదా? అని మనకు తోచుచున్నది.

బ్రిటిష్ పాలనలో ప్రజలెదుర్కొన్న అనేకమైన బాధలు గరిమెళ్ళ సత్యనారాయణ రచించిన "మాకొద్దీ తెల్లదొరతనము"అనే గీతాన్ని చదివినప్పుడు బ్రిటిష్ వారి కబంధ హస్తాలలో భరత మాత ఎంత వ్యథ ననుభవించిందో బోధపడుతుంది. ఈ స్థితిలోనే అల్లూరి సీతారామరాజు మన్యం ప్రజల బాధలు చూడలేక తెల్లవారికి ఎదురు తిరిగి పోరాటం చేశాడు. ఝాన్సీ లక్ష్మీబాయి తెల్లదొరలతో యుద్ధం చేసింది. అలాగే కట్టపొణ్యం వీర బ్రహ్మన తిరుగుబాటు చేసాడు. ఈ విధంగా దేశంలో అక్కడక్కడ మొదలైన తిరుగుబాటులే జాతీయోద్యమానికి దారితీశాయి. తరువాత కాంగ్రెసు స్థాపన తో ఉద్యమం ఊపందుకొని బొంబాయి, బెంగాలు, కలకత్తా లాహోర్, నాగపూర్, మచిలీపట్నం, గుంటూరులలో ఉద్యమానికి బీజాలు పడ్డాయి.

మన నాయకులైన లాలా లజపతిరాయ్, బాలగంగాధరతిలక్, బిపిన్ చంద్రపాల్ దేశాన్ని ఒక తాటి మీదికి తీసుకొని వచ్చారు. వీరిని లాల్, బాల్, పాల్ గా పిలిచేవారు. వీరు అతివాదులుగా పేరుపొందారు. తరువాత మితవాద వర్గమూ బయలుదేరింది. 1902 లోని జాతీయ్యోద్యమ సంఘటనలు మనకు ఆధారాలు.

1905 లో బిపిన్ చంద్రపాల్ రాజమండ్రిలో సభ పెట్టినపుడు తెలుగు వ్యాఖ్యాతగా చిలకమర్తి లక్ష్మి నరసింహంగారు వ్యవహరించారు. ఆ సందర్భంలో చిలకమర్తి వారి జాతీయోద్యమ స్పందన పరిశీలించిన–

**"భరత ఖండంబు చక్కని పాడియావు**
**హిందువులు లేగ దూడలై ఏడ్చుచుండ**
**తెల్లవారను గడుసరి గొల్లవారు**
**పితుకుచున్నారు మూతులు బిగియగట్టి"**

అను పద్యము ఆంధ్రదేశమున జాతీయోద్యమానికి ప్రారంభ గీతంగా అభివర్ణించ వచ్చును. ఆ సందర్భంలో ప్రపంచ

వ్యాప్తంగా అనేక మార్పులు వచ్చాయి. మొదటి ప్రపంచ యుద్ధం వలన ఏర్పడిన జాత్యహంకారాలు, ఫ్రెంచివారు తీసుకువచ్చిన వలస విధానాలు, పారిశ్రామిక విప్లవం మొదలైనవి.

తెలుగులో గురజాడ అప్పారావుగారు రచించిన "దేశభక్తి " గేయము, రాయప్రోలు వారి "ఏ దేశమేగినా ఎందుకాలిడినా...' అను గేయములలో భారతీయత వుట్టిపడుచున్నది. వీరందరూ చేసిన పోరాటం ఒక ఎత్తు గాంధీజీ నడిపిన ఉద్యమం ఒకఎత్తు. మహాత్మాగాంధీ అహింసా సిద్ధాంతంతో దేశమంతటినీ ఒకతాటిపై నడిపి అత్యంత ప్రాధాన్యతను చేకూర్చారు. అయన నడిపిన ఉప్పు సత్యాగ్రహం, విదేశీ వస్తు బహిష్కరణ, సైమన్ గో బ్యాక్, క్విట్ ఇండియా ఉద్యమాలు జాతీయోద్యమంలో ముఖ్యమైన ఘట్టాలుగా చెప్పవచ్చును. దేశభవిష్యత్తు జాతి మొత్తం మీద ఆధారపడి వుంది.

భిన్నజాతుల, మతముల కలయిక కులాలు, వైరుధ్యాలు, కల ఈ దేశాన్ని మొత్తం ఒక తాటిపై నడపడం గాంధీ, నెహ్రూవంటి నాయకుల సామ్యానికి, నాయకత్వానికి ప్రతీకలుగా చెప్పవచ్చును. మనదేశంకోసం ఎందరో నాయకులు త్యాగాలు చేశారు. వారందరి త్యాగ ఫలమే, పోరాటాల ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న ఈ స్వాతంత్ర్యం. ఈ స్వేచ్ఛను, ఈ స్ఫూర్తిని మనం మన తరువాతి తరాలవారికి అందించగలగాలి.

**"భుజాల బరువుమీద**
**శిరస్సు వున్నతమని కిరీటాలు మొలచినపుడు**
**నాదేశం రత్నగర్భ**
**రత్నాల కోసం గర్భాన్ని చీల్చిన దేవరు"**

అను గీతములు భరత జాతిని ఉత్తేజ పరిచాయి.

"మాకొద్దీ తెల్ల దొరతనము" అను గేయమును ఒక

తెల్లదొర పాడించుకొని విన్న తరువాత ఆయన మాట్లాడుతూ భాష అర్థంకాని నాకే ఒళ్ళు గగుర్పొడుస్తున్నది. ఈగేయం విన్న భారతీయులు ఎలా తమ కోపాన్ని ఆపుకోగలరు? అని అన్నాడు.

**"సంకెళ్ళను కఠిన దాస్య శృంఖలముల**
**తమంతతాము చెదిరిపోవ**
**గగన తలమున తమంత తాము మార్మోవ**
**స్వేచ్ఛా ఝురుల నింతు"**

వంటి కవితలు చదివినపుడు సామాజిక పరిణామం, చలన సూత్రాలు ఎలావుంటాయో తెలుస్తుంది.

బసవరాజు, దువ్వూరి, శ్రీశ్రీ మొదలైన కవులు జాతీయోద్యమ సమయంలో కలం పట్టి దేశమాత దాస్యశృంఖలాలను ఛేదించడానికి ప్రయత్నించారు. ఆరోజుల్లో కలం పట్టిన ప్రతికవీ జాతిని జాగృతం చేశారు. ❀

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 13 హైదరాబాద్ డిసెంబరు - 2022

# జాతీయోద్యమం - మన సంస్కృతి

ఆచార్య పి. వరప్రసాదమూర్తి, రెక్టార్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు



నేడు భారతదేశంలో స్వాతంత్ర్య అమృత మహోత్సవాన్ని ఎంతో వైభవోపేతంగా జరుపుకునే నేపథ్యంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి అనుబంధ కళాశాలల్లో మకుటాయమానంగా ఉన్నటువంటి మహిళా చైతన్యానికి మహిళా సాధికారతకు ప్రతీకగా నిలుస్తున్న గుంటూరు ప్రభుత్వ స్వయంప్రతిపత్తి మహిళా కళాశాల ఆచార్య వర్యులందరూ కలిసి ఎంతో ఔచిత్యవహమైన, సందర్భోచితమైన విషయాన్ని ఎంపికచేసుకోవడం ఎంతైనా ముదావహం.

జాతీయోద్యమం అనుభవాలు – జ్ఞాపకాలు – సాహిత్యం అనేటటువంటి శీర్షికతో అంతర్జాల మాధ్యమంగా అంతర్జాతీయ సదస్సు నిర్వహించడం ఎంతో సందర్భోచితంగా ఉన్నది. ఈ సదస్సులో పాల్గొన్న సహృదయ మిత్రులు ద్రావిడ విశ్వవిద్యాలయ కులపతి వర్యులైన ఆచార్య తుమ్మల రామకృష్ణగారికి నమస్సులు, కళాశాల ప్రిన్సిపల్ గారికి నమస్సులు, కళాశాల తెలుగుశాఖకు హార్థిక అభినందనలు.

భారతదేశంలో ఉన్న ఈ నేల సుగంధ పరిమళాలు వెదజల్లే సౌరభూపేతమైన నేల. ఈ నేల విజ్ఞానవీచికలు ప్రసరించినటువంటిది. ధాన్యసిరులను కురిపించి, నిత్యాన్నపూర్ణగా విలసిల్లినట్టి రత్నగర్భ అటువంటి భారత జాతిని కొన్ని వందలయేళ్ళు పరాయి పాలకులు తమ హస్తగతం చేసుకొని ఎంతగానో హింసించినటువంటి నేపథ్యంలో ఈ జాతీయోద్యమం ఆవిర్భవించింది.

అనేక కులమతాలు, వర్గ వైషమ్యాలు కల్పిస్తున్నాసరే భారతీయ సంస్కృతి నేటికీ స్థిరంగా, సజీవంగా ప్రపంచానికి విశ్వగురు గా నిలుస్తుందనడంలో ఎట్టి సందేహమూ లేదు. విభిన్న కులాలు, మతాలు, వర్గాలు విభిన్న భాషలు ఎన్ని ఉన్నప్పటికీ భారతీయ సంస్కృతి యొక్క మహోన్నతమైన వైశిష్ట్యం ఏమిటంటే భిన్నత్వంలో ఏకత్వం, ఈ భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించడంలో మన జాతీయ నాయకులు కృతకృత్యులయ్యారని మనం భావించవచ్చు.

హిందూ, క్రైస్తవ, ముస్లిం ఎన్ని మతాలున్నప్పటికీ ఎన్ని భాషలు, యాసలు ఉన్నప్పటికీ, విభిన్న సంస్కృతీ ఆచార వ్యవహారాల సమ్మేళనం తోనే ముందుకు సాగుతుంది. "యూనిటీ ఇన్ డైవర్సిటీ" అనేటటువంటి సిద్ధాంతాన్ని ప్రాతిపాదిక చేసుకొని భారతదేశం ముందుకువెళుతుంది. భారతదేశం మిగతా దేశాలకు ఆధ్యాత్మిక గురువుగా ఉంది. ఈ ఆధ్యాత్మికతనే పునాదిగా వేసుకొని జాతీయోద్యమాన్ని కొనసాగించారు మన నాయకులు.

రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్య పాలనకు చరమగీతాన్ని పాడారు. వారిని తరిమికొట్టడంలో అతివాదులు, మితవాదుల పాత్ర అమోఘమైనది. జాతీయోద్యమాన్ని నడిపి ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దడంలో జాతీయోద్యమ స్ఫూర్తి రగుల్కొల్పేటట్లుగా చేసినటువంటి సాహిత్య సృష్టికర్తల పాత్ర అమోఘం. కళారూపాల పాత్ర, కవిత, గేయం, పాటలు అన్నీ కూడా అద్వితీయమైనటువంటి పాత్రను పోషించాయి. యావద్దేశ ప్రజలను జాతీయోద్యమం వైపు నడిపించడంలో సాహిత్య సృష్టి కర్తల పాత్ర అమోఘమైనది.

భారత జాతి స్వాతంత్ర్యాన్ని సాధింప జేసుకోవడంలో సాహిత్య ప్రక్రియలైనటువంటి ఏకాంకిక, నాటిక, నవలిక, నవల, కథానిక, కవిత, పద్యం వంటి ప్రక్రియలతో పాటు వివిధ కళారూపాల ప్రదర్శనలు, ఉద్యమగీతాలు, ప్రసంగాలు, పత్రికా సంపాదకీయాల వంటివన్నీ కూడా ఎంతగానో దోహదం చేశాయి. డెబ్బై అయిదు వసంతాలు జరుపుకుంటున్న వజ్రోత్సవ వేడుకల్లో తెలుగుజాతి తమవంతు పాత్రను ఏవిధంగా పోషించింది అనే విషయంపై మనం ఈ సదస్సు సందర్భంగా దృష్టిని కేంద్రీకరించాలి.

ఆధ్యాత్మికత కోణంగా మహారాష్ట్ర లో బాలగంగాధర తిలక్ ఈ గణేశ నవరాత్రులను జాతీయోద్యమానికి పునాదిగా మలచుకున్నారు. అందరూ కూడా ఈ గణేశ నవరాత్రులను జరుపుకునే సందర్భంలో అనేకమందిని కులమతాలకు అతీతంగా వారు సంఘటితం చేసి "స్వరాజ్యం నా జన్మహక్కు" అని నినదించారు. అట్లే ఆధ్యాత్మికతే పునాదిగా చేసుకొని దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు బెంగాల్ లో జరిగాయి. అవికూడా జాతీయోద్యమ స్ఫూర్తికి పునాదిగా నిలిచాయి.

అలాగే 19వ శతాబ్దపు సాంస్కృతిక పునరుజ్జీవన దశ నుండి ఈ జాతీయోద్యమ స్ఫూర్తి మరింతగా రగిలింది. ఆ సాంస్కృతిక పునరుజ్జీవన ప్రభావంతో ప్రజల మనసుల్లో జాతీయోద్యమ సాధన బలంగా నాటుకుపోయింది, అభ్యుదయ భావజాలం పెరిగింది. ఆ స్ఫూర్తిని రగిలించిన వారిగా గురజాడ అప్పారావు గారిని గురించి ప్రముఖంగా పేర్కొనాలి. వాస్తవానికి 'వందేమాతర' గీతం 1882 లో బంకించంద్ర చటర్జీ బెంగాలీ భాషలో 'ఆనందమఠ్' నవలలో వ్రాసిన తరువాత, రవీంద్రనాథ్ ఠాగూర్ 1896 లో మొదటిసారిగా భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలో 'వందేమాతర' గీతాన్ని ఆలపించారు.

ఆ తరువాత భారత జాతీయగీతం అయిన 'జనగణమన' అనే గీతాన్ని 1911 లో రచించి ఆలపించారు. ఈ రెండు గీతాలాపనలు జాతీయోద్యమం భారతదేశం నలువైపులా ఉవ్వెత్తున ఎగిసిపడే విధంగా జాతిని జాగృతం చేశాయని చెప్పడంలో. ఎట్టి సందేహం లేదు. భారతదేశం స్వాతంత్ర్యం సాధించడానికి ప్రజలను చైతన్యవంతంగా చేయడానికి వందేమాతర ఉద్యమం అలాగే, 'జనగణ' గీత ఉద్యమం భాతరతదేశం నలువైపులా కొనసాగింది. అదే సమయంలో గురజాడ అప్పారావు గారు ఆంధ్రదేశంలో 1910 లో 'వందేమాతరం' గేయ రచన తరువాత, 'జనగణ' గీత రచనకంటే ముందు 'దేశభక్తి' గీతాన్ని జాతీయ గీతం స్థాయిలో రచించారు.

పోరాటాలకు పురిటిగడ్డగా, రాజకీయ చైతన్యానికి స్ఫూర్తిగా నిలిచినటువంటి తెలుగునేల పన్నుల నిరాకరణ, సహాయ నిరాకరణ, ఉప్పు సత్యాగ్రహం వంటి జాతీయోద్యమాలలో పాల్గొంటూనే జాతీయోద్యమంలో ప్రత్యేకతను సంతరించు కున్నటువంటి తెనాలి (కఠే) వరం బాంబు కేసు, చీరాల పేరాల ఉద్యమం, పల్నాటి పుల్లరి ఉద్యమం, పెదనందిపాడు పన్నుల నిరాకరణ, కోటప్పకొండ ఘటనలు ఎన్నెన్నో, ఈ ప్రాంత ప్రజానీకాన్ని స్వాతంత్ర్య కాంక్షవైపు మరల్చడంలోఎంతో కృతకృత్యమయ్యాయని చెప్పవచ్చు.

"స్వంతలాభం కొంతమానుకు పొరుగు వారికి తోడ్పడవోయ్,
దేశమంటే మట్టికాదోయి దేశమంటే మనుషులోయ్,
దేశమనే దొడ్డవృక్షం ప్రేమలనే పూలెత్తవలెనోయ్,
నరుల చెమటను తడిసి మూలం ధనం పంటలు పండవలెనోయ్,
దేశాభిమానం నాకు కద్దని ఒట్టి గొప్పలు చెప్పుకోకోయ్,
పూని ఏదైనను ఒక మేల్ కూర్చి జనులకు చూపవోయ్"

అనే ఈ చరణాల ద్వారా సుస్పష్టమైనటువంటి జాతీయభావాన్ని రగులకొల్పిన మహాకవి గురజాడ.

స్వాతంత్ర్య పోరాట కాలంలో అనేకమంది సత్యాగ్రహ ఉద్యమాల్లో పాల్గొని కారాగారానికి వెళ్ళి అనేక కష్టనష్టాలు

పడ్డారు. వారి త్యాగాల వల్లనే మనకు స్వాతంత్ర్యం వచ్చింది. అటువంటివారు మనకు ప్రాతః స్మరణీయులు. గురజాడవారు రాసినటువంటి దేశభక్తి గేయంలో యాభై ఆరు పంక్తులు మనకు కనిపిస్తాయి. ఇవి భారతీయ సాహిత్యంలో అద్వితీయమైనటువంటి స్థానాన్ని అలంకరించాయని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు.

"మాకొద్దీ తెల్లదొర తనము" అని నినదించిన గరిమెళ్ళ సత్యనారాయణ అలాగే వీరేశలింగం గారి శిష్యుడు చిలకమర్తి లక్ష్మీనరసింహం ఇంకా ఈ ఉద్యమాలతో పాటు ఆనాటి పౌరులను మద్యపానం వంటి దురభ్యాసాలకు లోనుకాకుండా, త్రివర్ణ పతాకాన్ని చేబూని అందరూ కొంత సంఘసంస్కరణ దృక్పథంతో కూడా వ్యవహరించేలా చేశారు.

1921వ సం.లో జాతీయోద్యమ రథసారధి జాతిపిత మహాత్మాగాంధీ విజయవాడకు విచ్చేసినప్పుడు ఆనాటి భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలో పింగళి వెంకయ్యగారు రూపొందించిన త్రివర్ణ పతాకానికి జాతిపిత ఆమోదముద్ర వేశారు. అప్పటినుండి జాతిమొత్తం త్రివర్ణ పతాకాన్ని చేబూని వందేమాతరం అని నినదిస్తూ నిరంతరం పోరాటాన్ని సాగించారు. 1947 జూలై 22 న కొద్దిపాటి మార్పు చేర్పులతో పింగళి వెంకయ్యగారు రూపొందించినటువంటి త్రివర్ణ పతాకాన్ని రాజ్యాంగ సభ కూడా ఆమోదించింది. ఈ విధంగా జాతీయోద్యమంలో త్రివర్ణ పతాక రూపకల్పన ఒక అనిర్వచనీయమైన అనుభూతిని మిగిల్చింది.



# జాతీయనాయకులతో నా జ్ఞాపకాలు

(కీలకోపన్యాసం)

**ఆచార్య ఆర్.వి.యస్. సుందరం,** విశ్రాంత ఆచార్యులు, మైసూరు విశ్వవిద్యాలయం, కర్ణాటక

నెల్లూరు కు చెందిన వెన్నెలకంటి రాఘవయ్య గారు యానాదుల గురించి, గిరిజనుల గురించి ఎన్నో పుస్తకాలు రచించారు. పార్లమెంట్లో నెహ్రూగారి తరువాత నాయకులుగా ఉండేవారు. వి.వి. గిరి గారికి వియ్యంకుడు. వారి ప్రత్యక్ష పరిచయం నాకు కలగడం సంతోషకరం.

ఆంధ్రదేశంలో వావిలాల గోపాలకృష్ణయ్య ఆయన్ని చూస్తేనే ఒళ్ళు పులకరించేది. అటు కర్ణాటకలో దొరైస్వామిగారు వంద సంవత్సరాలు పూర్ణాయుష్కులుగా ఉండి ఇటీవలే మరణించారు. మరణించే వరకు తప్పులు చేసిన ప్రభుత్వాలను నిలదీస్తూ, స్వాతంత్ర్య స్ఫూర్తిని కొనసాగించారు. వీరిద్దరూ కూడా జాతీయోద్యమంలో పాలుపంచుకుంటూ పెళ్ళికూడ చేసుకోలేదు. వీరు తమ పూర్ణ జీవితాన్ని సమాజానికే అంకితం చేసిన మహోన్నతులు. ఇలాంటివారిని చూసినప్పుడు కొంతవరకైనా వారిని అనుసరించాలనే భావన కలుగుతుంది. ఆ భావనలు నేటితరం విద్యార్థుల్లో కలిగించడానికే ఇలాంటి సదస్సుల ఉద్దేశ్యం.

రెండువేల సంవత్సరాలకు పైగా ఈ దేశం మీద జరిగిన రకరకాల దాడులను గమనిస్తే శ్రీశ్రీ 'దేశచరిత్రలు' లో రాసిన ఒక అద్భుతమైన గేయం గుర్తుకొస్తుంది. "ఏదేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం, నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం, బలవంతులు దుర్బలజాతిని, బానిసలను కావించారు". ఈ వాక్యాలు కేవలం భారతదేశానికి మాత్రమే సంబంధించినవి కావు. ప్రపంచమంతటా ఈ దుస్తితె ఉంది. వేల ఏళ్లుగా ఈ పరిస్థితి కొనసాగుతూనే ఉంది.

భారతీయులది దుర్బలజాతి కాదు. అయినా కూడా రెండువేల సంవత్సరాలుగా ఏదో ఒక విధమైన బానిసత్వం ఇది. హృదయానికి సంబంధించినది కాదు. ఒక పరిపాలనకు, సమాజానికి కొన్ని విషయాలకు సంబంధించినవి మాత్రమే. మనం అలాంటి బానిసత్వాన్నే అనుభవిస్తూ వస్తున్నాం.

కొన్నివేల ఏళ్ల సంవత్సరాలుగా జాతీయ భావన అనేది మనకు కొత్తేమీ కాదు. ఉపనిషత్తుల కాలంనుండి కూడా మనం ఎన్నో విధాలుగా అక్కడక్కడ చెప్పుకుంటూనే ఉన్నాం. ఇప్పటికీ కూడా ప్రవర చెప్పండి అంటే "భరతవర్షే, భరతఖండే, మేరోః దక్షిణ దిగ్భాగే, శ్రీశైలస్య ఆగ్నేయ ప్రదేశే, కృష్ణా కావేర్యోః మధ్యదేశే" అనే విధంగా చెప్పుకుంటాం. భారతదేశంలో ఉండేటటువంటి భరతఖండం, మేరుపర్వతం, వింధ్యపర్వతం, నదులూ అన్నీ ఉన్నాయి. వాటి మధ్య ప్రదేశంలో నేనున్నాను అని చెప్పుకోవడం అనే భావనే భారతీయ మనస్తత్వానికి ఒక ఉదాహరణ. ఇది ఈ నాటిది కాదు.

అలాగే "గంగేచ యమునేచైవ గోదావరీ సరస్వతీ నర్మదే సింధూ కావేరీ జలెస్మిన్ సన్నిదిం కురు" ఇది చెబుతుంటేనే మనం ఎంతగా ఈ నదులూ పర్వతాలతో మమేకమై జీవిస్తున్నాం, ఇలాంటి వాటితో మనకు సంబంధం ఉంది అని చెప్పుకునేటటువంటి ఒక భావన మనకు మొదటినుండీ ఉంది. అలాగే భారతీయుల్లో భారతీయత అనే భావన ఎలా వచ్చిందో కానీ, ఆ కారణాలన్నీ కాలగర్భంలో కలిసిపోయాయి.

మనం అమెరికా వెళితే ఉత్తరం నుండి దక్షిణం వరకు ప్రయాణించినా ఒకే రకమైన మనుషులు, ఒకే రకమైన ఆవాసాలు, జీవన విధానం, ఆహారపు అలవాట్లు కనిపిస్తాయి. కానీ భారతదేశం అలా కాదు. కన్యాకుమారి నుండి కాశ్మీరం వరకు ప్రయాణం చేస్తూ ఉంటే ఎన్నో రకాల మనుష్యులు, జీవన వైవిధ్యాలు, వేష భాషాలు, ఆహారపు అలవాట్లు హీనంగా కనిపిస్తాయి. కానీ, మనమంతా ఒక్కటే అనే భావన మొదటినుండి అంతస్సూత్రంగా ఉంది.

ఈనాడు మనం జాతీయోద్యమం అనే మాట, జాతీయత అనేమాట సమానార్ధకాలుగా వాడుతాం. జాతీయత అంటే జాతి. జాతీయత అంటే కన్నడంలో కులం అనే అర్ధంలో వాడుతారు. అక్కడ రాష్ట్రీయత అనాలి. రాష్ట్రం అంటే దేశం అని అర్థం. మనం జాతి అంటే భరతజాతి, తెలుగుజాతి అనే అర్ధంలో తీసుకుంటాం. భారత దేశంలో ఉండేవాళ్ళందరం భరతజాతి అంటే భారతీయులం. అలాగే తెలుగుజాతి.

'నేషనలిజం' అంటే జాతీయత ను ఒక పరికల్పనగా అంటే 'కాన్సెప్ట్' గా మనం పరిశీలిస్తే అది యూరప్ లో మొదలైంది అంటారు. మొదటినుండీ మనలో ఉన్నదే కానీ, పాశ్చాత్యంశంగా మనం చదివేటప్పుడు యూరప్ ను సూచిస్తాము. యూరప్ లో ఎన్నోరకాల దేశాలు, భాషలు ఇప్పటికీ ఉన్నాయి. యూరప్ అంతా ఒకటేనని చెబుతారు గానీ, వైవిధ్యం ఉంది. అక్కడ 18 వ శతాబ్దానికి పూర్వం ఎక్కడో హృదయాంతరాళంలో అణగి ఉన్న జాతీయత భావనే అది ఫ్రాన్స్ లో మొదలై ప్రపంచంలో ఇతర దేశాలకు విస్తరించింది.

అమెరికాలో 'రెడ్ ఇండియన్స్' మాత్రమే స్థానికులు మిగిలిన వాళ్ళు అందరూ ఇతర దేశాల నుండి వచ్చి అమెరికాలో స్థిరపడ్డవాళ్లే. ప్రస్తుతం వాళ్ళందర్నీ మీరు ఏ దేశస్థులు అంటే అమెరికన్స్ అనే చెబుతారు. అంతలా వాళ్ళలో జాతీయతాభావన పెరిగిపోయింది. 18 వ శతాబ్దం లో మొదలైన ఈ జాతీయతా భావన ఒక జాతికి సంబంధించిన సర్వ విషయాలలో కూడా ఆ జాతికి స్వేచ్ఛ ఉండాలి అనే బలమైన ఒక భావన మనలో ఏర్పడటానికి 'రూసో' లాంటి వాళ్ళే కారణం. ఈనాడు జాతీయత అనేది ఒక సిద్ధాంతం లాగా ప్రజ్వలించి మనలో స్వాతంత్ర్యోద్యమానికి అంకురార్పణ జరిగినది.

రెండువేల సంవత్సరాలనుండి మనదేశం మీద అనేకమైన దాడులు జరిగాయి. గ్రీకులు, మహమ్మదీయులు, పారశీకులు, ఫ్రెంచ్, బ్రిటన్, ఇలా ఎంతోమంది మనల్ని వ్యాపారం పేరుతో ప్రలోభపెట్టి మనదేశం మీద దాడి చేశారు. వాళ్ళందరినీ భారతదేశం నుండి పారద్రోలాలి అనే ఉద్దేశ్యంతో ఏర్పడ్డదే జాతీయతా భావన. ప్రతాపరుద్రుని కాలంలోనే ఈ భావనను మనం గమనించవచ్చు. పృథ్వీరాజ్, రాణా ప్రతాప్ సింగ్, శివాజీ, విజయనగర రాజుల కాలంలోనే మ్లేచ్ఛులను మన దేశం నుండి తరిమివేయాలనే భావన రగుల్కొంది.

మన జాతీయోద్యమంలో ఒక ముఖ్యమైన మార్పు ఏంటంటే, ఎంతోమంది సంస్థానాధీశులు వీరోచితంగా పోరాడారు. కన్నడలో అబ్బక్క , టిప్పుసుల్తాన్, చిత్తూరులో రాణీ చెన్నమ్మ, అల్లూరి సీతారామరాజు లాంటివాళ్లు ఎందరో.. వాళ్ళ పేర్లను మనం ఆయా ప్రాంతాలకు పెట్టాలి. అప్పుడే యువతరానికి వారిని గురించి తెలుస్తుంది.

ప్రకాశం గారి పేరును ఒక జిల్లాకు పెట్టడం జరిగినది. కర్ణాటకలో రాణి చెన్నమ్మ పేరుతో ఒక ఎక్స్ప్రెస్ రైలు నడుస్తుంది, రాణి చెన్నమ్మ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశారు. సంగుళ్ళి రాయన్న పేరుతో రైల్వే స్టేషన్ ఏర్పాటు చేశారు.

మన జాతీయోద్యమం ప్రపంచంలోనే ఒక విభిన్నమైన ఉద్యమం. ఎందుకంటే అహింసే ప్రధానంగా సాగింది. ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్(ఫ్రాంటియర్ గాంధీ, సరిహద్దు గాంధీ) గాంధేయవాద సిద్ధాంతాలతో ఉద్యమించాడు. అమెరికాలో మార్టిన్ లూథర్ కింగ్ గాంధీ ప్రభావంతో నల్లవారి అభ్యున్నతికి పోరాడారు.

గొప్ప జాతీయోద్యమ నాయకుడైన జె. బి. కృపాలాని తొంబై ఏళ్ల వయసులో కూడా హిందూ పేపర్ కు వ్యాసాలు రాసేవారు. ఆయన ఒక వ్యాసంలో “అందరూ ఆయుధాలు పట్టుకొని మనమీద దాడిచేస్తే ఆయన 'అహింస' అన్నారు. అందరూ

ఒకచోట కూర్చొని మాట్లాడుకుంటుంటే, ఉపన్యాసాలు ఇస్తుంటే, ఆయన మౌనం వహించేవాడు. దాన్నే ఆయుధంగా చేసుకున్నాడు. కురుచ దుస్తులతో కార్యక్రమాలకు వస్తూ తన ప్రతిఘటనను ప్రదర్శించేవాడు". జాతీయోద్యమానికి గాంధీ ఎలా కొత్తరూపు ఇచ్చారో కృపాలానీ గారు ఆ వ్యాసంలో వివరించారు.

1982 లో నేను తొలిసారిగా అమెరికా వెళ్ళినప్పుడు అక్కడ భారత దేశం అంటే పులులు, సింహాలు సంచరించే ప్రాంతం అని భావించేవారు. అప్పుడే గాంధీ సినిమా వచ్చింది. అమెరికన్ల మీద అది ఎంత ప్రభావం చూపింది అంటే నన్ను చూసి వారు "మీరు గాంధీ పుట్టిన దేశం నుండి వచ్చారా" అని అడిగేవారు. ఆ సినిమాలో ఒక దృశ్యం ఏమిటంటే బ్రిటిష్ వారు భారతీయులని వరుసగా నిలబెట్టి లాఠీ లతో కొడుతుంటే వారు ఆ హింసను మౌనంగా భరిస్తారు. ఇది ఎలా సాధ్యం అని వారు నన్ను అడిగారు. అంటే మన జాతీయోద్యమం మౌనము అహింసే ఆయుధంగా ఎలా జరిగాయో అర్థం చేసుకోవచ్చు. ఉప్పును తయారు చేసుకోవడం మా హక్కు అని చెప్పడం లాంటివి మన జాతీయోద్యమంలో ప్రధానమయ్యాయి.

దువ్వూరి రామిరెడ్డి గారు "ఓసీ జాతీయత నీ బలోజ్వలత్వము ఎంత, నీ శక్తి సామర్థ్య మెంత, నీదు శంఖ రవముల కల ఇంద్రజాలమెంత అస్థిపంజరములు సైతము ఆడునౌరా!" అంటారు. అంటే అస్థిపంజరాలు సయితం జాతీయోద్యమాన్ని చూసి ప్రేరణ పొందాయట.

ఈ జాతీయోద్యమం సమాజం మీద సంస్కృతిమీద సాహిత్యం మీద ఏరకమైన ప్రభావం చూపిందో మనం ఆయా రంగాల మార్పులను గమనిస్తే తెలుస్తుంది. మన జాతీయోద్యమంలో ప్రధాన భూమిక వహించిన నూలు బట్టలను నేడు ప్రతీఒక్కరు ధరించడానికి ఆసక్తి చూపుతున్నారు.

జాతీయోద్యమం దేశభక్తిని రగిల్చింది. నేను యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలో ఉన్నప్పుడు తెలుగు తెలిసిన 'లిజామిచ్చేల్' తో కలిసి కొన్ని కవితల్ని ఇంగ్లీషు లోకి అనువాదం చేశాము. అలా చేస్తున్నప్పుడు గురజాడ వారి దేశభక్తి గీతం విన్నప్పుడు ఎంతమంచి భావం ఉంది దీనిలో "దేశం అంటే మట్టి కాదు మనుషులు అని చెప్పడం, దేశంలో తయారైన సరుకు మీరు ఇతరులకు అమ్మండి అని చెప్పడం" లో ఆర్థిక శాస్త్ర తత్వం ఉంది. అదీ దేశభక్తి అంటే.

వినోభా భావే గారు నెల్లూరు కు వచ్చినప్పుడు తిక్కవరపు వెంకట్రామారెడ్డి గారు లాంటి మహానుభావులు రెండువందలు, రెండువందల యాభై ఎకరాలు భూమిని భూధాన ఉద్యమానికి సమర్పించారు. అది జాతీయోద్యమంలో భాగంగా నిలిచింది. ముట్నూరి కృష్ణారావు, కాశీనాథుని నాగేశ్వర రావు, సురవరం ప్రతాపరెడ్డి లాంటివాళ్లు పత్రికా స్వేచ్ఛ కూడా అవసరమే అని చెప్పారు. పత్రికా రంగంలో వీరి కృషి మరువలేనిది. స్వేచ్ఛా వాతావరణాన్ని కల్పించడానికి ఈ పత్రికలు ఎంతో కృషి చేశాయి. సురవరం ప్రతాపరెడ్డి ఆంధ్రుల సాంఘిక చరిత్రను రాయడమే ఒక గొప్ప మలుపు.

ప్రకాశం గారు అనగానే మనకు ఆత్మాభిమానం గుర్తుకువస్తుంది. వీరిని గురించి చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు తమ స్వీయచరిత్రలో– ప్రకాశంగారు రాజమండ్రికి వచ్చి నాటకాలు ఆడేవారట ఒకసారి నాటకం అయిపోయాక బ్రిటిష్ వారు ప్రకాశం గారి వద్దకు వచ్చి "మీరు మళ్ళీ నాటకాన్ని ప్రదర్శించండి మేము ఛాయా చిత్రాలు తీసి లండన్ పత్రికలలో ప్రచురిస్తాం" అన్నారట. ప్రకాశం గారు "మీకోసం మేము ప్రత్యేకంగా నాటకాలు ఆడం" అని తిరస్కరించారట. అని చెప్పారు.

వావిలాల గోపాల కృష్ణయ్య గారు మైసూరు విశ్వవిద్యాలయానికి వచ్చినప్పుడు మా శాఖ తలుపు తీసుకొని లోపలికి వస్తుంటే అక్కడున్న మా 'డైరెక్టర్' గారు "ఏయ్ ఎవరు" అన్నారు. నేను ఆయన వావిలాల గోపాల కృష్ణయ్య అని చెప్పగానే, మా 'డైరెక్టర్' గారు వెంటనే వారికి చేతులు జోడించారు. ఆయనకు వావిలాల గోపాల కృష్ణయ్య గారి పేరు తెలుసు గానీ, మనిషిని చూడలేదు. అదీ వారి గొప్పతనం. వావిలాల గోపాల కృష్ణయ్య గారు ఎంత సరళంగా ఉండేవారంటే, ఆయన ఒక సంచీ పట్టుకొని అందులో సబ్బుముక్క, ఒకజత బట్టలు మాత్రమే పెట్టుకొని తిరుగుతుండేవారు. ఆయన్ని చూసినప్పుడు ఈ ఆర్భాటాలన్నీ మనకవసరమా అనిపిస్తుండేది. ఇలాంటి వ్యక్తులందరూ మొన్న మొన్నటి వరకు మన మధ్యే ఉన్నారు అంటే ఎంతో సంతోషం అనిపిస్తుంది.

హరిజనోద్యమం, అస్పృశ్యతా నివారణ, దేవాలయ ప్రవేశం, కులాతీత వివాహాలు మొ. వాటిని ప్రోత్సహించారు. ఇవన్నీ కూడా జాతీయోద్యమంలో భాగమే. ఒకవైపు అహింసాత్మక ఉద్యమం సాగుతుంటే మరోవైపు అతివాదులూ, తమ ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు. దేశం కోసం చనిపోవడానికి సిద్ధపడ్డారు. అల్లూరి సీతారామరాజు, రాణీ చెన్నమ్మ చెంగల రాయుడు లాంటి వాళ్ళ గురించి మనవాళ్లు వీరగాథలు రాసి పాడుకున్నారు. వాళ్లను బ్రిటిష్ వాళ్ళు దొంగలుగా చిత్రీకరించారు. కానీ మనవాళ్లు వాళ్ళని వీరులుగా చిత్రించారు. మనలో ఉత్తేజాన్ని కలిగించారు.

రాయప్రోలు సుబ్బారావు గారు "ఏ దేశమేగినా, యెందు కాలిడినా, ఏ పీఠ మెక్కినా ఎవ్వరేమనినా పొగడరా నీతల్లి భూమి భారతిని, నిలుపరా నీ జాతి నిండు గౌరవము.." అన్నారు. ఇలాంటివి వింటున్నప్పుడు ఒళ్ళు పులకరిస్తుంది. ఆనాడు ఇంకా ఎలా ఉండేదో, ఆ కాలంలో మనం పుట్టకపోతిమే అనిపిస్తుంది. మంగిపూడి వారి నిరుద్ధ భారతం, జాషువా గారి గబ్బిలం, లాంటివి చదివితే దేశంలోని రుగ్మతల గురించి అర్థమవుతుంది. వాటిని పొడగొట్టడానికి అందరం కలిసి నడవాలి. అప్పుడే స్వర్ణయుగం వస్తుంది. అందుకే మన జాతీయోద్యమం ప్రపంచ చరిత్రలో చిరస్మరణీయమైనది. ❀

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 13 హైదరాబాద్ డిసెంబరు - 2022

# జాతీయోద్యమం అనేది ఒక నిరంతర స్ఫూర్తి

(సమామపనోత్సవ ప్రసంగపాఠం)

**ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు,** తెలుగుశాఖ అధ్యక్షులు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్



ఆజాదీ కా అమృత మహోత్సవంలో భాగంగా ప్రభుత్వ మహిళా కళాశాల, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ వారు రెండు రోజులు (10, 11 ఆగస్టు 2022) సదస్సు 'జాతీయోద్యమం అనుభవాలు–జ్ఞాపకాలు–సాహిత్యం' పేరుతో నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ అంతర్జాల సదస్సులో అధ్యాపకులు, ఆసక్తిగల వారు అధికసంఖ్యలోనే పాల్గొనడాన్ని గమనిస్తున్నాను. ఇంత మంచి సదస్సుని ఏర్పాటు చేసిన  తెలుగు శాఖవారికీ, ఈ కళాశాల వారికీ, అలాగే ఈ సమావేశంలో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికి నా హృదయపూర్వక నమస్కారాలు.

ముందుగా సదస్సు కోసం పెట్టిన పేరు గురించి మాట్లాడుకోవాలి. ఈ పేరు చాలా బాగుంది. దీనిలో ఎక్కడా సాహిత్యానికి సంబంధించిన విషయాలు మాత్రమే మాట్లాడాలని చెప్పలేదు. అయినప్పటికీ ఇది తెలుగు శాఖవారు నిర్వహిస్తున్నారు కనుక, తెలుగు సాహిత్యంతో ముడిపడిన జాతీయోద్యమాన్నీ, జాతీయోద్యమంలో పాల్గొన్న తెలుగు వారి అనుభవాలనీ, ఆ జ్ఞాపకాలను ఈ సదస్సులో చర్చించుకుంటున్నాం. మల్టీ డిసిప్లినరీ అంశాన్ని ఈ సదస్సు శీర్షికగా తీసుకోవడం వల్ల సాహిత్యం చరిత్రతోను, అనేక సామాజిక విషయాలతోనూ ఉన్న అవినాభావ సంబంధాన్ని కూడా చర్చించడానికి ఉపయోగపడింది.

ఈ మధ్యకాలంలో కేవలం తెలుగు భాషా సాహిత్యాలతో ముడిపడిన అంశాలు మాత్రమే కాకుండా, ఇతర సామాజిక శాస్త్రాలతో ముఖ్యంగా కవుల, రచయితల సామాజిక బాధ్యతను సాహిత్యం ద్వారా ప్రతిపలించే తీరును ప్రకటితమయ్యే లా సదస్సులు నిర్వహించడం కనిపిస్తోంది. ఒక బాధ్యతాయుతమైన ఒక తరం తెలుగు శాఖలలో ఉందనీ, వారి ఆలోచన విధానాన్ని తెలిపేలా ఈ సదస్సులు జరగడం ప్రశంసనీయం. మారుతున్న సామాజిక అవసరాలకు జాతీయ విద్యా విధానానికి అనుకూలమైన ఆలోచనలతో ఆయా విశ్వవిద్యాలయాల వారు వాటి అనుబంధ కళాశాలల వారు అనుసరించడం ఒక అభ్యుదయకర పరిణామం.

సమాజంలో ఏ చిన్న మార్పు జరిగినా, దానిని వెంటనే తెలుగు సాహితీవేత్తలు, విద్యార్థులు వివిధ సాహిత్య ప్రక్రియల రూపంలో సమాజంలోకి తీసుకెళ్ళి తమవంతు సామాజిక బాధ్యతను నెరవేరుస్తున్నారు. అదే ఓ 'సైన్స్' విద్యార్థి అయితే ఏదైనా ఒక కొత్త ఆవిష్కరణ జరిగినప్పుడు దానికి 'పేటెంట్' వచ్చేవరకు గోప్యంగా ఉంచి, దానిని అమ్ముకొని డబ్బు చేసుకుంటారు. ఇదీ ఆ శాస్త్రానికున్న లక్షణం. అదే మన సాహిత్యం, అలా కాదు. సమాజానికి అవసరమైనదనిపించినప్పుడు లాభాపేక్షకంటే సమాజశ్రేయస్సే ప్రధానంగా సాహితీవేత్తలు భావిస్తుంటారు. అటువంటి అభ్యుదయకరమైన బాధ్యతను నిర్వహిస్తున్న మన తెలుగు సాహిత్యం ఈ జాతీయోద్యమంలో చేసిన కృషిని మూడు రకాలుగా నిలబెట్టి, చర్చిస్తూ నిర్వహించే ప్రయత్నం చేయడం ముదావహం.

జాతీయత అంటే ఏమిటి?:

సాధారణంగా తమ జాతి మీద వారికుండే అభిమానమే జాతీయత అని మనం చెప్పుకుంటూ ఉంటాం. అయితే ఈ

జాతీయత అనేది మానవతతో ముడిపడి ఉంటుంది. ఇది స్వచ్ఛంగా, ఆర్ద్రంగా ఉండే హృదయాన్ని కలిగి ఉండటమే మానవత. మనిషి తాను ఎలా ఉంటున్నాడో, ఎదుటి మనిషి కూడా అలాగే ఉండాలని కోరుకోవడంలో మానవత్వం ఉంటుంది. అదే నిజమైన మానవత్వం అవుతుంది. నిఘంటువులు, విజ్ఞాన సర్వస్వాలు జాతీయతను *"స్వదేశం లేక స్వజాతిపట్లగల అభిమానం జాతీయ భావం." "ఒకజాతి సంక్షేమం పట్లగల అభిమానం." "జాతీయత అంటే స్వాతంత్ర్య వాంఛ"* అని వివరించాయి. జాతీయతను నిర్వచించినవాళ్ళు రకరకాలుగా దీన్ని వివరించేప్రయత్నం చేశారు.

*"తమలో తమకు ఆర్థికముగను, సాంఘికముగను భేదము లెన్నియున్నను రాజకీయముగ తామందరు ఒకరే అనియు, ఇతరులు వేరనియు భావించు మానవుల సముదాయమునకు జాతి, అనియు, అట్టి భావమునకు జాతీయత అనియు పేర్లు"*

*"జాతిపట్లగల శ్రద్ధాసక్తులు, జాతీయ సమైక్యం లేక స్వాతంత్ర్యాన్ని ఉద్బోధించడం జాతీయత"*

*'ఒకే సంస్కృతికి చెంది, ఒక ప్రదేశంలో సన్నిహితంగా జీవిస్తూ, ఒక మనుగడ గలిగి సంచరించే జనుల మానసిక స్థితి. అది స్విస్ జాతీయుల ఆరోగ్యకర మైన దేశభక్తి మొదలుకొని జర్మనీ నాజీల దురభిమాన పూర్వకమైన అసహనం దాకా వర్తిస్తుంది.... జాతీయత నవ్య భావం. కాని, దాని బీజాలు ఆదిమ మానవుడు కొన్ని తెగలుగా సంఘాన్ని విభజించుకున్నప్పటి నుంచి ఉన్నాయి."* ఈ నిర్వచనాల్లో ఇంచుమించు విస్తృతంగానే జాతీయతను వివరించే ప్రయత్నం కనిపిస్తుంది.

మనం సంతోషంగా ఉంటే, ఇతరులు కూడా అలాగే ఉండాలని కోరుకోవడం మానవత. ఇదంతా మనం చేసే పనిమీద ఆధారపడి ఉంటుంది. ప్రజలు తమ జాతికి చెందిన సర్వ జనుల జీవన విధానానికి గానీ, స్వేచ్ఛకి గానీ ఎటువంటి అడ్డంకులు ఉండకూడదని నమ్మి ఆ ధ్యేయం కోసం పాటుపడటమే జాతీయత అంటారని పత్రసమర్పకుల ద్వారా కూడా అది ఇప్పటికే విదితమైన విషయం. జాతి అంటే కేవలం ఒక కుల పరంగానో, ఒక మత పరంగానో, కేవలం ఒక లింగ పరంగానో విడదీసి చూసేదీ కాదు.

భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న ఈ భారతదేశంలో సర్వ మానవాళి జీవన విధానానికి అనుగుణంగా వారు ఏర్పరచుకున్న జీవన విధానం జాతీయభావానికి సంబంధించిందవుతుంది. వారు ఏర్పరుచుకున్న జీవన విధానంలో మతం అంటే, ఒక ఆలోచనా విధానం. ఈ ఆలోచనా విధానంలో ఉంటే నీవు క్రమబద్ధమైన జీవన విధానంలో వెళ్తున్నట్టు చెప్తారు. అంటే సర్వ జనుల స్వేచ్ఛకు ఆటంకం లేకుండా తాము నమ్మిన లక్ష్యం కోసం మనందరం పాటుపడాలని ఒక్కోమతం చెబుతుంది. అప్పుడది జాతీయతలో భాగమే అవుతుంది. ఈ పద్ధతిలో చూసినప్పుడు ప్రజలు తాము నివసిస్తున్న నేలమీద భక్తిని ప్రకటించాలి. ఈ దేశం నాదీ అనే భావన కలిగి ఉండాలి. అంతేకాదు స్వజాతి జనుల మీద ప్రేమను పెంపొందించుకోవడం కూడా జాతీయతలో భాగమే. ఈ దేశంలో నివసిస్తున్న ప్రజలందరిమీదా ప్రేమ ఉండాలి.

సదస్సు లక్ష్యాన్ని గురించి చెప్తూ సదస్సు సమన్వయకర్త డా. సురేష్ కుమార్ గారు ఈ నాటి యువత ఈ నాటి ప్రజలు దేశభక్తి గురించి గానీ, దేశభక్తులను గురించి గానీ పెద్దగా పట్టించుకోనట్టి ఒక తరం బయలుదేరిందని, ముఖ్యంగా మనం సాధించినటువంటి స్వాతంత్ర్యం విలువ వాళ్ళకు తెలియడం లేదని తన ఆవేదనను వ్యక్తం చేశారు. అది నిజంగా మనం సమాజంలో చూస్తున్నాం. అటువంటి తరానికి జాతీయత, జాతీయ సమైక్యత, సమగ్రతల అవరాన్ని వివరించాల్సిన అవసరం ఎంతైనాఉంది.

ఈరోజు మనం అనుభవిస్తున్న ఈ స్వేచ్ఛా, ఈ సమానత్వం, ఇంత పరిపూర్ణమైన జీవన విధానాన్ని మనం అనుభవిస్తున్నాము అంటే, అది ఎంతోమంది త్యాగం వల్లనే సాధ్యమైందనే నేపథ్యం ఈనాటి యువతరానికి తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. ఇది తెలియకపోవడం వల్లనే ఈ దేశం పట్లా, దేశభక్తి పట్లా ఒకరకమైన నిర్లక్ష్య భావాన్ని కలిగి ఉంటున్న యువత బయలుదేరింది. ఆ యువతకు జాతీయత అంటే ఏమిటో తెలియజేసే ఉద్దేశ్యం తోటే ఈ సదస్సును నిర్వహించడం సంతోషం.

'జాతీయోద్యమం – అనుభవాలు, జ్ఞాపకాలు, సాహిత్యం' అనే పేరుకు అనుగుణంగానే చాలా ఆయా రంగాల్లో అనుభవజ్ఞులైన వక్తలను ఆహ్వానించి వారితో ప్రసంగాలను ఇప్పించడం చాలా మంది ఆలోచన. ఈ జాతీయ సదస్సు శీర్షికలో అనుభవాలు అని కూడా అన్నారు కాబట్టి, ఆనాడు భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న వారి అనుభవాలను, వారి వారసుల జ్ఞాపకాలను నేటి యువతకు పరిచయం చేయడం మరింత బాగుంది.

ఆనాడు భారత స్వాతంత్ర్యోద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న సుద్దాల హనుమంతుగారి కుమారుడు సుద్దాలఅశోక్ తేజగారు, టంగుటూరి ప్రకాశంగారి మనుమలు టంగుటూరి శ్రీరామ్‌గారు, గురజాడ అప్పారావుగారి మనుమరాలు గురజాడ అరుణగారు, పింగళి వెంకయ్యగారి మనుమడు శ్రీ జి.వి.యల్. నరసింహం గారు ఇప్పటి వరకూ తమ తమ జ్ఞాపకాలను గురించి అద్భుతంగా వివరించారు.వారు నాటి చరిత్రను, వాళ్ళ కుటుంబీకుల ద్వారా విని, గమనించి మన ముందు ఆవిష్కరింపజేశారు. దీనిని పరిశోధనా పరిభాషలో ప్రత్యక్ష అనుభవాలు అంటారు. అక్కడ ఏమైతే జరిగిందో జరిగిన ఆ 'సీన్' లో ఉన్నవాళ్లు, వాళ్ళ అనుభవాలను ప్రత్యక్షంగా చెప్పడం లేదా వాటిని తెలుసుకొని చెప్పడం Empirical Research లో భాగమే అవుతుంది. దీన్ని ఎంతో నమ్మశక్యమైన సమాచారంగా భావిస్తారు. అలాంటి అనుభవాలనుండి వచ్చిన అంశాలను కూడా ఈ సదస్సు చర్చించడం ఎంతో ఆసక్తిని కలిగిస్తుంది.

మనకు సృష్టి ప్రారంభం నుండి కూడా ఒక జాతి మరొక జాతిని, ఒక రాజ్యం మరొక రాజ్యాన్ని జయించాలనే తపన కనపడుతూనే ఉంటుంది. దీన్నే ఆదిమ సమాజాల్లో మానవుల మధ్య ఉండే Mighty is right అని మనం Political Thought ని చదువుకునేటపుడు రాజ్యసంక్రమణ సిద్ధాంతాల్లో ఒక భావనను వింటుంటాం. ముఖ్యంగా Thomas Hobbes (1588-1679), John Locke (1632-1704), Jean-Jacques Rousseau(1712-1778)అనే రాజనీతి తత్వవేత్తలు వివరించిన రాజ్య సార్వభౌమాధికార సిద్ధాంతాలను గురించి చదువుకొనేటప్పుడు, మత్స్య న్యాయాన్ని గురించి కూడా చదువుకొని ఉంటాం. దీనిలో ఒక జాతి మీద మరొక జాతి కొనసాగించిన దాడులు, ఆ దాడులే తర్వాత కాలంలో యుద్ధాలుగా పరిణమించి, ఒక సార్వభౌముడిని ఏర్పరుచుకోవాలనే భావనకు అంకురార్పణకు దారితీసాయని చదువుకొని ఉంటాం. ఆ సందర్భంలోనే ఆ రాజ్యాల్లో ఉన్నటువంటి మత్స్యన్యాయం బయటికి వస్తుంది. ఇలా ఒక జాతి మరోజాతిని, ఒక రాజ్యం మరో రాజ్యాన్ని జయించి సామ్రాజ్యాలుగా స్థాపించుకున్నారు. అంటే బలవంతులు బలహీనుల్ని బానిసలుగా చేయడం, ప్రపంచ చరిత్రలో అన్నిచోట్లా కనిపిస్తుంది. దీని ఫలితంగానే కొన్ని సామాజిక ఒడంబడిక ప్రయత్నాలు జరిగాయని పొలిటికల్ థాట్ తెలుపుతుంది.

ఈ పరిస్థితుల్లోనే మనకు 16, 18 శతాబ్దాలలో యూరప్ ఖండంలో నిజమైన జాతీయతా భావాలు ఉద్భవమయ్యాయని చరిత్ర చెబుతోంది. అంటే ఫ్రెంచి విప్లవానికి పూర్వం యూరప్ లో జాతీయ భావాలు స్థిరపడ్డాయి. ఆ చరిత్రను గురించి చెప్పడం ఇక్కడ ప్రధాన ఉద్దేశ్యం కాదు. కానీ, 'విశ్వకవి' రవీంద్రనాద్ ఠాగూర్ Song Offerings (గీతాంజలి) ని రచించారు. ఇందులోని Where the Mind is without Fearగీతంలో దేవునిపై తన భక్తిని, మాతృదేశంపై తనకున్న ప్రేమను ఆయన చక్కగా తెలిపారు. రవీంద్రుని ప్రార్థన, ఆకాంక్షలు ఆయన భావనలను మనం తెలుగులో చెప్పుకుంటే ఇలా ఉంటుంది.

*"ఎక్కడ మనసు నిర్భయంగా ఉంటుందో*
*ఎక్కడ మనుషులు తలెత్తుకుని తిరుగుతారో ఎక్కడ విజ్ఞానం స్వేచ్ఛగా ఉంటుందో*
*సంకుచిత భావాలతో ముక్కలుగా చీలిపోదో ఎక్కడ సత్యవాక్కులు వెలువడుతాయో*
*ఎక్కడ నిర్విరామ కృషి పరిపూర్ణత కోసం చేతులు చాపుతుందో.*
*ఎక్కడ స్వచ్ఛమైన వివేకధార ఇంకిపోకుండా ఉంటుందో*
*ఎక్కడ నిరంతర ఆలోచన, ఆచరణ వైపు నీవు*
*బుద్ధిని నడిపిస్తావో నా తండ్రీ!*
*ఆ స్వేచ్ఛా స్వర్గానికి నా దేశాన్ని నడిపించు*

ఇలా ఎందుకు కోరుకోవాల్సి వచ్చింది? అవి ఈనాటి తరానికి తెలియాలంటే ఆనాడు పరాయి దేశ పాలనలో కష్టనష్టాలకు గురైనటువంటి వాళ్ళ అనుభవాలు తెలియాలి. ఇందులో స్వేచ్ఛ కోసం కవి పడుతున్న తపన మనకు కనిపిస్తుంది. అందుకే అనుభవాలను కూడా సదస్సు శీర్షికలో చేర్చారనుకుంటాను.

ఈ సందర్భంగా మన భారతీయులు పడిన కష్టనష్టాల గురించి కొన్ని ముఖ్యమైన అంశాల్ని తెలుసుకోవాలి. ఇల్బర్ట్ బిల్లు: అనేది 1883 ఫిబ్రవరి 9న యొక్క వైస్రాయ్ మార్క్వెస్ ఆఫ్ రిప్పన్ సమయంలో అధికారికంగా ప్రవేశపెట్టబడిన ఒక బిల్లు, దీనిని కౌన్సిల్ ఆఫ్ ది గవర్నర్–జనరల్ ఆఫ్ ఇండియా యొక్క చట్టపరమైన సభ్యుడు సర్ కోర్టేనే పెరెజిన్ ఇల్బర్ట్ రూపొందించారు. భారతీయులను బ్రిటన్ న్యాయమూర్తులు విచారించవచ్చు. కానీ, బ్రిటన్ అధికారులు నేరం చేస్తే వారిని విచారించే అధికారం భారతీయులకు లేదు అనేది ఈ బిల్లులో ఉన్న ఒక వివాదం.

నీలిమందు తోటల్లో పనిచేస్తున్న మహిళలను బ్రిటన్ సిపాయిలు అత్యాచారాలు చేస్తున్నా వారికి సరైనటువంటి శిక్ష పడేది కాదు. అదే కనుక భారతీయ సిపాయిలు లేదా భారతీయులు ఏదైనా ఒక చిన్న నేరం చేసినా బ్రిటన్ న్యాయమూర్తులు తీవ్రమైన శిక్షలను విధించే వారు. అందువల్ల బిల్లుకు వ్యతిరేకంగా భారతీయులు ఉద్యమించారు. దీనితోపాటు భారతీయ మహిళలు బ్రిటన్ మహిళలతో పోల్చుకుంటే ఉన్నత విద్యా అవకాశాలు వారికి లేవని అపహస్యం చేశారు. ఇది ఒక ప్రధానమైన చారిత్రక పరిణామానికి దారితీసింది. భారత జాతీయ కాంగ్రెస్ (1885) భారతీయులందరినీ ఒక ఉద్యమ శక్తిగా మార్చడానికి ఉపయోగపడింది. దీని తర్వాత భారతస్వాతంత్ర్య సంగ్రామంలో అనేక దశల్లో అతివాద, మితవాదధోరణుల్లో ఉద్యమాలు జరిగాయి. అలా జరగడంలో మన భారతీయులెంతగానో జాతీయతా స్ఫూర్తిని ప్రదర్శించారు. కవులు, రచయితలు వివిధ ప్రక్రియల్లో రచనలు చేశారు. అవన్నీ దేశవ్యాప్తంగా ఒక నిశ్శబ్దవిప్లవానికి ఎంతగానో తోడ్పడ్డాయి. వీటిని ప్రాచుర్యంలోకి తీసుకొని రావడంలో పత్రిక పాత్రను విస్మరించలేం.

మన భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక మనల్ని మనం పరిపాలించుకోవడానికి ఒక రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకోవడం మనకి ఎదురైన మొట్టమొదటి పెద్ద సవాల్. దీనికోసం ఒక రాజ్యాంగ పరిషత్ ఏర్పడింది. భారతదేశంలోని అన్ని ప్రాంతాలకు సంబంధించిన సుమారు 299 మంది ప్రతినిధులు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. మన తెలుగు ప్రాంతం నుండి టంగుటూరి ప్రకాశం, పట్టాభి సీతారామయ్య గార్లు ప్రతినిధులుగా ఉన్నారు. రాజ్యాంగ పరిషత్‌ను రాజ్యాంగ సభ అని కూడా అంటారు. ఇది రాజ్యాంగంగా రాయడానికి ఒక డ్రాఫ్టింగ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ ఆనాటికే గొప్ప మేధావి, విద్యావంతుడు అయిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ని చైర్మన్ గా ఎన్నుకున్నారు. ప్రపంచ దేశాలలో ఉన్న రాజ్యాంగాలను అధ్యయనం చేసి ప్రజాస్వామ్యాన్ని పటిష్టంగా అమలుపరచుకోవడానికీ, ప్రజా సంక్షేమాన్ని విస్మరించకుండా ఉండడానికి అనేకమైన అనుకూలమైన విధానాలతో ప్రపంచ దేశంలోనే అత్యుత్తమ సమాఖ్య వ్యవస్థకు కావలసిన రాజ్యాంగాన్ని డ్రాఫ్టింగ్ కమిటీ అందించింది. దాన్ని 1949 నవంబర్ 26 వతేదీన భారత రాజ్యాంగాన్ని ఆమోదించారు. 1950 జనవరి 26 వ తేదీ నుండి దీని ప్రకారం భారత ప్రభుత్వం పరిపాలన మొదలైంది.అంటే మొదటి సవాల్ అయిన భారత రాజ్యాంగాన్ని మనం ఏర్పాటు చేసుకోవడంలో విజయవంతమయ్యాం.

నేటికీ కూడా అతిపెద్ద రాజ్యాంగం భారత రాజ్యాంగమేనని ప్రపంచ దేశాలలో ఉన్న రాజ్యాంగాలన్నీ పరిశీలించిన మేధావులు చెప్తున్నటువంటి మాట. ఈ రాజ్యాంగానికి ఉన్న మరొక అవకాశం సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగాన్ని సవరణలు చేసుకోవడానికి కూడా అవకాశాన్ని కల్పించారు. ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ, బలమైన కేంద్రంతో కూడిన సమాఖ్య వ్యవస్థ. హక్కులతో పాటు విధులను కూడా సూచించిన గొప్ప రాజ్యాంగ వ్యవస్థను మనం ఏర్పాటు చేసుకొని భారతదేశం అంతా ఒకే పరిపాలనకు అనుకూలమైనటువంటి అఖిలభారత సర్వీసులను కూడా మనం విజయవంతంగా అమలు చేసుకుంటున్నాం.

మన కవులు కూడా చాలా మంది 'అభ్యుదయ యుగం' నుండే కష్టానష్టాలను గురించి చెప్పడం మొదలుపెట్టారు. శ్రీశ్రీ రచనలు పీడిత వర్గాల్లో గొప్ప చైతన్యానికి బీజాలు వేశాయి. దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు స్వేచ్ఛహరింపబడుతుందని చెప్పిన లక్షణాల్లో అంతర్భూతంగా జాతీయతా భావ లక్షణాలు ఉన్నాయి.మనం కథా సాహిత్యంలో కానీ, నవలా సాహిత్యంలో కానీ జాతీయోద్యమ గీతం అనగానే మనకు ముందుగా గుర్తుకు వచ్చేది 'వందేమాతరం' గేయం. ఆ తర్వాత 'జనగణమన...' గేయం. ఈ గీతాలను నేడు మనం వింటుంటే ఒక కంటినుండి స్వేచ్ఛా స్వాతంత్ర్యాల ఆనంద భాష్పాలు, మరో కంటి నుండి ఆనాటి వీరుల త్యాగాలను స్ఫురణకు తెచ్చే విషాదాశ్రువులు వెలువడుతాయి. అది ఆనందం విషాదం కలగలిసిన ఉద్విగ్నత. 'జనమనగణ' గేయంలో మన దేశంలోని వివిధ ప్రాంతాల్ని, నదుల్ని, పర్వతాల్ని, వివిధ భౌగోళిక పరిస్థితుల్ని వర్ణించి దేశ ఔన్నత్యాన్ని చెప్పడం కనిపిస్తుంది. ఇవన్నీ మనకున్న గొప్ప సంపదకు నిదర్శనాలు. మన తెలుగు సాహిత్యం విషయానికి వస్తే చిలకమర్తి వారి పద్యం...

**"భరత ఖండంబు చక్కని పాడియావు**
**హిందువులు లేగదూడలై యేడ్చు చుండ**
**తెల్లవారను గడుసరి గొల్లవారు**
**పితుకుచున్నారు మూతులు బిగియ బట్టి"** దీన్నే మొదటి జాతీయోద్యమ పద్యమని కొందరు అంటే, మరికొందరు 1905 డిసెంబర్ 15 నాటి 'కృష్ణా పత్రిక' మొదటి సంచికలో వచ్చిన The Cry of Mother India అనే గీతం మొదటిదని అంటారు. మరికొందరు ఒక అజ్ఞాతకవి రాసిన "***హిందువులారా ఎన్నాళ్ళీ గతి...***" మొదటిదని అంటారు. నాటి సాహిత్యాన్ని పునర్మూల్యాంకనం చేసుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. చిలకమర్తి వారి స్వీయచరిత్రలో 224, 226 పుటలలో *"బిపిన్ చంద్ర గారి ఉపన్యాసాలకు ఇంగ్లీష్ రాని జనులకు తెలుగులో చెప్పమని నన్ను కోరారు. సదస్సు చివరి రోజు నా మనస్సులో ఊహించుకొని ఈ క్రింది పద్యాన్ని బహిరంగంగా చదివాను. అదే భరతఖండంబు చక్కని పాడియావు"* అని అన్నారు. అంటే అది 1907 లో రాసింది. ఈ గేయమే మొట్టమొదటి జాతీయోద్యమ తెలుగు గేయం కాదన్నంత మాత్రాన వారి గేయం తక్కువదేమీ కాదు. భావోద్వేగం పొంగిపొరలే నాటి కాలంలో ఇలాంటి దేశభక్తి గేయాలు పునరుత్తేజితం చేస్తాయి.

దేశమాత గావించిన ఆక్రందన అంతా The Cry of Mother India అనే గేయంలో కనిపిస్తుంది. ఈ విషయాలన్నీ జాతీయోద్యమంపై పరిశోధన చేసిన 'మద్దూరి సుబ్బారెడ్డి' గారు తన పరిశోధన గ్రంథంలో వివరించారు.

*'ఎన్నో జాతులు మనలో ఉండేను / ఏమది న్యాయం ఇతరుల జోక్యం?*
***ఒక తల్లి పిల్లలు కలహించుకున్నా /అన్నదమ్ములే వారెన్నటికీ.*** 'అఖండ భారతదేశాన్ని సందర్శించిన గరిమెళ్ళకు భారతదేశం రెండు ముక్కలయినప్పుడు బాధాకరంగా కనిపించడంలో వింతయేమీ లేదు. 'అఖండ హిందూస్థాన స్వప్నం ఆఖరు కిట్లడుగంటింది' అనడంలో అఖండ భారతదేశం భారతదేశం, పాకీస్తాన్ గా విడిపోయిన బాధ కనిపిస్తుంది. 1947, జూన్ 8 ఆనందవాహినిలో ప్రచురితమైన **'చీలికలు'** అనే గేయంలో. అఖండ భారతమే మా దేశం అనే భావాన్ని వానమామలై వరదాచార్యులుగారు కూడా **'మా దేశం'** గేయంలో కూడా ఇంచుమించు ఇదే ఆవేదనను వ్యక్తంచేశారు. ఇలా కవులు సమైక్య భారతావని రెండుగా విడిపోవడాన్ని జీర్ణించుకోలేక పడిన వేదనలో దేశభక్తితో పాటు, జాతీయతా స్ఫూర్తి కనిపిస్తుంది. గుర్రం జాషువా గారు భరతమాత గొప్పదనం గురించి వర్ణిస్తూ చెప్పిన పద్యంలో భారతదేశం యొక్క ఔన్నత్యం ఎంతో గొప్పగా ఉంది.

*"సగర మాంధాత్రాది షట్చక్రవర్తుల*
*యంకసీమల నిల్చినట్టి సాధ్వి*
*కమలనాభుని వేణుగానసుధాంబుధి*
*మునిగి తేలిన పరిపూతదేహ*

*కాళిదాసాది సత్కవికుమారుల గాంచి*
*కీర్తి గాంచిన పెద్దగేస్తురాలు*
*బుద్ధాది మునిజనంబుల తపంబున మోద*
*బాష్పముల్విడిచిన భక్తురాలు*
*సింధు గంగానదీజలక్షీరమెపుడు*
*గురిసి బిడ్డల బోషించుకొనుచునున్న*
*పచ్చి బాలెంతరాలు మా భరతమాత*

***మాతలకు మాత సకలసంపత్సమేత.*** *(గుఱ్ఱం జాషువ, భరతమాత)* ఇంత మహోన్నతంగా భారతమాతను అభివర్ణించిన గుఱ్ఱం జాషువ గారే ఈ దేశంలో వర్ణవ్యవస్థ కులవ్యవస్థగా మారి జాతిని విచ్ఛిన్నం చేస్తున్న పరిస్థితిని గమనించి నాలుగు వర్ణాల గురించి చెప్తారు కదా, మరి ఐదవ వర్ణాన్ని సృష్టించిందెవరని నిలదీస్తూ...

***"ముసలి వాడైన బ్రహ్మకు బుట్టినారు***
***నలుగురు కుమారులనుట విన్నాము గాని***
***పసరముకన్న హీనుడభాగ్యుడైన***

***యైదవ కులస్థు దెవ్వరమ్మా!సవిత్రి"*** అని ప్రశ్నించడంలో భారతదేశంలో కుల వ్యవస్థ జాతీయభావాన్ని నాశనం చేస్తుందనే ఆవేదనను వ్యక్తం చేయడం కనిపిస్తుంది. అయినప్పటికీ, ఆంధ్రదేశం నుండి భారతదేశంలో ఉన్న ప్రసిద్ధమైన విషయాలను, కీర్తిని భౌగోళిక స్వరూపాన్ని కాళిదాసు వర్ణించినట్లే, తన గబ్బిలం కావ్యంలో తెలుగు ప్రశస్తిని జాషువా వర్ణిస్తాడు. మానవుడినే దేవుడిగా భావించిన మహాకవి గురజాడ అప్పారావుగారు దేశమంటే మట్టికాదని, మనుషులని గొప్ప సందేశాన్ని అందించారు.

***"దేశమంటే మట్టి కాదోయ్/దేశమంటే మనుషులోయ్***
***చెట్టపట్టాల్ పట్టుకొని/దేశస్థులంతా నడువవలెనోయ్***
***అన్నదమ్ముల వలెను జాతులు/మతములన్నియు మెలగవలెనోయ్***
***మతం వేరైతేను యేమోయ్/మనసు లొకటై మనుషులుంటే***
***జాతమన్నది లేచి పెరిగి/లోకమున రాణించునోయ్***
***దేశమనియెడి దొడ్డ వృక్షం/ప్రేమలను పూలెత్తవలెనోయ్***
***నరుల చమటను తడిసి మూలం/ధనం పంటలు పండవలెనోయ్***
***ఆకులందున అణగిమణిగి/కవిత కోవిల పలకవలెనోయ్***

***పలుకులను విని దేశమందభి/మానములు మొలకెత్తవలెనోయ్"*** *(గురజాడ అప్పారావు, దేశమును ప్రేమించుమన్నా... 1910)* ఈ గేయం రాసిన గురజాడ అప్పారావుగారి మీద *'జాతీయోద్యమ (ప్రభావం ఉందని ఖచ్చితంగా చెప్పలేము కాని ఆ ఉద్యమాన్ని ఆయన చిన్నచూపు చూడలేదనీ, ఆయన (ప్రముఖ మానవతావాది కావడంవల్ల, ఆయన ఎల్లలులేని దేశాన్ని తన దేశంగా భావించినట్లు నిర్వంద్వంగా చెప్ప వచ్చు*"ని డా. చల్లా రాధాకృష్ణశర్మ వ్యాఖ్యానించారు. ***(తెలుగు – తమిళ కవిత్వాలు: జాతీయవాదం : యువభారతి, 1994: పుట,31)***

రాయప్రోలు సుబ్బారావు (1892– 1984) "జన్మభూమి" గీతంలో...

*ఏ దేశమేగినా ఎందుకాలిడినా*

*ఏ పీఠమెక్కినా, ఎవ్వరేమనినా,*
*పొగడరా నీ తల్లి భూమి భారతిని,*
*నిలపరా నీ జాతి నిండు గౌరవము...*

అంటూ భారతదేశం యొక్క గొప్పతనాన్ని ఏంతో ఉన్నతంగా చెప్తూ

***"లేదురా ఇటువంటి భూదేవి యెందూ***
***లేరురా మనవంటి పౌరులింకెందు."*** అన్నారు.

చెన్నాప్రగడ భానుమూర్తిగారు సర్వ భారతాన్ని మనస్సులో ఉంచుకుని ఇలా వర్ణించారు.

*"సదయత్వంబున నాటి నేతు రచనా నైపుణ్య మేపారగా*
*నదులన్ సాగరగాములన్ పథమునన్ బంధించి వంధ్యోర్విప*
*స్యద గావింపగఉ గుల్య లేర్పరచి, రథ్యా శ్రేణి నిర్మించి సౌ*
*ఖ్యదమై పొల్చు స్వరాజ్య మీయవని స్థైర్య స్ఫూర్తి వర్ధిల్లుతన్"*

మంగిపూడి వెంకట శర్మగారు తన నిరుద్ధ భారతము (1915) అనే కావ్యంలో ఇలా అన్నారు:

***మాలలన్ పంచము లటంచు, మాదిగలని,***
***శ్వపచులని, చెప్పగా రాని వారటంచు***
***మరియు చండాలురని తోడి మానవులను***
***దరిమి వేయుట సాంఘిక ధర్మమగునె?'*** అని ఆనాడే ప్రశ్నించడం కనిపిస్తుంది. అంతేకాదు, ఆనాడు పంచములను నీచంగా చూస్తున్నప్పుడు ఆయన ఎంతో గౌరవంగా సంబోధిస్తూ ఇలా అన్నారు.

*"పంచములార! యంతరిత భవ్య గుణోత్కరులార! గర్భితో*
*దంచిత శక్తులార! యసమర్థులెమీఅలు? గొఱ్ఱెమందలో*
*వంచితమై చరించు నలవ్యాఘ్ర కిశోరము రీతిపూర్తిగా*
***వంచితులైతి రాత్మబల వైఖరినెంచుడు! మేల్కొనుండికన్"*** దీనిలో దళితులు అసమర్థులు కాదని చెప్పడం గొప్పవిషయం. జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు భారత కథను ఆధారంగా చేసుకుని స్వాతంత్ర్యోద్యమ కాలం నాటి జాతీయోద్యమభావాలను ప్రతిఫలించేలా విజయశ్రీలో ఇలా వర్ణించారు.

*"దొరలకు ముందు రాజసములో తెగనీలిగి పట్టుపాన్పులన్*
*బొరలు దినమ్ము లన్నియును బోయె, ప్రపంచము మారిపోయె, ము*
*ష్కరులు కరూద్వహుల్ మనల గాదని కన్నులు మూసికొన్న ఈ*
***నరుని కఠోర గాండివ నినాదము నిద్దుర మేలు కొల్పెడిన్"*** మహాత్మాగాంధీ జాతీయోద్యమంలో కనబరచిన పోరాటస్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనంగా ఈ పద్యం కనిపిస్తుంది.

ఇలా ఎంతోమంది కవులు తమతమ రచనలలో దేశభక్తి భావాలను ప్రకటించారు. ఇవన్నీ జాతీయోద్యమానికి ఆటంకంగా నిలిచే అంశాలుగా ఆనాడే కవులు గుర్తించారు. మహాత్మాగాంధీ స్వాతంత్ర్యోద్యమంలో అందరూ పాల్గొనాలని అనేక ఆలోచనలు చేశారు. దాని ఫలితంగానే హరిజనోద్ధరణ, హరిజనులకు దేవాలయాల ప్రవేశం వంటి అనేక సంఘసంస్కరణలను అమలు చేశారు. దీనిఫలితంగా దేశవ్యాప్తంగా అనేకమంది కవులు తమ రచనల ద్వారా అంటరానితనం మహాపాపమనీ, మానవులంతా సమానమనే భావనతో కవిత్వం, నవలలు, కథలు, నాటకాలు రాశారు. వీటన్నింటిలోను భారతజాతీయోద్యమ ప్రభావాన్ని

గమనించవచ్చు.

మనం స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం పడుతున్న తపన రొమాంటిసిజం ప్రభావంతో వచ్చిన భావకవిత్వంలో కూడా కనిపిస్తుంది. మనకు దేవులపల్లి కృష్ణశాస్త్రి రచించిన 'స్వేచ్ఛాగీతం' అనేది కేవలం అదొక అనుభూతి కవిత్వంగా మాత్రమే చూడవలసిన పనిలేదు. దానిలో ఉన్న జాతీయత, స్వేచ్ఛా ప్రియత్వం గురించి తెలియాలి అంటే ఇస్మాయిల్ గారు రాసిన పుస్తకం చదవాలి. అందులో కృష్ణశాస్త్రి గారిలోని స్వేచ్ఛా తపన వెనుక ఉన్న జాతీయోద్యమ భావనను గురించి చాలా చక్కగా రాశారు. తరువాత అద్దేపల్లి రామ్మోహనరావుగారు కూడా ఒక అద్భుతమైన వ్యాసం రాశారు. అది చదివితే భావకవిత్వంలో కూడా స్వేచ్ఛా శృంఖలాలను అంటే ఈ స్వేచ్చను బంధిస్తున్న ఆ బంధనాలను తెగగొట్టడం కోసం ప్రయత్నిస్తున్న ఆ తపన కవిత్వంగా చెప్పిన తీరు కనిపిస్తుంది.

అభ్యుదయ కవిత్వాన్ని పరిశీలిస్తే, అభ్యుదయ కవులకు సహజంగా ఉన్న లక్షణం అంతర్జాతీయ భావన. ఈ భావన ఉండటం వలన అన్ని దేశాలలో మానవుడు స్వేచ్ఛగా ఉండాలి. దానిలో భాగంగానే ఈ దేశంలో వాళ్ళు కూడా స్వేచ్ఛగా ఉండాలి. సుఖంగా ఉండాలి అని కోరుకున్నారు. తెలంగాణా లోని నిజాం నిరంకుశ పాలనను కూడా వ్యతిరేకించింది. దాశరథి వంటి వారు ఆనాడు అక్కడ జరుగుతున్న నిజాం నిరంకుశ పరిపాలనను తమ సాహిత్యం ద్వారా తెలియజేశారు. ఆ తర్వాత శ్రీశ్రీ తెలుగు సాహిత్యంలో పీడిత వర్గానికి గొప్ప సాహిత్యనాయకుడుగా కనిపిస్తారు.

అభ్యుదయ సాహిత్యం తరువాత వచ్చిన ధోరణులలో మనకు ఒక తీవ్రవాద ధోరణిలా కనిపించే దిగంబర కవిత్వోద్యమంలో భరతమాతను '**వందేమాతరం...**' అనే గీతంలో ***'భరతమాత ఎండిన స్తనంతో ఉంది' అంటూ "ఒంటిమీది గుడ్డలతో జెండాలు కుట్టించి వివస్త్రవై ఊరేగుతున్న దైన్యం నీది/ ఎండిన స్తనాల మీదికి ఎగబడ్డ బిడ్డల్ని ఓదార్చలేని శోకం నీది"*** అంటూ రకరకాలుగా అభివర్ణించారు. ఇలా అభివర్ణించడానికి కారణం ఈ దేశంలో మనవాళ్ళు ఏదైతే ఆశించి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకోసం తపన పడి జాతీయోద్యమంలో పాల్గొన్నారో వారియొక్క అనుభవాలు, వారియొక్క ఆశయాలు వాస్తవంలో కనిపించకపోయేసరికి, దేశంలో అవినీతి పెరిగిపోయేసరికీ, దేశ సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకరింపబడేసరికీ, సమాజం కులాలు, మతాలు, వర్గాలుగా మరింత విభజన రేఖలు కనిపించేసరికీ కవులలో అసహనం పెరిగింది. ఆ అసహనాన్ని తెలుగు కవులు ముఖ్యంగా దిగంబర కవులు సమర్థవంతంగా పట్టుకున్నారు. అందుకే ఆ భాషలో కాఠిన్యం కనిపిస్తుంది.

దిగంబర కవిత్వం తరువాత వచ్చిన విప్లవ కవిత్వం, విప్లవ కవులు సాయుధంగా పోరాడితే తప్ప ప్రజాస్వామ్యం సాధ్యం కాదని సమసమాజం స్థాపితం కాదు అనే భావనలో ఉండేవారు. దానిలో భాగంగానే శ్రీశ్రీ సాహిత్యాన్ని మనం అర్థం చేసుకోవాలి. ఆ తరువాత వచ్చిన స్త్రీవాద సాహిత్యంలో, ఈ దేశంలో స్త్రీని వేదకాలం నుండి ఎంతో ఉన్నతంగా పూజిస్తున్నాము, గౌరవిస్తున్నాము అని చెబుతున్నాం. నేటి స్త్రీకి మనం ఇస్తున్న లేదా మనం చూస్తున్న స్థితి ఎటువంటిది అని ప్రశ్నించుకోవాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడింది అంటే ఆర్థిక స్వేచ్ఛా అనేది కేవలం పురుషుల చేతుల్లో ఉండి, వాళ్ళు స్త్రీలను కేవలం విలాసవస్తువులుగా ఉపయోగించుకున్న స్థితి నుండి ఏర్పడింది. **'నీలిమేఘాలు'** కవితాసంకలనంలో స్త్రీల వేదనలోని అనేక పార్శ్వాలు మనకు కనిపిస్తాయి. వారి ఆలోచనలు తెలుస్తాయి. 1984 లో సావిత్రి **'బంది పోట్లు'** అనే కవితలో స్త్రీని ఎలా చూస్తున్నారో ఎంతో శక్తివంతంగా అభివ్యక్తీకరించారు.

***"పాఠం ఒప్పచెప్పక పోతే పెళ్ళిచేస్తానని***
***పంతులు గారన్నప్పుడే భయమేసింది !***
***ఆఫీసులో నా మొగుడున్నాడు***
***అవసరమొచ్చినా సెలవివ్వడని***
***అన్నయ్య అన్నప్పుడే అనుమాన మేసింది!***
***వాడికేం ? మగమహారాజని***

*ఆడా, మగా వాగినప్పుడే అర్థమై పోయింది*
*పెళ్ళంటే పెద్ద శిక్ష అని*
*మొగుడంటే స్వేచ్ఛా భక్షకుడని*
*మేం పాలిచ్చి పెంచిన జనంలో సగమే*
*మమ్మల్ని విభజించి పాలిస్తోందని!"*

దీన్ని వ్యాఖ్యానించనవసరం లేదు. స్త్రీవాద సాహిత్యానికి మ్యానిఫెస్టోలాంటి కవిత ఇది. కేవలం జాతీయోద్యమం అనేది మనదేశాన్ని మనం స్వాతంత్ర్యం సాధించుకొని, మనల్ని మనం పరిపాలించుకోవడం కోసం చేసే ఉద్యమంగా మాత్రమే చూడకూడదు. అది నిరంతరం జరిగే ఒక ప్రక్రియ. మనం స్వాతంత్ర్యం సాధించుకున్న తర్వాత కూడా మనలోని లోపాల్ని మనం సరిదిద్దుకోవడానికి చేసే ప్రతి ప్రయత్నం జాతిని పునర్నిర్మించుకునే ప్రయత్నంగానే చూడాలి. ఈ నేపథ్యంతోనే ఆధునికసాహిత్యంలో వస్తున్న ధోరణులు, వాదాలను కూడా అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉంది.

స్త్రీవాద సాహిత్యం తరువాత దళితవాద సాహిత్యం దీనిని పరిశీలిస్తే, '*మేము ఈ దేశంలోనే ఉన్నాము కానీ ఈ దేశంలో మాకున్న స్థానం ఏది*' అని ప్రశ్నించింది. ఈ దేశంలో కులం వాస్తవం. కులాధారంగా నిర్మింపబడిన ఈ దేశంలో నాకున్న స్థానం ఏది అని ప్రశ్నించింది దళితవాద సాహిత్యం. కులం లేదు... కులం లేదు... అంటున్న వాళ్ళు కూడా మన కులం గురించి తెలియక ముందు మనకు, వాళ్ళకు మధ్యలో ఉండే సంబంధం ఒకలా ఉంటుంది. మన కులం గురించి తెలిసిన తరువాత వాళ్ళు మనల్ని చూసే విధానం లో మార్పు ఉంటుంది. దీనికి కారణం ఈ కులమనేది పవిత్రత, అపవిత్రత అనేవాటికి ముడిపడిన అంశంగా హిందూమతం చిత్రీకరించింది. పురుషసూక్తంలో బ్రాహ్మణులు బ్రహ్మ నుదుటి నుండి పుట్టారని, క్షత్రియులు భుజాలనుండి పుట్టారని, వైశ్యులు తొడలనుండి పుట్టారని, శూద్రులు పాదలనుండి పుట్టారని చెబుతుంది. ఈ సమాజ వ్యవస్థ ముందుకు నడవాలంటే అన్నీ వర్ణాలవాళ్ళు ఉండాలనే సూక్తిని ప్రతీకని వాళ్ళు సరిగ్గా అర్థం చేసుకోలేక, విభిన్న వ్యాఖ్యానాల వలన ఆ విధానాన్ని మాసిపూసి మారేడుకాయ చేశారు.

సలంద్ర అనే కవి **"దళితమానిఫెస్టో"** అనే కవితని రాశాడు. దీనిలో స్వాతంత్ర్యం రాకముందూ, తర్వాత కూడా దళితులు పడుతున్న అవమానాల్ని, బాధల్ని ఒక క్రమపరిణామంలో వర్ణించాడు.

*"నన్ను*
*నీ దేవుడి గుళ్ళోకి రావద్దన్నావు*
*సరే, ఎలాగయితేనేం*
*నేను నాస్తికుణ్ణవడమే బాగయింది*
*నన్ను*
*చదువుకోవద్దన్నావ్‌జి*
*చదివితే నాలుక కోసెయ్యమన్నావ్*
*వింటే చెవుల్లో*
*వేడివేడి సీసపులోహం పోయమన్నావ్*
*సరే, ఎలాగయితేనేం*
*నువ్వెంతటి మూర్ఖుడివో*
*నీవెంతటి విశాలహృదయుడివో*
*నాకు తెలిసిపోవడమే బాగయింది*

*నన్ను*
*చచ్చిన శవాల దహన సంస్కారాలే చూసుకోమన్నావు*
*సరే, ఎలాగయితేనేం*
*మీ ప్రాణాలని కూడా*
*ఎలా పాతేయాలో*

***నాకు తెలవడమే బాగయింది"*** అని దళిత జీవితాన్ని, వీరిలో రావాల్సిన చైతన్యాన్ని కూడా ఈ కవితలో ప్రకటించాడు కవి. దీని తరువాత వచ్చింది మైనారిటీ సాహిత్యం. దేశ విభజన తరువాత జరిగిన పరిణామాలను ఖాదర్ మొయినుద్దీన్ **'పుట్టుమచ్చ'** కవితలా ఎందుకు రాయాల్సి వచ్చింది. క్రికెట్ చూస్తూ ఉంటే మన పక్కన కూర్చొన్నది మన ఫ్రెండ్ అయినా కూడా అతను ముస్లిం అవడం మూలంగా అతన్ని విదేశస్థుడిగా భావించే అతను మన పక్కన ఉన్నాడు. కాబట్టి మనం మాట్లాడవద్దు అనే స్థితి మనకు ఎందుకు వచ్చిందని మనం ఆలోచించాలి. ఈ దేశంలో నాకు 1947 ఆగస్టు 15 ఒక 'పుట్టుమచ్చ' చేసింది. నేను ఈ దేశంలో ఉన్న గాలిని పీలుస్తూ ఈ నేలలో జీవిస్తూ, ఈ దేశం కోసం నేను ప్రాణాల్ని ఒడ్డుతున్నా కూడా నన్ను విదేశీయుడంటున్నారు. నాకు స్వేచ్ఛ లేకుండా పోయింది. అని చెబుతారు. ఒక అభద్రతా భావంనుండి వచ్చింది మైనారిటీ సాహిత్యం.

*"ఎన్నికలకు ముందు*
*ఎన్నెన్నో సంఘటనలకు ముందు*
*దేశ చరిత్ర దిశానిర్దేశానికి*
*నా నెత్తురు గూడుపట్టవుతుంది*
*పార్లమెంటు భవనంలో వాలేందుకు*
*నా నెత్తురు పాదలేపనమవుతుంది.*
*నా రక్త పదవీసోపానానికి*
*అభయ 'హస్త'మవుతుంది*
*నా రక్తం 'భరతమాత' నుదుటి*
*తిలకమవుతుంది. పూజా 'కమల' మవుతుంది."*

అంటూ సాగే పుట్టుమచ్చ కవితలో దేశంలో పెరిగిపోతున్న కుల, మత ఉన్మాదాల్ని ప్రశ్నిస్తాడు కవి ఖాదర్ మొహియుద్దీన్. తమ దేశాన్ని పునర్మించుకోవాలనే తపన కూడా జాతీయోద్యమంలో భాగంగా చూసినప్పుడు ఈ కవిత్వం ఎంత గొప్పదో తెలుస్తుంది.

*"క్రికెట్మేచ్ నా దేశభక్తికి*
*తూనికా, కొలమానమవుతుంది*
*నేను నా మాతృదేశాన్ని*
*ఎంతగా ప్రేమిస్తున్నానన్నది కాదు*
*ఏయే పరాయి దేశాల్ని*
*ఎంతెంతగా ద్వేషిస్తున్నానన్నదే*

***నా దేశభక్తికి ఎంతో కొంత ఆధారమవుతుంది"*** అంటూ చివరికి క్రికెట్ ఆట కూడా ముస్లింలను అనుమానించడానికి ఒక సాకు కావడాన్ని ఖాదర్ ప్రశ్నించారు.

**"నేను పుట్టకముందే**
**దేశద్రోహుల జాబితాలో**
**నమోదై ఉంది నాపేరు"**

**అన్న "పుట్టుమచ్చ"** దీర్ఘకావ్యంలోని వాక్యాలు మనల్ని ఆలోచింపజేస్తాయి.

ఈ మైనారిటీ సాహిత్యంలో ఇంకొక పాయగా వచ్చింది. క్రైస్తవ సాహిత్యం. ఇది మైనారిటీ సాహిత్యంలో అంతర్భాగమైంది. అంటే బొట్టు పెట్టుకోకపోతే రెండు రకాలుగా ఆలోచిస్తారు. ఒకటి హిందూ ధర్మం ప్రకారం బొట్టు పెట్టుకుంటే ఆమె పుణ్యస్త్రీ, భర్త ఉండటం వలన బొట్టు పెట్టుకుంది. ఒకవేళ చిన్న వయసు నుండి బొట్టు పెట్టుకోలేదంటే క్రైస్తవులై ఉంటారు. అంటే ఇక్కడ బొట్టు వాళ్ళ అస్తిత్వానికి ఒక ప్రతీకగా మారిపోయింది.

మరి ఇవన్నీ కూడా ఈ డెబ్బై అయిదు సంవత్సరాల భారత స్వాతంత్రోద్యమంలో "ఆజాదీ కా అమృత్ మహెూత్సవ్" జరుపుకుంటున్న ఈ తరుణంలో ఇలాంటివి మనం సరిదిద్దుకోవాల్సిన అంశాలు చాలా ఉన్నాయి. ఈ దేశం నాదీ అనే భావన ప్రతీ ఒక్కరికీ రావాలంటే, కవుల యొక్క బాధ్యత గురుతరమైనది. మనం అనుకొన్నవి, రాసుకున్నవి ఒకటైతే, అవి ఆచరణలో వేరుగా కనిపించినప్పుడు కవులు గానీ, రచయితలు గానీ ఆరకమైన ప్రేరణను కచ్చితంగా చేస్తారు. ఎన్నో నిబంధనలు ఉన్నటువంటి ప్రాచీన సాహిత్యంలోనే

**"రాజుల్ మత్తులు వారిసేవ నరకప్రాయంబు వారిచ్చునం**
**భోజాక్షీచతురంతయానతురగీ భూషాదు లాత్మవ్యధా**
**బీజంబుల్ తదపేక్ష చాలు మరితృప్తిం బొందితిన్ జ్ఞానల**
**క్ష్మీజాగ్రత్పరిణామ మిమ్ము దయతో శ్రీ కాళహస్తీశ్వరా!"** అని ఆ రోజుల్లోనే, కవి అంతా స్వేచ్ఛగా మాట్లాడాడు. కవి నిరంకుశుడు కాబట్టి అతను మాట్లాడుతాడు. కానీ కవులు ఇప్పుడు అలా మాట్లాడితే...? నిజంగా కవులకు అలాంటి స్వేచ్ఛ నేడు ఉందా అనిపిస్తుంది. భారతరాజ్యాంగంలోని ఆర్టికల్ 17 ప్రకారం దేశపౌరులకు భావ స్వాతంత్ర్యపు హక్కు ఉంది. కానీ ఈ స్వేచ్ఛ నేడు నిజంగా కనిపిస్తుందా? అని ప్రశ్నించవలసిన అవసరం ఏర్పడినప్పుడు, మనం కచ్చితంగా అటువంటి సాహిత్యాన్ని కూడా పరిశీలించవలసిన అవసరం ఉంది.కవులు, రచయితలు జాతీయోద్యమ సాహిత్యంలో చాలా చైతన్యవంతమైన పాత్రను పోషించారు. ఇవన్నీ ఎందుకు రాశారంటే, మనదంతా ఒకే కుటుంబం. మనలో ఉన్నటువంటి ఈ భేదాభిప్రాయాలను తొలగించుకోవాలని చెప్తున్నారు. ఈ భేదాభిప్రాయాలను మీరు పోగొట్టండి. అప్పుడు మనమంతా నిజంగా ఒకటవుతాము. అంతేకానీ మీరు మీ కులాన్ని ఆధారంగా చేసుకొని... మీ మతాన్ని ఆధారంగా చేసుకొని.. మీ ప్రాంతాన్ని ఆధారంగా చేసుకొని... చెప్పేదొకటి, ఆచరణలో మరొకటి ఉన్నప్పుడు ఆ మనిషి పట్ల విశ్వాసం ఉండదు. అది సాహిత్యమైనా అంతే. కవులు, రచయితలు ముందుగా వీటిని ఆచరణలో చూపించాలి. ఈ దేశం నాది... ఈ కవి నావాడు అని భావించుకునే స్థితి రావాలంటే.. మనలో ఉన్నటువంటి చెడును పోగొట్టుకోవాలి. మన ఆలోచనల్లోని కల్మషాన్ని కడిగేసుకోవాలి. మనలో ఉన్న సంస్కరణ భావాలే మనకు సాహిత్యంగా రావాలి. అప్పుడే అది చాలా సమర్థవంతంగా, శక్తివంతంగా భాసిస్తుంది.

చివరగా ఒక్క వాక్యం... ఈ డెబ్బైఅయిదేళ్ళ భారతదేశం లో ఈ జాతి పునర్నిర్మాణంలో భాగంగా మన తెలుగు కవులు మన కథా రచయితలు, మన కళాకారులు వాళ్ళ అనుభవాలను, అభిప్రాయాలను చాలా సమర్థవంతంగా, శక్తివంతంగా చెప్తున్నారు. కాబట్టి దాన్ని మనం జాగ్రత్తగా అర్థం చేసుకున్నప్పుడు మనకి ఇతర భాషలలో కూడా అంతా శక్తివంతమైన సాహిత్యం వచ్చింది. మరొక వైపు ప్రపంచ సాహిత్యాన్ని చూసినప్పుడు మనకున్న ఈ స్వేచ్ఛా కానీ, ఈ స్వాతంత్ర్యం కానీ ఇతర దేశాలలో ఎంతవరకున్నాయని తెలుసుకోకపోతే మన భారతదేశం పట్ల మనకు ప్రేమ అభిమానం ఏర్పడవు. మనలో మనకి కొన్ని చిన్న చిన్న భేదాభిప్రాయాలు ఉండవచ్చు. అవి మనలో మనం సర్దుబాటు చేసుకునేవే తప్ప, అవి మరీ అంతా తీవ్రమైనవి కావని మనం గమనించినట్లయితే,

ఈ దేశం పట్ల మనకు నిజమైన ప్రేమ ఏర్పడుతుంది. ఈ దేశం పట్ల నిజమైన భక్తి ఏర్పడుతుంది. అటువంటి ప్రేమనీ, అటువంటి భక్తిని పెంపొందించడానికి ఉపయోగపడిన ఈ సదస్సు నిజంగా ఫలవంతమైనదని భావించవచ్చు. ఈ సదస్సు నిర్వాహకులకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

నేను పెద్ద ప్రసంగాన్నే రాసుకొచ్చాను. కానీ, దాన్ని అంతా ఇక్కడ వివరించాలంటే సమయం సరిపోదు. అందువల్ల ఈ కళాశాల వారు పత్రాలన్నింటినీ ఒక పుస్తకంగా తీసుకొస్తున్నారని తెలిసింది. దీనిలో నా పూర్తి ప్రసంగాన్ని అందిస్తాను. 'జాతీయోద్యమం అనుభవాలు–జ్ఞాపకాలు–సాహిత్యం' అనే ఈ అంతర్జాల, అంతర్జాతీయ సదస్సులో మీతో నా అభిప్రాయలను పంచుకునే అవకాశం కలిగించినందుకు మీకందరికీ నాహృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అందరికీ నమస్కారం. ❀

# ఆంధ్రదేశంలో జాతీయోద్యమ పాత్ర

**ఆచార్య విస్తాలి శంకర రావు,** తెలుగు శాఖాధిపతి, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై



డెబ్బై అయిదు సంవత్సరాల స్వాతంత్ర్య అమృత మహోత్సవాల సందర్భంగా నిర్వహించే ఈ సదస్సు ఒక అద్భుత రూపకల్పన. భారత చరిత్రలో 1885–1947 సంవత్సరాల మధ్య కాలాన్ని పోరాట సమయంగా అభివర్ణించవచ్చు. జాతి బానిస విముక్తి కోసం పోరాడి దాస్య శృంఖలాలను త్రెంచి వేసిన సమయం కాబట్టి జాతీయోద్యమంగా చెప్పుకుంటున్నాము. ఇది ఒక ప్రాంతానికి, ఒక మతానికి, ఒక కులానికి, ఒక మనిషికి సంబంధించినది కాదు. భారతీయులకు సంబంధించినది. జాతీయ భావాలకు సంబంధించినది.

"ఎందరో వీరుల త్యాగఫలం మన నేటి స్వేచ్ఛకిదె మూల బలం వారందరినీ తలచుకొని మన మానస వీధిని నిలుపుకొని తేనెల తేటల మాటలతో మన దేశ మాతనే కొలిచెదమా" అన్న కవిగారి పాటను తలచుకొన్నట్లయితే ఈరోజు మనం అనుభవిస్తున్న ఈ స్వేచ్ఛ వెనుక గత జీవిత పోరాటాల చరిత్రలో ఎందరో మహానుభావుల పాత్ర ఉన్నదన్న విషయం మర్చిపోకూడదు.

స్త్రీ పురుష కులమత భేదం లేకుండా ప్రాంతాలకు భాషలకు అతీతంగా పాల్గొని జాతిని జాగృతం చేశారు. వారందరికీ హృదయపూర్వక నమస్సుమాంజలులు. అమరవీరులందరికీ నివాళులు. వారందించిన ఈ స్వేచ్ఛా కుసుమాలను ఆస్వాదిస్తూ, ఆనందిస్తూ మనం భారతీయులం, మనది భారత జాతి అని గర్వంగా చెప్పుకుంటున్నాము.

భారతదేశం లోని ఆంధ్రదేశం లో ఉన్న గుంటూరులో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు కాబట్టి 'ఆంధ్రదేశంలో జాతీయోద్యమ పాత్ర' అనే విషయం గురించి ప్రస్తావిస్తాను.

ఆసియా ఖండంలో అనేక తిరుగుబాట్లు జరిగాయి. రష్యాపై జపాన్ విజయం, చైనాకు సంబంధించిన స్వాతంత్ర్య విప్లవం, 1904 లో సన్య, 1906 లో షహాను కు వ్యతిరేకంగా పర్షియా, మజ్లిస్, టర్కీ లో నిరంకుశ సుల్తానును వ్యతిరేకిస్తూ తురుష్కులు చేసిన ఉద్యమాలు ముఖ్యమైనవిగా పేర్కొనవచ్చు. ఇవన్నీ భారతీయులకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చాయి.

1909 లో అప్పుడప్పుడే జాతీయోద్యమం పురుడు పోసుకుంటున్న రోజులవి. ఆ రోజులలో ఆంధ్రదేశంలో ఆంధ్రభారతి అను ఒక పత్రికలో మేల్కొలుపు అనే శీర్షికతో ఒక అజ్ఞాతకవి జాతీయోద్యమాన్ని చైతన్యపరుస్తూ –

"కదన కేకకు మన జపానులెల్ల
సకాలంలో మేల్గాంచి పెరుగును
గాఢ నిద్రను విడచి
పారశీకులు దీర్ఘ నిద్రను పారద్రోలిరి గౌరవంబున

వారిదారిన తురుష్కులు అందరును నీకంటే
ముందరగా నిద్రలేవగా పంది వలె నీవిట్లు నిద్రపోవ పాడియగు నయ్య"

అని వ్రాయడం జరిగింది. జాతీయోద్యమంలో ఆంధ్రుల పాత్ర కీలకమని చెప్పడానికి ఇది ఒక నిదర్శనం. 1920 తరువాత గాంధీ శకం ప్రారంభమయింది. అనేక ప్రాంతాలలో స్థానిక సమస్యలను ఆధారంగా చేసికొని ఎంతోమంది వీరులు ఉద్యమాలను నడిపి పోరాటం చేశారు. జాతీయోద్యమ స్ఫూర్తిని ప్రజలలో నింపారు. చీరాల పేరాల శాసనోల్లంఘన ఉద్యమం, పల్నాటి పుల్లరి ఉద్యమం, పెదనందిపాడు పన్నుల నిరాకరణ, అల్లూరి సీతారామరాజు రంప విప్లవం, ఉప్పుసత్యాగ్రహ ఉద్యమం, అతివాదులైన లాల్ బాల్ పాల్ ప్రజలను చైతన్యపరుస్తూ, ఉద్యమాలు నడిపారు. బెంగాల్ లో వందేమాతర ఉద్యమం ఇలా ఎన్నో ఉద్యమాలు జరిగాయి.

అయ్యదేవర కాళేశ్వర రావు, గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, సీతారామశాస్త్రి వంటి ఆంధ్ర నాయకులు స్వదేశీ మిత్ర పేరుతో మద్రాసు బీచ్ లో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వందేమాతర ఉద్యమానికి వారి సహకారాన్నిచ్చారు. అటువంటి గొప్పనేల ఆంధ్రదేశము. ఆ ఉద్యమాలలో చీరాల పేరాల ఉద్యమం ఒకటి. పర్వతనేని వీరయ్య చౌదరి గారి స్ఫూర్తితో కొండా వెంకటప్పయ్య గారు, ఉన్నవ లక్ష్మీనారాయణ గారు, రామస్వామిగారు, సీతారామశాస్త్రి గారు మొదలగువారు 'శాంతిసేన' అని ఒక సంస్థను స్థాపించారు.

సహాయ నిరాకరణ ఉద్యమానికి నిదర్శనంగా ఒక సంఘటనను ఇక్కడ ప్రస్తావించవచ్చు– 'ఒకసారి రూథర్‌ఫర్డ్ తన అనుచరులతో గుంటూరు వచ్చినప్పుడు పెదనందిపాడు ప్రాంతంలో పర్యటిస్తున్నప్పుడు వారికి ఆహారం అందకుండా చేశారు. వారు ఎర్రటి మిరపకాయాలను చూసి తినేవస్తువులని ఆకలి తీర్చుకోబోయారు. ఆ మిరపకాయలు తిన్నవారికి ఒక్క నీటి చుక్కను కూడా అందకుండాజేసి గుంటూరు మిరపకాయల ఘాటు ఎలా ఉంటుందో చూపించారు. సైనికులకు అగ్గిపెట్ట కూడా దొరకనివ్వలేదు. ఆకలితో బ్రిటిష్ సైన్యం అలమటించి పోయింది. మంచి నీరు దొరకక మిరప ఘాటు తట్టుకొనలేక బురద నీటిని తాగిన స్థితిని' ప్రకాశం గారి జీవిత చరిత్రలో మనకు కనిపిస్తుంది. అటువంటి ఉద్యమాల పురిటిగడ్డ ఈ గుంటూరు సీమ.

మన్యంలో పోరాటం చేస్తూ అల్లూరి సీతారామ రాజు తూర్పుగోదావరి జిల్లాలోని రాజఒమ్మంగి పోలీసు స్టేషన్ కొల్లగొట్టి వారి ఆయుధాలతో వారిపైనే యుద్ధం చేసిన సాహసవీరుడు.

సైమన్ కమీషన్ వ్యతిరేక ఉద్యమంలో ఫిబ్రవరి ఎనిమిదవ తేదీన ప్రకాశం పంతులుగారు అందరినీ కూడగట్టి మద్రాసు వీధుల్లో తిరుగుతున్నప్పుడు పోలీసులు కాల్పులు జరిపారు. ఆ కాల్పుల్లో పార్థసారథి అనే వీరుడు చనిపోయాడు. ఆయన మృతదేహం వద్దకు పోలీసులు ఎవరినీ రానీయలేదు. వస్తే కాల్చివేస్తామని బెదిరించారు. ఆ సందర్భంలో గుండుకెదురుగా గుండెను చూపించిన ప్రకాశం గారి ధైర్యం మనం ఎలా మరిచిపోగలం? ఇంతటి స్ఫూర్తిని కలిగిన నేల ఇది.

అనేక ఉద్యమాలకు సాహిత్యం వెన్నుదన్నుగా నిలుస్తున్నది. 'వీరగంధము తెచ్చినారము వీరులెవ్వరో తెలుపుడీ 'ఉప్పో యమ్మ..' అనుచు పాటలు వ్రాసి మన ఆంధ్రదేశమునకు జాతీయోద్యమ స్ఫూర్తినిచ్చారు. "చేయెత్తి జెకొట్టు తెలుగోడా, గతమెంతొ ఘన కీర్తి కలవోడా" అంటూ ఆంధ్రదేశమునందు అణువూ అణువున జాతీయోద్యమం నడిపిన వీరుల యొక్క పాత్ర ప్రముఖమైనదిగా మనం చెప్పవచ్చు. ❀



# జాతీయోద్యమం - నా అనుభవాలు

**డా. కూరెళ్ల విఠలాచార్య,** స్వాతంత్ర్య సమరయోధులు

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించడానికి త్యాగం చేసిన మహానుభావుల్ని 'ఆజాదీ కా అమృత్ మహోత్సవం' లో భాగంగా నిర్వహిస్తున్న ఈ సదస్సు సందర్భంగా మనం జ్ఞాపకం చేసుకోవాలి. ఎంతోమంది త్యాగం చేస్తే దాని ఫలితంగా ఈనాడు భారతదేశం స్వాతంత్ర్యమై డెబ్బై అయిదవ వసంతంలోకి అడుగుపెడుతున్నది. ఇదంతా ఆ అమృతమూర్తుల యొక్క త్యాగం. వారిని దేవతల సరసన నిలబెట్టి స్తోత్రం చేశాను నేను రచించిన "విఠలేశ్వర శతకం" లో 1947లో మనకు పూర్తి స్వాతంత్ర్యం వచ్చినట్లుగా నేను భావించడం లేదు. ఆనాటికి హైదరాబాద్ సంస్థానం 'భారత యూనియన్' లో కలువలేదు. నిజాం రాజ్యంలో ప్రజలు ఎన్నో కష్టాలు పడ్డారు. ఒకవైపు స్వాతంత్ర ఉత్సవాలు జరుపుకుంటుంటే, మరోవైపు తెలంగాణా ప్రజలు నిజాం సైన్యం రజాకార్లచె పీడింపబడ్డారు. 17 సెప్టెంబర్ 1948 వరకు హైదరాబాద్ సంస్థాన అరాచకాలను భరించారు. పదమూడు నెలలు నరకయాతన పడ్డారు తెలంగాణా ప్రజలు.

ఎప్పుడైతే నిజాం రాజ్యం భారతదేశంలో కలిసిందో అప్పుడే నిజమైన స్వాతంత్ర్యం సిద్ధించినట్టు. తెలంగాణా విమోచనోద్యమం కూడా భారతజాతీయోద్యమంలో భాగమే. తెలంగాణా విముక్తి కోసం సాగిన పోరాటంలో ఎందరో మహానుభావులు అసువులు బాశారు. రావి నారాయణ రెడ్డి గారు రాష్ట్రానికి సంబంధించిన స్వాతంత్ర్య సమరయోధులు. వీరు 'దేశానికి సంబంధించిన, రాష్ట్రానికి సంబంధించిన స్వాతంత్ర్యోద్యమ నాయకులు అని విడివిడిగా ఉండకూడదు, అందరూ జాతీయోద్యమ యోధులే' అని భారత ప్రభుత్వానికి ఒక వినతిపత్రం సమర్పించారు.

1947 ఆగస్టు 15 న స్వామీ రామానంద తీర్థ సుల్తాన్ బజారులో జెండా ఎగురవేస్తే, అరెస్ట్ చేశారు. మొగిలయ్య అనే యోధున్ని చంపివేశారు. మరికొందరు నాయకుల్ని దేశబహిష్కరణ చేశారు. ఉక్కుమనిషి వల్లభాయ్ పటేల్ గారు లేకుంటే మిమ్మల్ని జైళ్లోనే ఉంచేవాడు. మాలాంటి ఎందరినో వెట్టిచాకిరీ నుండి కాపాడాడు. ఈయన దాదాపు 542 సంస్థానాలను భారతదేశంలో కలిపారు.

'ముసలి నక్కకు రాచరికంబు దక్కునే' అన్నారు మహాకవి దాశరథి. అలా అన్నందుకే వారిని బంధించి నిజామాబాద్ జైల్లో పెట్టారు. అక్కడే ఆయన గోడలపైన "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అని రాశారు. రజాకార్లు చేయని దుష్కృత్యాలు లేవు. స్త్రీల పుస్తెలను కూడా దోచుకొని పోయారు.

నిజాం రాజు తెలుగు మాట్లాడితే నాలిక కోస్తానన్నాడు. అందరూ ఉర్దూ మీడియంలో చదవాలి అన్నాడు. షేర్వాణీ వేసుకొని బడికి పోతే గౌరవం. మా సంప్రదాయ దోవతీ కట్టుకుంటే హీనంగా చూసేవారు. అటువంటి పరిస్థితి నుండి మిమ్మల్ని కాపాడినవాడు వల్లభాయి పటేల్. తెలుగును మాట్లాడకుండా చేసిన దుష్టమైన కాలం అది. మా తెలంగాణా ప్రజలు మరువలేని మహనీయుడు పటేల్.

1885 డిసెంబర్ 28 న జాతీయ కాంగ్రెస్ ఆవిర్భవించినప్పుడు యే సంస్థనయితే భారతదేశం నుండి వెల్లగొట్టిందో ఆ సంస్థకు ఇంగ్లీషు వాడే అధ్యక్షుడు కావడం ఆశ్చర్యకరం ఆయనే ఎ.ఓ. హ్యూమ్. కలిసి ఎన్నో ఉద్యమాలు చేసిన వారిలో విభేదాలు వచ్చి అతివాదులు, మితవాదులుగా విడిపోయారు. అతివాదులు మితవాదులను పావురాలు అంటే, మితవాదులు అతివాదులను రాబందులు అన్నారు.

బాలగంగాధర తిలక్ రాజకీయాల్లోకి వచ్చిన తరువాత అనిబిసెంట్ కృషివల్ల తిరిగి అందరూ ఒకేతాటిపైకి వచ్చారు. గాంధీగారి ప్రవేశంతో ఉద్యమ స్వరూపం మారిపోయింది. ప్రపంచ రాజకీయాల్లోనే పెనుమార్పులు తీసుకువచ్చిన మహానుభావులు గాంధీ గారు. ఎంత అహింసాత్మకమైన విప్లవమైనా స్వాతంత్ర్యోద్యమంలో రెండున్నర లక్షల మంది చనిపోయారని అధికారిక గణాంకాలు. ఇంకా ఎంతమంది చనిపోయేవారో గాంధీగారి అహింసావాదం లేకపోతే.

ఆయన విజయవాడకు వచ్చినప్పుడు మన ఆంధ్రులు ఘనమైన స్వాగతం ఇచ్చారు. పెద్ద సభ చేశారు. ఆయన స్వాతంత్ర్యోద్యమ నిధులకు మాగంటి అన్నపూర్ణమ్మ లాంటి వాళ్ళు తమ వంటి మీదున్న మొత్తం బంగారం ఇచ్చేశారు. విదేశీ వస్తు బహిష్కరణ చేశారు. “Do or Die” అంటే ‘చావో రేవో’ లాంటి వారి నినాదాలను అనుసరించారు. భారతదేశ మంతటినీ కదిలించిన జాతీయోద్యమం మనది.

రాజేంద్రప్రసాద్, జవహర్ లాల్ నెహ్రూ, బాలగంగాధర తిలక్, బిపిన్ చంద్రపాల్, లాలా లజపతిరాయ్ వంటి మహానుభావులు నిస్వార్థంగా పనిచేయడం వల్లే మనకు స్వాతంత్ర్యం సిద్ధించింది. ఉన్నవూరిని కన్న తల్లిని మర్చిపోక, దేశంపట్ల భక్తిని కలిగి ఉండండి. అదే మన అందరికి శ్రీరామ రక్ష. ❀

# టంగుటూరి ప్రకాశం పంతులు - నా జ్ఞాపకాలు

**టంగుటూరి శ్రీరామ్,** టంగుటూరి ప్రకాశం పంతులు గారి మనుమడు



ప్రకాశం పంతులు గారి యొక్క ఆశయసిద్ధికోసం మా నాన్నగారు టంగుటూరి సూర్య నారాయణ గారు స్థాపించిన 'ప్రకాశం అభివృద్ధి అధ్యయన సంస్థ' ద్వారా సమాజ సేవ చేస్తున్నాను. మా నాన్న గారు ప్రకాశం పంతులుగారి యొక్క అన్నదమ్ముల బిడ్డలలో ఒకరు. వీరి స్వగ్రామం కూడా ప్రకాశం జిల్లా లోని 'వినోదరాయునిపాలెం'. వీరి తాత ముత్తాతల కాలమంతా వల్లూరు లోనే జరిగింది.

ప్రకాశం పంతులు గారి యొక్క శతజయంతి ఉత్సవాల సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి, తెలంగాణా రీవి పి.వి.నరసింహారావు గారి సూచన మేరకు మా నాన్నగారు టంగుటూరి సూర్యనారాయణ గారు హైదరాబాద్ లో ప్రకాశం అభివృద్ధి అధ్యయన సంస్థను స్థాపించారు. వారి ఆశయ సిద్ధి కోసం వారి కలలను నెరవేర్చడానికి వారు సూచించిన మార్గంలో సమాజ సేవ చేయడానికి ప్రకాశం గారి కల గ్రామ స్వరాజ్యం, మూఢ నమ్మకాలను పారద్రోలడం, విద్యా వ్యాప్తి ఈ మూడింటి మీద ప్రకాశం గారు కలలు కన్నారు, ఆచరించారు. తనకున్న సర్వస్వాన్ని ప్రజాసేవకు, దేశ సేవకు అంకితం చేశారు.

ప్రకాశం గారి జీవిత చరిత్ర, వారు జరిపిన ఉద్యమాలు స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత కూడా ప్రకాశం గారి ఆఖరి క్షణం వరకు ప్రజా సేవను ఎలా నిర్వర్తించారో, ఎలా చేశారో, ఈతరం వారు, పాలకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అందరూ తెలుసుకోవాలి, ఆచరణలో పెట్టాలి. వారియొక్క సిద్ధాంతాలు కానీ, ఆర్థిక విధానాలు కానీ ఏనాటికైనా ఆచరణీయం.

**ప్రకాశం పంతులు గారి జీవితం :**

ప్రకాశం గారి స్వగ్రామం వినోదరాయని పాలెం అయినా వారి తాత ముత్తాతల కాలమంతా వల్లూరు లోనే జరిగినది. వల్లూరులో ప్రకాశంగారికి ఓనమాలు దిద్దించి అక్షరాభ్యాసం చేయించింది వెంకటప్పయ్య పంతులుగారు. వీరి నాన్నగారు 11 సం. వయసులో చనిపోయిన తరువాత వీరి విద్యాభ్యాసం వినోదరాయని పాలెం, అద్దంకిలలో జరిగింది. తరువాత వీరి జీవితాన్ని మార్చివేసింది ఇమ్మానేని హనుమంతరావు నాయుడు అనే ఉపాధ్యాయుడు. వీరు ప్రకాశం గారిని తనవద్దే ఉంచుకొని చదివించారు. బదిలీ పై రాజమండ్రి వెళ్ళినప్పుడు ఆయన తల్లిని ఒప్పించి తనతో పాటు ప్రకాశం గారెని రాజమండ్రి తీసుకెళ్ళి చదివించారు. వీరే ప్రకాశం గారికి సర్వస్వం అయ్యారు.

ప్రకాశం గారు చిన్నతనంలో కటిక బీదరికాన్ని అనుభవించారు. మూడు రూపాయల పాఠశాల ఫీజు కూడ చెల్లించలేని పరిస్థితి వారిది. అప్పట్లో వారి తల్లి సుబ్బమ్మ గారు హెూటల్ ఒంగోలు కోర్ట్ ముందు నడిపేవారు. ఆరోజుల్లో అది గౌరవప్రదంగా భావించేవారు కాదు. కుమారుని ఉన్నత చదువులు చదివించాలనే పట్టుదలతో ఉండేవారు. తన పట్టుచీరను తాకట్టు పెట్టి ప్రకాశం గారి పాఠశాల పీజు కట్టారు. ప్రకాశం గారి తల్లి సుబ్బమ్మ గారు ఎంతో ఆత్మాభిమానంతో, గుండెనిబ్బరంతో, ధైర్యసాహసాలతో

ఉండేవారు. ఈ లక్షణాలని ప్రకాశంగారు తన తల్లి నుండి పుణికిపుచ్చుకున్నారు. ఆవిడని తన అన్నదమ్ములు చూసుకుంటామని చెప్పినా గానీ ఒప్పుకోలేదు.

ఒంగోలులో వీరి ఇల్లు మునసబు కోర్ట్ ముందు ఉండేది. అక్కడి లాయర్లు లాంగ్ కోటు చేతిపై వేసుకొని ఠీవీగా నడుస్తూ ఉన్న దృశ్యం వారిని ఆకర్షించింది. తానూ లాయర్ అవ్వాలని సంకల్పించుకున్నారు. ఆ ఆశయ సిద్ధికోసం పట్టుదలతో శ్రద్ధగా చదివేవారు. లక్ష్యాన్ని సాధించారు. లండన్ వెళ్ళి బారిష్టర్ చదివి, ఆంధ్రప్రదేశ్ కు తిరిగి వచ్చి, మొట్ట మొదటి సారిగా రాజమండ్రి లో ప్రాక్టీస్ మొదలుపెట్టారు. విజయవాడ, ఒంగోలు లలో కూడా వాదిస్తూ తన ప్రాక్టీస్ ను విస్తరించుకుంటూ చెన్నై లో తన ప్రాక్టీస్ అక్కడివారికి ధీటుగా మొదలుపెట్టారు. క్రిమినల్ లాయర్ గా ప్రసిద్ధి పొందారు. 1907 నుండి 1921 వరకు అలుపెరుగని కృషి చేసి అపరిమితమైన ఆస్తిని సంపాదించారు. కలకత్తా, ఊటీ, మద్రాసు, రాజమండ్రి, ఒంగోలులలో అనేక మైన భవనాలు, తోటలు, స్థిరాస్తులు, బాంక్ బాలెన్సులు సంపాదించారు. లాయర్ గా తాను సంపాదించిన లక్షలు, కోట్ల ధనాన్ని ప్రజాసేవకే ఉపయోగించారు.

నాటకాల ప్రదర్శనలో ప్రకాశం గారు దిట్ట. 'స్టార్ ఆఫ్ ది స్టేట్' అనే బిరుదు వీరి ప్రతిభా పాటవాలకు నిదర్శనం. ఉషా పరిణయం, ప్రమీలా పరిణయం వంటి నాటకాలలో స్త్రీ పాత్రలు వేశారు. జాతీయోద్యమ నేపథ్యంతో చిలకమర్తి లక్ష్మీ నరసింహం గారు రాసిన నాటకాలలో వేషాలు వేసేవారు.

ప్రకాశం గారు ఏ పని చేసినా ఆత్మవిశ్వాసంతో, పట్టుదలతోటి, తెగింపు, ధైర్యసాహసాలతోటి చేసేవారు ప్రకాశం గారు కోర్ట్ లో వాదించేటప్పుడు ఆ రోజుల్లో బ్రిటిష్ జడ్జ్ లకు ఒక అపసవ్యమైన గుణం ఉండేది. అడ్వకేట్స్ వాదించేటప్పుడు వారికి నచ్చకపోతే వారిని హేళనగా, తక్కువ చేసి మాట్లాడేవారు. ఒకసారి ప్రకాశం గారు వాదించేటప్పుడు బ్రిటిష్ వాడైన ఆ జడ్జ్ ఏంటి నువ్వేమి వాదిస్తున్నావు, నువ్వు చెప్పేది నాకు అర్థం కావడం లేదు అంటే, నిజమే జడ్జ్ గారు మీ రెండు చెవులమధ్య ఏమైనా ఉంటే కదా తెలవడానికి అంటారు. ఆ రోజుల్లో జడ్జ్ ఎదిరించే ధైర్యం ఆయనకే స్వంతం. ప్రకాశం గారు కోర్ట్ కు వస్తున్నారు అంటే, జడ్జ్ లు అలర్ట్ అయ్యేవారు. 'లా టైమ్స్' పత్రికను కొని దానికి వారే సంపాదకత్వం వహించారు. వారి ధైర్య సాహసాలకు, ప్రతిభా పాటవాలకు, 'ప్రిన్స్ ఆఫ్ మద్రాస్' అనే బిరుదును బహూకరించారు.

ప్రకాశం గారికి ఇద్దరు తమ్ముళ్లు ఒకరు జానకి రామయ్య గారు మరొకరు శ్రీరాములు గారు వీరిద్దరూ సమాజ సేవలోనే ఉన్నారు. ప్రకాశం గారి తమ్ముడు శ్రీరాములు గారు రాజకీయ కారణాల వల్ల కందుకూరి వీరేశలింగం గారిని విమర్శించారు. ఆయన భారతి అనే ఒక పత్రిక నడుపుతుండేవారు. అది చూసి కందుకూరి గారు శ్రీరాములు గారి పైన కేసు వేశారు. ఆ సమయంలో ప్రకాశం గారు లండన్ లో ఉన్నారు. ఈ విషయం తెలిసి ఆయన లండన్ నుండి రాజమండ్రి వచ్చారు. తమ్ముణ్ణి ఎలాగైనా గెలిపించాలని ఇరవై ఏళ్ల క్రితం వచ్చిన తీర్పును వెలికి తీసి ఆ కేసును గెలిచారు. అదీ ఆయన పట్టుదల.

లండన్ లో బారిష్టర్ చదివేటప్పుడు ప్రతీరోజు ఒక విద్యార్థి సాయంత్రం సమావేశంలో సిగార్ కాల్చుతూ ఉపన్యసించాలి, తల్లికిచ్చిన మాట ప్రకారం నేను సిగార్ కాల్చను, ఉపన్యసించను అంటూ సమావేశాన్నే వదిలి వెళ్ళిన సాహసి ప్రకాశం గారు. ఆయన చదువు పై చూపిన శ్రద్ధకు స్కాలర్ షిప్ కూడా పొందారు.

**రాజకీయ జీవితం :**

ప్రకాశం గారి గురించి రాస్తూ వి.వి. గిరి గారు ఆంధ్రదేశపు యాభైయేళ్ల చరిత్ర చెప్పాలి అంటే ప్రకాశం గారి జీవితమే దానికి ఉదాహరణ అన్నారు. జాతీయోద్యమంలో భాగమైన సహాయ నిరాకరణ, 'సైమన్ గో బ్యాక్', వ్యక్తి సత్యాగ్రహం, ఉప్పు సత్యాగ్రహం, 'క్విట్ ఇండియా', చీరాల పేరాల లాంటి ఉద్యమాలలో తానే తానై తన స్వంత ఖర్చు తో ఉద్యమాలు నడిపారు.

1921 లో చెన్నై రాష్ట్రం లో ఒక జాతీయ సభ ఏర్పాటు చేశారు. అప్పుడు బ్రిటిష్ ప్రభుత్వం ఇక్కడ సభ నిర్వహిస్తే అరెస్ట్

చేస్తామన్నారు. అప్పుడు ఆ సభకు శ్రీనివాస అయ్యంగార్ అధ్యక్షత వహించవలసి ఉంది. వారు వెనుతిరగడంతో ప్రకాశం గారు ముందుకు వచ్చి ఆ సభకు అధ్యక్షత వహించారు. దాంతో బ్రిటిష్ వారి దృష్టి ప్రకాశం గారి పై పడింది.

ఆరోజుల్లో హిందూ పేపర్ తప్ప ఏ పేపర్లు లేవు, అదికూడా బ్రిటిష్ ప్రభుత్వాన్ని పెద్దగా ఎదిరించేది కాదు. అంత పెద్ద సభ దాదాపు పదివేల మందితో జరిగితే ఆ విషయం పేపర్లలో రాకపోవడంతో తానే ఒక పత్రిక నడపాలని అనుకున్నారు. అదే స్వరాజ్య పత్రిక. ప్రాణాలకు తెగించి సర్వం త్యజయించి పోరాడిన భరతమాత ముద్దుబిడ్డ ప్రకాశంగారు. ❀

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 13 హైదరాబాద్ డిసెంబరు - 2022



# పింగళి వెంకయ్య గారు - జ్ఞాపకాలు

**డా. జి.వి.యల్. నరసింహం**, పింగళి వెంకయ్య గారి మనుమడు,
విశ్రాంత ప్రాంతీయ సంచాలకులు, గుంటూరు.

పింగళి వెంకయ్య గారితో 17 సంవత్సరాల ప్రత్యక్ష పరిచయం ఉంది. వారితో నా మధురస్మృతులకు, మా అమ్మ గారు అంటే పింగళి వెంకయ్య గారి ఏకైక కుమార్తె శ్రీమతి మహాలక్ష్మీ గారు చెప్పిన విషయాలను జోడించి, పింగళి వెంకయ్యగారు వ్రాసిన డైరీలను ఆధారం చేసుకొని వారి జీవిత చరిత్రను రచించాను కాబట్టి ఇది సమగ్రమైనది.

త్రివర్ణ పతాక నిర్మాతగానే కాక పింగళి వెంకయ్యగారు బహుముఖ ప్రజ్ఞాశాలి. పెద్ద చదువులు చదవడం, దేశ ఆర్థికాభివృద్ధికి పనికి వచ్చే పరిశోధన చేయడం ఆయన ధ్యేయం. అమ్మమ్మ తాతయ్యల వద్ద పెరిగిన పింగళి వెంకయ్య గారిని ప్రేమతో వారి తాతగారు పై చదువులకు వేరే ఊరు పంపలేకపోయారు. వెంకయ్యగారు చదువు మీది మక్కువతో ఇంట్లోంచి పారిపోయి బందరు వెళ్ళి చదువుకున్నారు.

వెంకయ్యగారి తండ్రి హనుమంతరావు గారు. యార్లగడ్డ కరణంగా చేశారు. అయినా కానీ చదువుకోసం తల్లిదండ్రుల మీద ఆధారపడకూడదని వెంకయ్యగారు సైన్యంలో చేరి కొద్దిరోజులు పనిచేశారు. తరువాత కూడా చిన్న చిన్న ఉద్యోగాలు చేసి సంపాదించుకొని కష్టపడి చదువుకున్నారు. శ్రీలంక వెళ్ళి అక్కడ 'సీనియర్ కేంబ్రిడ్జ్ ఎక్సామ్' లో ఉత్తీర్ణులయ్యారు.

దక్షిణాఫ్రికాలో జరిగిన 'బోయర్ యుద్ధం' లో ఒక సైనికునిగా మా తాతగారు పింగళి వెంకయ్యగారు పాల్గొన్నారు. అక్కడే ఉన్న గాంధీ గారు ఆ యుద్ధంలో గాయపడిన సైనికులకు 'రెడ్ క్రాస్' ద్వారా సహాయం చేశారు. అప్పుడే గాంధీ గారితో వెంకయ్య గారికి పరిచయం కలిగింది. 1899 నుండి 1904 వరకు నాలుగేళ్ల పాటు 'బోయర్ యుద్ధం' జరిగింది. 'బోయర్ యుద్ధం'లో పాల్గొన్నారు కాబట్టి వీరిని 'సిపాయి వెంకయ్య' అనికూడా అంటారు.

జాతీయోద్యమ కాలంలో ఉత్తర భారతంలో ఉన్నప్పుడు భాషా సమస్య వచ్చింది. అక్కడి ప్రసంగాలకు తెలుగు సరిపోదు కనుక చాలా భారతీయ భాషలు నేర్చుకున్నారు. భగవద్గీత చదవడం కోసం సంస్కృతం నేర్చుకున్నారు. జపాన్ వాళ్ళు స్వాతంత్ర్యం ఎలా పొందారో తెలుసుకోవటం కోసం జపనీస్ భాష నేర్చుకున్నారు. అందుకే వీరిని 'జపాన్ వెంకయ్య' గారు అనికూడా అంటారు.

విషయ పరిజ్ఞానం వల్ల పెద్ద ఉపయోగం లేదు, భావ వ్యక్తీకరణకు భాషా పరిజ్ఞానం అవసరమని చెప్పేవారు. అందుకే అన్ని భాషలు నేర్చుకున్నారు. ఎవర్నీ ఏదీ ఆశించకూడదు, ఉన్నదానితో తృప్తి పడాలి ఏపనైనా ఫలితం ఆశించకుండా బాధ్యతగా చేయాలి అనేది ఆయన సిద్ధాంతం. దానిని జీవితాంతం ఆచరించి చూపారు.

రోజు గడవని పరిస్థితుల్లో కూడా తన విలువలకే కట్టుబడి ఉన్నారు. గాంధీగారి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరం జరుగుతున్న రోజుల్లో 1906 లో దాదాబాయి నౌరోజీ నాయకత్వంలో 22 వ కాంగ్రెస్ మహాసభకు కలకత్తా వెళ్లారు. ఆ సభలో

ఆంగ్లేయుల జెండా ఎగురవేసి ఆంగ్లేయుల జాతీయ గీతం పాడి సభను ప్రారంభించడం వీరిని చాలా బాధించింది. ఆ బాధ నుండే భారత జాతికి ప్రతీకగా జాతీయ పతాక రూపకల్పన జరిగింది. మన జెండా రూపొందించడానికి, అన్ని దేశాల జెండాల గురించి పరిశోధన చేసి "The National Flag for India" అనే పుస్తకం రాశారు. వీరు రూపొందించిన జాతీయ జెండా అప్పటి పెద్దల మన్ననలు అందుకొని నేటికీ భారతదేశ ఔన్నత్యాన్ని చాటుతుంది.

విజయవాడ లోని గాంధీ నగర్లో జరిగిన కాంగ్రెస్ సమావేశాలకు విచ్చేసిన గాంధీగారు 'జెండా రూపకల్పన' బాధ్యతను వెంకయ్య గారికి అప్పగించడం జరిగినది. వెంకయ్య గారు బహుభాషా కోవిదుడు, అనర్గళంగా ఏ భాషలోనైనా మాట్లాడగలరు. పింగళి వెంకయ్యగారి రాజకీయ గురువు బాలగంగాధర తిలక్ ఆయన చనిపోవడం తో వీరు రాజకీయాల నుండి వైదొలిగారు.

అయితే ఆయన ధ్యేయం కేవలం జాతీయ జెండా రూపకల్పన కాదు, పరిశోధన మాత్రమే. మునగాల సంస్థానంలో పనిచేసినప్పుడు, ఆంధ్ర జాతీయ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేసినప్పుడు కూడా అదే ధ్యేయంగా పనిచేశారు. మునగాల రాజా ప్రోత్సాహంతో వారు ఇచ్చిన క్షేత్రంలో పత్తిపై పరిశోధన చేసి అమెరికా నుండి పత్తి గింజల్ని దిగుమతి చేసుకొని సంకరీకరణం చెందించి 'కాంబోడియా' పత్తిని సృష్టించారు. అప్పుడు వీరిని 'పత్తి వెంకయ్య' అని పిలిచారు. ఈ పత్తిని కనుక్కోవడం ద్వారా విదేశీ వస్త్ర బహిష్కరణకు పునాది వేశారని చెప్పవచ్చు.

ఆర్థిక పరిపుష్టికి దోహదం చేసే విధంగా మైనింగ్, డైమండ్స్, ఖనిజాలమీద పరిశోధన చేయాలనే తపనతో మద్రాసు వెళ్ళి 'ప్రెసిడెన్సీ' కళాశాలలో 'జియాలజీ & మినరల్స్' మీద డిప్లొమా తీసుకున్నారు. తరువాత నెల్లూరు చుట్టుపక్కల మైకా గనులున్నవని చెప్పింది వీరే. 'డైమండ్స్' ఎలా ఏర్పడతాయి అనే విషయంపై రాసిన పరిశోధనా పత్రాలు ప్రపంచ జియోలాజిస్ట్ లందరినీ అబ్బురపరిచాయి. వజ్రాలు బొగ్గు నుండి ఏర్పడతాయి అనేది అప్పటి వరకు ఉన్న నమ్మకం. వీరి పరిశోధనలో అవి అన్నీ ప్రదేశాలలో ఇవి బొగ్గు నుండి ఏర్పడవని, "పేరెంట్ రాక్" నుండి ఏర్పడతాయి అని చెప్పారు. వీరి ఈ పరిశోధనా వ్యాసం లండన్ కి చెందిన 'జియోలోజికల్ సొసైటీ' వారి మన్ననలను పొందింది. వీరికి "బహుముఖ ప్రజ్ఞాశాలి" అనే మాట సరిగ్గా సరిపోతుంది. ఆయన జీవితం యువతకు మార్గదర్శకం.

గాంధీ గారికి జాతీయ పతాక రూపకల్పన చేసి ఇచ్చిన1921 మార్చ్ 31 మరుసటి సంవత్సరమే అంటే 1922 లో మా అమ్మగారు జన్మించారు. మా తాతగారు, అమ్మమ్మగారు విజయవాడ లోని 'చిట్టి నగర్' లోని ఒక పూరి గుడిసెలో నివసించారు. అటువంటి స్థితి లో కూడా ఆయన ఎవరినుండి ఏమీ ఆశించలేదు. దేశానికి చేసిన సేవలు కానీ, గొప్ప పనులు కానీ ఎవరికీ చెప్పుకునేవారు కాదు. తనకు పేరు రావాలి అనీకాని, కీర్తి ప్రతిష్టలు గడించాలనే కోరికలు కానీ ఆయనకు లేవు. కాబట్టే, ఆయన గురించి పెద్దగా ఎవరికీ తెలియదు.

ఆజాదీ కా అమృత మహోత్సవం కార్యక్రమము ద్వారా ఆనాడు దేశ సేవ చేసిన మహానుభావులను గురించి ఈనాడు మనం మాట్లాడగలుగుతున్నాము. నేటి తరానికి వారి ఆత్మ త్యాగాలను గురించి చెప్పగలుగుతున్నాము.

ఈ ఆజాదీకా అమృత మహోత్సవం ద్వారా స్వాతంత్ర్యం సంపాదించడానికి ఎంతమంది ఎన్ని కష్టాలు పడ్డారో, ఎన్ని త్యాగాలు చేశారో తెలుసుకోవడం జరుగుతుంది. 'నూట ముప్పై కోట్ల' మంది ఆత్మ గౌరవానికి ప్రతీక మన జాతీయ జెండా. మనం మన జాతీయ జెండాను గౌరవించడం అంటే మనలను మనం గౌరవించుకోవడమే. ❁

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 13 హైదరాబాద్ డిసెంబరు - 2022

# జాతీయోద్యమం-గేయం

**డా. తోటకూర ప్రసాద్,** తానా అధ్యక్షులు (మాజీ)
ప్రపంచ తెలుగు సాహిత్య వేదిక నిర్వాహకులు, అమెరికా



స్వాతంత్ర్యం అనగానే మనం ముందుగా గుర్తు తెచ్చుకోవలసిన మహనీయుడు మన జాతీయ ఝండా రూపకర్త అయిన పింగళి వెంకయ్యగారు. ప్రత్యేకంగా ఆయన మనతెలుగువాడు. నిరాడంబరుడు. వెంకయ్యగారు సైన్యంలో చేరారు. పొంతన లేని రంగాల్లో పరిశోధనలు చేసి పత్తి వెంకయ్య, వజ్రాల వెంకయ్య, జపాన్ వెంకయ్య అని ప్రసిద్ధిపొందారు. మనందరి ప్రతీక మన జాతీయఝుండా.

జాతీయోద్యమంలో ఎందరో అసువులుబాశారు. వారందరినీ ఈ సందర్భంగా మరోసారి స్మరించుకుందాం. యుద్ధం చెయ్యకుండా ప్రజలను యుద్ధోన్ముఖులుగా చేయుటకు పాటుపడిన కలం యోధులుగా ఉన్న సాహితీవేత్తలు ఎందరో ఉన్నారు. ఎన్నో నిర్బంధాల మధ్య కూడా వారు తమ కవన పోరాటాన్ని కొనసాగించారు. అయితే ఇందరి త్యాగఫలమైన స్వాతంత్రాన్ని మనం అనుభవిస్తున్నామా? నిజమైన ప్రజాస్వామ్యం అనులు లో ఉందా? ఒకసారి ఆలోచిద్దాం.

అనేక అన్యాయాలు మన కళ్ళముందు జరుగతున్నా మన నోరు పెగలడం లేదు. మన సంస్కృతి పట్ల, భాష పట్ల గౌరవం లేదు. నిరాశా, నిర్లిప్తత ఉన్న తెలుగు జాతి లాంటి జాతి భారతదేశంలో ఎక్కడా కనిపించదు. ఒకప్పుడు ఎవరికైనా ఆపదవస్తే అందరూ ఏకతాటిపై నిలిచి పోరాడేవారు. మరిప్పుడు ఎంతో పోరాటం చేసి భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు ఏర్పారు చేసిన ఆంధ్రాబ్యాంక్ పోతే ఎవరు పట్టించుకోలేదు. ఎన్నో త్యాగాలు, ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొని మహానుభావులు మనకు స్వాతంత్ర్యం తెచ్చిపెడితే ఈనాడు మనం మరో విధమైన దాస్యంలో బతుకుతున్నా మనిపిస్తుంది.

భాషపట్ల గౌరవం లేదు. జాతి పట్ల సరైన అవగాహన లేదు. ఇలాంటి యువతవల్ల దేశం ఎటు పోతుందో? ఇది అందరం ఆలోచించవలసిన విషయం. పనిలేకుండా సోమరుల్లా ప్రజలను తయారుచేసే రాజకీయ వ్యవస్థ ఉన్నంతకాలం ఈ దేశానికి రక్షణ లేదు. ప్రభుత్వాలు వస్తుంటాయి పోతుంటాయి, కానీ కష్టం వచ్చినప్పుడు ఒకరికొకరు చేయూతనిచ్చుకున్నది గొప్ప సమాజం. కానీ ప్రస్తుతం కుల, మత, వర్గ, భాషా భేదాలు పెరిగిపోతున్నాయి. అందరూ ఒకేబాటలో నడిచినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం.

స్వాతంత్ర్య సమర స్ఫూర్తిని రగిలించిన సాహితీ మూర్తులను తప్పని సరిగా మనం తెలుసుకోవడం తప్పనిసరి. జాతీయ పతాకం గురించి బసవరాజు అప్పారావు గారు రాసిన గేయం– "పతాకోత్సవం చేయండి స్వాతంత్ర్య భారత చిహ్నం ..... అంటూ జెండా గొప్పతనాన్ని తెలియజేశారు జాస్తి వెంకట నరసయ్య గారు బోసువీరుడు అనే గేయంలో– "మూడు రంగుల జెండా ముచ్చట గొలుప......" అంటూ రాశారు.

విదేశీ వస్త్ర బహిష్కరణ, స్వదేశి వస్త్రధారణ, రాట్నం వడకడం, ధరించడం అనే గాంధీ గారి ఉపదేశంతో ప్రేరేపితులై నెల్లూరు వెంకట్రామానాయుడు గారు– "కట్టకుమా సీమ బట్ట పెట్టకుమా వాని పొట్ట, కట్టగట్టి కడకు దేశమున కీగతి తెచ్చితివి......" అంటూ దేశీయ ఖద్దరు మాత్రమే కట్టమని చెప్పారు.

బసవరాజు అప్పారావుగారు ఇదే విదేశీ వస్త్ర బహిష్కరణ గురించి–

**"సిగ్గులేదా నీకు శరములేదా అన్నమైనా లేక బీదలల్లాడుతుంటేను**
**సీతాకోకా చిలుక లాగా సీమగుడ్డ కట్టి తిరుగసిగ్గులేదా నీకు**
**పూటకూడూలేని ప్రజలకు రాట్న మొకటి పెన్నిధానమటంచు**
**పవిత్రమైన రాట్నం ఖద్దరు లెక్కింపనీకు సిగ్గులేదా!**
**అంగడియన్ని ఉంటే అల్లుడి నోట శని ఉన్నట్లు**
**భాగ్యరేఖ భరత భూమి పరదేశీ సరుకు లేలా**
**సిగ్గులేదా నీకు శరము లేదా!"**

అంటూ ఆదేచనను వ్యక్తం చేశారు.

ఇక గుంటూరు వాసి జంద్యాల పాపయ్యశాస్త్రి గారు–

"అడుగు పెట్టిన చాలు అవనీంద్ర రత్న రజిత కిరీటము లారతు లొసుగు ....." అంటూ మహాత్మా గాంధీని స్తుతించారు.

కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరిగారు. "వీర గంధము తెచ్చినారము వీరు దెవ్వడో తెల్పండి పూసిపోదుము మెడను వేతుము పూలదండ భక్తితో......." అంటూ అద్భుత గీతాన్ని రాశారు.

మోములూరు నాగభూషణం గారు భారతశంఖారావం అనే గేయంలో– "భారత సోదరా పరుగిడి రారా, వీరుడివై స్వరాజ్య పాప్తికి వీరకంకణం దాల్చుదామురా......" అంటూ స్వాతంత్ర్య శంఖారావాన్ని పూరించారు.

పైడిపాటి సుబ్బరామ శాస్త్రిగారు– "ఎత్తండీ దివిటీలు, వత్తండీ శంఖాలు, కొలువు తీర్చి దేశమాత కొలువు తీర్చెను......." అంటూ రాశారు.

మల్లాది చంద్రశేఖర శాస్త్రిగారు జయభేరి మోగింది అనే గేయంలో–

**"జయభేరి మోగింది జనులార లేవండి**
**జయము పొందెడి దాక శాంతము లేదండీ**
**జంకు గొంకు లేక చెంగు చెంగు చెంగున రండి**
**దేశ సేవను జేయ ధీరులై నిలవండి.**
**కాంగ్రెసు రథ మిదె కదిలేను చూడండి.**
**శక్తి వంచన లేక సాయముచేయండి**
**కాంగ్రెస్ పరువును కాపాడండి**
**కాంగ్రెస్ బావుటా కదలక నిలపండి**
**భారత జాతీయ గౌరవం నిలపండి**
**ఆశ పెట్టు వారి కమ్ముడు పోకండి.**
**కాసు బేరానికి కక్కుర్తి పడకండి**
**బానిసత్వం బాపు బాసలు చేయండి**
**మానవ సేవయే మదిలో దలచండి**
**ప్రాణాలు మానాలు బలియిచ్చి రారండి"** అంటూ వ్రాశారు.

రామరాజు పుండరీకాక్షుడు గారు

**"కదిలింది కదిలింది కాంగ్రెసు రథమండి**
**చెయ్యెత్తి ఒకసారి జోహారనండి**
**దేశసేవకు మీరు ధీరులై నడవండి**
**దేశ స్వాతంత్ర్యాన్ని తెస్తామనండి**
**దాసోహమని గాంధీ దారిన నడవండి**
**వాసిగ భారత బతుకునే నిలపండి**
**ప్రభుత్వ సంస్థలన్నీ పడగొట్టి సాగండి.**
**శుభమని స్వరాజ్య సోపాన మెక్కండి"** అంటూ వ్రాసారు.

ఈ విధంగా అనేకమంది సాహితీమూర్తులు మన స్వాతంత్ర్య సమరంలో పాల్గొని వారికున్న ఉద్యోగాలను, ఆస్తిపాస్తుల్ని అన్నింటినీ త్యాగం చేసి త్యాగమూర్తుల్లా నిలవబట్టే మనకు స్వాతంత్ర్యం లభించింది. అలాంటి స్వాతంత్ర్యాన్ని మనం ఇప్పుడు నిజంగా అనుభవిస్తున్నామా ? అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే నేడు అమలవుతుందా? రాజకీయనాయకులు తమ స్వార్థం కోసం ఆ రాజ్యాంగాన్ని తూట్లు పొడుస్తుంటే, ప్రజల్లో చైతన్యం ఏది ? ప్రశ్నించే గొంతుకలేవీ ? కేవలం తమ ఉనికి కాపాడుకోవాలనే స్వార్థంతో మనకెందుకులే అనే భావన వచ్చినప్పుడు అది జాతి క్షమించరాని నేరమవుతుంది.

అనవసరంగా మాట్లాడటం, అవసరమైనప్పుడు మౌనం దాల్చడం అనేవి భారతదేశాన్ని పట్టిపీడిస్తున్న పెద్ద సమస్యలు. మేధావుల మౌనం జాతి ప్రగతికి అవరోధం. ఇప్పటికైనా మేల్కొని మన భాష పట్ల గౌరవం పెంచుకుందాం. మన ఇంటి నుండే తెలుగును ప్రారంభిద్దాం. కేవలం పాఠ్య ప్రణాళిక మీదనే దృష్టి పెట్టకుండా గొప్పగొప్పవారు నడయాడిన నేలమీద పుట్టి వారి చరిత్రను తరువాతి తరాలకు తెలుపవలసిన బాధ్యత మన అందరి మీదా ఉంది. ❀

# జాతీయోద్యమం - నిషేధ గేయాలు

**ఆచార్య ఎన్. వి. కృష్ణారావు,** తెలుగు శాఖ అధ్యక్షులు,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయము



జాతీయోద్యమం భారతదేశ చరిత్రలో ఓ మరచిపోలేని, మరచిపోరాని మహోజ్వల ఘట్టం. ఆ ఘట్టం ఫలితమే స్వేచ్ఛ, స్వరాజ్యం, శ్రేయస్సు. వ్యక్తి శ్రేయస్సు, సమాజ శ్రేయస్సు. వ్యక్తి స్వేచ్ఛగా ఉంటే అతని మనోవికాసం అంబరాలను తాకుతుంది అద్భుతమైన ఆలోచనలు అంకురిస్తాయి. మరెన్నో అద్భుతాలు ఆవిష్కరించడానికి అవకాశం ఏర్పడుతుంది. సంఘోన్నతికి, సంఘోద్ధరణకు తనవంతు కృషిచేసి జన్మ సార్థకం చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. వ్యక్తి బానిసైతే వ్యవస్థ ఉనికిని కోల్పోతుంది. ప్రపంచం క్రియా శూన్యం అవుతుంది. బానిస బ్రతుకు బ్రతకడం అంటే వ్యక్తి వ్యక్తిత్వం తాకట్టు పెట్టడమే. జీవితం తన చేతుల్లో లేకపోవడమే. స్వేచ్ఛా జీవి విశ్వాన్ని సాధిస్తాడు. స్వేచ్ఛ లేని బానిస బ్రతుకు బ్రతకడం కంటే మరణించడం సుఖం. అయితే అది అవాంఛనీయం. ప్రకృతికి విరుద్ధం. మనిషి మరణించడం దేనికి చిహ్నం వెలుగుకా? చీకటికా? వికాసానికా? విలాసానికా? మరణం, మరణించటం ప్రకృతి గుణాలైతే, చంపటం, చంపించడం, చంపించబడటం మూర్ఖత్వం అహంకారం అధికార దర్పం మొదలైన అవలక్షణాలతో కూడిన అనాలోచితమైన మానవ నైజాలు. వ్యక్తి మరణిస్తే సమాజం స్మశానమవుతుంది. ప్రపంచ శూన్యం అవుతుంది. పదిమంది కూడితే సమాజం. పదిమంది పనులు చేస్తే ప్రగతి. పదిమంది శ్వాసించి నిలబడితే ప్రపంచం. తను పీల్చే గాలిని స్వేచ్ఛగా శ్వాసించగలిగితే అతడు స్వేచ్ఛ జీవి. లేకుంటే నికృష్ట బానిస. ప్రాచీన కాలం నుండి సామాజిక జీవనంలో కొన్ని ఆటుపోట్లు ఎదురైనా స్వేచ్ఛగానే జీవిస్తూనే వచ్చారు భారతీయులు. మొఘలుల కాలంలోనూ కొంత స్వేచ్ఛగానే జీవించారు. ఆంగ్లేయుల పాలన ప్రారంభమైన నాటినుండి భారతీయులు స్వేచ్ఛగా శ్వాసించలేకపోయారు. స్వతంత్రంగా జీవించలేకపోయారు. తాము పుట్టిన నేల, పెరిగిన ఊరు, పీల్చిన గాలి, తాగిన నీరు ఇలా తమ సొంతం అనుకున్నదే జీవితం కాకుండా పోయింది. పోతూ ఉంది. అటువంటి హీన దీన పరిస్థితుల్లో కొందరు మహాత్ములు, మేధావులు, పరోపకారులు, దేశభక్తి పరులు సంఘంలో ఉద్భవించారు. వందల సంవత్సరాల బానిసత్వపు సంకెళ్లు తెంచుకొని స్వేచ్ఛ వాయువులు పీల్చటానికి, స్వతంత్రగమనం సాగించడానికి, స్వరాజ్య పీఠం సాధించడానికి, తమ రక్తపు బొట్లను మెట్లుగా చేశారు. తమ వాక్కులను వాడి బాణాలుగా ప్రయోగించారు. తమ కళలను కత్తులుగా పైకెత్తారు. తమ ఆవేశాన్ని అగ్నిపర్వతం చేశారు. పోరాటం సాగించారు. మరణిస్తూ మానవత్వపు శంఖాన్ని పూరించారు. మరణించి మృత్యుంజయులయ్యారు. ప్రజలను అనేక రకాలుగా చైతన్యవంతం చేసి మార్గదర్శకత్వం వహించారు. ఆదర్శ ప్రాయులయ్యారు. అటువంటి వీర దేశభక్తుల ప్రతి చర్య బ్రిటిష్ ప్రభుత్వానికి పక్కలో బల్లెమైంది. కంటిలో నలుసైంది. కాలిలో ముల్లయింది. చెప్పులో రాయయింది. ఉపేక్షిస్తే మెడకు ఉరిత్రాడు అవుతుందని భావించింది. భయపడింది. తమను తమ అధికారాన్ని ఎవరు ఏ రూపంలో వ్యతిరేకించినా కఠినాతి కఠినంగా శిక్షించాలని దీక్షబూనింది. కక్ష పెంచుకుంది. ఆ పరంపరలో తెలుగుదేశంలో దేశభక్తి ప్రేరితమైన, బోధకమైన ఎన్నో సాహిత్య ప్రక్రియలు బయటకు దూసుకుని వచ్చాయి. వాటన్నిటిలో ప్రజలను అత్యంత చైతన్యవంతంగా చేసినటువంటి తెలుగు సాహితీ ప్రక్రియ గేయం.

జాతీయోద్యమ సమయంలో తమ గేయాల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేసిన ఎందరో గేయకర్తలు, గాయకులు ఉన్నారు. వారిలో అత్యంత ప్రజాదరణ పొందిన గీత రచయిత గాయకుడు గొప్ప దేశభక్తుడు గరిమెళ్ళ సత్యనారాయణ. వారు రాసి పాడిన ప్రతి పాట పదునైన బల్లెంలా బ్రిటిష్ ప్రభుత్వం గుండెల్లో గుచ్చుకుంది "మాకొద్దీ తెల్ల దొరతనము" గరిమెళ్ళ రాసిన ఈ గేయంలో కొద్ది భాగం

పల్లవి. మాకొద్దీ తెల్ల దొరతనము దేవామాకొద్దీ తెల్ల దొర తనము
మా ప్రాణాలపై పొంచి మానాలు హరించే మాకొద్దీ తెల్ల దొరతనము
చరణాలు. పన్నెండు దేశాలు పండుచున్నా గాని పట్టెడన్నమే లోపమండి
ఉప్పు ముట్టుకుంటే దోషమండి నోట మట్టి కొట్టి పోతాడండీ
అయ్యో కుక్కలతో పోరాడి కూడు తింటామండీ ॥ మాకొద్దీ ॥
ఏడాదికేడాదీకెక్కువ శిస్తేసి ఈ భూమి నాదే నన్నాడు
మమ్ము కూలికి దున్నమన్నాడు కడుపు మంటతో చావమన్నాడు
అయ్యో బానిసలకు వాడు ప్రభువౌతానన్నాడు ॥ మాకొద్దీ ॥
ఈ గేయం ప్రజలను ఉగ్రూతలూగిస్తూ ప్రభుత్వాన్ని భయకంపితం చేసింది.
గరిమెళ్ళ రాసిన "సైతాను ప్రభుత" గేయం కూడా ప్రభుత్వాన్ని వణికించింది.
పల్లవి. దండాలండోయ్ మేముండలేమండోయి బాబు
ఈ సైతాను ప్రభుతనింకా సాగనీయకండోయిబాబు
చరణాలు వర్తకానికంటూ ఇంట్లో పాదమెట్టినాడు బాబు
పాదం పెట్టి దొంగతనం ప్రారంభించాడండి బాబు
పాల కడలి వంటి రాజ్యం బద్దలైందండి బాబు
కూలి చేసుకున్న పొట్టకు కూడు లేదండోయి బాబు ॥ దండాలండోయ్ ॥
ఉప్పు పన్ను పప్పు పన్ను ఊరికి వెళితే పన్ను బాబు
కొప్పు కాస్త దేవుడికి మొక్కుకుంటే పన్ను బాబు ॥ దండాలండోయ్ ॥

ఈ గేయం ఎంతో వ్యంగ్యంగా బ్రిటిష్ వారు చేసే దురాగతాలను ఎండగట్టింది.

ప్రజాదరణ పొందిన మరో గేయం "రామదండు పాట" దీనిని ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య రాశారు. ఇది 1922లో వెలువడింది. ఇందులో గాంధీ ప్రభావం, సహాయ నిరాకరణ ఉద్యమ స్ఫూర్తి మొదలైన అంశాలు పేర్కొనబడ్డాయి.

పాట. జై శ్రీమద్రమారమణ గోవిందో హరి
రామా రామా కలియుగ రామ గాంధీ వర నామా
రామా రామా కలియుగ ధామ గాంధీ పరంధామా
సీమవారు మా జుట్టు పట్టి క్షేమము చెరచిరిగా
పామర జనములు బాధలు పడ మన ధనమునూడ్చినారుగా
బంగరు పండే భారత భూమి పరుల పాలయింది
లంగరు వేసి కూర్చున్నాడు ఇంగ్లీషు ప్రభువండి ॥ రామ రామ ॥

స్వరాజ్యాన్ని, స్వేచ్ఛను కాంక్షిస్తూ వచ్చిన మరో గేయం "స్వరాజ్య జెండా". దీనిని శృంగవరపు సీతారామాచార్యులు రాశారు. 1931లో ముద్రించబడింది.

పాట. "ఎత్తండి స్వరాజ్య జండా
జండా నెత్తండి ధైర్యము నిండా
నింక స్వరాజ్య జయమును సాధింతు మనుచు...
ఎత్తండి స్వరాజ్య జెండా.."

భారతీయులు జండా పైకెత్తితే చాలు అది దేశద్రోహం అన్నారు. ప్రభుత్వ వ్యతిరేక కుట్ర దారులు వారందరూ అన్నారు. ఈ పాట ప్రజలలో ప్రచారం కాకూడదు అన్నారు. నిషేధాన్ని విధించారు.

1931లో వచ్చిన పాటల పుస్తకం "స్వరాజ్య శంకు". దీనిని కలగా సత్యనారాయణ రాశారు 132 చరణాలు ఉన్న చిన్న పాటల పుస్తకం ఇది. ఈ పుస్తకంలోని పేజీల సంఖ్య కేవలం ఎనిమిది మాత్రమే. ఇది రాజమండ్రిలో ముద్రితమైంది. పుస్తకం ప్రారంభంలోనే చిలకమర్తి వారి భరతఖండంబు చక్కని పాడియావు అన్న పద్యం ఉంది. బ్రిటిష్ వాళ్లు భారతీయుల మీద ప్రేమతో ఏ పని చేయడం లేదు. కేవలం వారి వ్యక్తిగత స్వార్థంతోనే అన్ని చేస్తున్నారు. భారతదేశము నుండి సమస్తమూ దోచుకుంటున్నారు. భారతీయులను బానిసలుగా చూస్తున్నారని కవి ఆవేదన చెందుతూ స్వరాజ్యం వచ్చే వరకు పోరాటం మానవద్దని కోరుతూ ఈ రాక్షస ప్రభుత్వం మనకొద్దు అంటూ ప్రజలను మేల్కొల్పుతున్నటువంటి గేయం ఇది.

పాట. వద్దురా మనకొద్దురా / ముందుద్దురా ఇక వద్దురా
ఈ రాజ్యం వద్దురా పర రాజ్యము వద్దురా
హద్దు పద్దులేని రాజ్యము ఊగులాట లేలరా..

ఎంతో పేరు ప్రచారం పొందిన గేయ సంకలనం "రైతు భజనా వళి". ఇది 125 పేజీలు గల పాటల సంకలనం. దీనికి సంపాదకుడు ఎన్జీరంగా. 1934 లో మొదటి ముద్రణ పొందింది. 15 సంవత్సరాలలో 12 ముద్రణలు పొందటం దీని ప్రత్యేకత. ఈ గ్రంథం ఇన్ని ముద్రణలు పొందడానికి కారణం రైతు ఉద్యమాలు పెరగడమే. అనేక రకాలైన రైతు సమస్యలు ఈ పాటలలో ప్రస్తావించబడ్డాయి. అజ్ఞానాన్ని తొలగించుకోవాలని, జమీందారీ రైతాంగాన్ని చైతన్యవంతం చేయడం, అధిక పన్నులు, సిస్తులకు నిరసన తెలియజేయడం, అస్పృశ్యత నివారణకు ప్రబోధం చేయటం వంటి అనేకంశాలు ఉండటం వలన ఈ గ్రంథం ఆంక్షలకు గురైంది. అందులో ఒక పాట..

చేదామంటే కూలీ లేదు పోదామంటే నాలి లేదు
బిచ్చమంటే మాలీ కాదురా / ఓ సంగదేవ దేవుడికే జాలి లేదురా
తినబోతే మెతికే సున్నా కట్టబోతే గుడ్డే సున్నా తాకబోతే నీళ్ళే సున్నారా
ఓ లోకసంగా పీల్చబోతే గాలే సున్నారా
ఆసామీలా చరణాకోల పోలీసులా పోటు చాలా / ఇంతకంటే జైలే మేలవురా
ఓ గురునాథ మా జీవనమే మాకే గోలరా

ఇవే కాక కార్మిక భజనా వళి, మహాత్మా గాంధీ భజన గీతములు, పంజాబ్ పాట, స్వరాజ్య కోలాటం, స్వరాజ్య గీత పుంజం మొదలైన ఎన్నో గేయాలు, గేయ సంకలనాలు, గేయ సంపుటాలు జాతీయోద్యమ కాలంలో వెలువడి ప్రజల్లోకి చొచ్చుకుపోయి వారిని చైతన్యవంతం చేయటానికి ఎంతగానో ప్రయత్నించాయి. ఆ ప్రయత్నం సఫలమైతే మా ప్రభుత్వం విఫలమవుతుందని భావించిన బ్రిటిష్ ప్రభుత్వం వాటిని నిర్దాక్షిణ్యంగా నిషేధించింది.



# జాతీయోద్యమం దేశభక్తి

**డా. ఇ. మాధవి,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు

ఏ ఉద్యమమైనా విజయవంతం కావాలి అంటే దానికి సాహిత్యపు ఊపిరి ఉండాలి. సాహితీవేత్తల యొక్క అండదండలు లేకుండా ఏ ఉద్యమము ముందుకు వెళ్లలేదు. ఉద్యమము చైతన్యవంతంగా ప్రజలలోకి వ్యాపించడానికి, ఆ ఉద్యమము సాధించవలసిన లక్ష్యాలకు సాహిత్యపు అండదండలు ఉండాలి, చైతన్యవంతంగా ప్రజాలలోకి వెళ్లగలగాలి అంటే సాహిత్యపు తోడ్పాటు అవసరం. అప్పుడే ఏ ఉద్యమమైనా విజయవంతం అవుతుంది. నాటి ఉద్యమ స్థితిగతులు తర్వాతి తరాలవారికి తెలియజేయాలన్నా ఆ సమయంలో వచ్చిన సాహిత్యమే తోడ్పడుతుంది.

స్వాతంత్ర్య అమృతోత్సవాల సందర్భంగా మరోసారి నాటి సాహిత్యాన్ని, సాహితీవేత్తలను, ఉద్యమకారులను స్మరించుకోవడం ఆనందంగా ఉంది. యువతలో దేశభక్తిని పెంపొందించడానికి ఆ సాహిత్యం ఊతం అవుతుంది. కాబట్టి ఈ సాహిత్యం ఎప్పుడూ నిత్యనూతనంగానే కనిపిస్తుంది.

దేశభక్తి కలిగిన కవులు, రచయితలూ నేటికీ దేశభక్తిని రగిలించే సాహిత్యాన్ని సృష్టిస్తూనే ఉన్నారు. అలాంటి వారిలో ఒకరు వేంపల్లి గంగాధర్ గారు. వారు రాయలసీమ మాండలికంలో రచనలు చేశారు. అక్కడి పరిస్థితుల్ని సహజత్వంతో చిత్రించారు ఆయన. వారి రచనలలో స్వాతంత్ర్యోద్యమ కథలు కూడా ఉన్నాయి. వాటిలో నాకు బాగా నచ్చిన కథ “ఏడు లాంతర్ల సెంటర్” అనే కథ.

“ఏడు లాంతర్ల సెంటర్” కథలో స్వాతంత్ర్యోద్యమం జరిగేటటువంటి రోజులలో బ్రిటిష్ పాలకులు భారతీయులను బానిసలుగా చూస్తూ వాళ్ళ చేత చాలా నీచమైన పనులు చేయిస్తూ, హీనమైనటువంటి పరిస్థితుల్ని కల్పించేవారు. అలాంటి ఒక బ్రిటీష్ అధికారి దగ్గర ఈ కథలోని నాయకుడు పనిచేస్తూ ఉండేవాడు. బూట్లు తుడవడం దగ్గర నుంచి ‘తుపాకులు’ శుభ్రం చేయడం, అతని వాహనాన్ని నడపడం లాంటి అన్నీ పనులు చేస్తాడు. స్వేచ్ఛ కావాలి అనే భావజాలం ఆప్రాంత ప్రజలలో ఉంటుంది. ఒకసారి గాంధీ మహాత్ముడు ఆ ప్రాంతానికి వస్తాడు. అతని ప్రసంగం విన్న వారికి ఉద్రేకంతో రక్తం మరిగిపోతుంది. గాంధీ గారి సిద్ధాంతాలను వీరు విశ్వసిస్తారు. జాతీయోద్యమంలో పాల్గొనాలి అనే ఆసక్తి కలుగుతుంది. కానీ అశక్తులు. ఎందుకంటే వారు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనాలి అంటే వారికి పూట గడవాలి కదా. ఆ పరిస్థితుల్లో అతనికి ఒక అవకాశం వస్తుంది.

ఆ దొరను మన కథానాయకుడు ఒంటరిగా ఒక ప్రాంతానికి తీసుకువెళ్లాల్సి వస్తుంది. ఆ సమయంలో అతనికి బ్రిటీష్ దొరలు చేసే అకృత్యాలు గుర్తుకు వస్తాయి. బ్రిటీష్ వాళ్ళకు వ్యతిరేకంగా పనిచేసే వాళ్ళని ఆ ఏడులాంతర్ల సెంటర్ లో ఉరి తీసేవాళ్ళు, మిగిలిన వాళ్ళను భయపెట్టడం కోసం. ఆ విషయం కూడా అతనికి గుర్తుకొస్తుంది. చీకటి పడింది, దొర తనకు ఒంటరిగా చిక్కాడు. కావాలి అంటే తాను అతన్ని చంపివేయవచ్చు చదివే వాళ్లందరికీ అలాగే అనిపిస్తుంది. అతనికి అదొక మంచి

అవకాశం తన కోపాన్ని వ్యక్త పరచడానికి. కానీ, అతను అలా చేయడు, తమ వాహనం ఆ ఏడు లాంతర్ల సెంటర్ కి వచ్చాక అక్కడ మన జాతీయ పతాకాన్ని అతడు ఎగురవేస్తాడు. అది మనం ఊహించని సంఘటన. గాంధీ చెప్పిన అహింసా సిద్ధాంతం వాళ్ళ నరనరాల్లో ఎలా జీర్ణించుకు పోయిందో చెప్పడానికి అదొక ఉదాహరణ అని చెప్పవచ్చు. అతడు అతన్ని చంపే అవకాశం వచ్చినా, చంపడు. ఎందుకంటే అది గాంధీ సిద్ధాంతానికి వ్యతిరేకం కాబట్టి. దీన్ని బట్టి గాంధేయ సిద్ధాంతాల్ని వారు ఎంతగా ఆచరించేవారో అర్థం అవుతుంది. ఆ రోజుల్లో ప్రతికూల పరిస్థితుల్లో జాతీయ జెండాను ఎగురవేసే ఘట్టం చాలా అద్భుతంగా అనిపిస్తుంది. అది ఈ తరం వారికీ ప్రేరణ కలిగిస్తుంది. ఆ సమయంలో వచ్చిన రచనలన్నీటిలో ఆయన్ని దేవుడుగానే చెప్పడం కనిపిస్తుంది. కానీ ఈ మధ్య కాలంలో ఆనాటి పరిస్థితుల్ని ప్రతిబింబించే కథలో కూడా గాంధీ గారిని మహాత్మునిగానే చిత్రించడం జరిగింది.

గొప్పవాళ్లు పుట్టిన ప్రదేశంలో, నడయాడిన నేలమీద మనం నివసించడం చాలా గొప్ప విషయం. అట్టి వారి కుటుంబాల్లో జన్మించడం చాలా అదృష్టంగా భావించాలి. వారి గౌరవం మనకూ దక్కుతుంది. నేను 'టీచర్ ట్రైనింగ్' కోసం విశాఖపట్నం జిల్లాలోని భీమునిపట్నం వెళ్ళినప్పుడు మొదటి రోజు క్లాస్ లో నేను చీరాల నుండి వచ్చాను అని చెప్పగానే 'చీరాల పేరాల ఉద్యమాన్ని' వాళ్ళు ప్రస్తావించడం నేను గొప్పగా భావించాను. 'ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాల కృష్ణయ్య' కారణంగా జాతీయోద్యమ స్థాయిలో అది గొప్ప ఉద్యమంగా చరిత్రలో నిలిచిపోయింది.

దుగ్గిరాల గోపాల కృష్ణయ్య గారు కృష్ణాజిల్లా పెనుగంచిప్రోలులో జన్మించారు. ఆయన జన్మించిన మూడు రోజులకే తల్లి చనిపోయారు. మూడు సంవత్సరాలకే తండ్రి చనిపోయారు. అయినా సరే ఆయన దేశమే తన కుటుంబంగా భావించారు. ఆయన బాపట్లలో ప్రాథమిక విద్య పూర్తి చేసి, గుమాస్తాగా పనిలో చేరుతారు. కానీ ఎక్కువ రోజులు ఆపని చేయలేక, తనను పెంచిన బాబాయికి ఈ ఉద్యోగం చేయడం కన్నా, భిక్షమెత్తుకొని బ్రతకడమే మిన్న అని ఉత్తరం రాస్తారు. బాబాయి అంగీకారంతో గుంటూరులో 'మెట్రిక్యులేషన్' పూర్తి చేసి తన స్నేహితుడైన నడింపల్లి నరసింహారావు సహాయంతో స్కాట్లాండ్‌లో ఉన్న చరిత్ర, అర్థశాస్త్రంలో ఉన్నత విద్యను పూర్తి చేసి రాజమండ్రి కళాశాలలో ఆచార్యులుగా చేరుతారు. స్వేచ్ఛా ప్రియుడైన ఈయన, ప్రిన్సిపల్ ఆర్. డబ్ల్యు. ఏ. రాస్ నిరంకుశత్వాన్ని సహించలేక ఉద్యోగానికి రాజీనామా చేస్తాడు. భార్య దుర్గాభవానీ అనారోగ్యం కారణంగా చీరాలకు చేరుకుంటారు. ఈయనకు సంగీతం తెలుసు. పద్యాలకు, పాటలకు బాణీలు కట్టి పాడుతూ, ప్రజల్ని ఆకర్షించేవారు. 'సాధన' అనే ఒక సాహిత్య పత్రికను స్థాపించారు. పత్రికలు ప్రజల మధ్యకు వెళ్ళినప్పుడు ఒక్కరి భావజాలం అందరి మధ్యకు వెళుతుంది అని ఆ రకంగా జాతీయోద్యమంలో ఈ పత్రిక ప్రముఖ పాత్ర పోషించింది.

ఆంగ్లేయుల కనుసన్నల్లో నడిచే జస్టిస్ ప్రభుత్వం 'చీరాల పేరాల' లను మున్సిపాలిటీ చేయాలని భావించారు. ఎందుకంటే అప్పటి వరకు పన్నులద్వారా ఆదాయం నాలుగు వేలు వస్తుంటే, మున్సిపాలిటీగా మారాక నలభై వేలు వస్తుంది. అక్కడున్న వారు పేద చేనేత కార్మికులు. సాధారణ రైతులు. వారు పన్నుల భారాన్ని మోయలేక ఉద్యమం చేస్తారు. ఆ ఉద్యమానికి నాయకత్వం వహించింది దుగ్గిరాల గోపాల కృష్ణయ్య గారే.

విజయవాడ కాంగ్రెస్ సభలకు వచ్చిన గాంధీ గారు చీరాలను సందర్శిస్తారు. ఆయన రెండు మార్గాలను సూచిస్తారు. ఒకటి అహింసా మార్గంలో పన్నుల నిరాకరణ ఉద్యమాన్ని చేయమంటారు. రెండవది పన్నుల పరిధిలో ఉన్న ప్రాంతాన్ని వదిలి వేరే ప్రాంతానికి వెళ్ళమని సూచిస్తారు. గోపాల కృష్ణయ్య గారు రెండవ మార్గాన్నే ఎంచుకుంటారు. కుల, మత, లింగ భేదాలు లేకుండా గోపాల కృష్ణయ్య గారి మాట విని అందరూ 'రామ్‌నగర్' ను గుడారాలతో నిర్మించుకుంటారు. పదకొండు నెలలు ఓపికగా అలాగే ఉంటారు. గోపాల కృష్ణయ్య గారెని అరెస్ట్ చేయడంతో నాయకత్వ లోపం ఏర్పడి, సహాయం చేసే వారు లేక వారు తిరిగి తమ స్వంత ప్రాంతానికి వెళ్లిపోతారు.

గోపాల కృష్ణయ్య గారు 1921 లో బరంపురం లో జరిగిన కాంగ్రెస్ సభలకు వెళ్ళినప్పుడు ఈయన ప్రజలను రెచ్చగొట్టే ప్రసంగాలను చేస్తున్నాడని అరెస్ట్ చేసి శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ ముందు హాజరు పరుస్తారు. అప్పుడా కలెక్టర్ అధికారులందర్నీ

రావణాసురునిలా, కంసునిలా, బలిలాగా పోలుస్తున్నావట ఏంటి అని అడుగుతారు అవును మా ప్రజలకు అలా చెబితేనే అర్థం అవుతుంది అంటారు. ప్రతినాయక పాత్రలతో వారిని పోల్చి చెప్పడం మనకు ఇక్కడ కనిపిస్తుంది. దీంతో ఈయనకు ఒక సంవత్సరం కారాగార శిక్ష విధిస్తారు. ఈయనకు క్షయవ్యాధి సోకడంతో చిన్న వయసులో ముప్పై ఎనిమిది సంవత్సరాలకే మరణిస్తారు.

'దేశంమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్' అన్నారు. విధి నిర్వహణ అనేది మన ప్రధాన కర్తవ్యం. దేశభక్తిని మనం మన రక్తంలోనే జీర్ణించుకునేలా చిన్నప్పటి నుండే సాధన అవసరం. ఈ లక్ష్యానికి ఈ సదస్సు తోడ్పడుతుందని భావిస్తున్నాను. ❀

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 13 హైదరాబాద్ డిసెంబరు - 2022

# స్వాతంత్ర్యోద్యమ కవయిత్రి - శ్రీమతి తల్లాప్రగడ విశ్వసుందరమ్మ



సారస్వత కళానిధి **డా. వెలువోలు నాగరాజ్యలక్ష్మి,** విశ్రాంత ప్రాచార్యులు

ప్రతి జాతికి దేశభక్తి నిసర్గసుందరమైన ఒక సహజ భావన. తాత్కాలికమైన ఆటంకాలు ఎన్ని చుట్టుముట్టి వేధించినా అవకాశం వచ్చినప్పుడు పైకి ఎగిసిపడే భావన ఇది. పరిస్థితుల ప్రభావానికి మాటు మణిగినట్లు కన్పించినా అవసరం అయినప్పుడు లావా లాగా విజృంభిస్తుంది. ప్రభంజనంలా వ్యాపిస్తుంది. పగవాడి అంతు తేలుస్తుంది. అనువు కానప్పుడు ఒదిగి ఒదిగి మనసు పొరల్లో దాక్కుంటుంది. తరువాత అణువణువునా జ్వలిస్తుంది. ఆవిరులు పుక్కిలిస్తుంది. ఈ భావన నిత్యనూతనం, మాతృదేశంపై నిష్కళంకమైన, నిరుపమానమైన భక్తి, తన జాతి శ్రేయస్సుకు పాటుపడాలనే తపన – దేశభక్తికి మూలసూత్రాలు.

ఆంగ్ల ప్రభుత్వం మీద భారతీయులు సాగించిన స్వాతంత్ర్యోద్యమానికి, సాధించిన విజయానికి భరతజాతి గుండెల నిండుగా ప్రవహించే అసమానమైన దేశభక్తియే కారణం. సమాజానికి దిశా నిర్దేశం చేసే కవులు తాము జన్మించిన జాతికి మేలు చేకూర్చాలనే ఉదాత్త ఆశయంతో తమ రచనల ద్వారా ఆనాడు మహోద్యమానికి ఊపిరులూదారు.

భారత స్వాతంత్ర్యోద్యమం ఆధునికయుగ సంస్కరణలకు నాంది పలికింది. స్త్రీ, పురుష తారతమ్యం లేకుండా ఐకమత్యంతో ఉద్యమంలో పాల్గొనాలంటే స్త్రీ విద్య, స్త్రీ భావప్రకటన స్వేచ్ఛ, స్వతంత్రత అత్యంతావశ్యకాలని భావించారు. స్త్రీవిద్యా, వివాహ, ఆర్థిక స్వావలంబన, దేశాభివృద్ధి, రాజకీయ చైతన్యం వంటి అంశాలతో దేశ స్వాతంత్ర్య సాధనకు సమాంతరంగా కవయిత్రులు కలం చేపట్టారు. తమ సృజన శక్తికి పట్టం కట్టారు. ఉద్యమాలలో స్వయంగా పాల్గొన్నారు. తమ రచనలతో జనులలో, ప్రధానంగా మహిళలలో స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించారు కథలు, వ్యాసాలు, నాటకాలు, శతకాలు, గేయాలు, కవితలు, నవలలు, గల్పికలు ఇత్యాది పలు సాహిత్య ప్రక్రియలతో కవయిత్రులు ఉద్యమాలతో మమేకమై నినదించారు.

ఆనాటి ఆంధ్ర కవయిత్రులలో శ్రీమతి తల్లాప్రగడ విశ్వ సుందరమ్మ ఆదర్శ ప్రాయురాలైన కవయిత్రీమణి ఈమె పశ్చిమ గోదావరిజిల్లా 'ఉండి' గ్రామంలో మల్లవరపు శ్రీ రాములు, సీతమ్మ, గార్లకు 1899 మార్చి 6వతేదీన జన్మించింది. 8 సం. రాల వయసు లోనే తల్లాప్రగడ నరసింహశర్మ గారితో వివాహం జరిగింది. బాల్యంలోనే భారత, రామాయణాది గ్రంథాలు, చిలకమర్తి లక్ష్మీనరసింహం, వీరేశ లింగం పంతులుగార్ల రచనలు చదివింది. భర్తతో కలసి సేవా కార్య క్రమాలలో చురుకుగా పాల్గొనేది. చాగల్లు ప్రాంతంలో నెలకొల్పబడిన వీరి ఆశ్రమం ఆనందనికేతనం. మహాత్మాగాంధీ పట్ల అసమానమైన భక్తి ప్రపత్తులు బాల్యంనుండే ఆమె హృదయంలో నెలకొన్నాయి. ఉద్యమ చైతన్యంతో తాను కూడ ఉద్యమ ఘట్టాలలో పాల్గొన్నది. మహిళలను చైతన్యవంతులను చేసింది. కొన్ని సందర్భాలలో కారాగార వాసం అనుభవించింది ఉద్యమంలోని ప్రతి సందర్భంలోనూ ఆమె తన ఉనికిని చాటుకుంది. గానమై ప్రవహించింది.

1920 – 49 నడిమి కాలంలో ఆమె తన రచనా ప్రస్థానం కొనసాగించింది. ఆధునిక సాహిత్య చరిత్రలో ఈ కాలం భావకవిత్వశాఖ విస్తారంగా వ్యాప్తిచెందింది. విశ్వసుందరమ్మ కవిత్వంతో భావకవితా రీతులు ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. భావకవిత్వంతో

ప్రణయ, ప్రకృతి. భక్తి, దేశభక్తి, సంఘసంస్కరణ, సంస్మరణ కవిత్వాలుగా సాహిత్య విమర్శ కారులు వింగడించారు. విశ్వసుందరమ్మ కవిత్వంతో దేశభక్తి పూరితమైన సాంఘిక గీతాలు, ఉద్యమ గీతాలు ప్రముఖ స్థానం వహించాయి.

కవిత భావ ప్రధానం. దానికి పాండిత్యం యొక్క ఆవశ్యకత లేదు. హృదయాంతర్గతమైన భావాన్ని శక్తిమంతంగా, ప్రభావ శీలంగా ఆవిష్కృతం అయినప్పుడు దాని భాష అదే చూసుకుంటుంది. ఏ ప్రక్రియ హృదయావిష్కరణకు సమర్థమైన ఆలంబనమూ ఆ సాహితీ ప్రక్రియని చేపట్టగల ప్రతిభ కవి సొంతం.

విశ్వసుందరమ్మ కవితల లక్ష్యం స్వాతంత్ర్య, సాంఘిక ఉద్యమం. అందుకే ఆ లక్ష్యానికి అనుగుణంగా ఆమె గేయ ప్రక్రియను స్వీకరించింది గేయం గానయోగ్యం. ఏదైనా ఒక నీతిని, ఆదర్శాన్ని ప్రబోధాన్ని అందించవలసి వచ్చినప్పుడు గానం జనుల హృదయాలలో అమిత వేగంగా ప్రవేశించి కవి ఉద్దేశించిన మార్పుకు దోహదం చేస్తుంది. ఆ దృష్టితో చూసినప్పుడు విశ్వసుందరమ్మ గేయరచన ఆనాటికి కార్యాచరణకు శక్తిమంతమైన ఆయుధంగా నిలిచింది.

A simple song for thinking hearts అని తన కవిత్వాన్ని గురించి వర్డ్స్ వర్తు మహాకవి చెప్పుకున్నాడు. యోచనాపరుడైన మానవుని హృదయాన్ని రంజింపచేసే అంశాలే తన కవితా సామగ్రి అంటాడు. ఈమె గేయ కవిత్వం సరళ సుందరమై ఆనాటి సమాజంలో విశ్వ సుందరమ్మ ఉద్యమస్ఫూర్తికి వాకిళ్ళు తెరిచింది. గ్రామసీమల్లోనూ, నిరక్షరాస్యుల్లోనూ ఉద్యమావశ్యకతను వివరించి, వారిలో చైతన్యదీపాలు వెలిగించింది. స్వాతంత్ర్య కాంక్షను ప్రతివ్యక్తి హృదయానికీ చేరువచేసింది. గేయాలతో భారతీయుల గుండె గాయాలను ప్రకృతి అంతటా ప్రతిధ్వనింపచేసింది. ఆనాటి పత్రికలు కూడా నిస్వార్థంగా కవుల, కవయిత్రుల రచనలను ప్రచురించి ఉద్యమ వ్యాప్తికి తమవంతు పాత్ర పోషించాయి.

"ఖద్దరెంతో ప్రీతి గట్టుమా / మొద్దుదనుచు మాతి ముదువక కన్నతల్లి సేవచేయుమా / వన్నెవాసి కనగ కోరుమా / దాస్యభావ మెదను వీడు మా / దేశమోక్షణమ్ము గోరుమా / త్యాగజీవియై తరింపునూ / దేశమునకు ప్రాణమొసగుమా" ఇలా పాడుకుంటూ ఉద్యమానికి ఊపు తెచ్చింది. 'స్వదేశ వస్త్రము' అనే గేయంలో ఆనందంతో ఆడిపాడింది–

"అతి సుతారమగు పొందూర్వలువలు / నుతికెక్కెను గా భువిలోన
సన్నుతి పొందెనుగా భువిలోన / తెలుగు తల్లులకు తెలుగు పిల్లలకు
తేజంబెంతయో పెంచెగదా / ముది ఖాదీ వస్త్రమె మించె గదా".

గాంధీజీ శాసనోల్లంఘన ఉద్యమాన్ని చేపట్టారు. నాటి నుండి ఉద్యమం ఇక వెనుదిరగలేదు. 1930లో ఉప్పు సత్యాగ్రహం స్వాతంత్ర్య ఉద్యమ ఘటనలలో ప్రఖ్యాతమైనది ఉప్పుపై పన్ను విధించిన బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గ్రామీణ జనులు, మహిళలు ఆ ఉద్యమంలో పాల్గొన్నారు. ఈ పరిణామాలకు అనుగుణంగా విశ్వ సుందరమ్మ గేయం అందుకుంది. ప్రచారం చేసింది.

"భరతదేశ దాస్యముడుపగా / భారతీయ! సాగి నడువుమా
మనతల్లి చేతి బంధనమ్ముల/ త్రెంపగాను తెంపుసేయుమా
మన నాయకమని చెప్పినట్లుగా / సమరభువికి సాగి నడువుమా
ఆ ఉప్పు చట్టమును జయింపగా / సమర భువికి సాగి నడువుమా
ఆ ఉదధి చేరి ఉప్పు సేయగా / సంద్రంపుదరికి సాగినడువుమా" – ఉప్పు చట్టము

ఈ గేయం ఇప్పుడు వింటూ ఉంటేనే దేశభక్తి కలవారికి ఒడలు గగుర్పొడు స్తుంది. ఇక ఆకాలంలో ఉద్యమస్ఫూర్తిని కలిగించటంలో ఇలాంటి గేయాలు ఎంతటి ప్రభావాన్ని కలిగించాయో ఆలోచిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. స్త్రీలు గడపదాటి బయటికి రావటానికి అవకాశం లేని ఆ కాలంలో విశ్వ సుందరమ్మ నెఅపిన ఉద్యమసేవ అనన్యసామాన్యం.

ఉప్పు చట్టం, ఖద్దరు, రాట్నం వడకటం వంటి ప్రయత్నాలు ఈ కాలానికి చాలా చిన్నవిషయాలుగా అనిపించవచ్చు. ఆ గేయాలు అతిసాధారణమైన గేయాలు అనిపించ వచ్చు కాని ఆకాలంలో అసలు ఏమాత్రమూ ఉద్యమ స్ఫూర్తి లేని నిరక్షరాస్యులను జనాన్ని ఉత్తేజితం చేయటానికి అవసరం అయ్యాయి.

"భారత స్వరాజ్యము గోరి / సమర సైనికుల జేరి
సత్యాగ్రహమును జేయ / సమకట్టక వలె నేడు
హక్కు స్వత్వములు పొంద / అక్రమ చట్టము డింద
ఉప్పు పంట పండించి / కప్పు దిశల నీయశము

అని 'సత్యాగ్రహము' అనే గీతంలో పాడింది.

"జన్మహక్కు మరచి నీవు / శాశ్వతముగ దాసుడవై
బ్రతుకనేల, పరదాస్య / భ్రాంతి వీడి లెమ్మురా!
భరత సోదరా! భరత సోదరా!
బానిస బడలనీల భరతసోదరా – అని హెచ్చరించింది.

బానిసత్వపు సంకెళ్ళలో మ్రగ్గిపోతూ దైన్యంతో కాలంగడుపుతున్న భారతీయులను గురించి అవేదన చెందింది. ఆమెలో కొన్ని సందర్భాలలో నిరాశ ఆవరించింది. తన ఆవేదనను, నిరాశను గీతం రూపంలో వెల్లడించింది.

భారతీయుల కేడుగడమె / కానిపింపక పోయెగా
భారతావని పారతంత్ర్యపు / పాశమందున జిక్కగా
వీరవరులకు ధీరవరులకు / దారిచూపిన భూమియే
పిరికివారల మొరకువారల / కడకు మోయగ వలసెగా

–అని దుఃఖించింది.

స్వాతంత్ర్యం సంపాదించలేకపోతే భారతీయులుగా జన్మించిన ఫలమేమి? అని సూటిగా నిలదీసింది. భరత భూమి యొక్క విశిష్టతను, స్వాతంత్ర్యోద్యమంలో పాటుపడుతున్న దేశ భక్తులను స్మరించి వారి బాటలో నడువుమని సూచించింది.

"పరులకు వెరవని పరమధీరురాలు / ఝాన్సీ మహారాణి జనన మందిన భూమి ఆత్మగౌరవవాంఛ నాంగ్ల సైన్యములకు జడుపునొందని రామరాజు పుట్టిన భూమి బుద్ధ, రామకృష్ణ, శ్రద్ధానందాదులను గాంధి యోగిని బోలు ఘనులగాంచిన భూమి"

విశ్వసుందరమ్మ బాల్యంలోనే పురాణ గ్రంథాలన్నిటిని అధ్యయనం చేసింది. చరిత్రను పరిశీలించింది. భారతదేశానికి వన్నె తెచ్చిన మహా మహులందరిని ఆమె ఆదర్శంగా స్వీకరించి గీతాలు రచించింది. తెలుగు మహిళలలో అత్మగౌరవ స్ఫూర్తి నింపింది. ఏ ఉద్యమం అయినా యువత ఉత్సాహంగా పాల్గొన్నప్పుడే అది విజయవంతం అవుతుంది. యువత, మహిళ లేని ఉద్యమాలు అంతగా సఫలం కానేరవు. ఈ సూత్రం బాగా తెలిసిన విశ్వసుందరమ్మ యువతను మేల్కొల్పింది.

"లెండు, యువక యువతు లార / లెండిక వేగ
మెండుగ నుత్సాహ రసము / మించి పొంగగా
భారతాంబ పాలనమున / భావి పౌరులైన మనము
ఏల నింక వెనుక దీయ / ఏల వెనుక కదుగువేయ"

అని స్వీయ గీతాలు పాడుతూ ప్రేరణ నందించింది.

ఆనాడు ఉద్యమంలో పాలు పంచుకోవటం గొప్ప అదృష్ట విశేషంగా భావించేవారు. ఏదో ఒక రీతిలో ఉద్యమ

భాగస్వామ్యం స్వీకరించి జనులంతా తమ జన్మ ధన్యమైనదని భావించేవారు. ఉద్యమం లోని ఒక్కొక్క ఘట్టంలోనూ ఆనాటి స్త్రీ పురుష లెల్లరు చేసిన త్యాగాలు విన్నా, చదివినా నేటికీ ఒడలు గగుర్పొడుస్తుంది. అంతటి త్యాగధనుల వలన మనం స్వతంత్ర భారతీయులమై ఈ గడ్డపై జన్మించటం మనకందరికి గర్వకారణం. ఎందరో మహిళలు వివాహం చేసుకుంటే ఉద్యమ కార్యక్రమాలకు ప్రతి బంధకం అవుతుందని ఎంచి వివాహాన్ని ధిక్కరించి ఉద్యమాలలో వెన్నుదన్నుగా నిలిచారు. మహిళల్లో ఉవ్వెత్తున ఎగిసిపడిన స్వాతంత్ర్య భావనకు విశ్వసుందరమ్మ వంటి కవయిత్రుల రచనలు ఎంతగానో ఊతం ఇచ్చాయి. స్వాతంత్ర్య కాంక్ష అనే అగ్నిని ప్రజ్వరిల్లచేశాయి. చెరసాలల్లో స్త్రీలు మ్రగ్గిపోయి లెక్కలేని ఇక్కట్లకు గురి అయ్యారు. వారి మనోభావాలను ఆర్ద్రతా భూయిష్టంగా ఆవిష్కరించింది విశ్వసుందరమ్మ.

ఆమె కేవలం గీతావళినే కాక ఛందోబద్ధ రచనలు కూడ చేసింది. సరళ సుబోధకమైన శైలిలో, తెలుగుతనం నిండిన భాషలో ఆమె పద్య రచన సాగింది..

"కఠిన కారాగృహమను లంకాపురమున
బంధితులమయి యున్నాము భయము వీడి
అబలలముగాక మెంతయు సబలలమయి
భరతదేశ విముక్తిని బడయు కొరకు"

ఒకవంక ధైర్యం; మరొక వంక దైన్యం సమ్మిళితమైన స్త్రీల మనోభావాలను వ్యక్తీకరించింది. స్వాతంత్ర్య సముపార్జన అవశ్య కర్తవ్యాన్ని ఎలుగెత్తి చాటిచెప్పింది. మహిళ కారాగృహ బద్ధలైన మహిళలలో సైతం ఆత్మవిశ్వాసం నింపింది తన గీతాల ద్వారా. తాము సబలల మయ్యామని ప్రకటించింది ధైర్యంగా. స్త్రీలలో అంతర్గతంగా దాగి ఉన్న శక్తి సామర్థ్యాలను వెలికి తెచ్చుకొని దేశ భవితకు తోడ్పడవలసినదని, దానికై త్యాగానికైనా వెనుదీయరాదని పిలుపు నిచ్చింది.

"స్వార్ధ జీవితంబే సౌఖ్యమ్మా / లేక త్యాగజీవితందే సౌఖ్యమా?
దాస్యశృంఖల బద్ధురాలై / తల్లి పరులకు లొంగి యుండగ
ఈసు నొందక వ్యర్థమైన / ఆశలకు లోబడిన హేయపు
వేడివేడి రుధిర ధారల / నోడ్చి తల్లి సేవజేయక
మూఢ దాస్యపు సేవలోనే / మునిగి మునిగి ముక్తినొందని
శక్తులన్నీ సమసిపోయి / భక్తిశ్రద్ధలు మాసిపోయిన"

ఆంగ్లేయులు అప్పటికే ఉద్యమకారులను, స్త్రీ పురుష భేదం లేకుండా హింసించటం ప్రారంభించారు. అందుకే రుధిర ధారలనైనా తట్టుకొని స్వాతంత్ర్య హక్కుకోసం పోరాడి త్యాగమయమైన జీవితంలోని . సఖ్యాన్ని ఆస్వాదించమని విశ్వసుందరమ్మ ఉద్ఘోషించింది.

తిలక్ జేసిన స్వరాజ్యం నా జన్మహక్కు' అనే ప్రబోధం సమాజంలో అత్యంత ప్రభావాన్ని చూపింది. నాడు ప్రారంభమైన వందేమాతరం ఉద్యమం స్త్రీల ఆలోచనలలో గణనీయమైన మార్పుకు కారణం అయింది. స్త్రీలు మరింత చొరవతో ఉద్యమ కార్యకలాపాలలో కృషి చేయసాగారు. భండారు అచ్చమాంబ మొదలైన రచయిత్రులందరు స్త్రీల స్వతంత్ర వ్యక్తిత్వానికి, సామాజిక ఉద్యమాలలో ప్రవేశించి తమ దేశభక్తిని నిరూపించుకోవటానికి పత్రికలలో పలు వ్యాసాలు రచించారు. నాటకాది ప్రక్రియలలో రచనలు చేశారు.

దేశదేశాలలో స్త్రీలకు ఓటు అనే నినాదాలు మారుమ్రోగుతున్నాయి.. ప్రజాప్రతినిధులను ఎన్నుకొనే హక్కు కోసం ఆనాటి స్త్రీ సంఘాలు పోరాడాయి. స్త్రీలలో రాజకీయ చైతన్యం కలిగించటానికి, దేశ పరిపాలనా స్వాతంత్ర్యానికి దారితీసే

విధంగా స్త్రీలు ముందడుగు వేయటానికి ఆనాటి రచయిత్రులు, రచయితలు, పత్రికల వారు తమ రచనల ద్వారా దోహదం చేశారు. ఆకృషిలో తానుకూడా భాగ స్వామ్యం వహించిన విశ్వసుందరమ్మ 'ఓటు' ప్రాముఖ్యాన్ని తన గీతాల ద్వారా వినిపించింది.

"జైశంకరాయనిరండి/ జన్మహక్కులను కోరండి
ప్రజాబంధువై మనెడు ఎ సుజనులకే ఓట్లిచ్చి
మన భారతమంత / పరువు నిల్పగా రండి" (ఓటు)

ఇలా ఒకవంక స్త్రీల చైతన్యానికి, మరొకవంక స్వాతంత్ర్య సాధనకు విశ్వసుందరమ్మ కవితాగానం చేసింది.

జనరల్ డయ్యర్ సాగించిన మారణకాండ ఉదంతాన్ని, సైమన్ కమిషన్ గోబ్యాంక్ అంటూ ఉద్యమకారులంతా ముక్త కంఠంతో నినదించిన సన్ని వేశాలను విశ్వసుందరమ్మ తన గీతాలలో నమోదు చేసింది. సైమన్ కమిషన్ నియామకం వెనుక కుట్రను భారతీయులకు జరగబోతున్న ద్రోహాన్ని ఒక పరిణతి చెందిన రాజకీయవేత్త బోధించినట్లుగా బోధించింది.

అతి సాధారణ పౌరులకు సైతం కమిషన్ నేపథ్యరహస్యం అవగతం అయ్యే రీతిలో రచన చేసింది.

"మరల మటంచును తెల్పగ రాదా / తిరిగి సైమనును వెనుకకును
సైమను రాగా సంతస మేలా / సాక్ష్యము లీయగ పోనేలా.
సత్యాగ్రహ మొసగునదె సరాజ్యమ్ము / సైమనొసగునది శూన్యమ్ము
మొన్నే కదా చేసెను డయ్యరు / చిన్న తనములను ఎన్నెన్నో
అధికారులు దొరలాండే మాటలు / అన్నియు బూటక నాటకముల్
వాక్స్వాతంత్ర్యము వల్ల కాదనుచు / వేసిరి నోటికితాళమ్ము
ఎప్పటి కైనను ప్రజల శక్తియే ఎ తెచ్చును మనకు స్వతంత్రము".
ఆనాటి ఉద్యమం మీద, ఆమెకు ఎంత పట్టు పరిశీలన నిబద్ధత ఉన్నాయో

ఆమె పాడిన ఒక్కొక్క గేయమూ విశదపరుస్తుంది.

అనిబిసెంట్ వంటి విదేశీవనితలు సైతం శాంతి యుతంగా కొనసాగుతున్న స్వాతంత్ర్యోద్యమానికి, భారతీయుల న్యాయబద్ధ మైన ఆకాంక్షలకు తమ సహకారం అందించారు. ఎండ కన్నెరుగని ఎందరో మహిళలు కారాగారవాస శిక్షల ననుభవించారు. వారందరి పోరాట పటిమను జనుల హృదయంలతో నిలిపింది. సరోజినీనాయుడు, స్థానాపతి రుక్మిణమ్మ, పులుగుర్త కమలాదేవి, సుబ్బమాంబ వంటి వీర మానినీ మణులను ప్రస్తావించింది.

"ఆంధ్రుల కోడలు అల సరోజిని వంటి
    కవయిత్రి చెరలోన గడుపవలసె
ఆంధ్రుల పుత్రికయగు రుక్మిణీ సతి
    పట్టభద్రోణి ఖైదు పడగవలసి
సంగీత సాహిత్య సరస విశారద
    కమలంసతియు బందిఖాన దవసె
భాగవతోత్తమ, వరవక్త, సుబ్బమాం
    బయును కారాబద్ధకాగవలసె
మానవతికనకమ్మాయు మ్రగ్గవలసె
ధీరమతి లక్ష్మి బాయమ్మ డిందవలసె

త్యాగి మైన సత్యవతమ్మ వేగవలసె
దేశ ముక్తికై చెరసాల వాసమందు.

కొన్ని సందర్భాలలో సంభాషణాత్మక గీతాలు రచించింది. తాత్విక ధోరణితో దేశ ఉద్యమాన్ని అను సంధానించి గేయ రచన చేసిన గొప్ప దేశభక్తి కవయిత్రి తల్లాప్రగడ విశ్వసుందరమ్మ. 'మోక్ష మార్గము' పేరుతో ఆమె రచించిన గీతం అన్నా చెల్లెళ్ళు సంభాషణ రూపంలో సాగింది.

"మోక్షపట్నం పోదమంటే తెరువదేదిర  అన్నాయా!
మోక్షమది నీ తల్లి దేశపు ముక్తియందే చెల్లెలా!
దేశ సేవను చేయువిధమును తెలియజెప్పర అన్నయా!
దేశజులకు సేవచేయుట దేశసేవయే చెల్లెలా!
ఐకమత్యమే బలమటంచును అరయుమీమది చెల్లెలా!
భారతీయుల భావ దాస్యము పాయునంతట చెల్లెలా!
అగ్రజులు అంత్యజులు నను వ్యత్యాస ముడిగిన చెల్లెలా!
తగ్గి అంతః కలహములు మటుమాయమగునే చెల్లెలా!
పంచములు నీ కన్నదమ్ములటంచు నమ్ముము చెల్లెలా!
వంచనమ్మదికాదు సత్యము విశ్వసింపుము చెల్లెలా!

ఆరోజుల్లో ఏ ఇద్దరు మాట్లాడుకున్నా ఉద్యమ విషయాలే చర్చకు వచ్చేయి. ఏ కుటుంబంలో చూసినా ఉద్యమ స్ఫూర్తిని నింపే సంభాషణలే వినిపించేవి. ఉద్యమమే వారికి జీవితంగా మారిపోయింది. అటువంటి తీవ్రతను, ఉద్యమ సంలీనతను, ఆనాటి పరిస్థితిని సువ్యక్తం చేస్తుందీ గీతం.

స్వాతంత్ర్య పోరాటం తోపాటు  స్త్రీ విద్య, మద్యపాన నిషేధం, అస్పృశ్యతా నివారణ వంటి అంశాలు కూడ ప్రాధాన్యం వహించాయి. సమాజం సంస్కరింప బడినప్పుడే, స్త్రీలుకూడ ఉద్యమంలో పరిపూర్ణ భాగస్వామ్యం వహించినప్పుడే సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని సాధించు కోగలమని గాంధీజీ బోధించారు. ఆ సిద్ధాంతాలను, మద్యపాన వ్యతిరేకతను విశ్వసుందరమ్మ పాటలుగా కట్టి గొంతెత్తి పాడారు.

సాధారణంగా అష్టకష్టాలు అని మనం వ్యవహరిస్తూ ఉంటాం కదా మద్యపానం వలన ఎదురయ్యే అష్టకష్టాలు ఎటువంటివో వివరించింది విశ్వసుందరమ్మ తన సీస పద్యంలో–

"కల్లు త్రాగుటవల్ల ఘనత పోవుట యొందు
ఒడలు జబ్బులపాల పడుట రెండు
ఆలుబిడ్డలు దైన్యమందుట మూడగు
చేనున్న రూకలు చెల్ల నాల్గు.
పోలీసవారల పోటు లైదవదగు
పరువు మర్యాదలు బాయుటారు
కడుదుష్టుడని నిందపడుట యన్నదియేడు
ఆరోగ్యహీనుడవగు టెనిమిది
అట్టి అష్ట కష్టముల పాలగుటయెంచి
మద్యపానమ్ము సేయుట మానుమోయి.

బ్రతుకుమోయి సంఘమ్మున పరువు తోడ
మానవత్వము కోల్పోక మద్యపాయి.

సంఘసంస్కరణ విధానాలపై విశ్వసుందరమ్మకు పూర్తి అవగాహన ఉన్నదని ఆమె రచనల ద్వారా సువ్యక్తం అవుతుంది. బాల వితంతువులు భరతదేశ ధైన్యతకు హేతువని నొక్కిచెప్పింది. సమాజానికి ఒక రుగ్మత వంటి బాల్యవివాహాలను నిరసించటమే అందరి కర్తవ్యమని నినదించింది.

"బాల విధవలై వంతల పాలు బడిన
బాలికల గోడు దీర్పంగ జాల రొక్కొ
బాల విధవలయు సురెయిాం భరతదేశ
హైన్యతకు హేతువని కనుడన్నలారా!"
"తొల్లి వీరేశలింగార్యుడుల్ల మందు
బాల విధవల గతి గని జాలి బొంది
అల వితంతు పునర్వివాహముల సాధ్య
పరచె, సంఘదౌర్జన్యము సరకుగొనక"
"ఆమహామహు మార్గము ననుసరించి.
సంఘసంస్కరణోద్యమ సాధకులయి
భారత దేశాభ్యుదయముకై పాటు బడుట
పరమవిధి దేశభక్తులౌ పురుషతతికి"

అని మార్గ నిర్దేశం చేసింది. లోకం పోకడ ఏమాత్రమూ తెలియని చిన్న వయసులో వివాహం చేస్తే ఇంటికే పరిమితం అయిపోయి. దుర్భరమైన జీవితాన్ని గడిపే సామాజిక స్థితిని దుయ్యబట్టింది. ఈ సామాజిక రుగ్మతలను సమూలంగా రూపుమాపి ఉత్సాహ వతులైన యువతులను సైతం ఉద్యమంలోనికి ఆహ్వానించవలసినదని నినదించింది. అందరం కలసి కృషి సాగించవలసిన అవసరాన్ని పదేపదే పరిపోషం చేసింది 'స్వాతంత్ర్య కృషి' అనే గేయంలో–

"భువనవంద్యంబైన భారతభూమిలో పుట్టితివి నీవు
నవనవాభ్యున్నతికి తెరువును అరయదగును గదా
వైనతేయుడు తేజమున తన తల్లి దాస్యము బాపినట్లుగ
యత్నమున నీ దేశ దాస్యము బాపదగును గదా"
"అమృతమునకై సురవరులు మును
అంబుధిని మధియించినట్లుగ
నిరుపమముగ స్వతంత్రమునకై
నీవు పోరుమురా"

"కులములని పోరాడుకుంటే / కూటి కగునా గుడ్డ కగువా
బలమదంతయు పోయి దైన్యము పాల బడుదుముగా"

అని జాతిని హెచ్చరించింది. దేశభక్తి, త్యాగనిరతి, కార్య శూరత్వం నిండిన వనితారత్నంగా తాను ఎదగటమే కాక తెలుగు మహిళలను ఎదగవలసిన దని బోధించింది.

మహాత్మా గాంధీజీ సత్యాగ్రహ సమర చరిత్రలోని వివిధ ఘట్టాలలో సన్నిహితంగా సంచరించింది. అసలైన సత్యాగ్రాహిగా

ఆమెకూడా కారాగృహ వాసం చేసి ఉండటంచేత ఆమె చేసిన వర్ణనలకు, పాడిన పాటలను ఒక నిజాయితీ, ఒక జీవకళ చేకూరింది.

ఉప్పు సత్యాగ్రహం కాలంతో విశ్వసుందరమ్మ పశ్చిమ గోదావరి జిల్లాలోని స్త్రీలకు నాయకత్వం వహించింది. ఏలూరులో అరెస్టయిం ఆరు నెలలు రాయవెల్లూరు స్త్రీల కారాగారంలో శిక్ష నమభవించింది. 1932 లో నిషేధింపబడిన ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సమావేశానికి తెనాలిలో అధ్యక్షత వహించింది – ఆ సభలో తీవ్రమైన లాఠీఛార్జి చేసి, ఆరెస్ట్ చేసి తిరిగి ఆరు నెలలు కఠిన శిక్ష విధించారు పోలీసులు. 1933లో విడుదలచేశారు.

1930లో తనను విచారించిన కోర్టులో విశ్వసందరమ్మ ఒక వాంగ్మూలం ఇచ్చింది. అది ఆమె త్యాగమయ దృక్పథానికి, జీవిత ధర్మానికి ప్రతిబింబంగా నిలిచి పోయింది.

"గాంధీ మహాత్మునిచే మొదలుపెట్టబడిన ఈ ధర్మ సమరమున పాల్గొన్నందులకు నేనేమాత్రము పశ్చాత్తాపమును చెందుట లేదు నేనే మాత్రం తప్పు చేయుటలేదు. నా కెట్టి శిక్ష విధించినను అణుమాత్రము నేను పరితాప పడను – స్వాతంత్ర్యం కోరుట మా జన్మహక్కు కావున మేము కోరక మానము. భారత దేశము స్వాతంత్ర్య వాయు పూరిత మెప్పుడగునో అప్పుడే భారతీయుల మనస్సు చల్లనగును.

ఇంతటి ధీర గంభీర అయిన ఉద్యమకారిణి, కవయిత్రి, తల్లాప్రగడ విశ్వసుందరమ్మ. ఆకాలంలో విశ్వసుందరమ్మ చావలి బంగారమ్మ, బసవరాజు రాజ్యలక్ష్మమ్మలను త్రిరత్నములుగా ప్రసిద్ధికెక్కిన నారీమణులు. ఆగష్టు 30 – 1949న ఆమె తన తనువును చాలించిన విశ్వసుందరమ్మ వాగ్ఝరి. ఆమెప్రకటించిన భావపరంపర, ధైర్యసాహసాలు వనితాలోకానికి దారిదీపాలు. స్ఫూర్తి దాయకాలు. ❀

# అనంతజిల్లాలో గాంధీజీ జ్ఞాపకాలు - అనంతవాసుల అనుభవాలు

డా॥ వి. శ్రీదేవి, కళాశాల అధ్యక్షులు,చేబ్రోలు ప్రభుత్వ కళాశాల, గుంటూరు



భారతదేశ స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో తెలుగు ప్రజలపాత్ర శ్లాఘనీయమైంది. అందులో రాయలసీమ ప్రాంత కృషి వెలకట్టలేనిది. స్వాతంత్ర్యోద్యమానికి ఒక శతాబ్దం ముందు నుంచే రాయలసీమలో అక్కడక్కడా, అప్పుడప్పుడూ తెల్లదొరలపై ఎదురుతిరగడాలు మనకు అగుపడతాయి. అయితే వాటిని మన చరిత్ర స్వాతంత్ర్య పోరాటాలుగా గుర్తించకున్నా, రాయలసీమ ప్రాంత వాసిగా ఇవి ఒకరకంగా విదేశీయులపై స్వాతంత్ర్య పోరాటానికి నాందిగానే భావించవచ్చు అన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాను. 1838లో కర్నూల్ నవాబు 'రసూల్‌ఖాన్' ఆంగ్లేయులకు వ్యతిరేకంగా నిలిచి పోరాటాలు సాగించారు. 1801 నుండి 1805 వరకు చిత్తూరులో పాలెగాళ్ళ తిరుగుబాటు జరిగింది. చిత్తూరు పాలెగాళ్ళలో ఎదురుగొండ పాలెగాడు 'ముద్దురామప్పనాయుడు' ముఖ్యమైనవాడు. ఇతను ఆంగ్లేయులతో పోరాడి ఆంగ్లేయుల చేతిలో ఉరితీయబడ్డ పాలెగాడు. 1846న కడప జిల్లా కోయిలకుంట్లకు చెందిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఆంగ్లేయులపై తిరుగుబాటు చేసి విప్లవ సింహం అయ్యాడు. ఈయన రాయలసీమలో తిరుగుబాటు చేసిన పాలెగాళ్ళలో గొప్పవాడిగా కీర్తించబడ్డాడు. ఆయన గొప్పతనం గురించి జానపదులు బాణీలు కట్టి పాడడం ద్వారా ప్రజల్లో నిలిచాడు. ఇటీవలి కాలంలోనే ఆయన పోరాట వీరుడుగా గుర్తింపు పొందబడ్డాడు.

రాయలసీమలో ఒకటైన అనంతపురం జిల్లా స్వాతంత్ర్యపోరాటంలో చూపిన స్ఫూర్తి, పోరాడిన విధానం చాలా గొప్పది. ఫ్యాక్షన్ ముద్రవేసుకున్న ఈ జిల్లాలో కొద్దిమేర అయినా అవి తగ్గడానికి కారణం ఈ జిల్లాలో మూడు పర్యాయాలు మహాత్మాగాంధీగారు పర్యటించడం ఒక కారణంగా కనిపిస్తోంది. భారతదేశంలో ప్రసిద్ధి చెందిన కరువుజిల్లాల్లో ఒకటిగా ఉన్నప్పటికీ, స్వాతంత్ర్య దీప్తికి, సాహితీ సాంస్కృతిక చైతన్యానికి తనదైన ప్రత్యేకస్థానం కలిగి ఉన్న ప్రాంతం.

స్వాతంత్ర్య పోరాట కాలంలో అనంతపురం జిల్లాలో 1908 లో జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రారంభించబడింది. పి. కేశవపిళ్ళై అధ్యక్షుడిగా, పి. ఆదిమూర్తిరావు, టి. శివశంకరం పిళ్ళై ఉపాధ్యక్షులుగా, బాలజీరావు, వై. శేషప్పలు కార్యదర్శులుగా ఈ కమిటీ రూపొంది భారత జాతీయ కాంగ్రెస్‌కు అనుబంధ సంస్థగా కూడా సేవలిందించింది. జాతీయోద్యమంలో భాగంగా సామాజిక చైతన్యం పెంపొందించడంలో గాంధేయ భావజాలము, మద్యపాన నిషేధము, గ్రంథాలయ ఉద్యమము, ప్రముఖపాత్ర పోషించినప్పుడు ఇక్కడి ప్రజలు విశేషంగా స్పందించారు.

**అనంత జిల్లాలో గాంధీజీ పర్యటనలు :**

స్వాతంత్ర్య పోరాటంలో చురుకుగా ఉన్న అనంతపురం జిల్లాలో మహాత్మాగాంధీగారు మూడు పర్యాయాలు అనంతపురం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటనలు చేశారు. ఆ ప్రభావం అనంతపురం జిల్లాపై ఎంతో ప్రభావాన్ని చూపింది. మొదటిసారి 1921లో తిలక్ నిధి వసూలు కార్యక్రమం కోసం ఈ జిల్లాలో అడుగుపెట్టారు. 1929లో రెండో పర్యాయం ఖద్దరునిధి వసూలు కార్యక్రమం సందర్భంగా ఈ జిల్లాలో పర్యటించారు. 1933-34 సంవత్సరాల కాలంలో హరిజన యాత్ర సందర్భంగా గాంధీగారు

ఈ జిల్లాలో పర్యటించారు. ఇలా అన్ని సందర్భాలలో అనంతపురం జిల్లా వ్యాప్తంగా వేలాదిమంది ప్రజలు వారి గ్రామాల నుండి కాలినడకతోను, ఎద్దుల బళ్ళ మీదుగా ఆయనను సందర్శించడానికి, ఆయన సందేశం వినడానికి వచ్చేవారు. ఆయన సంచార యాత్రలలో చాలా చురుకుగా పాల్గొన్నారు.

**అనంత జిల్లాలో గాంధీజీ తొలి పర్యటన :**

మహాత్మాగాంధీ అనంతపురం జిల్లాలో మొట్టమొదటిసారి అడుగుమోపింది 1921వ సంవత్సరం సెప్టెంబరు 29వ తేది సాయంత్రం 5 గంటలకు తాడిపత్రి రైల్వేస్టేషన్. ఆయన తిలక్ నిధి వసూలుకు విరాళాలు స్వీకరిస్తూ తిరుపతి, రాజంపేట, కడప సందర్శనలను ముగించుకొని కర్నూల్‌కు వెళుతూ, మార్గమధ్యంలో తాడిపత్రిలో నిర్వహించిన సభలో పాల్గొన్నారు. ఆనాటి సభలో కలచవీడు వెంకటరమణాచార్యులు గాంధీజీపై స్తుతిపద్యాలు రచించి, స్వాగతవచనాలు పలికారు. గాంధీజీ ఉపన్యాసాన్ని గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు తెలుగులోకి అనువాదం చేశారు.

గాంధీజీ తాడిపత్రి సందర్శన కార్యక్రమంలో పురపాలకసంఘం వారు, కాంగ్రెస్ సంఘం వారు సన్మానపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీగారు హిందీలో ఉపన్యాసం చేశారు. ఆయన తన ఉపన్యాసంలో ఖిలాపత్ ఉద్యమానికి సహకరించచాలని, మతసామరస్యానికి దోహదం చేయాలని, వర్ణవివక్ష తొలగిపోవాలని తాడిపత్రి ప్రజలకు సూచించారు. అంతేకాకుండా ప్రజలందరూ స్వదేశీ ఉద్యమం అవలంబించాలనీ, నూలు వడకటాన్ని స్త్రీ, పురుషులందరూ విధిగా నేర్చుకోవాలని సూచించారు. పురుషులు జూదం, తాగుడు, స్త్రీలోలత్వం వంటి వ్యసనాలు మానుకోవాలని ఉద్బోధించారు.

అనంతరం గాంధీగారికి తాడిపత్రి పౌరులు సన్మానం నిర్వహించారు. తిలక్ స్వరాజ్య నిధికి 1500 రూపాలయలు అందించారు. ఆభరణాలు అనేకం ఇచ్చారు. వాటిని అప్పటికప్పుడు వేలం వేసి ఆ వచ్చిన డబ్బును కూడా నిధికి జమచేశారు. అదేరోజు గాంధీగారు రైలులో కర్నూలు వెళుతూ గుత్తి, గుంతకల్లు స్టేషన్‌లలో ప్రజలను ఉద్దేశించి స్వదేశీ వ్రతం, స్వరాజ్య సంపాదన గురించి ఉపన్యసించారు. వేలాదిమంది ప్రజలు గాంధీజీ దర్శనార్థం దారి మధ్యలో స్టేషన్‌లో వేచివుండి భక్తిభావంతో ఆయనను దర్శించుకున్నారు. మరుసటి రోజు కర్నూలు జిల్లా సందర్శన ముగిసిన తర్వాత తిరుగు ప్రయాణంలో గాంధీజీ మధ్యాహ్నం 2 గంటలకు గుంతకల్లు రైల్వేస్టేషన్‌కు చేరారు. అక్కడి నుండి బళ్ళారికి వెళ్ళారు. తిరిగి ఇదే మార్గం ద్వారా బొంబాయి మెయిల్‌లో బొంబాయికి వెళ్లాడు.

గాంధీజీని చూడటానికి ఇప్పట్లా రవాణా సదుపాయాలు లేకున్నా, ప్రజలు ఎద్దులబండ్లు, గుర్రపుబండ్లు తదితర వాటిల్లో, కాలినడకన కూడా వెళ్ళారట. ఇల్లూరు నుండి నీలం చిన్నపరెడ్డి (మాజీ రాష్ట్రపతి నీలంసంజీవరెడ్డిగారి తండ్రిగారు), తరిమెల సుబ్బారెడ్డి (ప్రఖ్యాత కమ్యూనిస్టు నాయకుడు తరిమెల నాగిరెడ్డిగారి తండ్రిగారు), పప్పూరి రామాచార్యులుగారు (నీలం సోదరులకు ఉపాధ్యాయుడు) తాడిపత్రికి వెళ్ళారు. గాంధీజీ ఉపన్యాసం విని స్ఫూర్తి పొంది తిరిగి వచ్చిన తర్వాత తరిమెల ప్రాంతాల్లో ఖద్దరు వస్త్రధారణ, చరఖా వడకటం, కల్లుసారాయి అంగళ్ళు లేకుండా చేయడం వంటి చర్యలు వారు చేపట్టారు. తరువాత దశాబ్దాల తరబడి పప్పూరు రామాచార్యులు స్వాతంత్ర్య ఉద్యమకాలంలోనూ, స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాతిగానూ సమాజ సేవలో చురుకైన పాత్ర వహించడానికి మహాత్మాగాంధీ కావించిన ఈ పర్యటన ప్రధాన కారణమైంది.

1925వ సంవత్సరంలో బొంబాయి మెయిలులో మద్రాస్‌కు వెళుతున్న సమయంలో దారిమధ్యలో ఉన్న గుంతకల్లు స్టేషన్‌లో కొంతసేపు రైలు ఆగినపుడు ప్రజలు ఆయనను తండోపతండాలుగా దర్శించుకున్నారు. ఆ సమయంలో గుంతకల్లు కాంగ్రెస్ కమిటీవారు నూలుదండలతో, జాతీయ పతాకాలతో గాంధీజీని ఆహ్వానించి, సత్కరించారు. అయితే ఈ పర్యటనలో ఆయన ప్రసంగం చేయలేదు. కొద్దిసేపు మాత్రమే స్టేషన్‌లో ఆగారు.

**అనంత జిల్లాలో గాంధీజీ రెండో పర్యటన :**

హాత్మాగాంధీ ఆంధ్రదేశంలో పలు ప్రాంతాలను సందర్శిస్తూ రాయలసీమ పర్యటనలో భాగంగా అనంతపురం జిల్లాను రెండోదఫా సందర్శించారు. 1929 మే నెలలో ఈ పర్యటన జరిగింది. మే నెల 16వ తేది గాంధీగారు మదనపల్లి నుండి ప్రయాణం మొదలుపెట్టి కదిరి మండలంలోని నాగిరెడ్డి పల్లిలో అనంతపురం జిల్లాలో అడుగుపెట్టారు. గాంధీగారు నాగిరెడ్డిపల్లికి వచ్చిన తరుణంలో మాచిరెడ్డి వెంకటస్వామిరెడ్డి ఆయనకు స్వాగతం పలికి నిధి సేకరణకు 116 రూపాయలు భక్తితో సమర్పించారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో వేదిక ముందు 20 రాట్నాలను, సభకు వచ్చిన వారిలో చాలామంది ఖద్దరు ధరించి ఉండటం గమనించిన గాంధీగారు ప్రజలను అభినందించారట. అనంతరం కదిరిలో నిర్వహించిన సభలో గాంధీజికి సమర్పించిన పౌర సన్మాన పత్రాన్ని అప్పటికప్పుడు వేలం వేయగా, కురుమాల వెంకటరెడ్డిగారు దానిని 25 రూపాయలకు కొన్నారట. కదిరి ప్రజలు ఖద్దరు నిధికి 1210 రూపాయలు సమర్పించారట. కుటాగుళ్ళలో వై. నారాయణరెడ్డిగారు 116 రూపాయలు, ప్రజలు 116 రూపాయలు ఖద్దరు నిధికి విరాళం అందించారు.

రాత్రి 8.30 గంటలకు కారులో ధర్మవరం చేరుకున్న ఆయన అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ధర్మవరంలో 1148 రూపాయలు నగదు విరాళంగా ఇచ్చారు. అక్కడ కేవలం 10 నిమిషాలు మాత్రమే గాంధీజీ మాట్లాడి, అనంతపురం పట్టణానికి వెళ్ళిపోయారు.

అనంతపురం పట్టణంలో పాతూరులోని వేణుగోపాలస్వామి దేవాలయ సమీపంలోని తలంబ్రాల మంటపంలో గాంధీజీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా దాదాపు 1500 వరకు నగదు, ఆభరణాలు స్వరాజ్య నిధికి జమచేయబడ్డాయట.

రెండోదఫా గాంధీజీ అనంతపురం పర్యటనకు వచ్చిన సందర్భమంగా మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డిగారు (అప్పటికి కాంగ్రెస్ యువనాయకుడు) మొదటిసారిగా గాంధీగారి దర్శనాన్ని చేసుకున్నారు. తర్వాతి కాలంలో క్రియాశీల రాజకీయాల్లో ఎంతో చురుకైన పాత్ర వహించి, ఆంధ్రరాష్ట్రం ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, పార్లమెంట్ స్పీకర్గా, భారత రాష్ట్రపతిగా ఎన్నో పదవులు అలంకరించి అనంతపురం జిల్లాకు కీర్తిప్రతిష్టలు తీసుకువచ్చారు

రెండోదఫా పర్యటన 1929 మే 17న అనంతపురం నుండి తాడిపత్రి వరకు సాగింది. అనంతరం కడపజిల్లా ముద్దనూరుకు వెళ్ళారు. రెండో దఫా పర్యటనలో ఈ జిల్లా నుంచి సుమారు 5330 రూపాయలు స్వరాజ్య నిధికి అందజేయబడినట్లుగా చరిత్రలో నమోదైంది.

**అనంత జిల్లాలో గాంధీజీ తుది పర్యటన :**

మహాత్మాగాంధీగారు అనంతపురం జిల్లాను చివరిసారిగా 1934 (జనవరి)లో పర్యటించారు. జనవరి 3వ తేది పెద్దవడుగూరు గ్రామంలో భూస్వామి, గ్రామీణ సౌభాగ్యానికి విశేషంగా కృషిచేసిన గాంధేయవాది, త్యాగశీలి, దేశభక్తుడు అయిన కుమ్మెత చిన్నారపరెడ్డి ఇంటిలో బసచేశారు. గాంధీగారి వెంట మల్కాని, మౌలానా సుభాని, మాగంటి బాపినీడు, గాడిచర్ల హరిసర్వోత్తమనాయుడు, కల్లూరు సుబ్బారావు తదితరలు ఉన్నారు. ఉదయం 7 గంటలకే గ్రామంలో వేలాదిమందితో బహిరంగ సభ నిర్వహించారు. గాంధీగారు హిందీలో చేసిన ప్రసంగాన్ని సత్యనారాయణగారు తెలుగులో అనువదించారు. ఈ సభలో హరిజన నిధికి రూ.1116 విరాళం ఇచ్చారు. గాంధీజీ ఆ మొత్తాన్ని అనంతపురంలో నిర్వహిస్తున్న హరిజన హాస్టల్ కేశవ విద్యానికేతన్కు ఇచ్చివేశారు. పెద్దవడుగూరు సభ అనంతరం గుత్తి హైస్కూల్ మైదానంలో ఏర్పాటైన బహిరంగ సభలో మాట్లాడారు. గుత్తి పౌరులు 116 రూపాయలు, హరిజన సేవక సంఘం వారు 116 రూపాయలు విరాలం ఇచ్చారు. అనంతరం గుత్తి నుంచి గుంతకల్లు వెళ్ళే మార్గంలో తిమ్మనచెర్లలో ఉన్న తోళ్ళ పరిశ్రమ కర్మాగారం వద్ద ఉన్న హరిజనవాడను సందర్శించారు. అక్కడ పరిశ్రమ యజమానులు 116 రూపాయలు, కార్మికులు 50 రూపాయలు విరాళాలను అందించారు. గుంతకల్లు లో నిర్వహించిన సభలో 467 రూపాయలు, 13 రూపాయలు విరాళాలుగా వచ్చాయి. కొనకొండ్లలో గాంధీజీకి 118 రూపాయలు, వజ్రకరూరులో 90 రూపాయలు హరిజన నిధికి విరాళంగా వచ్చాయి.

ఉరవకొండ మీదుగా అనంతపురం వచ్చిన గాంధీగారికి ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. సాయంత్రం వేళ నిర్వహించిన బహిరంగ సభకు పెద్దఎత్తున ప్రజలు హాజరయ్యారు. హరిజన నిధికి 1116 రూపాయలు విరాళం అందింది. అనంతపురం నుండి బయలుదేరి హిందూపురం చేరుకున్నగాంధీగారు జయకీర్తిగారి ఇంటిలో బసచేశారు. ఉదయం 7 గంటలకు హిందూపురంలో బహిరంగ సభను నిర్వహించారు. ప్రజలు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు. అక్కడి నుంచి గాంధీగారు మైసూరు నుంచి వచ్చిన బృందంతో కలిసి మైసూరుకు వెళ్ళిపోయారు.

గాంధీగారి మూడు పర్యటనల ప్రభావం రాజకీయంగా జిల్లాను ఎంతో బలోపేతం చేసింది. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో జిల్లా నుంచి పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనేలా చేయడంలో, ప్రజలలో దేశభక్తి భావం పెంపొందించడంలో, సాంఘిక సంస్కరణలు తీసుకురావడంలో గాంధీగారి పర్యటనలు చాలా ప్రభావాన్ని చూపాయని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

ఎంతోమంది స్వాతంత్ర్య సమర వీరులు అనంతపురం జిల్లా నుండి జైళ్ళకు వెళ్ళారు. స్వరాజ్య ఉద్యమంలో తీవ్రంగా పాల్గొన్నారు. మహాత్మాగాంధీగారు భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో ఇచ్చిన ప్రతి పిలుపును ఈ జిల్లా నాయకులు అందుకొని, తీవ్రంగా భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. ముఖ్యంగా మహిళలు ఎంతో ఉత్సాహంగా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. ఇల్లూరు కేశమ్మ, ఐదుకల్లు రాజమ్మ, ప్రతాపగిరి శాంతాబాయి, కరణం ఉమాబాయమ్మ, వెంకమ్మ, రబియాబీ, హట్టి పిళ్ళెమ్మ, ఛాయాపురం పుల్లమ్మ వంటివారు గాంధీజీవల్ల ప్రభావితులై ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నారు. గాంధీజీ నాయకత్వంలో మొదలైన సత్యాగ్రహంలో కేశమ్మ పాల్గొని జైలుకు వెళ్ళింది. 1942 లో క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో పాల్గొని రాయవేలూరు జైలులో జైలుశిక్షను అనుభవించింది.

గాంధీజీ పర్యటనలను అనంతపురం జిల్లా వాసులు చాలా పదిలపరచుకున్నారు. ఆయన నడచిన ప్రతి అడుగులోనూ తోడై నిలిచారు. ఆయన అనంత సందర్శన గుర్తుగా "గాంధీబజారు" అని ఒక ప్రాంతానికి పేరు పెట్టుకున్నారు. ఆయన ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు. ఆయన జ్ఞాపకాలను పుస్తకాల్లో పదిలంగా భద్రపరచుకున్నారు. ❀

**ఆధార గ్రంథాలు**

1. ఆంధ్రప్రదేశ్‌లో గాంధీజీ – తెలుగు అకాడమీ ప్రచురణ (1978)
2. 'అనంత' జిల్లాలో గాంధీజీ – డా॥ పతికి రమేష్ నారాయణ
3. అనంతపురం జిల్లా చరిత్ర (1928) – కలవటాల జయ రామారావు
4. ఇల్లూరు కేశమ్మ – విద్వాన్ దస్తగిరి (12–08–2001న ఆకాశవాణి అనంతపురం కేంద్రం నుండి ప్రసారితం)
5. అనంతదర్శిని – డా॥ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి (సంపాదకులు), ఎబిసి పబ్లికేషన్స్, అనంతపురము, ఫిబ్రవరి (2009)

# స్వాతంత్ర్య ఫలం

**డా. తొట్టెంపూడి శ్రీ గణేష్,** ఆచార్యులు కృత్రిమ, బౌద్ధికత విభాగం,
యస్.ఆర్.హెచ్. విశ్వవిద్యాలయం, జర్మనీ



మాతృదేవోభవ.డెబ్బై అయిదు సంవత్సరాల స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. ఈ కార్యక్రమం ఈ రోజు మన మహిళా కళాశాల నిర్వహించడం ముదావహం. స్వాతంత్ర్యం అంటే నా చిన్నప్పుడు జెండా ఎగురవేయడం, చాక్లెట్లు తినడం అని అనుకునేవాన్ని. కానీ, నా ఉద్దేశ్యంలో స్వాతంత్ర్యం అంటే ప్రశ్నించే హక్కు.

నేను ఏడవ తరగతి చదివేటప్పుడు దుర్గాబాయి దేశముఖ్ పాఠం ఉండేది. అందులో ఒక కార్యక్రమానికి నెహ్రూ గారు టికెట్ లేకుండా వస్తే ఆమె "టికెట్ లేకుండా ఎందుకు లోనికి ప్రవేశించారు" అని అడిగారు. అప్పటికి ఆమె ఒక విద్యార్థిని. ఈ సంఘటన నాకు ఇంకా గుర్తుంది. ఏ దేశమైనా, అబివృద్ధి చెందాలి అంటే, ప్రజలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో బతకాలి అంటే ముఖ్యంగా కావలసింది ప్రశ్నించడం. ఆ ప్రశ్నించడం అనేది మీ జీవితం లో అడుగడుగునా మీరు జీర్ణించుకోవాల్సిన అవసరం ఉంది. అది లేనప్పుడు మనకీ స్వాతంత్ర్యం వృధా. నేటి యువత ప్రశ్నించడమే మరిచిపోయింది. ఎవరో రావాలి ఏదో చేయాలి అనుకోవడంలోనే మన జీవితం సాగిపోతుంది.

మనం అందరం డెబ్బై అయిదు సంవత్సరాల స్వాతంత్ర్య వేడుకలను జరుపుకుంటున్నాం. మీకు ఈ స్వాతంత్ర్యం సుఖం ఇచ్చిందా ? సంతోషాన్ని ఇచ్చిందా ? మీ స్వాతంత్ర్యం మీ ఊళ్లోనే స్వేచ్ఛగా బతికేటట్టు చేసిందా ? ఇప్పుడున్న స్వాతంత్ర్యంలో చాలామంది సమానత్వాన్ని కోల్పోతున్నారు. మహిళలను ఒకరకంగా, పురుషులను ఒకరకంగా చూడటం, బీద, ధనిక వ్యత్యాసాలు సమాజంలో పోవాలి. అప్పుడే నిజమైన స్వాతంత్ర్యం.

చాలామంది మేధావులు పొట్ట చేత పట్టుకొని విదేశాలకు వలసపోతున్నారు. ఆ మేధో వలస ఆగిపోవాలి. ఎంతో మంది విద్యార్థులు ఉన్నత చదువులకోసం విదేశీ బాట పడుతూ, భారత దేశ సంపదను విదేశాల్లో వినియోగిస్తున్నారు. రోజురోజుకూ ఈ సంఖ్య పెరుగుతుంది. దీనిని అరికట్టగలగాలి. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందరికీ అందించగలగాలి, విదేశీ విద్యార్థులను ఎక్కువ సంఖ్యలో ఆకర్షించ గలగాలి.

ఒక బస్సులో కూర్చున్నపుడు ఒక ముసలివాడు వస్తే ఎంతమంది యువత లేచి నిలబడుతున్నారు. రోడ్డు మీద వెళు తున్నప్పుడు 'ఆక్సిడెంట్' అయితే అతన్ని పట్టుకొని లేపి అతనికి సాయం చేసేవాళ్ళు ఎంతమంది. తల్లిదండ్రులు విద్యార్థులకు ఆ విలువలను నేర్పిస్తున్నారు ? అని ప్రశ్నించుకోవాలి. అంబేద్కర్ జయంతి రోజో, వివేకానందుని జయంతి రోజో మొహం కనపడకుండా దండలు వేస్తాం కానీ, ఆ స్పూర్తి తో పనిచేసేవాళ్ళు, ఆ స్పూర్తితో తప్పుని తప్పని ఖండించేవాళ్లు ఎంతమంది.

1947లో మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు చాలా ఐరోపా దేశాలు, జర్మనీ, నెదర్లాండ్స్ లాంటి దేశాలకు తినడానికి తిండి కూడా లేదు. ఇప్పుడు మనం డెబ్బై అయిదు సంవత్సరాల ఉత్సవాలు జరుపుకుంటుంటే, సింగపూర్ యాబై

సంవత్సరాల స్వాతంత్ర్యాన్ని జరుపుకుంటుంది. 1985 లో సింగపూర్ శ్రీలంకను చూసి మనం కూడా శ్రీలంక లాగా అభివృద్ధి చెందాలని అనుకునే వాళ్ళట. కానీ ఇప్పుడు సింగపూర్ ఎంతలా అభివృద్ధి చెందిందో మనం చూస్తున్నాం. దాని విస్తీర్ణం మన రెండుమూడు జిల్లాలంత కూడా ఉండదు. రెండు మూడు గంటల్లో దేశం చివరి వరకు ప్రయాణించొచ్చు. వాళ్ళు ప్రతీ ఒక్కటీ దిగుమతి చేసుకోవాల్సిందే. అది ఏ వసతులు లేని దేశం. పంటలు కూడా సరిగా పండవు. ఉన్న వనరుల్ని సక్రమంగా వినియోగించుకొనడంతో ఆ అభివృద్ధి సాధ్యమైంది.

మనం చదువుకుంటున్నామంటే ఈ చదువు కేవలం ఉద్యోగం కోసం కాదు. నీ దేశం కోసం, నీ సమాజం కోసం వెచ్చించాల్సిన అవసరం ఉంది. గాంధీ గారికి స్ఫూర్తి నిచ్చిన దేశం 'సౌత్ ఆఫ్రికా' గాంధీ గారి మనవరాలు ఆదేశ పౌరురాలిగానే జీవిస్తున్నారు. నేను ఆ దేశాన్ని సందర్శించినప్పుడు ఆమెను కలిశాను. "జాతిపిత గా భారతదేశం గౌరవించే మహాత్ముని మనుమరాలిగా ఇక్కద జీవిస్తున్నారెందుకు" అని అడిగాను. నేను అక్కడే ఉంటే మా అన్న లాగా నన్ను కూడా పక్కన పడేసేవారు. నేను ఇక్కడ ఉండటం వల్ల కొంచమైనా గుర్తింపు ఉంది అన్నారు. ఏదో ఒక కార్యక్రమానికైనా నన్ను అక్కడికి పిలుస్తున్నారు అన్నారు. నేను జీవనోపాధికి ఇక్కడకు వచ్చినా, నా ఆశయాలకు అనుగుణంగా ఉండగలుగుతున్నాను అన్నారు. ఉపన్యాసాలు ఇవ్వడం కాదు వాటిని జీవితంలో కొంతవరకైనా ఆచరించగలగాలి. ఆ దమ్ము, ధైర్యం ఉన్నవాళ్ళ నాయకత్వం ఈ దేశానికి కావాలి. అలాంటి వాళ్ళ అవసరం మనదేశానికి ఉంది.

"సుజలాం, సుఫలాం, మలయజ శీతలా, సస్య శ్యామలాం, మాతరం వందేమాతరం" అని అంటున్నాం. పక్క ఊరు వెళితే 'బిస్లరీ' నీళ్ళు కొనుక్కొని తాగవలసి వస్తుంది. మామూలు నీళ్ళు తాగితే జ్వలుబు, దగ్గు వస్తాయి. ఏమైంది 'సుజలం'. ఎరువులు లేకుండా ఒక కూరగాయ, పండూ పండించలేని స్థితి మనది. ఏమైంది 'సుఫలం'

చలికాలంలో ఢిల్లీ వెళితే ఆర్టిఫీషియల్ మాస్క్ లేదా ఆక్సిజన్ లేకుండా మనం బయటికి వెళ్లలేము. ఏమైంది 'మలయజ శీతలా' నికి ?

రైతు పంట వేస్తే ఆత్మహత్యలు చేసుకోకుండా, రైతు స్వయంగా తాను పండించి తన సంసారాన్ని, కుటుంబాన్ని పోషించుకోగలడా ? పోషించుకోలేడా ? అనేది ఇంకా ప్రశ్నార్థకంగానే ఉంది. ఏమైంది సస్యశ్యామలం ? ఎక్కడ ఉన్నాం మనం. ఒకసారి యువత ఆలోచించాలి. మీరు చదువుకునే చదువు మీ కుటుంబానికి ఉపయోగపడుతుందా అనేది ఆలోచించాలి. అది జరుగనప్పుడు మళ్ళీ ఉద్యమాలు రావాల్సిందే.

ప్రపంచం అంతా సాంకేతికత వైపు పరుగులు పెడుతుంటే, 21వ శతాబ్దంలో కూడా ఇంకా కులాలు, మతాలు అని ఏంటి ఈ గొడవలు ? అవన్నీ వీడండి. ప్రశ్నించే తత్వాన్ని అలవరచుకోండి, నైపుణ్యాలను అలవరచుకోండి, సాంకేతికంగా ఎదగండి అభివృద్ధి పథంలో పయనించండి. ❁

# జాతీయోద్యమం

**డా. బూసి వెంకటస్వామి,** తెలుగుశాఖ ఆచార్యులు, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం



ప్రతిష్ఠాత్మకమైన గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాలలో 'ఆజాదీ కా అమృత మహోత్సవం' లో భాగంగా డెబ్భై అయిదు సంవత్సరాల స్వాతంత్ర్య వజ్రోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ అంతర్జాల సదస్సుకు సందర్భోచితంగా "జాతీయోద్యమం అనుభవాలు-జ్ఞాపకాలు-సాహిత్యం" అనే విభిన్న అంశాన్ని ఎంపిక చేసుకోవడం ముదావహం.

"జాతీయోద్యమం అనుభవాలు-జ్ఞాపకాలు-సాహిత్యం" అనే అద్భుతమైన శీర్షిక పెట్టడం వెనుక ఒక మంచి ఆలోచన ఉంది. 'తెలుగు సాహిత్యం - దేశభక్తి', 'తెలుగు సాహిత్యం - జాతీయోద్యమం' అనే శీర్షికలు మనకు కనిపిస్తూనే ఉన్నాయి. ఈ సదస్సులో ప్రత్యేకత ఏమిటి అంటే 'జ్ఞాపకాలు-అనుభవాలను' తీసుకోవడం చాలా గొప్ప విషయం. ఎందుకంటే మనం తెలుగు సాహిత్యాన్ని చదువుతూ ఉన్నప్పుడు స్వాతంత్ర్య సమరయోధులు మనకు ఎంతోమంది కనిపిస్తున్నారు. అయితే తెలుగు సాహిత్యంలో ఆ దేశభక్తి పూరితమైన భావజాలాన్ని తమ రచనలో పొందుపరిచినటువంటి కవులు మనకు ఇబ్బడిముబ్బడిగా కనిపిస్తారు.

నేను మొవ్వ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2006 నుండి 2012 వరకు పని చేశాను. ఆ సమయంలో ఒకసారి విద్యార్థులను తీసుకొని పింగళి వెంకయ్య గారి స్వస్థలమైన 'బట్లపెనుమర్రు' ను సందర్శించడం జరిగింది. అక్కడ విద్యార్థులకు మన జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య గారి ఇల్లు ఇది అని చూపించడం జరిగినది. ఆ జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఇప్పటికీ కూడా కొందరు విద్యార్థులు నాకు ఫోన్‌లు చేస్తూ ఉంటారు. అప్పుడు అక్కడ వారి సంబంధీకులు ఎవరూ లేరు కానీ విద్యార్థులు ఆ ఇంటిని దర్శించి ప్రేరణ పొందారు. మనం విద్యార్థులకు దేశభక్తి పూరితమైన విషయాలను చెబుతుండడం, జాతీయోద్యమ నాయకులను గూర్చి తెలియజేస్తుండడం, వారికి సంబంధించిన జ్ఞాపకాలను చూపించడం, దేశభక్తుల చరిత్రలను విశదీకరించడం ద్వారా విద్యార్థులు కచ్చితంగా చైతన్యవంతం అవుతారు. వారు తప్పకుండా ఆ దేశభక్తి భావాలను అలవరచుకుంటారు. ప్రస్తుత తరుణంలో అది చాలా అవసరం. ఈ బృహత్తర కార్యక్రమానికి గుంటూరు మహిళా కళాశాల శ్రీకారం చుట్టడం చాలా సంతోషం.

దివి సీమలో ఉన్న స్వాతంత్ర్య సమరయోధుల యొక్క చరిత్రను చాలామంది దివిసీమ రచయితలు అక్షరీకరించారు. ఉదాహరణకు పోలవరపు కోటేశ్వరరావు గారి కథల్లో జాతీయోద్యమ భావాలు వ్యక్తమవుతాయి.

ముదిగొండ శివప్రసాద్ గారు ఈమధ్యనే 'వంశధార' నవల రాశారు. అది ఒక సాంఘిక నవల. వంశధార అనేటువంటిది శ్రీకాకుళంలో ఉన్నటువంటి ఒక నది. ఆ నది దగ్గర నుండి మన కథానాయకుడు చెన్నపట్నం వరకు ప్రయాణం చేసి, మద్రాసులో చలనచిత్ర రంగంలో అత్యున్నత స్థాయికి వెళతాడు. ఇక్కడ వంశధార అని శ్రీకాకుళం నుండి ప్రారంభించారు కానీ, ఆ వంశధార కథ స్వాతంత్ర్యోద్యమానికి ముందుది. స్వాతంత్ర్యోద్యమానికి ముందే అక్కడ చుట్టుపక్కల ఉన్నటువంటి గ్రామాలలో దేశభక్తి పూరితమైన చిన్నచిన్న నాటకాలు వేసేవారు. ఆ సమయంలో బ్రిటిష్ వాళ్ళు వాళ్ళని వెంటపడి చంపి కాలువల్లో పడేసేవారు. అలాంటి సంఘటనలను చదువుతూ ఉంటే హృదయం భారమవుతుంది.

ముస్లిములు కూడా దేశభక్తి ప్రేరేపిత రచనలను అందించారు. ఉదాహరణకు తెనాలికి చెందిన మహమ్మద్ నవీజుద్దీన్ ఎం.డి. సౌజన్య అనే కలం పేరుతో ప్రసిద్ధి చెందారు. ఆయన ఎన్నో నవలలు, నాటకాలు రాశారు. వాళ్ళ నాన్న గారు ఖద్దర్ ఇస్మాయిల్‌గా పేరుపొందారు. ఆ రోజుల్లో ముస్లిములు అందరూ కూడా వారిని వెలివేశారు. ఎందుకంటే గాంధీగారి ప్రభావంతోటి మాంసాహారాన్ని కూడా మానేశారు. ఆయన కూతురు పెళ్లి చేసినప్పుడు శాకాహార భోజనం పెట్టారు. దాంతో ముస్లిం పెద్దలు వారిని దూరం పెట్టారు. ఇలాంటి సంఘటనలు ఆ రోజుల్లో కోకొల్లలు. ఇలాంటి వన్నీ చిన్న చిన్న విషయాలే కావచ్చు కానీ, జాతీయోద్యమంలో భాగాలే. ఇలాంటి విషయాలన్నీ ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. భావి తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉంది. దానికి ఈ సదస్సు తోడ్పడుతుంది. ❀

# దేశాభిమాని త్యాగశీలి శ్రీకోపల్లె హనుమంతరావు

మణినాథ్ కోపల్లె

"శ్రీకోపల్లె హనుమంతరావుగారి తీక్షణమగు బుద్ధి,
గొప్ప స్వార్థ త్యాగము నిష్కళంకమైన దేశభక్తి మనం మరువలేనిది.
త్యాగమూర్తులయిన వారిచే నిర్వహించబడుతున్న ఈ విద్యాలయం
బందరు పట్టణంలో ప్రతిష్టితం కావటం ఆంధ్రులెల్ల గర్వించదగింది."

– మహాత్మాగాంధీ

స్వాతంత్ర్య సమరంలో మౌనంగా దేశం కోసం పోరాడిన వ్యక్తి శ్రీ కోపల్లె హనుమంతరావుగారు. ఒకరు తనదైన పంథాలో జాతీయ విద్యకై పోరాడిన వ్యక్తి. ఆ రోజుల్లో జాతీయ విద్య కూడా స్వాతంత్ర్య సిద్ధికి ఒక సాధనమని ఎంచారు.

కోపల్లె హనుమంతరావుగారు జాతీయ విద్య ద్వారా ప్రజలలో చైతన్యం తీసుకురావాలని అహర్నిశలు కృషి చేసి మచిలీపట్నంలో కొందరు ప్రముఖులతో కలిసి 1910 లో ఆంధ్ర జాతీయ విద్యా పరిషత్‌ని స్థాపించారు.

**ఆనాడు ...**

దేశ స్వాతంత్ర్యం కోసం జరిగే పోరాటంలో మహాత్మా గాంధీజీ స్వాతంత్ర్య ఉద్యమానికి ఆధ్వర్యం వహించిన తరువాత విదేశీ ఉద్యోగాలను, విదేశీ చదువులను బహిష్కరించి జాతీయ ఉద్యమాన్ని, జాతీయ విద్యావిధానాన్ని నేర్చుకొనవలసిందిగా కోరారు. విద్యావిధానానికి వచ్చేటప్పటికి మహాత్మా గాంధీజీ కంటే ముందే దేశం మొత్తంలో మూడు చోట్ల ప్రధానమైన ఉద్యమాలు ప్రారంభమైనాయి. రవీంద్రనాథ్ ఠాగూర్ ఆధ్వర్యంలో శాంతినికేతన్, బెనారస్‌లో మదన్‌మోహన్ మాలవ్యా అధ్వర్యంలో బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, మచిలీపట్నంలో కోపల్లె హనుమంతరావుగారి ఆధ్వర్యంలో జాతీయ కళాశాలలు ప్రారంభమైనాయి.

బందరు జాతీయ కళాశాలకు ఒక విశిష్టమైన చరిత్ర ఉన్నది. బందరు త్రయంగా పిలువబడిన డా॥ భోగరాజు పట్టాభి సీతారామయ్య, ముట్నూరి కృష్ణారావు, కోపల్లె హనుమంతరావులు ప్రధాన పాత్ర వహించారు. ఆంధ్రదేశంలో ఆనాటి రోజుల్లో స్వాతంత్ర్య ఉద్యమాలకు బందరు ప్రధాన కేంద్రమయింది. మహాత్మాగాంధీ సైతం బందరు జాతీయ కళాశాలలో ప్రసంగించారు.

బందరులో అనేక మంది ప్రముఖులు జాతీయ కళాశాలలో పనిచేస్తుండేవారు. స్వాతంత్ర్య ఉద్యమానికి జాతీయ కళాశాల పరివ్యాప్తమైంది. జాతీయ ఉద్యమానికి వెన్నెముకగా నిలిచిన జాతీయ కళాశాల చరిత్ర ఆంధ్ర దేశపు స్వాతంత్ర్య ఉద్యమంలో భాగమైనది. దుగ్గిరాల గోపాల కృష్ణయ్యగారి నుండి బెజవాడ గోపాలరెడ్డి వరకు అధ్యాపకులు, విద్యార్థులు అనేకమంది పనిచేసేవారు. వంగ దేశానికి శాంతినికేతన్ ఎలాగో ఆంధ్ర దేశానికి జాతీయ కళాశాల అలాంటిది.

ముఖ్యంగా జాతీయ విద్యకై వారు తన జీవితాన్ని త్యాగం చేశారు. మానవ జీవితంలో బాల్యం, కౌమార్యం దశలు ముఖ్యమైనవి. ఈ దశే భవిష్యత్తుకి పునాదులు వేసే కాలం. ఆ పునాదులు అక్షర జ్ఞానంతో జ్ఞాన సముపార్జనతో విజ్ఞానవంతంగా ఉంటే వినయ సంపదలతో, సంస్కార వంతంగా రాణించే అవకాశం ఉంటుంది. జీవితంలో ఎన్నో సాధించ గలుగుతారు. ఉన్నత శిఖరాలని చేరుకోగలుగుతారు. అందుతే అందరికీ విద్య గురించి ఆయన ఎక్కువ ఆరాటపడేవారు.

ఆంధ్ర దేశంలో ముఖ్యంగా జాతీయోద్యమాలకి ఊపిరి పోసింది బందరు పట్టణం. ఆ రోజుల్లో తెల్లవారి కింద బానిసతనం కన్నా ఆత్మ వంచన మరొకటి వుండదని భావించేవారు. భారత దేశంలో తెల్లవారి పాలనలో నడిచే విద్యాలయాలన్నీ ఆంగ్లేయుల పద్ధతిలో వారికనుకూలంగా నిర్బంధ బోధనతో ఉండేవి. ఆ విద్యని వ్యతిరేకిస్తూ భారత దేశ మంతా జాతీయ విద్యకై నిరసన మొదలైంది. ఉద్యమాలూ నడిచాయి. మన తెలుగునాట కూడా జాతీయ విద్యకై ప్రత్యేక పాఠశాలలు, కళాశాలలు నెలకొల్పాలనే సంకల్పంతో బందరు పట్టణంలో"ఆంధ్ర జాతీయ కళాశాల" వెలిసింది. ఆ విద్యాలయంలో జ్ఞానవాహినియై దీపాలు వెలిగించిన స్వాతంత్ర్య సమరయోధులు ముఖ్య పాత్ర వహించారు. స్వాతంత్ర్య సిద్ధికై జాతీయ విద్య కూడా ఒక సాధనంగా ఎంచారు.

ఆంధ్ర జాతీయ కళాశాల సాధారణ విద్యతో పాటు లలిత కళలు, వృత్తి విద్యలని కూడా ప్రవేశ పెట్టి వ్యక్తుల జీవితాలకు భవిష్యత్ పునాది వేసింది. ఎందరికో దారి చూపించింది. 1910లో స్థాపితమైన ఈ జాతీయ కళాశాల దినదినాభివృద్ధి చెందుతూ ఉన్నతవిద్యలతో పాటు విశ్వవిద్యాలయాన్ని కూడా ఒక భాగంగా నెలకొల్పే స్థితికి ఎదిగింది. ఈ ఎదుగుదలలో ఎన్నో ఎత్తు పల్లాలను ఈ కళాశాల ఎదుర్కొంది.

ఎందరో విద్యార్థులకి జ్ఞాన సంపదనిచ్చే ఈ కళాశాల విజ్ఞాన వాహినిలో ఆశయాలతో వెలుగొందే జ్ఞాన దీపాలు ఎన్నో ఉన్నాయి. వాటిలో తొలిదీపం అయిన కోపల్లె హనుమంతరావుగారు తమ ఆత్మ తేజస్సుతో యీ దీపాన్ని వెలిగించారు. ఎందరో మహితాత్ములు తమ తేజస్సును ఇంధనంగా చేసి తిరిగి ఆ ఆశయాల దీపాలను ప్రకాశింప జేశారు. ఆ ప్రకాశమే ఆంధ్ర జాతీయ కళాశాల ఉనికిని దేశమంతటికి వెలుగుని పంచింది.. జాతీయ విద్య గురించి, విద్యాలయ స్థాపన గురించి ముట్నూరి కృష్ణారావు గారు తమ కృష్ణాపత్రిక ద్వారా విస్తృత ప్రచారం కలిగించారు. డా॥ భోగరాజు పట్టాభి సీతారామయ్య గారి కార్య దక్షత ఈ కళాశాలను నిలబెట్టింది.

ఈనాడు గగనాన ఎగురుతున్న మన భారతీయ జాతీయ జెండా రూపొందించినది ఆంధ్ర జాతీయ కళాశాలే!. ఆనాడు భారత జాతీయ కాంగ్రెసుకు రాట్నం గుర్తుతోను, ఈనాడు అశోక చక్రం తోనూ విరాజిల్లే త్రివర్ణ పతాక సృష్టి కర్త శ్రీ పింగళి వెంకయ్యగారు. వీరు ఆంధ్ర జాతీయ కళాశాల అధ్యాపకులు. వీరు మన జాతీయ జెండాను దీనిని అతి తక్కువ కాలంలో రూపొందించారు.

అలాగే ఆంధ్ర జాతీయ కళాశాల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చిహ్నం, రాజముద్రికకు కారణమై ఎంతో ఘనకీర్తి సంపాదించింది. చిత్రకళానిధి ఈరంకి వెంకటశాస్త్రిగారి శిష్యులు శ్రీ సూరిశెట్టి ఆంజనేయులుగారు రూపొందించిన ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ రాజముద్ర 1956వ సంవత్సరంలో సుమారు 300 మందికి పైగా పంపిన నమూనాలలో ఉత్తమమైనదిగా గ్రహించి ఈ నమూనాను ఎన్నుకొన్నట్లుగా ప్రకటించడమైంది.

కోపల్లె హనుమంతరావుగారు తన ఆశయ సిద్ధికై కుటుంబాన్ని, వ్యక్తిగత జీవితాన్ని కూడా త్యాగం చేశారు. అహర్నిశలు జాతీయ కళాశాల అభివృద్ధికై కృషి చేశారు. తన ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయ లేదు. ఈ కళాశాల భవిష్యత్తుని దర్శించిన మహానుభావులు.

**జననం**

బహుళ షష్ఠి... ఏప్రిల్ పన్నెందున 1879వ సంవత్సరం. కృష్ణారావు, సీతమ్మ దంపతుల తొలి సంతానంగా హనుమంతరావుగారు దివి తాలూకాలోని అవిరిపూడిలో జన్మించారు.

చల్లపల్లి జమిందారుగా శ్రీమత్ రాజా యార్లగడ్డ మల్లికార్జున ప్రసాద నాయుడు బహద్దూర్‌గారి వద్ద శ్రీ కృష్ణారావుగారు దివాన్‌గా వుండేవారు.ఆయన అక్కడి లావాదేవీలు, వ్యవహారాలు చూస్తుండేవారు. అప్పుడప్పుడు ఆయన కూడా తండ్రితో పాటు చల్లపల్లి కోటకి వెడుతుండేవారు.

కృష్ణారావుగారు ఇంటికి తరచూ లావాదేవీల కోసం ఎవరో ఒకరు వస్తూండేవారు. తండ్రి వెంట ఉండే హనుమంతరావుగారు కూడా అక్కడే వుండి అంతా గమనిస్తూ వుండేవారు. వీరికి కూడా తండ్రిగారి తెలివి తేటలు వచ్చాయి. వ్యవహార దక్షత తెల్సివచ్చింది.

**విద్యాభ్యాసం**

హనుమంతరావుగారు చురుగ్గా చదువులలో ముందుంటూ బందరులో హిందూ హైస్కూలులో స్కూలు ఫైనలు పాసై, కాలేజీలో చేరారు. 1896లో బి.ఏ.పాసయ్యారు. హైస్కూలులో ఉన్నప్పుడే ముట్నూరు కృష్ణారావుగారితో స్నేహ బంధం మొగ్గ తొడిగింది.

మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో ఎం.ఏ. వృక్షశాస్త్రములో నిపుణులయ్యారు. వృక్ష శాస్త్రమంటే వీరికి ఎంతో ప్రీతి. వృక్షశాస్త్రంలో ఆ డిగ్రీని పొందిన వారు చాలా తక్కువ. అందుకే కొద్ది రోజులలోనే వారు ఊటీలో 'అసిస్టెంటు కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్' హోదాలో ప్రభుత్వ ఉద్యోగిగా చేరారు. ఆరోజుల్లో ప్రభుత్వ ఉద్యోగం అంటే చాలా గౌరవం ఉండేది. ఊటీలో రెండు సంవత్సరాలు పనిచేశారు. త్వరలో డిప్యూటీ కలెక్టరు పదవిని అందుకునేవారు. కాని ఆయనకి ప్రభుత్వ ఉద్యోగం సంతృప్తినివ్వలేదు. ప్రజోపయోగంకోసం పాటుబడాలని నిశ్చయించుకున్నారు. చేస్తున్న ఆ ఉద్యోగానికి రాజీనామా చేశారు.

1904లో మద్రాసు వెళ్ళి అక్కడ బి.ఎల్. చదివారు. ఆ తరువాత బందరులో లాయరుగా ప్రాక్టీసు ప్రారంభించారు. కొద్ది కాలానికే ఆ వృత్తిని కూడా వదిలివేసి ఉద్యమాల బాట పట్టారు.

తెల్లవారి పాలనలో ఉండే ప్రభుత్వ ఉద్యోగం కాదని లాయరుగా ప్రాక్టీసు మొదలెట్టిన హనుమంతరావుగారు తానూ మంచి లాయరుగానే పేరు పొందారు. కానీ ఆయన లాయరుగా ఎక్కువ రోజులు ఉండలేదు. దానికి కారణం దేశాభ్యుదయం. దేశాభిమానం. స్వాతంత్ర్య సాధనకై ఆరాటం.

ఆ రోజుల్లోనే కోపల్లె హనుమంతరావుగారు కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావుగార్ల ఆధునిక భావాలకి ప్రభావితులైనారు.

ఆ రోజుల్లో మన తెలుగు విద్యార్థులు ఉన్నత చదువులకై మద్రాసు (చెన్నై) నగరానికి వెళ్ళి చదువుకోవలసి వచ్చేది. ఉన్నత విద్యా ప్రమాణాలు కల కళాశాలలు ఇక్కడ ఉండేవి కావు. మరి కొన్ని సార్లు ఇంకా దూర ప్రదేశాలకి వెళ్ళి చదువుకునేవారు ఆ రోజుల్లోనే వంగదేశ విభజన జరగటం, వందేమాతరం ఉద్యమం ప్రారంభ మవటం జరిగింది. జాతీయోద్యమం ఊపందుకుంది. ఎందరో జాతీయ వాదులు, మహానుభావులు ఉరికంబం ఎక్కారు. ఎందరో దేశనాయకులు బ్రిటీషు వారిచే బంధించబడి, కారాగారాల పాలయ్యారు. ఆసమయంలో శ్రీ బిపిన్ చంద్రపాల్ ఆంధ్రదేశమంతట సంచారం చేసి, బందరు, విజయవాడల్లో వుపన్యాసాలిచ్చి ప్రజలను చైతన్యవంతుల్ని చేశారు.

**ఉద్యమాల బాట**

దేశమంతా ప్రారంభమైన ఉద్యమ జ్వాలలు తెలుగు నాట కూడా విస్తరించాయి. కోపల్లె హనుమంతరావుగారిలో దేశభక్తి నరనరాల పాకిపోయింది. తాను ఉద్యమాల్లో అందరితో పాటు పాల్గొనసాగారు. బ్రిటీషు వారి పాలనకి వ్యతిరేకోద్యమాలు దేశమంతా పాకినట్లే మన ఆంధ్రలోని బందరులోనూ ఎక్కువగా సాగాయి.. వాని వేపు ఆకర్షితులైన హనుమంతరావు గారు దేశసేవ వైపు మొగ్గారు.

పట్టాభి మొదలైన అందరు నాయకులతో పాటు హనుమంత రావుగారు కూడా సూరత్‌లో జరిగిన కాంగ్రెస్ మహా సభల తరువాతనే జాతీయ నాయకులంతా ఉద్యమాల్లో పాల్గొన్నారు. సహాయ నిరాకరణోద్యమం మొదలైనపుడు ఈ ఉద్యమ ప్రభావం తెలుగువారిలో మరింతగా చూపింది. తమ విద్యా పట్టాలను చించి వేశారు. కోపల్లె హనుమంతరావుగారు కూడా తన 'లా' పట్టాని చించి వేశారు. వీరితో పాటు గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు, కొండా వెంకటప్పయ్య గారు, పట్టాభి గారు మొదలైన ప్రముఖులు తమ తమ వృత్తులను మానేశారు. ప్రభుత్వ రంగ ఉద్యోగాలను, న్యాయవాద వృత్తులను, విద్యార్థులు తమ చదువులను మానేశారు. తమ వృత్తి పట్టాలను చించి వేశారు. వారందరూ కూడా ఉద్యమాల్లో పాల్గొనేలా చేసింది మహాత్మా గాంధీ నాయకత్వాన జరిగిన ఆనాటి ఉద్యమ స్ఫూర్తి.

**బిపిన్ చంద్రపాల్ వాగ్ఝురులు**

బిపిన్ చంద్రపాల్ ఆంధ్రదేశ సంచారానికై విజయనగరం, రాజమండ్రి, బందరు, కాకినాడ, విజయవాడ వంటి ముఖ్య పట్టణాలకి వచ్చి బ్రహ్మాండమైన తన వాగ్ఝురులలో అందరినీ ముంచెత్తారు. బందరులోని గొడుగుపేట నాటకశాలలో బిపిన్ చంద్రపాల్ ఉద్యమ ప్రచార సభ ఏర్పాటు చేశారు. బిపిన్ చంద్రపాల్ ఉపన్యాసం విన్న వారంతా ఉద్రేక పూరితులయ్యేవారు. ఆంధ్రనాట స్వదేశీ వస్తువుల అమ్మకానికై అనేక అంగళ్ళు (షాపులు) నెలకొల్పబడ్డాయి. భారత దేశ విద్యలను బోధించడానికై విద్యాలయాలు ఏర్పడ్డాయి. విద్యా ఉద్యమపథాన కోపల్లె హనుమంతరావుగారు, పత్రికా మాధ్యమ పంథాన ముట్నూరి కృష్ణారావుగారు, రాజకీయ పంథాన పట్టాభి సీతారామయ్యగార్లు – తమదైన ప్రత్యేక శైలిలో ప్రజాస్ఫూర్తికి నడుం కట్టి సంపూర్ణ దేశాభ్యుదయ పథంలో ఏకమయ్యారు. జాతీయ విద్యగురించి ప్రత్యేక శ్రద్ధ వహించారు.

**ఆంధ్ర జాతీయ విద్యా పరిషత్**

పుర ప్రముఖులు, నాయకుల సమక్షంలో జాతీయ విద్య గురించి చర్చలు జరిపి విద్యా పరిషత్తు స్థాపనకై ఏర్పాట్లు జరిగాయి. కళాశాల ప్రారంభోత్సవాన్ని మార్చి 27, 1910న శ్రీ కొండా వెంకటప్పయ్యగారి చేతుల మీదుగా జరిపించారు.

దేశ చరిత్రలకు, దేశ భాషలకు ప్రాధాన్యతనిచ్చి, జాతీయ భావాలను పురికొల్పి, జాతీయతా భావానికి పునాదులు వేసింది ఈ కళాశాల. ఆ ప్రాంగణంలో తరగతి గదులు, వర్క్‌షాపులు, ఆటస్థలాలు, అధునాతన ఫాం హౌజ్‌లు, ఉపాధ్యాయుల నివాస గృహాలు, విద్యార్థుల కోసం హాస్టలు వసతి గృహాలు అన్ని వసతులతో కూడి ముప్పై ఎకరాల స్థలంలో కళాశాల నిర్మింపబడింది. అలనాటి గురుకుల పద్ధతిలోలా ఉండేది కళాశాల ప్రాంగణం. కళాశాలలో గుర్రపు స్వారీ, శరీర వ్యాయామమూ, విద్యార్థులకు నిర్బంధ విద్యగా ప్రవేశపెట్టారు.

కోపల్లె హనుమంతరావుగారి దృష్టిలో....

**"మామూలు అక్షర జ్ఞానం విద్య కాదు. భాషా పాండిత్యం విద్యా కాదు.**
**వివిధ విషయ పరిజ్ఞానం సంపాదించటం విద్య కాదు.**
**శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శక్తున్నింటినీ ఏకం చేసి**
**అపశ్రుతులు లేని సమగ్ర సంపూర్ణ వ్యక్తిత్వాన్ని రూపొందించగలిగేది**

**నిజమైన విద్య. ఇది ప్రాచీనతను ఆరాధించదు. అధునాతనాన్ని దేన్నీ నిరసించదు.**
**జాతీయ విజాతీయాలను ఔదల దాల్చదు. కాలదన్నదు.**
**అన్నిటికీ మించి, అందరి నుండి మంచిని గ్రహించడానికి ప్రయత్నిస్తుంది."**

ఇటువంటి మహోన్నత లక్ష్యాలతో కూడినది ఆనాటి విద్య. దేశ చరిత్రలకు, దేశ భాషలకు ప్రాధాన్యతన్చి, జాతీయ భావాలను పురికొల్పి, జాతీయతా భావానికి పునాదులు వేసింది ఈ కళాశాల.

భారీ పరిశ్రమలకు తోడ్పడి దేశ సౌభాగ్యం పెంచటానికి ఉపయోగపడే మెకానికల్ ఇంజనీరింగుకు ప్రథమ స్థానం కల్పించారు.

నూతన విద్యా విధానంతో పాటు సంప్రదాయ సాంకేతిక విద్యలు, వృత్తి విద్యలను పోత్సహించేవారు. చేనేత మగ్గాలతో బట్టల నేతకు, తివాచీ నేత, కంబళ్ళ నేత. పట్టు పరిశ్రమ, బందరు కలంకారీ వంటి అద్దకపు పనుల వంటి కుటీర పరిశ్రమలకు కూడా ప్రాముఖ్యం ఇచ్చారు. ఇవి నేర్చుకున్న విద్యార్థులు తమ బతుకు తాము బతికేలా తయారు చేసే వారు. చిత్రకళలు కూడా నేర్పించేవారు. అందుకోసం శిల్పి అయిన ప్రమోద కుమార చటర్జీని ప్రత్యేకంగా బెంగాలు నుంచి రప్పించి కళాశాలలో చిత్రకారునిగా నియమించారు.

బందరు పట్టణం కలంకారీ అద్దకాలకు పెట్టింది పేరు. సహజసిద్ధంగా లభించే చెట్లనుంచీ, కాయగూరల నుంచీ లభించే రంగులతో దుస్తులపై కలంతో కళాత్మకంగా భారత రామాయణాలను చిత్రించడం బందరు కళాకారులకు ఎంతో పేరు. అలాంటి కళలను తమ జాతీయ కళాశాలలో ఒక విద్యగా ప్రవేశ పెట్టి ఎందరో విద్యార్థులకు ఆ కలంకారీ విద్యలో తర్ఫీదు నిప్పించి నిపుణులుగా తయారు చేశారు. ఆయన చర్మకారులను కూడా ప్రోత్సహించేవారు.

జాతీయ కళాశాలకి లక్ష్య ప్రాయమైన రూపం ఇచ్చారు. తెలుగునాట వృత్తి విద్యా కోర్సులను ప్రవేశ పెట్టిన ఏకైక కళాశాల ఆంధ్ర జాతీయ కళాశాలే!

**ప్రధానోపాధ్యాయులుగా...**

హనుమంతరావుగారు 1910 నుంచి 1921 వరకు తొలి ప్రధానోపాధ్యాయులుగా వున్నారు. కళాశాల అధ్యక్షులుగా కూడా కొన్నేళ్ళు పనిచేశారు. చాలా సంవత్సరాలుల జీతం ఏమీ తీసుకోకుండానే పని చేశారు. ఆ తరువాత మూడు సంవత్సరాలు నెలకు ముప్పై రూపాయలు మాత్రమే తీసుకునేవారు. ఆ డబ్బులు కూడా పేద విద్యార్థుల జీతాలకు, దాన ధర్మాలకు వినియోగించేవారు. కళాశాలకు విరాళాలను సేకరించటం కోసం నిరంతరం సంచారం చేస్తూనే తానే ప్రిన్సిపాల్ కనుక అవకాశం కలిగినప్పుడు పిల్లలకు బోధిస్తూ ఉండేవారు. ఆయన బోధనా సామర్థ్యం అమోఘం. బోధించేటప్పుడు ఆ పుస్తకంలోని పాఠాలే కాదు, హిందూ, బౌద్ధ, బ్రహ్మ మతాలను గురించీ, హైందవ, గ్రీకు నాగరికతల గురించీ, విద్యార్థులకి అర్థమయ్యేట్లు, విన్నవారు ఆనందించేట్లు బోధించేవారు. కళాశాలలో ప్రతిరోజూ మొదటి అరగంట ఆర్యులకాలం నాటి చరిత్ర, ఉన్నత ఆశయాలతో నిండిన మనదేశ సంస్కృతిని బోధించేవారు.

కళాశాల వార్షికోత్సవాలప్పుడు హనుమంతరావుగారు పెద్ద పెద్ద వ్యాసాలు రాసి జాతీయ విద్యాలయ స్వరూపాన్ని వివరిస్తూ ఉండేవారు.

కాలికి చెప్పులు ధరించకుండా, నెత్తిన గొడుగు లేకుండా ఎండలో కూలీ వారితో పాటు కళాశాల పనులలో పాల్గొనేవారు. అలుపెరుగని అనంత శక్తి, నిస్వార్థం,అంకితభావం అన్నీ కలగలిపి ఆంధ్ర జాతీయ కళాశాల విజయ బాటలో నడిచింది. వీరికి అండగా కమిటీ సభ్యుల సహకారం కూడా ఉండేది. హితులు, సన్నిహితులు, ప్రజల సహాయ సహకారాలు కూడా లభించేవి.

కులమతాల కతీతంగా అందరి పట్ల ఆదరణ కలిగి ఉండేవారు. కూలీలుగా స్త్రీలు, పురుషులను సమానంగా కళాశాల పనులలోకి ఉపయోగించుకుని వారికి జీవనాధారం కలిపిస్తుండేవారు.

దళిత విద్యార్థులను ఎక్కువగా కళాశాలలో చేర్చుకొని, వారికి ఉచిత విద్య కల్పించటమే కాక ఆర్థిక సాయం కూడా చేసేవారు.

కళాశాలకి వచ్చే పదివేల రూపాయల ఆనాటి ప్రభుత్వ గ్రాంటును వదలుకొన్నారు. దానితో ప్రభుత్వం నుంచి వచ్చే ఆదాయం తగ్గిపోయింది. కళాశాల ఆవరణలోని తాటి కల్లు చెట్ల నుంచి వచ్చే ఆదాయాన్ని వద్దని మద్యపానాన్ని నిరోధించి, మద్య పాన నిషేధోద్యమాన్ని ఆనాడే ఆయన ప్రబోధించారు

అప్పుడప్పుడు కాన్ఫరెన్సులకు హనుమంతరావుగారు కూడా వెళుతుండేవారు. కాని రైలు ఎక్కినప్పటి నుండి, తిరిగి బందరు చేరేవరకు కాన్ఫరెన్సుకు సంబంధించిన విషయములకన్న కళాశాలనుగురించే ఎక్కువ ఆలోచించేవారు.

**విద్యా నిధులకై భిక్షాటన**

ఆయన లక్ష్య శుద్ధి విద్యా స్థాపన. ఆ విద్యకై భిక్షాపాత్ర ధరించిన వారిలో ఆయన ప్రథముడు. కళాశాల నిధులకోసం హనుమంతరావుగారు గ్రామ గ్రామానికి వెళ్ళి సంపాదించేవారు. దక్షిణ దేశములో ఆయన తిరుగని ప్రదేశం లేదు.

ఒక కళాశాల నిలబడాలంటే అధ్యాపకులు, ఇతర సిబ్బంది మొదలైన వారందరి వేతనాలతో పాటు కళాశాల నిర్వహణకు ఎంతో ఖర్చు అయ్యేది. ఏదైనా చెప్పే ముందు తాను ఆచరించి చూపే హనుమంతరావుగారు తను సంపాదించిన ఆస్తిలోని ధనం, భూములు కూడా జాతీయ కళాశాలకి విరాళాలుగా అందచేశారు.

కళాశాల నిధుల సేకరణ వినూత్నంగా ఉండేది. బందరులో ప్రతి ఇంటా చిన్న తాటాకు బుట్ట పెట్టి ప్రతిరోజూ ఒక గుప్పెడు బియ్యం (ముష్టి) ఆ బుట్టలో వేయవలసిందిగా ఇంటివారిని కోరేవారు. వారానికి ఒకరోజు కళాశాల తరపున వ్యక్తులు వచ్చి ఆ బుట్టలలోని బియ్యం సేకరించి కావడి వానితో తీసుకెళ్ళి ఆ ధాన్యం అమ్మి కళాశాల నిధికి జమకట్టేవారు.

ఒకసారి బందరు కోటకి విడిదికి వచ్చిన ఒక పెద్ద ధనికుని (హైదరాబాదు నవాబు) కళాశాల నిధులకై అడగడానికి వెళ్ళినప్పుడు అనవసర కాలయాపన చేస్తూ వారు వేచి ఉండేలా చేసి, తదనంతరం వారిని లోపలికి ఆహ్వానించారు. హనుమంతరావుగారి హోదా, విద్యా సంస్కారం అన్నీ తెలిసిన ఆ ధనికుడు హనుమంతరావుగారిని కూర్చొనమని మర్యాద చేయలేదు. నిలబెట్టి అరగంట మాట్లాడించారు. అయినా దాన్ని ఆయన అవమానంగా తీసుకోలేదు. జమిందారుగారికి కళాశాల అభివృద్ధి పనులు వివరిస్తూ, విరాళాలు కోరుతూ, కళాశాలకి వచ్చి చూడ వలసిందిగా ఆహ్వానించారు.

కళాశాలకై, దానికి రూపురేఖలు దిద్దటానికై దానిని సర్వాంగ సుందరంగా చేయటానికై మహా భిక్షుకుడైనారు ఆయన. సంక్రాంతి భిక్షలనీ, ధన ధాన్యాల వసూళ్ళనీ, అటు తంజావూరు నుంచి ఇటు శ్రీకాకుళం వరకు, ఆంధ్ర దేశమూ, దక్షిణా పథమూ అంతా కూడా సమయానికి నిద్రాహారాలు లేకుండా సంచరిస్తూ ఉండేవారు.

పెద్దలనక, పిన్నలనక, లాభం లేకున్నా, దూషించినా, విసుక్కున్నా, కేవలం తాను చేపట్టిన కార్యాచరణమే పరమాదర్శంగా ఎంచి ఆయన దేశ దేశాలు తిరిగి భిక్షసేకరించారు.

కోపల్లె హనుమంతరావుగారు ఎన్నో తోటలను, పొలాలను సేకరించి అవిరామంగా తిరిగి అప్పట్లోనే 5.6 లక్షల రూపాయలను సేకరించి, జాతీయ విద్యాభివృద్ధికి అవసరమైన అన్ని విధాల సాధన సామగ్రిని సమకూర్చారు. హనుమంతరావుగారు చాలా మంచి ఉదార స్వభావులు. కాలేజీలో చదివే విద్యార్థులకే కాక పొరుగూళ్ళ నుంచి వచ్చి వారాలు చేసుకుని చదువుకునే విద్యార్థులు ఉండేవారు. అలా ప్రత్యేకించి చదివేవారికి కూడ హనుమంతరావుగారు సహాయం చేసేవారు.

**కళాశాల అభివృద్ధి పనులు**

ఆంధ్రనాట ఎలక్ట్రిసిటీ లేని రోజుల్లో బందరు పట్టణంలో వర్కుషాపులోని డైనమోతో కళాశాల ఆవరణ అంతా విద్యుద్దీపాలతో అలంకరించేలా చేశారు హనుమంతరావుగారు. అంతే కాదు కళాశాల ముందు భాగంలో డాబాపై ఉన్న సింహాల కళ్ళల్లో ఎర్రని చిన్న బల్బులని అమర్చి చైతన్యవంతంగా చేశారు.

హనుమంతరావుగారి విద్యా ప్రణాళికల్లో వ్యవసాయం కూడా ఉండేది. ఇంజన్లతో నీళ్ళు తోడి వ్యవసాయానికి ఉపయోగించే విషయంలో కూడా ఎక్కువ శ్రద్ధ తీసుకున్నారు. అందువల్ల చవిటి పఱ్ఱలుగా, ఊసర క్షేత్రాలుగా ఉండే గందుపాలెం, మల్లవోలు మొదలైన గ్రామాలలోని రైతులని ప్రోత్సహించి, మురుగు కాల్వలోని నీటి ద్వారా చవిటి భూములను పంట భూములుగా మార్పించారు. దీనితో వందలాది ఎకరాలు సారవంతాలై ఎకరానికి అధిక దిగుబడికి కారణభూతులయ్యారు. ఇలాంటి నీటి మోటార్ల విస్తరణకి జాతీయ కళాశాల ముఖ్యస్థానమయింది.

కళాశాల అభివృద్ధి పనులలో భాగంగా హనుమంతరావుగారు కళాశాల చెఱువులోకి నీరు రావటానికి సుల్తాన్‌నగరం కాలువలో నుండి పిల్ల కాలువని స్వయంగా దగ్గర వుండి తవ్వించారు. దీనికి కృష్ణాజిల్లా కలెక్టర్ ఇ. స్కాట్ గారు ఎంతో సహాయం అందించారు. ఆ సమయంలోనే హనుమంతరావుగారికి అనారోగ్యం కూడా మొదలయ్యింది.

కళాశాలలో విద్యాబోధనకవసరమైన లాబొరేటరీ పరికరాలను సమకూర్చటం జరిగింది. వ్యవసాయరంగానికి, సైన్సు రంగానికి, జియోగ్రాఫికల్ రంగానికి సంబంధించిన పరికరాలు ఏర్పాటు చేశారు. బెంగుళూరు, అలహాబాదులనుండి రెండు జాతుల పట్టు పురుగులను తెప్పించి వాటిని పెంచే విధానం విద్యార్థులకి బోధించేవారు.

**కుటుంబం**

హనుమంతరావుగారి భార్య పేరు భారతమ్మగారు.... కృష్ణమూర్తి, రామారావు అనే ఇద్దరు కుమారులు. నిరాడంబరులు. బందరులో పెద్ద ఇల్లు కట్టించారు హనుమంతరావుగారు. జమిందారులు. తండ్రి కృష్ణారావుగారికి పధ్నాలుగు మంది సంతానం. ఉమ్మడి కుటుంబం.. పెద్దకొడుకు హనుంతరావుగారు అందరూ కలిసి మెలిసి ఆప్యాయతానురాగాలతో వుండేవారు. తండ్రి తన సంపాదన తన పిల్లలందరికీ సమానంగా ఇవ్వటమే కాక జాతీయ కళాశాలకి కూడా విరాళమిచ్చారు. తండ్రి బాటలోనే నడిచే హనుమంతరావుగారు కూడా తమ చెల్లెళ్ళకి ఏమీ లోటు లేకుండా చూసుకునేవారు. ఎవరికి ఏ కష్టమొచ్చినా ఆదుకునేవారు. ఆ చుట్టుపక్కల కోపల్లె వారి కుటుంబమంటే ఎంతో గౌరవం, మర్యాద ఉండేవి.

**వ్యక్తిత్వం**

హనుమంతరావుగారు త్యాగశీలి. సహజంగానే మిత భాషులు. నిగర్వి.. నిరాడంబరులు. మహా ధీశాలి. విదేశీ వస్త్రములైన కోటు వంటివి త్యజించి ఖద్దరు దుస్తులనే ధరించేవారు. ప్రకృతి ఆరాధకులు.. కాలేజీ ఆవరణలో ఎన్నో చెట్లను నాటారు. వాటి ఆకులు, పూలు ఎవ్వరైనా కోసిన సహించేవారు కాదు. కవి హృదయమున్నవారు. చిన్న వయసు నుంచే అనేక పద్యాలు రచించారు. మంచి రచనా నైపుణ్యమున్నవారు. వారి రచనల్లో భాష. శైలి, పదాల ఎంపిక ఎంతో వైశిష్ట్యాన్ని సంతరించుకుంటాయి. గ్రాంధిక భాషలోనే రచనలు చేసేవారు. ఆంగ్ల భాషలోనూ ఉన్నతమైన పదాలను వాడేవారు. కార్య దీక్షాపరులు. స్వ సుఖము లేదు. ధనార్జన యందు ఆసక్తి లేదు. కీర్తియందు దృష్టిలేదు.. అధికార వాంఛ లేదు. ఉన్నది ఒక్కటే ఆశయం. భారతజాతికి జాతీయ విద్యా బోధన... దాని ద్వారా తెలుగువారిలో శారీరక, మానసిక అధ్యాత్మిక వికాసము కలుగుతుందనే నమ్మకం... ఆ ధృఢ సంకల్పమే జాతీయ విద్యా పరిషత్తుకు పునాది వేసింది. ధనము సంపాదించగలిగినంత తెలివితేటలు కలిగిన ఉన్నత విద్యావంతులై వుండి కూడా వాటిని తృణప్రాయముగ ఎంచారు. మానవ జన్మమెత్తుట మానవ సేవ మనస్ఫూర్తిగ చేయుటకే అని త్రికరణ శుద్ధిగా నమ్మి, ఆచరించిన వ్యక్తి.

స్వాతంత్ర్య జీవనమే ప్రధానంగా భావించి వ్యవసాయంలో అభిలాష కలిగి తమకుండిన చవిటి పర్ర భూములను ఎలాగయినా బాగు చేయాలని అనుకున్నారు. తమకి, ఇతర రైతులకు లాభం కలగాలని నీటి పంపులను ఏర్పాటు చేసారు. పూనికతో ప్రయత్నించి చాలా నష్టాల పాలయ్యారు.

హనుమంతరావుగారు తన నలభైరెండవ ఏట ఫిబ్రవరి 2, 1922న తుది శ్వాస విడిచారు.

**మరణానంతరం**

హనుమంతరావుగారి మరణానంతరం హనుమంతరాయ నిధిని ఏర్పాటు చేసి ఆ నిధులు కళాశాల కోసం నియోగించారు. వారి విగ్రహాన్ని కళాశాల ఆవరణలో నెలకొల్పారు. ఒక భవనానికి హనుమంతరాయుని పేరు పెట్టారు. అలాగే బందరు కోనేరు సెంటరు నందు కూడా ఒక బ్లాక్ కు హనుమంతరావుగారి పేరు పెట్టారు. వీరి జీవితం యువకులకి ఆదర్శ ప్రాయం. హనుమంతరావుగారు జీవించినంత కాలం నిధులకై పరులని యాచించారు. కాని వారి మరణానంతరం అనేకమంది విరాళాలు అందించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

**ఎందరో మహానుభావులు...**

కళాశాల ఆవిర్భవించినప్పటి నుండి ఎందరో ప్రముఖులు ఆ కళాశాల దర్శించారు... ఆ కళాశాలలో చదువుకున్నవారు, సంబంధం వున్నవారెందరో... మహాత్మా గాంధీ, డా. సర్వేపల్లి రాధాకృష్ణన్, గురువు బ్రహ్మర్షి రఘుపతి వెంకట రత్నం నాయుడు గారు కళాశాలతో అనుబంధమున్నవారైతే.. జాతీయ పతాక శిల్పి పింగళి వెంకయ్యగారు, దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు, కొండా వెంకటప్పయ్యగారు, చెఱకువాడ నరసింహం పంతులుగారు, గాడిచర్ల హరిసర్వోత్తరావుగారు, అడవి బాపిరాజుగారు, కవిసామ్రాట్ విశ్వనాధ సత్యనారాయణ గారు, కోలవెన్ను రామకోటేశ్వరరావుగారు, గురజాడ రాఘవశర్మగారు మొదలైన వారంతా ఆ జాతీయ కళాశాలలో ఉపాధ్యాయులుగా వున్నవారే. స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న వీరులే!

ఆనాడు సత్ సంకల్పంతో పురప్రముఖుల ఆమోదంతో ఏర్పడిన జాతీయ కళాశాల నేడు మహా వృక్షమే అయింది. విద్యా పరిషత్తు నేషనల్ కాలేజీగా, బి.యి.డి. కాలేజీ, స్థాపించబడి, కృష్ణ యూనివర్సిటీ కూడా కళాశాల ఆవరణలో రూపుదిద్దుకుని ఎందరో విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేస్తోంది. హనుమంతరావు గారి జీవిత చరిత్రయే కళాశాల చరిత్ర. కళాశాల చరిత్రయే హనుమంతరావుగారి జీవిత చరిత్ర.

కోపల్లె హనుమంతరావుగారి మాటల్లో చెప్పాలంటే "తను మనః ధనములను అర్పించుట గొప్ప కాదు. దేశము కోసం ఏదైనా చేయాలన్న కాంక్ష ఉండాలి. నా దృష్టిలో జాతీయ విద్యావిధానమే –స్వరాజ్య సంపాదనకు సాధనం" అని అనేవారు....

ఆంధ్ర జాతీయ కళాశాల స్థాపించిన పన్నెండు సంవత్సరాలకే వీరు (42 వయసులోనే) అనారోగ్యంతో తనువు చాలించారు. కాని నేటికీ ఆయన దేశమంతటా చిరంజీవులై వున్నారు. హనుమంతరావుగారి అకాల మరణం జాతిని కుంగదీసినా ఆ మహనీయుని ఆశయాలు చిరంజీవులై ఆ కళాశాల ఆవరణలోనే నిక్షిప్తమై నిలిచాయి.

మహాత్మాగాంధీ విడిదికి నెలవై – బహిరంగ సమావేశాలకు కొలువై
లలిత కళలకు నిలయమె – విద్యార్థుల భవితకు పునాదియై
నేటికీ చిరంజీవియై వర్థిల్లే – ఎందరో త్యాగధనుల త్యాగఫలం
భారతీయ వినువీథిన ఎగిరే కీర్త పతాకం! – తెలుగు జాతి గర్వించదగిన కళాశాల
పునాదులేసిన హనుమంతరాయులు – జీవిత చరిత్ర ఎందరికో మార్గదర్శం.!! ❁

# తెలుగులో జాతీయోద్యమ సాహిత్యం

డా. కట్టెపోగు సురేష్ కుమార్, తెలుగుశాఖాధిపతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వ.ప్ర.), గుంటూరు
చరవాణి : 9440543860

స్వంత తప్పిదాలతో భారతావని పరజాతి పాలకుల వశమైంది. క్రమంగా కళ్ళు తెరిచిన భారతావని పరాయి పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు జెండా ఎగురవేసి పోరాటం సాగిస్తున్నప్పుడు యావత్ తెలుగుజాతి ద్విగుణీకృతమైన ఉత్సాహంతో పాల్గొంది. అనేక ప్రకియలు కళారూపాల్లో జాతీయోద్యమ సాహిత్యాన్ని సృష్టించింది. రాజకీయ రంగంలో చాలా సంఘటనలు దేశవ్యాప్తంగా మొదలు కాకముందే వాటికి ఆంధ్రదేశం ఆలవాలమైంది. ఉదా : సహాయ నిరాకరణ పన్నుల నిరాకరణ, శాసనోల్లంఘనం, సాయుధ తిరుగుబాటు మొ॥వి.

స్వతంత్ర పోరాట సమయంలో సమాజంలో జరిగే ప్రతి సంఘటన సాహిత్యానికి వస్తువైన కాలం. దేశంలో జరుగుతున్న ఉద్యమాలు అందరికి చేరువకావడానికి కవులు, కళాకారులు చేసిన కృషి సాహసోపేతమైనది. ప్రభుత్వ నిర్బంధాన్ని, శిక్షలను తట్టుకుంటూ జాతి యావత్తు చేసిన పోరాటం సదాస్మరణీయం.

సాహిత్యంలో విస్తృత స్థాయిలో భావగీతాలు, ప్రభోద గీతాలు, పాటలు, పద్యాలు, కీర్తనలు, కావ్యాలు, ఖండ కావ్యాలు, శతకాలు, దండకాలు, బుర్రకథలు, హరికథలు, నవలలు, నాటకాలు, నాటికలు, సంగీత రూపకాలు, వ్యాసాలు, కథలు, లేఖలు ఇలా ఒకటేమిటి సాహిత్యం, కళలు సర్వం జాతీయ భావస్ఫోరకమై జాతిని చైతన్యపరుస్తూ వచ్చాయి.

తెలుగు సాహిత్యంలో "చిలకమర్తి రచన 'భరతఖండంబు 'చక్కని పాడియావు' అనే పద్యం భారత జాతీయోద్యమ సంబంధమైన తొలి రచన అని చెప్పవచ్చును" అని డా॥ సి. నారాయణ రెడ్డి ఆధునికాంధ్ర కవిత్వం – సంప్రదాయాలు – ప్రయోగాలు అనే తమ సిద్ధాంత గ్రంథంలో అంటారు.

1895లోనే చిలకమర్తి వారు గోదావరి మండల సభలో చదివిన పుష్పమాలిక చింతామణి పత్రికలో ప్రచురించబడింది. అందులో వారు ప్రభుత్వ పన్నుల విధానాన్ని ఇలా నిరసిస్తారు.

నేలదున్నుదు మన్నుజాల తరము పన్ను, నీరు గావలెనన్న నీటిపన్ను... ఇలా ప్రభుత్వం విధించే పన్నులు తీవ్రంగా ఉండి ప్రజల జీవనం దుర్భరమైంని ధైర్యంగా చాటుతారు. ఈ విధంగా తెలుగులో జాతీయోద్యమ సాహిత్యాన్ని మొదలు పెట్టినవానిగా చిలకమర్తిని పేర్కొనవచ్చును.

వందేమాతర ఉద్యమం మొదలైనపుడు దేశమంతా ఉప్పెనలా సాహిత్యం వచ్చింది. ఆ తర్వాత పి. రామశాస్త్రి, మార్తాండ శాస్త్రి, చెన్నాప్రగడ భానుమూర్తి, రాయప్రోలు, గురజాడ, గరిమెళ్ళ సత్యనారాయణ, గడియారం వేంకటశేష శాస్త్రి, మంగిపూడి, తుమ్మల, మరింగంటి శేషాచార్యులు, చలం, మంత్రిప్రగడ భుజంగరావు, చెళ్ళపిళ్ళ, జాషువా, నాళం, కొండవీటి వెంకటకవి, కరుణశ్రీ, బలిజేపల్లి, బాపిరాజు, వేలూరి, వడ్డాది, పూడిపెద్ది, విశ్వనాధ కవికొండల గురజాడ రాఘవశర్మ ఉన్నారు

వాస్తవానికి వీరి పేర్లు చెప్పడానికే వ్యాసం సరిపోదు. ఇలా వెలువడిన రచనల్లో దేశభక్తి, సందేశం, గతవైభవాన్ని కీర్తించడం, జాతిని చైతన్య పరచడం, ఐకమత్యం ప్రబోధించడం, దోపిడీని వ్యతిరేకించడం, ప్రభుత్వ పాలనను ఎండగట్టడం, మన వీరులను కీర్తించడం, జాతీయ నాయకులను స్తుతించడం, సంఘసంస్కరణ, నిర్మాణ కార్యక్రమాలు.. ఇలా ప్రతి అంశం మీద పాటలు, పద్యాలు, ఖండ కావ్యాలు, కావ్యాలు, శతకాలు, గేయకావ్యాలు, కీర్తనలు, భజనపదాలు, పదములు, హరికథలు, బుర్రకథలు విస్తృతంగా వెలువడినాయి.

యదార్థ సంఘటనలు, మతనేపథ్యం, చారిత్రకం, పురాణ సంబంధం, కల్పన నేపథ్యంలో వస్తువుని తీసుకుని కవులు, రచయితలు పలు ప్రక్రియల్లో రచనలు చేశారు. జాతిని చైతన్య పరిచారు.

**నాటకాలు :** 'నాటకాంతం హి సాహిత్యం' అని పెద్దలు చెప్పినట్లు పండిత పామరులను సమంగా ఆకట్టుకోగలిగిన ప్రక్రియ నాటకం. జాతీయోద్యమ కాలంలో పలు అంశాలని ఇతివృత్తాలుగా చేసుకుని నాటకాలు రూపొందాయి. చారిత్రక నాటకాలు, సాంఘిక నాటకాలు, పౌరాణిక నాటకాలు. ఇలా అనేక విధాల నాటకాలు వెలువడ్డాయి. ప్రభుత్వ తీరుననుసరించి, నిర్బంధ తీవ్రతను అనుసరించి నాటక వస్తువులో మార్పులు, చేర్పులు చేసుకుంటూ ప్రభుత్వానికి దొరకకుండా, ప్రజలను చైతన్యపరుస్తూ రచయితలు, నటులు, పోలీసులు, ప్రజలు ఆశ్చర్యపోయే రీతిలో నాటక ప్రదర్శనలు ఇచ్చారు.

స్వతంత్ర ఉద్యమకాలంలో జరిగిన జరుగుతున్న సంఘటనలు, జాతీయ నాయకులు, దేశభక్తి, చారిత్రక వీరులు, సంఘ సంస్కరణ, ఇలా పలు అంశాలతో నాటకాలు వచ్చాయి. వీరేశలింగం పతులుగారు మొదలుకొని దామరాజు పుండరీకాక్షుడు, దామరాజు రామానుజరావు, జాస్తి వెంకటనరసయ్య, దూళిపాళ్ళ వెంకట సుబ్రహ్మణ్యం, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, చలం, వేదాంతకవి, అబ్బరాజు రంగారావు, బలిజేపల్లి, జాషువా ఇలా ఎందరో నాటక సాహిత్యం సృష్టించి జాతిని జాగృతం చేశారు.

**కథానిక సాహిత్యం :** జాతీయోద్యమ నేపథ్యంగా వెలువడిన కథానికా సాహిత్యం తక్కువనే చెప్పాలి. ఆధునిక తెలుగు కథ 1910లో గురజాడతో మొదలైనట్లు తెలుస్తుంది. అంతకు ముందుగా కథానికలు వచ్చినా ఈ కాలం కొంచెం వెనక్కు జరుగుతుంది.. ఏమైనా 1940 నాటికి గాని కథానికా సాహిత్యం ఊపందుకోలేదు, కథానికల్లో ఎక్కువ శాతం కుటుంబ వ్యవస్థ, లౌకిక విషయాలు, ప్రణయం, సంఘ సంస్కరణ మొ॥ విషయాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. జాతీయోద్యమంలో అనేక అంశాలు మిళితమై ఉన్నాయి. గురజాడ కథానికలు సంఘసంస్కరణ నేపథ్యంగా వెలవడినవే. అలాగే చలం, శ్రీపాద, మొ॥ పెద్దల కథల్లో జాతీయోద్యమం నేపథ్యంలలోని పలు విషయాలను ప్రస్తావించినవే.

రాయసం వెంకట శివుడు 'చిత్రకథా మంజరి' అనే కథల సంకలనం (1927)లోని 'పార్వతి యనుతాపము' అనే కథానిక జాతీయోద్యమాన్ని, నాటి సమకాలిన పరిస్థితులను వర్ణించిన కథ. అలాగే బుర్రా వెంకట సుబ్రహ్మణ్యం గారి 'జ్యోతిష్యం', ముద్దుకృష్ణ నామంత్రి (1940) చలం, మల్లాది రామకృష్ణశాస్త్రి, జి.వి. కృష్ణారావు, అడవి బాపిరాజు, వేలూరి శివరామ శాస్త్రి ఇలా కొద్దిమంది కథల్లో ప్రత్యక్షంగానూ ఎక్కువమంది కథల్లో పరోక్షంగానూ జాతీయోద్యమం చిత్రించబడింది. మొత్తంగా చూస్తే ఈ రంగంలో కథానికా సాహిత్యం తక్కువగానే ఉంది.

**నవలా సాహిత్యం :** పాశ్చాత్య సాహిత్య ప్రభావం వలన తెలుగులోకి వచ్చిన ప్రక్రియల్లో నవల ఒకటి. పందొమ్మిదవ శతాబ్దం చివరలో తెలుగులో నవల వెలువడింది. నవలా రచనకు ప్రోత్సాహమిచ్చింది ఆంగ్లేయులే. ఆంగ్లేయుల పాలనా విధానాల వలన భారతీయ సమాజంలో ఎన్నోమార్పులు, ఊహించని విధంగా వచ్చాయి. అవి జన జీవితాన్ని తారుమారు చేశాయి. పూర్వ వ్యవస్థలు, ఆచార్య వ్యవహారాలు, జీవన విధానాలు, ఇలా అన్నింటిలో ఎన్నో మార్పులు వచ్చాయి. వీటన్నింటిని నవలలు చిత్రించాయి. ఏమైనా నవలా సాహిత్యం తక్కువగానే వెలువడింది. పాటలు, పద్యాలు, నాటికలు, హరికథలు, బుర్ర కథలు మొ॥ వెలువడినంతగా నవలా సాహిత్యం వెలువడలేదు. మొదటి నవలగా చెప్పే రంగరాజు చరిత్ర. పూర్తి నవలా లక్షణాలతోవెలువడిన రాజశేఖర చరిత్ర మొదలు జాతీయోద్యమం ముమ్మరమవుతున్న కొద్దీ సాంఘిక ఇతివృత్తాల నుండి చారిత్రక ఇతివృత్తాలవైపు

నవలా రచయితలు మరలినారు. చరిత్రలో ప్రసిద్ధులైన వీరుల కథల్ని చారిత్రక సంఘటనలని ఇతివృత్తాలుగా తీసుకుని నవలలు రాశారు. దీనికి ముఖ్య కారణం చింతామణి, విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి, ఆంధ్ర ప్రచారిణి గ్రంథమాల చారిత్రక నవలలను ప్రోత్సహించాయి. ఈ క్రమంలో వెలువడినవే చిలకమర్తి రాసిన అహల్యాబాయి, రాజస్థాన కథావళి, మొ॥ ధరణీ ప్రగడ వెంకట శివరావు గారి కాంచన మాల, వెంకట పార్వతీశ్వర కవుల వసుమతీ వసంతం, ప్రమదావనం, భోగరాజు నారాయణ మూర్తిగారి విమలాదేవి, శ్రీపాదవారి ఆంగ్లరాజ్యస్థాపన మొ॥ పేర్కొనదగినవి.

తల్లాప్రగడ సూర్యనారాయణ హేలావతి (1913) వేంకట పార్వతీశ్వరుల 'మాతృమందిరం' గాంధీజీ హరిజనోద్ధరణకు పూనుకొనకముందే రాసిన నవలలు. గాంధీజీ ప్రభావం బాగా పెరిగిన తర్వాత ఆ నేపథ్యం నుంచి నవలలు వచ్చాయి. ఇందులో వేలూరి శివరామశాస్త్రి గారి (అహోబలపండితుడు) ఓబయ్య (1920) ముఖ్యమైంది, మొదటిది కూడానూ. ఆ మరుసటి సంవత్సరం వెలువడిన నవల మాలపిల్ల. ఉన్నవలక్ష్మీ నారాయణ గారు రాసిన ఈ నవల పెద్ద సంచలనం. గాంధీజీ సిద్ధాంతాలు, మార్క్సిజం ప్రభావం ఇందులో కనిపిస్తాయి. అట్టడుగు వర్గాల వారు ఉద్యమంలోకి రావాలి, నాయకత్వం చేపట్టాలి, అపుడే నిజమైన ప్రభుత్వాలు ఏర్పడతాయనేది ఆనాడే ఉన్నవ వారు చెప్పటం వారి ముందు చూపుని సూచిస్తుంది. అడవి బాపిరాజు స్వతంత్ర ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొని కారాగార వాసం అనుభవించారు. వారి కలం నుండి వెలువడిన 'నారాయణరావు' కోణంగి నవలల్లో జాతీయోద్యమ ప్రభావం కనిపిస్తుంది. విశ్వనాథ 'వేయి పడగలు' జాతిలో సనాతన ధర్మాన్ని సంరక్షించడానికి రాసిన నవల. అలాగే మహీధర రామ్మోహనరావు (కొల్లాయి గట్టితనేమి) ఉప్పల లక్ష్మణరావు (అతడు ఆమె) మొ॥ బుచ్చిబాబు (చివరకు మిగిలేది) మొ॥ చెప్పకోదగినవి.

స్వతంత్ర ఉద్యమ కాలంలోనూ ఆ తర్వాత ఎంతో సాహిత్యం వెలువడింది. ఇక పత్రికలలో వచ్చిన వ్యాసాలు, ఉపన్యాసాలు, విమర్శలు, కరపత్రాలు విస్తృత స్థాయిలో జాతీయ భావాలను ప్రజల్లో ప్రేరేపించాయి. ఎంతో కాలం, ధనం, శ్రమ చివరికి ప్రాణాలు సైతం లెక్కచేయక చేసిన పని నిజాయితీతో, నిబద్ధతగా కొనసాగింది.

కొన్ని పదుల సంవత్సరాల పాటు, సాగిన ఈ సాహితీ యాగంలో వేలాది మంది కవులు, కళాకారులు, రచయితలు పాల్గొన్నారు. వీరి విస్తృతమైన ఈ విషయాలని చాలా స్థూలంగా మాత్రమే పరిచయం చేయటానికి ప్రయత్నించాను. ఇది ఒక స్థూల అవగాహనకు మాత్రమేనని నా మనవి. కొండను అద్దంలో చూపించే ప్రయత్నం. ❀

**ఉపయుక్త గ్రంథాలు**

తెలుగులో జాతీయోద్యమ కవిత్వం – మద్దూరి సుబ్బారెడ్డి
రజిత రంజని – రంజని ప్రచురణలు
ఆధునికాంధ్ర కవిత్వం – సంప్రదాయాలు – ప్రయోగాలు – సి. నారాయణరెడ్డి
ఆంధ్ర నవలా పరిణామం – బొడ్డపాటి కుటుంబరాయ శర్మ
తెలుగు కథానిక స్వరూప స్వభావాలు – పోరంకి దక్షణామూర్తి
వ్యాసపరిణామం – కొలకలూరి ఇనాక్
తెలుగు గేయ సాహిత్యం – జి. చెన్నకేశవరెడ్డి

# ధీర వనిత ఉన్నవ లక్ష్మీబాయమ్మ

**డా. వాసిరెడ్డి భవాని,** తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ.ప్ర), గుంటూరు

భరత జాతి ఈనాడు స్వేచ్ఛా వాయువును ఆస్వాదిస్తుందంటే అది ఎందరో మహానుభావుల త్యాగఫలంగా మనం చెప్పుకొనక తప్పదు. ఆనాటి నేతలందరూ తమ జీవితాలను ఫణంగా పెట్టి భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. వారిలో కొందరు దేశ మాత కోసం తమ ప్రాణాలను అర్పించిన వారూ వున్నారు వారి త్యాగాలను నేటి యువతరానికి గుర్తు చేయవలసిన ఆవశ్యకత ఎంతయినా వుంది. భారతదేశం స్వాతంత్ర్యం సాధించి నేటికి 75 సంవత్సరాలైనది ఈ వజ్రోత్సవ వేడుకలనే మనం ఆజాదీకా అమృత మహోత్సవ్ పేరిట జరుపుకొనుచున్న ఈ తరుణంలో ఆ అమృత మూర్తుల జీవిత గాథలను విద్యార్థులకు స్ఫురణకు తేవాలన్నదే ఈసదస్సు సంకల్పము. జాతీయోద్యమ కాలంనాటి పరిస్థితులను తలచుకొనినట్లయితే 1857 లో మొట్టమొదటి సారిగా స్వాతంత్ర్యోద్యమపోరాటం జరిగినది అందులో ఝాన్సీ లక్ష్మీబాయి వంటి ధీర వనితలు అసువులు బాసారు. పురుషులకన్నా స్త్రీలు ఏమాత్రమూ తీసిపోరని సరోజినీ నాయుడు, విజయలక్ష్మి పండిట్, అరుణా అసఫ్ అలీ, లక్ష్మీ సెహగల్, దుర్గాబాయిదేశముఖ్ వంటి వారెందరో తమ గడప దాటి వచ్చి భరతమాత సేవలో తరించారు.

మన ఆంధ్రదేశమునందు కూడా ఎందరో ప్రముఖులు భారతస్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనినారు. ఆంధ్రదేశం నడుమ భాగమైన గుంటూరు ప్రాంతం మొదటినుంచీ ప్రజాచైతన్యం కలిగిన ప్రాంతంగా పేరుగాంచినది. ప్రాచీనకాలంనుండి సారస్వత నిలయంగాను, విద్యల కాణాచి గానూ ప్రసిద్ధికెక్కింది. అమరావతి విశ్వవిద్యాలయం నాగార్జునా విద్యాపీఠం ఈ మండలానికి సంబంధించినవే (తిక్కన సోమయాజి తన తాత గుంటూరు విభుడని చెప్పియున్నాడు).

ఈ ప్రాంతంలో ఎక్కడ సంచరించినా సంచలనాలు సృష్టించిన వారెందరో మనకు సాక్షాత్కరిస్తారు. శాతవాహనులు ధాన్యకటకాన్ని రాజధానిగా చేసికొని పరిపాలించారు. ఈ ప్రాంతాన్ని ఎన్నో రాజవంశాలు ఏలినట్లుగా అనేక రాజ సంస్థానాలకు సంబంధించిన చారిత్రక ఆధారాలు మనకు కన్పిస్తాయి. రెడ్డి రాజులు పరిపాలించిన కొండవీడు సంస్థాన ఏలుబడిలోని అమీనాబాదు అనే ఒక గ్రామంలో మన కథానాయిక లక్ష్మీబాయమ్మ జన్మించింది. 1882వ సంవత్సరంలో గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం అమీనాబాదు గ్రామంలో నియోగి బ్రాహ్మణ కుటుంబంలో నడింపల్లి సీతారామయ్య రామలక్ష్మమ్మల కడగొట్టు సంతానం కాబట్టి ఈమె అల్లారుముద్దుగా పెరిగింది. తగినంతవరకు సాంప్రదాయ విద్య నేర్చుకొన్నది పువ్వుపుట్టగనే పరిమళించును గదా అన్నట్లుగా చిన్న తనం నుండే అభ్యుదయ భావాలు కలిగి ఉండేది. స్వాభిమానాన్ని ప్రదర్శించేది. దృఢ నిశ్చయం కలిగి ఉండేది. అందుకు నిదర్శనంగా మనం ఈ ఘట్టమును చెప్పుకొనవచ్చును. లక్ష్మీబాయమ్మకు 10వ ఏడు రాగానే ఆమె తండ్రి సీతారామయ్యగారు వివాహం చేయడానికి నిశ్చయించి అన్నివిధాలా తగిన వరుని కొరకు అన్వేషించ సాగారు. ఆవిషయం గమనించిన లక్ష్మీబాయమ్మ నెమ్మదిగా తల్లిని సమీపించి నేను ఉన్నవ బావను తప్ప ఇంకెవ్వరిని పెళ్లి చేసుకోనని ఖండితంగా చెప్పింది. అంత చిన్న వయసులోనే తన నిర్ణయాన్ని ధైర్యంగా బయటపెట్టింది. ఉన్నవ లక్ష్మీనారాయణ గారిది బీద కుటుంబం కనుక తన కూతురు భోగ భాగ్యాలతో

తులతూగలేదని తల్లిదండ్రులకు ఆ సంబంధం ఇష్టంలేదు. ఆడపిల్లలు నగలు చీరలు ఇష్టపడతారని ఉన్నవ వారు నీకు ఖరీదైన నగలు చీరలు పెట్టలేరని ఆమెకు నచ్చుజెప్ప ప్రయత్నం చేశారు. అయినా ఆమె ఖాతరు చేయలేదు. పాఠశాలలో లక్ష్మీనారాయణ గారి ప్రతిభ పాటవాలను ఆ వయసులోనే అంచనా వేసికొని నగలు చీరల కన్నా ఆయనతో వివాహమే మంచిదని తన ఆలోచనను స్థిర పరచుకొన్న ధీశాలి.

ఉన్నవ లక్ష్మీనారాయణ గారు 1877లో వేములూరుపాడు గ్రామంలో ఉన్నవ శ్రీరాములు మరియు శేషమ్మ గార్ల కడుపు పంటగా జన్మించారు. వేములూరిపాడ గ్రామంలో పెద్ద తరగతులు లేనందువల్ల అమీనాబాదు పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. విద్యార్థులందరిలోకి చురుకుగా, తెలివిగా ఉండడం వలన గురువుల ఆదరం సంపాదించారు. అది గమనించిన లక్ష్మీబాయమ్మగారు వారిని అభిమానించారు. ఆ అభిమానమే 1892 లో ఉన్నవ లక్ష్మీనారాయణ గారితో లక్ష్మీబాయమ్మ గారికి వివాహం జరగడానికి కారణమయ్యింది. వివాహం తర్వాత లక్ష్మీనారాయణ గారు ఉన్నత విద్య కోసం గుంటూరు మిషనరీ కళాశాలలో చేరారు. ఆ కళాశాలలో ఎక్కువ సమయం గ్రంథ పఠనం చేసేవారు సంస్కృతాంధ్ర గ్రంథములను క్షుణ్ణంగా పఠించారు. కళాశాల విద్య తరువాత ఉపాధ్యాయవృత్తి చేపట్టారు. 1898లో లక్ష్మీబాయమ్మగారు గుంటూరు కాపురానికి వచ్చారు.

**లక్ష్మీబాయయమ్మ గారి సంఘ సంస్కరణాభిలాష**

వీరు మహిళాభ్యుదయ కోసం ఎంతగానో పాటుపడ్డారు. వీరేశలింగం గారిని స్ఫూర్తిగా తీసుకొని వారి సమక్షంలో 1902 అక్టోబరు 11వ తేదీన గుంటూరు లో మొట్టమొదటి వితంతు వివాహం జరిపించారు. అందుకుగాను ఆనాటి సమాజం వారిని సంఘ బహిష్కరణ చేశారు ఆ సమయంలో లక్ష్మీబాయమ్మ గారు పురిటికోసం పుట్టింటికి వెళ్లారు. తల్లిదండ్రులు కూతుర్ని కాపురానికి పంపించడానికి భయపడ్డారు. కానీ ఆమె పంతం పట్టి అన్న పానీయాలు ముట్టకుండా గుంటూరు ప్రయాణమయ్యింది. చేసేదిలేక ఆమె తండ్రి గుంటూరులోని లక్ష్మీనారాయణ గారి అక్క గారైన రంగమ్మ గారింటి వద్ద వదిలి వెళ్లారు. భార్యా, పుత్రులను చూడడానికి వచ్చిన లక్ష్మీనారాయణ గారు ఎవరూ చూడకుండా కొడుకును తీసుకు వెళ్లారు. ఆ వెనుకే ఆమె భర్త ననుసరించింది. లక్ష్మీనారాయణగారి సింహగర్జనలు ఆంధ్రదేశమంతటా మారు మ్రోగినవి. లక్ష్మీబాయమ్మగారు వితంతువులకు ఆశ్రయమిచ్చివారిలో చైతన్యం కలుగజేసి భర్తకు పూర్తి తోడ్పాటు నిచ్చినది.

లక్ష్మీనారాయణగారు న్యాయవాదవృత్తి. పై ఆసక్తితో ఐర్లండ్ లో బారిస్టర్ చదవడానికి వెళ్లారు. అక్కడ వి.వి. గిరి, త్రిపురనేని రామస్వామి చౌదరి, తుర్లపాటి వేంకటేశ్వరరావు, నడింపల్లి దశరథ రామయ్య, పోలిశెట్టి హనుమయ్యగుప్త గార్లతో పరిచయం ఏర్పడింది. లక్ష్మీనారాయణ గారిలో జాతీయోద్యమ భావాలకు పాదుకలు పడ్డాయి. లక్ష్మీబాయమ్మగారు భర్త భావాలను గమనిస్తూనే నోములు, వ్రతాలు చేసుకొంటూ కాలం గడుపుతున్నది. పల్నాడు ప్రాంతంలో ప్రజలకు అటవీశాఖ వారు పుల్లరి విధించి జులుం చేస్తున్నారని, అక్కడ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని ప్రారంభించారు లక్ష్మీనారాయణ గారు. ఉద్యమం తీవ్ర రూపం దాల్చడంతో ప్రభుత్వ దురహంకారం తగ్గింది. పల్నాటిలో పుట్టిన చైతన్యాగ్నిని చల్లార్చడం కోసం ప్రభుత్వం పన్నాగాలపన్నింది.

నరసరావు పేట నుంచి సాయుధులైన రక్షక భటులను పంపించి పంతులు గారిని నిర్బంధించారు. నేరారోపణ చేసి ఒక సంవత్సరం పాటు కారాగార శిక్ష విధించారు. ఆ సమయంలో లక్ష్మీబాయమ్మగారు గుంటూరు లోనే వున్నారు. భర్తకు జైలు శిక్ష పడిందని ప్రభుత్వం ఆయనను రాయ వెల్లూరు పంపే ప్రయత్నంలో వున్నదని తెలిసి భర్తగారి పాదాలకు నమస్కరించి వారి అనుజ్ఞ పొందాలని, సంస్థలను నిర్వహించాలని ఆమె నెమ్మదిగా గుంటూరు రైల్వే స్టేషన్ కు బయలు దేరింది ఖద్దరు చీర ధరించింది త్రివర్ణ పతాకం చేతబట్టింది నగలన్నింటిని త్యజించింది నిశ్శబ్దంగా భర్త పా దాలను తాకి భర్త మెడలో పూలదండను వేసింది తన చుట్టూ వున్న కొండా వెంకటప్పయ్య పంతులు, కోలవెన్ను రామకోటేశ్వరరావు గార్ల ఓదార్పు వచనములు వింటూనే భర్తను ఒక కోరిక కోరింది మీ అర్థాంగానికే ఆంగ్లేయుడు కారాగార శిక్ష విధించాడు భారతీయ జీవిత పవిత్రత వారికి తెలియదు, ఉత్తమాదర్శాలుకల మనం ఊరకుండరాదు, మీరు నడిపించిన ఉద్యమం మీ భార్య నడపడానికి అనుమతిని ప్రసాదించండి.

అంటూ స్వాతంత్ర్యోద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొనడానికి ముందడుగు వేసిన ఆమె ధైర్యాన్ని ఏమని చెప్పవచ్చును ?ఆనాటినుంచి నగలను తీసివేసి కేవలం నాను తాడును మాత్రం ధరించి పిల్లవాడిని ప్రక్కనున్న స్త్రీలకు అప్పగించి త్రివర్ణ పతాకమును ధరించి నిరాడంబరంగా తిరిగిన వూరు తిరుగకుండా ఏమాత్రం జంకు గొంకు లేకుండా తిరుగసాగింది అలా తిరుగుతున్న ఈ ఉద్యమ వనితకు ఆ గ్రామాల ప్రజలు ఏమాత్రము సహాయ సహకారాలు అందించలేదు. పట్టెడన్నమూ దొరకని రోజులున్నాయి ఆడకూతురని ఆలోచించి అయినా గ్రుక్కెడు మంచి నీళ్ళు ఇవ్వలేని స్థితి లో ఆనాటి గ్రామ ప్రజలు వున్నారు. ఈమెకు సహాయం చేస్తే కారాగారానికి వెళ్ళవలసి వస్తుందని భయపడ్డారు. అపర ఝాన్సీలక్ష్మీ వలె ఉద్యమం కొనసాగించింది సమాజసేవాదృక్పథం తప్ప నిద్రాహారాలను కూడా లక్ష్య పెట్టలేదు. దేశ సేవికలను వెంట బెట్టుకొని వారిచే పాటలు పాడించేది భజనలు చేయించేది ఈ విధంగా ఆంధ్రదేశమునందలి స్త్రీలందరికి ఆదర్శప్రాయంగా వుండేది గాంధీ గారి పిలుపు నందుకొని ఖద్దరు ఉద్యమాన్ని నడిపారు. స్త్రీ అయినప్పటికి కల్లు పాకల వద్ద 'పికెటింగ్' వంటి సాహసోపేత కార్యక్రమాలు జరిపేది.

**శ్రీ శారదా నికేతన**

వీరేశలింగం దంపతులు వితంతు శరణాలయాన్ని స్థాపిస్తే, గుంటూరులో ఉన్నవ దంపతులు శ్రీ శారదానికేతనం అనే గురుకులాన్ని స్థాపించారు. బాలికల కోసం ఆంధ్రము, సంస్కృతము, హిందీ, ఆంగ్లభాషలలో శిక్షణతో బాటు సంగీతము, చిత్రలేఖనము, నవ్వారు, బట్టలనేత, కుట్టుపని, అల్లికపని, పట్టుజరీ తయారీ మొదలైన నగిషీ పనులు కూడా ఈ సంస్థలో నేర్పేవారు ఇక్కడకు వచ్చిన విద్యార్థులను సకల కళావల్లరులుగా తీర్చిదిద్ది పంపేవారు. ఇలా శ్రీ శారదానికేతన స్థాపనతో లక్ష్మీబాయమ్మగారు కడివెడు బిడ్డల తల్లి అయ్యింది తను కన్న బిడ్డ కన్నా శారాదా నికేతనం పిల్లల సంక్షేమాన్నే నిరంతరం ఆలోచించిన లోకజనని. ఎక్కడకు వెళ్ళినా ఆ పిల్లలను వెంటబెట్టుకొని వెళ్ళేది. వారందరినీ కూర్చోబెట్టుకొని కథలు చెప్పేది. వాళ్ళ చేత పాటలు పాడించేది హాస్యాలతో కడుపుబ్బ నవ్వించేది. అక్కడి విద్యార్థినులందరికి ఆమె తల్లి లక్ష్మీనారాయణ గారే తండ్రి, అందుకే ఆ పిల్లలు ఆ పుణ్య దంపతులను అమ్మగారూ, బాబుగారూ అని పిలిచేవారు. ఈ పిల్లల సంరక్షణ కోసం ఆ దంపతులిద్దరూ గ్రామాలలో తిరిగి మోతుబరి రైతులవద్ద విరాళాలు సేకరించేవారు. ధనం ఇవ్వలేని వారు ధాన్యము, సరుకులు ఎవరు ఏది యిస్తే దానిని సంతోషంగా స్వీకరించేవారు. ఏమీ ఇవ్వలేని వారి వద్ద ఉప్పయినా తీసికొని వచ్చేవారు. "చందన వృక్షం తన సౌరభాన్నిసమీప తరువులకే కాక భూరుహాలకు కూడా పరపునట్లు" శ్రీ శారాదా నికేతనం గుంటూరు కేంద్ర మైనప్పటికి దాని సౌరభాలు దేశమంతటా వ్యాపించాయి.

ఉన్నవ దంపతులు శ్రీ శారాదానికేతనంలోని విద్యార్థినులైన బాల వితంతువులకు పునర్వివాహాలు చేసేవారు ఒకానొక సందర్భంలో ఒకవితంతువును మిషనరీ శరణాలయానికి పంపుతున్నారని తెలిసి లక్ష్మీబాయమ్మగారు తన వెంట బెట్టుకొని తీసికొని వచ్చినది . అనసూయాదేవి అనే ఆమెకు 12 వ ఏట వివాహం జరిగింది 6 నెలల లోపే ఆమె వితంతువు అయినదట, 2013 వ సంవత్సరంలో శారదానికేతనానికి ఆమె వచ్చినపుడు లక్ష్మీ బాయమ్మ గారి గురించి అన్న మాటలు "1943 లో లక్ష్మీబాయమ్మ గారు నా జీవితాన్ని తీర్చి దిద్దిన విధానాన్ని మరచి పోలేను ఆ సమయంలో మూఢమి రోజులని భర్త చనిపోయిన నన్ను మా నాన్న ఇంటికి తీసుకు వెళ్లలేదు మా అక్క ద్వారా విషయాన్ని తెలుసుకున్న లక్ష్మీబాయమ్మగారు తానే స్వయంగా వచ్చి నికేతనానికి తీసికొని వచ్చినది. మూఢమి మీకుగాని, నాకు కాదని నా యెడల ఆరాధ్య దైవమై నన్నుతీర్చి దిద్దినది . "అంతే కాదు ప్రస్తుతం శారదానికేతనం లో వున్న లక్ష్మీబాయమ్మగారి విగ్రహాన్ని ఆమే స్వయంగా తయారు చేయించు కొన్నట్లుగా చెప్పారు .

ఉన్నవ లక్ష్మీబాయమ్మగారు, లక్ష్మీనారాయణగారు. ఇద్దరూ స్వాతంత్ర్యోద్యమంలో గుంటూరు కేంద్రంగా ముఖ్య భూమిక వహించారనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఒక వైపు ఉద్యమంలో పాల్గొంటూనే సంఘ సంస్కరణ వైపు దృష్టి పెట్టి సమాజాన్ని మేల్కొలిపిన మహనీయమూర్తులు. వారి సదాశయ రూప కల్పనకు నిదర్శనమే శ్రీ శారదా నికేతనం. వారు సంప్రదాయాన్ని గౌరవిస్తూనే ఛాందసాన్ని విడనాడారు.

ఆ ప్రయత్నంలో భాగమే లక్ష్మీనారాయణ గారి మాలపల్లి ఆవిష్కరణ ఆయన సాగించిన, సాధించిన ప్రజాహిత కార్యక్రమాలన్నింటిలోనూ నిరంతర భాగ స్వామినియై వారి పేరు ప్రతిష్ఠలను ఇనుమడింపజేసి తన సహధర్మచారిణీత్వమును సార్థక పరచుకున్న మహా ఇల్లాలు. 1922లో శ్రీ శారదానికేతనమునకు రూపు దిద్ది ఎందరో అభాగినులకు పరిపూర్ణ జీవితము నొసంగిన పుణ్య దంపతులు. వారు నిష్కల్మష హృదయముతో స్థాపించిన ఆ సంస్థ శాఖోపశాఖలు గల్గిన కల్పవృక్షము వలె నేటికీ వర్థిల్లుచున్నది. జీవితాన్ని మార్చే శక్తి విద్యకే వున్నది, విద్యను మించిన వికాస మార్గం లేదని సమాజం ముందుకు నడవాలంటే స్త్రీ విద్య ఎంత అవసరమో ఆనాడే ఊహించారు. నిరు పేదలైన, అనాథలైన ఎందరో స్త్రీలకు మార్గ నిర్దేశం చేసిన మహిళా మాణిక్యమే లక్ష్మీబాయమ్మగారు. సంస్థ అభివృద్ధి కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన పుణ్యవతి. వీరి త్యాగానికి ఆంధ్ర మహిళా సంఘం వారు "గృహలక్ష్మి" అని బిరుదునిచ్చి స్వర్ణకంకణాన్ని బహూకరించారు నిరాడంబరురాలైన ఆమెకు ఆ స్వర్ణ కంకణం కన్నా విలువైన గుణగణాలు, ఎనలేని కీర్తి, శారాదనికేతన విద్యార్థుల ప్రేమాభిమానాలు నిరంతరం ఆమె వెంటే వున్నాయనేది జగమెరిగిన సత్యం కడుపున పుట్టిన బిడ్డలను పెంచడమే కష్టమనుకుంటున్న రోజులలో ఎందరో బిడ్డలను కన్నతల్లి వలె సాకిన భరత మాత ముద్దు బిడ్డ మన లక్ష్మీబాయమ్మ గారు అనడంలో ఎంతమాత్రం సందేహం లేదు. ❀

# జాతీయోద్యమ స్త్రీల కథలు - విశ్లేషణ

**డా. దోమల ధాత్రికుమారి, తెలుగు అధ్యాపకురాలు,** ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ.ప్ర.), గుంటూరు

**ఉపోద్ఘాతం**

"ఇది సంఘర్షణ యుగము భారత హృదయం స్వాతంత్ర్యం కావాలని పరితపిస్తున్నది. ఏ మూలచూచిన స్వాతంత్ర్య భావమే మన కథా సాహిత్యంలో ప్రతిబింబించాలి."

– కథలు రాయటం ఎందుకు? – భారతి, పుష్యం – 1938.

భారతదేశవ్యాప్తంగా స్వాతంత్ర్యోద్యమ జ్వాలలు రగుల్కొంటున్న నేపథ్యంలో దేశ ప్రజలందరినీ ఐక్యం చేయడంలో దేశనాయకులు చేసిన కృషి అనన్య సామాన్యం. మితవాద, అతివాద, గాంధీ యుగాలలో నాయకులు దేశవ్యాప్తంగా పర్యటనలు చేసి,వారి ఉపన్యాసాల ద్వారా ప్రజల్ని ఉత్తేజపరచి, ప్రభావితుల్ని చేసి స్వాతంత్ర్య సముపార్జనే పరమావధిగా ముందుకు సాగారు.గాంధీ నాయకత్వంలో దేశమంతా ఏకతాటిపై నడిచింది. జాతీయోద్యమంలోకి మహిళలు ప్రవేశించిన తర్వాత ఉద్యమం మరింత బలోపేతమైంది. వీరితో పాటుగా కవులు, రచయితలు వివిధ ప్రక్రియలలో రచనలు చేసి, ప్రజలలో జాతీయోద్యమ భావాలు రేకెత్తించటంలో ప్రముఖపాత్ర పోషించారు. జాతీయోద్యమ కాలంలో వస్తువులో, భాషలో, శైలిలో కొత్తదనం చోటుచేసుకుంది. గ్రాంథిక భాషలో వ్రాయబడిన తొలితరం రచయిత్రుల కథలు జాతీయోద్యమ స్ఫూర్తిని, ఉద్యమకారుల త్యాగాలను, జాతీయోద్యమంలో స్త్రీల క్రియాశీలతను చిత్రించాయి. ఇవి సామాన్య ప్రజల ఆలోచనలు సైతం ఉద్యమం వైపు మళ్లేలా చేయగలిగాయి.

**జాతీయోద్యమ స్త్రీల కథలు**

జాతీయోద్యమ నేపథ్యంలో వచ్చిన స్త్రీల కథలలో కనుపర్తి వరలక్ష్మమ్మ 'కుటీరలక్ష్మి' (ఆంధ్ర పత్రిక, ఉగాది సంచిక, 1924), 'ఐదు మాసములు యిరువది దినములు' (గృహలక్ష్మి మాసపత్రిక, నవంబరు, 1932) అనే రెండు కథలు గుమ్మడిదల దుర్గాబాయి 'నేధన్యనైతిని' (భారతి,అక్టోబరు, 1929),మైదవోలు పద్మావతి 'త్యాగిని' (గృహలక్ష్మి,జనవరి,1931), బసవరాజు వేంకట రాజ్యలక్ష్మి 'ఎవరిదదృష్టం' భారతి, మే, 1931) తాడి నాగమ్మ 'కథగాదు' (భారతి, సెప్టెంబర్, 1935) అనే ఆరు కథలలో జాతీయోద్యమ భావాలను గురించి, ప్రజలలోని భావోద్వేగాలు, నిబద్ధత, దేశభక్తి, సంఘసంస్కరణ వాక్య నిర్మాణం ప్రభావం అనే అంశాలతో పాటుగా అంతర్లీనంగా సంప్రదాయ భావజాలం, నీతిప్రబోధం, ఆదర్శానుకరణం మొదలైన అంశాలు కనిపిస్తాయి. ఈ అంశాలను లేశ మాత్రంగా విశ్లేషించుటే ఈ వ్యాస ప్రధానోద్దేశ్యం.

1885–1947 మధ్య కాలం జాతీయోద్యమంలో ప్రధాన ఘట్టం. పై ఆరు కథల రచనా కాలం 1924–1935 సంవత్సరాల మధ్య కాలం. అంటే ఈ రచయిత్రులందరూ ఉద్యమాన్ని చూస్తూ, కొందరు ఉద్యమంలో కూడ పాల్గొని వాటన్నింటినీ తమ కథల ద్వారా ప్రత్యక్షీకరించారు.. ఈ కథలలో 1905 వందేమాతర ఉద్యమం 1920 సహాయ నిరాకరణోద్యమం, 1928

సైమన్ కమిషన్‌పై తిరుగుబాటు, 1929 లాహోర్ పూర్ణ స్వరాజ్య తీర్మానం, 1931 గాంధీ ఇర్విన్ ఒప్పందం, 1930 శాసనోల్లంఘనం మొదలైన వాటితో అనుసంధానిస్తూ కథా వస్తువును స్వీకరించడం జరిగింది.

అద్దకం వ్యాపారంలో ఉన్నత స్థితికి చేరుకొని తర్వాత వచ్చిన నష్టాలకు క్రుంగిపోయి వేంకటస్వామి మరణించగా భార్య రామలక్ష్మి తన కుటుంబ పోషణకై నూలు వడకి స్వదేశీ ఉద్యమంలో భాగమైన కథ 'కుటీరలక్ష్మి'. విదేశీ వస్తుబహిష్కరణలో భాగంగా జైలుకెళ్లిన తన భర్త కోసం స్వదేశీ ఉద్యమాన్ని చేపట్టి ఖద్దరు ధరించి జాతీయోద్యమ భావాలతో సావిత్రి, గౌరీ నోములు నోచి భర్త ఆశయాలను పంచుకుని భర్త మనసు గెలుచుకున్న యువతి కథ 'ఐదు మాసములు యిరువది దినములు'. బాల వితంతువైన శారాదాబాయి స్త్రీవిద్య కోసం తన జీవితాన్ని మొత్తం త్యాగం చేసి, లీల శ్యామసుందరుల ద్వారా తన ఆశయాన్ని నెరవేర్చుకొని ధన్యతనొందిన కథ 'నే ధన్యనైతిని'. కన్నతల్లి పోషణార్థం జాతీయోద్యమానికి దూరమైన కుమారునికి కర్తవ్యాన్ని బోధించి కుమారుడు జాతీయోద్యమంలో ప్రవేశించాలంటే తాను కుమారుడికి అడ్డమని భావించి బావిలో దూకి ప్రాణత్యాగం చేసుకుని కుమారుడు జాతీయోద్యమంలోకి ప్రవేశించేలా చేసిన తల్లి కథ'త్యాగిని'. వైవాహిక జీవితంలో వైఫల్యం చెంది జాతీయ ఉద్యమానికి అంకితం అయిపోయిన సరళ, దేశభక్తుల కుటుంబంలోకి వెళ్లి ఖద్దరు ధరించి స్వదేశీ ఉద్యమంలో భాగమైన కమలల వృత్తాంతంతో సాగిన కథ 'ఎవరిదదృష్టం'. పద్దెనిమిది సంవత్సరాల వనిత విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమంలో ప్రజలకు ప్రబోధం చేస్తున్న సందర్భంలో ఒక యువకుడు తనకు ముద్దిస్తే ఉద్యమంలోకి వస్తానని అన్నందుకు, 'తన మూడవ అన్న దేశం కోసం ముద్దు కావాలని కోరుకుంటే ఎందుకు ఇవ్వను ఎన్ని ముద్దులయినా ఇస్తా'నని ఎంతో సాహసంతో, ధైర్యంతో, సమయస్ఫూర్తితో అతనికి కర్తవ్య బోధ చేసి, తన దేశభక్తిని చాటుకున్న యువతి కథ 'కథ గాదు'. జాతీయోద్యమంలో వివిధ పద్ధతులు, మార్గాల ద్వారా మాతృదేశ దాస్యశృంఖల విముక్తికి నాయకులు, వీరులు, వీరవనితలు ఎలా పాటుపడ్డారో ఈ కథల్లో చిత్రించబడింది.

ప్రముఖ రచయిత్రి, సంఘ సేవకురాలు, కనుపర్తి వరలక్ష్మమ్మగారు గాంధీజీ నాయకత్వంలో విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ ఉద్యమాలలో పాల్గొన్నారు. ఆ ప్రభావం వారి కథలలో కూడ కనిపిస్తుంది. నీలి మందు వ్యాపార నేపథ్యంతో వీరి జాతీయోద్యమ భావజాలం నుండి జాలువారిన కథ 'కుటీరలక్ష్మి'. ఈ కథలో ప్రధాన వస్తువు సహాయనిరాకరణోద్యమంలో భాగమైన స్వదేశీ ఉద్యమం, ఖద్దరు పరిశ్రమ ప్రాధాన్యత,ఖద్దరు వాడకాన్ని గురించి తెలియజేయుట. రామలక్ష్మీ కుంటుంబ నేపథ్యంలో జాతీయోద్యమ తీరుతెన్నులను మనకు వివరించుటే రచయిత్రి ప్రధాన ఉద్దేశ్యం. వేంకటస్వామి కంపెనీ మొత్తం కాలిపోయి అతను మరణించటంతో వారి కుటుంబం వీధి పాలవుతుంది. రామలక్ష్మీ నూలు వడకటం ద్వారా తన కుటుంబాన్ని పోషించుకునే అవకాశాన్ని జాతీయోద్యమం ఫలితంగానే పొందగలిగింది. స్వదేశీ ఉద్యమంలో భాగంగా ఏర్పరచిన జాతీయ పాఠశాలలో తన పిల్లలిద్దర్నీ చేర్పిస్తుంది. జాతీయోద్యమ కార్యక్రమాల ద్వారా రామలక్ష్మి లాంటి ఎందరో ఆర్థిక స్తోమతలేని కుటుంబాలను ఉద్యమం ఆదుకుంది. ఇంకా ఈ కథలో మొదటి ప్రపంచ యుద్ధ ప్రభావంతో భారతదేశంలో అన్ని వస్తువుల ధరలు పెరిగిపోవటాన్ని, సహాయ నిరాకరణ ఉద్యమ స్వభావాన్ని, జాతీయ జన సంఘాలు ఏర్పడి జాతీయ ఉద్యమ కార్యక్రమాలు జరిపిన తీరును, నేత పరిశ్రమలు, జాతీయ పాఠశాలల స్థాపనను, మద్యపాన నిషేధ ప్రయత్నాలను, స్వదేశీ వస్తువులను అమ్మడం కోసం ఏర్పాటుచేసిన స్వదేశీ సంతలు సభలు, రాట్నాలను గురించి, ప్రతి ఇంట్లో స్వదేశీ వస్తువుల వాడకానికి సంబంధించిన వస్తువులు, విషయాలను గురించి ప్రత్యక్షీకరించారు.

విదేశ వస్తు బహిష్కరణ నేపథ్యంతో కనుపర్తి వరలక్ష్మమ్మ గారు రచించిన మరో విలక్షణమైన జాతీయోద్యమ కథ 'ఐదుమాసములుయిరువది దినములు'. దీనిలో కూడ ప్రధాన వస్తువు గాంధీ నాయకత్వంలో ఆరంభించబడిన సత్యాగ్రహోద్యమంలో భాగమైన విదేశీ వస్త్ర బహిష్కరణమే. విదేశీ వస్తు బహిష్కరణ సందర్భంలో విద్యార్థి గణనాయకుడైన గోపాలరావు గాంధీజీ పిలుపునందుకొని గాంధీజీ చేపట్టిన సత్యాగ్రహోద్యమంలో పాల్గొనటానికి వెళ్ళిపోతాడు. గాంధీజీ ఆహ్వానించగానే ఉద్యమంలోకి వెళ్లాడంటే అది గాంధీజీ నాయకత్వంలో ఉన్న ఔన్నత్యం. గోపాలరావు భార్య రుక్మిణి ప్రసవానికై ఏడవ నెలలో పుట్టింటికి వెళు _ంది. బిడ్డ పుట్టి ఐదవ నెల కూడా వచ్చినా సత్యాగ్రహోద్యమంలో మునిగితేలుతున్న గోపాలరావు తన భార్యను తీసుకొనిరాడు.

భార్యా బిడ్డల కంటే మాతృదేశానికి విముక్తి కలిగించడంలోనే తన మనసు లగ్నమవటం అతని దేశభక్తిని చాటుతోంది. ఉద్యమ తీవ్రతని ఈ విషయం ద్వారా తెలియజేశారు రచయిత్రి. గోపాలరావును విదేశీ వస్త్ర పికెటింగ్‌లో పాల్గొన్నందుకు పోలీసులు అరెస్టు చేసి బళ్ళారి జైలులో ఉంచుతారు. సహాయ నిరాకరణోద్యమ సమయంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న సత్యాగ్రహుల్ని పోలీసులు నిర్బంధించిన విషయాన్ని ఈ సంఘటనద్వారా గుర్తు చేశారు వరలక్ష్మమ్మగారు.

గోపాలరావు అరెస్టయి విదేశీ వస్త్రాలను ధరించటంలో వున్న పరాధీనతను గ్రహించిన రుక్మిణి నాటి నుంచి ఖద్దరు ధరించటం మొదలుపెడుతుంది. రాట్నం చేతపడుతుంది. సావిత్రి, గౌరీ నోమును తన భర్త శుభము కోరి చేయాలని సంకల్పించిన రుక్మిణి "ఈ వత్సరము మా యింట నోము నోచుకొనువారు ఖద్దరు వస్త్రములు ధరించియే నోచుకొనవలయును" అని వీరి ఇంటికి వచ్చి నోము నోచుకునే వారికి షరతు పెట్టింది. ఖద్దరు వాడకాన్ని స్త్రీలలో ప్రోత్సహించడానికి వరలక్ష్మమ్మగారు ఈ నోమును వేదికగా చేసుకున్నారు. జైలు నుంచి విడుదలై వచ్చిన గోపాలరావుకి పూలమాల వేయబోగా అతను విదేశీ నూలుతో చేసినదని దానిని వేసుకోడానికి నిరాకరిస్తాడు. అప్పుడు రుక్మిణి వీరత్వంతో "సీమనూలు నా చేతి నుండి తొలగి అయిదు మాసముల యిరువది దినములు అయినది" అని జవాబిచ్చింది. గోపాలరావు జైలుకు వెళ్ళిన నాటినుంచే స్వదేశీ ఉద్యమంలో భాగమైన విషయాన్ని ఇలా తెలియజేసిందా ధీరవనిత. ఈ కథ స్త్రీలందరిలో జాతీయ ఉద్యమం పట్ల, ఖద్దరు వాడకం పట్ల చైతన్యం కలిగించడంలో ప్రముఖ పాత్ర పోషించిందని చెప్పవచ్చు.

గుమ్మడిదల దుర్గాబాయి గారు రచించిన స్త్రీవిద్యా ప్రేరిత కథ "నేధన్యనైతిని". శారదాబాయి చుట్టూ కథనల్లుతూ స్వాతంత్ర్యోద్యమానికి సంబంధించి సైమన్ కమీషన్ వ్యతిరేక ఆందోళనను, స్వదేశీ ఉద్యమం జరుగుతున్న తీరును గురించి వివరించుట ఇందలి కథా వస్తువు. స్వదేశీ ఉద్యమంలో భాగంగా ఖద్దరు వాడకం, స్త్రీ విద్య ప్రాధాన్యతను వివరించుట ఈ కథ ప్రధానోద్దేశ్యం.

శారదాబాయి బాలవితంతువు ఉన్నతమైన భావాలు గల స్త్రీ. అవిద్యాంధకారములో కొట్టుమిట్టాడుతున్న స్త్రీలను ఉద్ధరించి తన జీవితాన్ని సార్థకం చేసుకోవాలనే దృఢనిశ్చయం గలది. పూనా వెళ్ళి నాలుగు సంవత్సరాల పాటు ఉన్నత విద్యలను అభ్యసించి స్త్రీల కోసం స్వయంగా ఒక పాఠశాలను స్థాపిస్తుంది. విద్య పట్ల స్త్రీలలో చైతన్యం తీసురావటానికి, వాళ్ళని చదువుకునేలా చేయటానికి రచయిత్రి ఈ కథాంశాన్ని ఎంచుకున్నారు.

నాయకుల ఉపన్యాసాలకు ప్రభావితుడైన శ్యామసుందరుడు తాను మూర్ఖుడనై పోయానని, విదేశాలకు వెళ్ళి విద్య నేర్చుకొనడం వలన అమూల్యమైన కాలం మొత్తం వృధా అయిపోయిందని చింతిస్తాడు. జాతీయ విద్యావిధాన ఆవశ్యకత, ప్రాధాన్యతలను పై మాటల్లో ధ్వనింపజేశారు రచయిత్రి. దేహాన్ని అర్పించి తన జీవితాన్ని సార్థకం చేసుకుంటానని' కృతనిశ్చయుడైన శ్యామసుందరుని మాటల ద్వారా యువ వీరుల స్వభావం ఎలా ఉండాలో తెలియజేశారు రచయిత్రి. సైమన్ కమిషన్ బహిష్కరణోద్యమంలో పాల్గొన్నందుకు పాఠశాల నుంచి వెళ్లగొట్టబడి, తన అన్న ప్రసాదరావు ఛీత్కారాలకు లోనై శారదాబాయి వద్దకు చేరి ఉద్యమ కార్యక్రమాలు కొనసాగించిన శ్యామసుందరుడు నాటి ఎందరో ఉద్యమకారులకు స్ఫూర్తి.

శ్యామసుందరుడు ఆ గ్రామానికి వచ్చి అక్కడ జాతీయ సంస్థలు నిర్మించి రాట్నాలను మగ్గాలను పెట్టించి, అనేకమంది బీదవారికి ఉపాధి కల్పించాడు. దేశ పరిస్థితిని గురించి, దేశ దారిద్ర్యాన్ని గురించి తెలుసుకోలేక తమలో తాము తగవులాడుచున్న పల్లె ప్రజల్ని విద్యావంతులుగా చేసి వారిలో ఐకమత్యాన్ని సాధించి వారిలో దేశభక్తిని నింపాడు. రాట్నాలు, మగ్గాల పట్ల వారిలో ఉత్సాహాన్ని కలిగించాడు. పై పనుల ద్వారా జాతీయోద్యమ కార్యాచరణమంతా మన ముందుంచారు రచయిత్రి. దేశభక్తి పారాయణులైన శ్రీనివాసరావు కమలల ఏకైక కుమార్తె లీల. తల్లిదండ్రులను కోల్పోయిన లీలని శారదాబాయి చేరదీసి తల్లి వలే ఆదరిస్తుంది. ఈమె కూడ జాతీయోద్యమ కార్యక్రమాలలో పాల్గొంటుంది. లీలా శ్యామసుందరులు తన ఆలోచనా విధానాలకు, ఆశయాలకు వారసులని భావించింది. వారిరువురిని ఒకటి చేసింది. శారదాబాయి చివరి క్షణాల్లో 'నేధన్యనైతినని' నా జీవితము సార్థకమైందని

పలికి ఎంతో తృప్తితో ప్రాణాలను విడుస్తుంది. జాతీయోద్యమ లక్ష్యాల సాధనకు కూడా ఇటువంటి సమర్థమైన యువకులే కావాలనే సూచన ఇందులో కనిపిస్తుంది.

లీల తండ్రి శ్రీనివాసరావు గారు తన చివరి క్షణాలలో లీలతో 'మాతృదేశము మాతృభూమి మరువవలదు. 'నా జీవితము వృథాగా గడిపి వేసితిని. నీవైనను భారతాంబ ఋణము దీర్చి యాదీనుని ఆత్మకు శాంతి గల్పింపుము' అని దిశా నిర్దేశం చేశాడు. లీల తల్లి కూడా మరణించబోయే ముందు తండ్రి మాట మరువవద్దు. నా కోరిక కూడా అదేనని 'అవిద్యాంధకారమందు మునిగి తేలుచున్న స్త్రీలను ఉద్ధరింపు' మనిచెప్తుంది. దేశక్షేమము స్త్రీవిద్య పైనే ఆధారపడి ఉన్నదని స్త్రీలను విద్యావంతులను చేయాలనే కర్తవ్యాన్ని రచయిత్రి పదే పదే గుర్తు చేశారు.

మైదవోలు పద్మావతి గారిచే రచించబడిన కథ 'త్యాగిని'. రచనాకాలం శాసనోల్లంఘన ఉద్యమం జరుగుతున్న రోజులు. ఒక తల్లి కుమారునితో సత్యాగ్రహోద్యమంలో పాల్గొని దేశంకోసం పోరాటం చేసి భరతమాత ఋణము తీర్చుకొనమని ఉద్బోధించుటే కథావస్తువు. 'నాయనా! అందరును సత్యాగ్రహ పోరాటములో పాల్గొనుచుండ నీవు ఆడుదానివలె ఇంట కూర్చొని యున్నావేమి? అని రావు తల్లి రావును ప్రశ్నించుటలోనే భారతీయులందరూ ఆనాడు ఎంత స్వాతంత్ర్యకాంక్షతో ఉన్నారో, గాంధీ నాయకత్వంలో భారతీయులందరూ ఏకతాటిపై నడచి ఎలా పోరాటం చేశారో తెలుస్తోంది. రావు తల్లి రావుతో "భారతీయుల కష్టాలు చూస్తూ ఉంటే ముసలిదాననయిన నాకే రోష పౌరుషములు పెల్లుబుకుచున్నవని నీవొకమనిషివేనా" అని పలుకుటలో భారతదేశ ప్రజలందరిలో సత్యాగ్రహ జ్వాలలు ఎలా రగుల్కొంటున్నాయో స్పష్టమవుతోంది. పై మాటలు "రోమ్ నగరం తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయించుకుంటూ కూర్చున్నాడు" అనే మాటలను తలపిస్తున్నాయి. సంస్కరణ దృక్పథాన్ని కలిగి శారదా చట్టమును ఆమోదించిన వారిలో రావు తల్లి కూడా ఒకరు. ఆమె ఆత్మ త్యాగానికి కారణము ఎవరికీ తెలియలేదు. ఆ రోజు రాత్రి కలలో 'నాకన్నను దేశమాతయే ముఖ్యమని ఎంచి తన ప్రాణములను త్యజించితి'నని పలికి అదృశ్యమౌతుంది. నాటి యువకులకు దిశా నిర్దేశం చేయటానికి రచయిత్రి ఈ సన్నివేశకల్పన చేసినట్లు భావించాలి. రావు తన తల్లి మరణానికి నిజమైన కారణాన్ని తెలుసుకొని ఉద్యోగాన్ని వదలివేసి, గాంధీజీ శిష్యుడై స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని వీరస్వర్గమలంకరించి భరతమాత ఋణాన్ని తీర్చుకుంటాడు. నాటి యువత ప్రథమ కర్తవ్యం స్వాతంత్ర్య సముపార్జనేనని రావు తల్లి పాత్రతో ఎంతో ఆవేశంతో పలికించారు రచయిత్రి. అదీ రచయిత్రి భావావేశము.

జాతీయోద్యమ స్ఫూర్తితో స్త్రీ విద్యను ప్రోత్సహిస్తూ రచించబడిన మరో జాతీయోద్యమ కథ బసవరాజు వేంకట రాజ్యలక్ష్మి గారి 'ఎవరిదదృష్టం'. కమల, సరళ ఇద్దరూ ప్రాణ స్నేహితులు. స్కూల్ ఫైనల్ వరకు చదివి తన ఇష్టప్రకారం తల్లిదండ్రుల అంగీకారంతో టెన్నిస్ విజేత హకీంబేగ్‌ని ప్రేమ వివాహం చేసుకున్న సరళ మతాంతర వివాహాన్ని బేగ్ కుటుంబ సభ్యులు వ్యతిరేకించగా, అది సహించలేక కమల ఇంటికి చేరుతుంది. సహాయ నిరాకరణోద్యమంలో కమల భర్త దామోదరం జైలుకు వెళ్లగా, జైలు నుంచి తిరిగి వచ్చేవరకు దామోదరం బాధ్యతని సరళ తీసుకుంటుంది. స్వదేశీ ఉద్యమంలో భాగంగా ఖద్దరు అమ్మడం, హిందీ ప్రచారం చేస్తూ ఉపన్యాసాలను ఇవ్వడం, స్త్రీలను వాలంటీర్లుగా చేర్పిస్తూ దేశసేవ చేస్తూ ఉంటుంది. కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేయటం, చదువు నేర్పించటం, నూలు వడకటం వంటివి ఊర్లో స్త్రీలందరికీ నేర్పిస్తుంది. 'తిలక్ నిధి'కి చందాలు వసూలు చేస్తుంది. ఇవన్నీ జాతీయోద్యమ కార్యక్రమాలే.

1929 లో బొంబాయిలో మత కలహాలు జరుగుతుంటే మత సామరస్యం కోసం పాటుపడుతూ అక్కడ వీధులలో పహారా కాస్తూ బేగ్ మరణిస్తే, భర్త వీర మరణం పొందినందుకు సంతోషిస్తుంది సరళ. ఇక్కడ రచయిత్రికి గల మతసామరస్య భావన, దేశభక్తి వ్యక్తమవుతున్నాయి. బెజవాడలో విదేశీ వస్త్ర దుకాణం దగ్గర 'పికెటింగ్' చేస్తూ అరెస్టయి ఆరు మాసాల జైలు శిక్ష విధించబడి రాయవేలూరు జైలుకు పంపబడుతుంది. జైల్లో ఆహారమూ, నియమాలు సరిపడక జబ్బున పడుతుంది. సరళ మరణావస్థలో ఉండి కూడా 'దేశం కోసం ప్రాణాలు ధారపొయ్యటం నా అదృష్టం....... దేశసేవ మాత్రం మరువవద్దు' అని

పలికి మరణిస్తుంది. వ్యక్తిగత జీవితాలను త్యాగం చేసి, ప్రాణాల్ని ధారపోసి భరతమాత విముక్తికై పాటుపడ్డ వ్యక్తులను గురించి ఈ కథ గుర్తుచేస్తుంది. ఈ కథలో బాల్యవివాహాల అంశం ఒకటి మినహాయిస్తే మిగతా విషయాలన్నీ జాతీయోద్యమాన్ని ప్రేరేపించే అంశాలే. వైవాహిక జీవితం కంటే స్వాతంత్ర్య సాధనే ముఖ్యమనే సరళ నిర్ణయం భారతదేశానికి స్వాతంత్ర్యం ఎంత ముఖ్యమో తెలియజేస్తోంది.

ఆద్యంతమూ జాతీయోద్యమ భావాలతో నిండిన కథ 'కథగాదు'. ఆనాటి స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలన్నింటినీ మన కన్నుల ముందు నిలిపే కథ ఇది. గాంధీ ఇర్విన్ ఒప్పందం కుదరడానికి పూర్వం శాసనోల్లంఘన ఉద్యమం దేశమంతా ఉధృతంగా జరుగుతున్న రోజుల్ని చిత్రించారు. స్వదేశీ ఉద్యమ నినాదాలు దేశమంతా తీవ్ర రూపంతో మార్మోగుతున్నాయని ఉద్యమ తీవ్రతని తెలియజేశారు నాగమ్మ. ప్రతి ఇంటి నుంచి ఒకరు భారత స్వాతంత్ర్య ఉద్యమంలోకి వెళ్తున్నారని, భారత జాతి త్యాగ సహనాలను చూసి ప్రపంచమంతా దిగ్భ్రాంతి చెందుతూ ఉందని ప్రజల దేశభక్తిని, పట్టుదలని ప్రపంచానికి ఋజువు చేశారు. పద్దెనిమిది సంవత్సరాల యువతి శాంతియుత పోరాటంలో భాగమై విదేశీ వస్తు బహిష్కరణోద్యమంలో పాల్గొంటుంది. ఆ సందర్భంలో ఒక పట్టణంలో బహిష్కరణ అస్త్రం పనిచేయడం లేదని తెలిసి అక్కడకు వెళ్తుంది. నవ నాగరికంగా ఉన్న అభినవ యువకుడొకడు విదేశీ వస్త్రాలను కొనటానికి  అక్కడికి వస్తాడు. తనని ఆపాదమస్తకమూ చూస్తున్న ఆ యువకునితో భారతీయుల క్షేమాన్ని, పరిస్థితిని తెలియజేస్తూ స్వదేశీ వస్తువులను కొనమనమని ప్రాధేయపడుతుంది. ఒక ముద్దిస్తే అలాగే చేస్తానన్నాడు. అప్పుడామె మరింత ఉత్సాహంతో తనకు ఇద్దరు  అన్నలున్నారని, వారురోజూ తనకు ముద్దిచ్చి ఆశీర్వదించి శాంతి సమరమునకు పంపుతారన్నది."విదేశ వస్తువులనెడి హాలాహలమునకు నాహుతియగుచున్న నీ బోటి సోదరుని రక్షింప నొక ముద్దీయలేనా? నీవునా మూడవ తోబుట్టువు. అన్నా! రమ్ము రా! ఒకటిగాదు. వలయునన్నిగొనుము" అని జవాబిచ్చింది. అదీ భారత యువతి ధీరత్వం, సాహసం. అదీ సమయస్ఫూర్తి. కామాంధులను సైతం ఉద్యమం వైపు మళ్లించే వాక్యాలివి. నాటి యువతులు జాతీయోద్యమ భావజాలంతో ఎంతో ధీరత్వాన్ని ప్రదర్శించి సామాన్య ప్రజలకు దిక్సూచిగా నిలిచి జాతీయ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని ఈ కథ ద్వారా తెలుస్తోంది.

**ముగింపు**

పై కథలన్నింటిలో ప్రధాన పాత్రధారులు స్త్రీలే కావటం గమనార్హం. ఈ కథలన్నీ జాతీయోద్యమంలోని ఏదో ఒక ప్రముఖ ఘట్టాన్ని నేపథ్యంగా తీసుకుని చిత్రీకరించబడ్డాయి. ఆనాడు జాతీయోద్యమం పట్ల ప్రజలలో చైతన్యం కలిగించటంలో ఈ కథలు ప్రధాన భూమిక పోషించాయన్నది నిర్వివాదాంశం. ఉద్యమం యొక్క ఉధృతిని, తీరును గురించి, జాతీయోద్యమంలో ప్రాణాలను కోల్పోయిన స్త్రీలను గురించి తమ కథలలో తెలియజేసి ప్రజలను జాతీయోద్యమం పట్ల ఆకర్షితుల్ని చేయటంలో కూడ ఈ తొలితరం రచయిత్రులందరూ కృతకృత్యులయ్యారని చెప్పవచ్చు. ఎంతోమంది దేశనాయకులు, దేశభక్తులు, కవులు, రచయితలు వివిధ మార్గాలలో చేసిన పోరాటాల ఫలితంగానే నేడు మనందరం స్వాతంత్ర్యోద్యమ ఫలాలను అందుకొని స్వేచ్ఛా వాయువులను పీల్చుకుంటూ అమృతోత్సవాలను జరుపుకోగలుగుతున్నాం. ❁

**ఉపయుక్త గ్రంథాలు**

1. కథాంశం – తెలుగు కథానికాసాహిత్య విమర్శ – రాచపాళెం చంద్రశేఖర రెడ్డి – ఏప్రిల్, 2006.
2. జాతీయోద్యమకథలు – సంకలనం  ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి – పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం–హైదరాబాదు – ప్రథమ ముద్రణ – 2007.
3. కథానిక పాఠాలు – కథా రచనలో మెలకువలు – అరసం సాహిత్య పాఠశాల, గుంటూరు –ప్రథమ ముద్రణ–మే, 2016.
4. ఈ తరం కోసం – కథా స్రవంతి – కనుపర్తి వరలక్ష్మమ్మ కథలు – ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం – గుంటూరు జిల్లా – ప్రథమ ముద్రణ –జూన్ 2022.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 13
UGC Care List Approved Journals
హైదరాబాద్ డిసెంబరు - 2022

# జాతీయోద్యమంలో స్త్రీచైతన్యం

**డా. యస్. దివిజాదేవి,** తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ.ప్ర), గుంటూరు

చరవాణి : 9246806307

మన భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి డెబ్భైఅయిదు సంవత్సరాలు అయిన సందర్భంగా వజ్రోత్సవాలను జరుపుకుంటున్నాం. ప్రజల్లో దేశభక్తిని పెంపొందించాలనే ఉద్దేశ్యంతో, "ఆజాదీకా అమృత్ మహోత్సవ్" పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వివిధ సంస్థలు అనేక కార్యక్రమాలను ప్రతి పౌరుడు స్ఫూర్తి పొందేలా నిర్వహిస్తున్నాయి. తమ ఇంటి పండుగలా ప్రతిఒక్కరూ ఈ జాతీయ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు.

నేటి యువతరానికి స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న ఎందరో మహనీయుల్ని ఈ సందర్భంగా పరిచయం చేయాల్సిన అవసరమూ ఉంది. వారి త్యాగాల్ని విపులంగా వివరించి ఆ రస స్ఫూర్తిని వారిలో రగుల్కొల్పాల్సిన ఆవశక్యత ఉంది. ఆనాడు వినువీధుల్లో స్వేచ్ఛకు, ఐక్యతకు ప్రతీకయైన మన జెండాను మనవాళ్లు ఎగరవేయడానికి ఎన్ని పాట్లు పడ్డారో తెలియజేయాల్సిన బాధ్యత కూడా మనకుంది.

నేటి తరానికి గాంధీ, నెహ్రూ, పటేల్, నేతాజీ, అంబేద్కర్, భగత్ సింగ్, అల్లూరి సీతారామ రాజు, టంగుటూరి ప్రకాశం పంతులు, పింగళి వెంకయ్య, ఝాన్సీ లక్ష్మీబాయి, సరోజినీ నాయుడు, సుచేతా కృపలానీ, విజయలక్ష్మి పండిట్, సావిత్రీ బాయి పూలే లాంటి నాయకులు కొందరు మాత్రమే అందరికీ తెలుసు. మరుగున పడిన మరెందరో మహావీరులను ఈ సందర్భంగా గుర్తుచేసుకోవడం మనందరి బాధ్యత.

గడప దాటడమే గగనమైన నాటి కాలంలో తమ ప్రాణాల్ని తృణప్రాయంగా భావించిన వీర నారీమణులెందరో జాతీయోద్యమంలో పాలుపంచుకున్నారు. వాడియైన కలంతో మాటల తూటాలు పేల్చినవారు కొందరైతే, పదునెక్కిన గళంతో విప్లవాగ్ని రగిలించిన వారు మరికొందరు, కత్తి తిప్పి, గన్నుపట్టి స్వేచ్ఛా పతాకాన్ని గగన విహంగంలా చూడాలని కలలు కని పోరాటాలు సల్పిన మహనీయ అమృతమూర్తులెందరో, వారందరి త్యాగఫలాన్ని మనమిప్పుడు అనుభవిస్తున్నాం. ఈ సందర్భంగా వారిలో కొందరి గురించైనా తెలుసుకోవడం మన కర్తవ్యం.

**రాణీ చెన్నమ్మ :** భారత స్వాతంత్ర్య సంగ్రామంలో సిపాయిల తిరుగుబాటు ఓ మరపురాని ఘట్టం. ఆ తిరుగుబాటు జరగడానికి మూడు దశాబ్దాల ముందుగా, కిత్తూరు పాలకురాలు రాణీ చెన్నమ్మ తొలిసారిగా ఆంగ్లేయులపై తిరుగుబాటు చేసింది. దీనిని భారత స్వాతంత్ర్య సంగ్రామానికి సంబంధించి తొలి తిరుగుబాటుగా అభివర్ణించవచ్చు.

కర్ణాటక రాష్ట్రం బెల్గాం జిల్లాలోని కాకతి అనే చిన్న సంస్థానాన్ని పాలించే ధూళప్ప గౌడ దేశాయ్ కుమార్తె చెన్నమ్మ. చూపు తిప్పుకోలేనంత అందంతో పాటు, పెద్దపులిని వేటాడి చంపే, సాహసమూ ఆమె సొంతం. కిత్తూరు సంస్థానాధీశుడు మల్లాసర్జ దేశాయ్ ను వివాహం చేసుకుంటుంది. మల్లసర్జ కొంతకాలానికి శత్రువులకు చిక్కి బందీగా మారి అనారోగ్యంతో మరణిస్తాడు.

మరణించడంతో, ఆమె సవతి కుమారుడు శివలింగ రుద్ర సర్జ రాజవుతాడు. కానీ, పాలనా వ్యవహారాలను చెన్నమ్మే చూసుకుంటుంది.

శివలింగ రుద్ర సర్జ అనారోగ్యం పాలవుతాడు. మరణించబోయే ముందు ఓ బాలుడిని దత్తత తీసుకుంటాడు. అయితే అప్పటి బ్రిటిష్ కలెక్టర్ థాక్రే కిత్తూరు ను ఆంగ్లేయుల ఏలుబడి లోకి తెచ్చి తీరాలని సంకల్పించినందున ఈ దత్తతను అంగీకరించదు, పైగా ఖజానా పైనా, అంతఃపుర స్త్రీలపైనా నిఘా పెడతాడు. అనేక అభ్యంతరకరమైన పనులకు పాల్పడతాడు. ఈ విషయాలపట్ల అసంతృప్తి చెందిన చెన్నమ్మ పై అధికారులకు లేఖలు రాసి స్పందన లేకపోవడంతో, తప్పని పరిస్థితుల్లో తిరుగుబాటు చేస్తుంది.

ఆ తిరుగుబాటులో చెన్నమ్మ నాయకత్వం లోని కిత్తూరు యోధుల చేతుల్లో వందలాది బ్రిటిష్ సైనికులు మరణిస్తారు. బ్రిటిష్ కలెక్టర్ థాక్రే నరికివేయబడతాడు. సంస్థానాలతో వ్యవహరించాల్సిన తీరుపై ఆంగ్లేయ పాలకులకు ఓ పాఠం నేర్పిందీ తిరుగుబాటు. స్థానిక అధికారులు మొదలు గవర్నర్ వరకు ఉన్న బ్రిటిష్ పాలకులకు సింహ స్వప్నమయింది రాణీ చెన్నమ్మ.

ఒకపక్క చెన్నమ్మతో సంధి ప్రతిపాదనలు చేస్తూనే మరోపక్క యుద్ధానికి ఏర్పాట్లు చేసుకుంటారు బ్రిటిష్ వాళ్ళు. తిరుగుబాటుకు పర్యవసానం తీవ్రంగా ఉంటుందని గ్రహించి పొరుగు సంస్థానాల నుండి మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేస్తుంది. అయితే అనేక కారణాల వల్ల మద్దతు పొందలేక పోతుంది. అయినా వెనకడుగు వేయక పోరాటానికి సిద్ధపడుతుంది. తనవాళ్లే చివరికి వెన్నుపోటు పొడిచినా వెనుదీయకుండా చివరివరకూ ఒంటరి పోరాటం చేసిన ధీర చెన్నమ్మ. ఈమె పోరాట స్ఫూర్తిని అక్షరబద్ధం చేశారు ప్రముఖ కన్నడ కవి సదాశివ వడయార్.

**ఉదాదేవి :** ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో ఝాన్సీ లక్ష్మీబాయితో పాటు అనేకమంది మహిళలు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలు కోల్పోయారు. వారిలో ఓ ధీర వనితే ఉదాదేవి. అవధ్ లోని ఓ పాసీ దళిత కుటుంబంలో జన్మించిన ఈమె ఆంగ్లేయుల అరాచకాలను వింటూ పెరిగింది.

ఆంగ్లేయులు ఆక్రమించుకున్న అవధ్ సంస్థానాన్ని ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో దక్కించుకోవడానికి నడుం బిగించిన బేగం హజ్రత్ మహల్ కి ఊత గా నిలిచింది ఉదాదేవి. మహిళల బెటాలియన్ ను ఏర్పాటు చేసి నాయకత్వం వహించింది. భారీగా ఆయుధ సంపత్తి కలిగిన ఆంగ్లేయులతో నేరుగా యుద్ధం చేయడం మూర్ఖత్వం గా భావించింది. పురుషుడిగా వేషం మార్చి మహల్ ముందున్న మర్రి చెట్టు కొమ్మల్లో నక్కి కూర్చొని, క్రింద ఉన్న బ్రిటిష్ సైనికులపై కాల్పులు జరిపింది. ముప్పై రెండు మంది సైనికులను అంతమొందించింది.

చివరికి వారి తూటాలకు బలైంది. ఆమె ధైర్య సాహసాలకు, వ్యూహ చతురతకు అబ్బురపడ్డ బ్రిటిష్ అధికారులు ఆమె పార్థివ దేహానికి సెల్యూట్ చేశారు. ఆమె పోరాట పటిమ జానపదుల కథల్లో శిఖరస్థాయిగా నిలిచింది.

**అరుణా అసఫ్ అలీ :** 1909 లో బ్రహ్మ సమాజ పద్ధతులు పాటించే సంప్రదాయ బెంగాలీ కుటుంబంలో జన్మించి, స్వేచ్ఛా భావాలతో ఎదిగారు. కలకత్తా లోని గోఖలే పాఠశాలలో ఉపాధ్యాయిని గా చేరి 1928 లో ఇరవై ఏళ్ల వయసు అంతరం ఉన్నా ప్రముఖ న్యాయవాది, కాంగ్రెస్ నాయకుడు అసఫ్ అలీని ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరి వివాహాన్ని హిందూ ముస్లిం ఐక్యతకు చిహ్నంగా గాంధీ అభివర్ణించారు. ఆ వ్యాఖ్యల్ని ఆమె అంగీకరించలేదు. “ఆయన ముస్లిం మతాన్ని చూసి నేను పెళ్లి చేసుకోలేదు, ఆయన గుణ గణాలు నచ్చి చేసుకున్నాను” అని నిర్మొహమాటంగా చెప్పింది.

పెళ్లి తరువాత భర్త అడుగుజాడల్లో నడుస్తూ స్వాతంత్ర్యోద్యమంలో పాలుపంచుకుంది. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుకు వెళ్ళింది. జైల్లో తోటి ఖైదీల ఆదరణను సంపాదించింది. 1942 ఆగస్టు ఎనిమిదిన ముంబాయిలో క్విట్ ఇండియా తీర్మానాన్ని ఆమోదించగానే, గాంధీ సహా కాంగ్రెస్ నాయకులందరినీ అరెస్ట్ చేసింది బ్రిటిష్ ప్రభుత్వం. ఉద్యమానికి నాయకులు లేకుండా చేయాలని ఎత్తుగడ వేసింది. ఏమిచేయాలో అర్థం కానీ పరిస్థితుల్లో అనారోగ్యంతో పదేళ్లు గా ఉద్యమానికి దూరంగా ఉంటున్న అరుణ అనూహ్యంగా తెరపైకి వచ్చింది.

ఆగస్టు 9 న పార్టీ సదస్సును నడిపించిన ఆమె ధైర్యంగా ముంబాయి 'గొవాలియా టాంక్' మైదానంలో కాంగ్రెస్ జెండాను ఎగురవేసి గాంధీజీ ప్రకటించిన క్విట్ ఇండియా ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. దీంతో దేశవ్యాప్తంగా క్విట్ ఇండియా అగ్నిని రగిల్చింది. ఆమె అరెస్ట్ కు వారెంట్ జారీచేశాక అజ్ఞాతం లోకి వెళ్ళింది. అజ్ఞాతంలో ఉంటూనే రామ్ మనోహర్ లోహియా తో కలిసి కాంగ్రెస్ పార్టీ మాస పత్రిక 'ఇంక్విలాబ్' ను నిర్వహించింది. ఆమె తలకు ఐదు వేలు ప్రకటించింది ప్రభుత్వం. ఆమె ఆస్తులను స్వాధీనం చేసుకుంది. గాంధీ లొంగిపొమ్మని చెప్పినా వినకుండా మార్చిజానికి చేరువైంది. స్వాతంత్ర్యం వచ్చేవరకూ అజ్ఞాత పోరాటాన్నే కొనసాగించింది. స్వాతంత్ర్యం తరువాత ఢిల్లీకి తొలి మేయర్ గా వ్యవహరించారు. 1996 లో మరణించారు. 1997 లో భారత ప్రభుత్వం "భారత రత్న" ప్రకటించింది.

**బసంతీదేవి :** 1880 మార్చ్ 23 న అస్సాం లోని జమిందారీ కుటుంబం లో జన్మించింది బసంతీదేవి. కలకత్తాలోని 'లోరెంటో హౌస్' లో చదువుకున్న ఆమె పదిహేడేళ్ల వయసులో అక్కడే పరిచయమైన చిత్తరంజన్ దాస్ ను పెళ్లి చేసుకుంది. ఆయన జాతీయోద్యమంలో పాల్గొని అరెస్టయిన తరువాత ఆయన నిర్వహిస్తున్న 'బంగార్ కథ' (బెంగాల్ కథ) బాధ్యతలను స్వీకరించింది. 1925 లో మరణించడం తో, భర్త అడుగుజాడల్లో నడుస్తూ, రాజకీయ సామాజిక ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంది. శాసనోల్లంఘన, ఖిలాఫత్ ఉద్యమాల్లో పాల్గొని తనవంతు పాత్ర పోషించింది.

'బెంగాల్ ప్రావెన్షియల్' కాంగ్రెస్ అధ్యక్షురాలిగా 1922 ఏప్రిల్ లో చిట్టగాంగ్ సమావేశంలో తన ప్రసంగంతో అట్టడుగు స్థాయిలో ఆందోళనలను ప్రోత్సహించింది. దేశ వ్యాప్తంగా పర్యటిస్తూ, వలస వాదాన్ని వ్యతిరేకించేందుకు గాను కళలకు, సాంస్కృతిక కార్యక్రమాలకు మద్దతిచ్చింది. ఈ క్రమంలోనే మహిళలకు విద్యనందించాలనే లక్ష్యంతో, 'నారీ కర్మ మందిర్' పేరుతో ఒక శిక్షణా కేంద్రాన్ని స్థాపించింది. పోలీసుల లాఠీ చార్జి లో మరణించిన లాలా లజపతిరాయ్ మరణానికి ప్రతీకారం తీర్చుకోవాలని యువతకు ఉద్బోధించింది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఆమె సామాజిక సేవలో కాలం గడిపారు. భారత ప్రభుత్వం 1973 లో ఆమెను దేశపు అత్యున్నత పౌర పురస్కారమైన పద్మవిభూషణ్ తో సత్కరించింది.

**డా. ఉషా మెహతా :** 1920 మార్చ్ 25న సూరత్‌కు దగ్గరలోని 'సరస్' అనే గ్రామంలో జన్మించింది. పాఠశాల స్థాయిలోనే స్వాతంత్ర్య ఉద్యమానికి ఆకర్షితులయ్యింది. ఎనిమిదేళ్ల వయసులోనే 1928 లో 'సైమన్ గో బ్యాక్' అంటూ నల్ల జెండా పట్టుకుంది. 1930 లో 'ఉప్పు సత్యాగ్రహం' ప్రభావంతో బయటికి వెళితే న్యాయమూర్తి అయిన తండ్రికి ఇబ్బంది కలుగుతుందని, సముద్రపు నీటినే ఇంటికి తీసుకువచ్చి ఉప్పును తయారు చేసింది.

తండ్రి ఉద్యోగ విరమణ చేశాక కుటుంబం ముంబాయికి చేరుకుంది. 1933లో ముంబాయి కళాశాలలో చేరి "మంజర్ సేన" (పిల్లల సేన) ను స్థాపించింది. వీరు ఉద్యమకారులకు సహాయం చేయడంతోపాటు, ఆంగ్లేయులను ఆట పట్టించేవారు. 1939 లో తత్వశాస్త్రంలో డిగ్రీ పూర్తి చేసిన ఉష, గాంధీ 1942 లో ఇచ్చిన "Do or Die" నినాదానికి ఉత్తేజితురాలై స్వాతంత్ర్య ఉద్యమ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొన్నది. "క్విట్ ఇండియా" ఉద్యమంలో సామాన్యులను భాగస్వాములను చేసింది.

1942 ఆగస్టు 14 న "వినండి కాంగ్రెస్ రేడియో 42.34 మీటర్స్" అంటూ రేడియో ద్వారా జాతీయ భావ తరంగాలను దేశ ప్రజల్లో వ్యాప్తి చేశారు. ఈ రేడియో "హిందుస్థాన్ హమారా" గీతంతో ప్రారంభమై "వందేమాతరం" గీతంతో ముగిసేది. గాంధీ లాంటి ముఖ్య నేతల ప్రసంగాలు దీనిలో ప్రసారమయ్యేవి. బ్రిటిష్ ప్రభుత్వం ప్రసార సాధనాలపై ఆంక్షలు విధించిన సమయంలో ఈ "యఫ్.యం." రేడియో నాయకులకు ప్రజలకు మధ్య వారధిగా నిలిచింది. బ్రిటిష్ రాడార్ నుండి తప్పించుకోవడానికి దేశంలోని వివిధ ప్రదేశాలనుండి ప్రసారాలు చేసేవారు. చివరకు ఒక సాంకేతిక నిపుణుడి మోసంతో 1942 నవంబర్ 12 న దొరికిపోయి కఠిన కారాగార శిక్ష అనుభవించారు.

స్వాతంత్ర్యానంతరం గాంధీ సిద్ధాంతాలపై Ph.D ని చేసి అధ్యాపకురాలిగా స్థిరపడ్డారు. "దేశం పట్ల విశ్వాసంగా ఉండటం మన బాధ్యత" అనే ఆమె పద్మభూషణ్ సత్కారాన్ని అందుకున్నారు. 2000 సం. ఆగస్టు 11 న మరణించారు.

**కమలాదేవి ఛటోపాధ్యాయ :** భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని అరెస్టయిన మొదటి భారతీయ మహిళ ఈమె. 1903 లో కర్ణాటకలోని మంగళూరులో సనాతన బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన ఈమె బాలవితంతువు, తొలి వితంతు వివాహమూ చేసుకున్నారు. తొలి విడాకులూ తీసుకున్నారు. జాతీయోద్యమంలో భాగమైన సంఘసంస్కరణోద్యమాన్ని ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని ముందుకు తీసుకెళ్లారు. మహిళా చైతన్యానికి కారణభూతులయ్యారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టయ్యారు.

సంఘ సంస్కర్తగా, రాజకీయ నాయకురాలిగా, సాంస్కృతిక వారధిగా, హస్తకళల నైపుణ్యం కలిగిన వ్యక్తిగా, స్త్రీ వాదిగా, విద్యావేత్తగా, నట-ప్రదర్శన కళల పోషకురాలిగా, విభిన్న రంగాలలో తనదైన ముద్ర వేస్తూ, 1932 లో ఢిల్లీలోని 'లేడీ ఇర్విన్ ఉమెన్స్' కళాశాల వ్యవస్థాపకుల్లో ఒకరిగా కూడా ఉన్నారు. వీరి విభిన్న రంగాల ప్రస్థానం మనందరికీ ఆదర్శప్రాయం.

**సరళా బెన్ :** ఇంగ్లాండ్ లోని ఓ మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన 'కేథరిన్ మేరీ హీల్ మాన్' ప్రపంచ శాంతి, సహకారం, సమానత్వాలను వెదుక్కుంటూ భారతదేశానికి వచ్చింది. భారత ప్రజలు గాంధీజీ నేతృత్వంలో శాంతి, అహింసా మార్గాల్లో స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నారని తెలిసి స్ఫూర్తి పొందారు.

ఈ పోరాటంలో భారతీయులతో కలిసి నడవాలని నిర్ణయించుకొని 'సరళా బెన్' గా పేరుమార్చుకొని హిమాలయాల లోని గర్వాల్ కి వెళ్లారు అక్కడి ప్రజలను స్వాతంత్ర్యోద్యమంలో భాగస్థులను చేశారు. 'క్విట్ ఇండియా' సమయంలో కుమావ్ జిల్లాలోని ప్రతీ లోయలోనూ ర్యాలీలు నిర్వహించారు. ఆమె పేరే ఓ ఉద్యమంగా మారింది. స్వాతంత్ర్యానంతరం పర్యావరణ పరిరక్షణకు కృషి చేశారు. చిప్కో ఉద్యమకారుడు సుందరలాల్ బహుగుణ ఈమె శిష్యుడే.

**నెలిసేన్ గుప్త :** బ్రిటన్ కు చెందిన 'ఎలెన్ గ్రే' కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో కలిసిన జతీంద్రసేన్ గుప్తాను వివాహమాడి భారత్‌లోకి అడుగుపెట్టి, నెలిసేన్ గుప్తాగా మారి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని తన జాతి వారైన బ్రిటిష్ వారినే ఎదిరించింది. 1973 లో భారత ప్రభుత్వం 'పద్మవిభూషణ్' అవార్డ్ తో ఈమెను సత్కరించింది.

**నీరా ఆర్య :** చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయి, పెంపుడుతండ్రి తో వ్యాపారరీత్యా దేశమంతా తిరుగుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొంటున్న యోధుల్ని చూసి స్ఫూర్తి పొందింది. తానూ ఆ పోరాటంలో పాల్గొనాలని ఆకాంక్షించింది. అది గ్రహించిన తండ్రి బ్రిటిష్ ప్రభుత్వం లో పనిచేస్తున్న వ్యక్తికిచ్చి పెళ్లిచేస్తాడు. అయినా ఆమె తన ఆలోచనను మాత్రం మార్చుకోలేదు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన "ఆజాద్ హింద్ ఫౌజ్" లో సైనికురాలిగా చేరింది. బ్రిటిష్ పాలకుల రహస్యాలు తెలుసుకునే గూఢచారిగా ఎదిగింది. "దేశ తొలి మహిళా గూఢచారి" గా పేరు తెచ్చుకుంది. బ్రిటిష్ వారి ఆదేశానుసారం నేతాజీ పై కాల్పులు జరిపిన తన భర్త ప్రాణాలనే తీసింది. అరెస్ట్ అయి అండమాన్ లోని 'కాలాపానీ' జైల్లో సైనికుల చేతిలో నరకయాతన అనుభవించింది.

నేతాజీ ఎక్కడున్నారు చెప్పు అనే సైనికులకు తన గుండెల్లో అనే సమాధానమిస్తే, ఆ గుండెల్ని చీల్చిన దుర్మార్గులు బ్రిటిష్ సైన్యం. స్వాతంత్ర్యం తరువాత విడుదలై అతి సాధారణ జీవితం గడిపింది. ఈమె జీవితం "లేడి స్పై" అనే పుస్తకంగా వచ్చింది. దేశం కోసం కుటుంబాన్నే కాదనుకున్న ఆదర్శమూర్తి నీరా ఆర్య.

**డాక్టర్ లక్ష్మీ సెహగల్ :** కేరళలోని భూస్వాముల కుటుంబంలో జన్మించిన లక్ష్మీ సెహగల్ బ్రిటిష్ పాలకులను తరిమేసేందుకు అడివి బాట పట్టింది. ఆయుధాలు భుజాన వేసుకొని పోరాడిన ధీర వనితల్లో ఈమె కూడా ఒకరు. దేశంలో కులతత్వానికి వ్యతిరేకంగా ఆమె చేసిన పోరాటం మరో జాతీయోద్యమాన్ని తలపిస్తుంది.

1938 లో మద్రాసు వైద్య కళాశాలలో 'ఎంబిబిఎస్' పూర్తయ్యాక 1940 లో సింగపూర్ వెళ్ళింది. అక్కడ నిరుపేదల వాడలో వైద్యశాల స్థాపించి స్థానికంగా ఉన్న భారతీయ కార్మికులకు సేవలందించింది. అక్కడే నేతాజీ ప్రసంగాలకు ప్రభావితురాలై 'ఆజాద్ హింద్ ఫౌస్' మహిళా దళాల్లో చేరి, కెప్టెన్ హోదా పొందింది. బోస్ స్థాపించిన 'నేషనల్ ఆర్మీ ఆధ్వర్యంలోని ఝాన్సీ 'రెజిమెంట్' కు ప్రాతినిధ్యం వహించిన ఆమె 'ఆల్ ఉమన్ రెజిమెంట్'ను నిర్మించడంలో, కమాండ్ చేయడంలో సాయపడింది. సింగపూర్, మలేషియాలలోని భారతీయుల కుమార్తెలు ఈ రెజిమెంట్ లో చేరగా, వారికి ఆయుధాలు ఉపయోగించడంలో శిక్షణ ఇచ్చింది. INA లో కల్నల్ హోదా కలిగిన ప్రేమ్ కుమార్ సెహగల్ తో ప్రేమలో పడింది. INA దళాలు బర్మాకు వెళ్ళే క్రమంలో బ్రిటిష్ వాళ్ళకు పట్టుబడి జైలు జీవితాన్ని అనుభవించింది. స్వాతంత్ర్యం వచ్చాక సిపిఐ(యం)లో చేరి, ప్రతిపక్ష నాయకురాలిగా బాధ్యతలూ నిర్వహించారు. మహిళల హక్కుల కోసం పోరాడిన ఈమె 2012 లో మృతి చెందారు.

**పారుకుట్టి నెత్యార్ :** కొచ్చిన్ రాజు రామవర్మ-16 భార్య పారుకుట్టి నెత్యార్. రాజుకు విద్యా, వైద్య, ఖగోళ, జ్యోతిష్య రంగాలలో ఆసక్తి. రాజకీయ పరిపాలనా బాధ్యతలు పట్టించుకోకపోవడంతో పారుకుట్టి నెత్యార్ యుక్త వయసులోనే పరిపాలనా బాధ్యతలు తీసుకొని అనేక పాలనా పరమైన సంస్కరణలు తెచ్చి కొచ్చిన్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశారు.

ఇవన్నీ చూసిన బ్రిటిష్ సర్కార్ ఆమెకు అత్యున్నత పౌర పురస్కారం 'కైజర్ ఎ హింద్' ను ప్రకటించడమే కాకుండా, కొచ్చిన్‌కు పదిహేడు గన్‌ల శాల్యూట్ హోదాను ఇచ్చింది. అనేక సందర్భాలలో ఆంగ్లేయుల కపటత్వాన్ని చూసిన ఆమె, ఆర్థికంగా నిలదొక్కుకున్న కొచ్చిన్ ను తరువాత ఆంగ్లేయులు కొల్లగొట్టడానికి ప్రయత్నిస్తారని ఊహించారు. అందుకే ఆంగ్లేయులకు ఆ అవకాశం ఇవ్వకుండా భారత స్వాతంత్ర్య ఉద్యమానికి బహిరంగ మద్దతు ప్రకటించింది.

రాచరికపు ఆడంబరాలు, ఆభరణాలు అన్నీ వదిలేసి ఖద్దరు చీర కట్టుకున్నారు, తన రాజ ప్రసాదంలోనే ఖద్దరు తయారీ కేంద్రం ఆరంభించి అక్కడ ఉన్న అందరి వస్త్ర ధారణను మార్పించారు. జాతీయోద్యమ కార్యకలాపాలకు రాజ మందిరాన్ని కేంద్రంగా మార్చారు. గాంధీజీకి స్నేహ హస్తం అందించారు. ఆయన్ని కలిసి జాతీయోద్యమానికి భూరి విరాళం అందజేశారు. తన కుమారుణ్ణి గాంధీకి తోడుగా పంపారు. బ్రిటిష్ వారు తమ రాజ్యం వైపు కన్నెత్తకుండా సంరక్షించుకున్నారు.

**గులాబ్ కౌర్ :** పంజాబ్‌లోని సామాన్య రైతు కుటుంబంలో 1890లో జన్మించిన గులాబ్ కౌర్ కుమన్ సింగ్ తో పెళ్లయ్యాక ఆంగ్లేయ సర్కార్ విధానాలకు విసుగు చెంది మెరుగైన జీవితం కోసం పొట్ట చేత్తో పట్టుకొని అమెరికా వెళ్ళే క్రమంలో మొదట ఫిలిఫిన్స్ లో అడుగుపెట్టారు.

ఆ సమయంలో భారత్‌లో బ్రిటీష్ సర్కార్‌ను కూల్చేసే క్రమంలో ప్రవాస భారతీయులతో ఏర్పడ్డ 'గదర్' పార్టీ విస్తరిస్తుంది. అమెరికా, కెనడా, సింగపూర్, ఫిలిప్పీన్స్, హాంకాంగ్ లలో భారతీయులపై విప్లవ కార్యకలాపాల ప్రభావం ఉండేది. అక్కడి గురుద్వారాల్లో మత ప్రార్థనల తరువాత స్వాతంత్ర్య లక్ష్యాల గురించి చర్చలు నడిచేవి. వాటి స్ఫూర్తితో గులాబ్ దంపతులు జాతీయోద్యమ కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొనేవారు. గులాబ్ తన గాత్రంతో అందరిలో స్ఫూర్తి నింపేది.

వారు భారత్ కు వెళ్ళి పోరాటం కొనసాగించాలనుకున్నారు. తీరా ఓడ ఎక్కేరోజు భర్త అమెరికాకే వెళ్ళి సుఖవంతమైన జీవితం గడుపుదామన్నాడు. పతిభక్తి కన్నా దేశభక్తి కే ప్రాధాన్యమిచ్చి భర్తను వదిలేసి గదర్ పార్టీ నేతలతో భారత్ కి బయలుదేరింది. గదర్ పార్టీకి ఆయుధాల సరఫరాతో పాటు, గూఢచర్యం చేస్తూ గదర్ పార్టీలో కీలక పాత్ర పోషించింది. రాజద్రోహం కేసు పెట్టి పోలీసులు ఆమెపై ప్రత్యేక నిఘాపెట్టి అరెస్ట్ చేశారు. జైల్లో చిత్రహింసలు పెట్టారు. విడుదలయ్యాక కూడా స్వాతంత్ర్య పోరాటం కోసం ప్రజల్ని చైతన్య పరిచింది ఈ మహనీయురాలు.

'సీతారామం' లాంటి పుస్తకాలు రాస్తూ, బెంగాలీ పుస్తకాలను అనువదిస్తూ బెంగాల్ లో చదువుకున్న ఏలూరు అమ్మాయి మాగంటి అన్నపూర్ణ తన నగలన్నీ జాతీయోద్యమానికి విరాలమిచ్చి, అమెరికా చదువునే వద్దనుకొని జాతీయోద్యమంలో పాల్గొన్న

మాగంటి అన్నపూర్ణమ్మ గాంధీజీ చేత 'కన్న కూతురు' గా సంభావింపబడ్డారు. భగత్ సింగ్ లాంటి వీరులకు కుటుంబాన్నే కాదనుకొని ఆశ్రయమిచ్చిన, సుశీలా దీదీ వైస్రాయ్ హత్యకు పథకం రచించిన ధీర.

దుర్గాబాయి దేశముఖ్, సంగం లక్ష్మీబాయి, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి, ఐలమ్మ, తారారాణి శ్రీవాస్తవ, మాతంగిని హజ్రా, అరుణా అసఫ్ అలీ, గులాబ్ కౌర్, కమలా నెహ్రూ, కల్పనా దత్తా, బికాజీ కామా, అనిబిసెంట్, ఇలా అజరామరమైన స్వాతంత్ర్య సమరాంగనల చరిత్ర అజరామరం, నిరంతరం స్మరణీయం. ఇలా ఎందరో ఇంకెందరో, మనకు తెలిసింది కొందరే, వారందరికీ ఈ సందర్భంగా నివాళులు. ❁

**ఆధారాలు :**

1. వివిధ పత్రికలు

2. సామాజిక మాధ్యమాలు

# జాతీయోద్యమంలో కనుపర్తి వరలక్ష్మమ్మ

**డా. పరుచూరి విజయలక్ష్మి,** తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ మహిళా కళాశాల, గుంటూరు

జాతీయోద్యమంలో పాల్గొన్న వందలాది మంది మగవారితో సమానంగా ఆడువారు కూడా చాలా మంది పాల్గొని భారత మాత దాస్యశృంఖలాలు తెంచడంలో తమవంతు పాత్రను ఎంతో సమర్ధవంతంగా పోషించారు. అలాంటి ధీర వనితల్లో ఒకరు మన కనుపర్తి వరలక్ష్మమ్మగారు. "ధర్మము నా జీవనము, నీతి నా మతము, సతీశ్రేయము నా లక్ష్యము" ఈ మూడింటిని సమర్ధించుటకే కలము పట్టితినని చెప్పిన విదుషీమణి శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారు. వీరు 6.10.1896 న రాజకీయాలకు, కళలకు కాణాచి అయిన బాపట్లలో జన్మించారు. ఆరోజుల్లో ఆడపిల్ల ఇంటిని సరిదిద్దుకుంటూ భర్తకు అనుకూలంగా నడుచుకుంటే చాలు అనుకునేవారు. ఆడవారు వీధుల్లో చెప్పులు వేసుకొని నడవడం మర్యాద కాదు. అవసరమైనా కూడా కళ్ళజోడు పెట్టుకోవడం తప్పు వంటి ఎన్నో ఆంక్షలమధ్య నలిగిపోతూ ఉండేది ఆడపిల్ల జీవితం.

అలాంటి పరిస్థితులలో కూడా వరలక్ష్మమ్మ మాత్రం కనిపించిన ప్రతి పత్రిక , ప్రతి పుస్తకం ఆసక్తితో చదివే వారు. అన్నగారి ప్రోత్సాహంతో వీరేశలింగం గారి వ్యాసాల్ని చదివి వాటి సారాంశాల్ని, భావాల్ని ఆమె స్వంత మాటలతో వ్రాసేవారు. కొటికలపూడి సీతమ్మ గారి ప్రసంగంతో తాను విద్యాభ్యాసం చేయాలనే ధృఢ సంకల్పం వరలక్ష్మమ్మ గారి మదిలో ఏర్పడింది. విద్యాభ్యాసం అంటే స్కూళ్లకు, కాలేజీ లకు వెళ్ళి మాత్రమే చదవాల్సిన అవసరం లేదు. మంచి గ్రంథాలను చదివి బాగా అవగాహన చేసుకొని అర్థాన్ని మనస్సుకు పట్టించుకుంటే అదీ విద్యాభ్యాసమే. ఆ విధంగా విద్యావంతురాలు అయింది వరలక్ష్మమ్మ. బాపట్లలో చోరగుడి సీతమ్మగారి సాహచర్యంలో ఎంతో నేర్చుకున్నారు. కృష్ణా పత్రిక, రఘువంశం, మనుచరిత్ర వంటి గ్రంథాలను ఔపోసన పట్టారు. అదిచూసి ఆమె అన్నగారైన నరసింహం వరలక్ష్మమ్మ అత్తవారింటికి వెళ్లేటప్పుడు "శబ్దార్థ చంద్రిక" అనే తెలుగు నిఘంటువును బహుమతిగా ఇచ్చారు.

పన్నెండేళ్ళ వయసులో కనుపర్తి హనుమంతరావు గారితో వరలక్ష్మమ్మ గారి వివాహం జరిగింది. విద్యాభ్యాసం రోజుల్లో వీరేశలింగం గారి ఉద్యమాలకు ప్రభావితుడైన, సంస్కారవంతుడైన హనుమంతరావు గారు, విద్యా విజ్ఞానాలకు సంబంధించిన గ్రంథాలను తెచ్చి భార్యకు ఇచ్చి ఆవిడ వ్యక్తిగా, రచయిత్రిగా, సారస్వత మూర్తిగా ఎదగడానికి తనవంతు సహకారాన్ని అందించారు.

ఆమెకు గ్రంథ రచన చెయ్యాలి. అనే కోరిక బలంగా ఉండేది. ఆమె చదివిన పుస్తకాలు, పత్రికలు, అభివృద్ధి సంఘాల వారు నిర్వహించిన పరీక్షలలో వరుసగా స్వర్ణపతకాలు సాధించడంతో వచ్చిన ఆత్మ విశ్వాసము, ఆమె బలమైన కోరిక తీర్చుకోవడంలో సోపానాలయ్యాయి. తెలుగు సాహిత్యానికి అపురూపమైన సేవచేసిన భారతి మాసపత్రికలో 1925 నుండి సుమారు 20 సం. ల పాటు, ప్రేమసుధ, బేంకీ బుచ్చిబాబు, రెండుకోర్కెలు, దీర్ఘ సుమంగళీభవ, ముందుకథ, మొదలైన కథలు ప్రచురించబడ్డాయి. అదేవిధంగా వినోదిని, గృహలక్ష్మి వంటి పత్రికల్లో కూడా ఈమె కథలు ప్రచురించబడ్డాయి. వీరు సుమారు యాభైకి పైగా కథలు రచించారు. ప్రతి కథలోనూ సమకాలీన సమాజం కథా వస్తువు, మారుతున్న పరిస్థితులు, మారుతున్న ధోరణులు, వాటి మంచి

చెడ్డలు, పాతవి ఎంతవరకు అనుసరించాలి, కొత్తవాటిని ఎంతవరకు ఆహ్వానించాలి. సంప్రదాయాలలో మేలు చేకూర్చేవి ఎంత? చెరుపు చేసేవి ఎంత? సమాజ సంస్కరణ ఏ రంగాలలో సాధించాలి మొదలగు విషయాలు వరలక్ష్మమ్మ కథల్లో కథా వస్తువులుగా ఉన్నాయి.

"పండ్లు కండ్లు లేని ముదుసలులకు పొట్టపొడిచినా అక్షరం ముక్క రాని, నిరక్షర కుక్షులకు గవ్వ గడింపలేని అప్రయోజకులకు కన్యాశుల్కం తీసుకుని కన్యల్ని సమకూర్చే నిర్భాగ్యపు దేశం".

అంటూ ఆనాడు సమాజంలో ఉన్న కన్యాశుల్క దూరాచారాన్ని పెల్లుబికిన ఆవేశంతో ఎత్తిచూపిన సంఘ సంస్కర్త. ఇంతవరకు వరలక్ష్మమ్మగారి బాల్యం, స్త్రీకి ఎన్నో ఆంక్షలున్న ఆ కాలంలో కూడా సారస్వత మూర్తిగా ఎదిగిన తీరు చూసాము. ఇది నాణానికి ఒక వైపు మాత్రమే. రెండవ వైపు చూస్తే వరలక్ష్మమ్మ గారి దేశభక్తి, జాతీయోద్యమంలో ఆవిడ నిర్వహించిన కీలకమైన పాత్ర కనిపిస్తుంది. దానిని కూడా పరిశీలిద్దాం.

**కరుణ గల నా తల్లి మా పాల కల్పవల్లి**
**అమ్మ భారతి వందనమమ్మ నీకు**
**ఆ భరత ధాత్రి నా తల్లి కంజలిడుదు**
**నవ్య స్వాతంత్ర్య వైభవ భవ్య వేళ**

అంటూ భరతమాత దాస్య శృంఖలాలు తెంచుకొని స్వేచ్ఛా గాలులు పీల్చుకుంటున్న ప్రథమ స్వాతంత్ర్య దినోత్సవం రోజున గళమెత్తి భారతమాతను కీర్తించిన శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ బాల్యం నుంచి దేశస్థుల పట్ల గాఢాను రక్తినీ, అభిమానాన్ని పెంచుకున్న వ్యక్తి. "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరియసీ" అనే మహా వాక్యాన్ని లోకానికి అందించిన శ్రీమద్రామాయణాన్ని చిన్న నాటనే చదివింది. ఈమె పుట్టింది చదువు, సంస్కారం ఉన్న కుటుంబంలో, వివాహమాడింది నీతి నిజాయితీ గల విద్యావంతుడు, మనసంతా దేశభక్తితో నిండి ఉన్న హనుమంతరావు గారిని. ఇటువంటి వాతావరణంలో ఉన్న వరలక్ష్మమ్మ గారికి దేశాభిమానము, మాతృభూమి మీద విశేష ఆదరం, గౌరవం ఉండటంలో ఆశ్చర్యం ఏముంది?

1910-20 ప్రాంతంలో భారతదేశంలో లాల్, బాల్, పాల్, నాయకత్వంలో స్వాతంత్ర్య పోరాటం తీవ్ర రూపం దాల్చింది. 1920 నాటికి మోహన్దాస్ కరంచంద్ గాంధీ ఆఫ్రికా నుండి తిరిగి వచ్చి స్వాతంత్ర్య సమర బాధ్యతను స్వీకరించి ప్రజల హృదయాలలో వెలుగుతున్న స్వాతంత్ర్య ఆకాంక్ష జ్యోతుల్ని తనసహాయ నిరాకరణ, శాసనోల్లంఘన, సత్యాగ్రహాల ద్వారా జ్వాజ్వల్యమానంగా చేశారు.

స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా రాట్నం పై నూలు వడకటం, ఖద్దరు కట్టడం, విదేశీ వస్తు బహిష్కరణ, దేశీయ విద్యాబోధన, హరిజనోద్ధరణ ఇవన్నీ స్వాతంత్ర్య సముపార్జనకు సాధనాలుగా, దేశభక్తికి సంకేతాలుగా స్థిరపడ్డాయి. అటువంటి పరిస్థితుల్లో వరలక్ష్మమ్మ భర్త ఉద్యోగ రీత్యా బదిలీలపై ఎక్కడికి వెళితే అక్కడ ఉన్న స్త్రీలను ఒకచోట చేర్చి ఉపన్యాసాలిచ్చి వారిలో స్వాతంత్ర్య ఆకాంక్షను, దేశాభిమానాన్ని పెంపొందించారు. తాను రాసిన శారద లేఖల్లో విదేశీవస్తు బహిష్కరణ, రాట్నంపై నూలువడకటం, ఉప్పు సత్యాగ్రహం వంటి విషయాల్ని ప్రస్తావించి, స్వాతంత్ర్య సముపార్జనకోసం సాగుతున్న సమరంలో స్త్రీలు కూడా విరివిగా పాల్గొనాలని, దేశభక్తి ఒక్క పురుషులకే కాదు, స్త్రీలకు కూడా ఉందని నిరూపించాలని ప్రబోధించారు. సహాయ నిరాకరణోద్యమం కొనసాగుతున్న రోజుల్లో వరలక్ష్మమ్మ గారు తన మిత్రు రాళ్ళతో కలసి స్వరాజ్యాలక్ష్మి వ్రతము, రాట్న పూజ చేసి, స్వదేశీ దీక్షా దారాలను ముంజేతికి కట్టుకున్నారు. తిలక్ స్వరాజ్యానిధికి కోటిరూపాయాల సేకరణ కార్యక్రమంలో పాల్గొని తానుకూడా విరాళాలు సేకరించి ఆ నిధికి పంపారు.

మహాత్మా గాంధీ బందరు వచ్చినపుడు వారిని కలిసి రాట్నంపై వడికిన నూలు మాలను వారికి సమర్పించి స్వరాజ్యానిధికి తన చేతికున్న ఉంగరాన్ని విరాళంగా సమర్పించారు. అపుడామె మిల్లు చీర ధరించి ఉన్నారు. అదిచూసి బాపూజీ మీరు రోజూ నూలు వడుకుతున్నారా? మరి మిల్లు చీర కట్టారేం ? ఇకనుంచైనా ఖద్దరు కడతారా? అని అడిగారు. వెంటనే అలాగే కడతాను అని బాపూజికి మాట ఇచ్చి అప్పటినుండి ముసలితనం వచ్చి లేవలేని పరిస్థితి వచ్చేదాకా ఖద్దరే కట్టారు. ఆ తర్వాత అయినా నేత చీర కట్టారు కానీ మిల్లు చీర కట్టలేదు. ఆమె మరణించిన తరువాత కూడా ఆమె కోరుకున్నట్లుగా శవం మీద ఖద్దరు వస్త్రాన్నే కప్పి శ్మశానానికి తీసుకు వెళ్లారు. ఖద్దరు ధారణ పట్ల ఆమెకుగల దీక్షా దక్షతలు అంత గొప్పవి.

ఒంట్లో ఓపిక ఉన్నంతవరకు రాట్నం వడికారు. ఖద్దరు కట్టారు. స్త్రీ హితైషిణి మండలిలో దేశభక్తిని పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించారు, దేశభక్తిని పెంపొందించే నవ భారతేతిహాసము, మహాత్మా గాంధీ జీవితము, రాణి మల్లమ్మ, నమో ఆంధ్రమాతా వంటి దేశభక్తి రచనలను పదుల సంఖ్యలలో రచించారు.

వరలక్ష్మమ్మ గారు ప్రత్యక్షంగా రాజకీయాలలో పాల్గొనలేదు కానీ తన తోడి స్త్రీలలో రాజకీయ చైతన్యం కలిగించేవారు. విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ వస్త్ర ధారణ, రాట్నం పై నూలు వడకడం మొదలయిన విషయాలను గురించి ఆమె రాసిన రాతల వలన ఎందరో స్త్రీలు ఉత్తేజితులై విదేశీ వస్తు బహిష్కరణ వంటి అనేక జాతీయ కార్యక్రమాలలో పాల్గొని జైళ్లకు వెళ్ళిన వారు కూడా ఉన్నారు. వారిలో గర్భవతులుగా ఉన్న స్త్రీలు జైళ్ళలో పురుళ్లు పోసుకోవడం విశేషం.

గాంధీ గారంటే వరలక్ష్మమ్మ గారికి చెప్పలేనంత భక్తి. ధర్మ సంస్థాపనాయ సంభవామి యుగే యుగే అని భగవంతుడు ధర్మ సంస్థాపన కొరకుజన్మించి నట్లు భారత మాత దాస్య శృంఖలాలు తొలగించుటకొరకు జన్మించిన అవతార మూర్తి మహాత్మా గాంధీ అని నమ్మే వ్యక్తి వరలక్ష్మమ్మ గారు. ఆవిడకు గాందీ అంటే ఎంత భక్తి అంటే గాంధీ గురించి ఒక దండకమే వ్రాసారు. అంతే కాకుండా గాంధీని కీర్తిస్తూ.

**ఖగ నాధుడమరేంద్రు గెలచి సుధయున్ గైకొన్న చందంబునన్**
**తగవున్ సత్యమతిక్రమింపక ధౌర్యం బేమియు లేకుండగన్**
**పగరం గెలచి స్వరాజ్యమన్ సుధను సంపాదించి మా గాంధీజీ**
**వగపున బయపెన మా భారతాంబకకిక వహ్వా!చూడుడీ నేటితో**

అంటూ ఆయనను కీర్తిస్తూ చాలా పద్యాలు రాశారు. గాంధీ గారిని చెరసాలలో వేసినపుడు వరలక్ష్మమ్మ గారు రాసిన శారద లేఖ జాతీయోద్యమంలో ఆమె ఎంతటి క్రియా శీలక పాత్ర పోషించారో తెలుపుతుంది. సత్యము అహింసా, త్యాగము అనే సూత్ర త్రయాలతో నిర్మితమైన ఈ మహోద్యమానికి మహాపవిత్రుడు, సాధు మూర్తి యగు మహాత్మాగాంధి తండ్రిలా నడుపువాడగుట వలన ఈ ఉద్యమానికి ఇంత పూజ్యత వచ్చిందని, ఆ మహాత్మునికి సమకాలీకులమగుట మన అదృష్టమని తెలిపింది. "వానర యూధములు రామ కార్యమున పాల్గొని పావనమైనట్లు నేడు మహాత్ముని ఉద్యమంలో పాల్గొనిన వారెల్లరు పునీతులగుదరు" అని రామకార్యమంత గొప్పకార్యము ఈ జాతీయోద్యమము. రాముడంతటివాడు గాంధీజీ, వానరుల వలే మనం కూడా ఈ జాతీయోద్యమంలో పాల్గొనాలని చెప్పారు. "రాముని వెంట తరలిన సీతా సాధ్వీమణి చందమున ననవరతము మహాత్ముని అడుగుజాడల నడచుచూ పుత్రులును, భర్తయు, గూడ బంధీకృతులైనను నిరుత్సాహమనునది లేక చింతయనునది యెరుగక దాదాపు అరువదేండ్లు సమీపించినను వ్యగ్రోత్సాహముతో కార్య రంగమున నిలిచి పనిచేయుచున్న బాబూజి ప్రియపత్ని కస్తూరి బాయియే మన స్త్రీలకాదర్శము. మహాత్ముడు చెరసాలకేగునపుడు మీ భార్యకేమి చెప్పుదురని యడుగ 'నీనేమియు చెప్పనక్కరలేదు ఆమె చాలా ధీరురాలు' అనినాడు నేడు భారత నారీమణు లెల్లరట్టి ధీరురాండ్రు కావలెను" అంటూ స్త్రీలు జాతీయోద్యమంలో పాల్గొనవలేనని తన లేఖ ద్వారా మేల్కొలిపింది.

గాంధీ గారితో పాటుగా సరోజినీ నాయుడు గారితో కూడా ఈమెకు పరిచయం మెండుగా ఉంది. వరలక్ష్మమ్మ గారి ఉపన్యాసానికి ముగ్ధురాలైన సరోజినీ నాయుడు వారింటికి ఆహ్వానించి సత్కరించారు. అదేవిధంగా స్వాతంత్ర్య సమరయోధురాలు ,స్త్రీ జనోద్ధరణకై కంకణం కట్టుకుని, ఆంధ్ర మహిళా సభ వంటి ఎన్నో సంస్థలను స్థాపించిన దుర్గాబాయ్ దేశముఖ్ వరలక్ష్మమ్మ గారికి సన్నిహితమైన సంబంధం ఉంది. దేశముఖ్ దంపతులు స్త్రీ హితైషిణి మండలిని సందర్శించారు. మద్రాసులో దుర్గాబాయ్ నిర్వహిస్తున్న సంస్థలని చూసి ముగ్ధురాలై

**ఉమకును రమకును వాణికి**
**అమర నొకే రూపమంది యవని జనింపన్**
**తమక మొదువగ స్త్రీకల్ప**
**ద్రుమమై యిట బుట్టితీవు దుర్గాబాయీ !**

అంటూ ఆమెను గురించి పద్యాలు రాసి ఆమెపై తన అభిమానాన్ని ప్రకటించుకున్నారు.

'భారత మాతా వందనం' అంటూ రాసిన పద్యాలలో

సకలలోక సంస్తూయమానవౌ శ్రీ సర్వజని గణన శిష్ట చరిత
వివిధ ఖండాలలో విఖ్యాతిగాంచిన విజయలక్ష్మిని గన్న వీర చరిత
అజదు వీరుల గూడి యాలంబు సేసిన లక్ష్మి యోధనుగన్న లలిత చరిత
స్త్రీ జనోద్ధరణకై సేవా వ్రతాసక్త మా పార్వతిని గన్న మహిత చరిత
హంస మెహతా సుచేతయు నమృత కౌరు
కమల యరుణాది వనితల గన్న తల్లి
కారునాగల తల్లి మా పాల కల్పవల్లి
అమ్మ భారతి వందనమమ్మ నీకు. అంటూ ప్రముఖ నారీ మణులను కీర్తించింది.

వరలక్ష్మమ్మగారు తాను రచించిన కథల ద్వారా కూడా జాతీయోద్యమ స్ఫూర్తిని ప్రజల్లో నింపారు. వీరు రాసిన కొన్ని కథలను ఇక్కడ స్పృశించుదాం. "ఐదు మాసముల ఇరువది దినములు" కథలో గోపాలరావు బాగా చదువుకొని సంస్కారము, దేశభక్తి కలిగినవాడు. జాతీయోద్యమంలో విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమంలో మునిగి కానుపుకి పుట్టింటికెళ్లిన భార్య బిడ్డనెత్తుకొని వస్తుందనే విషయం కూడా మర్చిపోతాడు. ఇంటికొచ్చి విదేశీ వస్త్ర ధారణలో ఉన్న భార్యను పలకరించనయినా లేదు ఎత్తుకొని ముద్దాడ వలసిన బిడ్డను కేవలం విదేశీ వస్త్రం తొడిగారనే కోపంతో తాకనుకూడా తాకడు. భార్య రుక్మిణికి ఎందుకిలా ప్రవర్తిస్తున్నాడో అర్థం కాదు. ఇంతలో విదేశీ వస్త్రములు బహిష్కరించమనీ ప్రచారం చేసినందుకు గాను గోపాలరావుకు ఆరునెలలు శిక్ష పడుతుంది. అప్పటికి రుక్మిణికి భర్త తాము విదేశీ వస్త్రాలు ధరించడం వల్లనే కోపంగా ప్రవర్తించాడని అర్థమై భర్తనడిచిన దారిలో అడుగిడి రాట్నం వడకడం, ఖద్దరు ధరించడం మొదలుపెడుతుంది. సావిత్రి గౌరి వ్రతం చేసుకుంటూ ఖద్దరు ధరించి వచ్చేవారే వ్రతానికి రావలసిందని ఆహ్వానిస్తుంది. ఆ వ్రతం జరుగుతున్నపుడే గోపాలరావు జైలునుంచి విడుదలై వస్తాడు. పూలమాలతో సంతోషంగా ఎదురవస్తున్న భార్యను చూసి ఈ మాల 'సీమ నూలు'తో కట్టినదేమో అంటే కాదు, ఇది నేను వడికిన నూలుతో కట్టినది అని చెబుతుంది. ఈ కథలో విదేశీ వస్త్రాలు కట్టినందుకు బిడ్డను కూడా తాకడానికి గోపాలరావు ఇష్టపడక పోవడం, జైలునుంచి విడుదలయ్యాక పూలమాలకూడ సీమదారంతో కడితే వద్దనడం, భర్త అడుగుజాడలో నడిచి తాను కూడా ఖద్దరు ధరించడం. రాట్నం వడకడం అనేది జాతీయోద్యమంలో ప్రతి ఒక్కరి బాధ్యతను గుర్తుచేస్తుంది. అదేవిధంగా స్వరాజ్య ఉత్సవం ఘనంగా జరుపుకోవాలనే ఆకాంక్షను తెలిపే కథ "కాపుల సంభాషణ". ఇలాంటి కథలనెన్నింటినో రచించి ప్రజలలో స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని రగిలించారు వరలక్ష్మమ్మగారు.

స్త్రీకి చాలా ఆంక్షలున్న కాలంలోనే గ్రంథాభ్యసనం ద్వారా విద్యార్జన చేసి గాంధీగారి అడుగు జాడల్లో అడుగిడి తన ఉపన్యాసాల ద్వారా ప్రజల్లో స్వాతంత్ర్యోద్యమస్ఫూర్తిని రగిల్చిన ధీరవనిత. స్త్రీలలో ఆత్మస్థైర్యాన్ని నింపింది. ప్రత్యక్షంగా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనక పోయినా తన రచనల ద్వారా, ఉపన్యాసాల ద్వారా పోరాట స్ఫూర్తిని ప్రజల్లో నిలిపి జాతీయోద్యమంలో తన వంతు పాత్రను నిర్వహించిన ధీరవనిత. ❀

**ఉపయుక్త గ్రంథములు**

1. కనుపర్తి వరలక్ష్మమ్మ కథలు

2. శారదలేఖలు

3. కనుపర్తి వరలక్ష్మమ్మ

# జాతీయవాదిగా ఆచార్య తిరుమల

**డా. కాకుమాని శ్రీనివాసరావు,** ఆంధ్రోపన్యాసకులు, ఆర్.ఆర్.డి.ఎస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భీమవరం

జాతీయ వాదం కేవలం రాజకీయపరమైన పరిభాషేమీ కాదు. అది జాతి ఆకాంక్షను వ్యక్తీకరించే ఒక సాంస్కృతిక నిర్మాణానికి చెందిన భావన కూడా. జాతీయ వాదాన్ని కేవలం ఒక మతపరమైన సంకుచితార్థంలోకి పరిమితం చేయటం దురదృష్టకరం.

ఒక జాతి దేశపరంగా మనిషి జీవిత విధానం, నాగరికత, సంస్కృతి, భాష వంటి అనేక అంశాలు జాతీయ వాదంలో చోటు చేసుకొంటాయి. కాలక్రమంలో విజాతీయమైన విపరిణామాలు ఒక దేశపు నాగరికతలో వినాశనాన్ని కలిగించవచ్చు కూడా. అది ఆ జాతి సంస్కృతి విచ్ఛిన్నతకు దారి తీయవచ్చు. ఆధునిక యుగం ఆరంభంలో బ్రిటీష్ వలస పాలకుల విధానాలు అనేక దేశాల్లో ఇలాంటి సంక్షోభాన్ని సృష్టించాయి. అనంతర కాలంలో వలస పాలకులకు వ్యతిరేకంగా జాతీయోద్యమాలు వెల్లువెత్తాయి. స్వాతంత్ర్యానికి పూర్వం జీవించిన వ్యక్తుల ఆత్మకథల్లో ఈ సంఘర్షణ తాలూకు ఆనవాళ్ళు గమనించవచ్చు.

తిరుమల రామచంద్ర గారి స్వీయచరిత్రలోని ఘట్టాలు ఆయన పుట్టిన సంవత్సరం 1913 ముందు వెనుకలనుండీ 1944 ప్రాంతాలదాకా చెందినవి. ఈ మూడు దశాబ్దాల కాలం చారిత్రకంగా గొప్ప ప్రాధాన్యత కలది. ఆంధ్ర మహాసభ ఆవిర్భావం, భారత ప్రభుత్వ చట్టాలు, సహాయ నిరాకరణ, స్వదేశీ ఉద్యమాలు, మోప్లా, బార్డోలీ, క్విట్ ఇండియా ఉద్యమాలు ఈ కాలపు పరిధిలో జరిగినవే.

బ్రిటీష్ ప్రభుత్వం జాతీయ జీవిత విధానాన్ని ప్రభావితం చేస్తూ ఆంగ్ల విద్య, క్రైస్తవ మతం, అల్లోపతీ వంటి విజాతీయమైన విధానాలను భారతీయ సమాజంలో ప్రవేశపెట్టడం అప్పటికే ఆరంభించారు.

ముఖ్యంగా సంస్కృత భాష పఠన, పాఠ్యాదులలో నుండీ క్రమేపీ నిష్క్రమిస్తున్న కాలమది. ఆయుర్వేద విద్య వెనుకబడిపోతూ ప్రభుత్వ ప్రాబల్యంతో అల్లోపతి విజృంభిస్తున్న కాలం. ఈ సామాజిక నేపథ్యంలో పురుడుపోసుకున్న జాతీయ భావాలు బాలుడిగా ఎదుగుతున్న తిరుమలలో క్రమేపీ ఊడల్లాగా వ్యాపించాయి.

తిరుమల అక్షరాభ్యాసం రోజుల్లో పాఠశాలలు జార్జి చక్రవర్తి ప్రార్థనతో ప్రారంభమయ్యేవి. సంస్కృతాన్ని కూడా ఇంగ్లీషు వాచకాల నుండి (భండార్కర్) నేర్చుకోవాల్సిన దుర్దశ నెలకొన్నది. వేదం చదివించాలా? ఇంగ్లీషు బడులలో చేర్చాలా? అన్న ఊగిసలాట పెద్ద పెద్ద పండితుల ఇంట్లో చర్చనీయాంశంగా ఉండేది. కన్యాశుల్కం నాటకంలోనూ ఈ చర్చను గమనించవచ్చు. ఇంగ్లీషు చదివితే ప్రభుత్వోద్యోగాలు వస్తాయనే ఆశతో "మంచినీటికి ఎగబడ్డ చేపల్లాగా" ఆనాటి ప్రజలు ఇంగ్లీషు బడులకు ఎగబడ్డారని టంగుటూరి ప్రకాశం పంతులు తన ఆత్మకథలో ప్రస్తావించారు.

తిరుమల రామచంద్రగారి కుటుంబం రెడ్డిరాజులు, విజయనగర సార్వభౌములు తాడిమర్రి సంస్థానం వారికి మత గురువులుగా ఉన్న తాతాచార్యుల వంశానికి చెందినది.

తాడిమర్రి సంస్థాన పాలకులు వ్యాధులు అంటే బోయ వంశానికి చెందిన వారు. రాజ్యాలు కనుమరుగయ్యాక వీరు వీర జాతికి చెందిన పాళేగారులుగా మిగిలారు. వీరు ఎదురు తిరిగే స్వభావం కలవారని బ్రిటీష్ ప్రభుత్వం భయపడి వీరిని క్రిమినల్ ట్రైబ్స్ చట్టం (C.T.Act 1871) కింద జమకట్టి ప్రభుత్వోద్యోగాలు ఈయ రాదని వీరిని దొంగలుగాను, నేర జాతులుగాను పరిగణించారు. అంతకుముందే సిపాయిల తిరుగుబాటు సమయంలో పోరాడిన ఈ తాడిమర్రి సంస్థానాన్ని బ్రిటీష్ సైనికులు నేలమట్టం చేసారు.

తిరుమల రామచంద్రగారి కుటుంబం పూర్తిగా సనాతనాచారం పాటిస్తున్నా వీరితాత గారు, నాన్న, చిన్నాన్నలు కాంగ్రెస్ వాదులు. వీరి ఇంట్లో నాలుగైదు చరఖాలుండేవి. వీరి తాతగారు తిరుమల తాడిమర్రి నరశింహాచార్యులు పట్టుదలతో బెల్గాం కాంగ్రెస్ సభలకు వెళ్ళి వచ్చారు. ఆయన తిలక్ అనుయాయులు.

రామచంద్ర ఎనిమదవ యేట నాలుగోక్లాసు ముగించాక సంస్కృతమా, ఇంగ్లీషా? అనే చర్చ మొదలైంది. తండ్రి పినతండ్రులిద్దరూ ఇంగ్లీషు చదివించాలని నిర్ణయించినా అది తాత్కాలికంగా కొన్ని నెలలే సాగింది. తాతగారు ఇంగ్లీషు చదువుకి మొదటినుండీ వ్యతిరేకం కావటం వల్ల మళ్ళీ తిరుమల రామచంద్ర గారిని సంస్కృతం చదివించటం ఆరంభించారు.

ఆనాటి సంస్కృత పండితులు వారణాసిలాంటి చోట్ల న్యాయ, వేదాంత, మీమాంసా, వ్యాకరణ యోగ శాస్త్రాలు చదివేవారు. కొందరు కొన్ని సిద్ధులు కూడా సాధించేవారు. తిరుమల రామచంద్రగారు ప్రత్యేకంగా ముచ్చుకుంట కృష్ణమాచార్యుల యోగశక్తి విశేషాలను తన ఆత్మకథలో ప్రస్తావించారు.

భారతీయమైన ఆలోచనా విధానం నుండీ నిర్భీతి, స్వేచ్ఛా జీవనం, సమానత్వ వాదం, సహనం, నిరాడంబరత, త్యాగం వంటి లక్షణాలు రామచంద్రగారి వ్యక్తిత్వంలో చోటుచేసుకున్నాయి. జాతీయ భాషాసంస్కృతులు అంతర్ధానమయ్యే పరిస్థితులనుండి, అవాంఛనీయ  పరిణామాలపట్ల ప్రతిఘటన నుండి తిరుమల రామచంద్ర వ్యక్తిత్వం రూపుదిద్దుకొన్నది.

రామచంద్రగారు జీవితాంతం ఖద్దరే ధరించారు. తిరుపతి సంస్కృత కళాశాలలో చేరినప్పుడు, వివిధ రాష్ట్రాల విద్యార్థులతో సహవాసమేర్పడి భారతీయ సమాజం నైజాన్ని ఆకళింపు చేసుకున్నారు. గాంధీజీ విధానాలు సహజంగానే రామచంద్రలో జాతీయ భావజాలానికి బీజాలు వేసాయి. తగలబడుతున్న హరిజనవాడలలో మంటలు ఆర్పడానికి నీళ్ళు మోసారు. వాళ్ళ పిల్లలను సురక్షిత ప్రాంతాలకు చేర్చారు. ప్రమాదాల్లో పడిపోయిన బండ్లను ఎత్తి గాయపడిన వారిని ఆస్పత్రులకు చేర్చారు. ఇవన్నీ తిరుమల తన 11వ ఏట తిరుపతి శ్రీ వేంకటేశ్వర సంస్కృత కళాశాలలో స్కౌట్ సంఘంలో ఉండగా చేసిన పనులు.

జాతీయ వాదాన్ని రాజకీయంగా కాక సాంస్కృతికంగా అవగాహన చేసుకోవాలని భావించిన అరబిందో ప్రభావం తిరుమలగారి మీద పడిందని భావించాలి. అరవిందో ప్రకారం "రాజ్యం", "స్టేట్" అనే భావన రాజకీయమైన భావన. ఒకవిధంగా పరిపాలనా రంగానికి సంబంధించినది. కానీ 'జాతి', 'నేషన్' అనేది రాజకీయ భావన కాదు. అది సాంస్కృతిక భావన. (శ్రీ అరవింద దర్శనము – కాకుమాను తారానాథ్ పే. 73).

ఫ్రెంచి మేధావి రేనాన్ జాతిని ఒక జీవాత్మగా, ఆధ్యాత్మిక సిద్ధాంతంగా నిర్వచించాడు. (అదే. పే. 74) అలాగే హెరాల్డ్ లాస్కీ తన 'Grammar of Politics' లో ప్రపంచం లోని మిగతావారికంటే , ఒక ప్రత్యేక ఐక్యతా భావన కలిగి ఉండటమే జాతి ప్రత్యేకత అంటాడు. ఆ జాతి చేసిన సామూహిక ప్రయత్నాల వలన చారిత్రకంగా వారిలో ఒక ఏకత్వం బలపడుతుంది.

అలాగే అరవిందుల దృష్టిలో జాతీయవాద ధోరణి కేవలం రాజకీయాలకే పరిమితం కాలేదు. అది ఆధ్యాత్మిక ప్రాతిపదికను వైవిధ్యాన్ని కలిగి ఉన్న భావన. ఈ దేశపు ప్రాచీన మూల్యాలను తిరిగి కాలానుగుణంగా పునరుద్ధరించడానికి ఒక

ఉన్నత ప్రయత్నం అవసరమని అరవిందుల అభిప్రాయం.

జాతి, మాతృదేశం కేవలం ఒక మట్టిముద్ద కాదు. కవిత్వ విశేషం. వట్టి ఊహ కాదు. అది విశేషమైన శక్తి స్వరూపిణి. ఇలాంటి భావాలు అప్పటికి బాలుడిగా ఎదుగుతున్న తిరుమల రామచంద్రలో ఆధ్యాత్మిక జాతీయ వాదాన్ని పాదుకొల్పాయి.

తిరుమల రాచచంద్ర కాంగ్రెసు కార్యక్రమ ప్రచారానికీ, సమావేశాల్లో ప్రోత్సాహానికీ పాటలు కావలసి వచ్చినప్పుడు, వాటిని సంస్కృతంలో రాసాడు.

**"ప్రేమ పూతా మాతా సుచరిత**
**సకల చరాచర నికరాకారే**
**వికసిత సురుచిత ఘనవన వారే**
**అకలంకే విమలోదక పూరే" లాంటి పాటలూ,**
**"భింది భింది భారతీయ**
**మాతృ దాస్య శృంఖలం**
**మందహసన విధుర మద్య**
**కలయమాతురాననమ్"** వంటి మార్చింగ్ సాంగ్స్ రాసారు. (హంపీ నుంచి హరప్పా దాక. పే. 241)

సంస్కృతంలో కవిత్వం రాయటం తిరుమలకు ఒక ఇష్టమైన వ్యాపకం. ఆయన 14 యేట తిరుపతి టౌన్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి అయ్యారు. విదేశీ వస్త్ర దహనము, ఖద్దరు ప్రచారం, హరిజనులను కూడగట్టడం, మద్య నిషేధ ప్రచారం ఇవీ ఆయన నేతృత్వంలో కొనసాగించిన కార్యక్రమాలు. ఆనాడు మొదలైన ఆయన ఖద్దరు వస్త్రధారణ జీవితాంతం కొనసాగింది.

తిరుపతిలోని గోవింద రాజ స్వామి మహాద్వార గోపురంపై కాంగ్రెస్ పతాక ఎగురవేయాలనే కోరిక ఆయనకు పుట్టింది. గోపురం అంతస్తులు 12. పోలీసుల నిఘా ఉన్నా 5వ అంతస్తుదాకా ఎక్కి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయగలిగారు. చిత్తూరు జిల్లా నుండి తొలి సత్యాగ్రహి ఆయనే. "పోలీసు కుక్కలకు భయపడకుడి" అంటూ 500 కరపత్రాలు తయారుచేసి బహిరంగంగానే పంచారు. స్వయంగా తనే పోలీసు ఠాణాలో ఆ కర పత్రాన్ని హెడ్ కానిస్టేబుల్ చేతికి అందించాడు.

కేసు విచారిస్తున్న సమయంలో మెజిస్ట్రేట్ ఆరోపణ పత్రాన్ని చదివి నేరం చేసావా? లేదా? అని ప్రశ్నించినపుడు "మీ దృష్టిలో నేను నేరస్తుడినేమోకాని, నా దృష్టిలో కాదు. నేను మీరు ఆరోపించిన విషయాలన్నీ మాతృదేశ భక్తితో, దేశం కోసం చేశాను. అలాంటప్పుడు నేను నేరం చేసినవాడిని ఎలా అవుతాను" అని ధైర్యంగా ఎదురు ప్రశ్న వేసిన దేశభక్తుడు తిరుమల రామచంద్ర. తాను అరెస్టయి జైలు లోపల ఉన్న నాటి రాత్రి "అరెస్టయినందుకు ఆనందంతో నాకు ఆకలి కాలేదు, నిద్ర పట్టలేదు" అని ఆయన రాసుకొన్నారు.

తిరుచిరాపల్లి సెంట్రల్ జైలులో వేయిమంది వివిధ రాష్ట్రాలకు చెందిన సత్యాగ్రహులతో కఠిన కారాగార శిక్షను అనుభవించాడు. జైలు గోడల మీద బొగ్గుతో ఎన్నో దేశభక్తి గేయాలు సంస్కృతంలో రాసారు. రవీంద్రుని సుప్రసిద్ధ గీతం 'అకేలా చలో'ను అనువదించారు. ధనికుల దౌర్జన్యాలను గర్హిస్తూ ఒక శతకం, సత్యాగ్రహ విజయ: అనే నాలుగంకాల నాటకమూ రాసారు.

ప్రభుత్వం నిషేధించిన వి.డి.సావర్కార్ "The First War of Indian Independence" బ్రెడ్డు ముక్కల మధ్య పెట్టించి రహస్యంగా జైలుకు రప్పించి, రహస్యంగా రోజుకో పుట చదివారు. విడుదలైన తర్వాత విప్లవోద్యమంలో చేరాలని స్నేహితులతో కలిసి చేతులమీద చేతులు వేసుకొని ప్రతిజ్ఞ చేసారు.

నెల్లూరులో ఒక గదిలో ఆళ్ళ బాలకృష్ణారెడ్డిలాంటి విప్లవ నాయకులతో రహస్యంగా నివసించారు. గూట్లోని శాకుంతలం,

ధ్వన్యాలోకం కింద పిస్తోళ్ళు, బాకులు, రివాల్వర్లు దాచి ఉంచేవాళ్ళు. వాళ్ళవెంట రెండుమూడు దోపిడీలకు, దొంగతనాలకు, అమావాస్య చీకట్లలో భోరున కురుస్తున్న వానలలో విప్లవకారులను తప్పించడానికి వెళ్ళాడు. అయితే క్రూరమైన ముఠాలాగా తయారైన ఆ బృందం నుండీ బయటకు వచ్చేసారు తిరుమల.

ఈ దేశపు ప్రాచీన మూల్యాలను సంరక్షించుకోవాలన్న భావన తిరుమల రామచంద్రలో ముందునుండీ ఉండేది. అందులో సంస్కృత భాషా పునరుద్ధరణలాంటిదే, ఆయుర్వేద శాస్త్ర సంరక్షణ.

ఆయన ఆత్మకథలోనూ, శ్రీపాద సుబ్రమణ్యశాస్త్రిగారి "అనుభవాలూ జ్ఞాపకాలూను" లోను దాదాపు అద్భుతమూ, అభూత కల్పనల వంటి వాస్తవాలు ఆయుర్వేద శాస్త్రం వల్ల జరిగినట్లు దాఖలాలున్నాయి. స్వయంగా తిరుమల రామచంద్ర జీవితంలోనే ఇలాంటి సంఘటనలు జరిగినట్లు ఆయన రాతల్లోనే తెలుస్తున్నాయి.

బ్రిటీష్‌వారు ఆయుర్వేదాన్ని చంపి అల్లోపతిని ప్రచారం చేయటానికి కమిటీ వేయటము, ఆయుర్వేదాన్ని పిచ్చివాళ్ళ పంచాయితీ అని ప్రకటించడమూ దేశవ్యాప్తంగా పండిత దీవి గోపాలచార్యులు జరిపిన ఆయుర్వేద పరిరక్షణ ఉద్యమమూ తిరుమలగారి ఆత్మకథలో స్పష్టంగా కథనం చేయబడింది. ఇవేకాక తేలు మంత్రం, పాముని కట్టడి చేసే మంత్రాలకు చెందిన విశ్వాసాలను బలపరిచే యదార్థ సన్నివేశాలను తిరుమల రామచంద్ర రికార్డు చేసారు.

హనుమద్భక్తులైన వస్తాదుల అసాధారణ బల ప్రదర్శన, అల్యాకు వంటి మొక్కల ఔషధ విలువల ప్రస్తావన వంటి విశేషాలు తరిగిపోతున్న భారతీయమైన మూల్యాలుగా చూపిస్తారు. ఆ మూల్యాల పరిరక్షణకు కంకణ బద్ధులై జీవిత పర్యంతమూ అధ్యయనం చేస్తూ విలువైన సారస్వతాన్ని సృష్టించి నిజమైన జాతీయవాదిగా తెలుగువారి మనసులలో విలువైన వ్యక్తిగా తనదైన ముద్ర వేసారు తిరుమల రామచంద్ర. ❀

# ఆదర్శ మహిళ శ్రీమతి ముసునూరి కస్తూరి దేవి

**డా॥ వై. శ్రీలత,** తెలుగు శాఖాధిపతి,ఎస్.ఆర్.ఆర్ & సి.వి.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వ), విజయవాడ.

జాతీయోద్యమం మహాత్మాగాంధీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా ముమ్మరంగా జరిగిన సందర్భంలో గాంధీజీ పిలుపునందుకొని ఎందరో మహిళలు అన్ని ప్రాంతాలనుండి ఉద్యమంలో పాల్గొన్నారు. ఇంటిపనికి, వంటపనికి మాత్రమే పరిమితం అని భావించబడిన మహిళలు జాతీయోద్యమంలో, చట్టసభల్లో తమ ఉనికిని చాటుకొన్నారు.

ఆంధ్రదేశంలో కందుకూరి వీరేశలింగంగారి సతీమణి శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మిగారు కందుకూరి చేపట్టిన సంఘ సంస్కరణోద్యమం, స్త్రీ విద్యావ్యాప్తి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని ఎందరో మహిళలకు ప్రేరణగా నిలిచారు. సమాజంలో పుట్టుకొస్తున్న నూతన పరిణామాలన్నీ ఆంధ్రదేశంలోని మహిళలను కూడా ప్రభావితం చేశాయి. ఎన్నో తెలుగు కుటుంబాలు జాతీయోద్యమానికి అంకితం కాగా, అలాంటి దేశభక్తుల కుటుంబంలో పుట్టిన మహిళ ముసునూరి కస్తూరి దేవిగారు.

**జననం :** కస్తూరి దేవి 1929 ఏప్రిల్ 18న కృష్ణా జిల్లా గుడివాడ తాలూకా గుడ్లవల్లేరు గ్రామంలో ప్రసిద్ధి చెందిన ఎర్నేని వారి ఇంట రెండవ సంతానంగా జన్మించారు. తండ్రి ఎర్నేని సుబ్రహ్మణ్యంగారు ప్రముఖ గాంధేయవాదులు. ఆయన గాంధీజీతోపాటు యావదాంధ్ర ప్రతినిధిగా దండి యాత్ర చేసి ఆంగ్లేయులను ఎదిరించి చాలాకాలం జైలు జీవితం గడిపారు. తల్లి ఎర్నేని లీలావతీ దేవి కూడా భర్త మార్గాన్నే అనుసరించింది. కస్తూరి దేవి నాయనమ్మ ఎర్నేని పుల్లమ్మగారు 80 సంవత్సరాల పండు వయసులో శాసనోల్లంఘనం చేసి జైలు జీవితం గడిపిన వ్యక్తి.

**బాల్యం :** స్వాతంత్ర్య సమరయోధుల ఇంట పుట్టి వారి మధ్య పెరిగిన కస్తూరి దేవికి దేశాభిమానం, సేవ అతిసహజంగా పసితనం నుండే అలవాటయ్యాయి. చిన్నతనంలో పెద్దమ్మ శ్రీమతి ఎర్నేని శేషమాంబ దగ్గర ఉండి, గుడ్లవల్లేరులో ఆరవ తరగతివరకు చదువుకున్నారు. ఆ తర్వాత కొమరవోలులో ఉన్న తమ తల్లిదండ్రులు స్థాపించిన గాంధీ ఆశ్రమానికి వచ్చారు. అక్కడి వాతావరణాన్ని గమనిస్తూ ఆ చిన్న వయసునుండే ఆమె పొలం పనులు, పశువుల పెంపకం, కాలువలు, రోడ్లు నిర్మించడం, నూలు వడకటం, నేయడం, ఖాదీ ప్రచారం చేయడం, ప్రకృతి వైద్య నిర్వహణలో సహకరించడం అలవాటు చేసుకున్నారు.

**విద్యాభ్యాసం :** ఆమె ఆశ్రమంలో ఉన్న సమయంలో అనేక మార్లు ఆంగ్లేయులు వారి ఆశ్రమంమీద దురాక్రమణ చేసి లాఠీచార్జీలు, ఆస్తులు ధ్వంసం చేయడం, కుటుంబ పెద్దలు జైలుపాలు కావడం వంటి వాతావరణం చూస్తూ, ఆశ్రమం నడుపుతున్న హిందీ స్కూలులో చదివి ఆమె రాష్ట్ర భాష పరీక్షలో ఉత్తీర్ణురాలయ్యారు. 1942లో పన్నెండు సంవత్సరాల వయసులో తన తల్లిదండ్రుల మాదిరిగానే వార్ధా ఆశ్రమం మహిళా విభాగంలో శిక్షణ పొందడానికి వెళ్లారు. ఆ సమయంలో క్విట్ ఇండియా ఉద్యమం తీవ్రరూపం దాల్చడం, గాంధీజీ తదితరులను ఆంగ్లేయులు అరెస్టు చేయడంతో ఆశ్రమాన్ని నిర్వహించేవారు లేకపోవడంతో కస్తూరి దేవి తిరిగి కొమరవోలు ఆశ్రమానికి తిరిగి వచ్చారు.

**స్వాతంత్ర్యోద్యమ ప్రవేశం :** కస్తూరిదేవి వార్ధా ఆశ్రమం నుండి తిరిగి వచ్చేనాటికి ఆంధ్రదేశంలో కూడా పరిస్థితులు ఉద్రిక్తంగానే ఉన్నాయి. కస్తూరిదేవి కుటుంబసభ్యులు, బంధువులు అందరూ ఎడతెరిపి లేకుండా ప్రజల్లో స్వతంత్ర భావాలను ప్రచారం చేస్తున్నారు. వారిని చూసి కస్తూరిదేవి కూడా బహిరంగంగా క్విట్టిండియా ఉద్యమ ప్రవేశం చేసి తన బంధువులతో కలసి బందరు, గుడివాడ, కైకలూరు తదితర ప్రాంతాల్లో రెండు నెలలపాటు రాత్రింబగళ్లు తిరిగి ప్రచారం చేశారు. ఆ సందర్భంలోనే మొదటిసారి 13 సంవత్సరాల వయసులో ఆరునెలల జైలు శిక్షను అనుభవించారు.

**వివాహం :** జైలు నుండి విడుదల అయ్యేనాటికి కస్తూరిదేవి తల్లిదండ్రులు ఇంకా జైలులోనే ఉన్నారు. ఆ సమయంలోనే ఆమెను పెంచి పెద్దచేసిన పెద్దమ్మ ఎర్నేని శేషమాంబగారి ప్రోద్బలంతో ముసునూరి భాస్కరరావుతో కస్తూరి దేవి వివాహం జరిగింది.

**శరణాలయ స్థాపన :** వివాహం జరిగిన కొంత కాలానికి విజయవాడ సమీపంలో ఉన్న యనమలకుదురులో తన పెద్దమ్మ స్థాపించిన 'కస్తూరిబా కరుణాలయం' అనే అనాధ శరణాలయం బాగోగులను చూసే బాధ్యతలను స్వీకరించి అక్కడి అనాథలకు ప్రేమతో, శ్రద్ధతో సేవ చేశారు. ఉన్నత చదువులను చదివితే మరింత క్రమ పద్ధతిలో సేవా కార్యక్రమాలను నిర్వహించవచ్చనే అభిప్రాయంతో మద్రాసులో ఉన్న దక్షిణ భారత హిందీ ప్రచార సభకు వెళ్లి రాష్ట్ర భాషా విశారద పట్టం పుచ్చుకున్నారు. అదే సమయంలో గుజరాతీ మహిళా మండలిలో హిందీ తరగతులు కూడా ఆమె నిర్వహించారు. తన సామర్థ్యంతో అందరి మెప్పు పొంది ఆంధ్రదేశం తిరిగివచ్చి విజయవాడలో ఉన్న హిందీ ప్రచారక విద్యాలయంలో హిందీ టీచరుగా శిక్షణ పొంది, రాష్ట్రభాషా ప్రచారాన్ని కూడా కొనసాగించారు.

కొంతకాలానికి కస్తూరిదేవి పుట్టింటివారి ఆస్తులన్నింటినీ బ్రిటీషు ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. దాంతో వారంతా కొమరవోలు ఆశ్రమంలో, తదితర ప్రాంతాల్లో నిరాడంబర జీవితాలు గడుపుతూ గాంధీజీ ఆదేశానుసారం వివిధ నిర్మాణాత్మక కార్యకలాపాలను నిర్వహిస్తూ ఉన్న సమయంలో కస్తూరి దేవి తల్లి మరణించారు. ఆవిధంగా చిన్న వయసులోనే గృహిణిగా తన కుటుంబ నిర్వహణతో పాటు, చిన్నవారైన సోదరీ సోదరులకు కూడా తల్లిలేని లోటు తీర్చే బాధ్యతను కస్తూరి దేవి చేపట్టారు.

**వినోబాభావే స్ఫూర్తితో భూసేకరణ :** అంతులేని పోరాట ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది కానీ గాంధీజీ నాయకత్వం కరువైంది. గాంధీజీ ఆశయాలకనుగుణంగా ఇంకా నిర్మాణాత్మక కార్య కలాపాలను కొనసాగిస్తూ ఉన్నవారికి శ్రీ వినోబాభావే నాయకత్వం ఊరట కలిగించింది. 1955లో ఆయన భూదాన యాత్ర చేస్తూ ఆంధ్రదేశానికి వచ్చిన సందర్భంలో కస్తూరిదేవి తన తండ్రితో కలసి శ్రీ వినోబాభావే వెంట ఆంధ్రదేశమంతటా ఎంతో శ్రమకోర్చి తిరిగారు. ఆ సందర్భంగా రెండువేల ఎకరాల భూమిని సేకరించారు. ఆ విధంగా కస్తూరిదేవి తాను ఏ పని చేపట్టినా ఆ పని విజయవంతంగా చేయగలనని నిరూపించుకున్నారు.

**రాజకీయ జీవితం :** కస్తూరి దేవి రాజకీయ జీవితంలో కూడా సంపూర్ణ విజయాలను అందుకున్నట్లుగా తెలుస్తుంది. 1963-64 సంవత్సరాలలో ఆమె అఖిలభారత గ్రామీణ మహిళా మండలి, కృష్ణా జిల్లా శాఖకు అధ్యక్షురాలుగా ఉన్న సందర్భంలో అఖిలభారత కాంగ్రెస్ మహిళా విభాగం కన్వీనరు శ్రీమతి ముకుల్ బెనర్జీ కృష్ణా జిల్లాకు రాగా, కస్తూరి దేవి ఆమె పర్యటనకు అన్నివిధాలా తోడ్పడి ప్రశంసలందుకున్నారు. ఆ విధంగానే 1968లో బీహారు క్షామబాధితుల సహాయార్థం వూరూరూ తిరిగి సమర్థవంతంగా బియ్యం సేకరించి ప్రదేశ్ కాంగ్రెస్ సంఘానికి సమర్పించారు.

ఆ తర్వాత ఆమె తన రాజకీయ జీవిత కార్యక్రమాలు బహుముఖీనంగా విస్తరించారు. 1954లో గుడివాడ పట్టణ కాగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా ఉన్నారు. 1959లో జిల్లా 'కాంగ్రెస్ అడ్‌హక్ కమిటీ' సభ్యురాలుగా 'నామినేట్' అయ్యారు. 1960 నుండి మరణించేవరకు ప్రదేశ్ కాగ్రెస్ సహసభ్యురాలిగా ఉన్నారు. 1956లో గుడివాడ పురపాలక సంఘ సభ్యులుగా ఎన్నికయ్యారు. 1967లో గుడివాడ నియోజకవర్గంనుండి శాసన సభ్యురాలిగా ఎన్నికై తన నియోజక వర్గానికి శాశ్వత ప్రయోజనాలను కలిగించే దిశగా కృషిచేశారు. ఎన్నో వనరులు అందేలా చేశారు. అలా రాజకీయ జీవితంలో కూడా అద్భుతంగా రాణించారు.

**వ్యక్తిత్వం :** ఒక రైతు బిడ్డగా, గ్రామీణ స్త్రీగా స్వావలంబన విధానంలో గాంధీజీ, వినోబాజీల ఆదేశాలను అక్షరాలా అమలులో పెట్టి సఫలతను సాధించారు. తన నియోజక వర్గం ఎలా ఉంటుందో, ఏ గ్రామానికి ఏయే వనరులు కావాలో, ఏ పనిచేస్తే ప్రజలకు ఎంత లాభం, సంక్షేమం కలుగుతుందో అనుభవపూర్వకంగా తెలుసుకొని ఆ ప్రయోజనాలను ప్రజలకందించిన ఆదర్శ మూర్తిమత్వం కస్తూరిదేవి గారి స్వంతం.

**మరణం :** కస్తూరి దేవిగారు శాసన సభ్యురాలిగా రెండు సంవత్సరాలే ఉన్నారు. 1969 మే 18న ఆమె నలభై సంవత్సరాల చిన్నవయసులోనే అకాల మరణం చెందారు. ఆమె మరణం ఆమెను ప్రజలకు దూరం చేసినా, ఆమె తలపెట్టిన ప్రజాహిత కార్యక్రమాలు మాత్రం ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. మరణించేనాటికి ఆమె జిల్లా కాంగ్రెస్ కార్యవర్గంలోనూ, శాసన సభ హౌస్ కమిటీలో, ప్రివిలేజెస్ కమిటీలో సభ్యురాలిగా ఉన్నారు. అదేవిధంగా వేములవాడ దేవస్థానంలో ట్రస్టు బోర్డు సభ్యురాలిగా, ఆంధ్రప్రదేశ్ పాల సలహా సంఘంలో సభ్యురాలిగా, దక్షిణ మధ్య రైల్వే ఎమినిటీస్ కమిటీలో కూడా సభ్యురాలిగా ఉన్నారు. తన మరణంతో పసిబిడ్డలను, భర్తను, బంధుకోటిని, ప్రజలను దు:ఖంలో వదిలివెళ్లారు.

**ముగింపు :** ఆదర్శమహిళ కస్తూరి దేవి జీవితాన్ని తెలుసుకోవడం ద్వారా అందరినీ ప్రేమించడం, పేదలపట్ల దయ, సత్య ప్రవర్తన, దయార్ద్ర దృష్టి, నిస్వార్థ సేవ వంటి ఉత్తమోత్తమ గుణాలను తర్వాతి తరాలు అందిపుచ్చుకోవాలి.

**ఆధార గ్రంథాలు :**

1. ఆంగ్లేయ దేశ చరిత్రము – పింగళి లక్ష్మీకాంతం

2. ఆంధ్రదేశము – స్త్రీలు – డాక్టరు అల్లాడి వైదేహి

3. మహిళ – పరిశోధక వ్యాస సంపుటి

# 'స్వాతంత్ర్యసిద్ధి' కావ్యవైశిష్ట్యం

**డా. కానుకొల్లు బాలకృష్ణ,** తెలుగు అధ్యాపకులు, సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల (మహిళ), కంచికచర్ల, యన్.టి.ఆర్. జిల్లా, చరవాణి : 9440064705

**పరిచయం :** అహింస, సత్యాగ్రహాలను ఆయుధాలుగా ఎంచుకొని రవి అస్తమించనిదిగా ప్రగల్భాలు పలికిన బ్రిటీషు సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించిన భారత స్వాతంత్ర్య సంగ్రామం ప్రపంచ చరిత్రలో మహోజ్జ్వల ఘట్టం. వ్యాపారం అనే నెపంతో మన దేశంలోకి ప్రవేశించి, కుటిలనీతితో భారత రాజవంశాలలో పరస్పర కలహాలను సృష్టించి, అదను చూసి అధికారాన్ని హస్తగతం చేసుకొని, చట్టాల పేరుతో, దోపిడీ లక్ష్యాలతో అరాచకాలకు తెరలేపి, లక్షలాది అమాయక భారత ప్రజల ధన మాన ప్రాణాలను హరించి, మారణహోమం సృష్టించిన బ్రిటీషు వలసపాలన మానవ నాగరికతకే మాయని మచ్చ.

వలస పాలకుల దుర్మార్గాలను గుర్తించి, వారి స్వార్థపూరిత చట్టాలను వ్యతిరేకించి, భారతీయుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం చేసిన పోరాటంలో తమ విలువైన ప్రాణాలను సైతం త్యాగం చేసిన ఎంతోమంది సమరవీరుల సంకల్పబలమే మనమంతా అనుభవిస్తున్న నేటి స్వాతంత్ర్య ఫలం.

మాహాత్మాగాంధీ భారత దేశాగమనం నుంచి స్వాతంత్ర్య సాధనవరకు దేశంలో జరిగిన ముఖ్య ఘట్టాలను మనోహరంగా వర్ణించిన గ్రంథమే 'స్వాతంత్ర్య సిద్ధి' (2000) పద్యకావ్యం. సుప్రసిద్ధ ఆర్థిక శాస్త్రవేత్త, ఐక్యరాజ్య సమితిలో సలహాదారుగా అనేక సంవత్సరాలు సేవలు అందించిన ఆచార్యులు, హైదరాబాదులో ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్ప్రైజ్ వ్యవస్థాపక సంచాలకులు, పద్యకవి శ్రీ వేమూరి వేంకట రామనాథంగారు రచించిన ఈ కావ్యంలో ఉన్న మొత్తం 25 అధ్యాయాలలో 1743 పద్యాలు ఉన్నాయి. "నా కను లద్దము లైన జీవగాథ" లను అనగా తాను ప్రత్యక్షంగా చూసిన సంఘటనలను ఈ కావ్యంలో సన్ని వేశాలుగా మలచినట్లు కవి చెప్పుకున్నారు.

సంయుక్త అనే నాటిక, చంద్రరేఖ అనే స్మృతి కావ్యం, నాగార్జునకొండ అనే నృత్యనాటిక, సన్నుతి అనే శతకం, కాదంబిని అనే కందపద్య పంచశతి, విరిసరులు అనే ఖండకావ్యం; బిచ్చగత్తె, చందల, రాజర్షి అనే మూడు నాటకాలు, సౌందర్యసమీక్ష అనే విమర్శగ్రంథం, కమల, తల్లిపిల్ల అనే నవలలు, మెరుపులు అనే వ్యాససంపుటితోపాటు అనేక కథారచనలు కూడా చేసిన రామనాథంగారు వృత్తి రీత్యా అర్థశాస్త్రవేత్త అయినా ప్రవృత్తి రీత్యా సాహితీవేత్త. (ఉపక్రమణిక 20, 21) రామనాథంగారు రచించిన స్వాతంత్ర్యసిద్ధి కావ్యంలోని విశేషాలను పరామర్శించడమే ఈ వ్యాస రచనోద్దేశ్యం.

**కావ్య వస్తువు:** బ్రిటీషు వలసపాలకుల బానిససంకెళ్ళలో రెండు శతాబ్దాలపాటు మ్రగ్గిన భారతమాత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకోసం దేశీయులు సాగించిన పోరాటకథలే ఈ కావ్యంలోని వస్తువు. వాస్తవ ఘటనలకు కావ్యోచితకల్పనలను జోడించి రచించిన కావ్యమే స్వాతంత్ర్యసిద్ధి.

**"పరభూనాధుల క్రింద దాస్యమున రూపున్ బాసి యున్నట్టి సుం**
**దరి యౌ భారతమాత మోము పయి స్వాతంత్ర్య ప్రభన్**
**గూర్ప సం గరమున్ బిడ్డలు సల్పి యున్న కథ నే కావ్యమ్ముగా చేతు, న**
**క్షర భావోచిత కల్పన ప్రథితమౌ కావ్యాత్మ శోభిల్లగన్"** (ఉపక్రమణిక -29)

**దక్షిణాఫ్రికాలో దయనీయస్థితి:** భారతదేశం విచ్చేసిన గాంధీ దక్షిణాఫ్రికాలో తెల్లదొరల దౌష్ట్యాలను, జాతి విద్వేషాలను గురించి వివరిస్తున్న సందర్భంలో వివాహచట్టం గురించి కింది పద్యంలో చేసిన వర్ణన అక్కడి దయనీయ స్థితులను పట్టిస్తుంది.

**"వారలు క్రైస్తవేతర వివాహము లన్నియు రద్దు చేసి, రా**
**తీరున నిన్ని నాళ్ళ కుల దీపము నీ సతి వార కాంతయౌ,**
**జారుడ వౌదు వీవు, తమ సంతతి యక్రమ జన్మ తుల్యమౌ;**
**మీరు భరించి సిగ్గు మొగ మెత్తక గోళ్ళను గిల్లు కొందురే?"**

(దక్షిణాఫ్రికాలో ప్రవాసభారతీయుల అవమాన విముక్తి -25)

అక్కడ క్రైస్తవేతరుల వివాహాలన్నింటినీ రద్దుచేయడంవల్ల కట్టుకున్న భార్య వారకాంతగానూ, తాను దొంగగానూ, తమకు పుట్టిన బిడ్డలు అక్రమ సంతానంగానూ పరిగణించే దుస్థితి ఏర్పడడం బ్రిటీషు దురాగతాలకు పరాకాష్ట.

తెల్లదొరల దౌష్ట్యాలకు వ్యతిరేకంగా ఆఫ్రికాలో గాంధీ సాగించిన అహింస, సత్యాగ్రహ దీక్షల లక్ష్యాలను, పర్యవసానాలను వర్ణిస్తూ భౌతిక శిక్షలు సంకల్పబలాన్ని సడలించలేవని వర్ణించారు.

**"దెబ్బ కలవాటు పడినదీ దేహ మెల్ల;**
**దెబ్బ కన్నా మతేమి సాధింపగలరు**
**క్రూరతములయ్యును నధర్మ భూరమణులు?**
**కొట్టి కొట్టి విసుగు చెందకుండ గలరె?"**

(దక్షిణాఫ్రికాలో ప్రవాసభారతీయుల అవమాన విముక్తి-96)

సత్యాగ్రహులు చెరసాలలకు బెదిరిపోరు. పైగా చెరసాలలు మానవుల అంతరాలనూ, అంతస్తులనూ చేరిపివేసి సమభావాన్ని కలిగిస్తాయని వారి విశ్వాసం.

**"బైట నెన్ని యంతస్తుల వారలైన**
**నంద రొక్కటె చెఱసాల బంధమందు,**
**మేని రూపముల్ వేఱ వేఱైన, లోన**
**నున్న పరమాత్మ యొకటే యన్న యట్లు"**

(దక్షిణాఫ్రికాలో ప్రవాసభారతీయుల అవమాన విముక్తి, 122)

ఈ పద్యంలో ధనిక పేద అంతస్తులను మానవశారీరక రూపభేదాలతోనూ, చెరసాల బంధనాలను పరమాత్మతోనూ పోల్చడం విశేషం.

**నగర వర్ణన:** ఈ కవి వర్ణించిన నగరాలలో శ్రీనగరం ప్రత్యేకమైనది. అలల సవ్వడిలా హ్రస్వ లకార ఆవృత్తి కలిగిన పదాలతో మనోహరమైన కూర్పుతో శ్రీనగర ప్రత్యేకతను మన మనోఫలకాలలో నిలపడం విశేషం.

**"వలపుల కులుకుచు, కలయిక**
**తలపుల పులకలను చిలిపితనపు కలలలో,**
**సొలపుల విల విల లలరెడు**
**చెలువపు టమృతముల చెఱువు శ్రీనగరమ్మే"** (భారత దర్శనము 18)

ఈ పద్యంలో 'శ్రీ' తోపాటు ఛందో నిర్ణీతమైన రెండవ, నాలుగవ పాదాల చివరి అక్షరాలు తప్ప తక్కిన అక్షరాలు అన్నీ లఘువులై సర్వలఘు కంద అందాన్ని అందిస్తుంది.

అలాగే దిల్లీ నగరాన్ని ద్విపద ఛందస్సులో వర్ణిస్తూ ఇసుమంతైనా తుప్పుపట్టని అక్కడి కుతుబ్ మినార్ ను "...మిన్నును పొడిచిన మేకును వోలె..." (భారత దర్శనము 30) అని వర్ణించడం అపూర్వమైన ఊహ. లోకంలోని కళాత్మకత అంతా అందులో తడిసి స్నానం చేసిందేమో అన్నట్లున్న తాజ్ మహల్ "...ఆష్టను కళార్ణవమున నెత్తైన దీవి/ ఆగ్రలో ప్రకృతికి దీని దగ్ర రీవి" (భారత దర్శనము 34) అని హృద్యంగా వర్ణించారు.

**స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలు:** గాంధీ స్వాతంత్ర్యోద్యమం గురించిన కార్యాచరణ చర్చలు చేసే సందర్భంలో తీవ్రవాద జాతీయవాదులు ప్రత్యక్షంగా యుద్ధమే శరణ్యమని చెప్పినట్లు వర్ణించిన పద్యం సహజరమణీయం.

**"దెబ్బకు దెబ్బ, గుండున కదే గతి గుండును, తెల్లవారిపై,**
**నిబ్బర మంత దోసిట గుణించుక కొట్టుటె శీఘ్ర మార్గమౌ;**
**నుబ్బిన కండ కావరపు హొూడల మాడుల నూడ గొట్టుచో**
**నబ్బును బుద్ధి, సీమకు రయమ్ము పరుంగిడ తెల్లవారికిన్"** (కార్యాచరణ చర్చలు 45)

చంపారన్ లో కర్షకులు తమకు మద్దతుగా నిలిచిన గాంధీకి తమ గోడు వెళ్లబోసుకున్నారు. అక్కడి రైతుల పొట్టలు కొట్టి అన్యాయంగా వారు పండించిన పంటను దోచుకొంటున్న తెల్లదొరల దుర్మార్గాన్ని ప్రపంచానికి చాటి అహింసతో, సత్యాగ్రహంతో వారి ఆశలు నెరవేర్చి గాంధీ బాపూగా ప్రశంసలందుకున్నారు.

**"పరుగై వచ్చిరి నీలి కర్షకులు చంప్రాన్ నుండి ఆంగ్లేయ దు**
**ర్భర దుశ్చేష్టల నోపలేక, పొలముల్ పండించుటే మాదు వం**
**తు, రూపాయల్ తుదిపైస దాక గొని, సంతోషమ్ముతో పొంగి తుం**
**టరులై గంతుట వారి వంతు, నొకనాడా, యెన్ని యో యేండ్లుగా"**

(అహింసాత్మక ప్రతిఘటన: తొలి సంఘటనలు 11)

**"మా పొట్టలు కొట్టిన యా**
**పాపాత్ముల మీద గెలుపు బడసితిమి అహిం**
**సా పాదయాత్ర త్రోవనె**
**బాపూ వైనావు మాకు, భరత ప్రజకున్"** (అహింసాత్మక ప్రతిఘటన: తొలి సంఘటనలు 22)

తెల్లదొరల దుర్మార్గ అమానవీయ పాలనకు నిలువుటద్దం జలియన్ వాలాబాగ్ దురంతం. తల్లులు, పిల్లలు, వృద్ధులు అని కూడా చూడకుండా మారణహోమం సృష్టిస్తూ రాక్షసభటులు ఆడిన చెలగాటాన్ని కళ్ళకు కట్టినట్లు వర్ణించారు.

**"తల్లుల్, పిల్లలు, వృద్ధులున్, పలువు రత్యంతార్తి సంఛిన్నులై**
**యల్లల్లాడువారు, నన్ని దెసలన్ హాహా ధ్వనుల్ సల్పుచున్,**
**కాళ్లన్ దాకు శవమ్ము లీదుచు శతఘ్న్యాపత్తుతో వేగుచున్,**

**మొల్లంచేద్చెదు శోకనాదములతో దిక్కుల్ మ్రోగె దీనమ్ముగా"** (జలియన్ వాలాబాగ్‌లో మృత్యు తాండవము 15)

అంతేగాక అక్కడి హృదయవిదారక దృశ్యాలను కంటతడిపెట్టేటట్లు వర్ణించారు.

**"చచ్చి పడ్డ తల్లి శవముపై పడి యేడ్చు**
**చున్న చిన్ని పాప కన్ను గవను**
**గ్రద్ద వ్రాలి పొడిచె; ప్రొద్దు గ్రుంకినవెన్క**
**నక్క లటకు వచ్చి మెక్క దొడగె"** (జలియన్ వాలాబాగ్ లో మృత్యుతాండవము 18) గాంధీ పిలుపు మేరకు సహాయనిరాకరణంలో ఉద్యమకారులు పోలీసుల దెబ్బలు తిన్నా తిరగబడకుండా, పల్లెత్తు మాట అనకుండా సాగించిన పోరాటం బ్రిటీషు ప్రభుత్వానికి ఆశ్చర్యాన్ని కలిగించింది.

**"ముందుకె కాని యొక్కడును మొగ్గక వెన్కకు, లాతి వారి దె**
**బ్బందుటె కాని త్రిప్పి యొక పల్లును దెబ్బను కొట్టకుండ, ఆ**
**క్రందన లేక "మా భరతలక్ష్మిని వీడి పరుంగు లెత్తుడీ**
**యెందుల కీ వృథా ప్రభుత యింక" నటంచు మొఱింగి రందఱున్"** (సహాయ నిరాకణోద్యమము 29)

ఉప్పు సత్యాగ్రహఘట్టంలో ఊతకర్రతో సముద్రతీరానికి నడక సాగించిన గాంధీని కృష్ణపరమాత్మతో పోల్చడం రమణీయం.

**"కదలె నొక్కడుగా గాంధి కఱ్ఱతోడ**
**దూరమున నున్న అంభోధి తీరమునకు;**
**అంత వెఱ్ఱియ యొకడె దవ్వంత సాగ,**
**కృష్ణ పరమాత్మ వంటి వాడీ మహాత్మ"** (దండి ఉప్పు సత్యాగ్రహము 9)

గాంధీ జాతీయోద్యమానికి విరాళాలను కోరగానే స్త్రీలు తమ వంటిపైనున్న ఆభరణాలను వొలిచి ఆయన జోలెలో వేశారు. అట్లా భారతీయ మహిళలు ఉద్యమాన్ని ఉరుకులెత్తించారు.

**"అని గాంధీ పలుకంగనే యువిదలం దారాట ముప్పొంగె, నం**
**తనె గాజుల్ మెడనున్న హారములు, నంద మ్మొల్కు వడ్డాణముల్**
**కనకస్ఫార మనోహరమ్మగు నలంకారమ్ములన్ పుణ్కి యా**
**తని జోలిం బడవేసి రంగన లమందానంద సందీప్తలై"** (దండి ఉప్పు సత్యాగ్రహము 3 2)

కృష్ణాతీరంలోని చల్లపల్లికి చెందిన ఈ కవి అక్కడికి సమీపంలోని మచిలీపట్టణంలో పోలీసులు రక్తం వచ్చేటట్లు చావబాదుతున్నా లెక్కచేయకుండా జాతీయపతాకాన్ని ఎగురవేసిన దేశభక్తుడు, జెండావీరుడుగా ప్రసిద్ధి పొందిన నర్సయ్య పోరాట పటిమను కొనియాడారు.

**"జెండా వీరు డటన్న పేరు బడసెన్ జీవించి నన్నాళ్ళు, యో**
**గ్యుండౌ భారత పుత్రుడన్న నుతితో నుప్పొంగె నర్సయ్య, చే**
**కందల్ మానని పుండులైన వను శోకం బంద డింతైన, నే**
**నుండం బోదునొ దాస్య ముక్తి వఱకేమో", యన్నదే బెంగయై** (దండి ఉప్పు సత్యాగ్రహము 99)

క్విట్ ఇండియా ఉద్యమ సందర్భంలో ఊపందుకున్న భారతీయుల సమరోత్సాహాన్ని సూచించడంకోసం కవి ఉత్సాహవృత్తంలో లయాత్మకంగా రచించిన కిందిపద్యం కవి రసౌచిత్యానికీ, సందర్భశుద్ధికీ నిదర్శనం. ఈ ఉద్యమాన్ని కవి 'పొందు పొందు ఉద్యమం' అనడం జనరంజకం.

ఉత్సాహ. **"పొండు పొండు ఆంగ్లులార, పొండు పొండు సీమకున్,
పొండు భారతాంబ వీడి, పొండు తక్షణమ్ముగా,
మొండికేసి యుందురేని, పుండురేగు గుండెలన్,
పొండు దాని తీపి పండు ముందె బుద్ధిమంతులై** ('పొండు పొండు' ఉద్యమము 2)

గాంధీ నిరాహారదీక్ష సమయంలో ఆయన క్షేమాన్ని కాంక్షిస్తూ హిందువులేకాక, మహమ్మదీయులు, క్రైస్తవులు, శిక్కులు సైతం ప్రార్థనలు చేసినట్లు ఒకే పద్యంలో వర్ణించి భారతీయుల ఐకమత్యాన్ని సూచించారు.

**"కోవెల లన్ని మ్రోగినవి గుంఫిత వైదిక మంత్ర సూక్తులన్,
పావనమౌ కురాను పద వల్లరు లల్లె విహాయసమ్మునన్,
దీవన కోరి ప్రార్థనల దెల్పెను క్రైస్తవ దివ్య సౌధముల్,
మ్రోవెను గ్రంథ సాహెబు స్వరమ్ములు, గాంధికి సేమ మబ్బగన్"** ('పొండు పొండు' ఉద్యమము 58)

ఇంకా బెంగాలులో ఆకలి చావులు, కలకత్తా వధాకాండ మొదలైన అంశాలను చారిత్రక ఆధారాలతో, ఔచితీమంత కల్పనలతో వర్ణించారు రామనాథం.

**"ఎందఱు కన్యలు గృహిణులు
నిందాన్వితులైన పరమ నీచుల బలవ
న్నందానల కీలలలో
నింధనమై మడసిరో గుణింపగవశమే?"** (కలకత్తా వధాకాండ 22) అంటూ కలకత్తాలో జరిగిన మతహింస అనే అగ్నికీలలలో ఎందరు మహిళలు దారుణంగా చంపబడ్డారోకదా! అని వాపోయారు.

**స్వాతంత్ర్య సమరవీరులు:** 'స్వరాజ్యము నా జన్మ హక్కు' అని గర్జించిన మరాఠాసింహం 'లోకమాన్య' బాలగంగాధర తిలక్ గురించి వర్ణిస్తూ హక్కు అనే పదాన్ని పునరుక్తి చేయడంద్వారా వారి నినాద వైశిష్ట్యాన్ని ద్విగుణీకృతం చేశారు.

**"ఇది భరతమాత, నా మాతృ హృదయ మిదియె
యగు, స్వరాజ్యము నా జన్మహక్కు, హక్కు;
లాటి జనులకు చెల్ల దీ రాజ్యలక్ష్మి"
అని తొలిగి హుంకరించిన ఆర్యుడతడు"** (అహింసాత్మక ప్రతిఘటన: తొలి సంఘటనలు 59)

ఇక మన్యం ప్రాంతంలోని గిరిజనులపై జరుగుతున్న దోపిడీని ఎదుర్కొని తెల్లవారి గుండెలలో గూడుకట్టిన తెలుగుతేజం, మన్యంపులి అల్లూరిని గురించి ద్విపద ఛందస్సులో వర్ణించారు. అల్లూరిని విలువిద్యలో మహావీరులైన ఏకలవ్యుడు, కరు?డు, అర్జునులతో పోల్చడం ఔచితీమంతం.

ద్విపద. **"తెనుగు బిడ్డ డితండు; తెల్లవారలకు
విలు బాణములు బూని, బెగడును గొలిపె,
ఏకలవ్యుని వోలె, నిన సుతు వోలె,
నాకృతి గొన్నట్టి అర్జును వోలె"** (అహింసాత్మక ప్రతిఘటన: తొలి సంఘటనలు 66)

నాటకకర్త కూడా అయిన ఈ కవి సహాయ నిరాకరణోద్యమ కార్యక్రమ సమాలోచన ఘట్టంలో ఒకే పద్యంలో జిన్నా, అబుల్ కలాం, నెహ్రూ అనే ముగ్గురు నాయకుల అభిప్రాయాలను సహజ సంభాషణా రూపంలో చెప్పడం అపూర్వం.

**"జిన్నా పల్కె "నెదో విధమ్మయిన యాజిన్ రేపగా జెల్లు వా**
**రి న్నిర్జింప"; అబుల్ కలాము, "సరె నే రీతిన్, బలంబున్నదే?"**
**యన్నన్ పల్కెను నెహ్రూ "శస్త్రములపై నాధారముం గొన్నచో,**
**మిన్నున్ నింపెడి దోమలై నలిగి పోమే వారి శస్త్రాగ్నిలో?"** (సహాయ నిరాకణోద్యమము 2)

**ఛందోవిశేషాలు :** ఆచార్య రామనాథకవి ఈ కావ్యంలో ప్రసిద్ధమైన వృత్తాలు, జాతులు, ఉపజాతులతో పాటుగా సందర్భశుద్ధితో కవిరాజవిరాజితము, మానిని, మధురగీతి, తరలము, రథోత్తమము, పంచచామరము, ఉత్సాహ, పాదప, ప్రయాణి మొదలైన విశేష వృత్తాలలో కూడా పద్యాలు రచించారు. అంతేగాక 'ఒక అత్యుగ్ర సంఘర్షణ' అనే ఆశ్వాసం మొత్తాన్నీ ద్విపద ఛందస్సులోనూ, 'కొన్ని అస్పృశ్యోదంతములు' అనే ఘట్టాన్ని కంద పద్యాలలోనూ, 'ఉమ్మడిదారుల దొమ్మి'ని సీసపద్యాలలోనూ రచించారు. 'భారత కోకిల' గా ప్రసిద్ధురాలైన సరోజినీదేవిని మత్తకోకిల పద్యంలో వర్ణించి వృత్తౌచిత్యాన్ని పాటించారు.

**నుడికారం :** ప్రతిపదంలో తెనుగుదనం ఉట్టిపడే ఈ కావ్యం నిండా అనేకమైన జాతీయాలు, సామెతలు సందర్భోచితంగా ప్రయోగించబడ్డాయి. క్విట్ ఇండియా ఉద్యమాన్ని పొందు పొందు ఉద్యమం అనడం దేశీయతకు ఒక నిదర్శనం... మంత్రములకు చింతకాయలు రాలునా చెప్పుదయ్య ..." (కార్యాచరణ చర్చలు –44) అనే సామెతను ప్రయోగించడమేగాక తరువాతి పద్యంలో "...చింతకాయలె కాదు కార్చిచ్చు మంట రాలె బుగ్గిగ నిట్టి మంత్రమ్ము వలన" (కార్యాచరణ చర్చలు 47) అంటూ ఆ సామెతను వ్యాఖ్యానించడం విశేషం.

అంతేగాక 'గోళ్ళు గిల్లుకొనుట' అనే జాతీయం, 'కోతికి కొబ్బరికాయ దొరికెనటన్న చందమై' అనే సామెత కూడా తెనుగు నుడికారప్రయోగాలకు ఉదాహరణలు.

ఈ కావ్యంలో సూక్తులవంటి వాక్య ప్రయోగాలు కోకొల్లలుగా కనిపిస్తాయి. అవి ప్రతిరోజూ మనకు కనబడే విషయాలలాగానే తోస్తాయి. కవి కలంలో అవి సూక్తులుగా మారిపోయాయి. ఉదాహరణకు –

"ప్రతిమతమున్ పరాత్పరుని వంకనె దృష్టిని సాచు" (దేశవిభజన 16)

"మతముల పేరిటన్ పనికిమాలిన వైరము పెంచుకొనుట యోగ్యత కనుకూల లక్షణము కాదు"

(దేశవిభజన 15)

"చివురులను పండజేయుట చెట్లవంతు
ఎగిరివచ్చుచు కొఱుకుట ఖగమువంతు" (దక్షిణాఫ్రికాలో ప్రవాస భారతీయుల అవమానవిముక్తి 144)

"అగ్నికీల యెచటనైన నగ్ని కాదె!" (గాంధీ భారత దేశాగమనము 40)

"అమృతము మథించి తెచ్చుట యరుదు గాని
సిద్ధభాండము బ్రద్దలు చేయుటెంత" (గాంధీ నిర్యాణము 36)

రామనాథంగారు చిన్న చిన్న పదాలతోనే అద్భుతభావాన్ని అందించగలిగిన నేర్పరి. జవహరలాల్ నెహ్రూ గురించి వర్ణిస్తూ "భరత జనయిత్రికే కంటిపాప నెహ్రూ" అనే ప్రయోగం ద్వారా ఈ దేశానికి గాంధీ కన్ను అయితే నెహ్రూ కంటిపాప అనే భావం స్ఫురిస్తుంది. తరువాత "జవహరుండు ఆంగ్ల సామ్రాజ్య జవహరుండు" అన్న ప్రయోగంలోని సభంగశ్లేషతో ఆంగ్లేయుల విజయాల వేగాన్ని హరించేవాడు అనగా ఆంగ్లేయులను ఓడించేవాడు అనే రమణీయమైన అర్థాన్ని సాధించారు రామనాథం.

**ముగింపు :**

"ఎన్నొ పెను పల్కులను నిన్ను మున్నె యెన్ను
పెద్ద కవులకు చిటికెనవ్రేలు నేను ..." (ఉపక్రమణిక – 16)

అని చెప్పుకున్న ఈ కవి రచించిన ఈ కావ్యం ఆచార్య సినారె చెప్పినట్లు గడియారం వేంకట శేషశాస్త్రిగారి 'శివభారతం', దుర్భాక రాజశేఖర శతావధానిగారి 'రాణాప్రతాప సింహచరిత్ర' ముదిగొండ వీరభద్రమూర్తిగారి 'వందేమాతరం' వంటి ఆధునిక చారిత్రక మహాకావ్యాల సరసన చేర్చదగిన దేశభక్తికావ్యం. అంతేగాక

**"మనసు సారించి భావ కల్పనము జేసి**
**శబ్ద సౌందర్యమును ధ్వని గతము జేసి**
**శిల్పి రాతిని బొమ్మగా చెక్కినట్లు**
**పదముల స్రవింపజేతు కావ్యార్ద్రతలను"** (ఉపక్రమణిక –27) అని చెప్పుకున్న ఈ కవి రచించిన స్వాతంత్ర్యసిద్ధి తన వాగ్దానానికి నిదర్శనగా నిలుస్తుంది. ❀

**ఆధారగ్రంథం**

1. వేంకట రామనాథం, వేమూరి. 2000. స్వాతంత్ర్యసిద్ధి (పద్యకావ్యము). హైదరాబాదు: వేమూరి చంద్రావతి రామనాథం ఛారిటబుల్ ట్రస్టు.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 13 హైదరాబాద్ డిసెంబరు - 2022

# తెలుగు సాహిత్యంలో జాతీయోద్యమ భావనలు - ఒక పరిచయం

**డా. రత్నశేఖర్ కట్టెపోగు,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆంధ్రవిశ్వవిద్యాలయం, విశాఖపట్టణం, ఆంధ్రప్రదేశ్

ప్రపంచంలో జరిగిన ఉద్యమాలను పరిశీలించినపుడు వాటివెనుక ఒక క్రమం వుంటుందని బోధపడుతుంది. మొదట ఒకానొక తీవ్రసంకల్పం ప్రజలలోకి చొచ్చుకొని పోయినపుడు అది వారిలో చైతన్యాన్ని కలిగిస్తుంది. సాంఘిక చైతన్యం క్రియాశీలమైనప్పుడు అది ఉద్యమరూపం ధరిస్తుంది. అప్పుడు ఆ ఉద్యమాన్ని చిత్రిస్తూ రచనలు వెలువడతాయి. ఉద్యమం ముమ్మరంగా సాగుతున్నప్పుడు ఉద్యమ చైతన్యాన్ని ప్రతిబింబిస్తూ రచనలు వెలువడడం, రచనలు ఉద్యమాన్ని ప్రతిబింబించడమే కాకుండా దానిని ముందుకు తీసుకుపోవడానికి కూడా దోహదం చేస్తాయి. కొందరు రచయితలు ఉద్యమాలను ముందుకు నడిపించాలనే ప్రత్యేక దృక్పథంతో రచనలు చేయడం కనిపిస్తుంది.

ఉద్యమం, సాహిత్యం పరస్పర ప్రభావం, ప్రేరణ కలిగివుంటాయి. ఉద్యమం సాహిత్యసృష్టికి దోహదంచేస్తే, సాహిత్యం ఉద్యమాన్ని ప్రచారం చేయడానికి దాన్ని ముందుకు తీసుకుపోవడానికి దోహదం చేస్తుంది. 19వ శతాబ్దం చివరిదశలో భారతదేశ రాజకీయరంగం నూతన కార్యకలాపాలకు సిద్ధంగావుంది. విద్యలోనూ, సాంఘికహోదాలోను, రాజకీయ పలుకుబడిలోను, సంఖ్యలోను గణనీయంగా పెరిగిన ఒక మధ్యతరగతి వర్గం రాజకీయ నాయకత్వం చేపట్టడానికి సిద్ధంగావుంది. కలకత్తా, బొంబాయి, పూనా, మద్రాస్ మొదలైనచోట్ల రాజకీయ సంఘాలు ఏర్పడ్డాయి. ఇండియన్ అసోసియేషన్ (కలకత్తా), బాంబే అసోసియేషన్, పూనా సార్వజనిక సభ, మద్రాస్ మహాజనసభ మొదలగునవి అలా ఏర్పడినవే.

జాతీయత అంటే ఒక జాతి ఆత్మగౌరవానికి, ఔన్నత్యానికి సంబంధించిన స్థితి. జాతి సంస్కృతి, సంప్రదాయాలను, సహజత్వాన్ని ప్రవహింపజేసే జీవనది జాతీయత. గురజాడవారి 'దేశభక్తి' గీతం జాతీయతకు వివరణ. ఒకే మనుగడ, ఒకే విశ్వాసంగల మానవ సమూహపు భావజాలమే జాతీయత. భిన్నత్వంలో ఏకత్వమే జాతీయత. తన జన్మభూమికి ఎప్పుడూ వినయంగా వుండి అవ్యాజమైన ప్రేమకలిగి వుండడం, ఆ నేలను అక్కడి సంప్రదాయాలను, చారిత్రకతను అభిమానిస్తూ గాఢమైన అనురాగం వుండటం జాతీయత. మనమంతా ఒక్కటే అనే భావమే జాతీయత అవుతుంది. జాతీయ భావానికి మనసు ముఖ్యం. తమ మాతృదేశం ఒక్కటే, తాము అందరి కష్టసుఖాలను పంచుకోవాలని అనుకోవటం జాతీయత అవుతుంది. భిన్నజాతులు, భిన్నమతాలు, భిన్నభాషలు వున్నా జాతీయత అలవడుతుందని భారతదేశం ప్రపంచానికి చాటి చెప్పింది.

జాతీయ భావాలున్నవారికి స్వాతంత్ర్యకాంక్ష తప్పనిసరిగా వుంటుంది. స్వాతంత్ర్యం అనేది జన్మత: సంక్రమించే సహజ లక్షణం. స్వాతంత్ర్యంలేని మానవజీవితం ఒడ్డునపడ్డ చేపలాంటిది. జన్మభూమిని దాస్యశృంఖలాలనుంచి విముక్తి చేయించాలని ఎందరో త్యాగాలుచేశారు. మాతృఋణం తీర్చుకున్నారు. జాతి విముక్తికోసం, మాతృభూమి స్వేచ్ఛకోసం కవులు కలాలుపట్టారు. అదే జాతీయోద్యమ కవిత్వం అయింది.

బ్రిటీష్ వలసపాలనలో రాజకీయంగా మాత్రమేకాకుండా ఆర్థిక, సాంస్కృతిక, భాషాపరంగా అన్ని రంగాల్లో భారతీయుల్ని

బానిసలుగాచేశారు. 'విభజించి పాలించు' అనే సిద్ధాంతాన్ని పాటిస్తూ జాతి సమైక్యతకు విఘాతం కల్పించారు. మన సార్వభౌమత్వాన్ని మంటకలిపారు. అప్పుడు భారతీయులు స్వరాజ్యంకోసం అపూర్వరీతిలో ఉద్యమం చేపట్టారు. 'నాదేశం, నాజాతి' అనే భావన ప్రతిభారతీయుడిలో పవిత్రధారగా ప్రవహించింది.

1885లో భారత జాతీయ కాంగ్రెస్ రూపుదిద్దుకోగా అందులో ఆంధ్రులు కూడా పాలుపంచుకోవడం జరిగింది. 1905కు ముందు భారతదేశములో జాతీయోద్యమము బలపడలేదు. ఆంధ్రుల మనస్సుల్లో జాతీయాభిమానము అంకురస్థితిలో వుంది. ఆంగ్ల ప్రభుత్వం 1905లో వంగదేశమును రెండుముక్కలుగా చేయడంతో భారతీయుల గుండె భగ్గుమన్నది. వంగదేశంలో చెలరేగిన ఆందోళనాగ్నిశిఖలతో ఇటు ఆంధ్రదేశం కూడా అట్టుడికిపోయింది. బిపిన్ చంద్రపాల్ కలకత్తానుండి బయలుదేరి బరంపురం, విశాఖపట్నంమీదుగా ఆంధ్రదేశంలోని రాజమండ్రి, విజయవాడ, బందరు, నెల్లూరు మొదలగు పట్టణాల్లో తెల్లదొరల దౌర్జన్యకాండకు వ్యతిరేకంగా ఉపన్యాసాలు ఇచ్చారు. వారి ఉపన్యాసాల తెలుగు అనువాదాలు అప్పటికే ఆంధ్రప్రజలలో రగులుతున్న జాతీయోద్యమ జ్వాలలను మరింత ప్రజ్వలింపజేశాయి. రాజమహేంద్రవర సభలో చంద్రపాల్‌గారి ఉపన్యాసంవిని ఉద్రిక్తులైన చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు వ్రాసి చదివిన పద్యం సభను ఉత్సాహపరిచింది.

**'భరతఖండంబు చక్కనిపాడియావు**
**హిందువులు లేగదూడలై యేడ్చుచుండ**
**తెల్లవారను గడుసరి గొల్లవారు**
**పితుకుచున్నారు మూతులు బిగియబట్టి'**

ఈ పద్యం ఆనాడు ఆంధ్రదేశంలో వ్యాప్తిలోవున్న అన్ని పత్రికలకెక్కింది. అలాగే హరికథలలో కూడా ప్రస్తావించబడింది. ప్రతి ఆంధ్రుడి నాలుకలపై తాండవమాడింది. ఈ పద్యం తెలుగులో భారత జాతీయోద్యమానికి సంబంధించిన తొలిరచనగా పేర్కొన్నారు.

అయితే అంతకుముందే ఇటువంటి పద్యాలు వున్నాయని చెప్పినా అవన్నీ అసంతృప్తిని, పరిపాలనా విధానాన్ని వివరించాయేగానీ ప్రభుత్వాన్ని, దోపిడీ ప్రభుత్వంగా ప్రత్యక్షంగా ఎదిరించలేదు. 1905 డిసెంబరు 15వ తేదీన కృష్ణా పత్రికలో 'ది క్రై ఆఫ్ మదర్ ఇండియా' అనే గీతం ప్రచురితమయింది. అది జాతీయోద్యమ ప్రథమ గేయమని చాలామంది అభిప్రాయపడ్డారు.

**'హిందువులారా, ఎన్నాళ్ళీగతి**
**మందమతులరై మాటికిజెడెదరా**
**నందనులగు మీరందరు స్రుక్కగ**
**యెందుకు నా బ్రతుకితరులకోసమ'** ఈ ప్రబోధగీతాన్ని రాసినవారి పేరు తెలియలేదు.

1907 మే నెలలో ప్రభుత్వము లాలాలజపతిరాయ్‌ను బంధించి బర్మాలో నిర్బంధించింది. దానికి నిరసనగా ఆంధ్రదేశంలోని అన్ని ప్రధాన నగరాలలో విద్యార్థులు సమ్మెలుచేశారు. వందేమాతరం నినాదంతో వీధులలో ఊరేగింపులు సాగించారు. ఈ సంఘటన జాతీయోద్యమ స్ఫూర్తిని దేశం నలుదిశలా వ్యాపించేలా చేసింది. దేశంలో కలిగిన ఈ సంచలనానికి చిలకమర్తివారు ఆవేశపూరితంగా

**'చెరసాలల్ పృథుచంద్రశాలలెయగున్, చేదోయిగీలించున**
**య్యరదండల్ విరిదండలయ్యెడును, హేయంబైన చోడంబలే**
**పరమాన్నంబగు, మోటుకంబళులు దాల్పన్ పట్టుసెల్లాలగున్,**
**స్థిరుడై యే నరుదాత్మదేశమును భక్తింగొల్చు నవ్వానికిన్'**

అంటూ ఈ పద్యం ఆవేశంతోపాటు అంకిత స్వభావాన్ని పురికొల్పింది. అలాగే

**'భరతఖండంబె యొకపెద్ద బందెఖాన**
**అందులోనున్న ఖయిదీలు పొందుజనులు**
**ఒక్క గదినుండి మార్చి వేరొక్కగదిని**
**బెట్టుటేకాక చెరయంచు వేఱెగలదె'**

అంటూ జాతీయభావాన్ని వ్యంగ్యంగానో, అన్యాపదేశంగానో చిత్రించకుండా సూటిగా ఆంగ్లప్రభుత్వాన్ని విమర్శించిన మొట్టమొదటి జాతీయకవిగా చిలకమర్తివారు కనిపిస్తారు.

జాతీయోద్యమ కవిత్వ ప్రపంచంలో మంగిపూడి వేంకటశర్మ స్థానం మహోన్నతమైనది. ఎదగబోయే ఆయన కవితా హృదయానికి చిహ్నాలు ఈ పద్యాల్లోనే కనిపిస్తాయి. దేశభక్తుడు చేవవిధుడు అన్నంతవరకు పోయారు అని మద్దూరి సుబ్బారెడ్డి తెలియజేశారు. వారు 'భరతమాత' అనే శీర్షికతో భారతదేశ ప్రాచీన ఔన్నత్యాన్ని గానంచేశాడు. 1912లో మాతృభూమికి తమకుగల అనుబంధాన్ని

**'చెలగి నేను విదేశ సీమలయందు**
**బహుసుందరోద్యానవనములందు...**
**విహరించుచున్నను, వేవేగమునను**
**నా జన్మభూమికి నన్ను గొంపోవ**
**వాయువునకు నేను స్వాగతంబిడుదు'**

అంటూ తెలియజేసి 'జననీజన్మభూమిశ్చ' అన్న సూక్తికి కావ్యత్వాన్ని కల్పించాడు. అలాగే 'ఆంధ్రభారతి'లో ప్రచురించిన ఒక ఖండకావ్యములో దేశమాతపై తనకుగల అపారభక్తిని వెల్లడించారు.

**'నాస్వకీయంబిది నా జన్మభూమి**
**యిదియంచు మనసార నెన్నడుగాని**
**యొకసారి తలపోసి యుల్లముప్పొంగ**
**హర్షింపనట్టి హతాత్ముండు కలడె**
**మునుపు తావెందుండి పుట్టెనో యట్టి**
**దుమ్ములోపలికిని దు:ఖింపబడకె**
**కీర్తింపబడకె శ్లాఘింపగాబడకె**
**గౌరవింపబడకె క్రమ్మరబోవు'.**

ఈ విధంగా మంగిపూడి తన రచనలలో జాతీయాభిమాన కవితారేఖలు తొంగిచూచినా చిలకమర్తివారిలోని తీవ్రత వీనిలో లేదు. ఆ తరువాత రాయప్రోలు రచనలలో చిలకమర్తివారి ఉద్యమస్ఫూర్తి, భావతీవ్రత రెండూ చోటుచేసుకున్నాయి. 1915లో గోఖలే మరణవార్తవిని 'అస్తమయము' అనే శీర్షికతో ఆంధ్రపత్రికలో రాసిన పద్యములో ఆంగ్ల ప్రభుత్వ నిరసనం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

**'దొరలందగించిన బిరుదుమోజునద్రుళ్లి**
**నాయకధర్మంబు బాయలేదు**
**ప్రభువుల విశ్వాసపదమెక్కి దుర్నీతి**
**బ్రజలపక్షము భంగపరపలేదు**

**స్వార్థలోభమున కపటనాటకములాడి**
**తల్లి కడుపు చెడదలపలేదు**
**సమయనీతి త్యజించి సంక్షోభ విడివడ**
**కలహకవాటముల్ కదపలేదు**
**నీతిచాతుర్యమును స్తవనీయమయిన**
**దేశ సేవనదీక్షయు దీర్చినావు**
**యోగివోలెను ఫలనిస్పృహుండవగుచు**
**మేలుకీళ్ళు సహించి గోపాలకృష్ణ'.**

ఈ విధంగా ప్రారంభమైన వారి జాతీయాభిమానము 'జన్మభూమి' మొదలైన పద్యాలతో పతాకస్థాయిని అందుకొన్నది. 1916 నుండి 1920 వరకు జరిగిన హెూంరూలు ఉద్యమం లాంటివి తెలుగులో నవ్యకవులలో దేశభక్తి భావాన్ని ప్రసరింపజేసి నాటి యువకులలో నూతనోత్తేజమును కలిగించినది. యువకవులు ఆంగ్ల విద్యాసంపర్కమువలన అమెరికా, రష్యా మొదలైన దేశములు స్వాతంత్ర్యం కొరకు జరిపిన ఉద్యమాలగురించి చదివి తమలోని జాతీయ భావాలకు పదునుపెట్టుకున్నారు. భారత జాతీయోద్యమానికి పాశ్చాత్య చరిత్ర పఠనం బలమైన కారణంగా కనిపిస్తుంది. రవీంద్రుని జాతీయ గేయాలు దేశంలో బహుళ వ్యాప్తిని పొందాయి. భారత జాతీయోద్యమ కవిత్వము ఆంధ్రదేశంలో వెల్లివిరియటానికి దేశంలోని ఉద్యమాలతోపాటు, రవీంద్రుని జాతీయ గేయాలు చాలావరకు ఉపయోగపడ్డాయి.

ఉద్యమానికి సమర్థుడైన నాయకుడు కావాలి. అప్పుడే ఆ నాయకునిమీద ఉద్యమకారులకు గురి, గౌరవం వుంటుంది. భారత జాతీయోద్యమానికి మహాత్మాగాంధీలాంటి మహెూన్నత వ్యక్తి నాయకత్వం లభించడం నిజంగా భారతీయులు చేసుకున్న అదృష్టం. మహాత్ముని గురించి నాడు తెలుగుప్రాంతంలో పేర్కొనని కవి లేడంటే అతిశయోక్తికాదు. తుమ్మల, జాషువా, పుట్టపర్తి, వడ్లమూడి, దామరాజు పుండరీకాక్షుడు, బసవరాజు అప్పారావు, కనుపర్తి వరలక్ష్మమ్మ మొదలగు రచయితల నుండి కావ్యాలు, శతకాలు, గేయాలు, దండకాలు, హరికథల రూపంలో వెలువడి ప్రజలను దేశభక్తులుగా, ఉద్యమశీలురుగా ప్రేరేపించాయి. జాతీయోద్యమ కవిత్వం అనగానే గరిమెళ్ళ సత్యనారాయణ రాసిన 'మాకొద్దీ తెల్లదొరతనం' గేయం గుర్తుకొస్తుంది. ఆ గేయం జనాన్ని ఉద్రేకపరచి, పిడికిలి బిగించేలా చేసి, ప్రతిఇంటా మంత్రంలా జపించబడింది. తెలుగువారిని జాగృతపరచిన వీరరస ప్రధానమైన గేయంగా కీర్తిగడించింది.

జాతీయోద్యమ కవిత్వంలో మాతృస్తుతి, దేశసంస్తుతి ఒక భాగం. దేశాభిమానం కలిగించడానికి దేశవైభవాన్ని కీర్తిస్తూ 'జన్మభూమి' అనే భావాన్ని నరనరాల్లో ప్రవహింపజేసింది. ఒకవైపు మాతృదేశాన్ని ఆరాధిస్తూ జాతీయ తత్వాన్ని బోధించాయి. జాతీయోద్యమంలో సహాయనిరాకరణం, మధ్యపాన నిషేదం, హరిజనోద్ధరణ, క్విట్ ఇండియా, ఉప్పుసత్యాగ్రహం ఘట్టాలను కవులు వీరోచిత సన్నివేశాలుగా కీర్తిస్తూ తెలుగు ప్రజలను కదనవీరులుగా తీర్చిదిద్ది కవనరంగం, కదనరంగం ఒకటేనని రుజువుచేసి కత్తికన్నా కలంమిన్న అని చాటి చెప్పారు. ❁

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 13 UGC Care List Approved Journals
హైదరాబాద్ డిసెంబరు - 2022

# జాతీయోద్యమ కవిగా మంగిపూడి

**డా. కె. కరుణశ్రీ,** డి.కె. ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ.ప్ర.) నెల్లూరు

జన్మ భూమి, స్వదేశం స్వాతంత్రోద్యమకాలం నాటి దైవాలు. దేశభక్తే దైవభక్తిగా దేశసేవే ఉపాసనా సాధనంగా ఆకాలంలో మార్పు చెందింది. కోల్పోయిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను తిరిగి పొందాలన్న ఆకాంక్ష ఆనాటి సామాజిక పరిస్థితుల కనుగుణంగా సాహిత్యలోకంలో కూడ ప్రసరించింది. కనుకనే సామాజిక, రాజకీయ రంగాలలోని చిన్న మార్పు సైతం కవుల కలాన్ని నింపింది. స్వాతంత్ర్య సంపాదనకు అర్హమైన ప్రతి అంశం ఆనాటి సాహిత్యంలో కన్పిస్తుంది. ప్రతి బంధకమైన అంశాల సంస్కరణ, ఖండన కూడ ఆనాటి సాహిత్య వస్తువులే. స్వాతంత్ర్య సంపాదనకు హిందూ జాతి అనర్హమైందని, కారణం జాతిలో ఉన్న అసమానతలేనని భావించి జాతీయోద్యమాన్ని పటిష్టం చేయడానికి ముందుగా మంగిపూడి వేంకటశర్మ సంస్కరణ కవిత్వాన్ని రచించారు. అగ్రవర్ణాల వారు పంచములను నీచంగా చూడడంతో వారు హిందూ మతాన్ని వీడి అన్యమతాలను ఆశ్రయిస్తున్నారని, కొంతకాలం ఇలాగే జరిగితే జాతిలో ఐకమత్యం పూర్తిగా నశించి సంఘబలం క్షీణిస్తుందని, ఫలితంగా స్వాతంత్ర్య సంపాదన దుర్లభమౌతుందని చాటిచెప్పారు. అందువలన సత్వరమే పంచములను సోదరులుగా భావించి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను గడించమని ప్రబోధించి జాతీయోద్యమంలో భాగంగా అస్పృశ్యతా నిర్మూలన కవిత్వాన్నీ రచించారు. హిందూ జాతిలోని భేదభావాల వలన ఆంగ్లేయులకు మరింత చులకనై పోతున్నారని కనుక సత్వరమే అసమానతలను రూపుమాపమని ప్రబోధించారు.

**"నాగరకులందు భరత సంతానమెట్లో**
**భరత వర్షీయులందు శ్వపాకులట్లె**
**ద్వేషభావంబు మాని శోధింపరయ్య"**

అని హెచ్చరించి భరత ఖండం ఈ కారణం వలనే నిరోధాన్ని కలిగి వుందని చెప్పారు. అందువలనే వితంతు సమస్య, బాల్య వివాహాలు, పంచముల సమస్యలను స్వాతంత్ర్య నిరోధాలుగా భావించి వాటిని తొలగించి సంఘానికి ఆయువు పట్టు గ్రహించి అందులో ప్రాణాలు పూరిస్తే గాని స్వాతంత్ర్య సంపాదన సులభమవదని భావించారు. "వర్ణభేదములకై వాదులాడుచునున్న దేశంబు ప్రోన్నత స్థితికి రాదు" దేశాభివృద్ధికి నెందు స్త్రీలే కారకురాండ్రు" అని దేశాభివృద్ధికి తద్వారా స్వాతంత్ర్య సంపాదనకు సంఘ సంస్కరణను చేపట్టమని చెప్పారు. నిరుద్ధత్వం జాతి కంతటికీ ఘటించినా ముందు అంత్యజులను, స్త్రీలను కూడగట్టుకోవాలని భావించి, సంస్కరణ వాదిగా జాతి బానిస కావడానికి కారణాలు కనుక్కొని జాతీయతా భావాన్ని పెంచడానికి ప్రయత్నించారు. మంగిపూడి కూడా వీరేశలింగం పంతులువలె రాచరికపు దుష్టపాలనపోయి సమాజం ముందుకు పోవడానికి ఆంగ్ల విద్య కారణం అని నమ్మినవాడు కాబట్టి విదేశీయుల వద్ద నేర్చుకున్న జ్ఞానంతోనే భారతదేశాన్ని ఉద్ధరించమని సూచించారు. పునరుద్ధరణ భావాలతో గతం నుంచి స్ఫూర్తిని పొందుతూ సంఘ సంస్కరణలతో జాతీయా భావాన్ని ప్రేరేపింప ప్రయత్నించారు. ఆంగ్లేయుల దౌష్ట్యాలు మితిమీరడం, స్త్రీల సమస్యలు కొంత మెరుగు పడడం, జాతీయోద్యమానికి నిర్దిష్ట నాయకత్వం లభించడంతో ప్రజలలో

స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కాంక్ష పెరిగి సంస్కరణలు కొద్దిగా వెనుకంజ వేశాయి. జాతీయ భావన బలపడడంతో మత సంస్కరణలపై కంటే జాతీయోద్యమం వైపు కవులు ఎక్కువ దృష్టి సారించారు. స్వాతంత్ర్యోద్యమంలోని ప్రముఖ ఘట్టాలైన వందేమాతర ఉద్యమం, మద్య నిషేదం, హరిజనోద్యమం, జాతీయ నాయకులు, రాట్నం, పరాయిపాలనా వ్యతిరేకత, భరతమాత, దేశభక్తి, గతం మొదలైనవన్నీ ఆనాటి కవుల జాతీయోద్యమ కవుల కవితా వస్తువులే అయ్యాయి. మంగిపూడి వేంకటశర్మ కూడా జాతీయోద్యమ ప్రేరకమైన అన్ని రకాల కవిత్వాన్ని రచించారు. మంగిపూడివారి జాతీయోద్యమ కవిత్వాన్ని తొమ్మిది విధాలుగా విభజించవచ్చు. 1. వందేమాతర ఉద్యమం 2. హిందూ దేశ ప్రస్తుత దురవస్థ 3. హిందూ దేశ పూర్వ ఔన్నత్యం 4. స్వదేశీ వస్తు ప్రోత్సాహం 5. జాతీయ గేయాలు 6. జాతీయ నాయకులు 7. జాతీయోద్యమ కవుల కర్తవ్యం 8. ఆంధ్రజాతి చైతన్యం 9. దేశభక్తి.

**1. వందేమాతర ఉద్యమం**

**"మేలుకొనుమీ భరతపుత్రుడ**
**మేలుకొనుమీ సుజనపుత్రుడ**
**మేలుకొనుమీ సచ్చరిత్రుడ**
**మేలుకొనమయ్యా! వత్సా ॥ మేలుకో ॥**
**వేడుకను జాతీయతను**
**వేగుచుక్క పొడిచెనదుగో**
**కూడి వందేమాతరమ్మను**
**కుక్కుటముల లరచెన్" ॥ వత్సా మేలుకో ॥**

అని వందేమాతర ఉద్యమంతో మంగిపూడి జాతికి మేలుకొలుపు పాడారు. అనేక సహదేశాలు మేలుకొని జాతీయోద్యమాన్ని కొనసాగించి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను పొందాయని ఆ బాటలో పయనించి భారతీయులను కూడా స్వాతంత్ర్యం పొందమని సూచించారు.

**"అందరును నీకంటే ముందఱ**
**నడుగు లేయుచు మెలగుచుండగ**
**పండవలె నిటు నిద్రవోవగ**
**పాడియగునయ్యా!"**

అంటూ ఎగతాళి చేసి భారతీయులలో పౌరుషాన్ని నింపాలని ప్రయత్నించారు.

స్వాతంత్ర్య భాగ్యంబు జేతి కందిచ్చు తంత్రంబు వందేమాతరంబు సుండు" అని భావించి వందేమాతర ఉద్యమ స్వరూప స్వభావాలు తెలియజేయడానికి 'వందేమాతరమ్' అనే కావ్యాన్ని రచించారు. వందేమాతర ప్రభావంతో భారతదేశాన్ని మాతగా కీర్తిస్తూ కవిత్వం వెలువడింది. దీనిలో భాగంగా వేంకట శర్మ భారత మాతృస్తవాన్ని కూడ సల్పారు.

"వందే సుందర రూపిణీం భగవతీం వందే కృపాంభోనిధం....... వందే చారు విహారిణీం సుచరితాం వందే సదామాతరం"

అని వందేమాతర ఉద్యమాన్ని స్వాతంత్ర్య సంపాదనకు చక్కని మార్గంగా వేంకటశర్మ భావించారు. "మన మనోరథము దీర్చి మనుచునట్టి బ్రహ్మమరయ వందేమాతరంబు సుండు" అని వందేమాతర ఉద్యమాన్ని గూర్చి వేంకటశర్మ అభిప్రాయపడ్డారు.

**2. హిందూ దేశ ప్రస్తుత దురవస్థ**

**"సర్వదేశముల కాశ్చర్యంబు గలిగించు కాశ్మీర శాలువల్ గంగ గలసె**
**ఉర్వియంతటను నోహొ! యనిపించుద క్కామేటి సెల్లాల నామమణిగె**

**నఖిల సీమలను వన్నెకు నెక్కి నుత్నిగన్న శిల్ప శాస్త్రం బతి స్వల్పమయ్యె**
**సకల రాష్ట్ర సుధీంద్ర సమ్మానితంబైన ప్రకృతి శాస్త్రంబెల్ల భస్మమయ్యె**
**చేతి పనులెల్ల మిగుల నశించిపోయె**
**సిరియు, విద్యయునుంగూడ జెదరిపోయె**
**నాగరికతాభిమానములే నాశనమయ్యె**

హిందుదేశంబు గరిమంబు హీనమయ్యె" అని దేశ ఆర్థిక స్థితి రోజు రోజుకూ దిగజారి పోతోందని హెచ్చరించారు. ఆర్థిక సంక్షోభంలో దేశం పడిపోడానికి కారణం విదేశీ వస్తు వ్యామోహమే నన్నారు.

**"ధరియించు వస్త్రములు మాన్చెష్టరు పట్టణంబున నుండి పంపవలసె**
**కాలంబు దెలిపెడి గడియార మమెరికా దేశంబు వారి బ్రార్థింపవలసె**
**నూనెకై రష్యాజనుల నగ్గిపెట్టెలు స్వీడన్ జపాన్ వారి వేడవలసె**
**ల్యాంపు, మేజోడు జర్మని నుండియును జిమ్ని యాస్ట్రేలియా నుండి యంపవలసె"**

అని హిందూ జన దుస్థితినీ వర్ణించారు. ఇటువంటి ఆర్థిక దుస్థితి నుంచి దేశం బయటపడాలంటే స్వదేశీ వస్తు ప్రోత్సాహం తప్పనిసరని స్వదేశీ ఉద్యమానికి కూడ ప్రోత్సాహం కలిగించే రచనలు చేశారు.

**3. హిందూ దేశ పూర్వోన్నత్యం**

హిందూ దేశ దురవస్థకు విలపించిన మంగిపూడి పూర్వ ఔన్నత్యాన్ని ప్రశంసించారు.

**"తన మతంబెల్ల ధాత్రిని బరుజేసిన**
**ఘను నశోకుని నెన్నగనువశంబె!**
**సార్థకంబుగ సాహసాంకంబు గైకొన్న**
**విక్రమార్కునెద భావింపదగునె!**
**పౌరుష శాలియై ప్రఖ్యాతి వడసిన**
**శాలివాహనునెన్న శక్యమొక్కొ!**
**విజితారియై పెక్కు విజయముల్చేకొన్న**
**ఘన శివాజిని మెచ్చగను నలవియె!!!** అని ప్రాచీన భారత వీరులను ప్రశంసించారు. దేశ ఆర్థిక స్థితి కూడా పూర్వం వైభవోపేతంగా ఉండేదని రత్నఖనులకు, జీవ నదులకు, మేటి శైలాలకు, అఖిల శాస్త్రాలకు, చక్రవర్తులకు, సత్యసంధులకు, ధర్మదేవతకు, ధనానికి, ధైర్యశాలురకు, శూరాగ్రగణ్యులకు భారతదేశం పుట్టినిల్లని చెప్పారు. "పుణ్యనదులకు నిలయమై పుణ్యులైన మునిజనుల కాయంబయి పుణ్యసతుల పుట్టినిల్లయి బాహుపుణ్యభూమియైన భరతమాత" ఆనాదు సకల సౌభాగ్యాలతో తులతూగిందని అటువంటి భారతదేశమిప్పుడు 'మిగుల దారిద్ర్య దశ నొందిపొగులు' తున్నదనీ బాధపడ్డారు.

**4. స్వదేశీ వస్తు ప్రోత్సాహం**

దేశం ఆర్థిక దైన్య స్థితి నుంచి తప్పించుకోవాలంటే స్వదేశీ వస్తు ప్రోత్సాహం తప్పనిసరని భావించి ఈ ప్రయత్నంలో భాగంగా ఖద్దరును ధరించమని ప్రభోధిస్తూ 'చరకాష్టకా'న్ని రచించారు. విదేశీ వస్తు వ్యామోహంలోనే దేశ ఆర్థిక స్థితి నాశనమౌతుందని "చరకము విడుచుటతోనే నరకము సిద్ధించే భరత వర్షమునకా చరకము విడుచుట బలు నాగరకమె నరకమ్ము గాక" అని ఘంటాపథంగా పలికారు. స్వదేశీ వస్తు ప్రోత్సాహంతోనే "తన దొడ్డిలోనే పండిన ప్రత్తి సమకూర్చి తను సొంతముగ నేకులను రచించి తన చేతితో వడికిన నూలు తన యూరి సాలె నేసిన యట్టి చేలగట్టి తన బాసలో పాండితిని గడించి తనదు తనువు

పరార్థదత్తము నొనర్చి మించు సత్కీర్తిచే ప్రకాశించునట్టి జనుడె చరితార్థుడాతని జన్మే జన్మ" అని స్పష్టంగా చెప్పారు. భూ భారము దీర్పకృష్ణుడు – పోరాటము కల్పించెను. సేవాపరము దీర్ప గాంధిచే – రాట్నము సంధించెను, అని రాట్నమే దేశ ఆర్థికస్థితిని సేవాపరాయణత్వాన్ని రూపుమాపగలదని భావించారు. కేవలం 'వందేమాతర మటంచు భజనలు సేయగా ఫలము లేదు' అని నొక్కి చెప్పారు. "చేతనున్న ధనము వెచ్చించ వలయు, సాగి దేశాంతరంబుల కేగవలయు, నేర్పిత బహుయంత్రశాలలు నిర్మింపవలయు", "కర్మ శాలలను వినిర్మింపవలయు, సకల వస్తు రచన సలుపవలయు, వర్తకమును జేయవలె" అని దేశం ఆర్థికంగా ముందుకు సాగడానికి చేయవలసిన పనుల గురించీ చెప్పారు. "మాతృదేవతయని భక్తి చేతనైన, జాతిపై నభిమానంబు చేతనైన, తెలుగు దేశాభిమానంబు చేతనైన" ఏ విధంగానైనా దేశాన్ని అభివృద్ధిచేయాలని ప్రబోధించారు.

**5. జాతీయ గేయాలు**

వేంకటశర్మ అనేక జాతీయ గీతాలు కూడ రచించారు. తల్లిని మించిన దైవం లేదు. అటువంటి తల్లికి కూడా తల్లి జన్మభూమి. అందుకే ఆనాటి కవులకు దేశమాత, భరతమాత, ఆంధ్ర మాత ఆరాధ్య దైవాలయ్యాయి.

"నిన్ను నెన్న మాతరమా! నిరుపమాన భరతమాత
మిన్ననైయఖిల భూములు! కన్నతల్లి! కల్పవల్లి"

అని భరతమాతను వర్ణించడం నాతరం కాదని మంగిపూడి అన్నారు.

"జయజయ భారత జనగణమా.. సాధు జన స్తుత చరితా
పావన హిందు బౌద్ధ తురుష్క ప్రముఖ మతాలయపూతా ?జయ జయ?
గంగాయమునా గౌతమి కృష్ణా కావేరి జలపూతా

వింధ్యముఖర పృథివీ ధరభరితా పకృతి విచిత్ర సమేతా ?జయ జయ?" అని పురా ప్రశస్తి గేయాలనూ వేంకటశర్మ రచించారు.

**6. జాతీయ నాయకులు**

స్వీయ జీవితాన్ని సంఘ జీవితాన్ని నియమబద్ధం చేయడానికి ఒక అర్థ శతాబ్ది అహరహం కృషి చేసిన ధర్మసాధకుడు గాంధీ. అహింస సత్యాగ్రహికి ఏకైక సాధనంగా ఆయన భావించారు. నిర్భీతితో కూడిన ధర్మ నిర్వహణం గాంధితత్వంలోని ప్రాణం. ఇందువల్లనే గాంధీని మించిన యదార్థ సంస్కర్త గాని విప్లవయోధుడు గాని మరొకడు లేడు అన్నారు. "సర్వాంగ సౌష్టవమైన జాతియోన్నతికి గాను కులమత వైరాలు సమసిపోవాలి. జాతి గౌరవాన్ని నశింపచేసిన మద్యపానత, అస్పృశ్యత, ధనికుల భోగపరాయణత, దీనుల ఆర్తనాదాలు, పరదాస్యం వలన ఏర్పడిన భయం, నైరాశ్యం, దైన్యం అన్నీ నశించాలి. ఇటువంటి ఆదర్శాలతో జీవితాన్ని సాగించిన గాంధీ గురించిన కవిత్వం పుంఖానుపుంఖాలుగా వెలువడింది. అటువంటి కవిత్వాన్ని రాసిన వారిలో శర్మ ఒకరు. 'గాంధీ చరిత్రామృతం' రచించి ఆత్మోపలబ్ధి నన్వేషించడానికే మహాత్ముని కథాగానం చేసినట్లు చెప్పుకున్నారు. స్వాతంత్ర్య సంపాదనకు గాంధి నేతృత్వాన్ని అంగీకరించమని ప్రార్థిస్తూ గాంధీ గారి గురించి ఆయన వ్యక్తిత్వం గురించి వేంకట శర్మ అనేక రచనలు చేశారు. అందులో శతకాలున్నాయి. కావ్యాలున్నాయి. గీతాలున్నాయి.

**"గాంధీ మహాత్ముని తత్వమెరిగి కష్టపడి పనిచేయండి**

**బంధము వదిలెడు స్వేచ్ఛావృత్తికై అందరు సమకూడండి"** అని గాంధీ నేతృత్వంలోనే స్వాతంత్ర్యం సిద్ధించగలదనీ స్వరాజ్య సాధనకై అందరూ గాంధీననుసరించాలనీ మంగిపూడి సూచించారు.

**7. జాతీయోద్యమ కవుల కర్తవ్యం**

స్వాతంత్ర్య సంపాదనకు అర్హమైన దేశభక్తి ప్రజలలో లోపించడానికి కారణం కవులేనని వేంకట శర్మ భావించారు.

"బానిసతనమున గ్రుగ్గెడు – బానిసలను దేశభక్తి మహితాత్ములుగా మానవిధులుగా మార్చెడు మానిత కావ్యంబులెన్ని మనకున్న వియో దేశాభిమాన నిరతిని – దేశమె సర్వస్వమనుచు త్రికరణ శుద్ధిన్ దేశమునకు బలిగా గల ధీశాలులు జేయు కృతులు తెలుగున కలవే" అని అవి లేవు కనుకనే ప్రజలలో దేశభక్తి లోపించిందని చెప్పారు. "కలమే వజ్రము గావలె – కలమే విపలబ్ధి కలముగావలె మౌఢ్యమున చిక్కిన జనులగు దేశీయులెల్ల జ్ఞానులగునటుల్ వడి వడి సద్గ్రంథము లెక్కడుగా రచియింపవలెను" అని ప్రబోధించారు. అస్పృశ్యులై సంఘానికి దూరమైన వారిని, స్త్రీలను ఉద్ధరించగల గ్రంథాలు రచించి కవులు తమ కర్తవ్యాన్ని పాటించాలని చెప్పారు. మంగిపూడి దృష్టిలో కవుల కర్తవ్యమొక్కటే. ప్రజలలో దేశభక్తిని దీపింపజేసి స్వాతంత్ర్యార్జన చేయడమే.

**8. ఆంధ్ర జాతి చైతన్యం**

జాతీయోద్యమ కాలంలోనే భాషా ప్రాతిపదిక మీద తెలుగు మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని భావించడంతో ప్రత్యేకాంధ్ర ఉద్యమం బయలుదేరింది. అయితే ప్రత్యేకాంధ్రలో ఆంధ్రులు మనలేరు అని కొందరు విమర్శించడంతో వారికి సమాధానంగా ప్రస్తుత వైభవం లేని ఆంధ్రులు గత శిధిలాలలో స్వర్ణయుగాలను గాలించారు. ద్వంద్వ జాతి చైతన్యం ఆంధ్రులలో వికసించడంతో భరతమాత, ఆంధ్రమాత రెండూ కూడ కవితా వస్తువులయ్యాయి. ప్రాచీనాంధ్ర కవిత్వంలో కన్పించే ఆంధ్రాభిమానం కంటే భిన్నమైన బహుముఖ వికసన పూర్వకమైన ఆంధ్రజాతీయ భావన ప్రత్యేక ఆంధ్రోద్యమ కాలంలో వెల్లివిరిసింది. జాతీయ పత్రికలైన కృష్ణాపత్రిక, దేశబంధు మొదలైన వాటిల్లో గాడిచర్ల హరిసర్వోత్తమరావు, కొండా వెంకటప్పయ్య తదితరులు వ్యాసాల రూపంలో ఆంధ్రాభిమానాన్ని ప్రకటించారు. కాని కవితా రూపంగా మొట్టమొదట జాత్యభిమానం ప్రకటించింది మంగిపూడి వేంకటశర్మే. 'ఆంధ్రమాత' అనే ఖండికలో "గౌతమి కృష్ణవేణీ తుంగభద్రాది మహావాహినీ జలపానంబు శ్రీశైల కాళహస్తి పురదాక్షారామ పురవర పత్రిక్షత్ర పూజితంబు" అని ఆంధ్ర మాతృస్తవాన్ని కూడా సల్పారు. 'ఆంధ్రదేశము' అనే మరో ఖండికలో ఆంధ్రుల పూర్వోన్నత్యాన్ని చాటారు.

**"చండ ప్రతాప రుద్రుండనం దగిన ప్రతాప రుద్రున కేది గేహసీమ**
**రుద్రదేవీ సమరుద్రమ దేవీ ప్రపూత చరిత కేది పుట్టినిల్లు**
**సరిలేని మూరురాయర గండ బిరుదాంక కృష్ణరాయలకేది గేహసీమ**
**భోజ సమాన విభ్రాజిత కీర్తి రాజనరేంద్రున కేది జన్మభూమి**
**మహిత బుద్ధిశాలి మనుమసిద్ధి నృపాల మౌళికేది రమ్యకేళివనము**
**ఖడ్గ తిక్కనాది ఘనులకేది నివాసమట్టి ఆంధ్రదేశమలరు గాత"** అని కేవలం ప్రశస్తి వచనాలతో ఆగక "యశము నన్మించుగాత శ్రీ యాంధ్రమాత" అని జాతి ఉచ్ఛస్థితిని దర్శించారు. అంతే కాకుండా ప్రత్యేకాంధ్రాసక్తి లేక ఆంధ్రుడు నిద్రిస్తున్నాడని వ్యంగ్యంగా విమర్శిస్తూ "జై ఆంధ్ర పుత్రుడా! జో మహాఘనుడా జో అసమర్థుడా! జో దంభపరుడా అన్నిటికి ఎగిరెగిరి అలసియున్నావు. జవమ్ము చాలక కాళ్ళు చాచుకున్నావు"! అందుకే ఇకనుంచి నీవు "పరుపుపై వెచ్చగా పండుకోవయ్య బిరుసైన దుప్పటి బిగదన్నవయ్య" అని రెచ్చగొడుతూ జోలపాట పాడారు. ప్రాచీన వైభవాన్ని స్మరించేది గతం నుంచి ప్రేరణ పొందేందుకు, గతంలో పోల్చి వర్తమానాన్ని అవగాహన చేసుకొని భవిష్యత్తును తీర్చిదిద్దుకోడానికి. కాని అది విస్మరించి ఆంధ్రులు గత వైభవ స్మరణలోనే కాలం గడుపుతున్నారని వేంకటశర్మ వెక్కిరించారు. "ఆర్య సంతతి వాడవనుచు పొంగెదవు – అన్నిటికీ నేనేనని అడ్డమయ్యెదవు" అని ఎగతాళి చేసి పౌరుషాన్ని కలిగించాలని ప్రయత్నించారు.

**9. దేశభక్తి**

భరత ఖండమంతా దిక్కుమాలి తేజాన్ని పోగొట్టుకొని సిరినంతా నష్టపోయి జీవించడమే కష్టమైన దశలో ఉంది. ఇటువంటి దశలో భగవంతుణ్ణి ఎలా ప్రార్థించగలను అంటూ వేంకటశర్మ భక్తిలో కుడా దేశభక్తిని పలికించారు. మాతృభూమికి

తనకు గల అనుబంధాన్ని గుర్చి చెప్తూ 'జన్మభూమి' అనే ఖండికను రచించారు. దూరతీరాల్లో ఇంద్ర భోగాల ననుభవిస్తున్నా అంతరంగంలో జన్మభూమి స్మరణను మర్చిపోలేమని చెప్పారు.

**"బహు సుందరోద్యాన వనములందు**
**తీరైన కాసార తీరమ్ములందు**
**విహరించుచున్నను వేవేగముగను**
**నా జన్మ భూమికి నన్ను గొంపోవ**
**వాయువునకు స్వాగతం బిడుదు"**

అని జన్మభూమిపై తనకు గల భక్తిని నిశితంగా ప్రదర్శించి దేశీయుల్లో ఆ భావాన్ని వ్యాప్తి చేయడానికి ప్రయత్నించారు. దేశ భక్తిని పెంపొందించడానికి వీరుల గాథలను కూడా వేంకట శర్మ రచించారు. చారిత్రక వీరనారీమణి చరిత్రను 'దుర్గావతి' కావ్యంగా మలచి దేశ భక్తిని ప్రేరేపింప ప్రయత్నించారు. స్వాతంత్ర్యోద్యమానికి చేయూత నివ్వక వెనుతీస్తే ముందుతరాలలో మన పరిస్థితి ఎలా ఉంటుందో చెప్తూ "స్వాతంత్ర్యము బాసి భావి సంతతి కినుకన్ బూతులు తిట్టగ బ్రతుకుగ రోతపడున్ గాగ యేనరుండు సహించు" అని అన్నారు. అంతేకాదు "తల్లి దండ్రులు కూర్మి సంతానమునకు దాచి యిడునవి ధనము, విద్యయును గావు. అభిజాత్యంబు స్వాతంత్ర్య వైభవంబు దాచి యిడవలె గడు నీకందనివిగాన" అని స్వేచ్ఛా స్వాతంత్ర్యాల – ప్రాధాన్యాన్ని స్పష్టపరిచారు.

స్త్రీ పురుష అసమానత, అస్పృశ్యత జాతిని నిర్వీర్యం చేస్తున్నాయని భావించి ముందుగా మన సంఘాన్ని సంస్కరించి తర్వాత స్వాతంత్ర్య సంపాదనకై కృషి చేయాలని వేంకట శర్మ భావించారు. ప్రస్తుత మన సమాజం స్వాతంత్ర్యానికి అనర్హమై ఉందని సంస్కరణ వాదిగా జాతిలోని లోపాలను తొలగించాలని ప్రయత్నాన్ని ప్రారంభించి, జాతీయోద్యమ కవిగా దేశభక్తి, భరతమాత, గతం, జాతీయ నాయకులు, రాట్నం, పరాయి పాలనా వ్యతిరేకత, వందేమాతర ఉద్యమం, దేశ ఆర్థిక వ్యవస్థ మొదలైన అన్ని అంశాలనూ మంగిపూడి స్పృశించారు. జాతీయోద్యమ కవిత్వంలో "పద్యమునకు, గేయమునకు బేధము లేదు. ఒక మహోద్యమము జాతి మొత్తము మీద సర్వజనుల గుండెలయందు మండుచున్న జ్వాల యొక్క స్వరూపము. ఆ జ్వాల యొకప్పుడు పద్యముగా నుండును. మరి యొకప్పుడు గేయముగా నుండును అందువలనే వేంకట శర్మ కవిత్వం కూడా భావావేశాన్ని అనుసరించి పద్యంగానో, పాటగానో, గేయంగానో రూపుదిద్దుకొంది. ❀

# జాతీయోద్యమం భారత స్వాతంత్ర్య వీరాంగన కనకమ్మ

డా. గోపవరం పద్మప్రియ, పి.ఆర్.ఆర్. & వి.యస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విడవలూరు,
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా. సెల్: 9177355538

భారతదేశ స్వాతంత్ర పోరాటంలో రక్తం మరిగే అంశాలు, రోమాలు నిక్కబొడుచునే సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా వారి త్యాగాల్ని, తెగువల్ని గుర్తు చేసుకుని స్ఫూర్తిని పొందడం ఈనాటి తరానికి, ఇప్పటి పరిస్థితులకు ఎంతో అవసరం, స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటంలో కేవలం పురుషులే కాదు మహిళలూ శివంగులై పురుషులతో సరిసమానంగా స్వాతంత్ర పోరాటంలో తమ భాగస్వామ్యతకు, స్వాతంత్ర్యం తీసుకురావడంలో వారు చూపించిన ధైర్య సాహసాలకు కొదవలేదు. సంప్రదాయాలకు కట్టుబాట్లకు ప్రాముఖ్యతను ఇచ్చే నాటి రోజుల్లో గడప దాటి మూఢ విశ్వాసాలను ఎదిరించి స్వతంత్ర పోరాటంలో పాల్గొని భారతదేశ మహిళా పౌరుషాన్ని చాటిన మహిళా మణులెందరో ఉన్నారు. వారిలో నెల్లూరుకు చెందిన భారత స్వాతంత్ర వీరాంగన పొణకా కనకమ్మ ఒకరు.

పొణకా కనకమ్మ నెల్లూరు వాస్తవ్యురాలు 1892 జూన్ 10వ తేదీన మరుపూరు కొండారెడ్డి, కామమ్మ దంపతులకు మినగల్లులో జన్మించింది (కోవూరు తాలూకా, నెల్లూరు జిల్లా) ఈమె పెరిగి పెద్దయినది పోట్లపూడిలో. వీరికి 9వ ఏటనే సుబ్బరామిరెడ్డితో వివాహం జరిగింది. వీరి పుట్టిల్లు, మెట్టిల్లు రెండూ సంపన్నమైన కుటుంబాలు. రెండు కుటుంబాలకు రాజకీయాలతో పరిచయం లేకపోయినా జాతీయోద్యమంలో చురుకైన పాత్ర వహించారు. ఈ ఉద్యమ పాత్రలో పొణకా కనకమ్మది సింహభాగం. జాతీయోద్యమంలో తన పాత్రను తన స్వీయ చరిత్రలో విపులంగా చర్చించింది. దానిని మనం చదువుతూ ఉంటే అనుభవాల దొంతరలాగా కన్పిస్తుంది. మరుగునపడివున్న వీరి స్వీయ చరిత్రను మనకు అందించిన ఘనత కాళిదాసు పురుషోత్తం గారిది. నేను ఈ పత్రంలో కస్తూరిదేవి విద్యాలయం, సుజనరంజని, జమీన్ రైతు, రాజకీయాలు ఇలా కొన్ని సంఘటనలను మాత్రమే పొందుపరచాను.

**సుజన రంజనీ సమాజం:-** 1913 మార్చి 1వ తేదీన పోట్లపూడిలో పొణకా పట్టాభిరామిరెడ్డి, మరుపూరు పిచ్చిరెడ్డి, నెల్లూరు రామానాయుడు, ఇంకా కొంతమంది మిత్రులతో కలసి సమాజ సేవకై సుజనీ రంజనీ సమాజం స్థాపించారు. దీనితో పాటు వివేకానంద గ్రంథాలయం కూడా స్థాపించారు. కనకమ్మ భర్త పొణకా సుబ్బరామిరెడ్డి ఔదార్యం, సహకారం వల్ల సుజన రంజనీ సమాజం ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక పునరుజ్జీవనంలో తన పాత్రను నిర్వహించింది. ఈ సమాజ సభ్యులు హరిజన, అరుంధతీ వాడల్లో కలరా, ఇన్ఫ్లుయెంజా వ్యాపించినపుడు మందులిచ్చి, గంజి కాసి పోసేవారు. పనిపాటలు చేసుకునే బాలుర కోసం విలుకానిపల్లె, పోట్లపూడిలో హాస్టళ్ళను నిర్వహించారు. గ్రామాల్లో, వీధుల్లో నలుగురు చేరే ప్రదేశాల్లో సంఘ సంస్కరణ గురించి దేశ పరిస్థితుల గురించి ఉపన్యాసాలనిచ్చేవారు.

ఈ సమాజానికి మొదట రాజకీయ ప్రసక్తి లేకపోయినా వెన్నెలగంటి రాఘవయ్య, చతుర్వేదుల కృష్ణయ్య ప్రవేశించిన తరువాత తిన్నగా ఆమె, ఆమె మిత్రబృందం, కొద్దికాలం అతివాద విప్లవ రాజకీయాల వైపు మొగ్గి పనిచేశారు. రహస్య కార్యకలాపాలకు

పల్లెపాడులో మామిడితోపును కూడా కొనాలని తీర్మానించుకున్నారు. కాని అది ఫలవంతం కాలేదు. క్రమంగా గాంధీజీ జాతీయోద్యమంలోకి ప్రవేశించిన తరువాత పూర్తిగా వీరు అహింసా మార్గం వైపు మరలారు.

గాంధీ ప్రభావానికి లోనుకాక ముందు మద్రాసులో ఓ.వి. చిదంబరం పిళ్ళై, గుంటూరులో ఉన్నవ లక్ష్మీ నారాయణ లాంటి విప్లవకారులతో చేతులు కలపి రహస్యంగా పిస్టళ్ళు, బాంబులు దిగుమతి చేసుకొని సమయం కోసం వేచి చూసిన సాహసి ఈమె.

**కస్తూరి దేవి విద్యాలయం:**

ఏ దేశ ఔన్నత్యానికైనా, ఏ జాతి అభ్యుదయానికైనా విద్య, విజ్ఞానం, సంస్కృతి ముఖ్యమైన మెట్లు. ప్రేమ, త్యాగం జీవిత సూత్రాలు. ఈ సిద్ధాంతాలతో భారత స్వాతంత్రోద్యమ తొలి వసంతాల్లో గాంధీజీ జీవిత భాగస్వామి కస్తూరిబా పేరిట ఉద్భవించిన ప్రాథమిక విద్యా వ్యవస్థ కస్తూరిబా విద్యాలయం. దీనివెనుక ముందు కనకమ్మ కృషి మరువలేది. ఈ విద్యాలయాన్ని 1923వ సంవత్సరంలో నెల్లూరు స్త్రీల కాంగ్రెసు సంఘం తరపున ప్రకాశం పంతులు చేత ప్రారంభించబడినది. ఈ పాఠశాలలో మన సంస్కృతికి అనుగుణంగా విద్య, నూలువడకడం, నేత, కుట్టుపని మొదలగు చేతిపనులు, ఆరోగ్య సూత్రాలు, సూర్య నమస్కారాలు మొ॥ విద్యా పద్ధతులను బోధించేవారు.

ఈ విద్యాలయ నిర్వహణకు చుట్టు ప్రక్కల గ్రామాల్లో తిరిగి ధాన్యము, బియ్యము వసూలు చేసే వారు, కొన్ని చోట్ల నాటక ప్రదర్శనలు ఇచ్చి ఆ ధనాన్ని దీని నిర్వహణకే ఖర్చు చేసేవారు. 1928వ సం॥ శ్రీ కస్తూరి దేవి విద్యాలయం భవన నిర్మాణార్థం విశాఖలో "శ్రీకృష్ణ తులాభారం', 'సారంగధర' నాటకాలను ప్రదర్శించాలని సంకల్పించారు. ఆ సమయానికి ఆంధ్ర విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి నాటి వైస్ ఛాన్సలర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అక్కడికి వచ్చియున్నారు. వీరి కోరిక మేరకు ఆ రెండు నాటకాలకు సర్వేపల్లి గారే అధ్యక్షత వహించారు.

1928లో భవన నిర్మాణార్థం పొగతోట ప్రక్కన 2 1/2 ఎకరాల స్థలాన్ని రూ.5400/- కొన్నారు. మే 12, 1929వ సంవత్సరంలో కస్తూరి దేవి పేరు మీద శంఖుస్థాపన కూడా చేయడం జరిగింది. 1929లో గాంధీజీ పిలుపు మేరకు శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నారు. 1930, 1932 సంవత్సరంలలో జైలుకు వెళ్ళడంతో ఈ విద్యాలయం 1933 వరకు మూతపడింది. వీరు జైలు నుండి విడుదలయి వచ్చిన తరువాత ఇది పునఃప్రారంభించబడింది. భవన నిర్మాణార్థం కస్తూరి దేవి నగర్లో వున్న ఒక భూమిని రేబాల పట్టాభిరామిరెడ్డికి ఇచ్చి, దర్గామిట్టలో 20 ఎకరాల భూమిని తీసుకోవడం జరిగింది. తిక్కవరపు రామిరెడ్డి 54000 రూ. భూరి విరాళంతో కస్తూరిభా నిధిని ఏర్పాటు చేసి తిరిగి విద్యాలయాన్ని నిర్మించారు.

కాని తదనంతరం జరిగిన అనేక రాజకీయ కుట్రలలో విద్యాలయం స్థాపనకు, నిర్మాణానికి, విస్తరణకు మూలబీజమైన పొణకా కనకమ్మ ఆ విద్యాలయం నుండి కార్యదక్షులు, సమర్థులు, ఎవరికీవెరవని వ్యక్తిత్వం మీద బలవంతంగా బయటకు రావలసి వచ్చింది. దీనికి సాక్ష్యం ఆమె కాంస్య విగ్రహం ఇటీవల వరకు చీకటి కొట్టులోనే మూలుగుతూ వుండటం ఇన్ని వున్నా పురుషబలం, ధనబలం ముందు తలవంచి దాని భవిష్యత్తు కోసం ఆమె చుట్టూ ముళ్ల కంచె వేసినా ఏ మాత్రం ఖాతరు చేయకుండా స్థిరంగా బలంగా అడుగు ముందుకు సాగించి, విద్యాలయ ప్రాంగణం నుంచి బయటకు వచ్చినా నిరాశ పడకుండా, రెట్టించిన ఉత్సాహంతో అడుగు ముందుకు వేసి పారిశ్రామిక పాఠశాలను స్థిరంగా నిలబెట్టింది. తిరస్కృతులు, బహిష్కృతులు, అనాధలు, అభాగినులు ఇలా రకరకాల మహిళలను చేరదీసి చేతివృత్తులు, హస్తకళలను నేర్పి, వాళ్ళకు జీవనోపాధిని కల్పించింది. కస్తూరి దేవి విద్యాలయాన్ని వదిలి వచ్చిన తరువాత ఆమె జీవితంలో ఏర్పడిన శూన్యాన్ని పారిశ్రామిక పాఠశాల పూరించింది. ఒక ఓటమి మరొక సంస్థకు పునాది అయింది. అదీ కనకమ్మ అంటే. అదే ఆమె కార్యదక్షత.

**జమీన్ రైతు:**

భూ వ్యవహారాలలో వెంకటగిరి రాజాతో వచ్చిన వివాదాలను లోకానికి తెలియజేసే ఉద్దేశంతో ప్రజల కొరకు, సొంత వ్యవహారాల కొరకు ఒక పత్రికను స్థాపించారు. దానిపేరే "జమీన్ రైతు". దీని వ్యవస్థాపక సంపాదకుడు పొణకా పిచ్చిరెడ్డి అని తమ స్వీయచరిత్రలో రాసుకున్నారు. "ప్రపంచాన్ని చకితమొనర్చే జమిందారీ ఉద్యమం మా కుటుంబం యొక్క మహాగ్ని జ్వాలలోనే అవతరించి దశదిశలా వ్యాపించింది. దాని నుంచే జమీన్ రైతు పుట్టింది. ఇది జగమెరిగిన సత్యం" అని తన మాటలను స్వీయ చరిత్రలో ఉటంకించారు. ఇదే విషయాన్ని ఆచార్య ఎన్.జి. రంగా కూడా జమీన్ రైతు స్వర్ణోత్సవ సంచికలో రాశారు.

కానీ తరువాత ఎక్కడా వీరి పేర్లు బయటకు రాలేదు. కారణాలు తెలియలేదు. ఇపుడు కూడా మనం గూగుల్లో జమీన్ రైతు వికీపీడియాను చూసినా వ్యవస్థాపక సంపాదకుల పేర్లు మాత్రం కనిపించవు.

**రాజకీయ ముచ్చట్లు :**

వీరి రాజకీయ ప్రస్థానం మన జాతీయోద్యమమంత సుదీర్ఘమైనది. కాబట్టి అక్కడక్కడ ఆమె పొందుపరచిన జ్ఞాపకాలను కొన్నింటిని మాత్రమే ఇక్కడ ప్రస్తావిస్తున్నాను. ఈ సంఘం ద్వారా వీరు తిలక్ స్వరాజ్య నిధికి నిధులను సమకూర్చడం, స్వదేశీ ఉద్యమంలో భాగంగా ఖద్దరు నేయడం లాంటి కార్యక్రమాలను నిర్వహించారు. జాతీయోద్యమమే కాక సామాజికోద్యమ నిర్వాహకురాలిగా 31 రాట్నాలను కొని మహమ్మదీయ స్త్రీలకు, పతితులకు ఇవ్వడంతో పాటు, 24 మణుగుల దూదిని, 3 మణుగుల ఏకులను ఇచ్చి వారిని ప్రోత్సహిస్తూ, వారు తయారు చేసిన ఖద్దరు వస్త్రాలను వీరే కొని ఉపాధితో పాటుగా స్వదేశీ ఉద్యమాన్ని విజయవంతం చేశారు.

**చెన్నపట్టణంలో రాజకీయ మహాసభ:**

1927వ సంవత్సరంలో చెన్నపట్టణంలో రాజకీయ మహాసభలు జరిగాయి. దానిలో భాగంగా స్త్రీల రాజకీయ మహాసభకూడా నిర్వహించడం జరిగింది. ఆ సభకు పొణకా కనకమ్మను అధ్యక్షత వహించవలసిందిగా కాశీనాధుని నాగేశ్వరరావు ఒత్తిడి చేసినా ఆమె ఒప్పుకోక పులుపర్తి లక్ష్మీ నరసాంబను అధ్యక్షురాలిగా చేసి సభను నిర్వహించామని పేర్కొన్నారు.

**జైలు యాత్ర:**

బాపూజీ ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో భాగంగా 1930-32 సంవత్సరంలలో వీరు అరెస్టు కాబడ్డారు. 1 1/2 సం॥ జైలు శిక్షను అనుభవించారు. ఇక్కడ ఆమెకు జరిగిన ఒక వివక్షను గుర్తు చేసుకుంటూ తనతో పాటు బెజవాడ గోపాలరెడ్డి కూడా అరెస్టు కాబడ్డారు. కానీ అతనికి 'ఎ' క్లాస్, తనకు 'బి' క్లాస్ జైళ్ళను ఇచ్చారని పేర్కొన్నారు.

**బిపిన్ చంద్రపాల్కు ఆతిథ్యం:**

ఈమెకు 9వ ఏటనే వివాహం అయి అత్తారింటికి ప్రవేశించింది. తనకు 15వ ఏట 1907లో టైఫాయిడ్ జ్వరం రావడంతో నెల్లూరుకు తీసుకుని వచ్చి వైద్యం చేయించారు. ఈ వైద్యం నిమిత్తం యడ్లవారి వీధిలో ఇల్లు తీసుకోవటం జరిగింది. అదే సమయంలో బిపిన్ చంద్రపాల్ రాజకీయ ఉపన్యాసాలు ఇస్తూ దేశమంతా సంచరిస్తున్నారు. ఇందులో భాగంగా మద్రాసు పోతూ ఉపన్యాసాల నిమిత్తం నెల్లూరుకు రావడం జరిగింది. అప్పుడు తన తమ్ముడు మరుపూరి పిచ్చిరెడ్డి, మరిది పట్టాభిరామిరెడ్డి ఇద్దరూ బిపిన్ చంద్రపాల్ని వీరింటికి ఆహ్వానించారు. వీరికి బారకాసు సెంటర్లోని ఆగా సాహెబ్ గారి మిద్దెమీద బస ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రెండు మూడు రోజులు పొణకా కనకమ్మ ఇంటిలో ఈ జంట ఆతిధ్యం స్వీకరించడం జరిగింది. వారి ఆహార విశేషాలను ఒకటి ఇక్కడ ఉటంకించారు. బిపిన్ చంద్రపాల్ గారికి ఎన్ని కూరలు చేసినా ఆ కూరల్లో వేపచిగుళ్ళు వేసుకుని తినేవారు అని పేర్కొన్నారు. ఈ సమయంలో ఈ సమావేశాలకు వచ్చిన మంగిపూడి పురుషోత్తమ శర్మ కూడా వీరి ఇంటికి వచ్చినట్లు గుర్తు చేసుకున్నారు.

**తిలక్ పరిచయం:**

1919లో తిలక్ గారు మద్రాసు వచ్చారు. వారిని కలవడానికి రాయప్రోలు సుబ్బారావు, రాఘువయ్య, తంబటి పుట్రయ్య తమ్ముడు పిచ్చయ్యలతో కలిసి కనకమ్మ కూడా మద్రాసుకి వెళ్ళింది. ఆ జ్ఞాపకాలను స్వీయ చరిత్రలో జ్ఞాపకం చేసుకున్నారు.

**మొదటి ప్రసంగం:**

1921వ సంవత్సరంలో వెన్నెలకంటి రాఘువయ్య, కందాడ దొరస్వామి జైలుకు వెళ్ళు సందర్భంలో పిడూరు వచ్చారు. అప్పుడు కనకమ్మను నెల్లూరుకి రమ్మని కోరారు. మర్నాడు మధ్యాహ్నానికి కనకమ్మ నెల్లూరుకి చేరుకుంది. ఆ సందర్భంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడమని కోరడంతో మొట్ట మొదట బహిరంగ ఉపన్యాసం ఇవ్వడం జరిగింది. అప్పుడు ఆమె పొందిన ఉద్వేగాన్ని, అనుభూతుల్ని నాటి జ్ఞాపకాలను తమ స్వీయచరిత్రలో ప్రస్తావించారు.

**స్త్రీల ప్రతినిధి:**

1921 సంవత్సరంలో అహ్మదాబాదులో కాంగ్రెస్ వార్షికోత్సవ సభలు జరిగాయి. ఆ సభలో ఈమెను అఖిల భారత కాంగ్రెస్ సంఘ సభ్యురాలిగా చేర్చుకుని ఆంధ్ర రాష్ట్రానికి స్త్రీల ప్రతినిధిగా నియమించడం జరిగింది. 2 సంవత్సరాల పాటు ఈ బాధ్యతలను చక్కగా నిర్వహించారు.

**నెల్లూరు స్త్రీల కాంగ్రెస్ సంఘం:**

1922 మార్చి 10వ తేదీన నెల్లూరు జిల్లా మహిళా కాంగ్రెస్ సంఘం స్థాపించబడింది. అప్పటికీ నెల్లూరు జిల్లా కాంగ్రెస్ సంఘం ఉండటంతో రెండు జిల్లా కాంగ్రెస్ సంఘాల పేర్లపై అభ్యంతరాలు వెలువడ్డాయి. దానితో జిల్లా తీసేసి నెల్లూరు స్త్రీల కాంగ్రెస్ సంఘాన్ని స్థాపించారు. ఇందులో వీరు సభ్యురాలిగా, కార్యదర్శిగా పనిచేశారు.

**మహాత్మునితో పరిచయ భాగ్యం:**

1919 సంవత్సరంలో గాంధీజీ చెన్నపట్టణంలో రాజగోపాలాచారి ఇంటికి వచ్చినప్పుడు కనకమ్మ తన తల్లితో పాటు గాంధీజీని దర్శించి నూలు వడకటం జరిగింది. ఆ నేత పని నైపుణ్యానికి గాంధీజీ అబ్బురపడి సబర్మతి ఆశ్రమానికి ఆహ్వానించటం జరిగింది. దండి ఉప్పు సత్యాగ్రహంలో భాగంగా 1921 సంవత్సరంలో గాంధీజీ నెల్లూరులోని పల్లిపాడుకి వచ్చినప్పుడు స్వయంగా పొణకా కనకమ్మ భర్తే గాంధీని పల్లిపాడు ఆశ్రమానికి తీసుకురావటం జరిగింది.

ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో జ్ఞాపకాలు తన స్వీయ చరిత్రలో నదీ ప్రవాహంలా మనకు తారసపడుతూనే ఉంటాయి.

**ఆధార గ్రంథాలు:**

1. కనకపుష్య రాగం (పొణకా కనకమ్మ స్వీయ చరిత్ర) – సంపాదకుడు, డా. కాళిదాసు పురుషోత్తం

2. వివిధ పత్రికా వ్యాసాలు.

# భారత జాతీయోద్యమం - 'కథ' పాత్ర

**డా. కె. ఎన్. సుందరేశ్వర రావు,** ఆంధ్రశాఖ అధ్యక్షులు, ఎస్.సి.ఎన్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రొద్దుటూరు

**1. చారిత్రిక నేపథ్యం**

'జాతీయత' అనే భావన భారతీయులతో పాటు, ప్రపంచ ప్రజలందరికీ ఆధునికకాలంలోనే కలిగింది. 18వ శతాబ్దంనాటి ఫ్రెంచి విప్లవం 'స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం' అనే మూడు భావనల్ని అందించింది. రామాయణ, భారతకాలాల నుండి 'జాతీయత' అనే భావన ఉన్నా అది స్పష్టంగా, ఆధునికకాలంలోనే బయటపడింది. నిజానికి ఈ 'జాతీయత' అనే భావన భారతదేశంలో పుట్టడానికి ఆంగ్లేయులే పరోక్షకారకులని కొందరి భావన. అందుకు వారు చెప్పే కారణం–శకలశకలాలుగా ఉన్న భారతీయ సమాజాన్ని (అన్ని ప్రాంతీయ రాజ్యాలను) ఆంగ్లేయులు ఒకే తాటిమీదకు తెచ్చి, రాజకీయంగా ఏకంచేశారు. అది వారి పరిపాలనా సౌలభ్యానికి తాత్కాలికంగా ఉపయోగపడినా, భారతీయులు మేల్కొనడానికి, వారిలో జాతీయతాభావన పుట్టడానికి కారణమైనాయి. భారతీయుల సంపదను కొల్లగొట్టడం, జాతివివక్షను ప్రదర్శించడం వంటి దుర్మార్గాలకు పాల్పడడంతో భారతీయుల్లో చైతన్యం వచ్చి జాతీయోద్యమానికి దారితీసింది.

భారతదేశచరిత్రలో జాతీయోద్యమం ఒక విశిష్టఘట్టం. ఎందుకంటే దేశచరిత్రలోనే మొదటిసారిగా అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్న ఉద్యమమిదే. ఆంగ్లేయులు ప్రవేశపెట్టిన ఆధునిక ఆర్థిక, రాజకీయ, విద్యా విధానాలు భారతీయులను చైతన్యవంతుల్ని చేశాయి. అందుకు మత, సాంఘిక ఉద్యమాలు, వార్తాపత్రికలు, ఆంగ్లవిద్య, ఆర్థికపరిస్థితులు ప్రముఖపాత్ర వహించాయి. అప్పటికే సతీసహగమనం, బహుభార్యాత్వం, బాల్య–వృద్ధ–కన్యాశుల్క వివాహాలు, మూఢనమ్మకాలు భారతీయసమాజాన్ని చీకట్లో ఉంచాయి. రాజా రామ్మోహనరాయ్ సంఘ సంస్కరణకు పిలుపునివ్వడంతో సంఘసంస్కరణ మొదలైంది. భారతదేశమంతా ఉవ్వెత్తున లేచిపడింది. ఎందరో మేధావులు దేశమంతా ఏకమై చైతన్యవంతులైనారు. ఆర్యసమాజం, దివ్యజ్ఞాన సమాజం, రామకృష్ణమఠంలాంటి సంస్థల వల్ల మతసంస్కరణ జరిగింది. 1780 నాటి బెంగాల్‌గెజిట్, తర్వాతి కాలంలో కేసరి, అమృతబజార్ మొదలగు పత్రికలు జాతీయోద్యమ వ్యాప్తికి కృషిచేశాయి.

**3.4 జాతీయోద్యమం – కథాసాహిత్యం**

భారతజాతీయోద్యమంలోని విభిన్నదశలను, విభిన్న పార్శ్వాలను స్థానిక, రాష్ట్రీయ, జాతీయ పరిణామాలను ప్రతిబింబించడంలో 'కథానిక' తనదైన ముద్రను చూపింది. ఏ ఒక్క చిన్న అంశాన్నైనా ఒక కళాఖండంగా మార్చగల శక్తి 'కథానిక'కు ఉంది. అలా 'కథానిక', భారతజాతీయోద్యమాన్ని ఆహ్వానిస్తూ, ఉద్యమతీవ్రతను ప్రతిఫలిస్తూ, ఉద్యమంలో స్వార్థశక్తుల ప్రవేశాన్ని విమర్శిస్తూ, భారత జాతీయోద్యమంలో బహుముఖ ప్రతిభను కనబరచింది. కవులుగా, నవలారచయితలుగా ప్రసిద్ధులుకాని వాళ్ళే ఎక్కువగా జాతీయోద్యమ కాలంలో కథానికలు రాశారు. అయితే ప్రసిద్ధకవులు, నవలాకారులు, కేవలం కథారచయితలు, అప్రసిద్ధులు 'కథానిక' ప్రక్రియలో రచనలు చేయడం వల్లనో ఏమో, భారత జాతీయోద్యమ 'కథ'కు రావలసినంత గుర్తింపు రాలేదు. అసలు ఈ కథలున్నట్లు చాలామందికి తెలియదు. అలా జాతీయోద్యమ కథానికలు ఆసక్తికరమైన అధ్యాయాన్ని సృష్టించాయి.

**(1) తెలుగు :–** తెలుగులో జాతీయోద్యమ ప్రభావంతో చాలా కథానికలొచ్చాయి. 1924 ప్రాంతంలో తెలుగులో జాతీయోద్యమ భావాలతో కథలు రావడం ఆరంభమైంది."కొడుకును జాతీయద్యమంలోకి పంపడంకోసం, ఒక తల్లి తన ప్రాణం త్యాగం చేయడం" అంశంగా వచ్చిన కథ 'త్యాగిని' (మైదవోలు పద్మావతి). తాను ఉద్యమంలోకి వెళితే, తన తల్లి దిక్కులేనిదౌతుందనే భయంతో రావు ఉద్యోగంలో చేరతాడు. ఎంతోమంది వద్దన్నా వినడు. తల్లి చెప్పినా పట్టించుకోడు. చివరికి ఒకరోజు అతను ఇంటికి వచ్చేటప్పటికి, బావిలో శవంగా కనిపిస్తుంది. ఆరాత్రి అతని తల్లి కలలోకి వచ్చి "నాయనా! నీవు సత్యాగ్రహంలో పాల్గొనడానికి నేనడ్డమనే ఉద్దేశంతో నా జీవితాన్ని నేను త్యజిస్తున్నాను" అని చెబుతుంది. సామాన్య మానవుల్లో ఈ కథ నిబద్ధతను అలవర్చడానికి ప్రయత్నించింది.

చిన్నపిల్లల్లో కూడ జాతీయోద్యమ స్ఫూర్తి ఎలా కలిగించాలో 'నాయింట్లో కూడ ప్రవేశించిందే' (బందా కనకలింగేశ్వరరావు) అనే కథ చెబుతుంది. డిప్యూటీ కలెక్టర్ కొడుకు సూరీడు, రెండణాలకు మామిడిపండ్లు కొని, వాటిని రూపాయికి అమ్మి, ఆ వచ్చిన డబ్బుతో చరఖా ఒకటి కొని ఇంట్లో పెడతాడు. అదిచూసి తండ్రి (డిప్యూటి కలెక్టర్ నారాయణరావు) ఆశ్చర్యపోతాడు. సాంఘిక జీవితంలో సంబంధాలు చెడిన స్త్రీ, పురుషులు జాతీయోద్యమంలో పాల్గొని, జీవితాలను సార్ధకం చేసుకున్న రీతిని కొన్ని కథలు చిత్రించాయి. 'నే ధన్యనైతిని' (గుమ్మడిదల దుర్గాబాయి), ఎవరిదదృష్టం' (బసవరాజు వెంకటలక్ష్మి), 'ప్రేమవేదిక మీద (చంద్రకళ)– మొదలైన కథలు అందులో ముఖ్యమైనవి. తెలుగులో వచ్చిన జాతీయోద్యమ కథల్లో 'నీలవేణి' (రాయసం వెంకటశివుడు) అనే కథ మణిపూస లాంటింది. సత్యాగ్రహ సైన్య నాయకుడు వీరప్రసాదరావు ఉప్పు తయారుచేస్తూ పోలీసుల లాఠీదెబ్బలు తిని పడిపోతే, ఆదరించిన గ్రామం నీలవాడ. అతనికి సపర్యలు చేసిన అమ్మాయి 'నీలవేణి'. అందుకు కృతజ్ఞతగా అతడు ఆ ఊరిని గాంధీజీ ప్రబోధించిన నిర్మాణ కార్యక్రమాలతో సంస్కరిస్తాడు. పార్టీ పిలుపు నందుకొని మద్రాసుకు వెళతాడు. కొన్నాళ్లకు నీలవేణి కూడా మద్రాసు వెళ్ళి ఉద్యమంలో చేరుతుంది.

జాతీయోద్యమ కాలంలో వ్యక్తిజీవితం కన్నా, వ్యక్తులకు సమాజం ఎలా ముఖ్యమైందో 'సుశీల' (చలం) అనే కథ ఋజువు చేసింది. జాతీయోద్యమంలో కుహనా ఉద్యమకారులు పుట్టడాన్ని 'కైంకర్యం' అనే కథలో మల్లాది రామకృష్ణశాస్త్రి చూపించారు. ఉద్యమంలో పాల్గొన్న స్త్రీలపట్ల ఆనాటి కుటుంబాలు ఎంత దుర్మార్గంగా ప్రవర్తించాయో 'అనిర్వచనీయ ఖ్యాతి' అనే కథలో జి.వి. కృష్ణారావు గారు చిత్రించారు. ఇంకా 'నారీ హృదయము (పెమ్మరాజు రాజగోపాలం), 'కథకాదు' (తాడి నాగమ్మ) కథలు కూడా ప్రముఖంగా జాతీయోద్యమ భావజాలాన్ని చిత్రించాయి.

**(2) తమిళం :–** తమిళ జాతీయకవిగా పేరొందిన సుబ్రహ్మణ్య భారతి, తన కథానికల్లో జాతీయోద్యమ భావాలను చక్కగా చాటుకున్నాడు. ఆయన కథాసంపుటి– 'స్వర్ణభారతి'. ఇందులోని చాలా కథలు ఆయనకు భారత జాతీయోద్యమం పట్ల ఉన్న భావజాలాన్ని పట్టి చూపిస్తాయి. తమిళంలో ఇంకా ఆర్.కృష్ణమూర్తి, మరైమలై అడిగల్, రాజగోపాల్, రాజాజీ మొదలైన వారు మంచికథలు రాశారు.

**(3) బెంగాలీ :–** దాదాపు 120 కథలతో 19వ శతాబ్ది చివరి నాటికే బెంగాలీ కథకు స్పష్టమైన రూపురేఖలు తీర్చిదిద్దిన రచయిత రవీంద్రనాథ్ ఠాగోర్. ఇంకా ప్రభాత్‌కుమార్ ముఖోపాధ్యాయ్ తన కథల్లో జాతీయోద్యమ స్ఫూర్తిని నింపారు. తన నవలల్లోలాగే కథల్లో కూడ జాతీయవాద స్ఫూర్తిని నింపిన రచయిత శరత్‌చంద్ర ఛటర్జీ. బెంగాలీ సాహిత్యం మధ్యతరగతి చుట్టూ తిరుగుతున్న సమయంలో 'అభాగిర్', 'మహేశ్' వంటి కథల్లో అట్టడుగువర్గ ప్రజల జీవితాన్ని చిత్రించాడు.

**(4) ఉర్దూ:–** గాంధీజీ ఆశయాల ప్రభావానికి లోనుగాకముందే, ఉర్దూలో 1908 లో ప్రేంచంద్ గారి 'సోయజ్ వతన్' అనే కథాసంపుటి వచ్చింది. తర్వాతి కాలంలో తాను జాతీయవాద రచనల్ని తీవ్రంగా రాశాడు. విదేశీ పాలకుల దుర్మార్గాల్ని వ్యతిరేకించమన్నాడు.

**(5) అస్సామి :–** అస్సామీలో 'జానకి' అనే పత్రిక ఆధునిక సాహిత్యానికి పునాదిగా పనిచేసింది. కలకత్తా విశ్వవిద్యాలయంలో చదువుకున్న యువకులు దీనిని ప్రారంభించారు. దీనికి ఆద్యుడుగా 'లక్ష్మీకాంత్ బారువా' ను విమర్శకులు పేర్కొన్నారు. ఈయన కవి, నాటక కర్త, నవలాకారుడు, కథారచయిత. అస్సామీయులపట్ల ఆయనకు లోతైన అవగాహన ఉంది. ఆయన కథల్లో 'జాంభవి' 'సురభి' ముఖ్యమైనవి.

**(6) కన్నడ :–** కన్నడంలో పి.టి. నరసింహాచార్ అనే రచయిత 'ధ్వజరక్షణ' పేరుతో జాతీయోద్యమ కథాసంపుటిని వెలయించాడు. ఇందులో జాతీయోద్యమంలో పాల్గొన్న యువకుల మానసిక సంఘర్షణను చిత్రించాడు. అట్లే 'నిరంజన్' అనే కథారచయిత రాసిన కథల్లో జాతీయోద్యమంలోని అనేక పార్శ్వాలు ప్రతిబింబించాయి. ఈయనపై గాంధీ, నెహ్రూల ప్రభావం బాగా కనిపిస్తుంది.

**(7) మలయాళం :–** మలయాళ కథానిక 1925 ప్రాంతాల్లో జాతీయోద్యమ చిత్రణకు పూనుకొన్నట్లు తెలుస్తోంది. కృష్ణపిళ్ళై అనే రచయిత, మలయాళ కథానికకు సామాజిక వాస్తవికతను జోడించి మంచికథలు రాశాడు. బ్రిటిష్ పాలకుల దుండగాలను పట్టి చూపించాడు. నిజానికి మలయాళ కథానికల్లో జాతీయోద్యమ స్ఫూర్తి రాజకీయదృష్టితో ప్రదర్శింపబడింది తక్కువని, సాంఘిక పార్శ్వంతో రాయబడిన కథలే ఎక్కువని చెప్పవచ్చు. తగళి శివశంకర పిళ్ళై, కేశవదేవ్, మహ్మద్ బషీర్ మొదలైన రచయితలు తమ కథల ద్వారా నూతన భారతజాతిని అభిలషించారు.

**(8) గుజరాతి :–** గౌరిశంకర్ అనే రచయిత గుజరాతీ భాషలో ఐదొందలకు పైగా కథలురాశాడు. 1930 కాలం నుండి వచ్చిన ఈయన కథలు జాతీయోద్యమంలోని వివిధ దశలను, భిన్నకోణాలపై వెలుగుచూపాయి. గుజరాతీ జాతీయోద్యమ కథకు ప్రాణం పోసిన మరో కథకుడు 'రామనారాయణ్ విశ్వనాథ్ పాఠక్'. ఆయన కథలు సత్యాగ్రహోద్యమాన్ని అణువణువునా పట్టి చూపిస్తాయి.

**(9) హిందీ :–** హిందీ కథానికల్లో కూడ జాతీయవాదం ఏదో ఒకరూపంలో ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గానీ ప్రతిఫలించింది. రజని ఫణిక్కర్ "పథర్ సంగీత్", విష్ణు ప్రభాకర్ రాసిన "అధూరి కహానీ", బృందావన్‌లాల్ వర్మ రాసిన 'వీరరాజపుట్' మొదలైన కథల్లో అస్పృశ్య నిరసన, మతసామరస్యం, దేశవిభజన పరిణామాలు, జాతీయోద్యమ భావజాలం తీవ్రంగా కనిపిస్తాయి. ప్రేంచంద్ రాకతో జాతీయోద్యమం కొత్తరూపు తీసుకుంది. ఆయన కథానికల్లో సమిష్టిజీవన చిత్రణకు, సాంఘిక రాజకీయ రంగాల చిత్రణకు కొత్త ప్రాధాన్యం వచ్చింది. తర్వాతి కాలంలో జయశంకర్‌ప్రసాద్, సుదర్శన్ ప్రముఖంగా కనిపిస్తారు. 1930 ప్రాంతం నుండి మార్క్సిజం ప్రభావంతో కథలు వచ్చినా, జాతీయోద్యమ స్ఫూర్తి తగ్గలేదు.

**ఆధార గ్రంథాలు**

1. మన నవలలు –మన కథానికలు – రాచపాళెం చంద్రశేఖరరెడ్డి
2. నూరేళ్ళపంట – (స్త్రీవాద రచయిత్రుల తెలుగు కథా సంకలనం)
3. వందేళ్ళ తెలుగు కథ (20వ శతాబ్ది ప్రతినిధి కథల సంకలనం) – సం. వాడ్రేవు చినవీరభద్రుడు.
4. అరసం సంచిక (అధ్యక్షోపన్యాసం) – దేవులపల్లి కృష్ణశాస్త్రి
5. అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం సంచిక – సంపాదకీయం
6. రాయలసీమలో ఆధునికసాహిత్యం – సామాజిక సాంస్కృతిక విశ్లేషణ – వల్లంపాటి వెంకటసుబ్బయ్య

# జాతీయోద్యమం - మహిళల సాహిత్యం

**డా. చింతల రాకేశ్ భవాని,** సహాయ ఆచార్యులు, తెలుగుశాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్‌నగర్
చరవాణి : 9246607551

చరిత్ర నిర్మాణంలో స్త్రీ పురుషులు ఇద్దరూ భాగస్వాములు. కానీ మగవారి చరిత్రే ఎక్కువగా రికార్డు అయింది. స్త్రీల కృషి విస్మరణకు లోనయింది. ఉద్యమాల్లోనూ స్త్రీల భాగస్వామ్యం ఉన్నప్పటికీ వారి పాత్ర చరిత్రలో గ్రంథస్థం కావడం తక్కువ. జాతీయోద్యమంలో మహిళల పాత్ర ఎంతో కీలకమైంది. కానీ జాతీయోద్యమ చరిత్ర గురించి చదువుతుంటే మగవాళ్ళ పేర్లే ఎక్కువగా వినిపిస్తాయి. మహిళల పోరాటాల పాత్ర గురించి రాసినవారు తక్కువ. వాస్తవంలో మాత్రం ప్రతి పోరాట ఘట్టంలో మహిళలు ముందున్నారు. 1857లో జరిగిన ప్రథమ స్వాతంత్ర్య పోరాటంలోనూ మహిళలు వేల సంఖ్యలో పాల్గొన్నారు. కానీ ఝాన్సీ లక్ష్మీబాయి వంటి ఒకరిద్దరు పేర్లు మాత్రమే వినిపిస్తాయి. నాటి సంగ్రామంలో పాల్గొన్న వేలాదిమంది మహిళల పాత్ర చరిత్రకెక్కలేదు. సాహిత్యరంగంలోనూ ఇదే పరిస్థితి. ఇపుడు పునర్విశ్లేషణలు చేసుకుంటే జాతీయోద్యమంలో మహిళల పాత్ర, సృజనాత్మక రంగంలో వారి కృషి ఎంత ఉన్నదో తెలుస్తుంది.

జాతీయోద్యమంలో సాహిత్యం, సృజనకారుల పాత్ర గురించిన చర్చ వచ్చినప్పుడు రచయిత్రుల, కవయిత్రుల కృషిని చెప్పేవారు అరుదు. వాస్తవంలో పందొమ్మిదో శతాబ్దంలోనే సమాజంలో సంస్కరణలు రావాలని, స్త్రీలు చైతన్యవంతం కావాలని కవయిత్రులు పద్యాలు రాశారు. దేశభక్తిని ప్రబోధించే గీతాల్ని రచించారు. తర్వాత కాలాన స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటాలకు మద్దతుగా పాటలు, కథలు, నాటకాలు, నవలలు రచించారు. ముఖ్యంగా మహిళలు ఎక్కువగా పద్యాలు, కవితలు, పాటలు రాశారు.

దేశభక్తి కవిత్వంలో మొదట పేర్కొనదగిన కవయిత్రి శ్రీమతి కొటికల పూడి సీతమ్మ గారు అని డాక్టర్ వాసా ప్రభావతి చెబుతారు. కందుకూరి వీరేశలింగం పంతులు గారికి అభిమాన శిష్యురాలు శ్రీమతి సీతమ్మ. ఆమె రాసిన 'అహల్యాబాయి' కావ్యం దేశభక్తి కవిత్వం కోవలోకి వస్తుంది. వీరేశలింగం గారు స్త్రీల కొరకు పాఠశాలలు పెట్టారు, పత్రికలు నిర్వహించారు. వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించారు. స్త్రీల కోసం ప్రత్యేకంగా సంఘాలు పెట్టారు. ఆ ప్రభావంతోనే శ్రీమతి సీతమ్మ గారు సమాజ సంస్కరణ కార్యక్రమాల్లో పాల్గొంటూనే రచనలు చేశారు. ఆమె రాసిన అహల్యాబాయి కావ్యం దేశభక్తి కవిత్వంలో ఎన్నదగినదిగా పేరొందింది. ఇదే గాక 'సాధురక్ష శతకము', పద్య భగవద్గీత అనే కావ్యాలు సృజించారు. ఆమె ప్రసంగాలు 'ఉపన్యాసమాలిక' శీర్షికన పుస్తకంగా వెలువడ్డాయి.

**శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ**

జాతీయోద్యమ కాలాన దేశభక్తిని ప్రబోధిస్తూ కవిత్వం రాసిన వారిలో పేర్కొనదగిన మహిళ శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ. గాంధీగారిపై ఆమె రాసిన పద్యాలు దేశభక్తికి నిదర్శనంగా నిలిచాయి. మహాత్మాగాంధీని కీర్తిస్తూ "అతడు దేవుడు భరతజాతికిపుడు" అంటూ రాయడం విశేషం. మంగళహారతులు కూడా దేశభక్తి భావాల్ని ప్రోది చేసి రాయడం గమనార్హం. 1934లోనే కేసరి

కుటీరం వారి 'గృహలక్ష్మీ స్వర్ణ కంకణం' అందుకున్న తొలి కవయిత్రి కనుపర్తి వరలక్ష్మమ్మ. 'ఓటు పురాణము' పేరుతో రాసిన కావ్యం ఓటు ప్రాధాన్యాన్ని వివరిస్తుంది. మహిళలంతా చైతన్యవంతులై ఓటు వేయాలని ఆమె కోరారు. దీనిని ప్రకాశం పంతులు గారికి అంకితం ఇచ్చారు. చక్కని కవిత్వం రాసిన ఈమె మంచి వక్త కూడా. స్త్రీలలో చైతన్యాన్ని తీసుకురావడానికి 'శారదలేఖలు, మా చెట్టు నీడ ముచ్చట్లు' శీర్షికన ఎన్నో వ్యాసాలు, కథలు రచించారు.

**అనేక ప్రక్రియల్లో రాణించిన కాంచనపల్లి కనకాంబ**

పల్నాడు సీమకు చెందిన కాంచనపల్లి కనకాంబ అనేక ప్రక్రియల్లో రచనలు చేశారు. విజ్ఞాన చంద్రికా పరిషత్తు వారు 1912లో నిర్వహించిన పోటీలలో ఆరు బంగారు పతకాలు గెల్చుకున్నారు. 1907లోనే అమృతవల్లి నవల రచించారు. 'గౌతమ బుద్ధ చరిత్రము', 'పాండవోదంతము', 'కాశీయాత్రా చరిత్రము', 'జీవయాత్ర', 'కలహంస విజయము', 'వేదాంత నాటకము', 'రామాయణ కథాసంగ్రహము' (సంస్కృత గద్యము) వంటి పుస్తకాలు వెలువరించారు. శాకున్తల నాటకము సృజించారు. మొత్తం 16 గ్రంథాలు రాయడం విశేషం. చదువు ప్రాశస్త్యం చెబుతూ ఆమె రాసిన ఈ కింది పద్యం కవయిత్రిగా కనకాంబ గొప్ప గారి గొప్పతనాన్ని తెలియజేస్తుంది.

**"చదివిన పండితులగుదురు,**
**విదితము గాకున్నయపుడు వెఱ్ఱిలె పురుషుల్**
**చదివిన చదువుక యున్నన్**
**ముదితలు విద్యాంసు రాండ్రు పుట్టువుచేతన్".**

మహిళా చైతన్యానికి నిదర్శనంగా నిలిచే కవిత ఇది. జాతీయోద్యమంలో భాగంగా ఎంతో మంది మహిళలు చదువుకుంటూ పోరాటాలలో పాల్గొనడానికి ప్రేరణ ఇచ్చిన పద్యమిది.

**గుడిపూడి ఇందుమతీదేవి**

పాత గుంటూరులో జన్మించిన గుడిపూడి ఇందుమతీదేవి మంచి కవయిత్రి, వక్త. తన ఉపన్యాసాలతో మహిళలు ఉద్యమాల్లోకి రావడానికి తగిన ప్రేరణ కల్పించారు. పదవ యేట నుంచి పద్యాలు, గేయాలు రచించారామె. 14 గ్రంథాలు వెలువరించారు. ఆమె రాసిన 'ఆంధ్ర మహిళామణి రుద్రాంబ' కావ్యం అసలు సిసలు దేశభక్తి కావ్యం. రుద్రాంబ అంటే రుద్రమ దేవి. ఆమె త్యాగాన్ని, ధైర్యసాహసాలను ప్రస్తుతిస్తూ రాసిన ఈ కావ్యం ఎంతోమంది మహిళల్ని ఉత్తేజితుల్ని చేసింది. గాంధీ, వినోభా భావే, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య వంటి ప్రముఖులని స్మరిస్తూ రాసిన స్తుతి గీతాలు ఎంతో విలువైనవి.

**ఎందరో కవయిత్రులు**

పేరుపేరునా చెప్పాలంటే కవయిత్రుల, రచయిత్రుల కృషి గురించి ఒక గ్రంథమే రాయవచ్చు. 1947కు పూర్వం రాసిన మహిళలు ఏ ప్రక్రియని నిర్వహించినా ఇతివృత్తంలో దేశభక్తి, స్వేచ్ఛాకాంక్ష, జాతీయోద్యమ ఛాయలు నిండివుండేవి. శ్రీమతి భువనగిరి లక్ష్మీ కాంతమ్మ గారి 'భారత కృష్ణ శతకము', దేశిరాజు భారతీదేవి రాసిన 'కాంతా శతకము' వంటి వాచకాలలో జాతీయోద్యమ పరోక్ష ప్రభావం కనిపిస్తుంది. భువనగిరి లక్ష్మీకాంతమ్మ వ్రాసిన 'స్త్రీ విద్య' అన్న ఖండకావ్యం ఒకటి విశిష్టమైంది. స్త్రీలకు బాల్యంలోనే స్త్రీల చరిత్రలు చెప్పాలని అంటుంది ఈ కవయిత్రి. స్త్రీలకు చదువు అవసరాన్ని చెప్పిన కావ్యం ఇది.

బసవరాజు రాజ్యలక్ష్మమ్మ, చావలి బంగారమ్మ వంటి వారు భావ కవితాయుగంలో చేసిన రచనలలో జాతీయోద్యమ స్ఫూర్తిని చూస్తాం.

**"మేలు కొనుమో భారతీయుడ మేలుకొనుమో దేశభక్తుడ**
**మేలుకొని నీ తల్లి దేశపు**

**ముక్తి గనవయ్యా!"** అంటారు శ్రీమతి తల్లాప్రగడ విశ్వసుందరమ్మ. దేశ దాస్యవిముక్తిని ప్రబోధిస్తూ ఆమె రాసిన కవితలు ఎంతో విశిష్టమైనవి.

గాంధీజీని భారత భాగ్యవిధాతగా కీర్తిస్తూ శ్రీమతి వక్కలంక రామాబాయి రాసిన కావ్యం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఆమె రాసిన పద్యాలు గాంధీ ఔన్నత్యాన్ని చాటి చెబుతాయి.

**"తగవులన్నియు నశియించి ధరణిలోన**
**నెల్లజనులైక్య కాములౌ యింపుతోడ !**
**"భారతావని! 'బాపూజీ' పండితులకు**
**సంతసము గూర్ప సతతంబు సాగునట్లు**
**ఈశుదాశీర్వదించుతయించు ప్రీతి"**

ఇలా ఆమె రాసిన పద్యాలు 1939 డిసెంబర్ 'గృహలక్ష్మి' పత్రికలో ప్రచురితమయ్యాయి. జాతీయోద్యమ కాలాన గాంధీజీ ప్రభావం ఎంతో మంది మహిళల్ని కవయిత్రులుగా తీర్చిదిద్దింది. ఇలా కవయిత్రిగా మారి మూడు భాషల్లో కవిత్వం రాసిన మహిళామణి శ్రీమతి బుఱ్ఱ కమలాదేవి. 'ఆంధ్ర కవయిత్రులు' అనే పుస్తకంలో శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ గారు ఈమె గురించి సవివరంగా రాశారు. సంఘసేవకురాలిగా, కవయిత్రిగా విశేష సేవలు అందించిన కమలాదేవి 'ధూర్త గోపాలుడు' పేరుతో రచించిన ఖండికలోని పద్యాల ప్రాశస్త్యం చెప్పుకోదగింది. తెలుగుతో పాటు సంస్కృతము, ఆంగ్ల భాషలలో కవిత్వం చెప్పిన దిట్ట అని వాసా ప్రభావతి గారు కమలాదేవిని ప్రశంసించారు. ఈమె రాసిన లఘు కావ్యాలను 'సుమమాల' పేరుతో ప్రచురించారు.

నాళము కృష్ణారావు గారి భార్య నాళము సుశీలాదేవి కవయిత్రి, సంఘ సేవకురాలు. దేశసేవ శీర్షికన అనేక పద్యాలు రచించారు. మహిళల కోసం గానసభలు నిర్వహించారు. మహిళలు సంఘటితమై ఉద్యమాల్లో పాల్గొనడానికి ఆమె చేపట్టిన కార్యక్రమాలు దోహదం చేశాయి.

**బహుముఖ పాత్ర**

జాతీయోద్యమ కాలం నాటి కవయిత్రులలో రచయిత్రిగా, కవయిత్రిగా, ఉద్యమకారిణిగా బహుముఖ పాత్ర నిర్వహించిన వారు శ్రీమతి దేవులపల్లి సత్యవతమ్మ, దుర్గాబాయమ్మతో పాటు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. దేశభక్తి పూరిత కవితలు రాయడమేగాక, ఉత్తేజపూరితమైన ప్రసంగాలు చేసేవారు. ఆమె అచ్చమైన గాంధేయవాది. దేవులపల్లి సత్యవతమ్మ "రథ చోదితుండ వౌచు రాజిల్లు కేశవున్ మరపించు శ్రీ గాంధీ మహిమ దలచి" అని ప్రారంభించిన కవిత్వ రచనలో (గృహలక్ష్మి ఫిబ్రవరి 1931) భారతేతిహాస కథా పాత్రలతో జాతీయోద్యమ నాయకులకు పోలికను భావించి చెప్పింది.

పుట్టపర్తి నారాయణాచార్యులు గారి భార్య పుట్టపర్తి కనకమ్మగారు కూడా మంచి కవయిత్రి. గాంధీమార్గాన్ని ఆదర్శంగా భావించారు. గాంధీజీ భార్య 'కస్తూరి బా' మీద అనేక పద్యాలు రాశారు. ఆమె మరణించినపుడు ఆర్ద్రమైన పద్యం రాశారామె.

**"శాంత గంభీరయైనట్టి సరసియందు**
**బడుచు, ఘూర్ణి జేసిన పిడుగువోలె**
**మామకేన చిత్తమ్ము నీ మరణవార్త**
**కలచినది, తల్లి, హైందవ కల్పవల్లి"** అంటూ కస్తూరిబాకు నివాళులు అర్పిస్తూ పద్యాలు రాశారు. పద్యాలే గాక ఎన్నో పాటలు రాశారు. రామ సుప్రభాతము, నరసింహ సుప్రభాతము, పార్థసారథి సుప్రభాతము వంటి గ్రంథాలు రచించారు.

ఆనాటి కవయిత్రులలో శ్రీ అయితం ఇందారా భారతులు జంట కవయిత్రులు. వీరు జననీ శతకము, అన్నపూర్ణా

సుభాషిత రత్నావళి అను పద్య గ్రంథాలు, ప్రతిమాదేవి అనే చారిత్రాత్మక నవల రాశారు. ప్రఖ్యాత దేశభక్తురాలు మాగంటి అన్నపూర్ణదేవి గారు విదేశాలలో చదువుకుంటున్న కాలాన తన భర్తకు రాసిన లేఖలే కావ్యవస్తువుగా రాసిన కావ్యమే 'అన్నపూర్ణా సుభాషిత రత్నావళి'. ఈ లేఖలలో మాతృదేశ సేవ, వీర, భక్తి, కరుణ రసాలు ఉట్టిపడుతుంటాయి. దేశం పట్ల ప్రేమాభిమానాలు వ్యక్తమవుతాయి. అందువల్లనే జాతీయోద్యమ కవిత్వంలో ఈ కావ్యానికి ప్రాధాన్యం లభించింది.

జాతీయోద్యమ కాలంలో ఇక్కడి అసమానతల గురించి కూడా ప్రస్తావిస్తూ వివక్షను ఎదుర్కొంటున్న వర్గాల గురించి కొందరు కవిత్వం రాశారు. దళితుల సమస్యను కవితా వస్తువుగా తీసుకొని పరుచూరి భువనేశ్వరీ దేవి రాసిన ఈ కింద పద్యమే ఇందుకు దాఖలా.

**"కడుపునిండార త్రాగంగ గంజిలేదు**
**కట్టుకొనుటకు చింపిరిబట్ట లేదు**
**నిద్రవచ్చుచో జానెడు నేల లేదు**
**దీన హరిజన స్థితియిదె తెలుగు బిడ్డ"** (గృహలక్ష్మి 1932 మార్చి అంటూ రాసిన కవితలో సమాజంలోని అంతరాల్ని ఎత్తి చూపారు. దేశానికి స్వాతంత్ర్యం లభించడమే కాదు ఈ వర్గాల వారు పీడన నుంచి, వివక్ష నుంచి విముక్తం కావాలని ఆశించారు. ఈ తరహా కవిత్వం అంతరాల తొలగింపు అవసరాన్ని నొక్కి చెప్పింది.

1947 ఆగస్టు 15 వరకు సాగిన జాతీయోద్యమంలో గాంధీజీ ప్రభావం అమితమైంది. జాతీయోద్యమంలో ఎందరో నాయకులు తమ జీవితాలను స్వాతంత్ర్య సిద్ధికి అంకితం చేసారు. తమ వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసి దేశ స్వాతంత్ర్యం కోసం ప్రజా ఉద్యమంతో మమేకమైన వారు ఎందరో ఉన్నారు. అలాంటి వారిలో మహాత్మాగాంధీ, బాలగంగాధర్ తిలక్, బిపిన్ చంద్రపాల్, సుభాష్ చంద్రబోస్ మొదలయినవారు ముఖ్యులు. వీరి జీవితాన్ని, ఆదర్శ ప్రాయమైన సంఘటనలను తెలుగు కవులు పద్యాలకు, గేయాలకు వస్తువుగా స్వీకరించారు. అయితే వీరిలో వెలుగు కెరటాలలో తెలియాడే నవ్వుతో విరాజిల్లే మహాత్ముడే అగ్రతాంబూలమందుకున్నాడు అంటారు డా. ఏనుగు నరసింహారెడ్డి. జాతీయోద్యమ కవిత్వం గురించి అధ్యయనం చేసిన ఆయన తెలుగులోనూ, ఇతర భారతీయ భాషలలోనూ జాతీయోద్యమ నాయకులలో మహాత్ముడి మీదనే ఎక్కువ కవిత్వం వచ్చిందని చెప్పారు. ఈ పరిశీలన వందశాతం నిజమని తెలుగునాట కవయిత్రుల, రచయిత్రుల సృజనాత్మక వ్యాసంగాన్ని గమనిస్తే అర్థమవుతున్నది. గాంధీజీ భావాల వెలుగులో స్వేచ్ఛాకాంక్షను వ్యక్తం చేసిన మహిళల సాహిత్యం పాఠకలోకం మీద ఉదాత్తమైన ప్రభావాన్ని చూపింది.

ఆనాడు స్వాతంత్ర్యోద్యమంలో మహిళలు క్రియాశీల పాత్రని పోషించాలని గాంధీజీ ఆశించారు. స్వాతంత్ర్య పోరాటం 1942 జూలైలో క్విట్ ఇండియా ఉద్యమంతో పతాకస్థాయికి చేరింది. ఇందులోకి భిన్నవర్గాల ప్రజా సమూహాలను కలుపుకొని రావాలని గాంధీ ఆకాంక్షించాడు. అందులో భాగంగానే జాతీయోద్యమంలోకి స్త్రీల సమీకరణ ఆనాడు ఒక ప్రధాన కార్యక్రమం అయ్యింది. ఆ నేపథ్యంలో వట్టికొండ విశాలాక్షి 'ప్రబోధం' అనే శీర్షికతో ఒక ఖండిక వ్రాసింది.

"స్వేచ్ఛ కావాలంటూ స్త్రీలే అడగాలి. సాహసముతో స్త్రీలే సాగిరావాలి" అని స్త్రీల స్వేచ్ఛకు హామీ లభించినప్పుడే దేశ స్వాతంత్ర్యం సాధ్యమవుతుందన్న దృక్పథాన్ని కనబరిచారామె. స్త్రీలు స్వేచ్ఛగా ఉద్యమాల్లోకి వచ్చినపుడే స్వాతంత్ర్య పోరాటం సమర్థవంతంగా సాగుతుందని ముందుగా పురుషులకు అర్థం కావాలని ఆమె ఆశించారు. కనుకనే స్వేచ్ఛా పిపాస స్త్రీలలో సమాంతరంగా అభివృద్ధి చెందాలని భావించారు. ఈ ఆకాంక్షతో ఆమె రాసిన కవిత్వం, ఇతర రచనలు మహిళల ఉద్యమాలపై ప్రభావం చూపాయి.

దేశ స్వాతంత్ర్యంతో పాటు స్త్రీలకు స్వాతంత్ర్యం లభించాలన్న కోర్కె అంతర్లీనంగా కొందరు మహిళల రచనల్లో దాగుంది. ఈ క్రమంలోనే స్వతంత్ర కాంక్షతో ఎందరో మహిళలు ఆనాడు దేశభక్తిపూరిత రచనలు చేసారు. జాతీయోద్యమ

సారస్వతం సుసంపన్నం కావడానికి తోడ్పడ్డారు. శ్రీమతి సామవేదుల చిరంజీవమ్మ, శ్రీమతి కర్లపాలెం సావిత్రి, శ్రీమతి దోసపాటి సీతారవమ్మ, శ్రీమతి వేమూరి జ్ఞానాంబ, శ్రీమతి ఓలేటి లక్ష్మీ కళ్యాణమ్మ, శ్రీమతి వీరపనేని సరోజాదేవి, శ్రీమతి పులవర్తి కమలాపతిదేవి, వట్టికొండ విశాలాక్షి, గిడుగు లక్ష్మీకాంతం, జొన్నలగడ్డ శారదాంబ మొదలయిన వారు జాతీయోద్యమం ఉధృతిని సంతరించుకోడానికి తమ కవిత్వం ద్వారా అందించిన తోడ్పాటు ఇతోధికమైంది. జాతీయోద్యమ కాలాన కవయిత్రుల కృషిని గురించి సమగ్రమైన విశ్లేషణ చేస్తే బృహత్తరమైన పరిశోధనా గ్రంథమవుతుంది.

సరోజినీదేవి, దుర్గాబాయి దేశ్‌ముఖ్ లాంటి వారు ఉద్యమకారులుగా ఉంటూనే రచనలు చేసి జాతీయోద్యమ చైతన్యానికి బాటలు వేశారు. వీరి బాటలోనే అనేకమంది స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు.

జాతీయోద్యమంలో మహిళలు కవిత్వం రాయడమే కాదు కథలు కూడా రాశారు. బండారు అచ్చమాంబ రాసిన కథల్లోనూ దేశస్వాతంత్ర్యానికి సంబంధించిన ఆకాంక్ష అంతర్లీనంగా ఇమిడివుంది. స్త్రీల చదువు గురించి ఆమె నొక్కి చెప్పారు. చదువు ద్వారా చైతన్యం వస్తుందని, తద్వారా స్వేచ్ఛాకాంక్ష బలపడుతుందని ఆమె భావించారు. కనుకనే స్త్రీల విద్య అవసరాన్ని తెలియజెప్పారు. జాతీయోద్యమ కాంక్షని బలంగా వ్యక్తం చేస్తూ 'కుటీర లక్ష్మి' అనే కథను కనుపర్తి వరలక్ష్మమ్మ 1924లో రాశారు. అది ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో అచ్చయింది. దీని తరువాతనే చలం, చింతా దీక్షితులు, శ్రీపాద వంటివారు జాతీయోద్యమ చైతన్యానికి శ్రీకారం చుట్టే కథలు రాశారు. మహిళలకు సంబంధించి వస్తే ఎక్కువమంది పద్యరచనలకు పరిమితమయ్యారు. తెలంగాణ నుంచి ఇల్లిందల సరస్వతీదేవి రాసిన 'కాని కాలం వస్తే' కథలో యథాతథ ఒడంబడిక గురించి, ఒక ముస్లిం కుటుంబం గురించి చిత్రితమైంది. దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చింది. కానీ హైదరాబాద్ సంస్థానం నిజాం నవాబుల ఏలుబడిలో ఉంది. భారతదేశంలో గానీ, పాకిస్థాన్‌లో గానీ కలవకుండా హైదరాబాద్ రాజ్యం స్వతంత్రంగా ఉండాలని నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ తలపోశారు. ఇదే ప్రతిపాదన మీద భారత ప్రభుత్వంతో తాత్కాలికంగా యథాతథ ఒడంబడిక జరిగింది. కానీ అప్పటికే నిజాం పాలనతో విసిగిపోయిన ప్రజలు భారతదేశంలో విలీనాన్ని కోరుకున్నారు. విలీనం కోసం ఆందోళన చేస్తున్నారు. ఈ పూర్వరంగాన్ని దృష్టిలో ఉంచుకొని ఇల్లిందల సరస్వతీదేవి ఈ కథ రాశారు. నిజాం పాలన కొనసాగితే ఇంకా ఎన్ని ఇబ్బందులు పడవలసి వస్తుందోనని తలపోస్తూ ఇక్కడ్నించి వెళ్ళిపోవాలనుకునే కుటుంబం గాథ ఇది. ఇలాంటి కథల్ని జాతీయోద్యమ ప్రభావంతో వచ్చిన కథలుగా పరిగణించవచ్చు.

జాతీయోద్యమ సాహిత్యంలో మహిళలు ఎక్కువగా కవిత్వం రాశారు. ఉపన్యాసాలు ఇచ్చారు. లేఖలు సృజించారు. వచనం రాసింది తక్కువ. కనుక జాతీయోద్యమ సాహిత్యంలో మహిళల పాత్ర వారి కవితా రచనలతోనే ముడిపడివుంది. దేశభక్తిని ప్రబోధించడంతో పాటు స్త్రీల ఆత్మాభిమానం వీటిలో కనిపిస్తుంది. స్త్రీ పురుష సమానత్వాన్ని ప్రబోధిస్తున్నది. అందువల్లనే ఈ కవిత్వానికి ఇప్పటికీ ప్రాధాన్యం ఉన్నది. మహిళా చైతన్యానికి వెలుగుదివిటీగా పనిచేస్తున్నది. ❋

**ఆధార గ్రంథాలు :**

1. ఆంధ్ర కవయిత్రులు – ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ
2. భారత స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు మహిళల పాత్ర – డా. వాసా ప్రభావతి
3. తెలుగు – హిందీ జాతీయోద్యమ గీతాలు – తులనాత్మక పరిశీలన – డా. ఏనుగు నరసింహారెడ్డి
4. స్వాతంత్ర్యానికి పూర్వం తెలుగు కవయిత్రులు (ప్రసంగ పత్రం) – కాత్యాయనీ విద్మహే, కందాల శోభారాణి
5. తెలుగు సాహిత్యంపై గాంధీ ప్రభావం – మొదలి నాగభూషణశర్మ
6. తెలుగులో జాతీయోద్యమ కవిత్వం – డా. మద్దూరి సుబ్బారెడ్డి

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 13 హైదరాబాద్ డిసెంబరు - 2022

# జాతీయోద్యమం - తెలుగు కవులు

**రాఘవేంద్ర రావు,** తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి

స్వతంత్ర భారత అవతరణ కోసం జరిగిన ఉద్యమం ప్రపంచ ఉద్యమాల చరిత్రలోనే వినూత్నమైనది. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా శాంతి, అహింస, సత్యాగ్రహాలు ప్రధాన సాధనాలుగా జరిగిన ఈ పోరాటంలో ఎందరో వీరులు ప్రాణాలను సైతం తృణప్రాయంగా భావించి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. ఈ స్వాతంత్ర్య ఉద్యమాన్ని ఉత్తేజ పరచడానికి భారత దేశమంతా కవుల కలం కదం తొక్కింది. మన ఆంధ్రావని నుంచి కూడా ఎందరో కవులు తమ కవితా బాణాలను ఆంగ్లేయులపై అస్త్రాలుగా ప్రయోగించారు. ఇందులో అతివాదులు, మితవాదులు, తీవ్రవాదులు అని మూడు పాయలవారు వారి వారి పరిధిలో స్వాతంత్ర్య సంగ్రామం సల్పినారు. మార్గాలు, సిద్ధాంతాలు వేరయినా అందరిది ఒకటే లక్ష్యం. అందరికీ "వందేమాతరం" తారకమంత్రమైంది. స్వాతంత్ర్యమనే ఈ ఫలాన్ని పొందదానికి ప్రతి వీరుడు తపస్సు చేసాడు. గాంధీ బోధనలు భగవద్గీత బోధనలై ప్రతి భారతీయుని గుండెను కదిలించి, కర్తవ్యోన్ముఖులయ్యే టట్టు సమ్మోహపరిచాయి. యావద్భారతదేశంలో అన్ని ప్రాంతాల్లోనూ జాతీయస్ఫూర్తిని రగిల్చింది. సంస్కరణోద్యమాలకు, విప్లవోద్యమాలకు బెంగాల్ కేంద్ర బిందువు కాసాగింది.

బెంగాల్ విభజనానంతరం దేశ ప్రజల స్వాతంత్రోద్యమ నినాదంగా మారిన బంకించంద్రుని 'వందేమాతరం' ప్రేరణతో ఒక అజ్ఞాతకవి కృష్ణాపత్రికలో 'ది క్రై ఆఫ్ మదర్ ఇండియా' శీర్షికన ఒక ప్రబోధ గీతాన్ని వెలువరించారు.

**"దూడనోరు గట్టి ద్రోహంబు గొల్లలు**
**పాడి సమస్తము పరులకమ్ముగతి**
**కూడులేని నా కొడుకుల గని**
**యేదకో నా ధనమెల్లను బోయెడి**
**చీము నెత్తురు చిక్కెనో లేదో**
**ఏ మెయి బ్రతుకును నీ దుర్దశ తో**
**ప్రేమ జూపరే!**

పై గేయం లోని రెండు పాదాల స్ఫూర్తితో రాసిన చిలకమర్తి పద్యం చూడండి

**భరతఖండంబు చక్కని పాడియావు**
**హిందువులు లేగదూడలై యేడ్చుచుండ**
**తెల్లవారను గడుసరి గొల్లవారు**
**పితుకుచున్నారు మూతులు బిగియగట్టి.**

పద్యం – రాజమండ్రిలో బిపిన్ చంద్రపాల్ సభలోని శ్రోతలను ప్రేరేపించింది. తెలుగు నాట తలమానికమయింది.

పంజాబ్ కేసరి లాలా లజపతి రాయ్ అరెస్టు సందర్భంగా పుట్టిన

**"చెరసాలల్ పృథుచంద్రశాలలె యగున్, చేదోయి గీలించు**
**నయ్యెర దండల్ విరిదండలయ్యెడును, హేయంబైన చోదంబలే**
**పరమాన్నంబగు మోటుకంబళులు రాల్చన్ పట్టు సెల్లాలుగున్**
**స్థిరుడై యే నరుడాత్మ దేశమును భక్తిం గొల్చు నవ్వానికిన్"**

**"భరత ఖండంబె యొక పెద్ద బందెఖాన**
**అందులోనున్న ఖయిదీలు పొందు జనులు**
**ఒక్క గది నుండి మార్చి వేరొక్క గదిని**
**బెట్టుటే కాక చెరయంచు వేర గలదె"**

ఈ పద్యాలు ప్రజల్లో విశేష ప్రచారాన్ని పొందాయి.

మంగిపూడి వెంకటశర్మ గారు వ్రాసిన గీతం ఉత్తేజనాత్మకమైనది.

**"మేలుకో సుచరిత్ర మేలుకో భరత పుత్ర**
**మేలుకో చిరమిత్ర మేలుకో**
**కాలాయమున మనపాలన వేళాయె**
**చాలు చాలు నిదుర మేలుకో"**

"దేశమును ప్రేమించుమన్నా మంచియన్నది పెంచుమన్నా" అనే గురజాడ దేశభక్తి గేయం తెలుగు సాహిత్యంలో కొత్త రీతిలో దేశభక్తిని నిర్వచించడమే కాక భావం, భాష, రూపం, వస్తు ఛందో ప్రక్రియలలో, శైలిలో నూతన ఒరవడిని చూపింది. తరువాత ముత్యాలసరంగా రూపు సంతరించుకొంది.

అర్థభావాల దృష్ట్యా, జాతీయ అంతర్జాతీయ భావనా పరంపర దృష్ట్యా, పద గుంఫనముల దృష్ట్యా ఈ గీతం బంకించంద్రుని 'వందేమాతరమ్', రవీంద్రుని 'జనగణమన', ఇక్బాల్ 'సారే అచ్ఛా' వంటి గీతాలను మించి ఉందని విమర్శకుల భావన. భరతభూమి పవిత్రతను కీర్తిస్తూ 'జన్మభూమి' గీతాన్ని రాయప్రోలుసుబ్బారావు గారు రచించారు.

**ఏ దేశమేగినా ఎందు కాలిడినా / పొగడరా నీ తల్లి భూమి భారతిని**
**ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైనా / నిలుపరా నీ జాతి నిండు గౌరవము**
**లేదురా ఇటువంటి భూదేవి యెందు / లేరురా మనవంటి పౌరులింకెందు**

అనే ఈ గీతం జన్మభూమిపై ప్రేమానురాగాలు కలిగించింది.

వీరిదే మరో గేయం 'తమ్ముడా!' అనే గేయం. ఈ గేయం నూతన తేజం ఉట్టిపడి చేతనత్వంతో సాగేటట్లు చేస్తుంది.

**శ్రీలు పొంగిన జీవగడ్డయు / పాలు పారిన భాగ్యసీమయు**
**వ్రాలినది యీ భరతఖండము / భక్తి పాడర తమ్ముడా!**

ఇది గురజాడ ముత్యాలసరం మార్గాన్ననుసరించింది. 1921లో పద్దాది సీతారామాంజనేయులు, పూడిపెద్ది కాశీ విశ్వనాథశాస్త్రి అనే ఈ జంట కవులు వెలువరించిన 'స్వరాజ్య గీతామృతము' లను పుస్తకంలోని 'దండాలు దండాలు భరత మాత పాట, పట్టణాలు, దాటి పల్లెలకు విస్తరించి విశేష ప్రజాదరణ పొందింది. ఈ గీతాన్ని రాసినందుకు వీరిద్దరినీ బ్రిటిషు ప్రభుత్వం ఒక సంవత్సరం రాజమండ్రి జైల్లో పెట్టింది, ఆ పాట ఇది.

**దండాలు దండాలు భరతమాత / అవి అందుకొని దీవించు భరతమాత**
**గాంధీ మహాత్ముండు భరతమాత / నీ ముద్దు కొడుకుండగా భరతమాత**

**మీ కేమియును భయము లేదు భరతమాత**
**మాకేమియును కొదువలేదు భరతమాత**

ఈ గీతం సర్వజనాదరణ పొందింది.
తెలుగు జాతీయ గేయకవి సార్వభౌముడు గరిమెళ్ళ సత్యనారాయణ గారి
"మాకొద్దీ తెల్ల దొర తనమూ" అనే పాట ధిక్కార స్వరాన్ని వినిపింపజేసింది.
"కవి కోకిల"గా ఖ్యాతి గడించిన దువ్వూరి రామిరెడ్డి
"లేవరోయి నిద్ర లేవరోరన్నా ! / లేచి నీ తమ్ముణ్ణి లేపరోరన్నా
కొంపంటుకున్నదీ కునుకు లేదన్నా? / నమ్మించి మన గొంతు నరికినారన్నా !
అని గాఢాంధకారంలో నున్న జగతిని వెన్ను తట్టి లేపాడు.
జాతీయోధ్యమంలో తెలుగు కవితా స్వరూపం.
ఇంకా దువ్వూరి వారు...
జోహార్ జోహార్ భారతమా / జోహార్ జోహార్ జోహార్
నీ పద పీఠిని ప్రాణ సుమంబులు నిల్పి భజించెదము

అని దేశమాతకు ప్రణతులర్పిస్తూ బానిస బంధాలు తొలగాలని ఆకాంక్షించాడు. ఇవే గాక 'వీరగంధము తెచ్చినారము వీరుడెవ్వడో దెల్పుడీ' వంటి గీతాలు తెలుగు జాతి స్వాతంత్రకాంక్షను మేల్కొలిపాయి.

హైదరాబాదు రాజ్యంలో నిజాముకు వ్యతిరేకంగా గళమెత్తిన దాశరథి కవితలు తెలంగాణా ప్రజలను ఉగ్రూతలూగించాయి. "ముసలి నక్కకు రాచరికంబు దక్కునే" యని ధిక్కరించిన దాశరథి స్వరం – తెలగాణా ప్రజల గుండె సవ్వడి అయ్యింది.

నా తెలంగాణా కోటి రతనాల వీణ అని నినదించాడు దాశరథి. ఈ విధంగా తెలుగు కవుల కలం స్వాతంత్ర్య కాంక్షను నొక్కి చెప్పింది.

అంతులేని సిరిసంపదలతో అలరారే భారతదేశం ఆంగ్లేయుల దాస్యంలో చిక్కిశల్యమై హీనాతి హీనస్థితికి చేరుకున్నది. స్వాతంత్ర్యోద్యమం మొదట 1857లో మీరట్లో జరిగిన సిపాయిల తిరుగుబాటుతో ఒక పిల్లకాలువలా ప్రారంభమై, దీనికి 1905లోని వందేమాతర ఉద్యమం, 1920 సహాయ నిరాకరణ ఉద్యమం, 1942 క్విట్ ఇండియా, నావికుల తిరుగుబాటు మొదలైన పోరాటాలు 1919 ఏప్రిల్ 3న పంజాబ్‌లోని జలియన్ వాలాబాగ్ ఉదంతము ఇవన్నీ సెలయేళ్లుగా, నదులుగా ప్రవహించి సముద్రంగా మారిన జాతి భారతదేశ స్వాతంత్ర్యం అను సుజల సింధువును చేజిక్కించుకుంది.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు వాఙ్మయము – జాతీయోద్యమ ప్రభావము – దేవులపల్లి రామానుజరావు
2. స్వీయ చరిత్రము – వ్యాసము – చిలకమర్తి లక్ష్మీనరసింహం ❋

# జాతీయోద్యమంలో సర్దార్ జమలాపురం కేశవరావు పాత్ర

**నూనావతు పార్వతి,** అధ్యాపకురాలు, తెలుగు శాఖాధిపతి
తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, సంగారెడ్డి @ బుధేర

తెలంగాణ మొత్తం ఆధిపత్య భావజాలంతో నిండిన రోజులవి ఎక్కడ చూసినా ఆవేదనలు, ఆర్తనాదాలు. తెలంగాణలో ఏ వ్యక్తి గుండెను తట్టినా ఆవేదనలు మిన్నంటుతున్నాయి. అటువంటి భీకర వాతావరణం నుండి చీల్చుకుంటూ ఒక ఉప్పెనలా ఆరడుగుల వ్యక్తి, ఆజానుబాహుడు సర్దార్ జమలాపురం కేశవరావు బయటికి వచ్చారు. సర్దార్ జమలాపురం కేశవరావు సెప్టెంబర్ 3, 1908 న ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెంలో వెంకటరావు, వెంకట నరసమ్మ దంపతులకు తొలిసంతానంగా జన్మించారు. సంపన్న సంప్రదాయ కుటుంబంలో జన్మించినా కూడా చిన్నప్పటి నుండి సామ్యవాద భావాలు కలవారు. మూఢనమ్మకాలను ఏనాడు నమ్మేవారు కాదు. అణగారిన వర్గాల వారికి అండగా నిలిచి వారిలో చైతన్య జ్వాలను రగిలించాడు. నిజాం నిరంకుశ పాలనను ధిక్కరించి అంతం చేయడానికి ప్రాణాలకు తెగించి పోరాడిన వ్యక్తి తెలంగాణ సర్దార్. తెలంగాణ ఉక్కుమనిషి సర్దార్ జమలాపురం కేశవరావు. ఉక్కు సంకెళ్లతో ఈడ్చుకెళ్ళినా కూడా ఇసుమంత చెక్కుచెదరని ధైర్యశాలి ఇతను. శత్రువుల పాలిట సింహస్వప్నంలా నిలిచాడు. కేశవరావు చిన్నప్పుడే తల్లి అనారోగ్య కారణాలతో మరణించారు. ఈ అనుకొని సంఘటనలతో తండ్రి పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వాళ్లని మంచి చదువులు చదివించి ప్రయోజకులను చేయాలని నిర్ణయించారు.

ఎర్రుపాలెంలో ప్రాథమిక విద్య తర్వాత ఖమ్మంలో మాధ్యమిక విద్య చదివారు. కేశవరావు సెలవులలో ఇంటికి వచ్చినప్పుడల్లా ఎక్కువ సమయం స్నేహితులతో గడిపేవారు. అతని స్నేహితులలో ఎక్కువమంది పని వాళ్ళ పిల్లలు, పేదవారు ఉండేవారు. వారి ఇళ్ళలో భోజనాలు చేయటం కొంతవరకు తండ్రికి ఇబ్బంది కలిగించేది. ఆ రోజుల్లో మూఢనమ్మకాలు ఎక్కువగా ఉండేవి. తన పదిహేడు సంవత్సరాల వయసులో ఒకసారి గర్భవతి అయిన స్త్రీ మరణిస్తే ఆమె దహన సంస్కరాలు చెయ్యటానికి అందరూ భయపడ్డారు. అప్పుడు అందరూ వారిస్తున్నా వినకుండా ఆ శవాన్ని తన భుజాలపై వేసుకొని స్మశానానికి తీసుకెళ్లి ఆ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి దహన సంస్కారాలు చేయించారు. కొడుకు చేసే పనులు తండ్రికి మింగుడు పడలేదు. వెంటనే కొడుకును హైదరాబాదులోని నిజాం కళాశాలలో చేర్పించారు. నిజాం కాలేజీలో చదువుతున్న రోజుల్లో దేశంలో జాతీయోద్యమం ఉవ్వెత్తున కొనసాగుతుంది. నిజాం సంస్థానంలో కూడా ఉద్యమం పెద్ద ఎత్తున వ్యాపించింది. ఆ రోజుల్లో వందేమాతరం ఉద్యమం ప్రతి పల్లెల్లోనూ, పట్టణంలోనూ, వాడవాడలా ప్రతిధ్వనించింది. వందేమాతరం గీతం నిజాం గుండెల్లో పిడుగుల వర్షం కురిపించింది. నిజాం ప్రభుత్వం జాతీయ భావాలను కించపరుస్తూ 'వందేమాతరం' గీతాన్ని నిషేధించింది. జాతీయవాదులంతా ఈ విధానాన్ని ఖండించారు. కేశవరావు మనసులో ఇంతకాలం దాగి ఉన్న ఆలోచనలు ఉప్పెనలా ఆకాశాన్నంటాయి. విద్యార్థులందరినీ కూడగట్టుకొని నిజాం ప్రభుత్వంపై ఉద్యమించారు. వందేమాతరం గీతాన్ని పాడనివ్వకపోతే తరగతులకు హాజరుకామని పట్టుబద్దారు. దీనితో నిజాం ప్రభుత్వం నిషేధాన్ని ఎత్తివేయక తప్పలేదు. ఈ ఘటన తర్వాత అతని ఆలోచనా పరిధి మరింత విస్తృతం అయింది. ఆయన వెళ్ళాల్సిన మార్గం మరింత స్పష్టమైంది. అయితే తన సిద్ధాంతాలకు వ్యతిరేకంగా తన తండ్రి నిజాం సంస్థానంలో ఉద్యోగం చేయాలని పట్టుబట్టారు. తండ్రి బలవంతం మీద కొంతకాలం పనిచేశారు.

అవినీతి, అక్రమాలు సహించని కేశవరావు ఎక్కువ కాలం ఉద్యోగం చేయలేకపోయారు. ఉద్యోగం చేస్తున్నా కూడా అతని దృష్టి మొత్తం ప్రజల మీద ఉండేది. నిజాం పాలనలో కొనసాగుతున్న వెట్టిచాకిరితో అష్టకష్టాలకు గురవుతున్న ప్రజల్ని చూసి చలించిపోయేవారు. తాండూరులో కొద్ది రోజులు పనిచేసి ఉద్యోగానికి రాజీనామా సమర్పించి బయటపడ్డారు. ఉద్యోగానికి రాజీనామా చేసిన సమయంలో తెలంగాణలో విముక్తి పోరాటం ఉధృతంగా కొనసాగుతుంది. వెట్టిచాకిరి నుండి ప్రజలను విముక్తి చేయడానికి తెలంగాణ జిల్లాల్లో ముఖ్యంగా వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో కేశవరావు కాలినడకన విస్తృతంగా పర్యటించారు. ఆ క్రమంలోనే భారత స్వాతంత్రోద్యమం పట్ల, గాంధీజీ సిద్ధాంతాల పట్ల కేశవరావు ఆకర్షితుడయ్యారు.

1923లో రాజమండ్రిలో మొదటిసారిగా మహాత్మా గాంధీ ఉపన్యాసాన్ని విన్న కేశవరావు 1930లో విజయవాడలో జరిగిన సభలో గాంధీజీ పరిచయంతో మరింత ఉత్తేజితుడైనాడు. కళా వెంకట్రావు ఆయనను గాంధీజీకి పరిచయం చేశారు. గాంధీజీ మాటలు ఆయనలో రాజకీయ చైతన్యాన్ని కలిగించాయి. ఆంధ్ర పితామహుడు మాడపాటి హనుమంతరావు ప్రారంభించిన గ్రంథాలయోద్యమాన్ని తెలంగాణలోని ప్రతి పల్లెలోనూ ప్రచారం గావించాడు. కేశవరావు ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాలో అనేక గ్రంథాలయాలు స్థాపించబడినాయి. తెలంగాణ ప్రజల అజ్ఞానానికి కారణం నిరక్షరాస్యులేనని గ్రహించి వారిలో చైతన్యాన్ని నింపడానికి ప్రత్యేక శ్రద్ధను కనబరిచేవారు. అణగారిన వర్గాలలో వారిలో అక్షర జ్ఞానాన్ని కలిగించాలనే ఉద్దేశంతో వయోజన విద్య వ్యాప్తికై రాత్రి పాఠశాలను ఏర్పాటు చేశారు. ఆరంభ దశలో కేశవరావు కార్యక్రమాలు ప్రజల్ని అంతగా ఆకర్షించలేదు. అయితే పల్లె వాతావరణంలో పుట్టి పెరిగిన ఆయనకు పల్లె ప్రజల మనసును అర్థం చేసుకోవటానికి ఎంతో సమయం పట్టలేదు. గ్రామాలలో రహస్య సమావేశాలు నిర్వహించి వారి సమస్యలను అర్థం చేసుకోవడం, నిజాం ప్రభుత్వంపై తలపెట్టిన ప్రజా ఉద్యమ లక్ష్యాలను వివరించేవారు. కేశవరావు నిరాడంబర జీవితం, నిస్వార్థపూరితమైన లక్ష్యాలు ప్రజల్ని బాగా ఆకర్షించాయి. ఆయన నిరాడంబరత్వానికి కార్యకర్తలు, ప్రజలు మంత్రముగ్ధులయ్యేవారు. ప్రజలపై కేశవరావు ప్రభావం రోజురోజుకు పెరగసాగింది. తెలంగాణలో ఎక్కడ చూసినా "సర్దార్ జమలాపురం కేశవరావు జై" అనే నినాదం మారు మ్రోగేది. గ్రామాలలో అనేక సభా కార్యక్రమాలు నిర్వహించేవారు. ఆయన ధైర్యసాహసాలు ప్రజలలో నూతనోత్సాహాన్ని కలిగించాయి. తను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఇతరులకి ఆదర్శంగా నిలబడ్డారు. ఒక వజ్రంగా ప్రకాశించారు.

మతదురహంకారి అయిన నిజాం యొక్క అరాచకాలని ఎదుర్కోవాలంటే ఒక వ్యక్తి వల్ల లేదా ఒక సమూహం వల్ల సాధ్యం కాదని జాతీయ భావాలు కల ఒక సంస్థ స్థాపన వల్లే అది సాధ్యమవుతుందని రాష్ట్ర నాయకులందరూ కలిసి "హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్" స్థాపించారు. 'తెలంగాణ స్టేట్ కాంగ్రెస్' ఆవిర్భావంలో కేశవరావు పాత్ర ఎంతోఉంది. 1938 అక్టోబర్ 24వ తేదీన మధిరలో గోవిందరావు నానక్, జనార్దన్ రావు దేశాయ్, రావి నారాయణరెడ్డిలతో కలిసి సత్యాగ్రహ దీక్షకు కేశవరావు సిద్ధమయ్యాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ సర్దార్ను దీక్ష చెయ్యనియ్యొద్దని నిజాం ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. మధిరలో అడుగడుగునా పోలీసులను మోహరించింది. అయినా భారీ సంఖ్యలో ప్రజలు దీక్ష వేదిక దగ్గరకు చేరుకున్నారు. అప్పుడే ఎవరూ ఊహించని విధంగా రైతు వేషంలో దీక్ష వేదిక దగ్గరకు వచ్చాడు కేశవరావు. వెంటనే మహాత్మా గాంధీకి జై, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ కి జై అని నినదించారు. నిషేధాన్ని ఉల్లంఘించి సత్యాగ్రహ దీక్ష చేశారని అరెస్టు చేశారు. అనేకమంది కార్యకర్తలు కూడా అరెస్టయ్యారు. కేశవరావుకు 18 నెలలు జైలు శిక్ష విధించారు. వరంగల్ జైల్లో ఎనిమిది నెలలు జైలు శిక్ష తర్వాత కేశవరావుతో సహా అందరినీ నిజామాబాద్ జైలుకు తరలించారు. జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా అదే పోరాట పంథాని కొనసాగించారు.

దేశంలోనే ప్రముఖ జాతీయ నాయకులు గాంధీజీ, రవీంద్రనాథ్ ఠాగూర్, జవహర్లాల్ నెహ్రూ, మాస్టర్ తారా సింగ్, వినాయక దామోదర సావర్కర్, మౌలానా అబుల్ కలాం ఆజాద్, జే.బి. కృపలాని, లోకనాయక్ జయప్రకాశ్ నారాయణ్ వంటి గొప్ప గొప్ప నాయకులు కూడా సత్యాగ్రహ విశేషాలను తెలుసుకొని సామాన్య ప్రజలు తమ హక్కుల కోసం జరుపుతున్న ధర్మపోరాటంగా అభివర్ణించారు. ఈ సత్యాగ్రహోద్యమం నిజాం రాజును గద్దెదింపలేకపోయినా, ప్రజలలో ఐకమత్యాన్ని తీసుకురాగలిగింది.

కేశవరావు అంటరానితనం నిర్మూలించేందుకు కృషి చేశారు. ఆదివాసుల అభివృద్ధికి కూడా కృషి చేశారు. పట్టణాలలో, పల్లెల్లో నివసించే ప్రజలతోనే కాకుండా ఎక్కడో అడవుల్లో నివసించే గిరిజనులతో కూడా సన్నిహిత సంబంధాలను కలిగి ఉండేవారు. సమాజంలో ఏ ఒక్క వర్గాన్ని విస్మరించకుండా అందరితో మంచి సంబంధాలని కలిగి ఉండేవారు. పానుగంటి పిచ్చయ్య, వనం నరసింహారావు, నారాయణరావులతో కలిసి పాల్వంచలో పర్యటించి ఆదివాసి మహాసభను ఏర్పాటు చేశారు. కేశవరావు ఉపన్యాసాలు వినటానికి మహిళలు కూడా తండోపతండాలుగా తరలి వచ్చేవారు. ఆయన ప్రసంగాలలో మహిళలు అబలలు కారని వీరమాతలని, వీరవనితలని ప్రశంసించేవారు. కేశవరావు తెలంగాణలోని అన్ని గ్రామాలు తిరిగి ప్రజలకు అండగా నిలబడి వారిని ఐక్యం చేసి రజాకారులకు దీటుగా నిలబెట్టారు. మాన ప్రాణాలకు ముప్పు వాటిల్లినప్పుడు ఎదురు తిరగడంలో తప్పేమీలేదని, సంఘవిద్రోహులకు సరైన గుణపాఠం నేర్పాలని ప్రజలకు చెప్పేవారు. అనేక గ్రామాలలో గ్రామరక్షక దళాలను ఏర్పాటు చేశారు.

1946లో కాంగ్రెస్ అధ్యక్షులుగా తెలంగాణలోని గ్రామాలలో, పట్టణాలలో కేశవరావు చేసిన ప్రసంగాలు విమోచనోద్యమాన్ని విజయపథం వైపు నడిపించాయి. హైదరాబాదు రాష్ట్ర విమోచనోద్యమానికి అనేక మంది స్వార్థపరులు అడ్డంకులు కలిగించారు. అయినా కేశవరావు లాంటి నాయకులు ఆ అడ్డంకులను అన్నింటిని అధిగమించి ప్రజలలో స్వాతంత్ర్య కాంక్షను కలిగించారు. నిజాం ప్రభుత్వంలోని జాగిర్దారులు, జమిందార్లు సామాన్య ప్రజల నుండి ఎన్నో రకాల పన్నులు వసూలు చేసేవారు. శుభకార్యాల దగ్గర నుండి చివరకు చావుకు కూడా పన్నులు వసూలు చేసేవారు. ఈ విధంగా శుభానికి, ఆ శుభానికి అనేక పేర్లతో పన్ను రూపంలో డబ్బులు వసూలు చేస్తూ మతోన్మాద శక్తులతో కలిసి ప్రజానీకంపై అత్యాచారాలు చేయించేవారు. ఏనాడు ప్రజల భవిష్యత్తు గురించి ఆలోచించేవారు కాదు. భూస్వాములకు, జాగిర్దారులకు ఉన్నవన్నీ హక్కులే. బాధ్యతలనేవి ఉండేవి కావు. ఆరోజుల్లో పోలీసు వ్యవస్థ కూడా గుండాల మాదిరి ప్రవర్తిస్తూ ఉండేది. అటువంటి పరిస్థితుల్లో కేశవరావు చేసే ప్రసంగాలు ప్రజల గుండెల్లో కొండంత ధైర్యాన్ని ఇచ్చేది.

1946 లో గాంధీజీ ఖమ్మం పర్యటన చిరస్మరణీయమైంది. గాంధీజీ పర్యటన పూర్తిగా కేశవరావు నేతృత్వంలో జరిగింది. అప్పటికే హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ లో ప్రముఖ పాత్ర పోషిస్తున్న ఆయన గాంధీజీ మన్ననలను పొందారు. గాంధీజీని కలిసిన ప్రతిసారి కేశవరావులో కొత్త ఉత్సాహం కనిపించేది. గాంధీజీ తర్వాత 'నేతాజీ సుభాష్ చంద్రబోస్' దేశభక్తి, ధైర్య సాహసాలు అతన్ని బాగా ప్రభావితం చేశాయి.

1942 లో కాంగ్రెస్ పిలుపు మేరకు 'క్విట్ ఇండియా' ఉద్యమాన్ని తెలంగాణలో ఊరురా ప్రచారం చేశారు. 1946లో మెదక్ జిల్లా కందిలో కేశవరావు అధ్యక్షతన జరిగిన 13 వ ఆంధ్ర మహాసభ సందర్భంగా నిర్వహించిన బ్రహ్మాండమైన ఊరేగింపు అందరిని ఆకట్టుకుంది. ప్రజా వ్యతిరేకమైన సంస్కరణలను అందరూబహిష్కరించాలని కాంగ్రెస్ కార్యకర్తలందరు గ్రామాల్లో పర్యటించి ప్రజలందరికి వివరించారు. నిజాం ప్రభుత్వం ప్రవేశపెట్టిన "బూటకపు సంస్కరణలు" వ్యతిరేక ప్రచారాన్ని రాత్రనక పగలనక అన్ని గ్రామాలు తిరుగుతూ చేపట్టారు. అత్రాఫ్ బల్దియ జిల్లా (ఇప్పటి రంగారెడ్డి) లో జరిగిన యువజన కాంగ్రెస్ సభలో కేశవరావు అధ్యక్ష హెూదాలో మాట్లాడుతూ జాతీయ నాయకులందరు ఏవిధంగా తమ ఉద్యమానికి సహాయమందిస్తున్నారో ప్రజలకు తెలియజేశారు. అదేవిధంగా తొర్రూరు ఇబ్రహీంపట్నం, మెదక్ జిల్లాలోని జోగిపేట్, శంకరంపేట్, సంగారెడ్డి, నారాయణఖేడ్ లలో జరిగిన బహిరంగ సభలలో కూడా బూటకపు సంస్కరణలకు వ్యతిరేకంగా ప్రసంగించారు. ఆయనతో పాటు కాటం లక్ష్మీనారాయణ, ఉమ్మెత్తల కేశవరావు, బాలచంద్ శ్రీనివాసరావు, డాక్టర్ చెన్నారెడ్డి, రాజేశ్వర్ జోషి వంటి వారు పాల్గొన్నారు. అంతేకాకుండా నిజామాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం ఇలా అన్ని జిల్లాలోని ప్రాంతీయ నాయకులతో కలిసి జన చైతన్య యాత్రలను జరిపారు. స్వామి రామానంద తీర్థ, సర్దార్ జమలాపురం కేశవరావు నిర్విరామ కృషి వల్లనే నిజాం ప్రవేశపెట్టిన బూటకపు సంస్కరణలను, కంటితుడుపు ఎన్నికలను ప్రజలు పూర్తిగా బహిష్కరించారు.

1947 ఆగస్టు ఏడవ తేదీన కేశవరావు కాంగ్రెస్ పిలుపు మేరకు మధిరలో స్టేట్ కాంగ్రెస్ చేపట్టిన సత్యాగ్రహం మరువలేనిది. వేలాది మంది ప్రజల సమక్షంలో ప్రభుత్వాన్ని విమర్శిస్తూ నిజాం సంస్థానం భారతదేశంలో విలీనం కావాలంటూ చారిత్రాత్మకమైన ఉపన్యాసం ఇచ్చారు. ప్రభుత్వ నిషేధాజ్ఞలను ధిక్కరించినందుకు నిజాం పోలీసులు అరెస్టు చేసి రెండు సంవత్సరాలు జైలు శిక్షను విధించారు. ఆయన రాజకీయ జీవితంలో అనేకసార్లు అరెస్ట్ అయినారు. జైల్లో ఉన్నంతకాలం రజాకార్లు చేస్తున్న అరాచకాలను జైలు నుండే పదజాలంతో ఖండిస్తూ పత్రికా ప్రకటనలు ఇచ్చేవారు. ఎనిమిది నెలల శిక్ష అనంతరం నిజామాబాద్ జైలుకు తరలించడం సహించలేని ప్రజలు వరంగల్ స్టేషన్‌లోనే గుమిగుడి “సర్దార్ జమలాపురం కేశవరావుకు జిందాబాద్” అనే నినాదాలతో పరిసరాలు దద్దరిల్లేలాగా చేశారు. నిజామాబాద్ పట్టణంలో ప్రవేశించిన కేశవరావును చూడగానే రోడ్డుకిరువైపులా నిలబడిన ప్రజలు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ ఆవేశపూరితులైనారు. పరిస్థితికి భయపడి పోలీసులు ప్రజల్ని శాంతింపజేయమని ఆయనని బ్రతిమాలడంతో ప్రజలకు ఆయన పట్ల ఉన్న ఆదరాభిమానాలు తెలుస్తున్నాయి.

కేశవరావు తన జీవితంలో ఎన్నోసార్లు జైలు జీవితాన్ని గడిపారు. 1947 ఆగస్టు 7న మధిరలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించినందుకు సర్దార్ ను అరెస్టు చేశారు. వరంగల్ జైలులో వందేమాతరం పాడితే కాలుస్తామని బెదిరించారు. దమ్మంటే కాల్చమని ఎదురు నిలిచాడు కేశవరావు. 1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో కేశవరావు వంటి గొప్ప నాయకులు జైలులో ఉండడం ఒక విషాదకర సంఘటన. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి స్వదేశీ సంస్థానాలన్ని ఒక్కొక్కటిగా ఇండియన్ యూనియన్ లో విలీనం అయ్యాయి. అయితే హైదరాబాద్ సంస్థానం మాత్రం ఇండియన్ యూనియన్ లో కలవలేదు. హైదరాబాద్ సంస్థానం కోసం ఇండియన్ మిలటరీ దళాలు సర్దార్ పటేల్ నేతృత్వంలో బలప్రయోగం చేయవలసి వచ్చింది. సర్దార్ వల్లభాయ్ పటేల్ చొరవతో నిజాం ఉస్మాన్ అలీఖాన్ హైదరాబాద్ రాజ్యాన్ని భారతదేశంలో విలీనం చేశారు. ‘పోలీస్ యాక్షన్’ తర్వాత ఖమ్మం జిల్లాలోని డోర్నకల్ ప్రాంతంలోని అడవి గ్రామాల ప్రజలు మిలటరీ ఆఫీసర్లపై తిరగబడినప్పుడు సర్దార్ పటేల్ కోరిక మేరకు కేశవరావు ఆ ప్రాంతంలో పర్యటించి అక్కడి ప్రజలను శాంతింపజేశారు. అందుకు సర్దార్ పటేల్ ఆయనను ఎంతగానో అభినందించారు. కేశవరావులోని దేశభక్తి, కార్యదీక్ష సర్దార్ పటేల్ ను ఎంతగానో ఆకర్షించాయి. భారతదేశం మొత్తానికి సర్దార్ పటేల్ అయితే ‘దక్కన్ సర్దార్’ గా జమలాపురం కేశవరావు ప్రసిద్ధిగాంచారు.

ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు ప్రారంభించిన ఆంధ్రోద్యమాన్ని తెలంగాణలో ఊరూరా తిరిగి ప్రచారం గావించి ప్రజలను చైతన్యవంతులను గావించారు. ఆర్య సమాజ్ నాయకుడైన పండిట్ నరేంద్రజీ ప్రభావం ఆయనపై ఎంతగానో ఉంది. “తల తెగిపోవచ్చు కాని వంచబడదు” అనే నరేంద్రజీ వాక్యాలను ఆయన ఎప్పుడు జ్ఞాపకం చేసుకునేవారు. రజాకారులు నరేంద్రజీ హత్యకు ప్రయత్నించినప్పుడు కేశవరావు ఆయనకు ఏదైనా హాని జరిగిన పక్షంలో రాష్ట్రంలో రక్తం ఏరులై పారు పారుతుందని హెచ్చరిస్తూ ప్రకటనలు చేశారు. కమ్యూనిస్టు నాయకులైన రావి నారాయణరెడ్డితో మంచి స్నేహబంధము ఉంది. వట్టికొండ నాగేశ్వరరావు, వాసిరెడ్డి వెంకటపతి, ఆరుట్ల లక్ష్మీ నరసింహారెడ్డి, కేశవరావును “అజాతశత్రువుగా” కొనియాడారు. అందరితో కలిసిమెలిసి ఉద్యమాన్ని ముందుండి నడిపేవారు. హీరాలాల్ మోరియా, కొలిపాక కిషన్ రావు, బొమ్మకంటి సత్యనారాయణ, జలగం వెంగళరావు. టి. హయగ్రీవాచారి, పెండ్యాల సత్యనారాయణ, కాటం లక్ష్మీనారాయణ, మాడపాటి రామచంద్రరావు, డాక్టర్ దాశరథి, డాక్టర్ వెంకటాచారి, కాళోజీ మొదలైన వారితో సన్నిహితంగా మెలిగేవారు. వీరందరూ ఉద్యమంలో ఒకే ఊపిరిగా పోరాడారు.

ఆంధ్ర నాయకులైన ఆంధ్ర కేసరి టంగుటూరి, కళా వెంకటరావు, పట్టాభి సీతారామయ్య మొదలైన వారితో కూడా మంచి పరిచయం ఉంది. 1947 లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కమ్యూనిస్టు పార్టీ సాయుధ రైతాంగ పోరాటం కొనసాగించింది. వేలాదిమంది కార్యకర్తలు, యూనియన్ లీడర్లు, సానుభూతి పరులు మిలటరీ దళాల చేతిలో హతమయ్యారు. చివరకు 1951 లో పోరాటాన్ని విరమించింది. 1952 వ సంవత్సరంలో భారతదేశమంతటా లోక్ సభ, శాసన సభకు ఎన్నికలు

జరిగాయి. దురదృష్టవశాత్తు స్టేట్ కాంగ్రెస్ లో గ్రూపులు, ముఠా తగాదాలు మొట్టమొదటిసారిగా బయటపడ్డాయి. ఈ గ్రూపు తగాదాల వల్ల రామానంద తీర్థ అనుచరుడైన కేశవరావు పరాజయం పొందాలనే ఉద్దేశ్యంతో దేశాయి వర్గం ఆయనను మధిర నుంచి కాక కమ్యూనిస్టు పార్టీకి కంచుకోట అయిన పాకాల నియోజకవర్గం నుంచి ఎంపిక చేస్తూ ఏఐసీసీ పార్లమెంటరీ బోర్డు ప్రకటన చేసింది. ఫలితంగా ముఠారాజకీయాల వల్ల కేశవరావు ఓడిపోయారు. విషాదం ఏమిటంటే ఏ భూస్వామ్య వ్యవస్థకు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడారో వారే తిరిగి పార్టీలో చేరి తిరిగి రాజకీయం చేయడం కేశవరావుని బాగా కృంగదీసింది.

తన రాజకీయ జీవితంలో ఎన్నోసార్లు జైలు జీవితం గడిపి, ఉద్యమ సమయంలో, పాదయాత్ర సమయంలో సరైన భోజనం లేకపోవడంతో శరీరం క్షీణించిపోయింది. పార్టీలోని నాయకులు చేసిన మోసంతో సర్దార్ బాగా కృంగిపోయారు. ఈ మానసిక ఒత్తిడితోనే 1953 మార్చి 23న తన 46వ యేట చనిపోయారు.

నిజాం సర్కార్ పై నిప్పులు చెరిగిన సూర్యుడిలా భూమికోసం, భుక్తికోసం, బానిసబంధ విముక్తి కోసం సాగిన పోరాటంలో సర్దార్ ఆణిముత్యంలా మెరిశారు. సంపన్న కుటుంబంలో పుట్టినా అన్ని వదిలి అభాగ్యుల ఆర్తనాదాలను అంతం చేయాలని పోరాటం వైపు పయనించారు. కాళ్లకు చెప్పులు లేకుండ తెలంగాణలోని గడపగడపకు తిరుగుతూ బానిసత్వ విముక్తికై పోరాడిన వ్యక్తి.

పటేల్, పట్వారి వ్యవస్థ కింద జరుగుతున్న నిరంకుశత్వ నిర్మూలన కోసం పోరాటం చేశారు. కమ్యూనిస్టు పేరుతో ముస్లింలను ఊచకోత కోస్తున్నారని ఆవేదన చెందారు. నిజాం ప్రభుత్వ అరాచకాలను అందరికంటే ముందుండి ప్రశ్నించేవారు. అందువల్ల ఆయన కార్యకర్తల అభిమానాన్ని సంపాదించగలిగారు. తను చెప్పదలుచుకున్న విషయం గురించి సూటిగా, స్పష్టంగా సుబోధకంగా చెప్పేవాడు. తన గురించి గొప్పగా చెప్పుకోవడం గాని, చెప్పించుకోవడం గాని, జయజయ ధ్వానాలు గాని, ఊరేగింపులు వంటి వాటిని సున్నితంగా తిరస్కరించేవారు. ఆజానుభాహులు, ఆకాశమంత యెత్తు మనిషి, ధైర్య సాహసం, మనోనిబ్బరం వంటి లక్షణాలు కేశవరావు గారి జీవితానికి అలంకార ప్రాయాలైనాయి. తక్కువగా మాట్లాడటం ఎక్కువగా పని చేయడం ఆయన ప్రవృత్తి. ప్రతి చిన్న విషయాన్ని చాలా జాగ్రత్తగా పరిశీలించడం, దాన్ని పరిష్కరించడం ఆయనకు అలవాటు. తన తోటి కార్యకర్తల పట్ల, సాధారణ కార్యకర్తల పట్ల సానుభూతితో ఉంటూ సమస్యల్ని పరిష్కరించేవాడు. స్నేహితుల పట్ల, పరిచయస్తుల పట్ల ఆయన చూపే ఆదరాభిమానాలకు జనం పరవశించి పోయేవారు. తెలంగాణలో ఒక ప్రియతమ నాయకుడిగా ప్రజా హృదయంలో నిలిచిపోయాడు. అందుకే ఆయనను అందరు 'తెలంగాణ సర్దార్'గా పిలిపించుకుంటారు. సర్దారుకు ఉర్దు, హిందీ, ఇంగ్లీష్, పార్శీ భాషలలో ప్రావీణ్యం ఉంది. ముక్కు సూటితనం, నిజాయితీ, ప్రజల సమస్యలపై పోరాడే తత్వం ఇవన్నీ కలిసి అతనిలో ఉండడం వలన ఎక్కువ కాలం ఉద్యోగం చేయలేకపోయారు. సర్దార్ లాంటి నిస్వార్ధ, నిష్కళంక దేశభక్తుల్ని కన్న తెలంగాణా తల్లి ధన్యురాలైంది.

**తాను తగిలించుకొన్నట్టి దానికన్న**
**ప్రభుత్వ మొసగినట్టి బిరుదు వరముకన్న**
**ప్రీతితో జనులొసగిన బిరుదే బిరుదు**
**అట్టి సర్దారు బిరుదుతో అలరుచున్న**
**కేశవాఖ్యునకు కలుగు కీర్తి గరిమ**

అని తెలంగాణ ప్రజలు సర్దార్ అనే బిరుదును ఎలా ఇచ్చారో చెప్తున్నారు రామాచారి ఈ కవితలో

**ముస్తాబు చేసుకొనే మోటార్లో ఊరేగు**
**మురిపెంబు నాకేమీ లేదన్న**
**మొండి చేతుల అంగి మోకాళ్ళ దాటిన**

మొలగుద్దతో తిరుగు కేశన్న
దిద్ది తీర్చని జుట్టు ముద్దులొలకని మోము
పెద్దవానికి లోటు కావన్న
పల్లె బాటల బాధ ప్రజలతో బాటు
నీ బరికాళ్ళకే బాగా గురుతున్న
మచ్చలేని మనసు జబ్బులేని వొళ్ళు
డబ్బులేని జేబు నీదన్న
సర్దారు నామంబు సహజ నామంబుగా
సరిపోయినది నీకు కేశన్నా.

–అన్నారు కాళోజీ. ❋

మూల గ్రంథాలు

1. తెలంగాణా స్వాతంత్ర్యోద్యమ సారథి సర్దార్ జమలాపురం కేశవరావు – మాదిరాజు కేశవరావు
2. మహాపథం కవిత – కవిరాజమూర్తి (తెలుగు), హీరాలాల్ మోరియా (ఉర్దూ)

# జాతీయోద్యమ ప్రభావం - గిరిజన నవల నేపథ్యం

**డా. జరుపుల రమేష్,** తెలుగు శాఖాధిపతి, తెలుగు విభాగం,
ఎస్.ఆర్. & బి.జి.యన్.ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, ఖమ్మం

'చనిపోయిన తర్వాత కూడా మాతృభూమి పై వున్న నా ప్రేమ
మా హృదయాలను వదిలిపోదు నా అస్తికల్లో దాని

పరిమళం అలాగే నిలిచిపోతుంది' అంటూ 1931 మార్చి 23 న భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురుల పై మరణశిక్ష అమలు జరిపిన రోజు అనుకున్న మాటలు. ఈ మాటలు యావత్ దేశాన్ని ఒక్కసారిగా ఆలోచింపచేశాయి. అప్పటి వరకు కేవలం దేశం, దేశభక్తితో ముందుకు వెళుతున్న ప్రజలు ఈ సంఘటనతో ఒక్కసారిగా జాతీయోద్యమ ప్రభావం మరింత బలంగా పుంజుకుంది. జాతీయతత్వం అనేదాన్ని సాంప్రదాయకంగా బూర్జువావర్గ ఆవిర్భావంతో జత చేయడం జరుగుతూ వుంది. ఫ్యూడల్ వ్యవస్థకు స్థానికతత్వ స్వభావం వుంటుంది. సోషలిజం యొక్క విశిష్ట లక్షణం. జాతీయ చైతన్యం, జాతీయ ప్రభుత్వాలు, బూర్జువా వ్యవస్థకు అవసరమౌతాయి. అయితే, తృతీయ ప్రపంచదేశాల్లో మాత్రం, అలాంటి బూర్జువా వర్గ కర్తవ్యాలు, మిగతా వర్గాలపై పడ్డాయి. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జాతీయతత్వం ముందుకొస్తుంది. బూర్జువావర్గం సామ్రాజ్యవాదానికి అవసరం. అయితే, ఆధునిక బూర్జువావర్గం ఏర్పడకముందే, సామ్రాజ్యవాదం, సమాజాల్లో చొచ్చుకొనిపోయి వుంది. అలాంటి బూర్జువా వ్యవస్థ ముందుదశలో, బూర్జువావర్గ చర్యలవల్ల, భావాల వల్ల, దాని స్వభావాన్ని గ్రహించవచ్చు. ఆధునిక బూర్జువావర్గం రంగం మీదకు వచ్చి, స్వతంత్రంగా కార్యక్రమ విధానాలను రూపొందించుకునే శక్తి వున్నప్పటికి, పరస్పర వైరుధ్యాలతో తన స్వభావాన్ని బహిరంగ పరిచింది. ఒకవైపు, సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ జాతీయోద్యమంలో పాల్గొని, తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకోవాలనుకోవడం, రెండవవైపు సామ్రాజ్యవాద ఫలితంగా, తాను నూతనంగా రంగంమీదకొచ్చినందున, సామ్రాజ్యవాదాన్ని గనుక గట్టిగా ఎదుర్కొంటే, తన బూర్జువా వ్యవస్థకే మోసం జరుగుతుందనే సత్యాన్ని తెలుసుకోవడం లాంటి వాస్తవాలు పై వాటిని సందిగ్ధంలో పడేశాయి. ఫలితంగా సామ్రాజ్యవాదంతో రాజీపడే ప్రయత్నాలను చేసింది. తన స్వేచ్ఛా పురోభివృద్ధి పంథాకు అడ్డంకులు ఎదురయ్యేకొద్దీ, రాజీ ప్రయత్నాలు అధికమయ్యాయి. ఫలితంగా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని ముందుకు తీసుకొనిపోయే ప్రధాన కర్తవ్యం అత్యధికంగా కార్మికవర్గంపై పడింది. సామ్రాజ్యవాద పెత్తనం నుండి విముక్తిని సాధించే దీర్ఘకాలిక పోరాటాన్ని, వివిధ దశల్లో వివిధ వర్గాలు ముందుకు తీసుకొనిపోయినప్పటికి, దాన్ని విజయవంతంగా నడిపింది కార్మికవర్గం మాత్రమే అంటూ ప్రభాత్ పట్నాయక్ అభిప్రాయపడ్డారు.

19 వ శతాబ్దంలో సామాజిక మత సంస్కరణల ఉద్యమానికి ప్రాతినిధ్యం వహించిన సాంస్కృతిక పునరుజ్జీవనం జాతీయ చైతనాన్ని గూర్చి తెలియజేస్తుంది. వ్యక్తి స్వేచ్ఛ వ్యక్తి గౌరవం ప్రాతిపదికగల సూత్రాల ఆధారంగా సాంఘిక మత సంస్థలను ప్రజాస్వామ్యయుతంగా తీర్చిదిద్దాలనే కోరిక ఆ చైతన్యం వల్ల కలిగింది. వలస పాలన వున్న కాలంలో ప్రారంభమైన నూతన వ్యవస్థని కాలంచెల్లిన సాంస్కృతిక అలవాట్లను మార్చే ప్రయత్నాలపై కేంద్రీకరణ జరిగింది. అయితే, వలస పాలన తన ఆధిపత్యాన్ని స్థాపించేందుకు సాంస్కృతిక రంగంలో ప్రవేశించడం ఎక్కువైన పరిస్థితిలో ఆ రంగంలో గుణాత్మకమైన మార్పు

వచ్చింది. ఫలితంగా ఆ చైతన్యం అంతర్గతంగానే మలుపు తిరిగి గతించిన సంస్కృతిని తిరిగి పుంజుకోవడం చేశాయి. ఈ ప్రభావంతోనే గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. అలాంటి గణనీయమైన మార్పులు సాహిత్యంలోనూ గూడ.

దేశంలో వచ్చిన నూతన మార్పులను సాహిత్యం అందిపుచ్చుకొని సరికొత్త మార్గంలో తన ప్రయాణాన్ని మొదలుపెట్టింది. అలా వచ్చిన నూతన కోణమే నవల సాహిత్యం. జాతీయోద్యమం ప్రభావంతో సాహిత్యలో అనేక నవలలు వెలుగుచూశాయి. ప్రధానంగా ఆనాటి కాలంలో నవల కానీ, కథ కానీ ఇలా అనేక ప్రక్రియల వల్ల దేశంలో జరుగుతున్న తీరును సమీక్ష రూపంలో కావచ్చు, సూక్ష్మ రూపంలో కానీ తెలియజేయడానికి ముందుకు వచ్చాయి. సమాజంపై బలమైన ముద్ర వేస్తే, వాటిని ప్రభుత్వాలు నిషేధం రూపంలో తొక్కి పట్టాయి. సాహిత్యాన్ని మాత్రం తొక్కి పట్ట గలిగాయి కానీ, భావాల్నీ అణగదొక్కలేకపోయాయి. వాటి రూపంలో నుండి నాయకులు, నాయకత్వాలు వచ్చి దేశంలో అక్షరజ్ఞానం లేని పేద ప్రజలకు నాయకత్వం వహించేలా చేశాయి. వారిలో చైతన్యం నింపే శక్తిలాగా మార్చాయి. చివరికి వాళ్ళే సాహిత్య వస్తువులుగా మారిన సందర్భాలు సాహిత్యంలో కనిపిస్తాయి. సాహిత్యంలో వస్తువుతో పాటు సాంస్కృతిక అంశాలు కూడా ప్రధాన భాగస్వామ్యం వహించాయి.

ఆనాటి దేశం పరిస్థితులు అలా ఉంటే, తెలుగు నాట పరిస్థితితులు మరోలా ఉన్నాయి. ఇక్కడ నిజాం పరిపాలనలో ప్రజలు అనేక ఇక్కట్లు పడినట్లు చరిత్ర తెలుపుతుంది. ఆ కోణంలో అనేక ఉద్యమాలు వచ్చాయి. వాటికి నాయకత్వం వహించిన వారిలో ఒకరు కొమురం భీము.

తెలుగు నవలల్లో గిరిజన నేపథ్యం ఉన్న నవలలు చాలానే ఉన్నాయి. చిల్లర దేవుళ్లు, మోదుగుపూలు, జనపదం, ప్రజల మనిషి, గంగు మొదలైన నవలల్లో గిరిజన జీవితాల ప్రతిఫలనాలు ఉన్నాయి. వాళ్ళ ఆకలి కేకలు, బాధలు, లైంగిక వ్యవస్థ, పేదరికాలు, వారిపై దౌర్జన్యాలు లాంటి విషయాలను రేఖామాత్రంగానైనా ఆ రచయితలు చిత్రించారు. దేశంలో అనేక చోట్ల గిరిజనుల పైన దాడులు జరిగాయి. కానీ, తెలుగు ప్రాంతాల్లో వీళ్ళ పై జరిగిన దాడి మరింత ఎక్కువ అని చరిత్రకారులు వివరించారు. సంఘంలోని ప్రతివ్యక్తికీ ప్రత్యక్షంగా సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనే అవకాశం ఉండాలి. ప్రత్యక్షంగా సాంస్కృతిక కార్యక్రమాలలో భాగస్వామి కావడమంటే ప్రతి వ్యక్తి సాంస్కృతిక సృష్టికర్త అయినట్లే. అలాగే మనిషికి ఉపయోగపడే అనేక రంగాల్లో కూడా భాగస్వామి కావాలి. అలా భాగస్వామి అయిన వ్యక్తి కొమురం భీము. ఈ నవల 1980 లలో రాయబడిన నవల వస్తువు మాత్రం జాతీయోద్యమం ప్రభావితం అయిన కాలం. అందుకే ఈ అంశాన్ని నేను ఈ వ్యాస పరిధిలో తీసుకోవడం జరిగింది.

**పరిచయం**

మానవజన్మ అంటేనే పోరాటం. పోరాటం లేని జీవితం గానీ, జీవితం లేని పోరాటం గానీ ఉండదు. ఈ రెండు విడదీయరానివి. మనిషి ఉదయం లేచినప్పటి నుండి ఏదో ఒక రకంగా ఘర్షణ (పోరాటం)పడుతూనే ఉంటాడు. కొందరేమో బతుకు కోసం, మరికొందరేమో బతికించుకోవడం కోసం, ఇలా రకరకాలుగా చేస్తుంటారు. అందరి లక్ష్యం ఒక్కటే. ఈ రెండు లక్ష్యాలతో పోరాటం చేసిన ధీరుడు "కొమురం భీము". ఆదిలాబాద్ జిల్లాలో 1901లో జన్మించిన భీము మరణించేవరకు(1940) నిత్యం పోరాటంతోనే జీవితం గడిపాడు. దీనికి నిదర్శనం సాహు, అల్లం రాజయ్య రాసిన 'కొమురం భీము' నవలే సాక్ష్యం. కాళోజీ అన్నట్లు "పుట్టుక నీది, చావునీది బతుకంతా దేశానిది" అనే మాట నూరుపాళ్ళు కొమురం భీమ్‌కి సరిపోతాయి. మనం జీవించే వాతావరణం పోరాట యోధునిగా చేస్తే, ఆకలి మరికొందర్ని పోరాట యోధునిగా చేస్తాయనడానికి చరిత్రే సాక్ష్యం. అటువంటి చరిత్ర కల్గిన యోధుడు కొమురం భీం.

తెలుగు సాహిత్యంలో గిరిజన సాహిత్యం ఇది చెప్పుకోతగినస్థాయిలో రాలేదు. మౌఖిక కథలు, పాటలు, నృత్యం మొదలైనవి తొలుతగా లభించే ఆధారాలు. ఆ తరువాత మౌఖికతో పాటు, లిఖిత సాహిత్య (కథలు, నవలలు, చిన్నచిన్న కవితలు). వాటిని ఆధారంగా చేసుకొని గిరిజనులే స్వయంగా తమ బాధలను, అనుభవాలను సాహిత్య రూపంలో చిత్రించడానికి

ప్రయత్నం చేస్తున్నారు. సాహు, అల్లం రాజయ్య రాసిన (కొమురం భీము) నవలను ఆధారంగా చేసుకొని భీమ్ జీవితాన్ని పరిశీలించడమే ఈ వ్యాసం ఉద్దేశం.

'కొమురం భీము' నవల రచయిత సాహు, అల్లం రాజయ్య. భూమి సమస్య ఆనాది కాలం నుండి కొనసాగుతుంది. ఈ క్రమంలో అడవిలో జీవించే గోండులు తమ భూములు తమకే చెందాలని నైజాం ప్రభుత్వంతో పోరాటం చేస్తారు. ఆ పోరాటంలో గోండుల నాయకుడైన కొమురం భీము మరణిస్తాడు. ఆ పోరాట పరిణామాన్ని తెలియజేయడమే ఈ నవల ఇతివృత్తం. స్థూలంగా నవలను పరిశీలిస్తే...

**నవల ఇతివృత్తం:**

నవలలో ప్రధాన పాత్ర 'కొమరం భీము'. కోడి కూతతో సుర్ధాపురం అనే గోండు గూడెం నిద్ర లేస్తోంది. గోండులు నిరంతరం అడవి నుండి ఇప్పపూలను తెచ్చుకుంటుంటారు. వాటినే ఆహారంగా చేసుకుంటుంటారు. ఇప్పపూలను తెచ్చుకోవాలంటే వేకువ సమయంలోనే అడవిలోకి వెళ్ళవలసి ఉంటుంది. లేకపోతే అడవి జంతువులు వాటిని తినేస్తాయి. ఒకరోజు కొమురం భీం తమ వదినతో ఇప్పపువ్వు కోసం వెళ్తాడు. అప్పటికి భీంకి పదమూడు సంవత్సరాలుంటాయి. వయస్సుకు మించిన ఆలోచనలు. వదినతో ఏవేవో మాట్లాడుకుంటూ, కుటుంబ సాధకబాధల గురించి ఆలోచించుకుంటూ, ఇప్పపూలను ఏరుకొని ఇంటికి చేరుకుంటారు.

భీం తండ్రి 'చిన్ను'. చిన్ను గోండు గూడెం నాయకుడు. అతని కనుసైగలో గూడెం నడుచుకుంటుంటుంది. చిన్నుకి భీం, సోము, బొజ్జు అను ముగ్గురు కొడుకులు. బొజ్జుతో కలసి భీం జొన్నచేను కాపలాకి వెళ్తాడు. అడవుల్లో పంట పండించడమంటే ఎంతో కష్టపడాల్సి ఉంటుందని తెలుసుకుంటాడు. నిత్యం అడవి మృగాల బెడద. ఏదో చప్పుడుకు భీం లేసి, అటు ఇటు చూస్తాడు. అడవి పంది కనిపిస్తోంది. వెంటనే అడవి దద్దరిల్లేలా భీం అరుస్తాడు. చాకచాక్యంతో అడవి పందిని చంపి గూడెం అందరి దృష్టిలో పడ్తాడు. పంటలు సిద్ధం కావడంతో షావుకారి గూడెంకు వస్తాడు. షావుకారి కళ్లేలన్నీ తిరిగి ఇచ్చిన అప్పు కింద పంటను కొలుచుకుంటుంటాడు. పది రూపాలు ఇచ్చి అంతకు అయిదు రెట్లు చేసే పంటను గోండుల నుండి తీసుకుంటుంటే, దాన్ని చూసి భీం తట్టుకోలేకపోతాడు.

ప్రకృతిలో దొరికే సర్వ సంపద ఏదో ఒక రకంగా అయిపోతుంటుంది. ఎండకాలం వస్తోంది. ఎండకాలం వచ్చిందంటే గోండులకు కరువు ఏర్పడుతుంటుంది. తాగడానికి నీళ్ళుండవు. తినడానికి ఏమీ దొరకదు. ఎక్కడ చూసినా కరువే. మంచినీటి కోసం కొన్ని మైళ్ళ దూరం పోవాల్సింటుంది. అయినా కొన్ని సార్లు దొరకవు.

'భీం' తన స్నేహితులతో కలసి మేకలను మేపుకోవడానికి అడవికి వెళ్తాడు. ఆ అడవిలో మేకలకోసం చెట్ల కొమ్మలను నరకుతాడు. చెట్ల కొమ్మలను నరికినందుకు, పైగా అడవిలో చెప్పకుండా, పన్ను చెల్లించకుండా మేకలను మేపినందుకు భీంతో పాటు ఉన్న వాళ్ళందరిని చౌకీదార్లు పట్టుకుంటారు. కొమ్మ నరికిన 'పైకు' చేతి వేళ్లను నరికేస్తారు. నష్టపరిహారం కింద కొన్ని మేకలను తీసుకుంటారు. ఇదంత చూసి 'భీం' జీర్ణించుకోలేకపోతాడు.

సాధారణంగా గోండులు పంట భూముల కోసం అడవులను నరుకుతుంటారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా దట్టమైన అడవిని నరికి పంట భూములుగా తయారు చేస్తారు. ఆ తరువాత పంట భూములు మా పట్టా భూములని అధికారులు స్వాధీనం చేసుకుంటుంటారు. అమాయకులైన గిరిజనులు(గోండులు) ఏమి అనలేక అక్కడి నుండి మరొక ప్రాంతానికి చేరుకుంటుంటారు. ఇదే గిరిజనుల జీవిత దినచర్యగా మారిపోతుంటుంది. ఇందుకోసం 'రాంజీ' గోండు లాంటి మహానీయుడు గోండు జాతి కోసం పోరాటం చేసి, ఆంగ్లేయుల కక్ష్యపూరిత దాడిలో ఉరికంబం ఎక్కాడని చిన్ను భీంతో చెప్పాడు. రాంజీ గోండు చరిత్ర విన్న భీంకి రక్తం ఉడికిపోతుంది. మరింత పట్టుదల ఏర్పడుతుంది. కొన్ని రోజుల తర్వాత భీం తండ్రి చిన్ను చనిపోతాడు.

చిన్ను మరణించిన తర్వాత గూడెం బాధ్యతను చిన్ను సోదరుడు 'కుర్దు' తీసుకుంటాడు. తుడుం మోగించి చిన్ను చనిపోయే ముందు చెప్పిన మాటలు అందరికి చెప్తాడు. తుడుం అంటే డప్పు చాటింపు లాంటిది. ఏదైనా ఆపద వచ్చినా, ఏదైన శుభాకార్యం చేయాలన్న తుడుం మోగించడం గోండుల ఆనవాయితీ. మా అన్న చనిపోతు ఈ గూడెం వదిలి, మరొక చోటికి వెళ్ళిపోండని చెప్పాడు. ఇక్కడికి వచ్చి చాలా సంవత్సరాలు అవుతుందని, అందువల్ల పంటలో సారం తగ్గిపోయిందని చెప్పాడు. కానీ, ఎవరు వెళ్లరు. 'కొమురం' సంతతి వారు మాత్రమే వెళ్తారు. కొత్తగా ఏర్పడిన గూడెంకు కూడా కూర్థు నాయకుడుగా బాధ్యత తీసుకుంటాడు. అందరు కలసి అడవిని నరికి పంటలు వేస్తారు. పంట పండడానికి సిద్ధంగా ఉంటుంది. పంటకోసేముందు పెద్ద దేవుడికి పూజలు చేస్తారు. అంతలో 'సిద్దిక్' అనే ప్రభుత్వ అధికారి మరికొంత మంది సైనికులను వెంటబెట్టుకొని కొత్తగా ఏర్పడిన గూడెంకు వస్తాడు. వచ్చి పన్ను కట్టడని, ఇవి మా పట్టా భూములని చెప్తాడు. అంతటితో ఆగక ఇష్టం వచ్చినట్టు గోండుల ఇండ్లకు నిప్పు పెట్టిస్తుంటాడు. దాంతో కట్టలు తెంచుకున్న కోపంతో భీం సిద్ధిక్‌ని చంపి పారిపోతాడు. రెండు రోజులు ఆ అడవుల్లోనే తిరుగుతూ, తర్వాత పాత ఊరికి వచ్చి 'కొండల్' అనే స్నేహితుడిని కలుసుకుంటాడు. అప్పటికి భీం సిద్ధిక్‌ని చంపిన వార్త అందరకి తెలిసిపోతుంది.

భీం, కొండల్‌తో కలసి రాష్ట్రం దాటి వెళ్ళిపోతారు. కొన్ని రోజులు అలా తిరిగినన్ని ప్రాంతాలను తిరిగి, తెలుసుకోవలిసిన విషయాలను తెలుసుకొని బాల్లార్షా చేరుకుంటారు. ఆ స్టేషన్‌లో 'విటోబా' అనే వ్యక్తి పరిచయం అవుతాడు. అతడు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పత్రిక నడుపుతుంటాడు. కొన్ని రోజులు భీం, కొండల్ అతడి దగ్గర ఉంటారు. చాలా రోజులు అయిపోయే సరికి కొండల్ తిరిగి వెళ్తానని చెప్పడంతో భీం అతనిని తిరిగి పంపిస్తాడు. భీం మాత్రం విటోబా దగ్గర చదవడం, రాయడం నేర్చుకుంటాడు. కొన్నాళ్లకు విటోబాను అరెస్టు చేయడంతో భీం ఒంటరివాడైపోతాడు. తిరిగి బాల్లార్షా రైల్వేస్టేషన్‌కు చేరుకుంటాడు.

అనుకోకుండా మళ్లీ బాల్లార్షా స్టేషన్‌లో తెలుగు మాట్లాడే వాళ్ళు భీంకు పరిచయం అవుతారు. వారు కూలీ కోసం అస్సాం ప్రాంతానికి వెళ్ళుతున్నామని, వీలైతే నువ్వు కూడా రావచ్చని చెప్పి తీసుకెళ్తారు. 'భీం' అక్కడ కొన్ని సంవత్సరాలు పాటు పని చేస్తాడు. అక్కడ ఉన్నప్పుడు బ్రిటీష్ వాళ్ళకి వ్యతిరేకరంగా అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం గురించి తెలుసుకుంటాడు. అప్పటికే తనకు ఎదురైన సంఘటనతో పాటు, మహనీయుల పోరాటం గురించి వినడం వల్ల మరింత చైతన్యవంతుడవుతాడు. అస్సాం నుండి ఏదో ఒక రకంగా తప్పించుకొని తమ ప్రాంతానికి చేరుకుంటాడు భీం.

'భీం' తిరిగి రావడం చూసిన తల్లి, అన్నలు, వదినెలు, పిల్లలు అందరు సంతోషిస్తారు. కొన్ని రోజుల తర్వాత భీం 'దేవడం లచ్చుపటేల్' దగ్గర పన్లో కుదురుకుంటాడు. అక్కడ కొన్ని రోజులు పనిచేస్తాడు. అప్పటి వరకు దేవడంలో ఎవరికి తెలియని పంటలు పండిస్తాడు. చాలా కాలంగా ఉన్న లచ్చుపటేల్ భూమి సమస్యను భీం పరిష్కరిస్తాడు. భీం అస్సాంలో ఉన్నప్పుడు హిందీ, ఉర్దూ భాషలను నేర్చుకుంటాడు. అవి ఇక్కడ ఎంతో ఉపయోగపడ్తాయి. ఇక్కడ నైజాం అధికారులు హిందీ, ఉర్దూ భాషలే ఎక్కువ మాట్లాడేవారు. పైగా ఈ భాషలను మాట్లాడేవారిని గౌరవించేవారు. దాంతో భీం పేరు గ్రామగ్రామానికి తెలుస్తోంది. లచ్చుపటేల్ స్వయంగా 'సోంబాయి' అనే గోండు యువతితో 'భీం' పెండ్లి జరిపిస్తాడు. కొన్ని రోజుల తర్వాత 'పైకుబాయి' అనే గోండు స్త్రీని భీం రెండో పెండ్లి చేసుకుంటాడు.

కొన్ని రోజుల తర్వాత 'కూర్దు' గూడెం వాళ్ళనందర్ని పిలిచి మాట్లాడుతాడు. మనకు భూమి సమస్య తీరడం లేదు. 'భీం' అన్ని భాషలు నేర్చుకున్నవాడు. మన తరపున ప్రభుత్వంతో మాట్లాడానికి భీంను తెచ్చుకోవాలని నిర్ణయించుకుంటారు. తమ జాతి నాయకుల నిర్ణయాన్ని భీం కాదనలేకపోతాడు. వెంటనే లచ్చుపటేల్ దగ్గర నుండి వచ్చేస్తాడు. గోండు జాతి కోసం కృషిచేయాలని అనుకుంటాడు. అప్పటి నుండి భీం బాబేఝరిలో ఉన్న పన్నెండు గూడాల గురించి ఆలోచిస్తుంటాడు. పన్నెండు గూడాలను ఏకం చేసి అడవిని నరకండని చెప్తాడు. దానికి వ్యతిరేకంగా పోలీసులు గోండులపై కేసులు పెడ్తారు. కేసుల పెట్టి కోర్టుల చుట్టూ తిప్పుతారు. చివరికి పోరాటమే మార్గమని చెప్పి 12 గ్రామాలకు తెలియజేస్తాడు. పన్నెండు గ్రామాలపై అధికారమంతా మనదని ప్రకటించుకుంటారు. దాంతో గూడెం వారందరు 'భీం'ని దేవుడని అనుకుంటారు.

పన్నెండు గ్రామాలపై అధికారం ప్రకటించుకున్న తర్వాత కొన్నాళ్ళు పంటలు పండించుకుంటారు. గూడెంకు ఇంతకుముందు వచ్చినట్లు పోలీసులు రారు. అయినా భీం ఏనాడు వెనకడుగు వేయకుండానే పోలీస్ వారి ఎత్తులకు పై ఎత్తుల గురించి గూడెం వారందరితో చర్చిస్తూ ఉంటాడు. కొన్ని రోజుల తర్వాత పోలీసులు రావడం, వాళ్ళని గోండులు తరమడం జరుగుతుంటుంది. చివరికి పోలీసులు గోండుల గుడిసెలను కాల్చేయడం, పంటకు సిద్ధం చేసుకున్న పొలాన్ని పాడు చేయడం చేస్తుంటారు. దీంతో విసిగిపోయిన ప్రజలు పరిష్కారం కోసం ఆలోచిస్తుంటారు.

కొంతమంది సలహాపై 'భీం' 'మహదు' 'రఘు'తో కలసి నైజం రాజును కలవడానికి హైదరాబాదు వెళ్తారు. అక్కడ కూడా భీం కి నిరాశే ఎదురవుతుంది. రాజు కలవడు. కలిసిన మంత్రి మీరు అడవులను నరుకుతున్నారని తిట్టి పంపిస్తాడు. భీం హైదరాబాదు నుండి తిరిగి వచ్చేలోపు పోలీసులు జోడెన్ ఘాట్‌ను సర్వనాశనం చేస్తారు. స్త్రీలను పాడు చేస్తారు. అది చూసిన భీం తన కోపాన్ని అణుచుకోలేక కాలిన జోడెన్‌ఘాట్ నుండి యుద్ధం చేయాలని ప్రకటిస్తాడు. పోలీసుల లాగా వివిధ ప్రణాళిక తయారుచేస్తాడు. అప్పుడే యుద్ధానికి వచ్చిన పోలీసుల్ని, భీం తమ దగ్గర ఉన్న యుద్ధ సామాగ్రితో ఓడిస్తాడు. ఎదురుదెబ్బ తగలడంతో పోలీసులు పై అధికారులకి తెలియజేస్తారు. భీం మాత్రం మా రాజ్యాన్ని పరిపాలించే హక్కు కావాలంటాడు. ప్రభుత్వం మాత్రం పన్నెండు గ్రామాలలో ఉన్న భూములకు పట్టాలు చేసిస్తామని చెప్తోంది. అయినా భీం మాత్రం పరిపాలన అధికారం కావాలని పట్టుపట్టడంతో చివరికి యుద్ధం తప్పలేదు.

పన్నెండు గ్రామాల్లో పండిన పంటల్లో సగభాగం ప్రభుత్వానికి ఇవ్వడం లేదు. ప్రజలు సంతోషంగా ఉంటున్నారు. గ్రామస్తులంతా పండిన పంటల్లో కొంత భాగం భీం సైన్యానికి ఇస్తున్నారు. భీం యుద్ధ కేంద్రం జోడెన్‌ఘాట్. అది గుట్టపై ఉండడంతో భీం సైన్యాన్ని జయించడం పోలీసులకు తరం కాలేదు. బలహీనతను ఆసరాగా చేసుకొని నైజాం పోలీసులు, భీం యుద్ధ ప్రాంతానికి ధాన్యం చేరకుండా కింద నిర్బంధం చేశారు. దాంతో కొన్ని రోజుల తరువాత సైన్యానికి తినడానికి ఆహారం దొరకదు. ఏదో ఒక రకంగా పోలీసులు జోడెన్‌ఘూట్‌ని జయిస్తారు. ఆ సైన్యంలో 'భీం' ఎవరో నైజాం పోలీసులకు తెలియదు. కుర్దు అనే ఊరి షావుకారి సహాయంతో తెలుసుకొని నైజాం అధికారులు భీంని కాల్చి చంపుతారు. దాంతో నవల ముగుస్తుంది.

**నవల – జాతీయోద్యమ ప్రభావ విశ్లేషణ:**

నవల ఇతివృత్తాన్ని పరిశీలించాక అనేక వాస్తవ విషయాలు తెలిసివస్తున్నాయి. కొమురం భీము నిజమైన నాయకుడుగా నిలిచాడు. మనిషి మానవ జీవితంలో బంధానుబంధాలు, సుఖదుఃఖాలు అనేవి ఏ విధంగా రూపుదిద్దుకొన్నాయో ఈ నవల ప్రస్తావించింది. ప్రధానంగా 1. అస్తిత్వం 2. మానవుడి అన్వేషణ 3. మతం 4. కులం 5. రాజకీయ దృక్పథం 6. సాంఘీకీకరణ 7. వలస వాదం 8. ఆకలి 9. భూమి సమస్య 10. స్త్రీలపై దోపిడీ మొదలైన విషయాల చాలా బలంగా ఎదుర్కొంటూ ప్రజల్లో మరింత చైతన్య నింపిన ఉద్యమం జాతీయోద్యమం.

భారతదేశంలో గిరిజనులు అనాది నుండి ఉన్నారా! లేదా మధ్యయుగ భారతదేశంలో వచ్చారా! అనే విషయాలు పరిశీలిస్తే ఒకప్పుడు ప్రపంచంలో ఉన్నా వారందరూ ఆటవికులేనని వివిధ పరిశోధనలు తెలుపుతున్నాయి. ఆ క్రమంలో మనిషి అడవి నుండి, గ్రామీణ ప్రాంతానికి, ఆ తర్వాత నాగరిక జీవితాన్ని అలవరచుకున్నాడు. కొంత పరిజ్ఞానం ఏర్పరుచుకున్న తర్వాత పట్టాణాన్ని నిర్మించుకున్నాడు. కానీ, గిరిజనులు అని ముద్రవేసుకున్న కొన్ని తెగలు మాత్రం అడవుల్లోనే ఉండిపోయాయి. ప్రపంచం అభివృద్ధి వైపు ప్రయనిస్తుంటే గిరిజనులు అడవి నుండి బయటికి రాక, మరింత అడవుల్లోనే ఉండిపోయారని వివిధ ప్రాంతాలు, భాషల సాహిత్యాలను పరిశీలించాక తెలిసివస్తుంది. కాబట్టి గిరిజనుడు ప్రాచీన కాలానికే చెందినవాడు.

"భారతదేశంలో 19, 20 శతాబ్దాలలో కొన్ని గిరిజన పోరాటాలు జరిగాయి" (Pg: 39.Tribal Freedom Fighters of India). హైదరాబాదును రాజధానిగా చేసుకొని పరిపాలిస్తున్న నిజాం ప్రభుత్వ పాలనలో కూడా కొన్ని పోరాటాలు జరిగాయి. అటువంటి పోరాటాలలో కొమురం భీము పోరాటం ఒకటి. కొమురం భీము గోండి తెగకు చెందినవాడు. గోండు తెగ గిరిజన

తెగలలో ఒకటి. 2001 జనాభా లెక్కల ప్రకారం 661 గిరిజన తెగలు దేశవ్యాప్తంగా జీవనం సాగిస్తున్నాయి. తెలంగాణ మరియు ఆంధ్ర రాష్ట్రాలలో 35 తెగలు ఉన్నాయి. వాటిలో గోండి ఒకటి.

ఈ నవలలో చిత్రించిన సంఘటనలకు, భీం జీవితానికి కొంత వ్యత్యాసం ఉంది. ఎందుకంటే రచయితలకు పూర్తిస్థాయిలో ఆధారాలు లభించనందువల్ల కొన్ని సంఘటనలను వాస్తవంగా, మరికొన్నింటిని కల్పనంగా చిత్రించిన సంఘటనలు ఇందులో ఉన్నాయి. “1925 నుండి 1940 మధ్యకాలంలో నిజాం అధికారులను అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టిన వ్యక్తి భీం”. భీం పోరాటం స్వార్థంతో కూడుకున్నదా?లేక ప్రజల కోసం చేసిన పోరాటమా? అనే విషయాలు పరిశీలించాలి. చరిత్రలో స్వార్థం కోసం పోరాటం చేసిన వ్యక్తులు, మరికొందరు ఆదర్శం కోసం పోరాటం చేసిన వ్యక్తులుగా కనిపిస్తారు.

ఆదిమ మానవుడు అడవుల్లో జీవించాడు. గిరిజనుడు కూడా అడవుల్లోనే జీవించాడు. ఆదిమ మానవుడ్ని గురించి నేటికి అనేక పరిశోధనలు సాగుతూనే ఉన్నాయి. అలాగే రానున్న కాలంలో గిరిజనులపై ఎక్కువ పరిశోధన జరిగే అవకాశం ఉంది. అడవి అంటేనే గుర్తుకువచ్చేది గిరిజనుడు. అడవితో ఆత్మీయానురాగం ఉంటుంది. అడవిని కన్నతల్లిలా భావిస్తాడు. ప్రకృతి బీభత్సాలు వచ్చి నష్టం కలిగితే తన కన్న తల్లికి నష్టం వాటిల్లిందని బాధపడ్తాడు. అడవినే నమ్ముకోవడం వల్ల తన సాధక బాధలను అడవి అనే కన్నతల్లితో పంచుకుంటాడు. ఏడుస్తాడు. అడవి ఓదారుస్తుందని పరవశించిపోతాడు. తన బాధలను వినీ వర్షాన్నిస్తుందనుకుంటాడు. దాంతో ఎంతో పరవశించి పోతాడు. అదే మానవునికి ప్రకృతితో ఉన్న సంబంధం. అలాంటి కన్న తల్లి లాంటి అడవి నేడు గిరిజనుడికి కాకుండా పోతుంది. నేడు అడవిని చుద్దామంటే వందల కిలోమీటర్లు వెళ్లితే గాని కనిపించని పరిస్థితి. అందువల్ల గిరిజనుడు అడవుల్లో పొందినంత ఆనందం మామూలు సమాజంలో పొందలేకపోయాడు. అడవుల్లో ఉన్నప్పుడు కరువు వచ్చినప్పుడు కూడా కావలసిన పదార్థాలు దొరికేవి. కానీ, నేడు అవి తినలేక కొనుక్కునే సామర్థ్యం లేక మూగవాని లాగా ఉండిపోతున్నాడు. ఈ విషయాన్ని ఈ నవల తేల్చి చెప్పింది.

మనిషి జీవన మనుగడ కోసం మొదటగా పోరాటం చేసింది ఆకలిని తప్పించడం కోసం. ఆ ఆకలి మనిషిని ఎటువైపునా తీసుకెళ్తుందని కొమురం భీమును పరిశీలించాక తెలుస్తోంది. చిన్నతనంలో తన వాళ్ళు పడుతున్న కష్టాలను చూడలేక ఊరు దాటి వేరే ఊరికి వెళ్ళిన వ్యక్తి భీము. భీము జీవన మనుగడ కోసం ఎన్నో ప్రాంతాలను దాటి అస్సాం చేరుకొని తన ఆకలిని తీర్చుకున్నాడు. తన ఆకలి తీరాక తన వాళ్ళ ఆకలిని తీర్చాలనే స్పృహతో అస్సాం నుండి తిరిగి వచ్చి ‘తన కోసం కాకుండా తన వాళ్ళ కోసం’ గా ఎదురు నిలిచాడు. ఈ క్రమంలో ఎన్నో కష్టాలు పడ్డాడు. ఆకలి తీర్చుకోవాలంటే మనిషికి భూములు కావాలి. భూములు కావాలంటే అడవులను నరకాలి. అడవులను పంటభూములుగా మార్చుకున్న తర్వాత ఆ భూములు తనవి కాకుండా పోతుండేవి. అడవుల్లోనే ఉంటున్న గిరిజనులు అడవిని పంటభూమిగా మార్చుకున్న తర్వాత అధికారులు ఆ భూములు మావి అని తీసుకునే వారని ఈ నవల వివరిస్తుంది.

పూర్వకాలంలో రాజులు సామ్రాజ్య విస్తరణ అనే పేరుతో భూమిని ఆక్రమించుకునేవారు. గిరిజనులు మాత్రం నిరంతరం పోరాటం చేస్తూ, అధికారుల చేతిలో బానిసలుగా బతుకుతూ వస్తున్నది కేవలం భూమి కోసమే. మానవ పరిణామదశలో భూమిపై మనిషి వ్యవసాయం చేయడం ఒక గొప్ప పరిణామదశ. మానవుడి కోసం భూమి కాదు, భూమికోసం మానవుడు. ఆ పరిణామదశలో భూమిని సాగుచేయడంలో నిష్ణాతుడైనవాడే రైతు. వాడికే భూమిమీద హక్కు. ‘దున్నే వాడిదే భూమి అన్నట్టు’ సారవంతమైన భూమిని ఆశించే గిరిజనుడు ప్రకృతి వైపరీత్యాలతో, క్రూరమృగాలతో చేసిన పోరాటాల నుండి బయటపడిన గిరిజనుడు, ఏనాడు కూడా తను సాగుచేసే భూమిపై హక్కు కావాలని కోరుకోలేదు. అలా తరతరాల నుండి తనదైన శైలిలో జీవితాన్ని గడుపుకుంటూ వచ్చాడు. కానీ ఆధునిక కాలంలో అసలైన సమస్య ఎదురైంది. అదే భూమి సమస్య. గిరిజన సాహిత్యం పలు భాషలో ప్రారంభమైందంటే అది కేవలం భూమి సమస్య వల్లే. అరుంధతీ రాయ్, మహాశ్వేతదేవీ, గోపీనాథ్ మహంతి లాంటి ప్రముఖ రచయితలు గిరిజన సాహిత్యాన్ని రాయటానికి, రాయాలనే అసక్తి కలిగించిన వస్తువు గిరిజనుల భూమి సమస్యే ప్రధాన

కారణం.

గిరిజనులకు గూడెంలో ఎదురౌతున్న సమస్యల్లో అధికారుల వేధింపు సమస్య మరీ ఎక్కువగా ఉంటుంది. ఒక అధికారి గూడెంకు వచ్చి తనకు కావల్సిన ఆహారాన్ని తినడానికి ఎప్పుడుపడితే అప్పుడు ఏర్పాటుచేయాల్సి ఉంటుంది. లేకుంటే జరిమానాలు విధిస్తాడు. అధికారుల భయంతో అమాయకమైన గిరిజనులు కోరుకున్న వాటిని ఏర్పాటు చేయకతప్పదు. కొన్ని సందర్భాల్లో దొర, లేక ఆ ఊరి యాజమాని, ప్రభుత్వ అధికారి తమ తమ సందర్భాన్ని బట్టి ఏదైనా ఒక శుభకార్యం లాంటిదో లేక ఏదైనా పండుగ వస్తే ఆ సమయంలో వాటికి సరిపడ ధాన్యాన్ని, పండ్లను, తేనెను, పూలను, కోయడానికి మేకలు మొదలైనవి ఇవ్వలేకపోతే ఇంటికి ఇంత జరిమానాకట్టవల్సి ఉండేది. లేకపోతే పొరపాటునా ఏదైనా తప్పు జరిగితే దానికి ఎదురయ్యే పరిణామాలు గిరిజనులు తట్టుకునే స్థాయిలో ఉండవు. అందువల్ల గిరిజన ప్రాంతాల్లో అధికారుల మోసాన్ని రచయితలు జాగ్రత్తగా పట్టుకున్నారు.

గిరిజనులు తమకు తెలియని దశలో గూడేం (తండా)కు షావుకారి వస్తున్నాడంటే ఆనందించేవాడు. తమకు కావలసిన వస్తువులను కొనుక్కోవచ్చుననే ఆలోచనతో అధికంగా సంతోషపడేవాడు. కానీ అది ఎంతవరకు వాస్తవమో ఈ నవలలో తెలిసి వస్తోంది. అనాదిగా అమాయకంగా అడవిలో జీవించే గిరిజనులు, అక్కడ దొరికే పండ్లూ, దుంపలూ, జంతువులూ మొదలైనవి ఏవి దొరికితే వాటిని తిని జీవనం గడుపుతుంటారు. పూటగడవని గిరిజనులు వ్యాపారం చేసి లాభాలు గడిస్తారా? అనే ప్రశ్న రాకమానదు. ఎంత నాగరిక సమాజానికి దూరంగా ఉన్నప్పటికీ ప్రతి మానవుడికి కనీస అవసరాలు ఉండటం సహజమే. అలా గిరిజనులకు కనీసావసరాలైన ఉప్పు, పప్పు, బెల్లం, పొగాకు మొదలైన వాటిని షావుకార్ల వద్ద తీసుకొని, గిరిజనులు అడవుల్లో అనేక అపాయాల నుండి తప్పించుకొని సంపాదించిన చింతపండు, తేనె, తుమ్మబంక, ధాన్యం మొదలైన వాటిని బదులుగా ఇచ్చేవారు. షావుకార్లు కిలోఉప్పు ఇచ్చి బదులుగా గిరిజనుల దగ్గర నాలుగు కిలోల చింతపండు తీసుకునేవాడు. గిరిజనుల అవసరాన్ని ఆసరాగా తీసుకొని షావుకార్లు అధికంగా వస్తువులను రాబట్టుకొనేవారు. ఇలా ప్రతి గిరిజన షావుకార్లు దోపిడీలు చెలాయించేవారు.

గిరిజనుల గ్రామాల్లో షావుకారు రాక ముందు వాళ్ళ జీవితం సుఖంగా సాగుతుండేది. ఎందుకంటే అప్పటివరకు ఏమీ రుచులు తెలియని గిరిజనులకు కొత్త రుచులు, కొత్త ఆశలను కల్పించారు. కొత్త జీవితం ప్రారంభించండి అని పురికొల్పారు. దాంతో తెలిసి తెలియక గిరిజనులు షావుకార్లు మాయలో పడ్డారు.'కొమురం భీము' నవలలో "*పంటకాలం కనుక ఆ వంకలు తిరిగిన బండ్లబాట మీద జనం ఎప్పటికన్నా ఎక్కువ తిరుగుతున్నారు. గూడెంలోని గోండులు, కొలాములు పండించిన జొన్నలు, కందులు, నువ్వులు ఒకటేమిటి అన్నీ ఈ వంకలు తిరిగిన బండ్లబాట మీదనుంచే గునగున నడిచిపోతాయి. అతి తక్కువ ధరకు లేదా ఎప్పుడో యిచ్చిన అప్పులకింద షావుకార్లు వీటన్నిటిని దోచుకపోతారు. పండించిన గోండులకు, కొలాములకు లెక్కల తిరకాసు అర్థం కాక విస్తుపోతారు. ఆ సంపదను కొల్లగొట్టిన వాళ్లు జనగామలో మేడలు మిద్దెలు గట్టి కులుకుతున్నారు. పట్టణాలల్లో వ్యాపారం లాభసాటిగా లేదని వ్యాపారస్థులు నైజాంకు నజరానాలు సమర్పించి గూడాలపై బడ్డారు. గంపల్లో సరుకులు బెట్టుకొని గూడెం గూడెం తిరిగి అమ్మారు. గుంటూరు పొగాకు తాగి చూడమన్నారు. చాయ్‌పత్తీ దూరదేశం నుంచి తెచ్చినామన్నారు. దీని తీపి చూడండని బెల్లం మట్టలకు రాసి నాకించారు. ఉప్పు మీ బతుకులో రుచీ పచీ తెస్తుందన్నారు. మీ గుడెమంతా వెలుగులు నింపే గ్యాసు నూనె ఇది కొనండని చెప్పారు. రంగుల గుడ్డలు చూయించి ఊరించారు. మీ కోసం మీ యింటి ముందుకు తెస్తున్నాం అన్నారు. ఈ వస్తువుల వెల తెలియని అమాయకులైన ఆదివాసులు వాళ్లముందు తమ వస్తువుల కుప్పలు బోశారు. ఆ విధంగా వాళ్లు షావుకార్ల మాయల్లో ఇరుక్కుపోయారు, అడవి సంపదంతా ఉప్పు, బెల్లానికే దొర్లిపోయింది.*" (పుట:17) ఈ విధంగా గిరిజనులకు కొత్త వాటిని పరిచయం చేసి షావుకార్లు ఏ విధంగా దోచుకున్నారో పై వర్ణన షావుకార్ల వాస్తవ జీవితానికి అద్దం పడుతుంది.

కొమురం భీము నవలలో కేవలం పోరాటమే కాకుండా గోండుల ఆచార సంప్రదాయాలను కూడా చిత్రించారు. గిరిజనుల ఆచార సంప్రదాయాలు గిరజనేతరుల ఆచారానికి తేడా ఉంటుంది. ఎందుకంటే ఇప్పటికి గిరిజనులు అడవుల్లోనే జీవిస్తున్నారు. అడవి సంప్రదాయమే ఉంటుంది. కాబట్టి ప్రపంచీకరణ నేపథ్యంలో గిరిజనుల ఆచారం ఒక ఆదర్శంగా నిలుస్తుందని భావించవచ్చు. దానికి కారణాలు ఇప్పుడు చాలా సినిమాలల్లో, టివీలలో గిరిజన దుస్తులు ఒక ప్రత్యేకమైన ఆకర్షణ. ఈ విషయాలను కూడా ఈ నవలలో చిత్రించారు.

గిరిజనులకు ఒక రాజ్యం కావాలని, వారికి భూములపైన హక్కులు కావాలని పోరాటం చేసిన వ్యక్తి భీము. ఆధునిక కాలంలో గిరిజనులు రాజ్యం పొందకపోయినా, కొంతవరకు భూముల పైన హక్కును పొందారని భావించవచ్చు. కొమురం భీము 'జల్, జంగల్, జమీన్' కోసం అలు పెరగని పోరాటం చేసి అమరుడుగా నిలిచిన వ్యక్తిగా ఈ నవల నిరూపిస్తుంది. కొమురం భీము తన వాళ్ళ కోసం ఒక మార్గాన్ని నిర్దేషించిపోయాడు. ఆ మార్గంలోనే గిరిజనులు నడుస్తున్నారని ఆశించవచ్చు. కొమురం భీము అలా చైతన్యవంతం కావడానికి జాతీయోద్యమ కాలం కూడా అతనికి కలిసివచ్చింది. పుట్టిన నాట ఇటువంటి పోరాట సమయం లేకపోతే ఇంతపెద్ద ఉద్యమానికి నాంది పలికేవాడు కాదు.

మనం ఎంచుకున్న లక్ష్యానికి ప్రత్యేకత ఉంది. ఈ లక్ష్యానికి ఉన్న బరువు, బాధ్యతలు మరింత విస్తృతం అవుతాయి. మనం చెప్పేదానికీ, చేసేదానికీ విస్తృతం అవుతాయి. మనం చెప్పేదానికీ, చేసేదానికి విస్తృతమైన ప్రభావం ఉంటుంది. ఈ కృషిలో మనం విజయం సాధిస్తాం అన్న విశ్వాసం జాతీయోద్యమ కాలం ఇచ్చింది.

**ఉపయుక్త గ్రంథాలు**

1. బి.కృష్ణకుమారి. (సం)1992. గరిమెళ్ళ వ్యాసాలు. తెలుగు విశ్వవిద్యాలయం. హైదరాబాద్.
2. తెలకపల్లి రవి. (సం). 2014. ప్రపంచీకరణ సంస్కృతి. ప్రజాశక్తి బుక్‌హౌస్. హైదరాబాద్.
3. సాహు, అల్లం రాజయ్య. 1983. కొమురం భీము. జోడెన్‌ఘాట్: ఆదివాసి ప్రచురణలు.
4. లియో హ్యూబర్‌మన్. 1997. మానవుడు సంపద సమాజం. ప్రజాశక్తి బుక్‌హౌస్, హైదరాబాద్.
5. డా. రమేష్, జరుపుల. 2018. తెలుగు నవల –గిరిజన జీవన చిత్రణ. ఆదిత్య పబ్లికేషన్: ఖమ్మం.
6. A.R.N. Srivastava. 1986. Tribal Freedom Fighters of India. Ministry of Information and Broadcasting government of India.

# మల్లాది రామచంద్రశాస్త్రి - జాతీయోద్యమ గేయాలు

**దారపురెడ్డి కనకమహాలక్ష్మి,** తెలుగు అధ్యాపకురాలు, శ్రీ చిట్టూరి ఇంద్రయ్య స్మారక ప్రభుత్వ కళాశాల, తణుకు

సహితస్యభావం సాహిత్యం అన్నారు. అంటే సాహిత్యం అనేది సమాజానికి మంచి చేసేదిగా ఉండాలి అని అర్థం. ఏ సాహిత్యంలోనైనా, ఏ సాహిత్య ప్రక్రియలోనైనా సరే ఆనాటి సాంఘిక అంశాలు మిళితమై ఉంటాయనేది కాదనలేని సత్యం. అయితే సమాజంలోని భావనలను మార్చడానికి సాహిత్యం అనే దానిని ఒక ఆయుధంలా మార్చడం కూడా మనకు కనిపిస్తుంది. అలా మన జాతీయోద్యమ సమయంలో మన భారతీయులలో ఇది మనదేశం, మనదేశాన్ని మనం బానిసత్వం నుండి విముక్తి చేయదానికి పాటుపడాలి, అనే దేశభక్తిని పురికొల్పేలా చాలా మంది కవులు, రచయితలు తమ సాహిత్యం ద్వారా ప్రయత్నించారు. సాహిత్యంలోని వివిధ ప్రక్రియల ద్వారా అంటే కథలు, నవలలు, గేయాలు, కవితలు, కావ్యాలు, పాటలు ద్వారా సమాజంలో దేశభక్తి పెరిగేలా ప్రజలను ఉత్సాహ పరిచేలా రచనలు చేశారు.

ఇటువంటి ప్రక్రియలలో గేయ ప్రక్రియ అనేది చాలా ప్రాచుర్యాన్ని పొందింది. చిన్నపిల్లలు సైతం లాలిపాట పాడితే హాయిగా నిద్రపోతారు. అందరికీ అర్థమయ్యే విధంగా సరళమైన భాషలో, పాటను తూటాగా మలిచి, మన తెలుగునేలలో, తెలుగు ప్రజానీకంలో దేశభక్తి భావనను పురికొల్పే విధంగా ఎందరో కవులు దేశభక్తి గేయాలను రచించారు. చిలకమర్తి లక్ష్మీనరసింహం రాసిన "భరత ఖండంబు చక్కని పాడియావు" అనే గేయం, రాయప్రోలు సుబ్బారావుగారి "ఏ దేశమేగినా ఎందు కాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని" అనే గేయం, గురజాడ అప్పారావు గారి "దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్" అనే గేయం, త్రిపురనేని రామస్వామి గారి "వీరగంధము తెచ్చినారము వీరుడెవ్వడో తెల్పుడి" అనే గేయాలు ప్రముఖంగా తెలుగువారిలో స్వాతంత్ర్యకాంక్షను రగుల్కొల్పాయి. అలా గేయాల ద్వారా స్వాతంత్ర్య అభిలాషను పురికొల్పేలా గేయాలను రాసిన వారిలో మల్లాది రామచంద్ర శాస్త్రిగారు ఒకరు. ఈయన 'ఆహుతులు', 'పద.. పద.. ఢిల్లీ', 'వేగరండు', 'సమరాహ్వానము', 'విఖ్యాత చరితా', 'భారతీయుడ నేను' మొదలైన గేయాల ద్వారా తెలుగు ప్రజలలో దేశభక్తిని ప్రేరేపించారు.

**ఆహుతులు:**

> **"లెండోయి లెండోయి, తండోప తండాలు**
> **రండోయి రండోయి, జండాలచేబూని॥**
> **క్రూర పరిపాలనను, కూల్చివేయుటకు**
> **దాస్య బంధాలన్ని తెంపివేయుటకు..."**

అనే గేయంలో అందరూ లేచి తండోపతండాలుగా జెండాలను చేత పట్టుకుని రండి అని, క్రూర పరిపాలనను కూల్చి, దాస్యబంధాలను తెంపి, స్వాతంత్ర్యాన్ని సాధించుకోవడానికి, దేశప్రజలందరూ త్యాగం చేయవలసిన అవసరం వచ్చిందని, భారతదేశాన్ని కాపాడటానికి ప్రాణత్యాగం చేసిన వీరులను పూజించి, భరతఖండ ఐక్యతను నిలబెట్టడానికి రావాలని, దేశంలోని

దారిద్ర్యాన్ని తొలగించటానికి మద్యపానాన్ని మాన్పించాలని, సర్వ మానవ సమత్వాన్ని నెలకొల్పటానికి అందరూ త్యాగం చేయాలని, లెండోయి లెండోయి తండోపతండాలు... రండోయి, రండోయి జెండాలు చేబూని... అంటూ గళమెత్తారు.

**పద, పద, ఢిల్లీ :**

"పద పద ఢిల్లీ పరుగున పోదాం.. పగర వేగమే, పారద్రోలగా భారతదేశము పరాధీనమై... ప్రాధాన్యముచెడి, ప్రాభవముడిగి పరువుగోల్పోయి, పరివేదనతో పొగులుచున్నదిక, మొసగన్ । పద పద ।"

అంటూ మనం పరుగున ఢిల్లీ వెళ్లాలని, భారతదేశం పరాధీనయై, ప్రాధాన్యం కోల్పోయి, వేదనతో ఉన్నదని, పురాతనమైన భారతీయ సంస్కృతి ప్రాతిపదికగా, ప్రపంచశాంతిని పరిరక్షించాలని, ఆజాద్ చంద్రశేఖర్‌కి, నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కి, జవహర్‌లాల్ నెహ్రూకు, టంగుటూరి ప్రకాశం పంతులకు, సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు, పట్టాభి సీతారామయ్యకి, గాంధీకి జైహింద్... అంటూ పరాయిపాలన నుండి మన దేశాన్ని కాపాడుకుందాం అని ఉద్బోధించారు.

**వేగరండు :-**

**"వేగరండు వీరులార... విప్లవంబొనర్పగా**
**విగత జీవ వీరవరుల... విప్లవంబొనర్పగా**
**సుష్టశక్తి ధారలన్... విశ్వశాంతిగూర్పగా ॥**
**కాత్మశాంతి గూర్పగా... కన్నతల్లి బంధనముల**
**కోరితెచ్చు కొందురా?"**

అనే గేయంలో విప్లవం ద్వారానే విశ్వశాంతి లభిస్తుందని, దేశం కోసం మరణించిన వీరులకు ఆత్మశాంతి కలిగేలా, వేడి రక్తపుధారలను తర్పణాలుగా అర్పించిన వారికి తృప్తి కలిగేలా, త్వరగా అందరూ విప్లవంలోకి రావాలని, మన కన్నతల్లి వంటి భారతమాత బంధనాలలో ఉందని తెలిసి, ఏమీ పట్టనట్లుగా, చూస్తూ ఉంటే మిమ్మల్ని ఎవరూ మెచ్చుకోరనీ, కుటిల రాజకీయాలతో మతాల మధ్య చిచ్చుపెట్టాలని చూసేవారి పట్ల జాగ్రత్తగా ఉండాలని, అటువంటి వారిని ఎదిరించి, పోరాడాలని పిలుపునిచ్చారు.

**సమరాహ్వానము :**

**"స్వాతంత్ర్య సమరమ్ము**
**సాగింపగా వే**
**సహచరులతో గూడి**
**రావోయి : సాగిపోవలె త్వరగ**
**లేవోయి"**

ఈ గేయంలో స్వాతంత్ర్యం కోసం సమరం సాగించడానికి త్వరగా మీ సహచరులతో కూడిరండని, ఇప్పటివరకు, స్వాతంత్ర్యం కోసం సామరస్యంగా చేసిన ప్రయత్నాలన్నీ చెడిపోయాయని, ఇక పోరాటంతోనే స్వాతంత్ర్యం సాధించుకోవాలని, విజయం దక్కకపోయినా, వీరస్వర్గం దక్కుతుందని, సమరాహ్వానం పలికాడు.

**విఖ్యాత చరితా :**

**"లాలి విఖ్యాత చరితా నా తండ్రి**
**లాలి విజ్ఞాన కవితా... లాలి సువిశాల నేత్రా! నా తండ్రి**
**లాలి సుకుమార గాత్రాః... అన్న వస్త్రముల కొఱకు-ఎన్నడే**

**యారాట మెరుగునట్టీ... అన్నపూర్ణయై యాకటన్-దీనయై**
**యలమటించెడు చూడరా?"**

ఈ గేయంలో అన్న వస్త్రాలకు ఎప్పుడూ లోటులేకుండా అన్నపూర్ణగా విలసిల్లే దేశం, ఈ రోజు ఆకలితో దీనంగా అలమటిస్తుందని, శరీరమే శాశ్వతం అని, తన దగ్గర ఉన్న ధనమే సర్వస్వం అనుకుంటూ, సంతోషపడితే, ఆ జాతికి ఇక మంచిరోజులు కరువైపోతాయని, అందుకే ప్రతి ఒక్కరూ సాహసాన్ని, ఔదార్యాన్ని, ప్రకటించాలని అప్పుడే లోకంలో శాంతి, సుఖం వెల్లివిరుస్తాయని తెలిపారు.

**విజయము నీదే**

**"విజయము నీదేరా? రారాః... విప్లవ భారత వీరకుమారా!**
**భారత స్వాతంత్ర్యమ్మునకై పోరాడిన శ్రమ నీదేరా వీరా**
**భారత వీరుల ప్రాణమ్ములగాపాడినట్టి ధీరా లేరా"**

అంటూ ప్రజలలో ఉత్సాహాన్ని నింపారు.

ఈ విధంగా మల్లాది రామచంద్రశాస్త్రిగారు తన గేయాల ద్వారా ప్రజలలో జాతీయ ఉద్యమభావాలు పురికొల్పేలా, స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రజలు పాల్గొనే విధంగా, ఉత్సాహ పరుస్తూ తన రచనల ద్వారా భారతదేశ విముక్తికి తన వంతు కృషిని చేశారు. ❋

**ఆధార గ్రంథము**

1. జాతీయగీతాలు - ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, సంపాదకుడు - గురజాడ రాఘవ శర్మ

# జాతీయోద్యమ సాహిత్యం - కవుల పాత్ర

డా॥ బి. శ్రీనివాసరావు, తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆముదాలవలస

ఏడున్నర దశాబ్దాల స్వాతంత్ర్యం వెనుక కొన్ని లక్షలమంది త్యాగధనుల ధన మాన ప్రాణాలను అర్పించిన నేపథ్యం స్ఫూర్తిదాయకం. ఆంగ్లేయుల పాలన నుండి భారతదేశ విముక్తి కోసం పోరాటం 1857లో ప్రారంభమైందని, ప్రథమ స్వాతంత్ర్య పోరాట సంగ్రామంగా దీనిని పేర్కొంటుంది చరిత్ర. 1905 నాటి వందేమాతర ఉద్యమం సాహిత్య చరిత్రలో ప్రముఖ ఘట్టంగా ఆవిష్కరించవచ్చు. ఈ భావన 1947 వరకు నిరంతరాయంగా కొనసాగింది. స్వాతంత్ర్యానంతర సహితం ఎన్నో సామాజిక అసమానతలు, సంఘసంస్కరణ, పరిపాలన, పాలకుల అసమర్ధత, అవసరమైన అభివృద్ధి కోసం సాహితీకారులు వివిధ ప్రక్రియలలో తమ వంతు కార్యశూరతను కలాల ద్వారా పంచుకున్నారు. ముఖ్యంగా స్వాతంత్ర్య ఉద్యమకాలంలో సహాయ నిరాకరణ, సత్యాగ్రహం, అహింసాధర్మం, స్వదేశీ, ఖాదీ, అస్పృశ్యత నివారణ, క్విట్ ఇండియా, సైమన్ గో బ్యాక్, పార్లమెంట్ పై బాంబుల దాడి, మన్యం వీరుల పోరాటాలు, ఉప్పు సత్యాగ్రహం ఇలా ఎన్నో ముఖ్యమైన ఘట్టాలలో కవులు, రచయితలు తమ సాహితీ పోరాటం చేశారు. జైలుకు వెళ్లారు. కారాగారవాసం సహితం ఆనందంగా స్వీకరించారు. అయినవారిని కోల్పోయారు. ఆర్థిక కష్టనష్టాలను ఓర్చుకున్నారు. మనిషికి కావాల్సింది సంపూర్ణమైన స్వేచ్ఛ అని విశ్వసించారు. దానికోసం పరితపించారు. కవులు, కళాకారుల సహకారం లేని ఉద్యమాలను నేటికీ ఊహించలేం. బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం, దివ్యజ్ఞాన సమాజం, రామకృష్ణ మఠం వంటి ఆధ్యాత్మిక సంస్థలు సైతం నూతన సంస్కరణల కోసం ప్రజలను సాహిత్య, ఆధ్యాత్మిక రచనల ప్రసంగాలు ద్వారా జాగృతం చేశాయి. 1907లో విజ్ఞాన చంద్రిక ఏర్పాటు 1910 గుంటూరులో జరిగిన ఆంధ్ర యువజన సంఘం చేసిన ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు తీర్మానం, 1912లో ఢిల్లీని రాజధానిగా చేయమనే ఉత్సవ సంరంభం, 1913లో బాపట్లలో జరిగిన ప్రథమాంధ్ర మహాసభ స్వరాష్ట్ర సిద్ధికై ఏర్పాటు చేసిన వైనం ఇలా ఎన్నెన్నో ఘట్టాలలో కవుల పాత్ర విస్మరింపలేనిది.

19వ శతాబ్దం చివరన వేదం వేంకటరాయ శాస్త్రి గారి 'ప్రతాపరుద్రీయం' నాటకంలో జాతీయోద్యమ భావనకు తెలుగులో అంకురార్పణ జరిగిందని సాహితీకారుల అభిప్రాయం. 1907 ఏప్రిల్ 19 నుండి 24 వరకు రాజమండ్రిలో బ్రిటిష్ వారి దురాగతాలపై బిపిన్ చంద్రపాల్ చేసిన ఉత్తేజిత ప్రసంగాలకు ప్రభావితులైన చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు కార్యక్రమాలు చివరి రోజున ఉత్సాహంగా వేదిక పైకి ఎక్కి

**"భరతఖండంబు చక్కని పాడియావు**
**హిందువులు లేగదూడలై యేడ్చుచుండ**
**తెల్లవారను గడుసరి గొల్లవారు**
**పితుకుచున్నారు మూతులు బిగియగట్టి"** అని చదివారు.

ఆ తర్వాత జరిగిన సంఘటనలు చరిత్ర చెప్పినదే..! అనంతర కాలంలో మంగిపూడి వెంకటేశ్వర శర్మ, చెన్నాప్రగడ భానుమూర్తి, గురజాడ, రాయప్రోలు, గరిమెళ్ళ, బసవరాజు, అడవి బాపిరాజు, విశ్వనాథ, జాషువా, నాయని, తుమ్మల, ఇంద్రగంటి,

కాళోజి, దాశరథి, కరుణశ్రీ, పుట్టపర్తి, దువ్వూరి, గడియారం, ఆరుద్ర, దేవులపల్లి, సోమసుందర్, అనిశెట్టి, కుందుర్తి, తిలక్ ఇలా సుద్దాల హనుమంతు, బండి యాదగిరి వరకు ఈ జాబితా కొండవీటి చాంతాడంత అవుతుంది. స్థూలంగా వీరి సాహిత్యాన్ని పరిశీలిస్తే జాతీయోద్యమం, ఆంధ్ర రాష్ట్ర సాధన, గాంధీ అరెస్టు, జెండా ఆవిష్కరణ, దేశభక్తి ప్రేరణ, వివిధ ఉద్యమాల ప్రాధాన్యత, ప్రజల భాగస్వామ్యం వంటివి ప్రాధాన్యత క్రమంలో తెరమీదకు వస్తాయి. స్వరాజ్యం కోసం ప్రజలు నడిపిన ఉద్యమాలకు సాహిత్యం తమ వంతు సహాయమందించింది. పత్రికలు, రేడియో వంటివి ప్రజలకు సాహిత్యం ఆవశ్యకతను తెలిపి వారిలో స్ఫూర్తిని నింపాయి. జాతీయోద్యమం దిశగా వారిని నడిపించాయి. దేశభక్తి పెద్ద ఎత్తున ప్రబలి వీరోచిత త్యాగ సంసిద్ధతకు జనం తమను తాము దిద్దుకునే రోజులవి. హింసారహితంగా అధికార శక్తిని ప్రతిష్టను నిర్భయంగా ఎదుర్కొను ధైర్యాన్ని సాహిత్యం రగులుకొలిపింది అనటం అతిశయోక్తి కాదు. పట్టణాలలో ప్రారంభమైన ఉద్యమం పల్లెలకు పాకింది. జాతీయగీతములు 'జానపదుల' జనజీవనంలో అంతర్భాగమైపోయాయి. భక్తి, వేదాంత, శృంగార, బాల గేయముల స్థానంలో జాతీయగీతాల ప్రవేశం కల్పించారు. ప్రజలు ఈ గీతాల ద్వారా చక్కని ప్రబోధం చేసిన వారిలో గురజాడ కూడా ఒకరు దేశంలోని సామాన్య మానవునికి సహితం **"దేశమంటే మట్టికాదని దేశమంటే మనుషులని"** స్పృహను కలిగించారాయన. ఇంగ్లాండులోని పారిశ్రామిక విప్లవం ఫ్రెంచ్ విప్లవంతో ప్రభావితుడైన గురజాడ రాసిన 'దేశభక్తి' గీతం శ్రీశ్రీ చెప్పినట్లు 'అంతర్జాతీయ గీతంగా' ఖ్యాతి గాంచవలసినదే! ఏ దేశం వారికైనా కర్తవ్య బోధ చేసే విశ్వ మానవ గీతమది.

**'దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్**
**దేశమును ప్రేమించుమన్నా మంచియన్నది పెంచుమన్నా "**

ఇంతకన్నా దేశం గురించి గొప్పగా దేశభక్తిని ఎవరు ప్రబోధించగలరు? మరొక కవి **మంగిపూడి 'మేలుకొనుమ భరత పుత్రుడు/మేలుకొనమా సచ్చరిత్రుడ'** అని సమర దుందుభి మ్రోగించారు. ఆనాటి నాయకులను, వారి ప్రబోధాలను నిరంతరం గమనిస్తూ వస్తున్న కవులు, నాటి సమాజానికి ప్రాధాన్యత కలిగిస్తూ ఉత్తేజితులను చేసే ప్రతి సన్నివేశమును తమ స్పందనలతో ప్రజలను ఉత్తేజితలను చేశారు. 1907లో లాలా లజపతిరాయిని అరెస్టు చేసి జైలుకు పంపినప్పుడు చిలకమర్తి వారు

**"చెరసాలల్ పృథుచంద్రశాలలె యగున్, చేదోయి గీలించు**
**నయ్యర దండల్ విరిదండలయ్యెడును, హేయంబైన చోడంబలే"** అని నినదిస్తూనే -
**"భరత ఖండంబె యొక పెద్ద బందెఖాన**
**అందులోనున్న ఖయిదీలు పొందు జనులు**
**ఒక్క గది నుండి మార్చి వేరొక్క గదిని**
**బెట్టుటే కాక చెరయంచు వేర గలదె"**

అని దేశభక్తి పరాకాష్టలో ద్వంద్వాతీత భావన శక్తి ఎలా ఇమిడ్చి ఉన్నదో తెలుపుతారు.

1921 అసహాయోద్యమం ప్రారంభమున గాంధీ మహాత్ముని స్ఫూర్తి మంత్రమైన బోధకు మహాకవులంతా స్వాతంత్ర్యం, దేశమాత వంటి ప్రబోధనాత్మక పదాలను గీతాలుగా అల్లుకున్నారు. గాంధీ సూక్తంగా వెలువరించుకున్నారు కవులు. "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ" ఈ వాక్యం వారికి కవితా మంత్ర బీజాక్షరమైంది. వందేమాతరం, జనగణమన, దేశమును ప్రేమించమన్న, ఏ దేశమేగినా ఎందుకాలిడినా, వందనమిదే గైకొనుమ! భారత జనని, మేలుకొనుమ భారత పుత్రుడా!, జోహార్ జోహార్, భారతమాత వంటి గీతాలు నాటి సమాజంలో మార్మోగిపోయినాయి. ఆంగ్లేయుల గుండెల్లో శ్వేత శీతాఘ్నులను పేల్చాయి. ముఖ్యంగా కాటూరి- 'ఎంత చక్కని తల్లివే'; దేవులపల్లి- 'జయ జయ ప్రియ భారత' వంటివి నేటికీ వినిపిస్తూనే ఉన్నాయి. దేశభక్తిని ప్రోది చేస్తున్నాయి. జాతి, జాతీయతల పౌరుషాగ్ని అస్తిత్వాలకు చిహ్నంగా నిలిచిన జాతీయ జెండా రూపకల్పన చేసిన పింగళి వెంకయ్య ధన్యులు. మూడు రంగుల మన జెండా ఆంగ్లేయులకు గుండెపోటు అయినది. 'జెండాను' ఘనంగా కీర్తించారు.

**'స్వాతంత్ర్య జాతికిది – చక్కని వెలుగు**

**జాతి పేరు జగాన – స్థాపించగలుగు'** అని కీర్తించారు. జాతి, వర్ణ, కుల మతేతర ధ్యేయమునకు ప్రతీక. వీర యోధులకు కరదీపిక. స్వేచ్ఛగా కాంతులు విరజిమ్ము సుధాకర చంద్రిక.

**'ఝండా ఊంఛా రహే హమార'**
**'ఝండా యెత్తర, జాతికి ముక్తిరా'**
**'పతాకోత్సవం సేయండి'**
**'ఎత్తండి స్వరాజ్య జెండా'**
**'ఎగురవే విను వీధి – ఎగురవే ఝండా'**
**'సౌఖ్య ప్రదాతగా– జాతీయ ఝండా'**
**'ఖండాంతరముల ఖ్యాతిగాంచి, జయము గూర్చిన ఝండా'**

ఇలా ఎన్నెన్నో గీతాలు జాతీయోద్యమంలో 'జెండా' ధరించవలసిన ఆవశ్యకతను ప్రజలకు చెప్పి ఉత్తేజితులను చేశారు కవులు.

జాతీయ ఉద్యమంలో ప్రజలను ఉగ్రూతలూగించి ప్రేరణాత్మక గేయంగా నిలిచి బ్రిటీష్ వారి గుండెల్లో ఫిరంగులు పేల్చిన గరిమెళ్ళ వారి *'మాకొద్దీ తెల్లదొరతనం / మా ప్రాణాలపై పొంచి మానాలు హరియించే' అని ఎలుగెత్తిన గరిమెళ్ళ, 'దండాలోయ్ – మే– ముండలేమండోయ్! బాబు / ఈ సైతాను ప్రభుత్వ నింకా సాగనీమండోయ్ బాబు'* అనే గీతాలు నిత్య చైతన్యవంతం. ఒక గేయంతోనే జైలు శిక్షననుభవించిన వారు గరిమెళ్ళ. ఇలా ఎంతోమంది కవులు తమ కలాలను, గళాలను ప్రాణాలకు నెరవక దేశమాత దాస్య శృంఖలాలను త్రెంచే క్రమంలో కుటుంబాలను, స్వంత ఆరోగ్య, ఆర్థిక సౌఖ్యాలను కాదనుకున్నారు. అనంతర కాలంలోనూ పదవులను తృణప్రాయంగా ఎంచారు. అనాథలుగా మిగిలారు. అనామకంగా అసువులు బాసారు. వీరు భౌతికంగా మన మధ్య లేకున్నా వారి దేశభక్తి పూరిత స్వాతంత్ర్య కాంక్ష గీతాలు నేటి తరానికి అవసరమే.

**శ్రీలు పొంగిన జీవగడ్డయి**
**పాలు పారిన భాగ్యసీమయి**
**వరలినది ఈ భరతఖండము**

**భక్తి పాడర తమ్ముడా...** కవులు జాతీయభావాన్ని గొప్పగా పాదుకొల్పి, తెలుగుదనం స్వాభిమానాన్ని సైతం వెలువరించారు. ఆ అడుగుజాడల్ని అనుసరిస్తూ... ఆ స్ఫూర్తిని నిలుపుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.

**ఆధార గ్రంథాలు**

1. జాతీయ గీతాలు – గురజాడ రాఘవ శర్మ – ఆంధ్ర సాహిత్య అకాడమీ – 1979
2. తెలుగు కవులు – కె.భాస్కరరావు– త్రివేణి పబ్లిషర్స్– 1979
3. వికీపీడియా కథనాలు

# జాతీయోద్యమ కథలు

**డా॥ కె. సుజాత,** తెలుగు అధ్యాపకులు, టి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కందుకూరు, నెల్లూరు,
చరవాణి : 9440011770

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణలలో ఒకటి 'జాతీయోద్యమ కథలు' అనే కథల సంపుటి. సంకలనకర్త ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు. ఈ సంకలనంలో మొత్తం 30 కథలున్నాయి. ఈ కథల్లో భారత జాతీయోద్యమ కాలం నాటి పరిస్థితులు, ప్రజల్లో ఉన్న ఉద్యమస్ఫూర్తి, దేశభక్తి ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న యువతి యువకుల గురించి, వారి త్యాగాల గురించి మనకీ కథల్లో కనిపిస్తుంది. ప్రాణాలు సైతం లెక్కపెట్టని ప్రజల తెగువ, తనకన్నా తన ప్రాణాల కన్నా దేశమే ముఖ్యమని చేతల్లో నిరూపించిన తల్లుల కథలు మనకిందులో కనిపిస్తాయి. నమ్మిన సిద్ధాంతాల కోసం బలయిపోయిన ఆనాటి ప్రజల ఆదర్శాలు మనల్ని నివ్వెరపరుస్తాయి. ఆనాటి సమాజంలో వచ్చిన సంస్కరణోద్యమ ప్రభావం కూడా మనకిందులో కనిపిస్తుంది. పేదరికం, బాల్యవివాహాలు, స్త్రీవిద్య, నిజాం నిరంకుశపాలన – పీడన, ఆర్థిక అసమానతలు, అంటరానితనం మొ॥గు అంశాలెన్నో ఈ కథల్లో చర్చించబడ్డాయి. ఆనాటి ఉద్యమకారుల అంకితభావం, త్యాగశీలత ఈనాటి తరానికి ముఖ్యంగా యువతరానికి స్ఫూర్తిదాయకం. వ్యాస నిడివిని దృష్టిలో ఉంచుకుని ఈ కథా సంకలనంలోని కొన్ని కథలను మాత్రమే ఈ వ్యాసంలో సమీక్షించటం జరిగింది.

**కుటీర లక్ష్మి** : ఈ సంకలనం లోని కథల్లో మొదటి కథ ఇది. రచయిత్రి కనుపర్తి వరలక్ష్మమ్మ. ఐరోపాలో ప్రారంభమైన సంగ్రామం ఒక కుటుంబాన్ని ఏవిధంగా ఛిన్నాభిన్నం చేసిందో, ఏ విధంగా ఒక ఇల్లాలిని ఇద్దరు పిల్లలతో సహా రోడ్డున పడేలా చేసిందో తెలిపే కథ ఇది. ఆనాటి సామాజిక పరిస్థితులనన్నిటిని కళ్ళకు కట్టినట్లుగా వర్ణించారు ఈ కథలో కనుపర్తి వరలక్ష్మమ్మ. ఐరోపా మహా సంగ్రామ కారణంగా హిందూదేశంలో అన్నవస్త్రాదుల కేర్పడిన మహాక్షామం వల్ల పేదలు పడ్డపాట్లు చెప్పనలవికాదు. పొట్టగడవడమే కష్టమైన పేదలకు బట్టలు కొనుక్కోవడం మహాదుర్భరమై పేలికలు కట్టారు. పట్టలు, చాపలు కట్టుకుని బ్రతికారు. ముఖ్యంగా చలికాలం చచ్చి బ్రతికినట్లయింది వారి పరిస్థితి. ఒకప్పుడు వస్త్రవ్యాపారంలో లక్షలు గడించి మహాభోగాలనుభవించిన రామలక్ష్మి, ఆమె బిడ్డలు కప్పుకోవడానికి దుప్పటి కూడా లేని పరిస్థితుల్లోకి పడిపోయిన స్థితిని చాలా కరుణరసభరితంగా వర్ణించారు రచయిత్రి ఈ కథలో. చివరికామె కుటుంబానికి సహాయనిరాకరణోద్యమంలో భాగంగా నెలకొల్పబడిన ఖద్దరు పరిశ్రమ, నూలు వడికే పని ఆమెని ఏవిధంగా ఆదుకుందో కుటీరలక్ష్మిగా ఆమెని నిలిపిందో, అటువంటి స్త్రీలకెందరికి ఈ పని ఆసరా అయిందో తెలిపే కథ ఈ కుటీరలక్ష్మి కథ.

**నా మంత్రి** : ముద్దుకృష్ణ రచించిన ఈ కథ అహర్నిశం స్వరాజ్యం కోసం కలలు కని, దేశం కోసం, స్వరాజ్యం కోసం జీవితమంతా ధారపోసిన దాసు అనే వ్యక్తికి ఎదురైన నిరాశని గూర్చిన కథ ఇది. దాసు స్వరాజ్యమే జీవితాశయంగా బతికినవాడు. అందరూ అతడిని గాంధీదాసు అంటారు. ఉద్యమంలో భాగంగా దెబ్బలు తిన్నాడు, జైలుకెళ్ళాడు. అయినప్పటికీ ఎక్కడా వెనుకంజ వేయలేదు. ఇంగ్లీషు వారి ప్రభుత్వం కాంగ్రెసుకు లొంగిపోయింది. కాంగ్రెసు నాయకులు మంత్రి పదవుల్ని అంగీకరించారు. అందులో దాసుకు సన్నిహితుడు జైల్లో రైతు జీవితం సుఖవంతం చేయడమే స్వరాజ్యలక్ష్యమని ఉపన్యాసాలిచ్చిన వాడు ఇప్పుడు మంత్రి

అయ్యాడు. ఆ మంత్రి తమ పల్లెకు వస్తున్నాడనగానే దాసు ఆనందానికి మేరలేదు. పల్లె అంతా తిరిగి మన మంత్రి వస్తున్నాడు. మన కష్టనిష్టూరాలు తెలుసుకుంటాడు. మనల్ని కష్టాల నుంచి గట్టెక్కిస్తాడు. మన మంత్రులు, మన కాంగ్రెసు మంత్రులు అంటే బీదసాదలకు బంధువులు. ఇంగ్లీషు వాళ్ళలా అధికారం చెలాయించి ప్రజల్ని దబాయించి బాధలపాలు చేసే మంత్రులు కారు అని ప్రతి గడపకి, ప్రతి ఇంటికి తిరిగి తోరణాలు కట్టించి, పసుపు కుంకాలతో పల్లె అంతా కళకళలాడేలాగా చేసి ఊరిలో జనానికి అమితోత్సాహం కలిగించాడు. రైల్వేస్టేషన్‌కి వెళ్ళి మంత్రికి దండవేసి తీసుకువస్తాను. మీ అందరిళ్ళకూ మంత్రి స్వయంగా వస్తాడు అంటూ ప్రజలకి చెప్పి పాతికమంది కుర్రవాళ్ళతో కాంగ్రెసు జెండాలు పట్టుకుని రైలు వచ్చే వేళకి వెళ్ళాడు దాసు. మంత్రి ఒకటవ తరగతి బోగీలో నుంచి దిగగానే కలెక్టరూ, ఉద్యోగస్తులు, లక్షాధికారులు చుట్టుముట్టారు. వాళ్ళతో కులాసాగా మాట్లాడుతూ మంత్రి కారులో ఊరేగింపుగా బంగళా చేరుకున్నాడు. దాసు చేసిన ఏర్పాట్లు ప్రకారం మంత్రి కారులో వస్తూ ఉంటే ప్రతి ఇంటి దగ్గరా ఆడవాళ్ళు హారతులు పట్టారు. పూలదండలు వేశారు. బంగళా చేరుకుని పంచభక్ష్య పరమాన్నాలతో భోజనం చేశాక మంత్రికి దాసు సంగతి జ్ఞాపకం వచ్చింది. కలెక్టర్ని దాసు గురించి అడిగి అతన్ని పిలిపించమని అనగానే కలెక్టరు, డిప్యూటి కలెక్టరుని పంపించాడు. డిప్యూటి కలెక్టరు తోటలో ఉన్న దాసు దగ్గరికి వచ్చి మంత్రిగారు మిమ్మల్ని రమ్మంటున్నారని పిలవగానే దాసు కళ్ళనీళ్ళు తుడుచుకుని మీ మంత్రి ఉద్యోగుల మంత్రి, లక్షాధికారుల మంత్రి. ఆ మంత్రితో నాకు నిమిత్తం లేదు. నా మంత్రి బీదసాదల మంత్రి, ప్రజల మంత్రి. నా మంత్రి రాలేదు. నేను రానని మనవి చెయ్యండి. నా మంత్రి రాలేదు. అంటూ దుఃఖం ఆపుకోలేక అక్కడి నుంచి లేచి వెళ్ళిపోతాడు దాసు. ఎంతో కష్టపడి, ఎన్నో త్యాగాల కోర్చి స్వరాజ్యం తెచ్చుకున్నది ఇందుకా అనే దాసు వేదన అవగతమయ్యాక మంత్రి ప్రవర్తన దాసుకే కాదు పాఠకులకు కూడా చివుక్కుమనిపిస్తుంది. ప్రజల బలిదానం, త్యాగాలు ఇటువంటి వారివల్ల వట్టిపోయినవికదా అని వేదన కలుగుతుంది.

**సేవాధర్మం** : ఈ కథ రచయిత కరుణకుమార. బ్రిటీష్ ప్రభుత్వంలో మిలిటరీ యోధుడైన హోతిసింగ్ ఐదు సంవత్సరాల తర్వాత ఇంటికి వచ్చినపుడు కొడుకు నాన్ కోపరేషన్ ఉద్యమంలో బలంగా పనిచేస్తున్నాడనే విషయాల్ని భార్య మాటల ద్వారా గ్రహిస్తాడు. కొడుకు గది నిండా ఉన్న నెహ్రూ, పటేల్ వంటి దేశనాయకుల ఫోటోలు మిలిటరీ ఉద్యోగి అయిన తన ఇంట్లో ఉండడం ప్రమాదకరం అని ఆఫోటోలన్నీ తీసి రహస్యంగా దాచిపెడతాడు. కొడుకు ఎక్కడున్నాడో చూసి పిలుచుకురమ్మని నౌకరుని పంపిస్తాడు. రామసింగ్ కోసం వెళ్ళిన నౌకరు “అబ్బాయి గారికి పోలీసు కాల్పుల్లో దెబ్బలు తగిలాయి అని, ఆస్పత్రికి తీసుకుపోయారని” వర్తమానం తెస్తాడు.

ఆస్పత్రిలో రక్తసిక్తమై గాయాలతో పడి ఉన్న కొడుకును చూసి తల్లడిల్లిపోయే ఆ తల్లిదండ్రుల వద్దకు ఒక పోలీసు కానిస్టేబుల్ వచ్చి హోతిసింగు చేతికి ఒక కవరు అందిస్తాడు. అందులో “సర్దారు హోతిసింగుకు రామసింగు అనే మైనరు పిల్లవాడు నీ కుమారుడని, నీ గార్డియన్‌షిప్పులో ఉన్నాడని మా నోటీసుకు వచ్చింది. అతడు చట్ట విరుద్ధమైన సంఘాలలో చేరి ప్రజాశాంతికి భంగం కలిగిస్తున్నాడు కాబట్టి అతన్ని నీ గార్డియన్ షిప్పు నుండి తొలగించి, అతనికి నీతో గల సంబంధం తెగ్గొట్టుకుని ఆ వైనం వెంటనే సర్కారు వారికి తెలియజేయవలెను” అనేది ఆ ఉత్తర్వు సారాంశం. గవర్నమెంటు నుండి వచ్చిన ఆ ఉత్తర్వు చదవడం ముగుస్తుండగా డాక్టరు గది తలుపు తెరచి పిల్లవాడికీ మీకు సంబంధం తెగిపోయింది అంటాడు. స్వరాజ్య సంగ్రామంలో అసువులు బాసిన ఒక వీర యువకుడి కథ సేవాధర్మం అనే కథ. ఆనాటి అట్టి త్యాగాలు చేసిన యువకులెందరో. ఎందరో వీరుల త్యాగఫలం ఈనాటి మన స్వాతంత్ర్యం.

**అనిర్వచనీయ ఖ్యాతి** : ఒక ఉద్యమంలో ఆడవాళ్ళు పాల్గొనడానికి, మగవాళ్ళు పాల్గొనడానికి ఉన్న వ్యత్యాసాన్ని తెలియజేసే కథ ఇది. రచయిత జి.వి. కృష్ణారావు. సత్యాగ్రహంలో భాగంగా రెండు సంవత్సరాలు జైలులో ఉండి వచ్చిన ఉష అనే అమ్మాయి తన తండ్రిని, అన్నావదినలను చూడాలనే ఆత్రుతతో, ఆరాటంతో వస్తే ఆమెకి ఆ ఇంట లభించిన స్వాగతం ఏవిధంగా ఉందో తెలిపిన కథ ఈ అనిర్వచనీయ ఖ్యాతి అనే కథ. తను జైలు నుండి విడుదలైన సంగతి, తన ఊరికి తిరిగి వస్తున్న సంగతి తెలిస్తే ఘనంగా ప్రజలు స్వాగతం పలుకుతారని కలలుకంటూ ఊరికి వచ్చి తన ఇంట్లోకి అడుగుపెట్టిన ఉషకి మళ్ళీ ఎందుకు తగలడ్డావు అని అన్న

తీవ్రంగా దుర్భాషలాడుతాడు. నాకు కూతురు లేదు చచ్చిపోయింది అని నాన్న అనడంతో ఉష క్రుంగిపోయింది. "రెండు సం॥ల క్రితమే జ్వరంతో చచ్చిపోయావని ఊళ్ళో చెప్పుకున్నాం. రేపు ఊళ్ళో తలెత్తుకోవాలా అక్కరలేదా ! పో. ఎవడితో ఉన్నావో వాడి దగ్గరకే పోయి ఊరేగు" అంటూ నిందలు మోపాడు అన్న. తండ్రికి కూడా అవే మాటలు చెప్పి తండ్రి మనసులో కూడా విషం నింపాడు. నాన్న, నాన్న అని ఏడుస్తూ ఉష తండ్రి కాళ్ళు గట్టిగా కావలించుకుంటుంది. ఆమె జైలుకు వెళ్ళిన విషయం వదిన తమ్ముడైన రఘుకి తెలిసినా అతడు నాకేమీ తెలియదన్నట్లు మాట్లాడడంతో విస్తుపోతుంది ఉష. ఏడుస్తున్న ఉషపై ఆమె అన్న, రఘు ఇద్దరూ పులుల్లా విరుచుకుపడి కొట్టడంతో కారాగారవాసంలో ఎముకలు మాత్రమే మిగిలిఉన్న ఉష అస్థిపంజరంలో నుంచి హంస ఎగిరిపోతుంది. మాతృదేశం మీద ప్రేమతో సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని దేశసేవ చేసినందుకుగాను ఉష ఆవిధంగా మూల్యం చెల్లించుకుంది. జాతీయోద్యమంలో పాల్గొని అనేక కష్టనష్టా లనుభవించినందుకుగాను ఎంతో మంచి పేరు, సత్కార సన్మానాలు జరుగుతాయనుకున్న ఉష లాంటి ఆడవాళ్ళకి సైతం ఇలాంటి ఖ్యాతి లభించడం భయంకరమైన నిందలు తనవాళ్ళ చేత పడాల్సిరావడం. ఆమె మరణం కంటే ముందే ఆమె హృదయాన్ని చంపేశాయి. ఉద్యమంలో పాల్గొని జేజేలు పొందవలసిన ఆమె స్త్రీ అయిన కారణంగా ఏవిధంగా నిందల పాలయిందో మనకీ కథ తెలుపుతుంది.

**ఐదు మాసములు యిరువది దినములు** : ఈ కథ కనపర్తి వరలక్ష్మమ్మ గారి కథ. సహృదయుడు, సుకుమారుడు, నాగరికుడు అయిన గోపాలరావుకి మాతృదేశమనిన పరమభక్తి. విదేశీ వస్త్ర దుకాణాల వద్ద పికెటింగ్ జరుపుట, నాన్ కోపరేషను ఉద్యమాల్లో పాల్గొనుట వంటి కార్యక్రమాలతో తలమునకలై ఉండేవాడు. ఉన్నత విద్యావంతుడు. ఉద్యమంలో పాల్గొని విదేశీవస్త్రాలు కొనవద్దని, ఆ దుకాణాల వద్ద ఉధృతంగా ప్రచారం చేసున్న కారణాన గోపాలరావు అరెస్టు చేయబడతాడు. ఆరు నెలలు జైలు శిక్ష వేయబడింది. భార్య రుక్మిణి తల్లడిల్లిపోయింది. తన దేశంలో తయారైన వస్త్రాలను తాను ధరించి ఇతరులను కూడా ధరించండని ప్రబోధించినందుకు దొంగలకు వేసినట్లు కఠినశిక్ష వేయడం విని దుఃఖపడుతుంది. తాను విదేశీ వస్త్రాలు ధరించడం భర్తకిష్టం లేదని తెలుసుకున్న తర్వాత రుక్మిణి ఇకపై ఎన్నడూ విదేశీ వస్త్రాలు ధరించకూడదని నిర్ణయం తీసుకుంటుంది. భర్త క్షేమం కోసం నోము నోచుకోవాలని నిర్ణయించుకుంటుంది. ఆ నోముకి వచ్చే ఇతర ఆడవాళ్ళు విదేశీ వస్త్రాలు ధరించి వస్తారేమో అని తన భర్తకి అయిష్టమైన పని కనుక ఆవిడ ఈ సంవత్సరం మా ఇంట నోము నోచుకొనువారు ఖద్దరు వస్త్రాలు ధరించే నోచుకొనవలెను అని కబురు పంపుతుంది.

ఈ నియమం కారణంగా ప్రతి సంవత్సరం కంటే కూడా చాలా తక్కువ మంది నోము నోచుకోవడానికి వస్తారు. అయినా రుక్మిణి నిరుత్సాహం చెందలేదు. రుక్మిణి నోము చివరి దినము అనగా తొమ్మిదవరోజున గోపాలరావు అనుకోకుండా ఇంటికి వస్తాడు. ఆ రోజుకు గోపాలరావు జైలుకి వెళ్ళి ఐదు నెలల ఇరవై రోజులు. గోపాలరావు తన సత్ప్రవర్తన కారణంచే శిక్షాకాలం కంటే పదిరోజుల ముందుగానే విడుదలై వచ్చాడు. అకస్మాత్తుగా భర్తను చూచిన ఆనందంలో దేవికై కూర్చిన పూలమాలను భర్త మెడలో వేయుటకు మహోత్సాహంతో ముందుకు వెళుతుంది రుక్మిణి. ఆ పూలదండ సీమనూలుతో గట్టినదేమో నేను ముట్టను అంటాడు గోపాలరావు. ఆ మాటలకు ఆ యోధపత్ని, ధీరవనిత ఇలా జవాబిస్తుంది. "సీమనూలు నా చేతినుండి తొలిగి ఐదు మాసముల ఇరువది దినములు".

ఆనాటి ప్రజలు ఎంత చిత్తశుద్ధితో ఉద్యమంలో మమేకమయ్యారో మనకీ కథ ద్వారా తెలుస్తుంది.

ఈ విధంగా ఆనాడు రాయబడిన ఎన్నో ఎన్నో కథలు ఆనాటి ప్రజల దేశభక్తికి, పరిస్థితులకు అద్దం పడతాయి. ❀

**ఉపయుక్త గ్రంథం**

1. జాతీయోద్యమ కథలు – పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

# తెలుగు కథల్లో జాతీయోద్యమం

**డా॥ ఉషారాణి పిల్లి,** తెలుగు శాఖాధ్యక్షులు, యస్.వి.డి, జి.డి.సి, మహిళా కళాశాల,
నిడదవోలు, తూర్పు గోదావరి జిల్లా. ఫోన్ : 9866703130

భారతదేశ చరిత్రలో స్వాతంత్ర్యోద్యమం ఒక ముఖ్యమైన సంఘటన. ఎందుకంటే భారతీయులు తమ అంతర్గత విభేదాలను తాత్కాలికంగా మరచి, సమిష్టి ఆశయం కోసం అధిక సంఖ్యలో పాల్గొన్న మొదటి ఉద్యమం ఇదే. ఈ ఉద్యమానికి ఎన్ని పరిమితులున్నా, ఈ ఉద్యమ నాయకత్వ స్వభావం ఎలాంటిదైనా దీని ప్రత్యేకత మాత్రం గొప్పది. 1857కన్నా ముందు వ్యక్తిగత తిరుగుబాట్లు మొదలై ఆ తర్వాత మొదటి స్వాతంత్ర్య సంగ్రామంతో సంఘటితమై 1885 నాటి కాంగ్రెస్ ద్వారా నిర్దిష్ట రూపాన్ని సంతరించుకొని, బెంగాల్ విభజన వ్యతిరేకోద్యమం, సహాయ నిరాకరణ, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల రూపం తీసుకున్న తొంభైయేళ్ళ చరిత్ర ఇది.

ప్రజలు ముమ్మరంగా పాల్గొన్న ఈ ఉద్యమం సహజంగానే తన సాహిత్యాన్ని సృష్టించుకుంది. స్వాతంత్ర్యోద్యమ ప్రభావంతో ఉత్తర భారతదేశంలో విస్తృతంగా సాహిత్యం వచ్చింది. తులనాత్మకంగా పరిశీలిస్తే దక్షిణ భారతదేశంలో అంత విస్తృతంగా సాహిత్యం రాలేదు. ఆయా ప్రాంతాల్లో సాగిన ఉద్యమ తీవ్రతను బట్టి సాహిత్యం కూడా ఉత్పత్తి అయ్యింది. ఏ ఉద్యమంలోనైనాగానీ ఆ ఉద్యమంతో ప్రభావితులైన వాళ్ళలో కవులు ఎక్కువ సంఖ్యలో కనిపిస్తారు. నవలా రచయితలు, కథకులు, నాటక రచయితలు, వారి రచనలు సంఖ్యాపరంగా చూసినప్పుడు చాలా తక్కువ. అయితే ఏ ప్రక్రియ ఉద్యమానికి పూర్తిగా దూరంగా లేదు.

తెలుగులో కూడా స్వాతంత్ర్యోద్యమంలో కవితలు, కావ్యాలు అధికంగా వచ్చాయి. పరిమిత సంఖ్యలో నాటకాలు, నవలలు, కథలు వచ్చాయి. తెలుగు సాహిత్య చరిత్రలో నూతన యుగాన్ని ఆవిష్కరించాయి. స్వాత్రంత్ర్యోద్యమంలో ఉద్యమాన్ని ఆరాధనాభావంతో, ఆవేశంతో ప్రతిబింబించిన కథలు కొన్నైతే, ఉద్యమాన్ని విమర్శనాత్మక దృష్టితో చూసిన కథలు మరికొన్ని. స్వాతంత్ర్యం వస్తున్న సమయంలో, వచ్చిన తొలినాళ్ళలో సమాజ బాధ్యతను కొన్ని కథలు నిర్దేశించాయి. ఆ తర్వాత వచ్చిన కథలు స్వాతంత్ర్యంలోని గుణదోషాలను, అది మిగిల్చిన ఆశ నిరాశలను విమర్శనాత్మకంగా చిత్రించాయి.

**జాతీయోద్యమ కథ – వస్తువైవిధ్యం:**

ఎక్కువ కథలు సహాయ నిరాకరణోద్యమంలో విదేశీ వస్త్ర, ఆంగ్ల విద్యా బహిష్కరణ, స్వదేశీ – ఖాదీ – వస్త్రధారణ, అందుకనుగుణంగా ఖద్దరు ప్రచారం అనే అంశాలను చిత్రించాయి. అలాగే గాంధీజీ ప్రబోధించిన అస్పృశ్యతా నిరసన, మద్యపాన వ్యతిరేకతలను కూడా చిత్రించాయి. మరికొన్ని కథలు సైమన్ కమీషన్ వ్యతిరేకోద్యమాన్ని ఉప్పు సత్యాగ్రహాన్ని ప్రతిఫలించాయి. ప్రతి కథా వ్యక్తిగత వాంఛలు సుఖ సంతోషాలకన్నా దేశ విముక్తి ప్రధానమనే లక్ష్యాన్ని నొక్కి చెప్పింది. అనేక కథల్లో భార్యా భర్తలు ఏవేవో కారణాలతో విడిపోయి జాతీయోద్యమంలో పాల్గొనడం ద్వారా తిరిగి కలుసుకున్నట్లు చూపించాయి. వ్యక్తి త్యాగాన్ని కొన్ని

కథలు బోధించాయి. కొన్ని కథల్లో బ్రిటీష్ ఇండియా ఉద్యోగులకు వారి పిల్లలకు ఉద్యమ కారణంగా జరిగిన సంఘర్షణ చిత్రించబడింది. కొన్ని కథలు తల్లిదండ్రులు తమ పిల్లలు ఉద్యమంలోకి పోవడాన్ని వ్యతిరేకిస్తే, పిల్లలు వాళ్ళను ధిక్కరించి పోయినట్లు చెప్పగా, మరికొన్ని కథలు తల్లిదండ్రులే పిల్లల్ని ఉద్యమంలో పాల్గొనమని ప్రోత్సహించినట్లు చెప్పాయి.

**1. తల్లుల త్యాగం:**

కొడుకును స్వాతంత్ర్యోద్యమంలోకి పంపడం కోసం తాను అడ్డంగా ఉండరాదని ఆత్మత్యాగం చేసిన తల్లి కథ మైదవోలు పద్మావతి రాసిన 'త్యాగిని'. ఈ కథలో తాను ఉద్యమంలోకి పోతే తల్లి దిక్కులేనిదవుతుందని రావు ఉద్యోగం చేసుకుంటుంటాడు. అయితే ఆ తల్లి "నాయనా! అందరును సత్యాగ్రహ పోరాటమున పాల్గొనుచుండ నీవు ఆడుదానివలె ఇంట కూర్చొనియున్నావేమి? ఆ భరత పుత్రుల ఘోష నీ చెవికెక్కలేదా? మహాత్ముని యాజ్ఞ యనిన లక్ష్యములేదా? భారతీయుల పాట్లు చూడ ముదుసలినగు నాకు రోష పౌరుషములు పైకుబికి జాలిచేత గుండె నీరుగుచున్నదే నీ మనసేమి పాషాణమా? ఇనుమా? ఏల కరుగుదు? నీవును ఒక మనిషివేనా? ఈ దేశమున జనించినవాడవేనా?" (చంద్రశేఖరరెడ్డి రాచపాళెం : 2006 : పుట : 55) అని నిలదీసింది. ఆ తర్వాత రెండు రోజులదాకా ఆమె నోటి నుండి "నాకన్నను దేశమాతయే ముఖ్యం' అన్న మాట వినబడుతూ ఉంది. ఒకరోజు రావు ఇంటికి వచ్చే సరికి తల్లి బావిలో శవంగా కనిపించింది. ఆ రాత్రి ఆమె అతనికి కలలోకి వచ్చి "నాయనా! భారతీయుడ వనిపించుకొనుము. నీవు సత్యాగ్రహము నందు పాల్గొనకుండుటకు నేనడ్డమని తలచి, నాకన్న దేశమాతయే ముఖ్యమని యెంచి, నే సజీవముగానున్న వెనుకంజ వేయుదువని నేను నా జీవితము త్యజించితిని" (చంద్రశేఖరరెడ్డి రాచపాళెం : 2006 : పుట : 55) అని చెప్తుంది. ఆ తర్వాత రావు ఉద్యోగం మాని గాంధీజీ శిష్యుడై స్వరాజ్య సమరంలో పాల్గొని వీరస్వర్గం పొందుతాడు. దేశ విముక్తి కోసం ఒక తల్లి తననుతాను రక్త సంబంధం నుండి విముక్తి చేసుకున్నట్లు రాయడం అప్పటి సామాజిక ఆవేశానికి సంకేతం.

**2. కార్యకర్తల నిర్మాణం:**

దిక్కులేని వారిని, తిరస్కృతులను చేరదీసి జాతీయోద్యమ కార్యకర్తలుగా తీర్చిదిద్దిన స్వచ్ఛంద సేవిక కథ గుమ్మడిదల దుర్గాబాయి రాసిన 'నే ధన్యనైతిని'. ఈ కథలో శ్రీనివాసరావు కూతురు లీల. చిన్నప్పట్నుంచి ఆమెకు రాట్నం మీద ఇష్టం. తండ్రి ప్రోత్సాహం కూడా ఉంది. ప్రసాదరావు ప్రభుత్వ ఉద్యోగి. అతని తమ్ముడు శ్యామసుందరుడు నిరంతర ఖద్దరుధారి. అన్నా వదినల పెంపకంలో పెరిగినా వ్యక్తిత్వం కలవాడు. సైమన్ కమీషన్ ఆంధ్రదేశానికి వచ్చినప్పుడు అన్న వద్దంటున్నా సైమన్ వ్యతిరేక ఆందోళనలో పాల్గొన్నాడు. పెద్దల ఉపన్యాసాలు విని ఇన్నాళ్ళు ఆంగ్ల విద్య అభ్యసిస్తున్నందుకు సిగ్గుపడి, తనను తాను దేశసేవకు అంకితం చేసుకోవాలని నిశ్చయించుకొని ఇంటికి వస్తాడు. వచ్చేసరికి పాఠశాల నుంచి తీసేస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుని నుంచి లేఖ వచ్చి ఉంటుంది. అన్న ఇంటి నుంచి తరిమేస్తాడు. లీలకు అమ్మానాన్నలు చనిపోతారు. ఆ గ్రామంలోనే శారదాబాయి అనే వితంతువు తన శారదా భవనంలో స్త్రీ విద్యా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఉంటుంది. లీలా శ్యామసుందరులు శారదా భవనానికి చేరుకుంటారు. శ్యామసుందరుడు రాట్నాలు, మగ్గాలు పేదవాళ్ళకు సమకూర్చి పెట్టి ఉపాధి కల్పించడం, ప్రజల్లో ఐకమత్యాన్ని మతసామరస్యాన్ని కలిగించడం – ఈ పనులు చేస్తుంటాడు. లీల శ్యామసుందరునితో పాటు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ అతని పట్ల ఆకర్షితురాలౌతుంది. శారదాబాయి ముసలితనంతో జబ్బు చేసి చనిపోతూ లీలా శ్యామసుందరుల చేతులు కలుపుతుంది. ఒక సామాజిక కార్యక్రమంలో కలిసి పనిచేస్తూ ఒకరినొకరు అర్థం చేసుకుకొని స్త్రీ పురుషులు ఒకటికావడమే ఆదర్శానికి ఆచరణకు ఈ కథ మంచి ఉదాహరణ.

మెట్టినింటి వాళ్ళు మతదృష్టితో తిరస్కరిస్తే జాతీయోద్యమంలో పాల్గొని జీవితాన్ని సార్థకం చేసుకున్న స్త్రీ కథ బసవరాజు వెంకట రాజ్యలక్ష్మి రాసిన 'ఎవరిదదృష్టం' కథ. ఈ కథలో "దేశము కోసం ప్రాణాలు ధారపొయ్యడం నా అదృష్టం' అని చివరి దశలో సరళ అన్న మాటలు గమనిస్తే ఆమె దేశభక్తిని సెంటిమెంటుగా కాక ఒక బాధ్యతగా స్వీకరించి, ఆ బాధ్యతా నిర్వహణ కోసం సొంత సుఖాలను త్యాగం చెయ్యడంతో పాటు తన ప్రాణాలను కూడా త్యాగం చేసింది. మంచి ఆదర్శవంతమైనది ఈ కథ.

**3. చిన్నపిల్లల్లో జాతీయోద్యమస్ఫూర్తి:**

స్వదేశీ ఉద్యమం పెద్దల్లోనేగాక పిల్లల్లోకి ఎలా చొచ్చుకుపోయిందో తెలిపే కథ బందా కనక లింగేశ్వరరావు రాసిన 'నా యింట్లో కూడా ప్రవేశించిందే' అన్న కథ. ఈ కథలో నారాయణరావు డిప్యూటి కలెక్టర్. సాధ్యమైనంత వరకు ఉద్యమకారుల్ని జైలుకు పంపి రావు బహద్దరు బిరుదు పొందాలనేది ఆయన సంకల్పం. ఆయనకు తగిన భార్య విశాలాక్షి. స్వరాజ్యోద్యమంలో పాల్గొన్నందుకు తన అల్లుడిని ఇంటికి రావద్దని కట్టడి చేసింది. అయితే ఆ ఇద్దరికీ తమ ఒక్కగానొక్క కొడుకు సూరీడు నుంచే వ్యతిరేకత ఎదురైంది. సూరీడు, రాము స్కూలు విద్యార్థులు, స్నేహితులు. రాము తల్లి సూరీడుకు కూడా పాఠాలు నేర్పుతూ ఉంటుంది. రాట్నం వడుకుతూ పాటలు పాడుతూ పాఠాలు చెప్తుంది. సూరీడుకు ఆమె దేశభక్తి పాటలు బాగా నచ్చాయి. పాఠాల కన్నా రాట్నం అతనికి ఆకర్షణీయంగా ఉంటుంది. ఇంటికొచ్చి పాటలు పాడతాడు. రాట్నం లేకుండా పాడిన పాటలు బాగాలేవని ఎలాగైనా రాట్నం సంపాదించాలని అనుకుంటాడు. ఇంట్లో వెదికి ఒక వెండి బేడ సంపాదిస్తాడు. దానికి బుట్ట మామిడి పండ్లు కొంటాడు. వాటిని అమ్మి రాట్నం కొని ఇంట్లో తెచ్చిపెట్టుకుంటాడు. దానిని తిప్పుతూ పాటలు పాడతాడు. అది తెలిసిన నారాయణ రావు "నా యింట్లో కూడా ప్రవేశించిందే' అని ఆశ్చర్యపోతాడు.

**4. ఉద్యమ వ్యతిరేకుల్లో పరివర్తన:**

మొదట్లో ఉద్యమానికి దూరంగా, ఉద్యమం గురించి ఏమీ పట్టనట్లు, నిర్లక్ష్యంగా ఉన్నవాళ్ళు క్రమంగా ఉద్యమం వైపు ఆకర్షితులై, ప్రచారం చేసిన వారి విధానాన్ని కొన్ని కథలు చిత్రించాయి. అలాంటి వాటిల్లో "దోష పరిహారం' ఒకటి. మద్యపాన ప్రియుడైన వ్యక్తి క్రమంగా మద్యపాన వ్యతిరేకోద్యమ కార్యకర్తగా మారిన యువకుని కథే ఇది. శ్యామ సుందరమూర్తి ఇంగ్లండులో బారిస్టర్ చేసి మద్రాసులో ప్రాక్టీసు పెడతాడు. అతనికి తాగుడు అలవాటైంది ఇంగ్లండులోనే. స్వదేశం తిరిగి వచ్చాక కూడా ఆ అలవాటు పోలేదు. దేశంలో బెంగాల్ విభజనోద్యమం పెల్లుబికింది. కాంగ్రెస్‌లో అతివాదులు, మితవాదులు ఏర్పడ్డారు. జాతీయతా భావాలు పెల్లుబుకుతున్నాయి. తిలక్ లాంటి వాళ్ళు జైలుకు పోయి వస్తున్నారు. పంజాబులో హత్యలు జరిగాయి. గాంధీ రాజకీయాల్లో ప్రవేశించాడు. ఉద్యమం క్రమక్రమంగా బలపడుతుంది. కానీ ఇవేమి పట్టలేదు శ్యామసుందర మూర్తికి. కచేరీకి వెళ్ళడం, మద్యం తాగడం, తన వృత్తిని చూసుకోవడం ఇదే అతని దినచర్య.

ఒకరోజు మద్యం తీసుకురాడానికి వెళ్ళిన నౌకరు ఒట్టి చేతులతో తిరిగి వచ్చాడు. స్వరాజ్యపు పార్టీవారు కల్లు సారాయి దుకాణాల ముందు ఆందోళన చేస్తున్నందువల్ల అమ్మకాలు, కొనుగోళ్ళు ఆగిపోయాయి. ఆందోళనలో పాల్గొన్న వారిలో ఆర్యసమాజ ప్రధాని మహాత్మ, హిందూ ముస్లిం ఐక్యత కోరే మౌల్వి సాహెబు, న్యాయవాద వృత్తిని వదిలి నాన్ కోఆపరేషన్‌లో చేరిన వైష్ణవుడు, సర్వస్వం త్యాగం చేసి సర్వెంట్స్ ఆఫ్ ఇండియాలో పనిచేస్తున్న త్యాగి, ఇద్దరు సేవా సమితి సభ్యులు ఉన్నారు. శ్యామసుందరమూర్తి తన స్నేహితులతో కలిసి వచ్చి మద్యం దుకాణంలోకి దూరతాడు. ఎవరి బోధనలు పట్టించుకోడు. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరుగుతుంది. చేసేదిలేక ఆయన ఇంటికి తిరిగి వస్తాడు. అందరూ దూరమవడంతో, అతను ఏకాకి అవుతాడు. అతని భార్య సునంద అతనికి జ్ఞానబోధ చేస్తుంది. చివరికి అతనిలో మార్పు వస్తుంది. ఒక ఉత్తరం రాసి పోస్టులో వేస్తాడు. అప్పటి నుండి ఖద్దరు వస్త్రాలు ధరించి మంచిగా ప్రవర్తిస్తాడు. ఖద్దరు ప్రచారం కోసం ఒక లక్ష రూపాయలు కాంగ్రెసుకు ఇస్తాడు. న్యాయవాద వృత్తిని వదిలేస్తాడు. కల్లు, సారా నిర్మూలనోద్యమంలో చేరతాడు.

**5. స్వదేశీ నిబద్ధత:**

అద్దకం వ్యాపారంలో బాగా అభివృద్ధి చెంది మొదటి ప్రపంచ యుద్ధ ప్రభావంతో దివాలా తీసిన కుటుంబాన్ని సహాయ నిరాకరణోద్యమంలో భాగమైన ఖద్దరు ఉద్యమం ఎలా ఆదుకుందో నిరూపించిన కనుపర్తి వరలక్ష్మమ్మ రాసిన 'కుటీరలక్ష్మి' కథ. ఈ కథలో వెంకటస్వామి తాత ముత్తాతలందరూ అద్దకం వ్యాపారులే. ఆ వృత్తినే స్వీకరించిన వెంకటస్వామి ఎవరూ ఊహించలేనంత ఎత్తుకు ఎదిగి, పెద్ద షావుకారు అయ్యాడు. రామలక్ష్మి అతని భార్య. పన్నెండేళ్ళు ఏ ఆటంకం లేకుండా వ్యాపారం కలిసి వచ్చింది.

1914 సంవత్సరంలో మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత భారతదేశంలో ధరలు పెరిగాయి. జర్మనీ బట్టలకు, మాంచెస్టర్, రంగూన్ బట్టలకు ధరలు పెరిగాయి. రూపాయికి ఆరుగజాలమ్మే మిల్లుగుడ్డ ఒక గజమైంది. ముప్పై రూపాయలమ్మే రంగు పీపా మూడు వందలైంది. ధరలు పెరిగినా వెంకటస్వామి ముందే చేసుకున్న మాట ప్రకారం పాత ధరలకే బట్టలు సప్లై చేయాలి. కనుక వెంకటస్వామి నిలదొక్కుకోలేక పోయాడు. అద్దకం వ్యాపారం మాని నీలిమందు వ్యాపారం ప్రారంభించాడు. అయినా కలిసి రాలేదు. ఒక వేసవి రోజున అతని అద్దకపు కొట్లన్నీ కాలిపోయాయి. మిల్లు తానుల దిండ్లు, రంగు బట్టల దిండ్లు అన్నీ కాలిపోయాయి. ఈ వార్త వినగానే వెంకటస్వామి స్పృహ తప్పిపోయాడు. మరలా లేవలేదు.

ఇద్దరు మగపిల్లలతో రామలక్ష్మి దిక్కులేనిదైంది. అప్పుల వాళ్ళు సర్వం లాక్కున్నారు. కట్టుబట్టలతో నిలబడింది రామలక్ష్మి. ఎవరో నిజాయితీ పరుడు తెచ్చిచ్చిన ఎనిమిది వందలతో కొంచెం నేల కొని గుడిసె వేసుకుంది. ఇరుగు పొరుగు ఇళ్ళలో కూలి పని చేసినా ఇద్దరు పిల్లల్ని పోషించడం కష్టమైంది. ఈ లోపల 1921 సంవత్సరంలో సహాయ నిరాకరణోద్యమం విజృంభించగా మద్యపాన నిషేధ ప్రయత్నాలు జరుగుతున్నాయి. స్వదేశీ సంతలు సభలు. ఏ ఇంట్లో చూసినా రాట్నాలు, కుదుళ్ళు ఏకులు, పత్తి – ఇవే కనిపిస్తున్నాయి..

రామలక్ష్మి ఊళ్ళో కూడా జాతీయ ఉపసంఘం, జాతీయ పాఠశాలలు వెలిశాయి. రాట్నాన్ని కూలికి వడికే వాళ్ళకి ఖద్దరు పరిశ్రమ వాళ్ళే ఏకులు తెచ్చి ఇచ్చి వడికిన నూలును వీసెకు రూపాయి పావలా కూలి ఇచ్చి తీసుకొనిపోతారు. ఆసు కూడా పోసిస్తే మరో పావలా అదనం. నూలు బాగా సన్నగా ఏకితే మరి కొంత అదనంగా ప్రతిఫలం. రామలక్ష్మి ఈ పనిలో కుదురుకుంది. కొడుకులను ఇద్దరినీ జాతీయ పాఠశాలలో చేర్చింది ఇరుగుపొరుగు ఇళ్ళలో చేసే పని మాని ఖద్దరుతోనే జీవనం సాగించడం మొదలు పెట్టింది. కాల పరీక్షలకు తట్టుకొని నిలబడ్డ వాళ్ళకు స్వదేశీ ఉద్యమం స్వయం సమృద్ధి జీవితాన్ని అందించిన వాస్తవానికి ఈ కథ ప్రతిబింబం.

**6. స్వాతంత్ర్యోద్యమం – కుటుంబ సంఘర్షణలు, సామరస్యాలు:**

స్వాతంత్ర్యోద్యమం కుటుంబ సంబంధాల్లో కలిగించిన ఘర్షణను చిత్రించిన కథల్లో పేర్కొనదగింది జి. వి. కృష్ణారావు రాసిన 'అనిర్వచనీయ ఖ్యాతి' కథ. ఈ కథలో కట్నం కారణంగా భర్త తిరస్కరించిన ఉష స్వాతంత్ర్యోద్యమంలోకి వెళ్తుంది. సత్యాగ్రహంలో పాల్గొని రెండేళ్ళు జైలు శిక్షను అనుభవిస్తుంది. జైలు నుండి విడుదలై రైల్లో ఇంటికి వస్తూ రకరకాల కలలు కంటుంది. తనకు అఖండ స్వాగతం లభిస్తుందనుకుంటుంది. స్టేషన్లో దిగి చూస్తే తన కోసం ఎవరూ రాలేదు. ఆశ్చర్యపోతుంది. ఇంటికి చేరుకుంటుంది. ఆమె అన్న వచ్చి తలుపు తీసి చూస్తాడు. నిర్ఘాంతపోయి తేరుకుని వాళ్ళ నాన్నను లేపి విషయం చెప్తాడు. నాన్న రెండేళ్ళ క్రితమే తన కూతురు చచ్చిపోయిందంటాడు. ఉష భోరున ఏడుస్తుంది. తాను స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నానంటుంది. ఆమె అన్న నోటికొచ్చినట్లు తిడతాడు. ఆమె ఎదురు తిరుగుతుంది. ఇంటి వాళ్ళందరు ఉష చెడి పోయిందనుకుంటారు. ఆమె స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నదంటే వాళ్ళు నమ్మరు. చివరికి ఆమె అన్న, అతని బావమరిది రఘు కలిసి ఆమెను చంపి ఊరి కాలవలో పడేస్తారు. అయినా సూర్యుడు తూర్పు దిక్కునే ఉదయించాడు.

స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొంటున్న స్త్రీలను ఇంటివాళ్ళు అపార్థం చేసుకున్నట్లే బయటి వాళ్ళు అపార్థం చేసుకున్నారు. అలా అపార్థానికి లోనైన ఒక ఉద్యమకారిణి కథ పెమ్మరాజు రాజగోపాలం రాసిన "నారీ హృదయము'.

**7. ఉప్పు సత్యాగ్రహం:**

గాంధీజీ నాయకత్వంలో సాగిన జాతీయోద్యమంలో సహాయ నిరాకరణోద్యమం తర్వాతి దశ ఉప్పు సత్యాగ్రహం. ఈ ఉద్యమం మీద కూడా కొన్ని కథలు వచ్చాయి. వాటిలో ముఖ్యమైంది రాయసం వెంకటశివుడు రాసిన "నీలవేణి' కథ.

నీలివాడకు కొంత దూరంలో సముద్రం. పన్నెండు వందల మైళ్ళ దూరంలో పశ్చిమ సముద్ర తీరంలో గాంధీ మహాత్ముడు పన్నిన ఉప్పు సత్యాగ్రహ రహస్యం తూర్పున తెలుగుదేశంలోని కుగ్రామం నీలివాడకు పాకింది. అక్కడొక శాంతి శిబిరం వెలిసింది. దాని దళాధిపతి ప్రసాదరావు చౌదరి. ఆయనొకరోజు ఇరవైమంది శాంతి సైనికులను తీసుకొని వచ్చి అక్కడి ఇసుక తిన్నెల మీద శిబిరం ఏర్పాటు చేసుకున్నాడు. అక్కడ సేకరించిన ఉప్పును ఇతర సత్యాగ్రహ దళాలకు పంపిస్తాడు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు వాళ్ళు సేకరించిన ఉప్పురాశులను పాడు చేస్తూ ఉండేది.

ఒకరోజు తెల్లవారక ముందే ప్రసాదరావు బయలుదేరి వెళ్ళాడు. ఒకచోట జెండా నాటి ఉప్పును సేకరించే ప్రయత్నం చేస్తున్నాడు. అప్పుడు అతనిని రహస్యంగా వెంబడించిన జవాన్లు అతన్ని లాఠీలతో కొట్టారు. 'హరిహరా! గాంధీకి జై' అంటూ ప్రసాదరావు స్పృహ తప్పి పడిపోయాడు. జవాన్లు వెళ్ళిపోయారు. సూర్యోదయమౌతుండగా నీలివాడలోని నీలమ్మ, ఆమె అన్న, తమ్ముడు ఆడుకోడానికి అక్కడికి వచ్చి స్పృహ తప్పిపడి ఉన్న ప్రసాదరావును చూసి అతనికి సపర్యలు చేసి స్పృహ తెప్పిస్తారు. అన్న గ్రామంలోకి వెళ్ళి మనుషుల్ని తీసుకురాగా ప్రసాదరావును వాళ్ళు గ్రామంలోకి తీసుకెళ్ళారు. దెబ్బలకు మందులు వేస్తారు. నీలమ్మ, ఆమె తల్లి అతనికి సపర్యలు చేయగా రాత్రికి స్పృహలోకి వస్తాడు. వాళ్ళు అతనికి సంగతులన్నీ చెప్తారు. పతాకం జాగ్రత్తగా ఉందని తెలిసి అతడు సంతోషిస్తాడు. నీలమ్మ అంతా తానే అయ్యి అతనిని కాపాడుతుంది. మర్నాడు అతన్ని వెతుక్కుంటూ శాంతి సైనికులు వచ్చి, అతనికి జరిగిన సంగతులన్నీ చెప్పి, శిబిరానికి తీసుకుపోవాలనుకుంటారు. కానీ గ్రామ ప్రజలు కొన్ని రోజులు తమ గ్రామంలోనే ఉండటం మంచిదంటారు. కొన్ని రోజులకు ప్రసాదరావు పూర్తిగా కోలుకుంటాడు. శిబిరానికి పోవాలని ప్రయత్నిస్తాడు. నీలమ్మ, ఆమె తల్లి కోరిక మీద దేశ పరిస్థితులు, ఉప్పు సత్యాగ్రహం, స్వరాజ్య సంపాదన మొదలైన అంశాలను వివరిస్తాడు. ఒకరోజు నీలమ్మ తల్లి "మా పల్లెవాళ్ళకు కూటికి లేకున్ననూ కల్లు ఖర్చు తప్పదు నాయనా" (చంద్రశేఖరరెడ్డి రాచపాళెం : 2006 : పుట : 63) అంది. ప్రసాదరావు మద్యపాన నిషేధాన్ని గురించి ఆ గ్రామ ప్రజల్లో అవగాహన కలిగిస్తాడు. అందరూ దానిని నమ్మేటట్లు చేస్తాడు. ప్రసాదరావు వల్ల ప్రభావితులైన ఆ గ్రామ ప్రజలు శాంతి సైన్యంలో మేమూ చేరతామని ముందుకు వస్తారు. ఉప్పును గుట్టలు గుట్టలుగా తయారు చేస్తారు. మద్యపాన నిషేధం పల్లెపల్లెకూ పాకి ప్రజలు గుంపులు గుంపులుగా శిబిరానికి వస్తున్నారు. ప్రజలు వేసే ప్రశ్నలకు ప్రసాదరావు సమాధానాలు చెప్తున్నాడు. ఒకరోజు ఒక వ్యక్తి తమను కల్లు, సారా మానమని చెప్పేటప్పుడు శాంతి సైనికులు కాఫీ, ఉప్మాలు మానాలన్నాడు. ప్రసాదరావు సైనికులతో చర్చించి కాఫీ మాన్పిస్తాడు.

రాజధానిలో నాయకులు ఒకరొకరు అరెస్టు కావడం వల్ల వెంటనే తన దళంతో వచ్చి ఉన్నత పదవిని స్వీకరించాలని ప్రసాదరావుకు ఆహ్వానం వస్తుంది. ప్రజలు అతి కష్టం మీద విషాదంగా అతనికి వీడ్కోలు చెప్తారు. నీలమ్మకు చెప్పివద్దామని వెళ్తాడు అతను. ఆ ఇద్దరిలో ఇదివరకే పరస్పరం ప్రేమ ఉంది. ఆమె హృదయం అతనికి తెలిసింది. అతని హృదయం ఆమెకు తెలపాలనుకొని ""ఐననూ దేశమంతయూ సంక్షోభించెడి ఈ సమయమున పెండ్లి మాటలు తలపెట్టుట అనుచితము గదా!" (చంద్రశేఖరరెడ్డి రాచపాళెం : 2006 : పుట : 64) అనుకున్నాడు. ఆమె కూడా అలాగే అనుకుంది. అతను ఆమె వేలికొక ఉంగరం పెట్టి ముద్దుపెట్టుకున్నాడు. పల్లె నుంచి వీడ్కోలు తీసుకున్నాడు.

కొన్ని రోజులకే అతను అరెస్టవుతాడు. ఏడాది జైలు శిక్షపడింది. ఈలోగా నీలవేణి గొప్ప కార్యకర్త అవుతుంది. స్త్రీలు నిర్వహించే విదేశీ వస్త్ర బహిష్కరణోద్యమంలో పాల్గొంటుంది. పగలంతా ఎండలో బజారులో నిలబడి వీదేశీ వస్త్రాలకు ఎగబడేవారిని కొనవద్దని ప్రచారం చేసింది. వాళ్ళ చీవాట్లు, సైనికుల కఠిన చర్యలు లెక్కచేయకుండా ఉద్యమం నడిపిస్తుంది. ఉద్యమ పిలుపునందుకొని మద్రాసు వెళ్ళింది. అరెస్టయింది. ఆర్నెల్లు జైలు శిక్ష అనుభవించింది. గాంధీ ఇర్విన్ ఒడంబడిక అనుసరించి విడుదలైంది. ప్రసాదరావు ఆమెను కలుసుకున్నాడు. కార్యకర్తల సమక్షంలో వాళ్ళు పెళ్ళి చేసుకున్నారు. ఆమెకు జైలు శిక్ష వేసిన రాతి గుండె న్యాయాధిపతి రాజరత్న మొదలియార్ భార్య విలువైన హారాన్ని ఆమె మెడలో వేస్తుంది. ఉద్యమకారులు ప్రజలతో మమేకమైతే ఉద్యమానికి ప్రజల అండదండలు లభించే తీరుకు ఈ కథ నిదర్శనం.

**8. విమర్శనాత్మక దృష్టి:**

జాతీయోద్యమాన్ని ఆరాధనా భావంతో, భక్తితో సమర్థిస్తూ అనేక మంది కథలు రాశారు. అయితే మరికొందమంది కథకులు ఆ ఉద్యమాన్ని విమర్శనాత్మక దృష్టితో చిత్రించారు. గాంధీ సిద్ధాంతంలోని పరిమితుల్ని, అశాస్త్రీయాంశాలను చర్చకు పెట్టారు. ఉద్యమంలోని అవకాశవాదాన్ని ఎత్తి చూపారు.

మల్లాది రామకృష్ణశాస్త్రి రాసిన "కైంకర్యం' కథలో వెంకటస్వామి అనే కిళ్ళీ కొట్టువాడి పాత్ర ద్వారా ఉద్యమంలో మద్యపాన నిషేధాన్ని చర్చకు పెట్టాడు రచయిత. వెంకట స్వామి పేరుకు కిళ్ళీ కొట్టువాడేగానీ అతనికి పెద్ద పెద్ద వాళ్ళతో సంబంధాలున్నాయి. ఆయన పచ్చి కాంగ్రెస్‌వాది. అతను అన్ని అవసరాలకు ఖద్దరు వాడతాడు. తమలపాకులు తుడవడానికి, కొట్లో దుమ్ము దులపడానికి కూడా ఖద్దరే వాడతాడు. పొద్దున్నే మహాత్ముని బొమ్మకు హారతి పడతాడు. ఎక్కడ కాంగ్రెస్ మీటింగు జరిగినా హాజరవుతాడు. చందాలిస్తాడు. అలాంటి వెంకటస్వామి మద్యపాన నిషేధం అమల్లో ఉండగా దొంగసారా అమ్మాడన్న ఆరోపణపై అరెస్టవుతాడు. కోర్టులో మద్యపానాన్ని సమర్థిస్తాడు. జాతీయోద్యమంలోని కొందరు అవకాశవాదుల్ని ఎండగట్టే కథ ఇది. సమకాలీన ఉద్యమాన్ని స్వార్థం కోసం వాడుకునే తత్వాన్ని బట్టబయలు చేస్తుంది ఈ కథ.

ముద్దుకృష్ణ రాసిన 'నా మంత్రి' కథ కాంగ్రెస్ నాయకత్వంలో నడిచిన స్వాతంత్ర్యోద్యమాన్ని విమర్శనాత్మకంగా చిత్రించాడు. అధికారం చేజిక్కేదాకా ఉద్యమంలో పాల్గొని అధికారం రాగానే ప్రజల్ని విస్మరించే రాజనీతిని ఎండగట్టే కథ ఇది. ఈ కథ నూటికి నూరు శాతం జాతీయోద్యమ కథ. దాసు గాంధీ ఉపన్యాసాలకు ఆకర్షితుడై ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్తాడు. జైల్లో పరిచయం అయిన వ్యక్తి తదనంతర కాలంలో కాంగ్రెస్ మంత్రిగా దాసు గ్రామానికి వస్తాడు. కానీ దాసుని అలక్ష్యం చేస్తాడు. దీంతో మనస్తాపానికి గురైన దాసు ఆ మంత్రి నుంచి దూరంగా వెళ్ళిపోతాడు. జాతీయోద్యమకాలంలోనే ఆ ఉద్యమ నాయకత్వంలోని ప్రజా వ్యతిరేక స్వభావాన్ని ప్రదర్శింది ఈ కథ.

సంఘ సంస్కరణోద్యమాన్ని జాతీయోద్యమాన్ని తిరస్కారభావంతో చూసిన రచయిత చలం. కందుకూరి, గాంధీల వ్యక్తిత్వాల మీద గౌరవం ఉన్నా వాళ్ళ ఉద్యమాల మీద ఆయనకు అంతగా నమ్మకం లేదు. జాతీయోద్యమాన్ని వ్యంగ్యంగా విమర్శిస్తూ "సుశీల', "అప్పుడు ఇప్పుడు', "1960', "ఆత్మార్పణ', "ఆ రాత్రి' వంటి కథలు రచించాడు.

స్వదేశీ ఉద్యమం వెర్రి సెంటిమెంటు అనే దృష్టితో "అప్పుడు-ఇప్పుడు' కథ రాసాడు. గాంధీజీ స్వరాజ్యం సిద్ధాంతం కూడా అర్థం లేనిదని "1960' కథలో పేర్కొన్నాడు. చలంలాగానే కొడవటిగంటి కుటుంబరావు కూడా "షావుకారు సుబ్బయ్య', "రసికుడు' వంటి కథల్లో జాతీయోద్యమాన్ని విమర్శనాత్మకంగా చిత్రించాడు.

**9. సాంఘీక విముక్తి – రాజకీయ విముక్తి:**

ఆధునిక కాలంలో భారతదేశంలో మొదట సంఘసంస్కరణోద్యమం వచ్చింది. ఆ తర్వాత జాతీయోద్యమం వచ్చింది. కొన్నాళ్ళు రెండు ఉద్యమాలు కలిసే నడిచాయి. అయితే సంఘ సంస్కరణోద్యమం వెనకబడి జాతీయోద్యమం బలోపేతమైంది. అప్పట్లో మేధావుల్లో సంఘ సంస్కరణ, స్వాతంత్ర్యోద్యమాల్లో ఏది ముఖ్యం అనే చర్చ కూడా జరిగింది. రచయితలు ఈ చర్చకు స్పందించి అనేక కథలు రాశారు.

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి రాసిన "మొదటిదాడి' కథలో జానకమ్మ, సుభద్ర పాత్రల ద్వారా రాజకీయోద్యమంకన్నా సంఘ సంస్కరణోద్యమమే గొప్పదని చాటాడు. జానకమ్మ తొమ్మిదో సంవత్సరంలోనే వితంతువవుతుంది. తర్వాత బి.ఏ. పాసై సంఘ సంస్కరణ భావాలు అలవర్చుకొని తన మామ కూతురైన సుందరిని అరవయ్యేళ్ళ వెంకట సోమయాజులు తాత రహస్యంగా పెళ్ళి చేసుకోబోతున్నాడని తెలిసి దాడి చేసి ఆ పెళ్ళిని ఆపి ఆడవాళ్ళందరికి ధైర్యాన్నిస్తుంది.

జానకమ్మ చిన్నాన్న కూతురు సుభద్ర రాజకీయాల్లోకి దిగుతుంది. మూడు నెలల జైలు శిక్ష అనుభవిస్తుంది. జైలుకెళ్ళిన వాళ్ళే నిజమైన దేశభక్తులని వాదిస్తుంది. "దేశమాత పిలుస్తుంది. అగ్నిహోత్రంలోకి దూకండి." (చంద్రశేఖరరెడ్డి రాచపాళెం : 2006 : పుట : 69) అని జానకమ్మను రెచ్చగొట్టగా, అది జానకమ్మకు ఇష్టంలేక సంఘ పునర్నిర్మాణాన్ని విస్మరించి రాజకీయాల్లో చొరబడటం మంచిది కాదని, రాజకీయాలకన్నా సంఘ సంస్కరణే ముఖ్యమని ఆ బాటలోనే ముందుకు వెళ్తుంది.

దీనికి భిన్నమైన కథే 'పూర్వజన్మ దాంపత్యం'. సీతారామశాస్త్రి, కృష్ణారావు బాల్య స్నేహితులు, అయితే వాళ్ళ అభిప్రాయాలు వేరు. శాస్త్రి స్వాతంత్ర్యోద్యమ అభిమాని. కృష్ణారావు కేవలం సంఘ సంస్కరణాభిలాషి. శాస్త్రి బి.ఏ. పరీక్షకు ఫీజు కట్టి సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొనడం కోసం దానిని మధ్యలోనే ఆపేస్తాడు. ఉద్యోగం చేసే ఆలోచన మానుకొని ఉద్యమంలో చేరతాడు. ఖద్దరు ధరిస్తాడు. ఖద్దరు ప్రచారం చేస్తాడు. స్వదేశీ పరిశ్రమల వల్లే దేశ దారిద్ర్యం పోతుందని నమ్ముతాడు. మహాలక్ష్మి వితంతువు. ఆమె వితంతువులకు విద్యాసంస్థలు స్థాపించి వాళ్ళను విద్యావంతుల్ని చెయ్యాలంటుంది శాస్త్రితో. కాని అప్పటికే (1929) లాహోరు కాంగ్రెస్ సంపూర్ణ స్వరాజ్య సాధనకే కృషి, త్యాగం చెయ్యాలని చెప్పి మహాలక్ష్మిని ఆంధ్రరాష్ట్ర స్త్రీలలో స్వరాజ్య వాంఛను కలిగేలా కృషి చెయ్యమని చెప్పి ఒప్పిస్తాడు.

**10. ఆనందహేల – కర్తవ్య నిర్దేశం:**

స్వాతంత్ర్యం వచ్చిన నాటి ఆనందాన్ని కొన్ని తెలుగు కథలు రికార్డు చేశాయి. జాతీయోద్యమం ప్రజలకు కల్పించిన ఆశల్ని, ఇచ్చిన ధైర్యాన్ని ఆ కథలు ప్రతిఫలించాయి. అలాంటి కథల్లో సహజానందం రాసిన 'ఆగష్టు పదిహేను' ఒకటి.

ఈ కథలో స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా నాయకుడు పతాక స్థాపన చేశాడు. దేశమే సింహాసనం. ప్రజలదే ఆ సింహాసనం. ప్రజలే పాలకులు అనే భావం అందరిలో కలిగింది. ప్రజల జయధ్వానాలు నాయకునికి కళ్ళ నీళ్ళు తెప్పించాయి. అమరవీరుల సమాధుల మీద పూల వర్షం కురిపించారు. అశువులు బాసిన పిల్లలు, యువకులు, వృద్ధులను ప్రస్తావించి నాయకుడు ప్రసంగించాడు. ఆ వీరగాథలు విన్న ప్రజల హృదయాలు తల్లడిల్లాయి. నాయకుని ప్రసంగం కవితాత్మకంగా, ఆర్ద్రంగా, ఆవేశంగా సాగింది. ప్రజలు పూలవర్షం కురిపించారు స్వాతంత్ర్యోత్సవం ముగిసింది. ప్రజలు ఇళ్ళకెళ్ళారు. చీకటి పడుతుంది. దూరం నుంచి జేజేలు స్పష్టాస్పష్టంగా వినిపించాయి. ఒక గుంపు సభా వేదిక వైపు వచ్చింది. అది ఒక పేదల గుంపు అందరి మీద చినిగిన పేలికలు, అందరివీ నిర్జీవ ముఖాలు. వాళ్ళను చూసిన యువకుడు వాళ్ళను ఇళ్ళకు వెళ్ళమన్నాడు. అందరూ జై అని వికృతంగా అరిచారు. ఇద్దరు వృద్ధులు ముందుకు వచ్చి నలిగిన పూలమాలలు తీసి అమరవీరుల సమాధులపై వేశారు.

ఇంతలో మరో గుంపు వచ్చింది. అవీ దుమ్మునిండిన ముఖాలే. వాళ్ళకు ఆ ఉపన్యాసాలేవీ అర్థం కాలేదు. అయిన వాళ్ళలో ఏదో అవ్యక్త ఆశ. తమ జీవన వేదన నశిస్తుందన్న ఆశ. ఆ చినిగిన బట్టలు, ఆ మురికి, ఆ అజ్ఞానం ఇక ఉండవన్న ఆశ. వాళ్ళూ దుమ్మునిండిన పూలమాలల్ని సమాధుల మీద పెట్టారు. వికృతంగా జయ ధ్వానాలు చేశారు. వాళ్ళను చూసిన ఒక వృద్ధుడు ""ఈ సూర్యోదయం మీకే. దేశపు అశ్రుధార మీరే. యుగాల నుంచీ ఇప్పుడే మీకు మానవజన్మ. ఇది మీ యుగం. ఈ స్వాతంత్ర్యం మీ ఐశ్వర్యం. ఇక మీరు యాచకులు కారు. యజమానులు. ఇందు కోసమే వందలు వేలు ప్రాణదానం చేశారు. స్వాతంత్ర్యం మీ ఐశ్వర్యం." (చంద్రశేఖర రెడ్డి రాచపాళెం : 2006 : పుట : 70) అన్నాడు. అతని మాటలు వాళ్ళ మనసుల్లోకి దూసుకుపోయాయి. అతని భాష వాళ్ళకి అర్థం కాలేదు. అయినా అతని మాటల్లో ఏదో వెలుగు ప్రసరిస్తున్నట్లు తోచింది వాళ్ళకు. స్వాతంత్ర్యోద్యమం అన్ని వర్గాల ప్రజల్లో రేకెత్తించిన ఆశలకు ఈ కథ అద్దంపడుతుంది.

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి రాసిన "సముద్రము నందలి మంచుకొండలు', "కొత్తచూపు' మొదలైన కథల్లో జాతీయోద్యమాన్ని నిలుపుకొనే కర్తవ్యాన్ని గుర్తుచేశాడు.

పెద్దిబొట్ల సుబ్బరామయ్య "ముసలమ్మమరణం', "కళ్ళజోడు', "అలజడి' వంటి కథల్లో స్వాతంత్ర్యం ఎలా మాయగా మిగిలిపోయిందో చిత్రించాడు. "ముసలమ్మమరణం' కథలో గోవిందరావు స్వాతంత్ర్య సమరయోధుడు. అతని భార్య వసంత. గోవిందరావు 1930-32 మధ్యకాలంలో ఇంటర్మీడియెట్ చదివి గాంధీజీ పిలుపందుకొని స్వాతంత్ర్య సమరంలోకి దిగి జైలు పాలవుతాడు. జైలు నుంచి తన భార్యకు త్వరలోనే స్వాతంత్ర్యం వస్తుందని తాము బయటకు వచ్చి రామరాజ్యాన్ని స్థాపించటం ఖాయమని ఉత్తరాలు రాస్తుంటాడు.

స్వాతంత్ర్యం వచ్చింది. గోవిందరావు చనిపోతాడు. వసంతకు వయసు మీద పడింది. ఆర్థికంగా చితికిపోయింది. ఆమె స్వతంత్ర భారతాన్ని గురించి కన్న కలలు కల్లలైపోయాయి. శక్తి ఉన్నంత వరకు ఇళ్ళలో పని చేసి బతికింది. కొన్నాళ్ళకు పని చేసే శక్తి లేకుండా పోయింది. గుడి దగ్గర చెప్పులకు కాపలా కాసింది. ఆమెకు అక్కడ ఒక అవిటి యువతి పోటీ వచ్చింది. ఏ రకంగా బతకలేని పరిస్థితి ఏర్పడింది. ఒక రోజు ఆకలికి తాళలేక తనను చనువుగా చూసే ఒక ఇంటికి వెళ్ళి, ఆ ఇంట్లో కనిపించిన లడ్డులను ఎక్కువగా తిని ఊపిరాడక చచ్చిపోయింది. మున్సిపాలిటీ వాళ్ళు ఆ శవాన్ని దహనం చేస్తారు. స్వాతంత్ర్య సమరయోధుడు గోవిందరావు భార్య చనిపోయేనాటికి ఆమెకు మిగిలిన ఆస్తి ఒక మూట. ఆ మూటలో ఆమె భర్త జైలు నుంచి రాసిన ఉత్తరాలు, పెళ్ళినాటి ఫొటో, భర్త ఇంటర్‌లో తీయించుకున్న ఫొటో మాత్రమే ఉంటాయి.

ఇలా జాతీయోద్యమాన్ని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో, అనుకూలంగానో, విమర్శనాత్మకంగానో చిత్రించిన తెలుగు జాతీయోద్యమ కథలు మనకు లభిస్తున్నాయి. స్వాతంత్ర్యోద్యమాన్ని చిత్రించిన కథల్లో తాత్వికంగా సాంప్రదాయికత కనిపించవచ్చు. కొన్ని అభిప్రాయాలు, సంభాషణలు పాత్రల ధోరణులు ఇప్పటికీ అభివృద్ధి నిరోధకాలుగా కనిపించవచ్చు. జాతీయోద్యమం తెలుగు కథల్లో నామమాత్రంగా కనిపిస్తుందని చెప్పుకోవాలి. వేలకొద్ది కథల్లో చాలా తక్కువగా ఇటువంటివి లభిస్తాయి. కానీ దొరికిన కొద్దిపాటి కథల్లో ఆనాటి జనజీవితం కళ్ళకు కట్టినట్లు చిత్రించారు రచయితలు. ❁

# చలం - సుశీల

డా॥ గుంటుపల్లి గౌరి, లెక్చరర్, ఎస్.కె.బి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మాచర్ల, పల్నాడు జిల్లా.

ఆధునిక సాహిత్యంలో తెలుగు నవలా రచయితల్లో గుడిపాటి వెంకటాచలం ఒక విలక్షణ ఆలోచనా సరళి గలిగిన రచయిత. మూడు దశాబ్దాలపాటు తెలుగు సాహిత్యంలో పెద్ద దుమారం రేపిన చలం 18-05-1894లో జన్మించాడు. తల్లి వెంకటసుబ్బమ్మ, తండ్రి సాంబశివరావు. వీళ్ళ ఇంటిపేరు గంగరాజువారు. జన్మస్థలం కొమ్మూరు. చిన్నప్పుడే చలాన్ని గుడిపాటి వెంకటరామయ్య దత్తత తీసుకోవడం వల్ల చలం ఇంటిపేరు గుడిపాటిగా మారిపోయింది. చిన్నప్పటినుండే అనారోగ్యంతో ఉండేవాడు. చిన్న చిన్న తప్పులకే వాళ్ళ నాన్న చలాన్ని చావబాదేవాడట. చివరకు చచ్చిపోతాడేమోననే భయంతో వదిలిపెట్టేవాడట. అందువల్లే చలం చిన్నప్పటి నుండి తండ్రిపై ద్వేషం పెంచుకున్నాడు.

చలం ఇంట్లో పురాణాల గోష్ఠి ఎక్కువగా ఉండడంవల్ల దైవభక్తి అప్రయత్నంగా ఏర్పడింది. చలం చిన్నతనంలో పురాణ శ్రవణం కూడా చేశాడు. అప్పుడే సీత అగ్నిప్రవేశం చలం మనస్సుని కదిలించి వేసింది. బహుశా చలం అంతగా స్త్రీ స్వేచ్ఛను గురించి ఆలోచించడానికి చిన్న తనంలోనే బీజాలు పడ్డాయేమో. చలం ఉపాధ్యాయుడిగా, హెడ్ మాస్టర్‌గా, స్కూళ్ళ ఇన్‌స్పెక్టర్‌గా ఆంధ్రప్రదేశ్ నలుమూలలూ తిరిగాడు. ఎన్నో అనుభవాలను సంపాయించాడు. బెట్రాండ్ రస్సెల్, డి.హెచ్. లారెన్స్, మాటర్ లింక్, బోస్, రవీంద్రనాథ్ ఠాగూర్ చలం ఆలోచనలకీ, భావాలకీ పదును పెట్టారు. 1911లో చలం పెళ్ళి రంగనాయకమ్మతో జరిగింది. అంటే 17 ఏళ్ళ వయస్సులోనే ఆయన పెళ్ళి జరిగింది. ఇద్దరు కొడుకులు, ముగ్గురు కూతుళ్ళు. రవి, వసంత్ మగపిల్లలు. సౌరీస్, నిర్మల, చంపక ఆడపిల్లలు. రవి చిన్నతనంలోనే చనిపోయాడు. వసంత్ ఇల్లు విడిచి వెళ్ళిపోయాడు. సౌరీస్ తాపసిగా మారిపోయింది. అలా కుటుంబం విచ్ఛిన్నం కావడం చలాన్ని ఎంతగానో బాధించింది. చలానికి పెళ్ళి మీద గౌరవం ఉండేదికాదు. కారణం చిన్నతనంలో తన కుటుంబంలో జరిగిన తన చెల్లి పెళ్ళి, తన బావ ప్రవర్తన. స్త్రీ ఇష్టం తెలుసుకోకుండా, స్త్రీని అనుభవించాలనే పురుష అహంకారాన్ని చలం దుయ్యబట్టాడు. ప్రేమలేని పెళ్ళిళ్ళను హర్షించలేక పోయాడు. పెళ్ళి పేరుతో స్త్రీ ఎదుర్కొనే హింసను తూర్పారబట్టాడు.

**సుశీల – కథ**

**కథావస్తువు :** ఇందులోని ప్రధాన కథాంశం వైయుక్తిక ప్రేమ కన్నా సామాజిక సేవ గొప్పదని నిరూపించడం. మోహానికి, త్యాగానికి మధ్య ఉన్న తేడాని స్పష్టం చెయ్యడం. ఈ కథ జాతీయోద్యమ కాలంలో రాయబడింది.

**ఇతివృత్తం :** ఈ కథలో సుశీల, నారాయణప్ప భార్యాభర్తలు. పెద్ద స్థితిమంతులు. చాల అన్యోన్యంగా జీవిస్తూ ఉంటారు. సుశీల అందానికి మరోపేరుగా ఉంటుంది. ఊర్లో వాళ్ళకి నారాయణప్పతో ఏపనీ లేకపోయినా పని కల్పించుకొని ఇంటికి వచ్చి సుశీలని చూడ్డం చాలమందికి ఒక దినచర్య. సాయంత్రం అయ్యేటప్పటికి ఊళ్ళోని ఉద్యోగస్థులంతా నారాయణప్ప ఇల్లు చేరుకుంటారు. యిల్లు క్లబ్బులాగా ఉంటుంది. రకరకాల సదుపాయాలు అందుతుంటాయి. రోజు ఇల్లు రాత్రి 10.00 గం॥ల

వరకు మనుషలతో కళకళలాడుతూ ఉంటుంది. మనుషుల మధ్య సుశీల మెరుపుతీగలా వచ్చిపోతూ ఉంటుంది. ఆడ, మగ భేదం లేకుండా సుశీల అందరితో కరచాలనం చేస్తూ ఉంటుంది. చర్చలలో చాల ఉదారంగా వ్యవహరిస్తుంటారు. భార్యభర్తలిద్దరికీ ఒకరిమీద ఒకరికి ఎలాంటి అనుమానాలు ఉండవు. మనసులోని విషయాలు ఏవీ దాచుకోకుండా ఒకరితో ఒకరు చెప్పుకుంటూ ఉంటారు. సంకుచిత స్వభావాలు లేకుండా ప్రజాస్వామిక భావాలని పాటిస్తూ ఉంటారు. వ్యక్తి స్వేచ్ఛను గౌరవిస్తూ ఉంటారు.

అదేసమయంలో ఆ ఊళ్ళోకి ఒక తురక పోలీసు ఆఫీసరు వస్తాడు. అతని పేరు సులేమాను. అందంగా ఉంటాడు. దేహదారుఢ్యం కలిగియుంటాడు. అప్పటికే ఇంగ్లండు వెళ్ళి వచ్చి ఉంటాడు. పెళ్ళికాని యువకుడు. ఆ ఊళ్ళోకి వచ్చిన రోజే నారాయణప్ప ఇంటికి వస్తాడు. మొదటిరోజే సులేమానుకి, సుశీలకి మధ్య స్నేహం ఏర్పడుతుంది. క్రమంగా వాళ్ళ స్నేహం వాళ్ళిద్దరి మధ్య ప్రేమకు దారితీస్తుంది. మొదట్లో సుశీల ఈ ప్రేమతో చాలా పోట్లాడుతుంది. ఒకటి రెండు రోజులు అదంతా ఉత్త స్నేహమనుకొని సమాధానపడుతుంది. ఆ తరువాత అతనికి దూరంగా ఉండడానికి ప్రయత్నిస్తుంది. ఒకటి రెండుసార్లు భర్తతో చెప్పేయాలనుకుంటుంది. అయితే ఆమెకు సులేమానుపై కలిగిన కొత్త ప్రేమ ఆమెను పూర్తిగా స్వాధీనం చేసుకుంటుంది. సులేమాను కనిపించకపోతే ఆమెకు ఊపిరాడని పరిస్థితి ఏర్పడుతుంది. సులేమానుది చాల పట్టుదలగల స్వభావం. సుశీలని చూసిన మొదటిరోజే ఆమెను తనదాన్ని చేసుకోవాలనుకుంటాడు. ఆమె ప్రేమని లోబరుచుకున్న దాకా నిద్రపోడు. ఒకరోజు సులేమాను పోలీసుల డ్రిల్లు చూడడానికి సుశీలను పిలుస్తాడు. నారాయణప్ప వెళ్ళద్దంటాడు. సుశీల వెళ్తుంది. ఇద్దరిమధ్యా భేదాభిప్రాయాలు ఏర్పడతాయి. అప్పుడు దేశమంతటా నాన్–కోపరేషన్ ఉద్యమం వస్తుంది. వెంటనే నారాయణప్ప తను వేసుకున్న సూటుబూటు తీసివేసి ఖద్దరు కట్టడం మొదలుపెడతాడు. ఒకరోజు రాత్రి సులేమాను సుశీల మాట్లాడుకుంటూ ఉంటారు. ఇద్దరినీ నారాయణప్ప చూస్తాడు. సులేమాను వెళ్ళిపోయాక సుశీలను అడుగుతాడు. 'నాతో చెప్పవా ఎందుకు బాధపడతావు నాతో చెపితే బాధ తగ్గుతుందని' చెపుతాడు. నామీద నమ్మకం లేదా అని అడుగుతాడు. సుశీల సమయం వచ్చినప్పుడు నీకే తెలుస్తుంది అని చెప్తుంది. నారాయణప్ప సులేమానుని ఇంటికి రావద్దని చెపుతాడు. సుశీల సులేమాను కోసం ప్రతిరోజు సాయంత్రం బంగ్లాకు వెళ్ళి కలిసి రావడం మొదలుపెడుతుంది. ఆలోపు నాన్–కోపరేషన్ ఉద్యమం ఎక్కువవుతుంది. అన్నిచోట్ల సమ్మెలు, మీటింగులూ చేస్తుంటారు. వాటన్నిటికి నారాయణప్ప నాయకత్వం వహిస్తాడు. సుశీల అదేమి పట్టించుకోదు. ఎప్పుడూ సులేమాను గురించే ఆలోచిస్తుంది. నారాయణప్ప ఉద్యమాన్ని నడుపుతున్నాడని జైల్లో పెడతారు. సుశీల ఉద్యమాన్ని నెత్తికెత్తుకుంటుంది. సులేమాన్ నుంచి దూరం కావడానికి అదే మంచిసమయం అనుకొని ఊరూరా తిరిగి ఖద్దరు బట్టలు అమ్మడం ప్రారంభిస్తుంది. నారాయణప్ప చాలా సంతోషిస్తాడు. దానితో సుశీలకి, సులేమాన్ ఇంటికి వచ్చినా మాట్లాడే ఓపిక ఉండేదికాదు. నారాయణప్పను మళ్ళీ రెండోసారి అరెస్టు చేస్తారు. మూడువేలు, జామీను ఇవ్వాలని లేకపోతే మూడునెలలు ఖైదీగా ఉండాలని తీర్పుచెబుతాడు. ఆ విషయంలో నారాయణప్పని చూసి సుశీల జాలిపడుతుంది. నారాయణప్ప మాట్లాడవలసిన మాటలు సుశీలే మాట్లాడుతుంది. "నన్ను కూడా జైల్లో పెట్టండి" అని అడుగుతుంది.

డిశంబరు 31 వస్తుంది. సులేమాను సుశీలతో ఇంక ఉద్యమం మానేస్తేనే మంచిదని చెపుతాడు. అప్పుడు సుశీల ఉద్యమం పోయిందేమోకాని అది నా హృదయం నించి పోలేదని చెబుతుంది. జైల్లో ఉండగా నారాయణప్పకు జబ్బుచేసి ఆరోగ్యం క్షీణిస్తుంది. సులేమాను పదేపదే సుశీల వెంటపడినా నారాయణప్ప జైలునుంచి వచ్చేవరకు నన్ను ముట్టుకోవద్దు అంటుంది. నారాయణప్పకు క్షయ అని డాక్టర్లు నిర్ధారిస్తారు. సులేమానుతో చెప్పకుండా నారాయణప్పను తీసుకొని సుశీల మదనపల్లె దగ్గరున్న హాస్పిటల్‌కు తీసుకువస్తుంది. రెండు నెలలు గడిచిన తరువాత సులేమాన్ సుశీల అడ్రసు తెలుసుకొని మదనపల్లెకు వస్తాడు. అక్కడ నారాయణప్పకు సేవలు చేస్తున్న సుశీలను సులేమాను చూస్తాడు. బాధపడతాడు. పలకరించకుండా వెళ్ళిపోదామనుకుంటాడు. సుశీల సులేమాన్‌ను చూస్తుంది. సులేమాన్‌తో రహస్యంగా మాట్లాడుతుంది. 'ఇక నన్ను మరచిపో! పెళ్ళి చేసుకో...' అని సులేమాన్‌తో చెబుతుంది. సులేమాను 'ఏం నామీద ప్రేమలేదా' అని అడుగుతాడు. సమాధానంగా సుశీల 'ఉంది కాని ఆయన మీద ఇంకా ఎక్కువ ప్రేమ పుట్టుకొచ్చింది' అంటుంది. అప్పుడు సులేమాన్ 'ఒకవేళ నారాయణప్ప

చనిపోతే' అంటాడు. సుశీలు 'ఆమాట అనకు చాలా కష్టంగా ఉంటుంది. ఆయన లేకపోతే నేనుంటానా!' అంటుంది. సులేమాన్ వెనుతిరుగుతాడు. నారాయణప్ప సుశీల వద్దకొచ్చి 'నీకు ఆనందం అక్కర్లేదా వెళ్లు' అని చెపుతాడు. అలా మాట్లాడకండి. అదంతా అయిపోయింది. మీ సేవ చెయ్యడానికి తగి ఉంటే ఎంత బాగుండేదనే దిగులు తప్ప ఇంకే బాధా నాకు లేదని అంటుంది. దానితో కథ ముగుస్తుంది.

**విశ్లేషణ :**

సుశీల చలం రాసిన 2వ కథగా గుర్తించడం జరిగింది. ఆయన మొదటి కథ భార్య. ఈ రెండూ సాహితి పత్రికల్లో 1924 లో అచ్చయ్యాయి. ఆ తరువాత 4 కథలు "కన్నీటి కాలువ" పేరుతో వెలవడ్డాయి. ఆ నాలుగు కథలలో ఆయన మొదట రాసిన ఈ రెండు కథలూ ఉన్నాయి. 1924 అంటే జాతీయోద్యమం ముమ్మరంగా కొనసాగుతున్న రోజులు. అందువల్లే "సుశీల" కథలో ప్రధాన పాత్ర అయిన సుశీల, ఆమె భర్త నారాయణప్ప జాతీయోద్యమంలో పాల్గొంటారు. నారాయణప్ప స్థితిమంతుడు, ఆదర్శవాది, అభ్యుదయ భావాలు కలవాడు. జీవితాన్ని విలాసమయంగా గడపడానికి అలవాటు పడినవాడు. అందమైన భార్య, సమాజంలో గుర్తింపు ఆయనని విలక్షణ వ్యక్తిగా నిలబెడతాయి. అయితే ఒక మనిషి జీవిస్తున్న సమాజాన్ని ఏ ప్రధాన అంశాలు ప్రభావితం చేస్తాయో, ఆ ప్రధాన అంశాలకు ఏ మనిషీ దూరం కాలేడనేది సుశీల కథ చదివితే బోధపడుతుంది.

సుశీల, సులేమాన్ ఆకర్షణకు గురై తన మనసు తన వశం తప్పిపోయి విలవిలలాడుతున్న సమయంలో సుశీల భర్త నారాయణప్ప స్వదేశీ ఉద్యమంలో అడుగుపెట్టి జైలుపాలవుతాడు. ఆరోగ్యం క్షీణించి మంచం పడతాడు. సులేమాను మోహంలోనుంచి బయటపడడానికి సుశీల నారాయణప్పతో పాటు స్వదేశీ ఉద్యమాన్ని నెత్తికెత్తుకుంటుంది. రాట్నం వడుకుతుంది. నూలు బట్టలమ్ముతుంది. ఈ కథలో వైయుక్తిక ప్రేమకు, సామాజిక సేవకు మధ్య ఘర్షణ మొదలవుతుంది. నారాయణప్ప ఏ పనీపాట లేకుండా అందరిని కూడేసి తన హోదాని గొప్పతనాన్ని రకరకాలుగా చాటుకుంటున్న సమయంలో సుశీల సులేమాను ఆకర్షణకు లోనవుతుంది. నారాయణప్ప స్వదేశీ ఉద్యమంలో పాల్గొని ఆరోగ్యం చెడగొట్టుకొని మంచాన పడిన తరువాత సుశీల మోహానికి దూరమై వైయుక్తిక సుఖాలకు, ప్రేమలకు దూరమై నారాయణప్పను కంటికి రెప్పలా కాపాడుతుంది. ఆమె మోహం కన్నా త్యాగం గొప్పదని నిరూపిస్తుంది. ఈ కథని మరో కోణంలో కూడా చూడవచ్చు. నారాయణప్ప భారతదేశానికి ప్రతినిధి అనుకుంటే సులేమాను పరాయి పాలకులకి ప్రతీకగా కనిపిస్తాడు. సుశీల పాలకుల పీడనంలో నలిగినా చివరకు తనదైన దృఢ సంకల్పంతో మిగిలిపోవాలనుకుంటుంది. అందుకే సులేమాను ఎంత ప్రలోభపెట్టినా చివరకు నారాయణప్ప సుశీలను సులేమానుతో వెళ్ళిపొమ్మని చెప్పినా తనుమాత్రం నారాయణప్పతోనే ఉండడానికి నిశ్చయించుకుంటుంది. "భర్త త్యాగం ముందు సుశీల లైంగిక స్వేచ్ఛ వెలవెలపోయింది. ఒక పరిధిలో లైంగిక స్వేచ్ఛ ఇత్యాది అల్పమైన శరీర ధర్మాలకంటే ఉదాత్తమైన మానసిక లోక ధర్మాలకే ఔత్కృష్ట్యం కలిగించడం మానవ ధర్మమనే సత్యాన్ని సుశీల కథ ద్వారా చలం ప్రతిపాదించాడు" అంటాడు డా॥ యన్. రామచంద్రగారు. ❁

**ఆధార గ్రంథాలు :**

1) చలం, గుడిపాటి. 'కళ్యాణి' (కథల సంపుటి). అరుణా పబ్లిషింగ్ హౌస్, ఏలూరు రోడ్డు, విజయవాడ.

2) బలరామ మూర్తి, ఏటుకూరు. 'చలం – స్త్రీ వాదం' (వ్యాస సంకలనం), విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ.

# దేశభక్తి ప్రబోధం - గరిమెళ్ళ గేయాలు

డా॥ ఆంజనేయుడు

ఏ దేశస్థునికైనా తన మాతృదేశంపై ప్రేమ, అభిమానం భక్తి ఉంటాయి. అవి వారి జీవనాడులలో ప్రవహిస్తూ త్యాగమూర్తులుగా తీర్చిదిద్దుతాయి. సాధారణ వ్యక్తి నుండి మహోన్నత స్థాయిని అలంకరించిన పౌరుని వరకు ఆ దేశం పట్ల గౌరవం కలిగి ఉంటాడు. పాలకుడు, సైనికుడు, రైతు, దేశ ఔన్నత్యాన్ని ఇనుమడింపచేస్తారు. కవి ఆ దేశ నానావిధములైన సకల సౌభాగ్యాన్ని గుర్తించి కీర్తించటమే కాకుండా ఆ వ్యవస్థలోని లోపాలను కూడా ఎత్తి చూపుతూ ప్రజలను చైతన్యపరుస్తాడు. ఏ దేశ కవికైనా తన దేశం పట్ల, తన ప్రజల పట్ల గల ప్రేమానురాగాలు తన రచనలో అంతర్లీనంగా చిత్రిస్తుంటాడు. John Naruda అనే కవి మాతృభూమిపై ఉన్న మమకారాన్ని క్రింది విధంగా కీర్తిస్తూ "నీ దేశానికి తప్ప మరెవవరికీ తలవంచకు" అని అంటాడు. To none but our Own land we bow a head. అలాగే వాల్టర్‌స్కాట్ రాసిన "పేట్రియాటిజమ్" అనే గీతం ప్రపంచంలోని అనేక దేశభక్తి గేయాలకు ఆదర్శప్రాయం. ఈ గేయం అనేక దేశాల కవులకు ప్రేరణ కూడా. ఇందులో ఈయన "ఈ దేశం నాది అని చెప్పుకోని, గర్వించని వాని బ్రతుకు వృధా" అంటాడు.

Breaths threre a man with soul so dead
Who never to himself hath said
This is my own my native Land.

మనకు రాయప్రోలు సుబ్బారావు గేయం స్ఫురణకు వస్తుంది. "ఏ దేశమేగినా ఎందుకాలిడినా ఏ పీఠమెక్కినా, ఎవ్వరెదురైనా పొగడరా నీతల్లి భూమి భారతిని"– అన్న గేయంలో నీ దేశాన్ని గూర్చి పాడుతూ గర్వించమంటాడు. ఇందులో స్వజాతి గౌరవాన్ని నిలపాలన్న ప్రబోధం మెండుగా కనిపిస్తుంది.

ఆంగ్లకవి జేమ్స్ థామ్సన్ రాసిన గేయంలో

Rule Britannia rule the waves
Britons never will be slaves - అని అంటాడు. ఈ గేయం మొదటి జార్జ్ పట్టాభిషేకం జరుగుతున్న సమయంలో రచించాడు. ఇందులో రాజభక్తి ప్రధానమైనది కానీ అందులోని ఆంగ్లేయులు ఎప్పుడూ బానిసలు కారాదు అన్న ఆకాంక్ష తొంగిచూస్తుంది. మన దేశాన్ని దాదాపు 200 సంవత్సరాలు పరిపాలించిన ఆంగ్లేయుల పాలన నుండి విముక్తిని పొందడానికి మన ప్రజలు చేసిన పోరాటం సత్యాగ్రహం, కత్తులు, కటార్లు, బాంబులు, ఫిరంగులు లేకుండా అహింస ద్వారా ఎంతోమంది మన జాతీయనాయకులు చేసిన కృషి, త్యాగ ఫలితంగా ఈ రోజు మనం స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్నాం. సిపాయిల తిరుగుబాటు, అంతకు ముందే వచ్చిన స్వతంత్ర పోరాటాలు మరుగుపడగా జాతి జాతంతా ఏకమై కాంగ్రెస్ నాయకత్వాన మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడిచి మన దేశానికి విముక్తిని తెచ్చారు. ఆ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలనే ఈ రోజు మనం అనుభవిస్తున్నాము.

ఈ జాతీయ ఉద్యమాలలో భాగంగా రాజవంశాల వాళ్లు, అతివాదులు, మితవాదులు స్వచ్ఛందంగా పదవులను విరమించుకొన్నారు. విద్యావేత్తలు, విద్యార్థులు, ఉద్యోగులు ఎందరో అనేకులు ఈ ఉద్యమంలో పాలిభాగస్తులైనారు. కవులు, కళాకారులు, రైతులు, ప్రజలు ఎవరికి వారే తమవంతు సహాయసహకారాలతో భరతభూమి దాస్యశృంఖలాలను విడిపించారు.

**భరతఖండంబు చక్కని పాడియావు**
**హిందువులు లేగదూడలై యేడ్చుచుండ**
**తెల్లవారను గడుసరి గొల్లవారలు**
**పితుకుచున్నారు మూతులు బిగియగట్టి**

1907 ఏప్రిల్ 19 నుండి 24 వరకు బిపిన్ చంద్రపాల్ ఆంధ్ర పర్యటన ప్రారంభమైంది. ఇందులో భాగంగా రాజమండ్రిలో ఆయన ప్రసంగించారు. చివరిరోజు వీరి ఉపన్యాసాలను చిలకమర్తి లక్ష్మీ నరసింహంగారు తెలుగులో అనువదించారు. చివరి రోజు వీరు ఆశువుగా చెప్పిన పై పద్యం ఆనాటి సభను ఉత్సాహపరిచింది. అంతటితో ఆగక ఆనాడు వ్యాప్తిలో ఉన్న పత్రికలలో కూడా వచ్చింది.  చిలకమర్తి వారి భరత ఖండంబు' అన్న పద్యం తెలుగులో భారత జాతీయోద్యమ సంబంధమైన తొలి రచన అని డా॥ పి. నారాయణ రెడ్డి గారు అన్నారు. ఆనాటి ప్రభుత్వం పట్ల ఉన్న అసంతృప్తిని చెందుతూ ఐకమత్యాన్ని ప్రబోధిస్తూ సాహసులకై పిలుపునిచ్చే కవిత్వాన్ని, పాటలను రచించి జాతీయోద్యమ కవిత్వానికి పిలుపునిచ్చిన కవుల్లో చిలకమర్తి తర్వాత పేర్కొనపబడినవారు గరిమెళ్ల సత్యనారాయణగారు. వీరు శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట తాలుకా గోనెపాడు గ్రామ శివారు ప్రియాగ్రహారంలో 1892 సం॥లో జన్మించారు. గరిమెళ్ల గేయాలు లభించినంత వరకు వాడుక భాష, 1915 స్వరాజ్యగీతాలు, 1926 హరిజన పాటలు, 1933 వీటితోపాటు ఇతర గేయాలు వున్నాయి.  స్వరాజ్య గీతాలు మొదటి భాగంలోనే మాకొద్దీ తెల్ల దొరతనం పాట ఉంది. ఆనాటి జాతీయ ఉద్యమ పరిస్థితులను గమనిస్తే 1920 సెప్టెంబర్ 4 నుండి 9 తేదీలలో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ సభ ప్రతిపాదించిన తీర్మానాలు ఆమోదించారు. అదే సంవత్సరం డిసెంబర్ 26న నాగపూర్‌లో జరిగిన కాంగ్రెస్ మహాసభ లక్ష్యం శాంతియుతమైన న్యాయబద్ధమైన సాధనాల ద్వారా స్వరాజ్యం స్థాపించడం, తిలక్ స్వరాజ్యం నా జన్మహక్కు తీర్మానించాడు. ఆ మరుసటి సంవత్సరం మార్చి 31, ఏప్రిల్ 1న బెజవాడలో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ కమిటి సమావేశాలు రాట్నాలతో ఖద్దరు వ్యాప్తి, త్రివర్ణ పతాక రూపకల్పన, గాంధీజీ కొల్లాయి వస్త్రధారణ, కార్మిక ఉద్యమ ప్రారంభం, నిరుద్యోగ కార్మికులు, పట్టణ పేద మధ్యతరగతి ప్రజలను జాతీయ ఉద్యమంలో భాగస్వాములను చేయటం జరిగాయి. అదే ఏడాదిలోనే వేల్స్ యువరాజు భారతదేశ పర్యటన దీన్ని బహిష్కరించిన దేశ ప్రజలు చీరాల పేరాల సత్యాగ్రహం పల్నాడు పుల్లరి నిరాకరణ ఉద్యమం, పెదనందిపాడు పన్నుల నిరాకరణోద్యమం ఆనాడు మహోద్యమంగా సాగాయి.

ఈ నేపథ్యంలోనే గరిమెళ్లవారు మాకొద్దీ తెల్లదొరతనం పాట రాసారు, పాడారు. ఈ పాట ఆనాడు తెలుగుదేశాన్ని దావానలంలా చుట్టుముట్టింది. భారతస్వాతంత్రోద్యమ కాలంలో ఇంతటి సమరశీల స్వభావం గల గొప్ప పాట మరొకటి లేదు. మాకొద్దీ తెల్లదొరతనం ఈ పాట ఎత్తుగడలోనే దీని గొప్పతనం తెలుస్తుంది. ఒక్కపాటలోనే స్వాతంత్ర్య పోరాట లక్ష్యం అంతా ఇమిడి ఉందనిపిస్తుంది.

'మాకొద్దు' అన్న మూడు అక్షరాలను ముందుపెట్టడంలోనే భారత ప్రజల ఆకాంక్ష, ఆగ్రహం, పరాయి ప్రభుత్వం పట్ల ఉన్న నిరసన, ద్వేషం అంతా ప్రతిధ్వనించేలా కనిపిస్తుంది. ఈ గేయం వేలాది మందిని సాతంత్ర సమరయోధులుగా తీర్చిదిద్దింది అనడంలో ఏమాత్రం సందేహం లేదు.

పల్లవి : మాకొద్దీ తెల్లదొరతనము దేవ
మాకొద్దీ తెల్లదొరతనము

అనుపల్లవి : మా ప్రాణాలపై పొంచి – మానాలు హరియించె అని సాగుతుంది. ఈ గేయంలో ముఖ్యంగా నాటి

సంఘంలో ఉండే పరిస్థితులను బ్రిటిష్ వాళ్ల దమననీతిని, సంఘ సమైఖ్యతతో పాటు సమాజంలోని మూఢనమ్మకాలను కుల వ్యవస్థను దాని నిర్మూలనను తెలియజెప్పాడు. అంతేకాదు నాటి సంఘంలోని లోపాలను కూడా సునిశితంగా విమర్శించాడు.

పన్నెండు దేశాలు పండుచున్నాగాని
పట్టెడన్నము లోపమండి !
ఉప్పు ముట్టకుంటే దోషమండి !
నోట ! మట్టికొట్టి పోతాడండి !
అయ్యో కుక్కలతో పోరాడి – కూడు తింటామండి.

పురాణాలు ఈ దేశాన్ని అన్నపూర్ణగా కీర్తించాయి. అక్షయపాత్రలు, కల్పవృక్షాలు ఇక్కడే వెలసిల్లాయని పేర్కొంటున్నాయి. ఈ దేశం సస్య శామలం. ఆహార కొరతలేదు, సంవృద్ధియైన ఆహారం, పాడిపంటలకు కొదువలేదు. అలాంటి దేశానికి వర్తకానికి అంటూ వచ్చిన బ్రిటీషర్లు ఇక్కడి ప్రజల అనైక్యతను ఆసరా చేసుకొని ఇక్కడ వారి రాజ్యాన్ని స్థాపించుకున్నారు. పోర్చుగ్రీసువారు, ఫ్రెంచి, డచ్చి మొదలైన దేశాలకు చెందిన వారు కూడా వ్యాపారం నిమిత్తం వచ్చి వారి లావాదేవీలు చూసుకొని తిరిగి వెళ్లారు. కొంతకాలమే వీరి పాలన ఇక్కడ సాగింది కాని ఆంగ్లేయులు ఎక్కవ కాలం ఈ దేశాన్ని పాలించారు. తంతితపాలా, రవాణా, సౌకర్యాలు రైల్వేలు, విమానాలు, ప్రభుత్వ పాఠశాలలు స్థాపించి విద్యావ్యవస్థను బలోపేతం చేశారు. సాంఘిక రుగ్మతలైన సహగమనం, బాల్యవివాహాలు, వరకట్నాలు, కన్యాశుల్కాలు నిర్మూలించారు. అయితే మన విశ్వాసాలను కొన్ని ఆచార వ్యవహారలను దుయ్యబట్టారు. నాడు గ్రామ సభలు మనకు ఉండేవి. గ్రామాధికారులే న్యాయన్యాయాలు నిర్ణయించేవారు. అందువల్ల మనమధ్య సోదరభావం ఉండేది. కోర్టులు లేవు. వీరు వచ్చి కోర్టులు ఏర్పాటు చేశారు. ఇవి రావడం వలన మన మధ్య సఖ్యత కొరవడిందని మనల్ని మనం శతృవులుగా చూసుకునే పరిస్థితి ఏర్పడింది అలాగే 144 సెక్షన్ ఏర్పాటు చేసి తనను ప్రశ్నించవద్దని చెబుతాడంటాడు కవి కల్లు సారా మధ్యపానం ప్రవేశపెట్టాడని వీటికి బానిసలు అయ్యారని మద్యం కోసం భార్య మెళ్లోని పుస్తెలు కూడా అమ్ముకుంటున్నారని ఈ వ్యసనం వల్ల కొన్ని కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యావంటాడు. స్వరాజ్యం జోలుకి వెళ్లవద్దని అలా వెళ్లిన వారిని శిక్షించటం చేశారు. పన్నులు, భూమిశిస్తులు పెంచడం వలన ప్రజల ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయ్యిందని వాపోతాడు.

ఇందులోనే తెల్లదొరల సేవ వల్ల బ్రతకవద్దని హితవు చెబుతాడు. అది జాతి కంతా తప్పని భావించమంటాడు. దేవుడు, నేలతల్లి వీటిని అంగీకరించవద్దనే ధర్మ సందేశాన్ని ప్రజలకిచ్చాడు. అసలు వాళ్లు ఇక్కడికి రావడానికి ఎవరి అనుమతి తీసుకున్నారని, వారి తాతల ఆస్థి ఇక్కడ ఏమైనా ఉందా అని ప్రశ్నిస్తాడు.

నాటి సంఘంలో ఉన్న అంటరానితనాన్ని గూర్చి చెబుతూ క్రింది విధంగా ఆక్షేపించాడు.

ఎవరెన్ని చెప్పినా హిందూదేశవాసు లేక సోదరులె సుండి

అంటూ దోషము మాకు లేదండి

పాపమంటూ చాటుదాం రండి
ఈ కుంటివాదనలు గూటిలో పెట్టండి.

ప్రజల మధ్య నెలకొల్పవలసిన సఖ్యతను పైన ఉదహరించాడు. అంతటితో ఆగక మనదేశంలో ఉన్న కర్మ సిద్ధాంతాన్ని కూడా వ్యతిరేకించాడు.

ఎన్ని జన్మములందు ఏమి నేరము చేసి కన్నుగానక తిరిగినామో

ప్రజల అన్నమెల్లను క్రుమ్మినాము

దైత్యులకన్న చెడ్డగా మెలగినాము.
నేడు దున్నలవలె నిట్లు దొరికితిమి దొరలకు

మనకు పరిపూర్ణమైన స్వేచ్ఛ కారాగారంలో ఉందని అక్కడికి అందరిని రమ్మంటాడు మీకు ముచ్చట ఇస్తుందని ఈ బ్రిటీషర్ల చచ్చు రాజ్యాన్ని వీడి అందరు జైలుకు రమ్మని ఆహ్వానించాడు. చెరసాలకు రమ్మని పిలవడంలో కవి ఉద్దేశ్యమేమిటంటే పరాయి పాలనలో ఉండి వారి కింద బానిసలుగా బ్రతకటం కంటే ఏ నేరం లేకున్నా కారాగారంలో ఉండటం ఉత్తమమని ఈయన అభిప్రాయం. ఎందుకంటే అక్కడ విచ్చలవిడిగా విహరించవచ్చు స్వేచ్ఛను అనుభవించవచ్చు. దీనికి దైవం కూడా అంగీకరిస్తాడంటాడు. ఈ గేయ ప్రథమంలో అధికారుల ఆజ్ఞలను వివరిస్తాడు. సమూహాలుగా ఉండకూడదని, పంట శిస్తులు, ప్రభుత్వాధికారిని ప్రశ్నించవద్దని చెబుతాడు. అందువల్ల పరోక్షంగా కవి ఆనాడు జాతీయ ఉద్యమం సంఘంలో కంటే కారాగారాలలోనే ఎక్కువ బలం పుంజుకుని దేశ సమైక్యతకు కావలసిన ప్రణాళికలు సిద్ధం చేసింది.

ఆనాటి రాజకీయ ఆర్థిక సాంఘిక పరిస్థితులన్నింటినీ తన పాటలో చెప్పాడు. నాటి ప్రజల సమస్య ఆహారం, కరువు కాటకాలు, అన్నంలేని అసంఖ్యాక ప్రజల దారిద్ర్యాన్ని బహిర్గతం చేయటమేకాక ఉప్పు ముట్టుకుంటే దోషంగా భావించాడు కవి, ఎందుకంటే దానిపైన కూడా పన్నులు వేసారు. స్వేచ్ఛగా ఉప్పు తయారు చేసుకోవటానికి అవకాశం లేకుండా చేశారు. ఈ సందేశమే తర్వాత 1930–32 నాటి ఉప్పు సత్యాగ్రహానికి గాంధీకి నినాదమైంది. కవి ఎంత ముందు చూపు ఉన్నవాడో చూడండి.

కిలాఫతు ప్రశ్న గేయంలో

మతములెల్ల నొకటి – వాని మహిమలెల్ల యొకటి
ఏ మతము చెరిపినను దైవమునకు ద్రోహంబు సమానంబు

మతాల మధ్య ఉండవలసిన సమన్వయాన్ని ఎంత చక్కగా చెప్పాడో చూడండి, దైవం అందరికీ సమానమే ఏ ఏ రూపాల్లో ఉన్న అంతర్లీనంగా అంతిమంగా మనిషి పొందుకోవలసిన దాన్ని పరోక్షంగా ఈ గేయంలో వినిపించాడు. హెచ్చు తగ్గులు మతాల మధ్య ఉండకుండా అన్ని మతాలను గౌరవించాలనే విన్నపాన్ని వివరించాడు. పంచములు అన్న గేయంలో

అన్నలారా ! వినుడి మన యఘుమొక్కటి గనుడి
మన చిన్న తమ్ములను చేరదీసి దయచేసి మహోధర మిడుడి,

ఎంత హితబోధ చేస్తున్నాడీ కవి, పంచముల స్థాయికి దిగి వారి దీనాలాపనను గమనించమంటూ వారిని మీ సహోదరులుగా భావించి ఆదరించడమే కాదు మార్గ నిర్దేశాలు చేయమంటాడు.అందరికి హితవు చెబుతూనే హరిజనులను ఎలా చైతన్య పరిచాడో చూడండి.

అంటరాని వాడని నన్నంటే ఇక ఒప్పుకోను
ఒంటరి ! నీ కిష్టము లేకుంటే అటు తొలగిపొమ్ము

వారిని కూడా స్వచ్ఛత కలిగి నివసించాలంటాడు దైవసన్నిధికి రమ్మంటాడు. అక్కడ అందరూ కలవవచ్చునంటాడు. రథము పాటలో

హిందువులును ముసల్మానులు ఇంకా మిగిలిన జాతులను సందియంబులు మానండి

వందేమాతరం మంత్రము మగ్గులను సుందరముగా బొందుపరచి రండి

అంటూ హిందూ ముస్లింల మధ్యనే కాక మిగిలిన ఇతరుల జాతులను కూడా కలిసి ఏకం కావాలని ప్రబోధించాడు

గరిమెళ్ల. ప్రజల మధ్య ఉండవలసిన సుహృద్భావ స్నేహ సౌదాన్ని కోరుకున్నాడు కవి. అలాగే ఆనాటి జానపద బాణిలో సామాన్య ప్రజలకు కూడా అర్థమయ్యే పదాలను పాడి వారిని ఉత్తేజపరిచాడు.

కల్లు త్రాగి యిల్లు వళ్లు గుల్ల చేసుకోవద్దని హెచ్చరిస్తాడు. కల్లు మానితే తెల్లవాని రాజ్యం తెల్లారిపోతుందని సామాన్య ప్రజలకు చెబుతాడు. మద్యపానానికి బానిసలు కారాదంటాడు. ఆనాటి ప్రభుత్వాన్ని సైతాను ప్రభుత్వమంటాడు ఈయన.

దండాలండోయి మేముండలేమండోయి బాబు

ఈ సైతాను ప్రభుత్వాన్నింక – సాగనీమండోయి బాబు – అంటూ ఖరాఖండితంగా చెబుతున్నాడు. అంతేకాదు స్వరాజ్యం మీద మాకు ఆత్మ నిలిచిందండి బాబు అను ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు. రాజ్యమేలుదము గీతంలో

"రారా పోదాము – రాజ్యమేలుదాము
రాజ్యంబు నేలుచును – రాజిల్లుచుందాము
తెల్లదొరల నుండి ఇల్లెల్ల గాపాడి ముల్లోకముల

కీర్తి ముట్టించివేద్దాము" – అన్న గరిమెళ్ల స్వాతంత్ర కాంక్షను ఆనాటి దేశ నాయకులు, జాతీయ ఉద్యమకారులు, ప్రజలు వేనోళ్ల కొనియాడినారు. స్వాతంత్ర ఉద్యమంలో ఈయన పాటలు జాతీయ గీతాల్లా అందరినోటా ఆలపించబడ్డాయి. మా కొద్దీ తెల్ల దొరతనం లోని ప్రతి చరణం ఒక తూటాలాగా తెల్ల దొరల గుండెల్లో గుచ్చుకున్నాయి. భారతీయులను ఉగ్రూతలూగించాయి. జాతీయ ఉద్యమంలో పాల్గొనేలా చేసాయి. ❁

# ఆంధ్రా ప్రాంతంలో జరిగిన జాతీయోద్యమంలో తెలుగు పత్రికల పాత్ర

**డా॥ సి.వి.పవన్ కుమార్,** చరిత్రోపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి, హైదరాబాద్

ఆధునిక యుగంలో పత్రికా రంగం ఒక బలమైన శక్తిగా అవతరించింది. పత్రికల సహకారం లేకుండా ఏ ఉద్యమం కూడా విజయవంతం కాలేదంటే అతిశయోక్తి కాదు. అందుకే మేధావులు ప్రజాస్వామ్య సౌధానికి ఉన్న నాలుగు మూల స్తంభాలలో పత్రికలను ఒకటిగా అభివర్ణించారు. పత్రికల ప్రాముఖ్యాన్ని గురించి ఆంధ్రజ్యోతి దినపత్రిక వ్యవస్థాపక సంపాదకులు నార్ల వెంకటేశ్వర రావు "పత్రికొక్కటున్న పదివేల సైన్యము, పత్రికొక్కటున్న మిత్రకోటి, ప్రజలకు రక్ష లేదు పత్రిక లేకున్న" [1] అని అన్నారు. నెపోలియన్ లాంటి వ్యక్తి కూడా తాను వెయ్యి తుపాకుల కన్నా నాలుగు ప్రతికూల పత్రికలకే భయపడుతానని అన్నాడు. "పత్రికలు లేని ప్రభుత్వం కావాలా?, ప్రభుత్వం లేని పత్రికలే కావాలా? అని నన్ను ఎవరైనా ప్రశ్నిస్తే ప్రభుత్వం లేని పత్రికలే కావాలని నిస్సందేహంగా చెప్తాను"[2] అని థామస్ జెఫర్సన్ మహాశయుడు అనడాన్ని బట్టి సమాజంలో పత్రికల ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చు.

స్వాతంత్ర్యానికి పూర్వం ప్రజలలో దేశభక్తిని, జాతీయాభిమానాన్ని రగుల్కొల్పటంలోనూ, భావ సమైక్యతను పెంపొందించడంలో తెలుగు పత్రికలు చరిత్రాత్మక పాత్రను పోషించాయి. జాతీయోద్యమ కాలంలో తెలుగు నాట పత్రికలు ఎలాంటి పాత్ర పోషించాయనే అంశాన్ని ఆవిష్కరించడమే ఈ పరిశోధనా పత్రం ముఖ్యోద్దేశ్యం. ఆంధ్రా ప్రాంతంలో జరిగిన జాతీయోద్యమంలో ,ఈ ప్రాంతం నుంచి వెలువడిన ప్రధాన తెలుగు పత్రికలైన ఆంధ్రపత్రిక, కృష్ణా పత్రికల అధ్యయనానికే పరిశోధనను పరిమితం చేయడం జరిగింది. అలాగే, సంఘసంస్కరణ కూడా జాతీయోద్యమంలో అంతర్భాగమైనప్పటికీ, రాజకీయ కోణంలోని వార్తలను మాత్రమే పరిగణనలోకి తీసుకొంటూ, ఉద్యమ ప్రధాన ఘట్టాలపైనే దృష్టి సారించడం జరిగింది.

**తెలుగు పత్రికల సంక్షిప్త ప్రస్థానం**

తెలుగు పత్రికలకు సుసంపన్న వారసత్వం ఉంది. సత్యదూత, వృత్తాంతిని మొదలగు పత్రికలతో ప్రారంభమైన తెలుగు పత్రికల ప్రస్థానం నేటికీ కొనసాగుతోంది. వీరేశలింగం గారి వివేకవర్ధిని(1874), హాస్యసంజీవని(1876), సతీహిత బోధిని(1883), సత్యసంవర్ధిని(1891) లాంటి పత్రికలు సంఘ సంస్కరణకు బాసటగా నిలిచి జాతీయోద్యమానికి పునాదులు వేశాయి. 1885లో ఐ.సి.పార్థసారథినాయుడు గారిచే ప్రారంభించబడిన ఆంధ్రప్రకాశిక తొలి రాజకీయ పత్రికగా ప్రాధాన్యం సంతరించుకొంది. 1902లో ప్రారంభమైన కృష్ణా పత్రిక, 1907 నాటి వందేమాతరం, 1908లో గాడిచెర్ల హరిసర్వోత్తమరావు సంపాదకత్వంలో వెలువడిన స్వరాజ్య పత్రిక, అలాగే 1908లో కాశీనాథుని నాగేశ్వరరావు చే ప్రారంభింపబడిన 'ఆంధ్రపత్రిక', మద్దూరి అన్నపూర్ణయ్య సంపాదకత్వంలో 1922లో ప్రారంభింపబడిన కాంగ్రెస్ లాంటి పత్రికలు జాతీయోద్యమ కాలంలో బాగా పనిచేశాయి. ఈ పత్రికలలో వచ్చిన ఉత్తేజపరిచే సంపాదకీయాలు, విమర్శనాత్మక వ్యాసాలు, విశ్లేషణా కథనాలు ప్రజలలో సాంఘిక, భాషా చైతన్యాన్ని కల్గించడమే కాకుండా, రాజకీయ చైతన్యంతో పాటు వారిని స్వాతంత్ర్య పిపాసువులను చేశాయి. మొత్తంమీద పంతొమ్మిదో

శతాబ్దపు పత్రికలు సంఘసంస్కరణకు ప్రాధాన్యం వహిస్తే, ఇరవయ్యో శతాబ్దం కాలం నుంచి మారిన దేశ రాజకీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రాజకీయోద్యమాలకు, అత్యంత ప్రాధాన్యతను ఇచ్చాయి.

బ్రిటీష్ వారు 1918లో మాంటేగు చేమ్సుఫర్డ్ సంస్కరణల ముసాయిదాను ప్రవేశపెట్టారు. ఇవి భారతీయులకు నిజమైన అధికారాల్ని అప్పగించలేకపోయాయని అన్నీ తెలుగు పత్రికలు ఘాటుగా విమర్శించాయి. 1918జూలై 13నాటి కృష్ణా పత్రిక సంపాదకీయం ఇలా అభిప్రాయపడింది."కొండను త్రవ్వి ఎలుకను పట్టడం జరిగింది. ఇంతకాలం దేశం అడిగింది ఒకటైతే ఇచ్చింది మరొకటి. కంటి తుడుపు చర్యగా మాత్రమే కొన్ని సంస్కరణలు ప్రవేశపెట్టినట్లు కనిపిస్తోంది. ప్రజల ఆశలకు, ఆశయాలకు గౌరవమిచ్చి, వాటిని పరిగణనలోకి తీసుకోలేదు. అన్ని అధికారాలు కుడి చేత్తో ఇచ్చి,ఎడమ చేత్తో తీసుకొన్నట్లు కనిపిస్తోంది. యంత్రానికి అనేక చక్రాలు అమర్చారు. కాని ప్రతి చక్రము వెనక్కు తిరిగేదే"[3]. రౌలట్ చట్టాలను ఎండగట్టడంలోనూ, జలియన్‌వాలాబాగ్ దురంతాన్ని ఖండించడంలోనూ, బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని మలచడంలో పత్రికలు సముచిత పాత్రను పోషించాయి.

గాంధీజీ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా ప్రారంభమైన సహాయనిరాకరణోద్యమానికి తెలుగు పత్రికలు ఈ ప్రాంతంలో ఎనలేని ప్రాచుర్యాన్ని కల్పించాయి. ఉద్యమ కార్యాచరణకనుగుణంగా జరుగుతున్న కార్యక్రమాలను ఎప్పటికప్పుడు అందిస్తూ, పదునైన సంపాదకీయాల ద్వారా ప్రజలను ఉత్తేజ పరిచాయి. ప్రజలు బాధలు, అణిచివేతలు మరియు ఎన్ని కష్టాలైన ఎదుర్కొని స్వరాజ్య సాధనే లక్ష్యంగా పనిచేస్తూ సహాయనిరాకరణ ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఆంధ్ర పత్రిక పిలుపునిచ్చింది[4].

సహాయనిరాకరణోద్యమం భారతదేశ చరిత్రలో నూతన శకానికి నాంది అనే కథనాన్ని ప్రచురించింది[5]. ఉద్యమంలో విద్యార్థుల బాగస్వామాన్ని నాటి పత్రికలన్నీ కాంక్షించాయి. ఇదే విషయమై కృష్ణా పత్రిక, మేలుకో। విద్యార్థులారా । మేలుకో అనే శీర్షికతో [6] దేశం కోసం విద్యార్థులు తమ విద్యను త్యాగం చేయాలనే చిత్తరంజన్ దాస్ గారి సందేశాన్ని అందించింది. సహాయనిరాకరణోద్యమంలో భాగంగా యావత్ భారత దృష్టిని ఆకర్షించిన చీరాల–పేరాల, పెదనందిపాడు పన్ను ల నిరాకరణ ఉద్యమ వార్తలను అన్నీ తెలుగు పత్రికలు ప్రధానంగా ప్రచురించాయి. గాంధీగారు చౌరిచౌరా సంఘటన( ఫిబ్రవరి,1922)తో సహాయనిరాకరణోద్యమంను అకస్మాత్తుగా ఉపసంహరించుకోవడంతో జాతీయోద్యమంలో 1927 వరకు స్తబ్దత ఏర్పడింది. ఈ సమయంలో తెలుగు పత్రికలు ప్రతేక ఆంధ్రరాష్ట్రోద్యమానికి తిరిగి ప్రాధాన్యతనిచ్చాయి.

గాంధీజి పిలుపు మేరకు 1927లో సైమన్ కమిషన్ బహిష్కరణ కార్యక్రమాలు చేపట్టినప్పుడు తెలుగు పత్రికలు ఆ వార్తలకు పెద్దపీట వేశాయి. ఆ సందర్భంగా టంగుటూరి ప్రకాశం పంతులు చూపిన ధైర్య సాహసాలను ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక, స్వరాజ్ లాంటి పత్రికలు ప్రధాన శీర్షికలతో ప్రచురించాయి. ముఖ్యంగా ఆంధ్ర పత్రిక సైమన్ బహిష్కరణ వ్యాసాలను పుంఖానుపుంఖాలుగా ప్రచురించడమే కాకుండా పత్రికలో నల్ల జెండాలను ముద్రించి, ప్రజలంతా నల్లజెండాలతో సైమన్‌కమిషన్‌ను బహిష్కరించాలని పిలుపునిచ్చింది[7]. ఆంధ్రులు సైమన్ కమిషన్‌ను బహిష్కరించడం వలన 1935 భారత చట్టంలో ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు గావించబడలేదు.కానీ ఊహించిన విధంగానే ఒరిస్సా, సింధు రాష్ట్రాలు ఏర్పడ్డాయి. ఈ విషయంపై పత్రికలు వివిధ రకాలుగా స్పందించాయి. తెలుగు పత్రికలు ఆంధ్రుల దేశ భక్తిని, జాతీయోద్యమ కాంక్షను పొగిడితే, మద్రాసు ఒపినీయన్ లాంటి ఆంగ్ల పత్రికలు ఆంధ్రోద్యమ విషయాన్ని సైమన్ కమిషన్‌కు నివేదించకపోవడాన్ని తప్పు పట్టాయి.

గాంధీగారు 1930లో చేపట్టిన శాసనోల్లంఘనోద్యమంకు సంబంధించిన వార్తలను, ఫోటోలను, సంపాదకీయాలను అన్నీ తెలుగు పత్రికలు కూడా విశేషంగా ప్రచురించాయి. మహత్మాగాంధీని జైలులో బంధించవచ్చు కానీ, అతని ఆలోచనలను కాదని, మార్చి 12 న ప్రారంభమయ్యే శాసనోల్లంఘనోద్యమం భారతదేశ స్థితిగతులనే కాకుండా, యావత్ ప్రపంచ భవిష్యత్ పరిణామాన్ని మార్చనుందని ఆంధ్రపత్రిక పేర్కొంది[8]. అన్నీ తెలుగు పత్రికలు ఈ ఉద్యమ కాలంలో తమ పత్రికలలో దాదాపు సింహభాగాన్ని ఈ ఉద్యమ వార్తల ప్రచురణల కోసం కేటాయించాయంటే అతిశయోక్తి కాదు. నెల్లూరుజిల్లా మైపాడు వద్ద జరుప

తలపెట్టిన ఉప్పు సత్యాగ్రహ వార్తలను, క్రియాశీల ఉద్యమవాలంటీర్ల జాబితాను నెల్లూరు సత్యాగ్రహం పేరిట జమీందారి రైతు (జమీన్‌రైతు) పత్రిక చక్కగా ప్రచురించింది[9] .

జాతీయోద్యమంలో చివరి ప్రధాన ఘట్టమైన క్విట్ ఇండియా ఉద్యమంవైపు ప్రజాభిప్రాయాన్ని మరల్చడంలో దాదాపు అన్నీ తెలుగు పత్రికలు ఇతోధిక కృషి చేశాయి. జాతీయ నాయకుల ప్రసంగాలు, కాంగ్రెస్ పార్టీ తీర్మానాలతో పాటుగా ఉద్యమ ప్రాధాన్యతను వివరిస్తూ ఆంధ్రపత్రిక ప్రత్యేక సంచికను కూడా విడుదల చేసింది[10]. జాతీయ నాయకుల అరెస్టులను ఖండిస్తూ పతాక శీర్షికతో ఆంధ్రపత్రిక వార్తా కథనాల్ని ప్రచురించింది[11]. అలాగే ఆంధ్రా ప్రాంతంలో నాయకుల అరెస్టులను, సంఘటనలను పేర్కొంటూ, ప్రభుత్వ దమనకాండను తెలుగు పత్రికలు ఘాటుగా నిరసించాయి. ముఖ్యంగా గుంటూరు, తెనాలి, నిడుబ్రోలు, దుగ్గిరాల తదితర ప్రాంతాల్లో జరిగిన ఉద్యమ సంఘటనలను పత్రికలు నిష్పక్షపాతంగా ప్రచురించాయి. జాతీయ స్థాయిలో వివిధ ప్రాంతాల్లో జరిగిన కాల్పులు, మరణించిన వారి వివరాలతో పాటుగా ఆంధ్రా ప్రాంతంలో అరెస్టు చేయబడిన వారి వివరాలను ఉటంకిస్తూ జమీందారి రైతు పత్రిక వార్తా కథనాలను అందించింది[12]. ఉద్యమ నేపథ్యంలో బ్రిటీష్ ప్రభుత్వం పత్రికలపై విధించిన ఆంక్షలను ఎండగడుతూ, తక్షణమే వాటిని ఉపసంహరించాలని ఆంధ్రపత్రిక కథనాన్ని ప్రచురించింది[13]. తదనంతర కాలంలో స్వాతంత్ర్య ప్రకటన వరకు జరిగిన అన్నీ పరిణామాలను కూడా ఎప్పటికప్పుడు ప్రజలకు అందించడంలో అన్నీ తెలుగు పత్రికలు సఫలీకృతమయ్యాయని చెప్పవచ్చు. స్వాతంత్రదినోత్సవాన్ని పురస్కరించుకొని అన్నీ పత్రికలు పతాక శీర్షికలతో పాటుగా లోపలి పేజీల్లో మొత్తం జాతీయోద్యమ సమీక్షలను, నాయకుల సందేశాలను అందించాయి.

మొత్తం మీద జాతీయోద్యమ కాలంలో తెలుగు పత్రికలు నిర్వహించిన పాత్ర అనిర్వచనీయం. టంగుటూరి ప్రకాశం పంతులు, పట్టాభి సీతారామయ్య, కాశీనాథుని నాగేశ్వరరావు, కొండా వెంకటప్పయ్య, వెన్నలకంటి రాఘవయ్య, గాడిచెర్ల హరిసర్వోత్తమ రావు తదితర ఉద్యమ నాయకులు తమ భావజాల వ్యాప్తికి పత్రికల్నే ప్రధాన ఆయుధంగా మలుచుకొన్నారు. ప్రముఖ ఉద్యమనేతలు చాలా మంది తాము పత్రికల వల్లే ప్రభావితమై ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్నామని వివిధ సందర్భాల్లోనూ, వారి జీవిత చరిత్రల్లో ఉటంకించడం గమనార్హం. జాతీయోద్యమంలోని అన్నీ ఘట్టాలను తాజా వార్తలను, విశ్లేషణాత్మక కథనాలు ఎప్పటికప్పుడు అందించి ప్రజలను చైతన్య పరచడంలో కృష్ణాపత్రిక, ఆంధ్రపత్రిక, స్వరాజ్, దేశాభిమాని, కాంగ్రెస్, జమీన్‌రైతు, పత్రికలు క్రియాశీల పాత్రను పోషించాయి. సైమన్ కమిషన్ పర్యటన కాలంలో జాతీయోద్యమం కోసం ఆంధ్రోద్యమ ప్రాధాన్యతను సైతం త్యాగం చేసిన తెలుగు పత్రికల జాతీయతా స్ఫూర్తి ప్రశంసనీయం.

**ఆధార సూచి :**


1. శాస్త్రి, ద్వా.నా.,తెలుగు సాహిత్య చరిత్ర, విశాలాంధ్ర బుక్ హౌస్, హైదరాబాద్,1998 పుట 747.
2. లక్ష్మణ రెడ్డి, వి., తెలుగు జర్నలిజం అవతరణ-వికాసం, రచన జర్నలిజం కళాశాల,హైదరాబాద్ 2002, పుట 6.
3. కృష్ణా పత్రిక 13 జూలై,1918.
4. ఆంధ్ర పత్రిక, ఆగష్టు 14, 1920
5. ఆంధ్ర పత్రిక, సెప్టెంబర్ 10, 1920.
6. కృష్ణా పత్రిక , ఫిబ్రవరి 5, 1921.
7. ఆంధ్ర పత్రిక, ఫిబ్రవరి 2,1928.
8. ఆంధ్ర పత్రిక , 2 ఫిబ్రవరి, 1928.
9. జమీన్‌రైతు పత్రిక, 6 ఏప్రియల్, 1930
10. ఆంధ్రపత్రిక, 8 ఆగష్టు , 1942
11. ఆంధ్రపత్రిక, 9 ఆగష్టు , 1942
12. జమీన్‌రైతు పత్రిక, 14 ఆగష్టు, 1942.
13. ఆంధ్రపత్రిక, 29 ఆగష్టు , 1942.

# జాతి కర్తవ్యమును ప్రబోధించిన 'దేశభక్తి' గేయం

**డా. కె. శ్యామలాదేవి,** తెలుగు అధ్యాపకులు, ఏ.ఎస్.డి. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అ) కాకినాడ

ఆధునిక తెలుగు సాహిత్యపు దిశను నవ్యత నుండి అతినవ్యత వైపుకి నడిపించిన స్రష్ట, సమాజ చైతన్యమే సాహిత్య ప్రయోజనమని భావించిన ద్రష్ట, మహాకవి గురజాడ అప్పారావు గారు.

*'మనిషి చేసిన రాయిరప్పకి*
*మహిమ కలదని సాగిమొక్కుతు...*
*కన్నులు తెరిచిన కానబడదో?*
*మనిషి మాత్రుడియందు లేడో...'* **(మనిషి గేయం) అంటూ మానవతావాదాన్ని కాంక్షిస్తూ...**
*మంచి చెడ్డలు మనుజులందున*
*ఎంచి చూడగ రెండెకులములు*
*మంచియున్నది మాలయైతే*
*మాలనే అగుదున్...'* (లవణరాజు కల) అంటూ భారతీయ సమాజంలో వేళ్లూనుకున్న వర్ణవ్యవస్థను నిరసిస్తూ....
*'ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చును*
*ప్రేమ నిలిచిన ప్రేమ నిలుచును...'* (కాసులు) అంటూ విశ్వమానవ ప్రేమతత్వమును బోధించడమే లక్ష్యంగా సాహితీ ప్రస్థానం కొనసాగించిన ఆధునికుడు గురజాడ.

గురజాడ కలం నుండి జాలువారిన అద్భుత గేయం దేశభక్తి. స్వాతంత్ర్యోద్యమ సమయంలో వెలువడిన ప్రధాన గేయములన్నీ భారతదేశ కీర్తనమే లక్ష్యంగా రచిస్తే, గురజాడ దేశభక్తి గేయం మాత్రం దేశీయ, ప్రాంతీయ భేదాలు లేకుండా విశ్వమానవ కోటికి జాతీయ గేయమనదగిన రచనగా రూపొందడం విశేషం.

*'దేశమును ప్రేమించుమన్నా*
*మంచియన్నది పెంచుమన్నా...'* అంటూ ప్రారంభమైన ఈ గేయం స్వదేశీయులలో జాతీయాభిమానమును, దేశభక్తిని నూరిపోస్తూనే

*'పట్టిమాటలు కట్టిపెట్టోయి*
*గట్టిమేల్ తలపెట్టవోయి...'* అని సమస్త మావకోటికి దేశంపట్ల నిర్వర్తించవలసిన కర్తవ్యమును ప్రబోధించినది. భూమి మీద జన్మించిన ప్రతి వ్యక్తి జన్మభూమి అభివృద్ధికై పాటుపడుతూ, దేశాన్ని ప్రగతి పథంవైపుకి నడిపించాలని సూచించారు.

మానవ మనుగడకు ఆధారమైన వ్యవసాయాభివృద్ధితోనే మానవాభివృద్ధి సాధ్యమంటూ, పాడిపంటలు పొంగిపొర్లే దారిలో పాటుపడాలని చెబుతూనే, ప్రతివారు తమ తమ అస్తిత్వాలను కాపాడుకొని జీవించడానికి శారీరక దారుఢ్యాన్ని కలిగివుండాలనీ,

అప్పుడే ఎలాంటి పరిస్థితులైనా ఎదుర్కొని విజయం సాధించగలగుతామని గురజాడ తెలియజేసారు.

దేశీయ కళల అభివృద్ధి దేశ సంపదకు, కీర్తికి మూలము. కళాహీనమైన మానవాళితో దేశం చైతన్య హీనమవుతుంది. కనుకనే

*'జల్దుకొని కళలెల్ల నేర్చుకు*
*దేశిసరుకులు నించవోయి...*
*దేశిసరుకుల నమ్మవలెనోయి...'* అని సందేశమిచ్చారు.

'మంచి గతమున కొంచమేనోయి' అనడం గురజాడ దార్శనీయ దృష్టికి నిదర్శనం. మనిషి ఆలోచన గతంలోనే ఆగిపోతే విలువైన వర్తమానం, భవిష్యత్తు అంధకారమగును.

*'మందగించక ముందు అడుగేయి*
*వెనుకపడితే వెనకేనోయి...'* సంకల్పంతో ముందుకు అడుగేయడం ద్వారానే జరగబోయే మంచిని, భావితరాల బంగరు భవితను చూడగలమని గురజాడ వక్కాణించారు.

మనుషుల మధ్య స్పర్ధలు కేవలం విద్య, వ్యాపారాలకే పరిమితమై దేశప్రగతికి దోహదపడాలని, వ్యర్ధమైన అంతరంగ కలహాలతో హింసను కాంక్షిస్తూ దేశశాంతిని భగ్నం చేయరాదని చెప్తూ...

*'దేశాభిమానం నాకు కద్దని*
*వొట్టి గొప్పలు చెప్పుకోకోయి*
*పూనియేదైనాను వొకమేల్*
*కూర్చి జనులకు చూపవోయి'*

దేశంపట్ల అభిమానమును మాటలలో కాక చేతలలో చూపించమని హితవు పలికారు.

జాతుల మధ్య ఓర్వలేనితనం, అసూయ దేశభవితకు గొడ్డలిపెట్టు కనుక ఐకమత్యభావనతో ఇతరుల మేలును కూడా తన మేలుగా భావించాలనీ, పరుల కలిమికి దు:ఖించే పాపికి సుఖం ఎక్కడా లభించదని, స్వార్ధబుద్ధిని వీడి పొరుగువాళ్ళకు తోడ్పడాలంటూ...

*'దేశమంటే మట్టికాదోయి*
*దేశమంటే మనుషులోయి!...'* అంటూ నినదించారు.

సుజనుల సమూహమే దేశానికి నిజమైన అర్ధమనే కొత్త నిర్వచనమిస్తూ, సమస్త మానవాళి కుల, మత, ప్రాంత, ఆర్ధిక భేదాలకు అతీతంగా సోదరభావంతో దేశాబివృద్ధివైపు పయనించాలనీ...

*'మతం వేరైతేను యేమోయి?*
*మనసులొకటై మనుషులుంటే...'* అంటూ విశ్వమానవ ప్రేమతత్వాన్ని తెలియజెప్పారు.

కులమతాల అంతరాలు తొలగి, విభేదాలు నశించి మనసులలో ప్రేమలనే పుష్పాలు వికసించాలనీ, ఆ ప్రేమ భావనలు నిఇడిన స్వేదంతో తడిసిన నేల సుగంధాలు జల్లే మంచి పంటనివ్వాలని, ఆ సిరిసంపదలతో దేశం తులతూగాలని కవి ఆకాంక్షించారు.

*'ఆకులందున అణగిమణిగి*
*కవిత కోయిల పలకవలెనోయి*

*పలుకులను విని దేశమందభి*
*మానములు మొలకెత్తవలెనోయి'*

వ్యవసాయాభివృద్ధి, కళల నైపుణ్యం, సంకల్పశక్తి, విద్యావ్యాపారాలకే పరిమితమైన స్పర్ధభావనలు, స్వార్థలేమితనం, ఐకమత్యం, సోదరభావన, కులమతాలకతీతమైన ప్రేమ తత్వము వీటన్నింటిని సాధించిన భరతజాతి వినయముతో కూడిన స్వాభిమానాన్ని ప్రపంచానికి పరిచయం చేయాలని, మాటల్లోనూ, ఆశయాల్లోనూ, చేతల్లోనూ అణువణువునా దేశభక్తి తొణికిసలాడాలని ప్రబోధించారు.

గురజాడ దేశభక్తి గేయం ద్వారా ప్రజల్లో దేశంపట్ల అభిమానాన్ని, భవిష్యత్తు పట్ల ఆశలను, భావితరాల పట్ల బాధ్యతను తెలుపుతూ, జాతీయ స్వాతంత్ర్య భావనపట్ల దేశ ప్రజల కర్తవ్యమును ప్రబోధించారు. ❁

**ఆధార గ్రంథాలు :**

1. ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు – ప్రయోగములు – డా॥ సి. నారాయణరెడ్డి

2. గురుజాడలు – ఎమెస్కో బుక్ – వెన్నేపల్లి గోపాలకృష్ణ

3. తెలుగు సాహిత్య చరిత్ర – ద్వానా శాస్త్రి

# జాతీయోద్యమ దీప్తి - ప్రజల మనిషి నవల

**పొన్నెకంటి స్వప్న,** పరిశోధక విద్యార్థిని, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్
చరవాణి : 9398510499

ఏ దేశ ప్రజలకైనా జాతీయతా భావం తప్పనిసరిగా ఉండాలి.లేకపోతే విదేశీ ఆక్రమణ కారణంగా దేశ ప్రజల మనుగడకు విపత్తు సంభవించినట్టే. పరాయి పాలనలో మగ్గుతున్న క్లిష్ట సమయంలో లేదా ఇతర విదేశీ ఆక్రమణ వలన దేశానికి ముప్పు ముంచుకు వచ్చే సమయంలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా కాక, ప్రజలందరూ ఒకే మాటకు కట్టుబడి జాగురూకతతో వ్యవహరిస్తూ, శత్రువులను పారదోలగలిగితేనే దేశ సమగ్రతను, సమైక్యతను కాపాడిన వారమవుతాము. అలా జరిగినప్పుడే దేశ ప్రజలు సుఖ సంతోషాలతో అభివృద్ధిని సాధించగలరు.ఇది ప్రతి దేశం అంగీకరించవలసినటువంటి సత్యం. జాతీయ సమైక్యతను సాధించడంలో సాహిత్యం కూడా తనదైన శైలిలో దోహదకారి అని చెప్పవచ్చు.

నిద్రాణమై ఉన్న జాతిని మేలుకొలుపుటకు స్వాతంత్ర్యము మహత్తరమైన సాధనము. ఒక దేశం యొక్క కష్టసుఖాలు, మంచిచెడులు, ఒడిదొడుకులు మొదలైన సర్వ విషయాలు సాహిత్యంలో ప్రతిబింబిస్తాయి. ఒక జాతి చరిత్రను నిర్మించుటలో కవుల,రచయితల పాత్ర అమోఘమైంది. కవి సమాజంలో ఒక వ్యక్తిగా మాత్రమే కాదు, మేధావి వర్గంలో మొదటి శ్రేణికి చెందినవాడు. నిద్రావస్థలో ఉన్న సమాజాన్ని తట్టిలేపి జాగృతం చెయ్యగల వైతాళికుడు. పరిస్థితుల ప్రభావం కవి పైన, కవి ప్రభావం జాతి మీద పరస్పరం ఉంటుంది. సమాజంలో అస్తవ్యస్తమైనటువంటి పరిస్థితులు నెలకొన్నప్పుడు తప్పనిసరిగా జాతి స్పందిస్తుంది. అందులో ప్రప్రథమంగా రచయితలు స్పందించి సమాజ చైతన్యానికి రచనలు చేస్తారు. ఈ లక్షణమే మన భారతదేశం అస్వతంత్ర్యమై పరపీడనం భరించలేక స్వాతంత్ర్యం కోసం అర్రులు చాచి ఆరాటపడిన రోజుల్లో, భారత జాతీయ సమైక్యత కోసం కవికోకిలలు కవితా గానం ఆలపించగా,స్వాతంత్ర్యమే జాతినంతటిని సంఘటితపరచి స్వాతంత్రోద్యమ సమరంలో పాల్గొనేలా చైతన్య స్ఫూర్తిని రగిలించింది.జాతి,మత,వర్గ భేదాలు లేకుండా దేశ ప్రజలందరూ సమైక్యంగా జాతీయ సమరంలో చేరి పరాయి పాలన విముక్తికై దేశ స్వాతంత్ర్యం కోసం ఉద్యమించేలా ఊపిరిలూదింది. అదే ఉద్యమస్ఫూర్తి నైజాం నవాబుకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటం వరకు అలాగే కొనసాగింది.ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆనాటి రచయితలు ఆనాటి పోరాట చరిత్రను అక్షరబద్ధం చేశారు.ఆ సమయంలో వెలువడిన సాహిత్యమంతా నాటి చరిత్రకు అద్దం పడుతుంది.ఆ నేపథ్యంలో వచ్చిన రచనల్లో తొలి తెలంగాణ నవలగా పేరెన్నికగన్నది ప్రజల మనిషి రచయిత వట్టికోట ఆళ్వారుస్వామి. బ్రిటిష్ వారి కనుసన్నల్లో తెలంగాణాలో హైదరాబాద్ సంస్థానం కేంద్రంగా నైజాము నవాబు సాగించిన దుష్టపాలన, వారి అండదండలతో దొరలు గ్రామాల్లో సామాన్య ప్రజానీకంపై చేసిన అరాచకాలు, నాటి ప్రజా ఉద్యమాలను తెలపడమే నా పత్ర సమర్పణ ముఖ్య ఉద్దేశం.

జనం నుండి జనంలోకి సాహిత్యం అని నమ్మిన వ్యక్తి వట్టికోట ఆళ్వారుస్వామి. తెలంగాణ జన జీవితాన్ని, సంస్కృతి వారసత్వాన్ని, భాషా సౌందర్యాన్ని,తిరుగుబాటు తత్వాన్ని, పోరాట నేపథ్యాన్ని తన రచనల్లో నిక్షిప్తీకరించారు. జనం పలుకుబళ్లను, మాట్లాడే తీరుతెన్నులను సమర్థవంతంగా తన రచనల్లో సింగారించారు. యాసల జాతీయాల సొగసులద్దారు. 1915లో నల్లగొండలో

అతి నిరుపేద కుటుంబంలో జన్మించిన పోరుబిడ్డ ఆళ్వారు స్వామి. పుట్టుక నుండి పేదరికంలో పనిచేసి శ్రామిక వర్గంలో ఎదిగిన ఆళ్వార్ స్వామి గ్రంథాలయ ఉద్యమంలోను, దేశోద్ధారక గ్రంథమాల వ్యవస్థాపకుడుగానూ, అంచెలంచెలుగా ఎదిగి ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించారు. ఆంధ్ర మహాసభ ద్వారా కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా నిజాం వ్యతిరేక సాయుధ పోరాటంలో ఒక చేత పెన్ను, మరో చేత గన్ను పట్టి ప్రజల కోసం పోరాడిన వ్యక్తి. క్విట్ ఇండియా ఉద్యమం నుండి నిజాం వ్యతిరేక పోరాటాల వరకు నాలుగైదు సంవత్సరాలు కారాగార శిక్షను అనుభవించారు. 1938కి ముందు నిజాం పాలన కింద ఉన్న తెలంగాణ ప్రజల జీవితాన్ని ప్రజల మనిషి నవలలో చిత్రించారు. తెలంగాణాలో దోపిడీకి గురవుతున్న ప్రజలను చైతన్య పరచడానికి రాసిన నవలగా దీన్ని పేర్కొంటారు.

**నవల నేపథ్యం**

నిజాం నిరంకుశ పాలనలో అణగారిపోతున్న ప్రజా సమూహాలలో తలెత్తిన అస్తిత్వ చైతన్యం, ఆరాటం, పోరాటాలు సమిష్టి రాజకీయ కార్యాచరణ ప్రజల మనిషి నవలలో ప్రధాన అంశం. మా నిజాం రాజు జన్మజన్మల బూజు అని మహాకవి దాశరథి చెప్పినట్లు ప్రతి ఊరిలోనూ నిజాం పాలనకు ప్రతీకలుగా కొన్ని పాత్రలు ప్రతిఘటనకు సిద్ధమవుతున్నటువంటి వారి నుంచి కొన్ని పాత్రలను ఎన్నుకొని ఈ ప్రజల మనిషి నవల ఒక మహేతిహాసంగా సాగుతుంది. దిమ్మెగూడెం అనే గ్రామాన్ని అందుకు ఉదాహరణగా చూడవచ్చు. భూమి కోసం పరితపించేటటువంటి కపట రాజనీతి ఒకవైపు దానికి ప్రతిఘటనగా జాతి కోల్పోయినటువంటి సాంస్కృతిక ఆత్మను, అభిమానాన్ని పునరుద్ధరించుకునే ప్రజ ఒకవైపు ఇందులో కనబడతారు. ధర్మక్షేత్రం కురుక్షేత్రం అయినటువంటి ఆనాటి పోరాటంలో ప్రజలవైపు ఉన్నటువంటి కంఠీరవాన్ని నాయకుడిగా ఎన్నుకొని అళ్వారుస్వామి ఈ నవలను రచించారు. ఆ వూరిలో అన్ని ఊళ్ళలో లాగే ఒక భూస్వామి ఉండేవాడు. అతని పేరు రాంభూపాల్‌రావు. నిజాం తొత్తు అయినటువంటి హైదర్ అలీ అతనితోపాటు భూస్వామికి కొమ్ముకాసేటటువంటి రైతులు ఒకవైపు ఉన్నారు. మరోవైపు ఆ దోపిడీకి గురైనటువంటి వారిలో అగ్రవర్ణాల నుంచి ఇటు నిమ్నజాతుల వరకు అనేకులు మనకు ఇందులో దర్శనమిస్తారు. తెలంగాణ సాయుధ పోరాటం జరగటానికి ప్రాతిపదిక సిద్ధం చేసుకున్నటువంటి సాహిత్య రచనల్లో ఇది ఒకటని చెప్పవచ్చు. ఈ రచయిత ఆ ప్రాంతవాసి మాత్రమే కాక ఉద్యమాలలో ప్రత్యక్షంగా పాల్గొనడం వలన అక్కడి ప్రజల మనోభావాలను చక్కగా సాహిత్య రూపం ఇవ్వగలిగారు.

ఒక ఊరిలో భూస్వామికి వ్యతిరేకంగా అనేక వర్గాల సమీకరణ సంఘటన ఈ నవలలో ప్రధానాంశం. వేదాల రఘునాథాచార్యులు గారిది సనాతన వైష్ణవ కుటుంబం. దొర రాంభూపాల్‌రావు గారికి ఆ కుటుంబానికి చాలా సాన్నిహిత్యం ఉంది. వాస్తవానికి దొర గారి ఆధ్యాత్మిక గురువులు అయినటువంటి ఈ రఘునాథాచార్యులు గారికి ఇద్దరు కుమారులు. పెద్ద కొడుకు వెంకటాచార్యులు సంప్రదాయమైనటువంటి పద్ధతిలోనే నడుస్తూ దొరవారి పక్షంగా ఉంటాడు. చిన్నవాడు కంఠీరవం తాను తన వారిచే భ్రష్టుడు అని అనిపించుకున్నప్పటికీ ఊరిలో దొరవారి పీడనకు గురవుతున్న వారి సానుభూతిని పొందగలుగుతాడు. అంతేకాకుండా ఈ నవలలో మరొక విశేషమేమంటే ఆనాడు ఉన్నటువంటి రాజకీయ పార్శ్వమే కాకుండా మత సాంస్కృతిక వైవిధ్యాలకు సంబంధించిన అనేక అంశాలు చక్కగా చోటుచేసుకున్నాయి. ఉదాహరణకి ఈ కంఠీరవం క్రమంగా ఎదుగుతూ వచ్చిన విధానాన్ని ఈ నవలలో చాలా అద్భుతంగా చిత్రించారు. కంఠీరవం తన వైదిక నేపథ్యాన్ని వదులుకొని ఎలా ఇతర వర్గాల వారి అనుభవాన్ని గ్రహించి, వారికి అనుకూలంగా ఉద్యమించిన విషయాన్ని ఆళ్వార్‌స్వామి చాలా చక్కగా ప్రతిబింబింపజేశారు. నిజామాబాద్ జైలుకు వెళ్లే వరకు కంఠీరవంకి ఇంకా తన కుల పట్టింపులు చాలానే ఉన్నాయి. అందరితో ఉద్యమం చేయటం అందరూ కలిసి అనేక విషయాల మీద చర్చలు చేయడం వల్ల, తనకు ఉన్నటువంటి ఆ అభిప్రాయం జైలు జీవితంలో పూర్తిగా మారిపోయింది. కంఠీరవం రెండున్నర ఏళ్ళ కాలం పాటు జైల్లో ఖైదీగా గడుపుతారు. జైల్‌లో ఉన్నటువంటి రకరకాల వ్యక్తులను గమనిస్తాడు. జైలు సిబ్బంది దెబ్బలకు గురై పిచ్చివాళ్లుగా మారిపోయిన వారిని చూస్తాడు. వారిలో 'బషీర్' అనే దొంగ అతనికి ఆప్తమిత్రుడు అవుతాడు. బషీర్ పూర్వం హిందువునని మతాంతరం వల్ల ముస్లింగా మారడాన్ని తెలుసుకుంటాడు. అతని తండ్రి

పోషించలేక అతన్ని అమ్మివేస్తే గిర్దావర్ కొన్నాడని, దొంగల గుంపుతో సంబంధాలు పెట్టుకున్నాడని,దాంతో పోలీసులు జైల్లో వేయడం జైలు సిబ్బంది అత్యంత కిరాతకంగా ప్రవర్తిస్తూ వెదురు కర్రలతో స్పృహ కోల్పోయేలా కొట్టడం, ఇవన్నీ చూసి కంఠీరవం చలించిపోతాడు. తన కోసం ఏడ్చేవారు కూడా ఉన్నారని ఆశ్చర్యపడి కంఠీరవానికి దగ్గరగా ఉంటూ శిష్యుడిగా మారతాడు బషీర్.

వట్టికోట రాసిన ప్రజల మనిషి నవల ప్రధాన లక్ష్యం మంచి ప్రభుత్వాన్ని ఏర్పర్చుకోవడం. ఈ లక్ష్యాన్ని ప్రజల మనిషి నవలలో కథానాయకుడు కంఠీరవం ద్వారా వాచ్యంగా చెప్పించారు. మంచి ప్రభుత్వం అంటే ఏంటని బషీర్ చేత ఒక ప్రశ్న కూడా వేయించి కంఠీరవం చేత సమాధానం చెప్పించారు. మంచి ప్రభుత్వంలో నీ తల్లిదండ్రుల వలె పొట్టకెల్లక కన్న బిడ్డలను అమ్ముకోరు, వదులుకోరు. అన్యాయంగా ఇతరుల ఆస్తులను ఆక్రమించరు. ఒకరిపై ఒకరికి ద్వేషం ఉండదు. అన్నం లేదని అరిచే వాళ్ళుండరు. అందరూ నీతికి కట్టుబడి దయతో మెలుగుతూ ఆప్తులుగా బతుకుతారు అని చెబుతాడు. అర్థ శతాబ్దం క్రితం వట్టికోట కన్న కల ఇది. భారతదేశానికి స్వతంత్రం వచ్చిందని స్వర్ణోత్సవ, వజ్రోత్సవ వేడుకలను జరుపుకుంటున్నాం. అయినా వట్టికోట 50 ఏళ్ల క్రితం ప్రజల బంగారు భవిష్యత్తు గురించి కన్న కలలను సార్థకం చేసేందుకు మంచి ప్రభుత్వం ఏర్పాటుకు జీవన్మరణ పోరాటాలు సాగుతున్న వర్తమాన చరిత్రనే మనం చూస్తున్నాం. ప్రజల మనిషి నవలలో ఆనాటి ప్రజల ఆశలను ఆకాంక్షలను ప్రతిఫలించిన కంఠీరవం, బషీర్, కొమరయ్య వంటి ఉద్యమ స్ఫూర్తి కలిగిన వారసులు ఈనాటి ప్రజా ఉద్యమాలలోనూ కొనసాగుతున్నారు. అందువల్ల ఆళ్వార్‌స్వామి నవలలు అంటే చారిత్రిక అవశేషాలు కావు. వర్తమానంతో సంభాషిస్తూ, సంఘర్షిస్తూ అంతిమ విజయం వరకు కొనసాగే ఇతిహాసంగా చెప్పవచ్చు.

నవలలో కథానాయకుడైన కంఠీరవంలో జైలు జీవితం తర్వాత కుల మతాతీత దృష్టి మరింత బలపడుతుంది. జైలు జీవితం గడిపిన ఖైదీలు అస్పృశ్యులు కాదన్న భావన కంఠీరవంలో పెరిగి బషీర్‌ను తమలో ఒకడిగా భావించి అతనితో కలిసి భోజనం చేయడం ద్వారా తన భావాలను తెలియజేస్తాడు. జైలులో తన వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకున్న బషీర్‌ని తన బంధువుగా, స్నేహితుడిగా పరిచయం చేస్తాడు. జైలుని చిరునామాగా మార్చుకున్న ఒక దొంగలో పరివర్తన తీసుకు వచ్చి ఒక కొత్త చిరునామా ఇచ్చే ప్రయత్నం చేస్తాడు రచయిత. ఈ నవలలో కంఠీరవం పాత్ర ద్వారా తన అభిప్రాయాలను వెల్లడిస్తారు వట్టికోట. సమాజంలో బషీర్ వంటి వాళ్లు చిల్లర దొంగతనాలు చేస్తే జైలు పాలవుతున్నాడు. కానీ దొర రామ్‌భూపాల్‌రావు వంటి వాళ్లు కొమురయ్యను, ఊరిని, చివరికి నిజాం సర్కార్‌ను కూడా మోసం చేసినా ఎలాంటి శిక్ష పడటం లేదు. అందువల్లే జైలు సమాజ విద్రోహుల కోసమే పుట్టాయి కానీ స్వార్థపరులు వాటిని దేశభక్తులపై ప్రయోగిస్తున్నారు అని కంఠీరవంతో చెప్పిస్తారు రచయిత.

నవలలో కథానాయకుడు కంఠీరవం ఉద్యమ ఫలితంగా జైలు పాలైతే దుర్మార్గుల ఫలితంగా ప్రతి నాయకుడు రామ్‌భూపాల్‌రావు జైలు పాలవుతాడు.ఫలితం ఒక్కటే అయినా వారిరువురిని జైలు పాలు చేసిన కారణాల ఫలితంగానే కంఠీరవం ప్రజల హృదయాల్లో ఉంటే, ప్రజల దూషణలు ఎదుర్కొనే రామ్‌భూపాల్‌రావు వంటి వారు ప్రజల నాలుకలపై కొలువుంటారు.

జై కాంగ్రెస్ సత్యాగ్రహం మొదలైన కాలంలో రామ్‌భూపాల్‌రావు జైలు నుంచి విడుదల అవుతాడు. నిజాం ప్రభుత్వానికి తొత్తుగా ప్రజలపై అధికారం చెలాయించడం ప్రారంభిస్తాడు.తనను జైలుపాలు చేసినందుకు గాను అందరిపై కక్షలు తీర్చుకునేందుకు అనేక కుయుక్తులతో కాలం గడుపుతాడు. ఫలితంగా గ్రామ ప్రజల వికాసానికి కంఠీరవంచే ప్రారంభించబడిన గ్రంథాలయం మూత పడుతుంది.జైలు నుంచి వచ్చిన తర్వాత కంఠీరవం, బషీర్, విజయదేవు, వెంకటేశ్వరరావు, కొమరయ్య తదితరులంతా గ్రామ ప్రజల పక్షాన నిలిచి హక్కులకై ఉద్యమించేలా వారిని ప్రోత్సహించి సఫలమయ్యారు. తదుపరి బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా జరుగుతున్న స్టేట్ కాంగ్రెస్ అధికారంలో పాల్గొని జైలు పాలవుతారు. ఒక మంచి పని చేసి అరెస్టు కావడం దేశ సేవలో ఉన్నత స్థాయిని పొందడమే.న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసే వెంకటేశ్వరరావు జైలు పాలు కావడం దేశం కోసం అతడు చేసిన త్యాగంగానే భావించాలి. దొంగగా శిక్షను అనుభవించిన బషీర్ ఉద్యమంలో జైలుపాలు కావడం మారిన అతని వ్యక్తిత్వానికి అద్దం పడుతుంది. వారందరూ స్వాతంత్రోద్యమంలో ఖైదీలుగా కావడం సమాజానికి దూరంగా గడపడానికి సూచిక కాదు. సమాజం కోసం త్యాగం

చేయడానికి సూచిక. రాజకీయ ఖైదీల జీవితం వెనుక కారణం ఉద్యమ జీవితం ప్రజల మనిషితో పాటు ఇతర రచనల్లోనూ జైలు జీవితాన్ని ఆసక్తికరంగా మలిచారు. స్వామి జైలు జీవితం మనిషి పరివర్తనకు తావివ్వాలనేది ఆయన అభిప్రాయం. ఒకవైపు ఉద్యమ చోదకశక్తిగానూ, మరోవైపు విజ్ఞాన ప్రసార వాహికగాను వెలుగులు విరజిమ్మిన వైతాళికుడు వట్టికోట. ఆయన రచనల్లో జైలు జీవితం అంతస్రావంగా కనిపిస్తుంది. తెలంగాణలో బహుశా అత్యంత దీర్ఘకాలం జైలు జీవితాన్ని చవిచూసిన గొప్ప రచయిత ఆయనే కాబోలు. ఆయన ఆరు సంవత్సరాల జీవితాన్ని జైలులో గడిపారు. వేరువేరు సందర్భాల్లో కాళోజీతో, దాశరథితో జైల్లో సహవాసం చేశారు. ఏ నేరం చేయని వారు కూడా జైల్లో ఎలా మగ్గిపోతున్నారో స్వయంగా చూసి బాధపడ్డారు. ఖైదీల జైలు జీవితాలకు కారణాలను అన్వేషిస్తూ ఆ అన్వేషణ సారాంశం నవలా సాహిత్యంలో ప్రతిఫలింపజేశారు. మొత్తానికి సత్యాగ్రహోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లిన వారిలో కంఠీరవం, కొమరయ్య, బషీర్, వెంకటేశ్వరరావు, విజయ్‌దేవులుగా కనిపిస్తున్నారు. అదే సమయానికి జైలు నుంచి విడుదలైన రామ్‌భూపాలరావు ప్రజల పక్షాన పోరాడే వారంతా జైల్లో మగ్గుతున్నారని తెలిసి మళ్ళీ యధా ప్రకారంగా తన అరాచకాలను కొనసాగిస్తాడు అని అనడంతో ఈ నవల ముగుస్తుంది.

ఈ రకంగా దిమ్మెగూడెంలో సామాన్య ప్రజల జీవితం చివరికి దొరల నియంతృత్వంలో అగమ్యగోచరంగా మారింది. కానీ దొరలు చేసే అన్యాయాలను వారి ఆగడాలను తిప్పి కొట్టడంలో ఎందరికో చైతన్యాన్ని కనువిప్పు ఉద్యమ స్ఫూర్తి కలిగించిన నవలగా ప్రజల మనిషికి స్థానం దక్కిందని చెప్పొచ్చు. కళ్ల ముందు జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కోవటానికి ఆనాటి ప్రజలు అనుసరించిన విధానాలు వారి ధైర్యసాహసాలు మనకు చక్కని నవల ద్వారా అందించారు. ఈ స్ఫూర్తి తర్వాత జరగబోతున్న సాయుధ పోరాటానికి ప్రజలంతా మమేకమై ఒక మాటకు కట్టుబడి దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడేందుకు చైతన్యవంతులను చేయగలిగింది. అదే స్ఫూర్తిని ప్రజలు జాతి లింగ మత వర్ణ భేదాలు లేకుండా స్వతంత్ర ఉద్యమం వరకు నడిచేలా చేయగలిగింది.

నిజాంకు వ్యతిరేకంగా తెలంగాణలో జరిగిన ఈ ఉద్యమం ఎక్కువగా భూమి కోసం భుక్తి కోసం నిరంకుశ విధానాలకు చరమగీతం పాడడం కోసం అయితే కనుక ఈ నవలలో కథానాయకుడు కంఠీరవం కాకుండా కొమురయ్య అవుతాడు అనేది కొందరి విజ్ఞుల వాదన. ఎందుకంటే కంఠీరవం వైష్ణవ కులం నుండి చైతన్యం పొంది సామాజిక ఉద్యమాల్లో ప్రవేశించే క్రమంలో ఎదుర్కొన్న సమస్యలు ప్రాధాన్యతలు క్రమంగా ఆయనలో చైతన్యం పెరిగిన తీరు నవలలో కంఠీరవం ప్రధాన పాత్రగా ముందుకు సాగింది. అయితే సమస్య ఎక్కడ వచ్చింది. తెలంగాణ రైతాంగ ఉద్యమం దేనికోసం ప్రారంభమైంది. భూమి కోసం భూస్వాముల ఆధిపత్యం వ్యతిరేకించడం కోసం నిజాం రాజ్యాన్ని వదులుకోవడం కోసం తెలంగాణ రైతాంగ ఉద్యమం ముందుకు సాగింది. సంఘం పేరిట నిజామాంధ్రమహాసభ తీసుకువచ్చిన చైతన్యంతో ప్రజలు కదిలారు. ఆంధ్ర మహాసభ రెండుగా చీలిపోయింది. ఒక పాయ కాంగ్రెస్ గాంధీ అభిమాన సంఘంగా మరో పాయ వామపక్ష అభిమాన సంఘంగా కొనసాగింది. వామపక్ష సంఘం ప్రజల భూమిని ప్రజలకు ఇప్పించాలని భూస్వాముల దోపిడీ దౌర్జన్యాలను అరికట్టాలని దున్నేవాడిదే భూమి అని ప్రధానంగా ముందుకు సాగింది. అందులో భాగంగా నైజాం సర్కార్‌ను కూడా చేయించుకొని నూతన ఉద్యమాన్ని నిర్మించాలనుకుంది. అందువల్ల ఒక సామాజిక ఉద్యమాన్ని చిత్రించిన పోడుభూమి సమస్య గురించిన ఉద్యమం ప్రధానమైనప్పుడు దానికి కేంద్ర బిందువు నవలలో కొమరయ్య. సామాజిక చరిత్రను అనుసరించి గానీ ఉద్యమ చరిత్రను అనుసరించి గానీ ప్రజల మనసుల్లో ఒక కథానాయకుడు కొమరయ్య అని నిరూపించారు. అనుమాండ్ల భూమయ్య లాంటివారు ఈ అభిప్రాయం పైన భేదాభిప్రాయాలు కూడా తలెత్తిన మాట వాస్తవమే. కారణం అధికులు కంఠీరవానికే కథానాయకునిగా స్థానం ఇవ్వడమే. కంఠీరవంలాంటి ఉద్యమాల్లో ఎలా పని చెయ్యాలో అని ముందుకు వస్తూ తనను తాను చైతన్య పంచుకుంటూ ముందుకు నడిచిన పాత్ర. ఏ విషయాల్లో ముందుకు నడిపించింది ఆర్య సమాజం ద్వారా ముస్లిములుగా మారిన దళితులను తిరిగి హిందువులుగా మార్చడానికి బాగా అభివృద్ధి చేసినట్లు కనబడుతుంది. అంతేగాని భూమి సమస్య కోసం కంఠీరవం నాయకత్వం వహించినట్లు కనపడదు. అయితే కంఠీరవాని ఎలా అర్థం చేసుకోవాలి? సామాజిక ఉద్యమంలో దిగువ మధ్య తరగతి నుండి చైతన్యం పొందిన ప్రజలు ఆయా పీడిత వర్గ పోరాటాలు చైతన్యమవుతూ ముందుకు సాగుతూ నాయకత్వంగా ఎదిగే క్రమానికి ప్రతీక. కులం రీత్యా కంఠీరవంకి వైష్ణవ

బ్రాహ్మణ కులం. ఇది ఈ నవల రాసిన వట్టికోట జీవిత చరిత్రకు అనుకరణ కావచ్చేమో అది అప్రస్తుతం. ఇది వట్టికోట జీవిత చరిత్ర కాదు. ఆత్మకథ కాదు. ఆయన జీవితానుభవాలను నవలాగా మలిచారు. అందువల్ల నవలే ప్రధానం. నవలలోని వస్తువు ప్రధానం. నవలలో చిత్రించబడిన సమస్య పరిష్కారం అందుకోసం ఉద్యమించిన ప్రజలు ప్రధానం. ఆ ప్రజల్లో కొమురయ్య ఒకడు.

కంఠీరవం విప్లవోద్యమంలో దిగువ మధ్య తరగతి నుండి తనను తాను సంస్కరించుకుంటే చైతన్యం తలచుకుంటూ చురుకుగా పాల్గొనే క్రమానికి చేరుకుని ఉండవచ్చు. కానీ కొమురయ్యకు కంఠీరవానికి మధ్య స్పష్టమైన తేడా ఉంది. కొమరయ్య ప్రజల నుండి వచ్చిన ప్రజల మనిషి. కంఠీరవం మధ్యతరగతి అగ్రకుల నుండి వచ్చిన మనిషి. ప్రజలతో కలిసి పనిచేయడానికి చైతన్యం పొందుతున్న మనిషి. కొమురయ్య జీవితమే పోరాటం. జీవిత వాస్తవికత కాదు. కొమురయ్యకు పోరాటం ఒక అనివార్యం అది జీవిత వాస్తవికత.

ఈ అంశం పట్ల రచయితల పట్ల ఎలాంటి భేదాభిప్రాయాలు నాకు కూడా అన్యాయంగా ద్వారా కుట్రల వల్ల తన భూమిని కోల్పోయి హింసించబడి తిరిగి తన హక్కులకై పోరాడి దొరలు జైలుపాలు చేసి ఈ పనిలో గ్రామ ప్రజలను సంఘటితం చేయడంలో కొమరయ్య తనదైన పాత్రను సమర్థవంతంగా పోషిస్తే, కుల మత చదువు స్థలాలను వదిలి అభ్యుదయ పదాలను నడిచి మనిషిగా ఎదిగిన కంఠీరవం ఇరువురు ఈ కథలో నాయకులే. వీరి పోరాట స్ఫూర్తి ఎందరికో ఆదర్శం అయింది తదుపరి జరగబోయే ఉద్యమాలకు...

ఈ విధంగా ప్రజల మనిషి నవల జాతీయోద్యమ స్ఫూర్తిని ప్రజలలో రగిలించింది అని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు....

**ఉపయుక్త గ్రంథసూచి**

1. ప్రజల మనిషి–నవల – వట్టికోట ఆళ్వారుస్వామి

# తెలుగులో జాతీయ కవిత్వోద్యమం - తొలి దశ

**డా. నల్లపనేని విజయలక్ష్మి,** తెలుగు ఆధ్యాపకురాలు, యార్లగడ్డ అన్నపూర్ణాంబ ప్రభుత్వ మహిళా కళాశాల, చీరాల, ఆంధ్రప్రదేశ్, సెల్ : 9701667350

జాతీయత అనేది ఒక మానసిక స్థితి. మనమంతా ఒక్కటే అని నమ్మి సమిష్టి ప్రయోజనాన్ని కాంక్షించే స్థితి. తను పుట్టిన భూమి మీదా, తరతరాల నుంచి సాగివస్తున్న సత్సంప్రదాయాల మీదా అవ్యాజమైన అభిమానం ఉండి ఒక పాలనా వ్యవస్థ కనుగుణంగా మనుగడ సాగించే మానసిక స్థితి జాతీయత అని ప్రముఖ రచయిత హాన్స్‌కోన్ జాతీయతను నిర్వచించాడు.

'Nationalism is a state or condition of mind characteristic of certain peoples with a homogeneous culture, living together in close association on a given territory, and sharing a belief in a distinctive existence and a common destiny'అని ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ అమెరికాలో జాతీయత గురించి వివరించబడింది.

ప్రతి జాతి తమ జీవన విధానానికి, స్వేచ్ఛకు ఇతరుల వల్ల ఆటంకం కలగకూడదని కోరుకుంటుంది. తమ భవిష్యత్తు తమ చేతుల్లోనే ఉండాలని కోరుకుంటుంది. ఆ ధ్యేయ సాధనకు పాటుపడుతుంది. తమ జాతి యొక్క ఉన్నత స్థితికి తామే పాటుపడటంలో జాతీయత ఇమిడి ఉంది.

ఆధునిక యుగంలో జాతీయోద్యమ భావానికి బీజం వేసిన వ్యక్తి రూసో. 'ఒక జాతికి సంబంధించిన సర్వ విషయాల్లోనూ ఆ జాతికి తప్పకుండా స్వేచ్ఛ ఉండాలని, ఆ జాతి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవలసింది ఆ జాతే గాని పర జాతి గాదని ప్రతిపాదించాడు. ఆయన ఆ విధంగా చేసిన ప్రతిపాదన మొదట పాశ్చాత్య ప్రాంతాలను ప్రభావితం చేసింది. ఆ తరువాత ప్రాచ్య దేశాలకు పాకింది. స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వం ప్రాతిపదికలుగా తన జాతి బాగోగులను తానే తీర్చిదిద్దుకోవాలనే ఆకాంక్ష ప్రతి జాతికి కలిగింది. 'The forest of Independence is better than the cage, though made of gold'అనే భావన అందరిలో పెరిగింది. పరాయి పాలన నుంచి తమ జాతిని విముక్తం చేసుకోవడం లక్ష్యంగా తిరుగుబాట్లు మొదలయ్యాయి. అవే జాతీయోద్యమాలు. స్వాతంత్ర్యోద్యమాలు.

భారతదేశంలో తొలిదశలో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాట్లు విఫలం కావటానికి ప్రజలందరూ జాతీయతా స్ఫూర్తిని అందిపుచ్చుకోకపోవటమే ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటులో సిపాయిలే అధిక శాతం పాల్గొన్నారు. టిప్పు సుల్తాను, శివాజీ తదితరులు చేసిన పోరాటాలు ఆయా భూభాగాలకే పరిమితమయ్యాయి.

ఆంగ్లేయులు తమ అవసరాల కోసం ప్రవేశపెట్టిన ఆంగ్లవిద్య భారతీయుల్లో స్వాతంత్ర్యకాంక్ష మొగ్గ తొడిగేలా చేయటానికి సాధనమైంది. ఆంగ్ల విద్యా ప్రవీణులైన యువకులకు ఉన్నత అధికారులుగా ఉద్యోగాలు నిరాకరించడం, పత్రికా స్వేచ్ఛను నిరాకరించే బిల్లును ప్రవేశపెట్టటం, జాతి పునరుజ్జీవనానికి కృషి చేస్తున్న వంగ రాష్ట్రాన్ని విభజించి హిందువులు, మహమ్మదీయుల మధ్య విభేదాలు సృష్టించడానికి ప్రయత్నించటం తదితర అంశాలు భారతీయులకు ఆంగ్లేయుల పట్ల గల భ్రమలను తొలగించాయి.

1907లో బిపిన్ చంద్రపాల్ ఆంధ్ర పర్యటన గొప్ప రాజకీయ సంచలనానికి కారణమైంది. అప్పటికే వందేమాతరం నినాదాన్ని అంది పుచ్చుకొని ఉద్యమస్ఫూర్తితో రగులుతున్న ఆంధ్ర ప్రజలకు తన ఉపన్యాసాలతో మరింత ఉత్సాహాన్ని అందించాడు బిపిన్ చంద్రపాల్. ఏప్రిల్ 19 నుంచి 24 వరకు ఆయన రాజమండ్రిలో ఉపన్యసించినపుడు ఆ ఉపన్యాసాలను చిలకమర్తి తెనిగించారు. ఉపన్యాసాల చివరి రోజు చిలకమర్తి ఆశువుగా చెప్పిన పద్యం–

**'భరతఖండంబు చక్కని పాడియావు**
**హిందువులు లేగదూడలై యేడ్చుచుండ**
**తెల్లవారను గడుసరి గొల్లవారు**
**పితుకుచున్నారు మూతులు బిగియగట్టి'**

ఈ పద్యం తెలుగులో భారత జాతీయోద్యమ సంబంధమైన తొలి రచన అని విమర్శకుల అభిప్రాయం.

అయితే దీనికి భావభిక్ష పెట్టిన రచన ఒకటి 1905 డిసెంబరు 15వ తేదీ కృష్ణా పత్రికలో కనిపిస్తుంది. అప్పటికే కృష్ణా పత్రికలో గాడిచర్ల హరిసర్వోత్తమరావు, కొండా వెంకటప్పయ్య గారు, చన్నాప్రగడ భానుమూర్తి పంతులు గారు రాసిన ప్రబోధాత్మక వ్యాసాలు చదివి ప్రేరితుడైన అజ్ఞాత కవి ఒకరు 'The cry of Mother India' (హిందూ దేశపు మొర) అనే గీతాన్ని ప్రచురించారు.

**'హిందువులారా! ఎన్నాళ్లీ గతి**
**మందమతులరై మాటికి జెడెదరా**
**నందనులగు మీరందరు స్రుక్కగ**
**యెందుకు నా బ్రతుకితరుల కోసమ**
**......................................**
**దూడ నోరు గొట్టి ద్రోహంబు గొల్లలు**
**పాడి సమస్తము పరుల కమ్మ గతి**
**కూడు లేని నా కొడుకుల గాదని**
**యేడకో నా ధనమెల్లను బోయెడి**
**......................................'**

అంటూ సాగుతుంది. ఆంగ్లేయులు భారతదేశపు సంపదను కొల్లగొట్టిన విధాన్ని చెప్పిన ఈ భాగం చిలకమర్తి నోట మరింత సొగసును, సమగ్రతను అందిపుచ్చుకొన్నది. అయినా 'సూటిగా ఆంగ్ల ప్రభుత్వమును విమర్శించిన జాతీయకవి' గా చిలకమర్తికి ప్రాధాన్యం ఇవ్వక తప్పదు. 1905 కంటె ఎంతో ముందుగానే 1895 లోనే ఆయన ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ రచించిన పద్యాలు చింతామణి పత్రికలో ప్రచురించబడ్డాయి.

**'నేల దున్నుదమన్నఁ జాలతరము పన్ను**
**నీరు గావలెనన్న నీటి పన్ను**
**వాణిజ్యమొనరింప వచ్చు బడికి పన్ను**
**సరకు లమ్ముద మన్న సంత పన్ను**
**కఱ్ఱ లమ్ముద మన్నఁ గలప కింకొక పన్ను**
**పట్టణంబుల మున్సిపాలు పన్ను**
**పారిపోవుదమన్నఁ బండి హాసీల్ పన్ను**
**కొంపమ్ముకున్నచో స్టాంపు పన్ను**

**ఉన్న మట్టుకు తినకుండ నుప్పు పన్ను**
**ననెడు పన్ను వెదిగదీసె జనుల నెల్ల'**

ఈ విధంగా ప్రభుత్వం పట్ల అసంతృప్తిని ప్రదర్శించడమే కాకుండా ప్రజల కోసం ప్రభుత్వంతో పోరాడే సాహసులు ముందుకు రావాలని పిలుపునిచ్చాడు. అందువల్ల తెలుగులో జాతీయోద్యమ కవిత్వానికి శ్రీకారం చుట్టిన ఘనత చిలకమర్తిదే.

1897 లో చింతామణి పత్రికలో పి. రామశాస్త్రి గారు రచించిన పద్యాలు దేశాభిమాని తత్వాన్ని ఆవిష్కరించి సంఘశక్తికి గల బలాన్ని తెలియజెప్పాయి. 1906 లో చన్నాప్రగడ భానుమూర్తి పంతులు గారు వెలువరించిన 'వందేమాతరం' పద్య ఖండిక భారతీయుల దుస్థితికి గల కారణాలను ఎత్తి చూపింది.

**ప్రొద్దున లేవంగ ప్రొయిరాజవలెనన్న**
**నగ్ని హెూత్రము స్వేదనంప వలసె**
**నా బాల గోపాల మఖిలంబునకును మాం**
**చెష్టరు పుట్టము ల్నేయవలసె**
**మునుమాపు వ్యాయామమునకు కందుకములు**
**లండను పంపుచు నుండవలసె**
**వ్రాతకు లేఖినీ పత్రము ల్వలయుచో**
**నాష్ట్రియా జర్మను లంపవలసె**
**చిన్నబిడ్డలు ద్రావంగ క్షీరములను**
**భాగ్యవంతుల పాలకు పంచదార**
**యూరి పేదల గంజికి నుప్పుగల్లు**
**నన్యదేశంబు లంపంగ నయ్యె నకట'**

1906 లో మనోరమ పత్రికలో 'The Salvation of India' (భారత ఖండ విముక్తి) అనే శీర్షిక క్రింద కొన్ని పద్యాలు ప్రచురించబడ్డాయి. కవి పేరు ప్రచురించబడలేదు. మనోరమ సంపాదకులైన చిలకమర్తి వారే ఆ పద్యాలు వ్రాసి ఉంటారని మొదలి నాగభూషణశర్మ గారు ఊహించారు.

**'స్వాతంత్రము నను గాదే**
**ఖ్యాతిన్ బలముల జయంబుఁ గను దేశంబుల్**
**స్వాతంత్ర్యము మేటి దొడవు**
**స్వాతంత్ర్యము లేని బ్రతుకు బ్రతుకే తలపన్'**

అంటూ స్వాతంత్ర్యం లేని బ్రతుకు బ్రతుకే కాదని తెలియజెప్పి ఐకమత్యంతో, సమతాభావంతో, నిస్వార్థంగా స్వాతంత్ర్య సముపార్జన కుపక్రమించాలని ఈ పద్యాలు బోధించాయి.

1909 లో ఆంధ్రభారతిలో 'మేలుకొలుపు' అనే శీర్షికతో ప్రచురింపబడిన గేయం వందేమాతరం స్ఫూర్తిని అందిపుచ్చుకొమ్మని దేశ జనులను ప్రబోధించింది.

**'మేలుకొనుమీ భరత పుత్రుడ**
**మేలుకొనుమీ సుజన పుత్రుడ**
**..............................'**

అంటూ మొదలైన గీతం దేశదేశాలు పరపాలన నుండి విముక్తి కావడం కోసం ఉద్యమించి విజయం సాధిస్తున్న వేళ దేశాభిమానులు మేల్కోవలసిన అవసరాన్ని తెలియజెప్పింది.

**'కౌతుకమున జపానులెల్ల**
**సకాలమున మేల్కాంచి పరగును**
**గాఢనిద్రను విడిచి చైనులు**
**కనులు తెరచి జగంబు గనుగొని**
**పారశీకులు దీర్ఘనిద్రను**
**బారద్రోలిరి గౌరవంబున**
**వారి దారిని యా తురుష్కులు**
**వర్తిల్లెద రిదిగో**
**అందరును నీ కంటె ముందర**
**నడుగులేయుచు మెలగుచుండగ**
**పంద వలె నిటు నిద్ర వోవగ**
**పాడియగునయ్యా'**

తొలిదశలో వెలువడిన జాతీయోద్యమ కవిత్వాన్ని పరిశీలిస్తే ప్రధానంగా దేశాభిమానం ఎలా ఉండాలో చెప్పడం, ఐకమత్యం కలిగి ఉండవలసిన అవసరాన్ని తెలియజెప్పడం, భారతదేశ ఆర్థిక దుస్థితికి కారణాలు వివరించి చెప్పడం – తద్వారా ప్రజలు పర పాలన నుంచి విముక్తం కావలసిన అవసరాన్ని గుర్తించేలా చేయడం కనిపిస్తుంది.

మొదట చిన్న ధారగా మొదలైన జాతీయోద్యమ కవిత్వం కావ్యాలు, పద్య ఖండ కావ్యాలు, పద్య ఖండికలు, గేయ ఖండ కావ్యాలు, గేయ ఖండికలు, శతకాలు, దండకాలు, కీర్తనలు, పదములు, భజన పాటలు, హరికథలు తదితర రూపాలలో వెలువడిన ఉపనదులను కలుపుకొని మహా కవిత్వ నదిగా రూపాన్ని పొందింది.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగులో జాతీయోద్యమ కవిత్వం–డా. మద్దూరి సుబ్బారెడ్డి, రాగసుధ ప్రచురణలు, తిరుపతి, 1982
2. ఆధునికాంధ్ర కవిత్వము–సంప్రదాయములు–ప్రయోగములు – డా.సి.నారాయణరెడ్డి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1967
3. Nationalism-Its meaning and History (Revised Edition)-Hans Kohn, 1965
4. Indian War of Independence-V.D.Savarkar, 1909

# తెలుగు నాటకం - స్వాతంత్ర్యోద్యమం

**డా. నేలటూరి అనిత మార్గరేట్,** తెలుగు అధ్యాపకులు, ఎస్.ఆర్.ఆర్. & సి.వి.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విజయవాడ

తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలున్నప్పటికి వాటన్నిటిని ప్రక్కకు త్రోసి నాటకం విశిష్టస్థానాన్ని పొందటానికి కారణం నాటకం దృశ్యరూపం కావడమే. మానవ జీవితానికి అనుకరణ అయిన నాటకం కాల్పానిక భావంతో ప్రేక్షకులకు ఆనందాన్ని కలిగించే అద్భుతమైన కళా స్వరూపం, సర్వకళల సమాహారం. నాటకంలో ఇతర లలితకళలన్నిటికి స్థానం వుంది గనుక కళారంగం అంటే మొదట మనకు గుర్తుకు వచ్చేది నాటక రంగమే. నాటకం వ్యక్తిజీవితం, నాటకం వ్యవస్థ రూపం, నాటకం సమస్త ప్రపంచం. సమాజంలో ప్రజల కష్టాలు, కన్నీళ్లు, ఉద్వేగాలు, సమస్యలు, సంఘర్షణలు, వైరుధ్యాలు, విభిన్న ప్రవృత్తులతో కూడిన సమగ్ర మానవుణ్ణి చిత్రించే దిశగా తెలుగు నాటక రంగం ప్రయాణించింది. సాంఘిక సమస్యలను కళాత్మకంగా ప్రయోగించటంలో, వస్తు వైవిధ్యాన్ని చూపటంలో నాటకరంగం నిర్వహించిన పాత్ర ప్రశంసనీయం. ప్రజా జీవితంతో మమేకమవుతూనే కాలానుగుణమైన ఇతివృత్తాలతో నాటకం ప్రజా ప్రయోగ కళగా భాసిల్లింది. దాదాపు నూట యాభై సంవత్సరాల చరిత్రగల తెలుగు నాటక రంగం సమాజాన్ని చైతన్య పరచటంలో తనదైన ముద్రవేసింది.

ఆధునిక నాటకం ప్రారంభమైన రోజుల్లో రచయితలు సంఘ సంస్కరణకు ప్రాధాన్యతనిస్తూ రచనలు చేసేవారు. మహాత్మాగాంధి 1920 లో భారత జాతీయ పోరాటానికి నాయకత్వం స్వీకరించి, దేశమంతా సంచారం చేయటం ప్రారంభించిన తర్వాత ఆ ఉద్యమానికి ప్రభావితులైన రచయితలు, దేశభక్తితో స్వాతంత్ర్య సాధన ధ్యేయంగా ప్రజలను చైతన్య పరచటానికి నాటకాలు వ్రాయటం, ప్రదర్శించటం ప్రారంభించారు. ఆ సమయంలోనే ఆంధ్రదేశంలో దేశభక్తి ప్రేరితమైన ఎన్నో సాహిత్య ప్రక్రియలు బయటకు దూసుకొని వచ్చాయి. వాటన్నిటిలో ఉజ్వలమానమై ఉవ్వెత్తున ఎగసి వినువీధుల్లో విహరించింది తెలుగు నాటకం. నాటక ప్రక్రియ జాతీయోద్యమ భావనను స్వాతంత్ర్య కాంక్షను, స్వేచ్ఛా పిపాసను కలిగించి, రెచ్చగొట్టి, స్వరాజ్యాన్ని సాధించే మార్గాన్ని చూపెడుతూ, విప్లవాత్మకమైన ప్రజాచైతన్యాన్ని తీసికొని రావటానికి ప్రయత్నించింది. ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వ నిరంకుశ పాలనను, అన్యాయాలను, దుర్మార్గాలను, నియంతృత్వ పోకడలను వీటన్నిటివలన ప్రజలు అనుభవించే కష్టనష్టాలను తెలిపే అనేక అంశాలతో నాటక కర్తలు నాటకాలను సృష్టించి ప్రజలను చైతన్యవంతులను చేయటానికి ప్రయత్నించారు.

ప్రజలు చైతన్యవంతులైతే తాము చేతులు ముడుచుకొని కూర్చోక తప్పదని గ్రహించిన బ్రిటిష్ ప్రభుత్వం ఆ నాటకాలన్నిటిని నిషేధించి నాటక కర్తలను జైళ్లకు పంపేది. ఈ నిషేధాల నిప్పుల వలయంలో చిక్కుకొని బయటపడలేక ఎన్నో అధ్భుతమైన నాటకాలు ఊపిరి పోగొట్టుకొని కనుమరుగైపోయాయి. తెలుగు సాహిత్య ప్రక్రియలపై బ్రిటిష్ ప్రభుత్వం నిషేధమనే ఇనుపపాదాన్ని బలంగా మోపటానికి ప్రధాన కారణం ప్రభుత్వ వ్యతిరేకతయే. ప్రజలకు అనుకూలంగా ఉండి ప్రభుత్వాన్ని విమర్శిస్తూనో, ఎదిరిస్తూనో రచించబడిన ఏ సాహిత్య ప్రక్రియ అయినా ప్రభుత్వానికి కోపం కలిగించటం వాస్తవం. ప్రభుత్వాలు తమ ఉనికిని కాపాడుకొనేందుకు తమ పరిపాలనను సజావుగా సాగించేందుకు ఆ సాహితీ ప్రక్రియలను అడ్డుకోవడం, అవసరమైతే ఆ

ప్రక్రియల ఉనికే లేకుండా చేయటం సర్వసాధారణం. బ్రిటీష్ వారి పరిపాలనలో భారతీయులు సొంతగడ్డపై, సొంత ఇంటిలో ఉంటూ కూడా పరాయి పంచన బ్రతికినట్లుగా బిక్కు బిక్కు మంటూ భయంతో దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించసాగారు. అటువంటి హీన, దీన పరిస్థితుల్లో కొందరు మహాత్ములు, మేధావులు, పరోపకారులు, దేశభక్తిపరులు సమాజంలో ఉద్భవించి బానిసత్వ విముక్తికొరకు, దేశమాత స్వేచ్ఛ కొరకు ఊపిరి ఉన్నంతవరకు పోరాడారు. అటువంటి వీరదేశభక్తుల ప్రతిచర్యా బ్రిటిష్ ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేకుండా చేసింది. ఇటువంటి ప్రభుత్వ వ్యతిరేక చర్యలను ఉపేక్షిస్తే చివరకు తమ ఉనికే ప్రశ్నార్థకమవుతుందని బ్రిటిష్ ప్రభుత్వం భావించి, భయపడింది. తమను, తమ అధికారాన్ని ఎవరు ఏ రూపంలో వ్యతిరేకించినా కఠినాతికఠినంగా శిక్షించాలనుకొంది. తెలుగు నాటక రచయితలు అనేకమంది ఈ ఆగ్రహానికి లోనైయ్యారు. అట్టివారిలో ముఖ్యులు దామరాజు పుండరీకాక్షుడు. స్వాతంత్ర్యోద్యమకాలంలో నిద్రాణమైవున్న జాతిని మేల్కొల్పడానికి, జాతీయోద్యమాన్ని ఉద్దీపింపచేయడానికి రచనలు చేసి ఎనలేని సేవ చేశారు. భారతదేశ దాస్యవృక్షాన్ని కూకటివేళ్లతో పెకిలించటానికి దామరాజు కలం నుంచి జాలువారిన సాహిత్యం చాలావరకు తోడ్పడింది. గాంధీ ఆవేశాన్ని గంభీర రణ శంఖారావంలా భావించి నాటకాలు, పద్యాలు, గేయాలు, బుర్రకథలు, హరికథలు ప్రచురించి బ్రిటిష్ ప్రభుత్వాన్ని భయభ్రాంతం చేసిన ప్రచండ వీర మార్తాండుడు ఈ కవిధీరుడు. ఈయన రాసిన 'గాంధీ విజయం' (1921) నాటకం నాటి ప్రభుత్వాన్ని దద్దరిల్లజేసింది. 'పాంచాల పరాభవం' (పంజాబ్ దురంతాలు) (1922) అనే నాటకంలో గవర్నర్ జనరల్ డయ్యర్‌ను 'డైరాసుర' అని సంబోధించడంపై బ్రిటిష్ పార్లమెంట్‌లో ఈ నాటకం మీద చర్చ జరిగింది. అనంతరం ఈ నాటకాలను ప్రభుత్వం నిషేధించింది. పుండరీ కాక్షుడు గాంధేయ సిద్ధాంతాల మీద నిబద్ధత కలిగిన వ్యక్తి. తెలుగులో మొదటగా రాజకీయ నాటకాలకు నాంది పలికిన ఘనత ఆయనకే దక్కుతుంది. 'నవయుగారంభము' (గాంధీ మహోదయం). ఈయన రచించిన ప్రథమ రాజకీయ నాటకం. ఇవేకాక ఆనాడు సంఘంలో కనిపించే పలు సమస్యలను తన రచనలతో ఒప్పించి ప్రజలకు సమస్య పరిష్కారాన్ని చూపేవారు. బ్రిటిష్ ప్రభుత్వం ఈయనను నిర్బంధించాలని తీవ్ర ప్రయత్నం చేసేది. కాని వారికి దొరకక ఎప్పటికప్పుడు కొత్త తరహా నాటకాలను రచిస్తూ ముందుకు సాగేవారు. ఉద్యమనాయకుల పేరు మీద, ఉద్యమాల పేర్ల మీద నాటకాలు రాసి ప్రదర్శిస్తుంటే ఆంగ్లేయ పాలకులకు సులభంగా దొరికిపోవడం జరుగుతుందని భావించి ఆయన హరిశ్చంద్ర, రాయబారం, చింతామణి వంటి నాటకాలు ప్రదర్శిస్తున్నట్లు ప్రచారం చేసి 'రణభేరి', 'క్విట్ ఇండియా' లాంటి నాటకాలను ప్రదర్శించేవారు. ఈయన రాసిన నాటకాలను ఆచార్య రంగా ఇంగ్లండ్‌లో ప్రదర్శించి అరెస్టు అయ్యారు. ఈయన నాటక సాహిత్య ధోరణికి తల్లడిల్లిన బ్రిటిష్ ప్రభుత్వం ఓ అడుగు దిగివచ్చి 'గాంధీజీ' పాత్రలేకుండా నాటకాలు రాయమని, అలా చేస్తే యాభైవేల రూపాయలు ఇస్తామని ఆశ చూపింది. కాని ఆ ప్రలోభానికి లొంగని దామరాజు 'గాంధీ లేనిది సాగదు నా కలమ్ము' అంటూ తన పని తాను చేసుకుపోయారు. ఇలా నిస్వార్థంగా భరతమాత దాస్య విముక్తికోసం ఆయన కృషి చేశారు. ఆయన రాసిన నాటకాలన్ని పండిత పామర జనులందరిని ఆకట్టుకొనేవి. వీరి నట బృందం అంతా ఒక ప్రత్యేకమైన కారులో ప్రయాణిస్తూ ఆంధ్రదేశమంతా ప్రదర్శనలిచ్చేవారు. 1920 నుంచి 1947 వ సంవత్సరం వరకూ పలు ఉద్యమాలను, స్వాతంత్ర్య ప్రాప్తిని తన రచనలలో చొప్పించి ఎన్నో ప్రబోధాత్మక రచనలు చేశారు. తగిన పాండిత్యము, ఉత్సాహం, దేశభక్తి, ధైర్య సాహసాలు గల నాటక వేత్త నేడు బయలుదేరి, ముందు రాబోవు వారికి మార్గదర్శకుడయ్యాడని ప్రశంసలు పొందాడు.

స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో నాటకాలు రచించి ప్రదర్శించిన ముఖ్యులలో మరొకరు శ్రీ పాద కృష్ణమూర్తి శాస్త్రి గారు. ఈయన 1921 లో 'తిలక్ మహారాజు' నాటకం రచించి ప్రదర్శించారు. ఇందులో నటి 'సుజలాం సుఫలాం' అంటూ వందేమాతర గేయం పాడుతూ ప్రవేశిస్తుంది. ఈయన 1924 లో 'గాంధీ విజయ ధ్వజము' అనే నాటకాన్ని రచించారు. ఇందులో నాగపూర్ కాంగ్రెసు వరకు నడచిన రాజకీయ చరిత్రను పొందుపరచారు. ఇంకా 'స్వరాజ్యోదయము' అనే నాటకాన్ని కూడా రాశారు. 1921 లో డి. సీతారామయ్య గారి 'స్వరాజ్య ధ్వజము', జంధ్యాల అయ్యావారి శాస్త్రి గారి ఆలీ ప్రభువుల నిర్బంధము, బుద్ధవరపు పట్టాభిరామయ్య గారి 'మాతృదాస్య విమోచనము', శ్రీ శ్రీనివాస చక్రవర్తి గారి 'దేశబంధు', మద్దూరి అన్నపూర్ణయ్య గారి 'చిచ్చుల

పిడుగు' పేర్కొన దగిన నాటకాలు. చిచ్చుల పిడుగు 1857 నాటి విప్లవ వీరుడు మంగళ పాండ్యే కథ. యలవర్తి శ్రీనివాసరావు గారి 'పీష్వా నారాయణరావు వధ', ముద్దరాజు సుబ్బారావు గారి చంద్రగుప్త, కోటమర్తి చిన రఘుపతి గారి 'చితోడు పతనం' మొదలైన నాటకాలు వెలువడినాయి. ఇవేకాక ఇంకా గుండి మెడ సుబ్బారావు గారి 'మేవాడపతనం' 'ఖిల్జీరాజ్యపతనం', పురిపండా అప్పలస్వామి గారి 'ఉత్కల పతనం", శ్రీపాద కామేశ్వరరావు గారి 'కాలా పహాడ్', మంచిరాజు దుర్గా శంకరామాత్య గారి 'శంభాజి నిర్యాణం' మొదలైన అనువాద నాటకాలు రచించబడి ప్రదర్శించబడి సమస్త భారతీయుల సమైక్యానికి, స్వాతంత్ర్య సముపార్జనకు ఉపకరించాయి. స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని నింపి చైతన్య వంతులను చేశాయి.

ఈ విధంగా తెలుగు సాహిత్య ప్రపంచంలో తెలుగు నాటకాలు వెలసి జాతీయోద్యమం, జాతీయ భావజాలం, గాంధీజీ రాజకీయ రంగ ప్రవేశం, గాంధీజీ నిర్మాణ కార్యక్రమాలు జాతీయోద్యమ అనుబంధాలైన అనేక అంశాలను ప్రజలలో హత్తుకునేలా చేసి దేశభక్తిని తెలియజేసి, స్వాతంత్ర్య సముపార్జనకు తోడ్పడ్డాయనడం సముచితం.

**ఉపయుక్త గ్రంధాలు**

1. తెలుగు సాహిత్య చరిత్ర – డా. ద్వా. నా. శాస్త్రి
2. తెలుగు సాహిత్య సమీక్ష – డా. జి. నాగయ్య
3. దృశ్యం – గుంటూరు కళా పరిషత్ ప్రత్యేక సంచిక
4. నాట్యకళ – ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ దశాబ్ద ప్రగతి
5. రూపిక – నాటక రంగ విశేష సంచిక
6. సాహిత్యామృతం – ఆచార్య ఎస్. గంగప్ప

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 13 హైదరాబాద్ డిసెంబరు - 2022

# విశ్వనాథ నవలలు - జాతీయోద్యమ స్ఫూర్తి

**ఆతుకూరి వేంకటేశ్వర్లు (యోగి),** సహ ఆచార్యులు, తెలుగు విభాగం,
ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖ, చరవాణి : 8074992611

## 1. ఉపోద్ఘాతం :

సాహిత్యం సమాజం నుండి పుడుతుంది. సాహిత్యం సమాజాన్ని ప్రభావితం చేస్తుంది. సాహిత్యం సమాజానికి దర్పణం వంటిది. ఒక జాతి చరిత్రను నిర్మించటంలో కవుల పాత్ర కీలకమైనది. వ్యాస, వాల్మీకులు భారత రామాయణాలను రచించి, భరతజాతిని ధార్మికంగా జాగృతం చేశారు. ప్రపంచంలోని అనేక దేశాలలో సామాజికంగా సమూలమైన మార్పులు రావటానికి రచయితలు పోషించిన పాత్ర గణనీయమైంది.

మన భారతదేశంలోను పరాయిపాలనను వ్యతిరేకిస్తూ, జాతిని జాగృతం చేస్తూ ఉద్యమం వచ్చింది. అదే జాతీయోద్యమం. దేశ నాయకులు చేసిన ప్రసంగాలు ప్రజలను ఉత్తేజ పరిచాయి. బ్రిటీషు వారి దాస్యశృంఖలాలను ఛేదించుకోవాలనే ప్రయత్నం పట్టుదల ప్రజలలో పెరిగింది. క్రమంగా జాతీయతా భావం ప్రజ్వలించింది.

జాతీయోద్యమంతోపాటు, సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమం కూడా బలపడింది. వేల సంవత్సరాల చరిత్ర, సంస్కృతి కలిగిన భారతీయులు తమ ఘనచరిత్రను తలచుకొని గర్వించే స్థితికి వచ్చారు. ఆంగ్లేయుల భాషా సంస్కృతుల కంటే భారతీయుల భాషా సంస్కృతులు ఉన్నతమైనవనే అభిప్రాయం ప్రజలలో బలపడింది. జాతీయోద్యమానికి వెన్నెముకగా నిలిచింది సాంస్కృతిక పునరుజ్జీవ ఉద్యమం. ఈ ఉద్యమాల స్ఫూర్తితో ఎంతోమంది రచయితలు భారతదేశంలోని ప్రధాన భాషలలో రచనలు చేశారు. మన తెలుగు భాషలో జాతీయోద్యమ స్ఫూర్తితో రచనలు చేసిన ప్రముఖులలో విశ్వనాథ సత్యనారాయణ ఒకరు.

## 2. విశ్వనాథ దృక్పథం :

జాతీయోద్యమ స్ఫూర్తితో విశ్వనాథ రచనలు చేశారనటం కంటే, విశ్వనాథ తన రచనల ద్వారా జాతీయోద్యమానికి బలాన్ని చేకూర్చారనటం సమంజసం. పాశ్చాత్య నాగరకతా వ్యామోహంలో పడి కొట్టుకుపోతున్న ప్రజల్ని ధైర్యంగా నిలువరించి, ఆలోచింపచేశారు. ఆంగ్లభాషా సంస్కృతుల మోజుల మనవారు సనాతన సంప్రదాయాల్ని విస్మరించటం జరిగింది. వేద, పురాణ, ఇతిహాల సారం తెలియని ఒక అంధకార దశ ఆవరించింది. అప్రాచ్యధోరణులు పెరిగిపోయాయి. పూర్వాచారాలను వెక్కిరించేవారు, తృణీకరించేవారు పెరిగిపోయారు. జాతి ఇలాగే పరాయి అనుకరణం చేస్తే, జాతి జీవాన్ని కోల్పతుందని భయపడి, బాధపడినారు విశ్వనాథ. అందుకే 'గతకాలము మేలు వచ్చుకాలము కంటెన్' అనేశారు.

పాశ్చాత్య సంస్కృతీ నాగరికతల ప్రభావంతో మన జాతి జీవన విధానంలో అనేక అవాంఛనీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. వాటిలో మానవ సంబంధాలు, ఆచారాలు, ఆరాధనలు, కళలు, నమ్మకాల వంటి ప్రధానమైన అంశాలపై చూపిన ప్రభావం పరిశీలింపదగినది.

**2.1. మానవ సంబంధాలు:**

మన గ్రామాలలో కులాలనేవి వృత్తులను ఆధారంగా చేసుకొని ఏర్పడ్డాయి. ఎవరి కులవృత్తిని వారు గౌరవంగా నిర్వహించుకునే వారు. కులాల మధ్య మానవ సంబంధాలు కూడా గౌరవంగా బంధుత్వం లాగా ఉండేవి. ఒక కులంవారు మరొక కులం వారిని అన్నావదినా, పిన్ని బాబాయి అంటూ పిలుచుకునేవారు. ఆంగ్లేయులు ఇంత సామరస్యంగా ఉన్న గ్రామీణ వాతావరణాన్ని కలుషితం చేశారు. మన ప్రజలకు కులవృత్తులపట్ల గౌరవం పోయేటట్లు చేశారు. కులవృత్తులను దెబ్బకొట్టి గ్రామీణ సంపదను, ఉత్పత్తిని పతనం చేశారు. క్రమంగా కులాల మధ్య మానవ సంబంధాలను దెబ్బతీసి, కులవిద్వేషాలను పెంచారు.

పాశ్చాత్య నాగరికత ప్రభావంతో స్త్రీ – పురుష సంబంధాలు కూడా మారిపోయాయి. శ్రీరాముని ఏకపత్నీ వ్రతం, పతిని ప్రత్యక్ష దైవంగా చూడటం వంటి ఆదర్శాలు క్షీణించాయి. స్వేచ్ఛా లైంగిక సంబంధాలు పెరిగాయి. స్త్రీ–పురుషుల మధ్య శ్రమైక సంబంధంపోయి, లైంగికాకర్షణ సంబంధాలు పెరిగాయి. జమిందారులు తమ ధర్మపత్నిని నిర్లక్ష్యం చేసి, విదేశీ వనితలను ఉంచుకొని ధర్మభ్రష్టులు కావటం జరిగింది.

గ్రామాలలో ఉండే గణాచారి, దేవదాసి వంటి సంప్రదాయ స్త్రీలను చూసే దృష్టిలోనూ మార్పువచ్చింది. ఊరికి ఉపకారం చేసే పురోహితులను ధిక్కరించే సంస్కృతి వ్యాపించింది. వెరసి విలువలతో కూడిన మానవ సంబంధాలు క్షీణించాయి.

**2.2. ఆచారాలు – ఆరాధనలు :**

పాశ్యాత్యుల ప్రభావంతో మన ఆచారాల పట్ల విశ్వాసం ప్రజల్లో సన్నగల్లింది. ఆచారాలు అశాస్త్రీయమైనవిగా కనిపించాయి. ఇంటి ముందు ముగ్గు వేయటం, కాలికి పసుపు రాసుకోవటం, నొసటిన తిలకం దిద్దుకోవటం, చేతికి గాజులు ధరించటం వంటి సంప్రదాయ ధోరణుల్లోను విముఖత్వం వచ్చింది.

గ్రామాలలో దేవాలయాలు ఆచార వ్యవహారాలకు, ఆరాధనకు, కళల పోషణకు పట్టుగొమ్మలు. విదేశీ సంస్కృతి ప్రభావంతో మన దేవాలయాలను ఆదరించే ప్రభువులు కరువయ్యారు. ధర్మార్థకామ మోక్షాలనబడే చతుర్విధ ఫలపురుషార్థాలను సాధించటమే మానవ జీవిత ధ్యేయమనే ఆలోచన ప్రజల్లో అడుగంటింది. గ్రామపెద్దలు ఇంగ్లీషు దొరలకు సలాము చేసే గులాములుగా మారిపోయారు. దేవాలయాలను పట్టించుకునే నాథుడు లేకపోయాడు.

**2.3. కళలు – నమ్మకాలు :**

పాశ్చాత్య ప్రభంజనంతో భారతీయ సంప్రదాయ కళలు గజ గజా వణికిపోయాయి. ఆదరించే ప్రభువులు, ప్రజలు లేక బక్కచిక్కిపోయాయి. కళలు మోక్ష సోపానాలనే భారతీయుల నమ్మకాన్ని పాశ్చాత్యులు వమ్ము చేశారు.

సంప్రదాయ కళలను ఆదరించేవారు లేక కళాకారుల జీవితాలు కళావిహీనమయ్యాయి. నాట్యం, సంగీతం, శిల్పం వంటి కళలు దేవాలయాలను ఆశ్రయించి మనగలిగేవి. అసలు దేవాలయాలకే మనుగడ కరువయ్యింది. ధూపదీపనైవేద్యాలు తప్ప, స్వామికి జరుగవలసిన కైంకర్యాలు సన్నగిల్లాయి.

ప్రజలు పాశ్చాత్యుల కళలను ఆస్వాదించటం, వారి మతవిశ్వాసాలను స్వీకరించటం జరిగింది. ఇలా చేస్తే ఏలినవారి మన్ననలను, వారి వద్ద ఉద్యోగావకాశాలను పొందవచ్చునని భావించారు. దైవకార్యం కూడా లౌకిక ప్రయోజనాలను ఆశించి చేశారు. కళోపాసన, దైవారాధన అనేవి మోక్షకారకాలనే అభిప్రాయం పోయి, భౌతిక సుఖాన్వేషణ పరమార్థంగా మారింది.

**2.4. విశ్వనాథ అవేదన :**

తన కళ్ళ ఎదుటే మన సనాతన సంప్రదాయానికి జరుగుతున్న నష్టాన్ని చూసి విశ్వనాథ చలించిపోయారు. వారి

గ్రామంలో నెలకు రెండైనా కూచిపూడివారి వీధి నాటకాలు జరిగేవని, తనకు ఐదు సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు, వారి నాన్నగారు పురాణం చెబుతూ ఉంటే వినేవాడినని విశ్వనాథ అన్నారు. ఇలాంటి ధార్మిక కార్యాలు తను చూస్తూ ఉండగానే నిరాదరణకు గురికావటం, ఆయన అంతరంగాన్ని కలిచివేసింది.

తన జీవుని వేదనను తన రచనలలో చొప్పించి విశ్వనాథ కొంత ఊరట చెందారనిపిస్తుంది. పాశ్చాత్యుల వల్ల ఎక్కడెక్కడ నష్టం కలిగిందో పరిశీలించి, నష్టపోయిన వాటన్నిటిని తన నవలల్లో ప్రవేశపెట్టి, వాటికి గుర్తింపును, వైభవాన్ని తెచ్చే ప్రయత్నం చేశారు విశ్వనాథ.

**3. విశ్వనాథ నవలలు : జాతీయోద్యమ స్ఫూర్తి**

విశ్వనాథ 58 నవలలు రాశారు. అన్నిటిలోను ఆయన దృక్పథం స్పష్టంగా కనిపిస్తుంది. సనాతన భారతీయ సంప్రదాయ వైభవం గొప్పదని, మానవ జాతికి మేలు చేస్తుందని వారు భావించారు. ఆ విషయాన్ని వారి నవలల్లో ధ్వనింపచేశారు.

విశ్వనాథ నవలల్లో 'వేయిపగడలు' విశిష్టమైన నవల. ఇది సహస్ర ముఖాలుగా వికసించి ఉన్న సనాతన సంస్కృతిని వర్ణించింది. పాఠకునికి కళ్ళ ఎదుట కనిపించేటట్లు చేసింది. కాలప్రభావానికి లోనై, జాతి ఎలా నష్టపోతుందో వివరించింది ఈ నవల. మన గ్రామసీమల్లో చక్కటి మానవ సంబంధాలుండేవి. అన్ని కులాల వాళ్ళు కలిసిమెలిసి పనిచేసే వాళ్ళు. ఎవరి వృత్తి వారికి గొప్ప. తక్కువ ఎక్కువ భేదం లేదు. అంటే, వర్ణాలున్నాయిగాని, వర్ణవ్యత్యాసం లేదు. రామేశ్వర శాస్త్రి నాలుగు వర్ణాలలోని స్త్రీలను వివాహం చేసుకున్నాడని 'వేయిపడగలు'లో చెప్పటం ద్వారా, నాటి సమాజంలో వర్ణాలు ఉన్నా వర్ణ సమానత్వం ఉందని చాటటమే ఉద్దేశం.

అంటరాని తనం, బాల్య వివాహాల వంటి దురాచారాలు మన సమాజంలో లేకపోలేదు. ప్రపంచంలోని ఏ జాతిలోనైనా కొన్ని దురాచారాలుంటాయి. అలాగే మనకూ ఉన్నాయి. వాటిని ఎవరూ సమర్థించరు కాని, వాటిని సంస్కరంచే నెపంతో, సంస్కృతిని సమూలంగా నాశనం చేస్తే జాతి నష్టపోతుంది. అందుకని సంస్కృతిని కాపాడుకోవాలి. జాతిని బ్రతికించుకోవాలి. ఈ ఉద్దేశంతో విశ్వనాథ వేయిపడగలలో 'ధర్మారావు' పాత్రను సృష్టించారు.

ధర్మారావు తెగిపోతున్న మానవ సంబంధాలను తెగకుండా చూశాడు. దేవదాసి 'గిరిక'ను చెల్లి అని పిలిచాడు. ఆమెలో భక్తి భావాన్ని పెంచి మోక్షగామిని చేశాడు. జమిందారు కృష్ణమనాయునికి యోగ రహస్యాలను బోధించి కపాల మోక్షం పొందేటట్లుగా చేశాడు. కృష్ణమనాయుడు తన తండ్రి రంగారావు లాగా పాశ్చాత్య పోకడలు పోకుండా, గ్రామంలో వేణుగోపాల స్వామి ఉత్సవాలను జరిపించి సంప్రదాయ సంరక్షణలో తన పాత్ర నిర్వహించారు.

గ్రామంలోని గణాచారి భవిష్యవాణిని వినిపించేది. నిరంతర భగవద్ధ్యానంలో ఉండేది, స్వార్థం సంకుచితత్వం లేని మనసుకు విశ్వలయ ప్రేరణగా నిలుస్తుంది. ప్రజలు పాపకర్మలు ఆచరించకుండా హెచ్చరిక చేస్తూ భవిష్యవాణిని వినిపిస్తుంది గణాచారి. దానిని నమ్మినవారకు భగవంతుని ఆదేశంగా భావించేవారు.

ఇలా విశ్వనాథ వారు భారతీయ ఆత్మను తమ రచనలలో నింపారు. జాతీయోద్యమం స్ఫూర్తిగా వచ్చిన రచనలలో లక్ష్యాన్ని సాధించే దిశగా విశ్వనాథ రచనలు సాగాయనటంలో అతిశయోక్తి లేదు.

**4. ముగింపు :**

జాతీయోద్యమం దేశానికి కొండంత మేలు చేసింది. జాతిని సమైక్యపరిచింది. తమ మూలలను వెతికి, వాటిలోని ఔన్నత్యాన్ని గ్రహించే ప్రయత్నాన్ని ప్రజలు చేశారు. ఈ నేపథ్యంలో అపారసాహిత్య సృష్టి జరిగింది. విశ్వనాథ నవలలు ఈ ఉ ద్యమానికి మార్గదర్శకంగా నిలిచాయి.

**ఆధార గ్రంథములు :**

1. డా॥ పి.వి.సుబ్బారావు - జాతీయోద్యమాన్ని ప్రదీప్తం చేసిన తెలుగు కవులు - జాగృతి వార పత్రిక - మే, 2022
2. మంగు శివరామప్రసాద్ - విశ్వనాథ నవలా కథా సమాలోచనం - ఆంధ్రభూమి పత్రిక - సెప్టెంబర్-2019
3. శ్రీరమణ - ఒక్కడు విశ్వనాథ - సాక్షి దినపత్రిక - సెప్టెంబరు, 2014
4. సత్యనారాయణ, విశ్వనాథ - వేయి పడగలు - శ్రీ విశ్వనాథ పబ్లికేషన్స్, విజయవాడ - 2013

# ఉన్నవ వారి మాలపల్లి నవల - జాతీయోద్యమ దృక్కోణం

**జి. రమేష్ బాబు,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి
**డా. కె. పుష్పమ్మ,** తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అ), రాజమండ్రి
చరవాణి : 9160207246

పరాయి పాలకుల కబంధ హస్తాల నుండి దేశ మాతను బంధ విముక్తం చేసి ఆమెలో స్వేచ్ఛ, స్వాతంత్ర కుసుమాలు గుచ్చటానికి ఎందరో దేశభక్తులు ఆయుధాలను ధరించి పోరాటం చేశారు. స్వాతంత్ర్యం కోసం అయితే రచయితలు, కవులు తమ అక్షరాలనే ఆయుధాలుగా మలచి రచనలు చేసి ప్రజలలో దేశభక్తనీ, జాతీయోద్యమ దృక్పథంను పెంపొందించారు, వార్తాపత్రికలు, కరపత్రాలు, దేశభక్తి గేయాలు, దేశభక్తిని ప్రభోదించే నవలలు ముఖ్యమైనవి. ప్రసార మాధ్యమాలు ఇంతగా నాడు అందుబాటులోకి రాని సమయంలో నవలలు సామాన్య ప్రజానీకానికి అందుబాటులో వుండేవి (పశ్చిమ – బెంగాల్) రాష్ట్రంలో జాతీయోద్యయం, స్వాతంత్ర్యకాంక్ష మొదటిసారిగా తీవ్రరూపం దాల్చిన సమయంలో, బకించంద్ర ఛటర్జీ వ్రాసిన "ఆనంద మఠం నవల – అందులోని వందేమాతర గీతం" చాలా మందిలో దేశభక్తిని రగులు కొల్పినాయి. ఆ నవల ప్రభావంతో మన తెలుగులోను నవలలు వచ్చాయి.

ప్రస్తుత నవల "మాలపల్లి" ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, 'గుంటూరు గాంధీ'గా పేరుపొందిన ఉన్నవవారు వ్రాశారు. రాజకీయ నేపథ్యం, జాతీయోద్యమ స్ఫూర్తితో వ్రాసిన మొదటి నవల. 1920–21 సహాయ నిరాకరణోద్యమంను గాంధీ నడిపిస్తున్న సందర్భంలో – ఆనాటి సమాజంలోని పరిస్థితుల ఎలా ఉన్నాయి అని మనకు ఇందులో వివరించాడు. ప్రజలందరూ సంఘటితం అయ్యి గాంధేయ పథంలోనడిస్తే స్వాతంత్ర్యం సిద్ధిస్తుంది. అని "సంఘదాసు" పాత్ర ద్వారా మనకు ప్రభోదం చేయిస్తారు.

అందుకే ఈ నవలకు – సంఘవిజయం అనే మరో పేరువుంది. ఆచార్య ఎన్.జి. రంగా – ఈ నవలను టాల్‌స్టాయ్ వ్రాసిన (War and Peace తో) పోల్చినాడు. వలస పాలనకు వ్యతిరేకంగా దేశ ప్రజలలో బలీయంగా వున్న స్వాతంత్ర్యకాంక్ష – దాని కోసం కొనసాగుతున్న జాతీయోద్యమాల పరంపర – హరిజనోద్ధరణ పేరుతో జాతీయోద్యయంలోనికి దళితులను ఆకర్షించటానికి కాంగ్రెస్ పార్టీ చేసే ప్రయత్నాలు ఇందులో కనబడతాయి. "ఇందులో వున్న సంఘ సంస్కరణ దృక్పదం, జాతీయోద్యమ దృక్పథం – ఈ నవలను తెలుగులో వచ్చిన తొలి విప్లవ నవలగా నిలబెట్టింది. కొ.కు. మాటల్లో చెప్పాలంటే పరాయి పాలనలో మనదేశం ఎంత కుళ్ళిపోయిందో – ఈ నవలను చదివితే తెలుస్తుంది. అంటాడు జాతీయోద్యమ ప్రభావంతో – వ్యవహరిక భాషలో వచ్చిన తొలినవల ఇది.

1917 రష్యాలో వచ్చిన బోల్షివిక్ విప్లవ స్ఫూర్తి కూడా ఈ నవలలో వుంటుంది. గాంధేయవాదం – మార్క్సియ మార్గం ఒకేసారి చూపించాడు. కంసుని చెరసాలలో కృష్ణుడు పుట్టినట్టు రాయవేలూరు జైలులో ఈ నవల పుట్టింది. పుట్టిన ఏడాదికే వలస పాలకులను భయపెట్టి నిషేధానికి గురైంది. ప్రభుత్వం నిషేధించిన మొదటి నవల ఇది. 03-07-1936లో నిషేధించారు – 31-07-1937 నిషధం ఎత్తివేశారు. 1921–22 కోస్తా ప్రాంతం అయిన పొన్నూరు వద్ద మంగళాపురం అనే – మాలపల్లిలో జరిగిన వృత్తాంతం ఇందులో ప్రముఖంగా ఉంది.

**"రామదాసు, సంగదాసు, తక్కెళ్ళ జగ్గడు"**

పాత్రలు, చౌదరయ్య అనే ఉన్నత వర్గానికి చెందిన వ్యక్తి పాత్ర కూడ వుంటుంది ఇందులో చౌదరయ్య దోపిడి వర్గానికి ప్రతినిధి అతని కుమారుడు – రామానాయుడు శ్రామిక వర్గానికి ప్రతినిధి. గాంధేయవాదిగా సంగదాసు ఇందులో మనకు కనబడతాడు. అట్టడుగు వర్గాల వాళ్ళు అందరు కలసి పోరాటం చేస్తే దేశంకు స్వాతంత్రం వస్తుంది. స్వాతంత్రనంతరం – చౌదరయ్యలాంటివారి పెత్తందారి అరాచకాలు అంతం అవుతాయి అని ప్రభోదం చేస్తాడు. పల్లెలోని ప్రజలకు – కాని చౌదరయ్యవలన హత్యకు గురిఅవుతాడు. రామదాసు పెద్ద కొడుకు అదృశ్యమై (వెంకటదాసు) తక్కెళ్ళ జగ్గడు పేరుతో సొంత సైన్యాన్ని నిర్మించుకొని, వలసవాదం, పెట్టుబడి వాదంకు వ్యతిరేకంగా పోరాటం చేస్తాడు. "ఇతని పాటలలోని విప్లవాత్మక గీతాలు – దేశభక్తి ప్రబోధకాలు.

ఇవి ప్రజలలో స్వాతంత్ర్య ఆకాంక్షను రగిలిస్తాయి. చాలా మంది యవకులు జగ్గడిని అనుసరిస్తు నాటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పని చేస్తారు. ప్రజలను బానిసత్వం నుండి బయటపడి స్వేచ్ఛగా జీవించాలని అందుకోసం పిడికిలి బిగించి పరాయి పాలకుల మీద తిరుగుబాటు బావుట ఎగర వెయ్యాలి అని సందేశాలు ఇస్తూ వుంటాడు. జగ్గడు అతని సభ్యులు దీనితో బ్రిటీష ప్రభుత్వం అతనివలన తమ పరిపాలనకు, తమ సార్వభౌమాధికారమునకు ముప్పు ఏర్పడుతుందని భావించి అతనిని రాజద్రోహిగా, బందిపోటు ముఠా నాయకునిగా ముద్రవేసి అతనిని తుద ముట్టడించడానికి ప్రసిద్ధి సి.ఐ.డి అధికారి రాంసింగ్‌ను రప్పిస్తారు. రాంసింగ్ కర్నూలు ఎస్.పి. సహాయంతో – ఎత్తులకు పై ఎత్తులువేసి, పదివేల సైన్యంను తీసుకుని దానిని నాలుగు భాగాలుగా చేసి జగ్గడిని అతని అనుచరులను ఎట్టకేలకు పట్టుకుంటారు. అడవిలో నుండి కర్నూలు జైలుకు తెచ్చి పడేస్తారు. పోలీసులు కర్నూలు జిల్లా కలెక్టర్ అతనికి వైద్య పరీక్షలు నిర్వహించి న్యాయస్థానంకు తీసుకువెళ్ళమనీ చెప్పాడు. మంగళాపురం వాసి అయిన వెంకటదాసు జగ్గడు అని అందరికీ తెలిసిపోయింది. అందరూ ఆశ్చర్యపోయారు. దేశభక్తి ఒక సామాన్యుని అసామాన్యునిగా మార్చి వేసింది అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తారు. ప్రజలందరూ గుంటూరు కోర్టులో న్యాయమూర్తి ముందు అతడు చేసిన సుదీర్ఘ ఉపన్యాసంకు న్యాయమూర్తి ఆశ్చర్య పోతాడు – అతని దేశభక్తినీ మెచ్చుకుంటాడు.

నువ్వు ధర్మబద్ధుడవైన చోరుడవు అంటాడు. నీదేశ భక్తి, త్యాగము భావి తరాలు వారికీ ఆదర్శనీయం అంటాడు. కానీ ప్రస్తుత చట్టాలు నిన్ను నేరస్తునిగా గుర్తించాయి శిక్ష అనుభవించక తప్పదు అని సరళ భావంతో ఐదు సంవత్సరాలు సాధారణ జైలు శిక్ష విధించాడు. తన తల్లి తండ్రులను చూసుకోవటానికి వీలుగా నిడదవోలు జైలులో శిక్ష అనుభవించేలా ఏర్పాటు చేశాడు. జైలులో తనను చూడటానికి వచ్చిన తల్లితండ్రులను చూసి అమితానందం పొందుతాడు.

ఆ మరుసటి రోజే అతని తల్లి మరణిస్తుంది. జగ్గడు కూడ గాయాల బాధ ఎక్కువ అయ్యి మగత కమ్మి మృత్యువు హస్తాలలోకి వెళ్ళిపోతాడు. తన జీవితంను దేశమాత సేవకే అంకితం చేసిన ధన్యజీవిగా మిగిలిపోతాడు. మరొక దేశభక్తుడు అయిన రామదాసు కూడ జగ్గని మరణానికి చాలా బాధపడుతాడు. వాళ్ళ పోరాటాల ఫలితంగా పార్లమెంటులో హిందూస్తాన స్వరాజ్య చట్టం వచ్చి దేశభక్తులు అందరూ జైళ్ళలో నుండి విడుదల అవుతారు. తన స్వగ్రామం అయిన మంగాళాపురంలో ఒక పాఠశాల ఏర్పాటుచేసి ప్రజల బలవంతం మీద ప్రధానోపాధ్యాయుడు అవుతాడు కొద్ది కాలం తరువాత సిద్ధుడై కొండ గుహలలో తపస్సుకు వెళ్ళి పరబ్రహ్మలో ఐక్యం అవుతాడు రామదాసు. దేశభక్తులు అయిన ఇరువురిని ప్రజలు దేవునిలా కోలుస్తారు. జగ్గడు ప్రభుత్వం దృష్టిలో బందిపోటు దొంగ అదే ప్రజల దృష్టిలో బీదల పాలిట దేవుడు ప్రభుత్వ సంపదను దోచి పేదలకు పంచి వాళ్ళ ఆకలిని తీర్చుతాడు. అందుకే అతడు మరణించినా ప్రజల మనస్సులలో ఎప్పుడు జీవించే వుంటాడు. వాళ్ళ మనస్సులలో దేశభక్తినీ, రగిలిస్తూనే వుంటాడు జగ్గడు.

తక్కెళ్ళ జగ్గని రూపంలో వున్న వెంకటదాసు పాత్ర అమోఘం అయినది ఆ పాత్రయే ఈ నవల దేశభక్తి, జాతయోధ్యమ స్ఫూర్తి కలిగిన నవలగా చరిత్రలో చిరకాలం వుండేలా నిలుస్తుంది. పరుల సేవలో పాలిపోయిన ప్రజల రక్తానికి దేశభక్తిని రగులుకొల్పి ఉద్రేకపరిచాడు మీరు పోరాటం చెయ్యకపోతే స్వాతంత్ర్యం రావడానికి యుగాలు పట్టవచ్చు అని జనానికి మేలు కొలుపు గీతాలు పాడతాడు. మార్క్సిజంకు మూల పురుషుడు అయిన కారల్‌మార్క్సు ప్రపంచ కార్మికులారా ఏకం కండి అని ఇచ్చిన పిలుపునకు

ప్రతీకగా పనివాళ్ళందరు ఏకమయ్యేంతగా – ప్రపంచమే మీదిరా అనే నినాదం ఇస్తాడు. ఇతడు పోలీసులకు పట్టుబడిన తరువాత జైలులో న్యాయమూర్తిముందు ఇచ్చిన వాఙ్మూలం మాక్సింగోర్కి అమ్మ నవలలో సావెల్ వాఙ్మూలంను తలపిస్తుంది.

1920 నాటికి ఆంధ్రాలో రాని కార్మికోద్యమంను, రైతుకూలీ ఉద్యమంను 27 సం॥రాలు తరువాత వచ్చిన స్వాతంత్ర్యం గురించి ముందుగానే ఊహించి ఈ నవలలో ఉన్నవ వారు వ్రాశారు. ఇది ఆయన భావి కాలజ్ఞతకు సూచికగా అందరూ భావించాలి. ఆయనకు వున్న ముందు చూపు, సామాజిక, రాజకీయ దృక్పథం గాంధేయవాద సిద్ధాంతంలో మూల సూత్రాలు ఈ నవలలో మనకు కనిపిస్తాయి. ఇంత ఉన్నతమైన నవలగా దీనిని మార్చినాయి. తొలి సామాజిక, రాజకీయ నవలగా ఇది చరిత్రలో నిలిచింది.

**ఆధార గ్రంథాలు :**

1. మాలపల్లి – ఉన్నవ లక్ష్మీనారాయణ

2. జాతీయోద్యమం – ఉన్నవ లక్ష్మీనారాయణ

# సంఘ సంస్కరణోద్యమం - కథా సాహిత్యం

**వంకం భాస్కర్,** ఆంధ్రోపన్యాసకులు, ఎస్.సి.ఎన్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రొద్దుటూరు

సంస్కరరణోద్యమం సందర్భంలోనే 'కథానిక' అనే ప్రక్రియ వచ్చింది. స్త్రీవిద్య, బాల్య వివాహాలు, వితంతు వివాహాలు, కులతత్వం, వేశ్యాసమస్య మొదలైన ప్రధానాంశాలతో; కొంచెం, అటూ ఇటుగా భారతీయ భాషలన్నింటిలోనూ 'కథ' ప్రారంభమైంది. కేవలం సంఘసంస్కరణోద్యమంలోనే కాక, తర్వాత వచ్చిన అభ్యుదయోద్యమ కాలంలోనూ వికసించింది. నేటికీ వికసిస్తూనే ఉంది.

**(1) అస్సామీ:–** ఆధునిక కథ అస్సామీలో 'లక్ష్మీనాథ్ బరువా' శరశ్చంద్రగోస్వామి మొదలైనవారు సంస్కరణదృష్టితో కథారచన చేశారు. ఒక కథలో–భర్త ప్రవాసంలో ఎక్కువకాలం ఉండిపోగా, భార్య వివాహేతరసంబంధం పెట్టుకున్నప్పుడు, తిరిగి వచ్చిన భర్త ఆమె ప్రవర్తనను అర్థంచేసుకొని, క్షమించినట్లు కూడా" చిత్రించారు. తర్వాతి కాలంలో లక్ష్మీధర్ శర్మ అనే రచయిత స్త్రీస్థానాన్ని అభ్యుదయదృక్పథంతో ఆలోచించి, సంస్కరణభావాలను పంచాడు.

**(2) ఒరియా:–** ఒరియాలో 1898 లో కథానిక వచ్చింది. ఫకీర్‌మోహన్ సేనాపతి రచయిత. ప్రధానంగా ఈ రచయిత ఒరియాభాషపై బెంగాలీభాష పెత్తనాన్ని నిరసిస్తూ, ఒరియా స్వయంప్రతిపత్తిని కాపాడాడు. పత్రికలు కూడా సంస్కరణభావాలను బాగా ప్రచారం చేశాయి.

**(3) కన్నడం:–** కన్నడంలో కథ 1900 లో ప్రారంభమైంది. ఎం.ఎస్.కామత్, 'ముంగేశ్‌రావు'లు కథానికకు అంకురార్పణ చేశారు. సామాన్యుని జీవితం పట్ల నిరంతర శ్రద్ధ కలిగిన రచయితగా, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత 'మాస్తి వెంకటేశ్ అయ్యంగార్' కనిపిస్తాడు, ఈయన తన కథల్లో అట్టడగువర్గాల, కథలను, గ్రామీణజీవితంలోని అనేక విషయాలను స్పృశించారు.

**(4) గుజరాతీ:–** గుజరాతీలో తొలి కథకుడు 'దల్పతరామ్' చాలా కథలు రాశారు. తొలితరం కథారచయితల్లో ప్రధాన విశేషం–స్త్రీరచయిత్రులు చాలామంది ఉండడం. సుమతి, ఊర్మిళ, అరవింద, శారదాబెన్ మెహతా మొదలైన రచయిత్రులు స్త్రీజనోద్ధరణ కేంద్రంగా కథలు రాశారు.

**(5)తమిళం:–** తమిళంలో చిన్నకథను తీర్చిదిద్దిన ఘనత 'అయ్యర్' కే దక్కుతుంది. అయ్యర్ సమకాలికుడైన మాధవయ్య ఆనాటి సాంఘిక దురాచారాలను ఖండిస్తూ, మార్పును కోరుకుంటూ రచనలు చేశాడు. సుబ్రహ్మణ్యభారతి కూడ టాగోర్ కథలను పదకొండింటిని తమిళంలోకి అనువదించారు. స్త్రీ చైతన్యాన్ని తన కథల్లో ప్రతిపాదించిన మరో రచయిత టి.జె.రంగనాథన్. ఆయన రాసిన 'నొండిక్కిళీ' (కుంటి చిలుక) కథ ఆచారాలను ధిక్కరించిన ఒక బాలికను గూర్చి చెబుతుంది.

**(6) బెంగాలీ:–** 1877 లో ఠాగూర్ రాసిన 'క్షుధిత పాషాణ 'కథ' వారి కుటుంబపత్రికలో ప్రచురింపబడింది. అయితే ఆధునిక కథాలక్షణాలు కలిగిన 'కథ' బంకించంద్ సోదరుడు పూర్ణచంద్ ఛటర్జీ రాసిన 'మధుమతి'. కానీ అందరూ తొలికథారచయితగా ఠాగూర్‌నే గుర్తిస్తున్నారు. కథారచన బెంగాల్‌లోనే కాకుండా, భారతదేశమంతటా ఠాగూర్ తోనే ప్రారంభమైందని చెప్పవచ్చు. ఠాగూర్ తన కథల్లో మానవసంబంధాల్లోని అతిసున్నితమైన అంశాలను ఆవిష్కరించారు.

**(7) మరాఠీ:–** 1888 లో 'నిబంధ చంద్రిక' అనే పత్రికలో వచ్చిన కథనే తొలికథగా గుర్తించారు. ఆ తర్వాత ప్రముఖ నవలారచయిత 'హరినారాయణ ఆప్టే' స్వయంగా పత్రిక స్థాపించి, కథలు ప్రచురించాడు. అల్లే కాశీనాథ రఘునాథమిశ్రా గూర్జర్ మొదలైన వారిని కథారచయితలుగా గుర్తించవచ్చు. ఈ విధంగా సంస్కరణోద్యమంలో ఊపిరిపోసుకున్న భావాలు మరాఠీలో తరువాతి కాలంలో రచయిత్రుల చేతుల్లోనూ, దళితరచయితల చేతుల్లోనూ గాఢతను సంతరించుకున్నాయి.

**(8) మలయాళం:–** తొలిదశలో నీతి మొదలైన అంశాలే ప్రధానంగా ఉపదేశకథలు వచ్చాయి. నాయనార్, ఆదినారాయణ పోదువాళ్ మొదలగు వారు తొలి కథారచయితలు. నంబూద్రిపాద్ ప్రధాన కథారచయితగా, తొలితరం కథకుడిగా కన్పిస్తారు. ఈయన సమకాలీన' దురాచారాలను తీవ్రంగా విమర్శించాడు. ఇతను రాసిన 'ఆత్మాహుతి' కథలో – అప్పట్లో నంబూద్రి జాతిలో విషంలా కమ్ముకున్న వరకట్నం దురాచారంపై దుమ్మెత్తిపోశాడు. ఆ తర్వాతి కాలంలో లలితాంబిక మొదలైన రచయిత్రులు కథాప్రక్రియను, సమర్థవంతంగా, నాటి దురాచారాల ఖండనకు ఉపయోగించుకున్నారు.

**(9) రాజస్థానీ:–** రాజస్థానీభాషలో 20వ శతాబ్దిలో కథరచన ప్రారంభమైంది. శివచంద్ర రాసిన 'విశ్రాంత్‌పథిక్' రాజస్థానీలో తొలికథ. తర్వాతికాలంలో ఛోటారామ్ శర్మ, శివనారాయణ మొదలైన రచయితలు ఆదర్శబోధకమైన కథలు రాశారు. అయితే ఎక్కువ మోతాదులో అభ్యుదయకర అంశాలు, సంస్కరణభావాలు స్వాతంత్ర్యానంతర కథల్లో ఎక్కువగా కనిపిస్తాయి. ప్రేంచంద్ భావాలతో 'వ్యాస్' అనే రచయిత రాజస్థానీకథకు కొత్త వస్తు రూపాలను అందించాడు.

**(10) పంజాబీ:–** పంజాబీ కథకూడా 20వ శతాబ్దిలోనే వచ్చింది. పత్రికలు కూడ కథాసాహిత్య ప్రచారానికి బాగా కృషిచేశాయి. పంజాబీలో భాయ్‌వీర్‌సింగ్ మోహన్‌సింగ్, చరణ్‌సింగ్ మొదలగు వారు తొలితరం ఉత్తమ కథకులు. వీరి కథల్లో సమకాలీన జీవితంపై అధిక్షేపం, హాస్యం కనిపిస్తాయి.

**(11) తెలుగు:–** తొలితెలుగు కథ ఏదనే విషయంపై ఈ మధ్య కొత్త కొత్త అభిప్రాయాలు వెలుగుచూస్తున్నాయి. మొదట్లో 1910 లో గురజాడ అప్పారావు రాసిన 'దిద్దుబాటు' కథ, ఆధునిక కథాలక్షణాలు కలిగిన కథగా అంతా అంగీకరించారు. మధ్యలో స్త్రీవాద రచయిత్రులు, విమర్శకులు 'నూరేళ్ళపంట' అనే కథాసంకలనం ప్రకటిస్తూ, బండారు అచ్చమాంబ రాసిన 'స్త్రీవిద్య' (1904) కథను తొలికథగా పేర్కొన్నారు.

ఏదిఏమైనా, 20వ శతాబ్ది తొలి దశకంలో వచ్చిన తెలుగుకథ వస్తురూపేణా సంస్కరణోద్యమానికి చేరువగా రాయబడింది. విద్యావంతురాలైన స్త్రీ అవసరం నాటి సమాజానికి ఎంత ఉందో 'తెలుగు కథ' చూపించింది. అలా 'దిద్దుబాటు' లో స్త్రీ విద్య, 'సంస్కర్తహృదయం'లో వేశ్యాసమస్య, 'మీరేమిటి? కథలో మతవిద్వేషాలు చర్చించబడినాయి. జాగ్రత్తగా గమనిస్తే–గురజాడ తన సమకాలికులందరిలోను, సమాజాన్ని ఎంత నిశితంగా పరిశీలించి ఆ కథలు రాశాడో తెలుస్తుంది. తర్వాతి కాలంలో శ్రీపాదసుబ్రహ్మణ్యశాస్త్రి, వేలూరు శివరామశాస్త్రి మొదలైనవారు ఇదే సంస్కరణ దృక్పథంతో నవలలు, కథలు రాశారు.

తొలి తెలుగుకథ 'దిద్దుబాటు' అయినా, స్త్రీవిద్య అయినా, మరేదైనా ఈ కథలన్నిటా మనం గమనించవలసిన ప్రధాన విషయం ఈ కథలన్నింటిలోనూ సంస్కరణదృష్టి, స్త్రీ విద్య, స్త్రీ చైతన్యం. వస్తురూపేణా కూడా నాటి కథలు సంస్కరణదృష్టిని సమాజానికి చాటిచెప్పాయి.

ఇలా 1890 నుండి 1920 వరకూ వచ్చిన తొలికథల్లో సంస్కరణభావాలు, ఆదర్శాలు 'వస్తువు'ను నిర్ణయించాయి. పాశ్చాత్య కథలను అనుసరించడంవల్ల భారతీయ కథ మంచి శిల్పపరిణితిని పొందింది. క్రమంగా కథారచనే కాకుండా, కథలపై విమర్శ, వివిధ బాషల్లోని కథల్లో అనువాదాలు రాసాగాయి.

గురజాడ తర్వాత తెలుగు కథకులు ఆ మార్గంలోనే ప్రయాణించి 'వస్తువు'ను మరింత విస్తృతపరచుకున్నారు. నాటి మహిళల జీవితంలోని విషాదాన్ని, ఆనాటి కుటుంబ వ్యవస్థకు అతీతంగా ఆలోచించి కథలు రాసిన తొలి రచయిత శ్రీపాద

సుబ్రహ్మణ్యశాస్త్రి. వితంతుస్త్రీల జీవితాలే కేంద్రంగా ఆయన రాసిన కథల్లో 'అరికాళ్ల కింద మంటలు, ఇల్లు బట్టినవెధవాడపడుచు' 'తల్లిప్రాణం' ముఖ్యమైనవి. 'అరికాళ్లకింద మంటలు' కథలో 'రుక్కమ్మ' పాత్ర, వితంతువుగా పుట్టింట్లో వెట్టిచాకిరీ చెయ్యలేక పంతులుగారి తోటకు వెళ్ళిపోయి పునర్వివాహం చేసుకుంటుంది. 'ఇల్లు బట్టిన వెధవాడపడుచు' కథలో బుచ్చమ్మ తనకు దక్కని జీవితసుఖం తన తమ్ముడికి దక్కకూడదన్నట్లు ప్రవర్తిస్తుంది. ఇంకా చలం రాసిన 'శేషమ్మ', 'వితంతువు' వంటి కథల్లో వితంతువుల జీవితాల్లోని విషాదం ఆవిష్కరించబడింది. కొన్ని కథల్లో వితంతువుల తిరుగుబాటు కనిపించింది. నాటి వృద్ధ వివాహాలలోని అసంబద్ధతను గురజాడవారి 'మెటిల్డా' లో లాగా 'స్త్రీతత్వము' (సుబ్బలక్ష్మి), మనీపర్సు మహత్యం (కాత్యాయనీదేవి) కథల్లో స్త్రీరచయిత్రులు చిత్రించారు. బాల్య వివాహాలను గూర్చి చెరుకుపల్లి శివరామయ్య 'పశ్చాత్తాపము'; కొడవటిగంటి కుటుంబరావు 'ద్వితీయం', రాఘవరావు 'పడుచుపెళ్ళాం', యనమండ్ర సాంబశివరావు 'గ్రహచారం', శ్రీనివాసశర్మ 'రాజయ్య సోమయాజులు', షబ్నవీసు నరసింహరావు 'బాలికా విలాపము' కథలు వివరించాయి. వేశ్యా సమస్యను గూర్చి గురజాడవారి 'సంస్కర్త హృదయం' లో లాగా ముద్దుకృష్ణ 'దురాశ', చిలుకలపల్లి గోపాలస్వామి 'భ్రమ' కథలు చిత్రించాయి. ఇంకా అస్పృశ్యతను గూర్చి 'శ్రీపాద' కలుపు మొక్కలు; మతమార్పిడిని గురించి 'ఇలాంటి తవ్వాయివస్తే, దళితుల్లోని వైరుధ్యాన్ని 'పుల్లంరాజు' కథలు చిత్రించాయి. ఇంకా 'అయ్యోపాపం' (గొట్టిముక్కల మంగాయమ్మ) 'యీరమ్మ (అరవ వెంకటస్వామి), 'మాదిగవాడు (లీలాసరోజిని), గుక్కెడు నీళ్లు (బందా కనకలింగేశ్వరరావు) 'ధర్మతల్లి' (చుందూరు రమాదేవి) మొదలైన కథల్లో అస్పృశ్యతను గాంధీబోధనల నేపథ్యంలో చిత్రించారు.

**పాదసూచికలు**

1. మన నవలలు –మన కథానికలు – రాచపాళెం చంద్రశేఖరరెడ్డి
2. నూరేళ్ళపంట – (స్త్రీవాదరచయిత్రుల తెలుగుకథాసంకలనం)
3. వందేళ్ళ తెలుగు కథ (20వ శతాబ్ది ప్రతినిధి కథల సంకలనం) – సం.వాడ్రేవు చినవీరభద్రుడు

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 13 హైదరాబాద్ డిసెంబరు - 2022

# జాతీయోద్యమం - దేశభక్తి కథలు పరిశీలన

**లెంక సత్యనారాయణ,** అధ్యాపకులు, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నర్సంపేట, వరంగల్

చరవాణి : 9989732382

ఆధునికాంధ్ర వచన సాహిత్య ప్రక్రియలో నవలా ప్రక్రియ తరువాత పాఠక సమాజాన్ని బాగా ఆకట్టుకున్న ప్రక్రియ కథానిక. తెలుగు వచన సాహిత్యంలో కథ ఒక విశిష్టమైన స్థానాన్ని సంతరించుకోవడమే కాకుండా ఆధునిక కాలంలో ఒక ప్రత్యేకమైన స్వరూపాన్ని సంతరించుకొంది. మానవుడు మాట్లాడడం నేర్చుకొని, ఆలోచించడానికి అలవాటుపడిన తరువాత స్వతహాగా మనసులో కలిగిన లేదా ఇతరుల ద్వారా విన్న విచిత్ర విషయాలను, పరంపరాగతమైన పురాతన వృత్తాంతాలను, తరాలు మారిన కొద్దీ రూపంలో మార్చుకుంటూ వచ్చిన విశేషాలను కథలుగా చెప్పుకుంటూ వచ్చాడు. ఆధునిక వచన ప్రక్రియ 18వ శతాబ్ది చివరి భాగంలో అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్, రష్యా దేశాల్లో ఆవిర్భవించగా పాశ్చాత్యుల ప్రభావంతో ఆధునిక సాహిత్యంలో ఓ ప్రక్రియగా (షార్ట్‌స్టోరీ) కథానిక తెలుగులో ఆవిర్భవించింది.

"భారతదేశంలో వేదాలు మొదలుకుని ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు మనోరంజక నీతిబోధక కథలు మొదలైనవన్నీ కథను ఆశ్రయించుకుని జీవించినవి. ఈ కథల్లో కూడా కల్పిత కథలతో పాటు జానపద కథలు, కథాబీజాలు చోటు చేసుకున్నాయి"[1] అని విమర్శకులు చెప్పిన విషయాలు ఆధారంగా కథా ప్రక్రియ మనదేశంలో ప్రాచీన కాలం నుండే వ్యవహారంలో గలదని చెప్పవచ్చును. ఆధునిక లక్ష్య లక్షణాలతో కథానిక సాహిత్యం ఇరవయ్యో శతాబ్దం ప్రారంభంలో రాయబడటానికి కావలసిన నేపథ్యం 19వ శతాబ్దం ఉత్తర భాగంలో కలదు "ప్రాచీన కాలంలో అగ్ని పురాణంలోనూ, అర్వాచీన కాలంలో పాశ్చాత్య విమర్శ గ్రంథాలలోను చెప్పిన కథానిక లక్షణములను సమన్వయం చేసుకుని కథానికను ఇట్లు వ్యవహరింపవచ్చును. ఒక రకమైన ఎత్తుగడ, నడకతీరు, ముగింపు, పరిమిత పాత్రలు, ఆ పాత్రలకు చక్కని పోషణ, వస్తు విన్యాస వైశిష్ట్యము, ఒక జీవిత సత్యమును ప్రతిపాదించుట, అన్నింటినీమించి వస్త్వైక్యముండి వినోదమో విజ్ఞానమో కలిగించగల చిన్న కథ కథానిక అవుతుందని ఆచార్య జి. నాగయ్య గారు అభిప్రాయపడిరి"[2].

జాతీయోద్యమ తీవ్రరూపము దాల్చిన సమయంలో అనేక ప్రాంతీయ భాషల్లో దేశభక్తి, జాతీయ సమైక్యత భావాన్ని రగిలించే సాహిత్యం చాలా ఉధృతంగా వచ్చింది. 1905లో బెంగాల్ విభజన లాంటి సంఘటనలు ఇందుకు దోహదం చేసాయి. విభజించు పాలించు లాంటి సిద్ధాంతాలు మొదలుకొని భారతదేశ జాతీయ సంపదను కొల్లగొట్టడం భారత ప్రజలు జీర్ణించుకోలేక పోయారు. ఈ సందర్భంలో తెలుగు భాషలో కూడా దేశ భక్తి కథా సాహిత్యం వెలువడింది. స్వాతంత్ర్య సముపార్జన లక్ష్యంగా, స్వాతంత్ర్య ఫలాలని ఆకాంక్షిస్తూ కులమత భేదాలకు అతీతంగా ఎందరో త్యాగ్యమూర్తులు స్వాతంత్ర్య సంగ్రామానికి కంకణబద్ధులైనారు. ఆ ఇతివృత్తాలు దేశభక్తి కథలలో గలవు.

దేశభక్తి అంటే దేశముపైన భక్తి అని అర్థం. దేశము, భక్తి అనే రెండు పదాల కలయిక దేశభక్తి, భక్తి అంటే లొంగుబాటు. ఆ లొంగుబాటు ఒక వ్యక్తి తన అస్తిత్వాన్ని కోల్పోయేంతవరకు కొనసాగుతుంది. దేశమనే భావనలో తనని తాను సంపూర్ణంగా

లయ మొందించుకోవడం దేశభక్తి. "దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్" అని గురజాడ చెప్పింది. దేశమంటే మనుషులని అర్థంకాని, దేశమంటే మట్టికాదనడం సరికాదు. ఎందుకంటే మనిషి మట్టి పైన నిలబడతాడు. మట్టిలేనిది మనిషిలేడు. మట్టిని విస్మరించి మనిషికి మాత్రమే ప్రాధాన్యతనివ్వడం సమాంజసంగా లేదు. కాబట్టి మట్టికి, మనిషికి విడదీయరాని సంబంధముంది. ఈ మట్టి కోసం యుద్ధాలు రక్తపాతాలు సంభవించాయి. ద్వేషాలు, ఆవేశాలు పెరిగాయి. దేశమంటే మట్టి, మనిషి అని కూడా అర్థం. అందులో వివరంగా లోతులకెళ్లి చూసినచో మట్టికి మనిషికి గల సంబంధం, ఆ మట్టిలో అభివృద్ధి చెందిన సంస్కృతి, సంప్రదాయలు, ధర్మము, చరిత్ర మొదలైనవి ఒక దానితో నొకటి పెనవేసుకొని ఉంటాయి. కావున దేశభక్తి అంటే మట్టి, మనిషి, సంస్కృతి, సంప్రదాయాలు, ధర్మము, చరిత్ర మొదలైనవి. దేశభక్తి అంటే వీటిన్నంటిపైన భక్తి. వీటన్నిటిలో వ్యక్తి తన అస్తిత్వాని కోల్పోవడము.

**యజ్ఞసమిధ కథ : రచయితా ఐతా చంద్రయ్య**

జాతీయోద్యమం అనే మహాయజ్ఞంలో ఒక దేశ భక్తుడు సమిధగా మారడము ఇందలి కథాంశము. ఈ కథలో ప్రధాన పాత్రలు రెండు 'రాంప్రసాద్ బిస్మిల్', 'అప్ఫఖుల్లాఖాన్'. రాంప్రసాద్ బిస్మిల్ దేశ భక్తుడు. ఆర్య సమాజ కార్యకర్త. ఆయుధాల తయారీలో ఆరి తేరినవాడు. దేశ స్వాతంత్ర్యము కొరకు అహర్నిశలు శ్రమిస్తుంటాడు. అప్ఫఖుల్లాఖాన్ యువకుడు. ఇస్లాం మతస్తుడు. గుండె నిండా దేశభక్తి గలవాడు. బ్రిటిష్ సామ్రాజ్యానికి చరమగీతం పాడడమే లక్ష్యంగా జాతీయ విప్లవ వీరుడుగా మారి స్వాతంత్ర్యము కొరకు పోరాడాలని రాంప్రసాద్ బిస్మిల్‌ను కలవగా "నేను హిందూ ధర్మాన్ని నమ్ముకున్నాను. నువ్వు మహమ్మదీయుడువని" బిస్మిల్ పలకగా కాదన్నా "ఆరాధనా విధానం వ్యక్తిగతం, కాని దేశం మనందరిది. మతాల పేర విడిపోతే ముందు తరాలు మనను క్షమించవు కలిసికట్టుగా స్వాతంత్ర్యం కోసం శ్రమించి సాధించుదాం. అందుకోసము కలిసి త్యాగాలు చేద్దాం. మనది హిందూదేశం, జాతిరీత్యా మనమంతా హిందువులం. మోక్షము కోసం వేర్వేరుదారుల్లో పయనించినా మన గమ్యం ఒక్కటే కదన్నా" అని అప్ఫఖుల్లాఖాన్ తన ఉద్దేశ్యాన్ని వ్యక్తపరుస్తాడు. ఈ మాటలు ద్వారా భారతజాతి అంతా ఒక్కటేనని జాతి, కులమతాలకు అతీతంగా అందరూ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని స్వాతంత్ర్య సముపార్జన లక్ష్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. చాలా సమయం చర్చించిన తరువాత రాంప్రసాద్ అప్ఫఖుల్లాఖాన్‌ను అక్కున చేర్చుకున్నాడు. మరి కొందరు దేశభక్తులు తోడై ఫలితంగా హిందుస్థాన్ రిపబ్లిక్ అసోసియేషన్ ఆవిర్భవించింది.

అప్ఫఖుల్లాఖాన్ ప్రస్తుతం హిందుస్థాన్ రిపబ్లిక్ అసోసియేషన్, కాపలాదారుడుగా ఉంటూ స్వాతంత్ర్య కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటాడు. దోర వయసులోవున్నావు పెళ్ళి చేసుకొని సుఖాలనుభవించవచ్చు కదా అని రాంప్రసాద్ మాట్లాడినపుడు "ప్రతి భారతీయుడు నా ఇల్లు, నా సంసారం బాగుంటే చాలునని గిరి గీసుక్కూచుంటే మన బానిసత్వంపోతుందా? విశాల విశ్వంలో కోట్లాది జీవరాశులు పుడుతూ గిట్టుతున్నాయి వాటికి మనకు తేడాలేదా! అందరి కోసం కొందరన్నా ప్రాణాలిస్తే ముందు తరాలు స్వాతంత్ర్యాన్నినుభవిస్తాయి కాదా! స్వేచ్ఛా భారతం మా త్యాగాలను సువర్ణక్షారాలతో రాసిపెడుతుంది. అదే మాకు తృప్తి, ఆనందం అని" అప్ఫఖుల్లాఖాన్ సమధానమిస్తాడు. భారతీయులు స్వార్థాన్ని విడనాడి విశాల దృక్పదంతో స్వాతంత్ర్యోదమంలో అందరూ పాల్గొన్నపుడే ఆ ఉద్యమము మంచి ఫలితాలనిస్తుందని, బానిస విముక్తికి పోరాటమే శరణ్యమని, ప్రతివ్యక్తి స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నప్పుడే అతని జీవితానికి ఒక సార్థకత ఏర్పడుతుందని అటువంటి దేశభక్తి లేని భారత పౌరుల జీవితం వ్యర్థమని రచయిత చెప్పారు.

ఆయుధాలు కొరకు, ఉద్యమాన్ని ముందుకు నడిపించడానికి ఆర్థిక వనరులు కావాలి. భారతీయుల రక్తమాంసాలను దోచుకొంటున్న బ్రిటీషిండియా ప్రభుత్వ ధనాన్ని కొల్లగొట్టమే లక్ష్యంగా రాంప్రసాద్ (ఆధ్వర్యంలో) నాయకత్వంలో 9.08.1925న షాజహాన్‌పూర్ నుండి లక్నో వెళ్తున్న రైలు బండిని కకోరి స్టేషన్‌లోకి చేరబోయేముందు రైలును నిలిపి అందులో గల డబ్బు పెట్టెను సొంతం చేసుకొని డబ్బుపెట్టి తాళం చెవులను వెయ్యేనుగులబలంతో అప్ఫఖుల్లాఖాన్ బ్రద్దలు కొట్టగా ధనం స్వాతంత్ర్య పోరాట

యోధుల చెంతకు చేరుతుంది. 12.09.1925న రాంప్రసాద్ బిస్మిల్‌ను పోలిసులు అరెస్టు చెయ్యగా, మిగిలిన సమరవీరులంతా పోలిసులకు చిక్కగా అస్పఖుల్లాఖాన్ తప్పించుకొని మారువేషంలో కాశీకి చేరుకుంటాడు. అక్కడ నుండి బీహర్‌కు చేరుకొగా ఒక పారిశ్రామికవేత్త ఆదరించగా అతని సంస్థలో పది నెలలు ఉద్యోగం చేస్తాడు. మిత్రదోహం వలన బందిగా మారుతాడు. యస్పీ తసద్రుక్‌ఖాన్ మతం పేరుతో తనను మచ్చిక చేసుకొని అప్రూవర్‌గా మారిపొమ్మని ఒత్తిడితేగా "మిస్టర్‌ఖాన్! మతం వ్యక్తిగతం దేశం మన భారతీయులందరిది.

ఈ మట్టిలో పుట్టిన మనం తిరిగి ఆ మట్టిలోనే కలిసిపోవాలి. మన దేశీయుల్ని మతాల వారిగా విభజించి పాలిస్తున్న బ్రిటిష్ సామ్రాజ్య వాదుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారే బదులు దేశ స్వాంతత్ర్యము కొరకు పోరాటం చెయ్యడమే శ్రేయస్కరం" అని అస్పఖుల్లాఖాన్ పలికిన మాటల్లో మతం సంకుచితమైన భావనని, జాతీయతాభావం విశాలమైనవినది, మతం పేరు మనుషులను, సమాజాన్ని విభజించే బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదిరించడానికి స్వాతంత్ర్య పోరాటం ఒక్కటే శ్రేయస్కరమని చెప్పిరి. కకోరి కుట్ర కేసు కోర్టులో ఒక ప్రవాసనంగా మారింది. గోవింద్‌వల్లభ్‌పంత్, నెహ్రూ శక్తియుక్తులు బూడిదలో పోసిన పన్నీరై రాంప్రసాద్ బిస్మిల్, రాజేంద్రలహారి, రోషన్‌లాల్‌తో పాటు అస్పాఖుల్లాఖాన్‌కు ఉరిశిక్ష పడింది. 19.12.1927న ప్రకృతికపుకున్న మంచు దుప్పటి మాయం కాకముందు "నా మాతృ భూమి నాకు స్వర్గం. ఈ మట్టినాకు సుగంధం. ఈ దేశంలో జన్మించడమే అదృష్టం. కొద్దికాలంలోనే మీరు తట్టాబుట్టా సర్దుకొని వెళ్ళడం ఖాయం" అని ఉరితాడును ముద్దు బెట్టుకున్నాడు అస్పాఖుల్లాఖాన్. స్వాతంత్ర్య సమర యజ్ఞ సమిథ అస్పఖుల్లాఖాన్. మాతృ భూమిని స్వర్గ సమానమని చెప్పడం, భారతీయులందరీకి ఈ మట్టితో సంబంధముందని చెప్పడం దేశభక్తికి పరాకాష్ఠ. స్వాతంత్ర్య సమరవీరుల త్యాగాలు వ్యర్థము కావని, భారతమాత బానిస సంకెళు ళ్ళ తెగ్గొట్టడానికి పోరాటమే ఏకైక మార్గమని, భారతీయులు కుల, మత, జాతి, లింగ భేదాలకు అతీతంగా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని స్వాతంత్ర్య ఫలాలను పొందాలని ఈ కథలో చెప్పబడింది.

**దేశభక్తి కథ : బలివాడ కాంతారావు**

ఈ దేశభక్తి కథలో స్వాతంత్ర్య ఉద్యమకాలము నాటి దేశభక్తికి, స్వాతంత్ర్యము తరువాత కాలము నాటి దేశభక్తికి మధ్యగల వ్యత్యాసాలను కథా రచయిత వివరించి చెప్పారు. నిస్వార్థమైన దేశభక్తులెవరు అన్న ప్రశ్న ఉత్పన్నమౌతుంది. ఈ కథలో ప్రధానపాత్రలు చలమయ్య అతని కొడుకు. కొడుకుపాత్రకు పేరు లేదు. చలమయ్య భార్య పాత్రకు కూడా పేరు లేదు. దేశభక్తి భావాన్ని గుండెలనిండా నింపిన అద్భుత కథాంశము దేశభక్తి కథ.

చలమయ్య అపారమైన దేశభక్తుడు, చిన్నతనంలో హైస్కూల్ విద్యను అభ్యసించే రోజుల్లో వందేమాతరం, మనదే రాజ్యం అని నినదించి లాఠీ దెబ్బలు తిన్నాడు. చలమయ్య పెద్దింటి మార్యాదస్తుల బిడ్డ. కళాశాల విద్యనభ్యసించేటప్పుడు పలుమార్లు జైలుకెళ్ళాడు. చలమయ్య బందరు కళాశాలలో చదివే రోజుల్లో ఎన్నో సత్యాగ్రహాల్లో పాల్గొని, లాఠీ దెబ్బలు తిని జైలుకు వెళ్ళాడు. నూలువడికాడు. గాంధీ టోపితో కోవెలలో శెఠగోపం పెట్టగా వచ్చిన నైర్మల్యభావాన్ని పొందాడు. స్వరాజ్యం వస్తే మళ్ళాపోతుందా అన్ని నాయకునితో దానికి రెండు కారణాలు చెప్పాడు. "ఒకటి మానకంటి పెట్టిన కులతత్వం. రెండోది ప్రాంతీయదురాభిమానం. మనం కులం పేరుతో, ప్రాంతం పేరుతో భారతీయులంతా ఒకే జాతి మనది ఒకే దేశం అని మరిచిపోతుంటాం" అన్నాడు. కులతత్త్వం, ప్రాంతీయదురాభిమానము దేశభక్తికి, జాతీయతా భావానికి పెద్ద అవరోధాలుగా అభివర్ణించాడు. ఆదర్శవంతుడై కులంలేని అతీగతిలేని హరిజన బాలికను వివాహం చేసుకొన్నాడు.

దేశానికి స్వాతంత్ర్యమొచ్చింది. చలమయ్య కొడుకు స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నాడు. దేశ స్వాతంత్ర్యాన్ని రక్షించవలసిన బాధ్యత తనది కాదు తన తరువాత తరాల వారిదని గుర్తించాడు. స్వరాజ్య సాధనకు గాంధీ టోపీ స్వరాజ్య రక్షణకు అవసరం లేదని భావించాడు. స్వరాజ్యం తరువాత గాంధీ టోపీ విలువ తారుమారైంది. చలమయ్య ధరించిన గాంధీ టోపీ వైపు ప్రజలు అనుమానంగా చూస్తున్నారు.

చలమయ్య తన కొడుకును దేశ రక్షణ కోసం పంపించాడు కొడుకు దేశం కోసం ప్రాణాలర్పించాడు. చలమయ్య జైలుకు మాత్రమే వెళ్లొచ్చాడు. దేశం కొసం ప్రాణాలర్పించిన తన కొడుకు విరోచిత మరణానికి తగిన గుర్తింపురాలేదు. "నాకన్నీరు దేశం కన్నీరు కాదా? నా గర్వం దేశం గర్వం కాదా? నా బాధ అందరి బాధ కాదా? అని అనుక్షణం బాదపడ్డాడు". ఇది స్వాతంత్ర్యము వచ్చిన తరువాత దేశభక్తి భావంలో వచ్చిన మర్పుకు సంకేతంగా కన్పిస్తుంది. "ఒక్కడు గదా బుద్ధి గడ్డి తిన్నాదా, మిలటరీకి పంపించావన్న మిత్రునికి సభ్యసమాజనికి దేశ భక్తి విలువను తెలియజేసాడు". "భక్తికి కోరికలు జతపరిస్తే భక్తికాదు. నేనోదో కాంక్షించి దేశభక్తి చూపిస్తే అది అహం మీద నాకున్న భక్తి కాని దేశభక్తికాదు. నా పేరు చరిత్రలో కాదు నా ఆత్మలో రాసుకొని" అని సమాధానం చెప్పాడు. అంటే దేశభక్తి నిస్వార్థమైనదని, ప్రతిఫలలాపేక్ష లేనిదని, అది ఒక స్వచ్ఛమైన ఆత్మ భావనగా చెప్పడం జరిగింది.

చలమయ్య కొడుకు సామాన్లు ఇంటికి పెద్దట్రంకు పెట్టెతో వచ్చాయి. తన కొడుకుకు సమాజం తగిన గౌరవాన్ని కల్పించకపోయిన మింటి చుక్కలు మిణుకు మిణుకుమని బాబు సమాధి మీద వెలుతురు ప్రసురిస్తున్నాయని గర్వపడ్డాడు. సముద్రం తన బాబు కొరకు హోరెత్తి ఏడుస్తుందని మనుషులు మాటలకు చావుందిగాని ప్రకృతి ఘోషకు చావులేదని సంతోషించాడు. తన కొడుకు త్యాగాన్ని మనుషులు గుర్తించక పోవచ్చు కాని పంచభూతాలు తన కొడుకును పొట్టలో పెట్టుకొని నిత్యం కీర్తిస్తూ ఉంటాయని భావించాడు. చలమయ్య పెట్టెలో వస్తువులు తిరగేస్తుండగా ఒక ఆల్‌బమ్ కనిపించింది. అందులో ఒక బెంగాలీ కన్య. కులంలేని పెళ్ళిచేసుకొని నేను కులతత్వాని ఎదుర్కొనాన్నని ఇంకో ప్రాంతం పిల్లను కొడుకు చేసుకొని ప్రాంతీయ తత్వాన్ని ఎదుర్కొనందుకు గర్వపడ్డాడు. ఒక్కొక్కపేజిలో బొమ్మలుకాదు యావత్ దేశము చలమయ్యకు దర్శనమిచ్చింది చలమయ్య రోదిస్తూ దగ్గరకొచ్చిన భార్యతో "మనబాబు మనదేశపు భూత, వర్తమాన, భవిష్యత్తులను నరకాలని వచ్చిన రాక్షసులను యెదిరించిన వేలాది వీరుల్లో ఒకడయ్యాడు. నా బాబు జన్మభూమి చరిత్రలో భాగమే అయిపోయాడు" అని ఎంతో ఆనందించాడు, గర్వించాడు. దేశ భక్తునకు స్వార్థపూరితమైన సమాజం సరైన గుర్తింపును గౌరవాన్ని ఇవ్వకున్నప్పటకీ చరిత్ర తగిన గుర్తింపునిస్తుందన్న ఆశాభావాన్ని రచయిత వ్యక్తీకరించారు.

యజ్ఞ సమిధ, దేశభక్తి కథలలోగల ఇతివృత్తాలు జాతీయోద్యమ స్ఫూర్తితో దేశభక్తి భావాలను అందిస్తున్నవి. ఇతివృత్తం కథారచనకు ప్రాణం వంటిది. రచయిత తన మనసును కదిలించిన సంఘటనను ఆధారంగా చేసుకొని ఇతివృత్తాన్ని రూపొందించుకుంటాడు. సామాజిక సంఘర్షణ కూడా ఇతి వృత్తంగా మలుచుకోవచ్చును. ఒక వ్యక్తిగాని, సమస్యగాని రచయితను స్పదింపచేస్తే అది అతనిని నీడలా వెంటాడుతుంది. దీనిని ఇతివృత్తంగా తీసుకొని కథారచన చేస్తే అందులో సహజత్వం, జీవం తోణికిసలాడుతుంది. అ దృక్పథంతో చూస్తే ఈ రెండు కథల ఇతివృత్తాలు సహజత్వాన్ని కలిగి ఉన్నట్లు తెలుస్తుంది.

పోరంకి దక్షిణామూర్తి "ఏ రకమైన సృజనాత్మకత కలిగిన కృషికైనా ముందు ముడిసరకు సిద్ధంగా పెట్టుకోవాలి. దానిని 'ప్రాసెస్' చేసుకొని నగిషీలు దిద్దుకుంటేగాని మనకు కావలసిన స్వరూపం ఏర్పడదు. ఈ ముడి సరుకునే సాహిత్య పరిభాషలో వస్తువు లేదా ఇతివృత్తం అంటారు"[3].

మధురాంతకం రాజారాం "మధ్యలో ఉండే కేంద్రబిందువులే ఇతివృత్తం అనంత వైవిధ్యం కానవచ్చే మానవ ప్రవర్తనకు అత్యంత సమీపంలో ఉన్న సాహిత్య ప్రక్రియ కథానిక అది నిర్వచనాలకు లొంగదు. ఎవరి అనుభవాలను వారు నిర్వచించుకోవలసిందేనని" చెప్పిరి[4].

పైన పేర్కొన్న సాహిత్య విమర్శకుల మాటలతో ఈ రెండు కథల ఇతివృత్తాలను సమగ్రంగా అధ్యయనం చేయగా కథాసాహిత్యంలో స్వాతంత్ర్య పోరాటంలో దేశభక్తి కథలకు గల ప్రాధాన్యత ప్రయోజనం మనకు సమగ్రంగా తెలుస్తుంది.

**ఉపయుక్త గ్రంథాలు:**

1. పోరంకి దక్షిణామూర్తి, "తెలుగు కథానిక వికాసం", విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1988.
2. ఆచార్య జి. నాగయ్య, "తెలుగు సాహిత్య సమీక్ష" రెండో సంపుటం, పుట. 829.
3. పోరంకి దక్షిణామూర్తి, "తెలుగు కథానిక వికాసం", విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1988.
4. మధురాంతకం రాజారాం, "తెలుగు కథకులు – కథన తీరు తెన్నులు" (ఒకటి, రెండు సంపుటాలు).
5. కస్తూరి మురళీకృష్ణ, కోడీహిళ్ళి మురళీమోహన్, "దేశభక్తి కథలు", సాహితి ప్రచురణలు, 33–22–2 చంద్రం బిల్డింగ్స్, సి.ఆర్. రోడ్, విజయవాడ.

# తెలుగు నవల - జాతీయోద్యమ ప్రభావం

(మాలపల్లి, కొల్లాయిగట్టి తేనేమి నవలల నేపథ్యం)

**డా. ఎం. రమేశ్ బాబు,** సహాయ ఆచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి, చరవాణి : 9652813779

నవల అనే సాహిత్య ప్రక్రియ జీవితంలోని ఏ అంశాన్నైనా తనలో ఇమిడ్చుకునే విశాల స్వభావం కలది. అలాగే నవలలో ఎన్ని విశేషాలనైనా, ఎన్ని ప్రవృత్తులనైనా, ఎన్ని శాస్త్రాలనైనా, ఎన్ని జీవితాలనైనా చివరికి సాహిత్యంలోని ఇతర ఎన్ని ప్రక్రియలనైనా తనలో ఇమిడ్చికోగలదు. సాహిత్య ప్రక్రియల్లో నాటకం ఒక సమాహార కళ అని ప్రసిద్ధి ఉన్నట్లే ఆధునికంగా వచ్చిన నవల నాటకం కంటే కూడా మరింత సమాహార ప్రక్రియగా చెప్పవచ్చు. "కథలోని సందేహం, వ్యాసంలోని చింతన, పరిశీలన నాటకంలోని సంభాషణ, పాత్రచిత్రణ ఇతివృత్త నిర్మాణం, కవిత్వంలోని అనుభూతి సాంద్రత, భావ చిత్రణం ఇంకా అనేక ప్రక్రియలకు సంబంధించిన అనేకాంశాలను నవలలో చూడవచ్చు" (నవలా స్వరూప స్వభావాలు – నాగభూషణ శర్మ మొదలి) ఇలా అని నవల కేవలం విజ్ఞాన సర్వస్వం వంటిది కూడా కాదు. ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం గారు చెప్పినట్లు "నవల జీవితానికి ఒక దృక్పథంతో చేస్తున్న కథా సూత్ర వ్యాఖ్యానం, కళాత్మక భాష్యం". అందుకే అనేక భాషా సాహిత్యాలలో నవల ప్రజాదరణ పొందిన, పొందుతున్న ప్రక్రియగా ఇప్పటికీ వెలుగొందుతుంది.

ఆంగ్ల భాషా ప్రభావంతో భారతీయ భాషలలో ముందుగా బెంగాలీ భాషలో ఈ నవలా ప్రక్రియ మొదలైంది. ఆంగ్ల మరియు బెంగాలీ భాషల్లోని నవలల్లో ఉన్న వైవిధ్యాన్ని తనలో ప్రదర్శిస్తూ విభిన్న ధోరణులతో, భిన్న భిన్న సిద్ధాంతాలను పాటిస్తూ అచిర కాలంలోనే తెలుగు సాహిత్యంలో నవల ఒక ప్రధాన ప్రక్రియగా స్థిరపడి ఇప్పటికీ పాఠకాదరణ పొందుతూ రాశిలోనూ వాసిలోనూ ఒక విశిష్ట గుర్తింపును పొందింది.

150 సం॥రాల తెలుగు నవలా సాహిత్యంలోని యుగ విభజనను పరిశీలిస్తే 1872–1900 వరకు అనువాదయుగం గాను, 1900–1930 వరకు వికాసయుగంగాను, 1930–1950 వరకు కాల్పనిక యుగం, 1950–1970 అభ్యుదయ యుగం, 1970–1990 వరకు ఆధునిక యుగంగాను చివరగా 1990 నుండి నేటి వరకు సమకాలీన యుగంగా తెలుగు సాహిత్యకారులు పేర్కొంటున్నారు. ఈ యుగ విభజనలోని వికాస మరియు కాల్పనిక యుగాలు అనగా 1900–1950 వరకు తెలుగులో వచ్చిన చాలా నవలల్లో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఆనాటి సమాజంలో సాగుతున్న జాతీయోద్యమ ప్రభావం కనిపిస్తుంది. దీనికి కారణం ఆనాటి రాజకీయ పరిస్థితులు, దేశవ్యాప్తంగా సాగుతున్న స్వాతంత్ర్య ఉద్యమం మరియు ఆనాటి సంఘ సంస్కర్తల కృషి తెలుగు భాషా సాహిత్యాలనే కాదు భారతీయ భాషలన్నిటినీ ప్రభావితం చేసింది.

1907 లో బిపిన్ చంద్రపాల్ దక్షిణ భారతదేశంలో పర్యటించి తన అనర్గళమైన, గంభీరమైన ఉపన్యాసాలతో కవి, పండిత లోకాన్నే కాక సామాన్య ప్రజానీకాన్ని కూడా స్వాతంత్రోద్యమంలో పాల్గొనే విధంగా చేసారు. ముఖ్యంగా 1907 ఏప్రియల్ పాల్ గారి రాజమండ్రి పర్యటన తెలుగు సాహిత్యకారులకు, ముఖ్యంగా నవలా రచయితలకు ఒక దిశా నిర్దేశం దొరికినట్లయింది. ఆ తర్వాత గాంధీ గారి నాయకత్వంలో ఉవ్వెత్తున సాగిన జాతీయోద్యమంలో తెలుగు రచయితలందరూ జాతీయోద్యమ నేపథ్యంలో

రచనలు చేశారు. కొందరు రచయితలు జైలులో ఉన్నప్పటికీ తమ రచనలను ఆపలేదు. సరికదా దీన్ని కూడా ఒక మంచి అవకాశంగా భావించి రచించారు.

అలా నవలాకారులు రచించిన అనేక నవలలో రెండు నవలల గూర్చి మనం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. వీటిలో ఒకటి 1922 లో వచ్చిన "మాలపల్లి" కాగా రెండవది 1965 ప్రాంతంలో వచ్చిన "కొల్లాయిగట్టితే నేమి" ఈ రెండు నవలల మధ్య కాలంలో వచ్చిన తెలుగు నవలలు అవి సామాజిక నవలలైనా, రాజకీయ నవలలైనా లేదా చారిత్రక నవలలైనా వాటిపై ఈ జాతీయోద్యమ ప్రభావం ప్రస్ఫుటంగా ఉంది.

## మాలపల్లి

మాలపల్లి నవలను ఉన్నవ లక్ష్మీనారాయణ గారు 1920-21 మధ్య కాలంలో రాయవెల్లూరు జైలులో ఉన్నప్పుడు రచించారు. 1922లో తొలిసారి ముద్రించారు. బ్రిటీష్ ప్రభుత్వం ఈ నవలను రెండుసార్లు నిషేధించింది. ఈ నవలకు మరో పేరు"సంగ విజయం". వృత్తి రీత్యా న్యాయవాది అయిన ఉన్నవ లక్ష్మీనారాయణ గారు, సాంఘీక, రాజకీయ, సంస్కరణాది విషయంలో ఆరితేరిన వారు. సహాయ నిరాకరణ ఉద్యమంలో గాంధీ గారి పిలుపు పేరకు 1920లో తన న్యాయవాద వృత్తిని తృణ ప్రాయంగా వదిలి జాతీయోద్యమంలో పాల్గొన్నారు. ప్రపంచ రాజకీయ పరిణామాలపై మంచి అవగాహన ఉన్న ఉన్నవ గారు 1917లో రష్యాలో వచ్చిన బోల్షివిక్ విప్లవం ప్రభావంతో ఈ నవలను రచించారు.

మాలపల్లి ఒక గొప్ప నవలగా కీర్తిస్తూ ఎం.ఎస్. సుదర్శనం గారు "ఈ శతాబ్ది రాజకీయాల్లో గాంధీజీ ఎలా విశిష్ట వ్యక్తో అలాగే తెలుగు నవ్య సాహిత్యంలో మాలపల్లి కూడా ఒక విశిష్ట రచన" అన్నారు. మాలపల్లి ఒక గొప్ప నవలగా ప్రసిద్ధి చెందడానికి ఆ నవలలోని 9 లక్షణాలను ద్వా.నా. శాస్త్రి గారు పేర్కొంటూ (1) సంఘ సంస్కరణ (2) స్వాతంత్రోద్యమ ప్రభావం (3) ఆధ్యాత్మికత (4) గాంధీ గారి ప్రభావం (5) వాడుక భాష (6) కథా వస్తువు (7) సంభాషణా నైపుణ్యం (8) వర్ణనాత్మకశైలి మరియు (9) పాత్ర చిత్రణలో వాస్తవికత అంటూ విశ్లేషించారు.

గాంధీ గారి నేతృత్వంలో తీవ్ర రూపం దాల్చిన జాతీయోద్యమం 1920-21 నాటి దేశ సామాజిక, రాజకీయ, చైతన్యానికి మాలపల్లి ప్రతీక. సమకాలీన చరిత్రను నవలగా మార్చిన ఉన్నవ గారు ఈ నవలలో వీరేశలింగం గారి సంఘ సంస్కరణ, గాంధీ గారి హరిజనోద్యమము, భారతదేశంలోని అతివాద, తీవ్రవాద ఉద్యమాల ప్రభావం, రష్యా విప్లవ ప్రభావం అలాగే కార్మిక, రైతు కూలీ ఉద్యమాలను కూడా ఈ నవలలో చిత్రించారు. ఈ అన్ని ఉద్యమాల వెనుక మళ్లీ భారతీయ ఆధ్యాత్మికతను ఎక్కడా వదలకుండా రచించారు ఉన్నవగారు. జి.వి. సుబ్రహ్మణ్యం గారు చెప్పినట్లుగా "ఉన్నవ గారు తాము కళ్లతో చూసిన సమాజాన్ని, తాము కలలు కన్న సమాజాన్ని కలిపి ముద్ద చేసి కళారూపంగా మన కందించారు". అన్న మాట అక్షర సత్యం. ఇక ఈ ప్రసిద్ధ నవల కథా కథనం సాహితీ మిత్రులందరికీ తెలిసిందే.

## కొల్లాయి గట్టితే నేమి?

మహీధర రామమోహన రావు గారు 1965 ప్రాంతంలో ముద్రణలో తెచ్చిన నవల "కొల్లాయి గట్టితే నేమి?" మహీధర్ గారు కూడా జాతీయోద్యమంలో క్రియాశీలంగా పాల్గొన్న వ్యక్తి. ఆయన రాసిన నవలలు ఓనమాలు, రథచక్రాలు, దేశం కోసం, మృత్యువు నీడల్లో, శుభలేఖ మరియు కొల్లాయి గట్టితేనేమి? అన్నీ రాజకీయ నేపథ్యంలో సాగేవే.

1920-21 నాటి ఆర్థిక, సాంఘీక, రాజకీయ పరిస్థితులను చిత్రించే ప్రయత్నంలో 1965 లో ఈ నవలను రచించారు. దీనిలో ఆనాటి ప్రధాన సంఘటనలైన జలియన్ వాలా బాగ్ హత్యాకాండ, రౌలత్ చట్టం, సహాయ నిరాకరణ, విదేశీ వస్తు బహిష్కరణ వంటి అంశాలను నేపథ్యంగా తీసుకొని 1920 నాటి ఆంధ్రదేశ చారిత్రక పరిస్థితులను విపులంగా, గాఢంగా కన్నులకు కట్టినట్లు ఈ నవలలో చిత్రించారు. జాతీయోద్యమంలో ప్రధాన కాలంగా భావించే ఆనాటి చారిత్రక విశేషాలన్నీ ఈ

నవలలో చూడవచ్చు. గాంధీ గారు కొల్లాయి (నూలు వస్త్రం) ధరించక ముందే మహీధర గారు "కొల్లాయి గట్టితే నేమి?" అన్న శీర్షికతో ఈ నవలను రచించినట్లుగా తెలుస్తుంది. 1968లో రాష్ట్ర ప్రభుత్వ సాహిత్య అకాడమీ అవార్డు పొందిన ఈ నవలా జాతీయోద్యమ నేపథ్యంలో వచ్చిన ఒక ఆణిముత్యం వంటి నవలగా చెప్పుకోవచ్చు.

ఇలా మొదట "మాలపల్లి" నవల నుండి చివరగా ముద్రణకు వచ్చిన "కొల్లాయి గట్టితే నేమి?" నవల వరకు తెలుగులో అనేక నవలలు ఈ జాతీయోద్యమ ప్రభావంతో వచ్చాయని చెప్పవచ్చు.

**ఆధార గ్రంథాలు:**

1) తెలుగు నవల స్వరూప స్వభావాలు - మొదలి నాగభూషణ శర్మ

2) ఆంధ్ర నవలా పరిణామం - బి.వి. కుటుంబ రావు. వాల్యూం-1

3) తెలుగు కవిత్వోద్యమాలు - తెలుగు అకాడమి - 2003

4) సాహిత్యంలో చర్చనీయాంశాలు - తెలుగు అకాడమి - 1991

5) తెలుగు మణిదీపాలు - ఎమెస్కో - 2009

6) తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ ద్వానా శాస్త్రి.

# జాతీయోద్యమ కవిత్వం

**డా. కె. లక్ష్మీనారాయణ,** తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ కళాశాల (స్వ.ప్ర), అనంతపురం, చరవాణి : 9398510499

జాతీయత అంటే ఒక జాతి ఆత్మగౌరవానికి ఔన్నత్యానికి సంబంధించిన స్థితి. జాతి సంస్కృతి సంప్రదాయాలను సహజత్వాన్ని ప్రవహింపజేసే జీవనది జాతీయత. గురజాడ వారి దేశభక్తి గీతం జాతీయతకు వివరణే. ఒకే మనుగడ ఒకే విశ్వాసం గల మానవ సమూహపు భావ జాలమే జాతీయత భిన్నత్వంలో ఏకత్వమే జాతీయత. హాన్స్‌కోన్ రాసిన Nationalism - Its Meaning and History (1965) పుస్తకంలో జాతీయతను చక్కగా నిర్వచించడం జరిగింది.

తన జన్మభూమికి ఎప్పుడూ వినయంగా వుండి అవ్యాజమైన ప్రేమ కలిగి వుండడం. ఆ నేలను అక్కడి సాంప్రదాయములను, చారిత్రకతను అభిమానిస్తూ, గాఢమైన అనురాగం వుండడం ఇదే జాతీయత. తన చుట్టూ ఉన్న దారుణ భీకర స్థితులను గమనిస్తూ, కూడా ఉదాసీనత వహించే దివాంధం కాదు కవి. తన జాతి పరాయి పాలకుల పదఘట్టనల కింద జీవచ్ఛవంలా బతుకుతున్నప్పుడు కవి చేతులు ముడుచుకొని కూర్చోలేదు. తెలుగు కవులు తమ కలాల్ని తుపాకులుగా, తమ గీతాల్ని తూటాలుగా చేసుకొని ఆంగ్లేయులపై ధ్వజమెత్తారు. మన కవులే కాదు ఆంగ్ల కవుల్లో కూడా కొందరు మన పక్షాన నిలిచి, గళమెత్తిన విషయాన్ని మద్దూరి సుబ్బారెడ్డి గారు తెలియపరిచారు. ఈస్టిండియా కంపెనీ భరతభూమిని పెట్టే హింసలను సహించలేక విలియం కూపర్ అలనేకవి "Look to the East, where ganga's Swarthy race shall shake your tyrant empaire to it's base" అంటూ తమ ప్రభుత్వాన్ని హెచ్చరించడం గమనార్హం. ఇలాగే కాల్‌రిడ్జ్, థామస్ లూ మనకు అండగా నిలువడం విశేషం.

ఆంధ్ర జాతీయోద్యమ కవిత్వంలో ఆరితేరిన కవి సార్వభౌములు చాలామంది వున్నారు. వీరివల్ల తెలుగు సాహిత్య చరిత్రలో జాతీయోద్యమ కవిత్వం ఒక శాఖగా ప్రజ్వలించింది.

1905లో వంగదేశ విభజన జరిగింది. అది భారతీయులలో ప్రతికారాన్ని రగుల్కొల్పింది. వందేమాతరోద్యమం" ప్రారంభమైంది. బిపిన్ చంద్రపాల్ బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా దక్షిణాన పర్యటించి, అనర్గళమైన, గంభీరమైన, దేశభక్తి పూరితమైన ఉపాన్యాసాలిచ్చారు. అవి ప్రజలను రెచ్చగొట్టాయి. 1907 ఏప్రిల్ 19 నుంచి 24 వరకు బిపిన్ చంద్రపాల్ రాజమండ్రిలో ఉపన్యసించారు.

ఆ ఉపన్యాసాలను చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు అనువాదం చేసి చెప్పేవారు. చివరి రోజు చిలకమర్తి వారు కూడా ఉద్రేకభరితులై ఆవేశంగా ఆశువుగా గుండె లోతుల నుంచి, పెల్లుబికి వచ్చిన ఈ పద్యాన్ని సభలో చెప్పారు.

**"భరతఖండంబు చక్కని పాడియావు**
**హిందువులు లేగదూడలై యేడ్చు చుండ**
**తెల్లవారను గడుసరి గొల్లవారు**
**పితుకుతున్నారు మూతులు బిగియగట్టి"**

ఈ పద్యం సభలోని వారందరిని, ఉత్తేజితుల్ని చేసింది. పత్రికలో ప్రచురితమై ప్రతినోటా మార్మోగింది. తెలుగులో జాతీయోద్యమ సంబంధమైన రచనలలో ఇదే మొదటిదని పరిశోధకులు భావించారు.

స్వాతంత్ర్యోద్యమంలో ఎందరో లాఠీ దెబ్బలను రుచిచూశారు. బూట్ల కాళ్ళతో తన్నినా, తుపాకీ మడమలతో బాదినా, జైలులోకి తోసినా ఎవ్వరూ వెనకంజ వేయలేదు. పైగా ఉద్యమం మరింతగా వ్యాపించింది. లాలాలజపతిరాయ్‌ని జైలులో నిర్బందించినపుడు ఆంధ్రదేశంలో కూడా నిరసన ఉద్యమం పెల్లుబికింది. అపుడు చిలకమర్తి స్పందించి రాసిన పద్యాలలో మణిపూస ఇది.

**"చెరసాలల్ పృధు చంద్రశాలలెయగున్, చేదోయిగీలించున**
**య్యరదండల్ విరిదండలయ్యెడున్, హేయంబైన చోడంబలే**
**పరమాన్నంబగు, మోటు కంబళులు దాల్పన్ పట్టు సెల్లాలగున్**
**స్థిరుడైయే నరుడాత్మ దేశమును భక్తింగొల్చు నవ్వానికిన్"**

ఈ పద్యం ఆవేశంతో పాటు అంకిత స్వభావాన్ని పురికొల్పింది. అలంకారికంగా ఔచిత్యవంతమైన పద్యమిది.

జాతీయోద్యమ కవిత్వ ప్రపంచంలో మంగిపూడి వారి స్థానం మహోన్నతమైనది. ఎదగబోయే ఆయన కవితా హృదయానికి చిహ్నాలు ఈ పద్యాల్లోనే కనిపిస్తాయి.

**"పరతంత్రత సౌఖ్యహరము**
**పరతంత్రత ప్రాణమాన భంగకరంబున్**
**పరతంత్రత బహుహేయము**
**నరకమువలె భరతమాత న్యాయసమేతా।"**

అని గర్జించిన కవి మంగిపూడి

మహాత్ముని ఆస్థాన కవిగా పేరొందిన "తెలుగు లెంక" తుమ్మల సీతారామమూర్తి చౌదరి గారు రాసిన "ఆత్మకథ" 'మహాత్మ కథ' 'ధర్మజ్యోతి', 'ఆత్మార్పణ', కావ్యాలలోనూ, మిగిలిన గేయాలలోనూ, మహాత్ముని ఆదర్శజీవితాన్ని మనకు కళ్ళకు కట్టించారు.

**"గాంధీ యుగమున పుట్టితిని, గాంధీ నడుపు**
**నుద్యమంబుల నలిగితి నోపినంత**
**గాంధీ నీక్షించితిని, గాంధీ కవిత వ్రాయ**
**గంటి నీ జన్మమునకు నీ పంట చాలు"**

అని తమ అపారమైన భక్తిని ప్రకటించారు.

కావ్యాలూ, శతకాలే కాదు గేయాలు, దండకాలు, హరికథలు, కూడా పూజ్య బాపూజీ పై వెలువడి ప్రజలను దేశభక్తులుగా, ఉద్యమశీలురుగా ప్రేరేపించాయి.

**శ్రీ గాంధీనామం – మరువాం మరువాం**
**సిద్ధము జైలుకి – వెరువాం వెరువాం**
**కూడి భరతమాత – గొలుతాం గొలుతాం**
**నేడే రాజ్యాన్ని – తెస్తాం తెస్తాం.**

అంటూ దామరాజు పుండరీకాక్షుడు గారు రాసిన గేయం

**"కొల్లాయి గట్టితేనేమి? మా గాంధీ**
**కోమటై పుట్టితేనేమి?**
**వెన్నపూస మనసు కన్నతల్లి ప్రేమ**
**పండంటి మోముపై బ్రహ్మతేజస్సు"**

అన్న బసవరాజు అప్పారావు గారు గేయం ఆనాడు సంచలనం కలిగించాయి. కొండవల్లి జగన్నాథ దాసుగారు స్త్రీల పాటల బాణీలో రాసిన గేయం ఇలా ఉంది.

**"గాంధీ లాలి మోహన గాంధీ లాలీ**

**కరుణాసాంద్రా మోహనదాస"**

అలాగే కనుపర్తి వరలక్ష్మమ్మ గాంధీ దండకం రచించారు.

మహాత్మగాంధీ పైనే కాకుండా మిగిలిన నాయకులపై కూడా కవిత్వం వెల్లివిరిసింది. కొంత స్మృతి కవిత్వం, మరికొంత స్తుతి కవిత్వం.

**"దేశబంధువనుచు దేశదేశంబున**
**పేరుగాంచెనట్టి భారతీయు**
**పూజ్య చరిత విన్న పుణ్యంబుగావున**
**లజపతీంద్రు వినుడు ప్రజలొకింత"**

అంటూ చెరుకువాడ వెంకట్రామయ్య గాదె జగన్నాథ స్వామి గార్లు లఘుకావ్యం రాశారు.

జాతీయోద్యమ కవిత్వంలో మాతృస్తుతి, దేశసంస్తుతి, ఒక భాగం, దేశాభిమానం కలిగించడానికి దేశ వైభవాన్ని కీర్తించాలి. "జన్మభూమి" అన్న భావం నరనరాల్లో ప్రవహించడానికి ఈ కవిత్వం తోడ్పడింది. ఇందులో పూర్వవైభవ ప్రసక్తి ఉంటుంది. దేశభక్తి ఉండడం అంటే దైవభక్తి ఉండటమే అన్న సందేశం ఉంటుంది.

**"నా మాతృదేశమా! నా ప్రాణ ప్రదము**
**నా నాక లోకమా! నా తపఃఫలము**
**నా ప్రాణములకన్నా నామేని కన్న**
**నతి గాఢముగ నిన్ను నాత్మ ప్రేమించు"**

అంటూ మంగిపూడి 1911లోనే 'భరతమాత' అనే ఖండికను రాశారు. వద్దాది సీతారామాంజనేయ కవి (పూడిపెద్ది కాశీవిశ్వనాథ శాస్త్రితో) రాసిన

**"దండాలు దండాలు – భరతమాత**
**అవి అందుకొని దీవించు – భరతమాత"**

అనే భరతమాత గీతం ప్రజల నాలుకపై చిందులేసింది.

**"ఏదేశమేగినా ఎందుకాలిడినా**
**ఏ పీఠమెక్కిన ఎవ్వరేమనిన**

**పొగడరా నీతల్లి భూమి భారతిని**
**నిలుపరా నీ జాతి నిండుగౌరవము"** అని రాయప్రోలు దేశప్రజలలో దేశభక్తిని రగిలించారు.

**జయభారతావనీ జయలోకపావనీ**
**శాంతి సుఖదాయినీ! జననీ నమస్తే**
**సకల సంపత్ఫనీ! సస్య నందనవనీ!**

వానమామలై వరదాచార్యులు కీర్తించారు.

**"పచ్చి బాలెంతరాలు మా భరతమాత**
**మాతలకు మాత సకల సంపత్సమేత"** అని "జాషువా" అన్నారు

ఈ కవితలు మాతృ దేశాన్ని అరాధించమంటూ జాతీయతత్వాన్ని బోధించాయి.

**"ఓసి జాతీయతా, నీ బలోజ్జ్వలత్వ**
**మెంత నీ శక్తి సామర్థ్య మెంత నీదు**
**శంఖరమునగల యింద్రజాలమెంత॥**
**అస్థి పంజరములు సైతమాడునౌర"**

అంటూ దువ్వూరి రామిరెడ్డి గారు 1928లో వీర ప్రబోధం చేశారు. వేదుల సత్యనారాయణ శాస్త్రి 1835లో "కాంక్ష" అనే ఖండికను రాసి కొత్త చూపును ప్రసరింపచేశారు.

**"నీచపు దాస్యవృత్తి మననేరని శూరత మాతృదేశ సే**
**వాచరణమ్ము నందసువులర్పణ జేసినవారి పార్థివ**
**శ్రీ చెలువారు చోట తదసృగ్రుచులన్ వికసించి వాసనల్**
**వీచుచు రాలిపోవగవలెందుదుదాత్త సమాధి మృత్తికన్"**

అని వేదుల త్యాగ ధనుల యెడల గల అపార గౌరవాన్ని ప్రకటించారు.

కవనరంగం కదనరంగం ఒకటేనని రుజువు చేశారు. కత్తికన్నా కలంమిన్న అని చాటి చెప్పారు.

**"వద్దురా మనకొద్దురా పరిపాలనంబిక వద్దురా**
**హద్దు పద్దూలేని పన్నులు రుద్ది పీల్చునుండెరా**
**మానప్రాణములకు మహమ్మారియై యున్నాడురా**
**దీనయై మనదేశమాత దేవులాడుచునుండెరా వద్దురా"**

అని గరికపాటి మల్లావధాని పిలుపునిచ్చారు.

జాతీయోద్యమంలో జాతీయ పతాక, రాట్నం జైలు వంటివి చాలా ముఖ్యమైనవి. వీటిపై ప్రత్యేకంగా కవితలు వెలువరించి కవులు ఉత్సాహాన్ని చైతన్యాన్ని కలిగించారు.

**"ఎగురవే వినువీధి – ఎగురవే జెండా**
**శాంతి దూతగ నేడు – జాతీయ జెండా"** అని సుంకర నారాయణ గారు అంటే

**"జెండా ఎత్తరా జాతికి ముక్తిర**
**నిండగు శక్తిర – నిల్పర కీర్తి**
**ప్రాణమొండె – అభిమానమొండె మన**
**ప్రాణములైనన్ బలియొసంగి ... మనజెండా యెత్తర'** అని గురుజాడ రాఘవ శర్మగారు అన్నారు.

**"అదిగో మన జయధ్వజం అదుగదుగో భద్రగజం**
**నదించునదో జయహిందని నవయువ సోదర వజ్రం**
**ఇదియే మన జయధ్వజం ఇది మన యాత్మల తేజం**
**ఇదియే మన జాతినిజం ఇది భారత సురభూజం"**

అని వానమామలై వరదాచార్యులు మన జాతి ఔన్నత్యానికి దర్పణమైన జాతీయ పతాక ప్రాశస్త్యాన్ని తెలియజేశారు.

**"జన్మమదేలా జైలుకుపోని 'జన్మమదేలా'**
**ధర్మము తోడును – జన్మభూమికి మన**
**నిర్మల త్యాగము – నొసగనివాని జన్మమదేలా"** అంటూ

జైలు కవితలు రాశారు.

క్విట్ ఇండియా ఉద్యమానికి స్పందించి మన కవులు ఇలా గళమెత్తి స్వతంత్ర్య శంఖం పూరించారు.

**"పరదేశీయులు తొలగండి।**
**ఈ భారతదేశం మాదేశం**
**వినండి వినండి విశ్వప్రజలు"** అని వానమామలై అన్నారు

**"వీర భారత యువకుల్లారా**
**విజయోత్సాహిత మూర్తుల్లారా**
**విన్నారా మన వీరుల చరితం**
**కన్నారా ఆగష్టు విప్లవం"** అని సాంబశివరావు బాబ్జీ ప్రబోధించారు.

**"లేచిపోయినవి పోలీసు టోపీలు**
**వందల వేలు రాబందులట్లు**
**కాలిపోయినవి సర్కారు కచ్చేరీలు**
**ఖరదూషణాదులు కష్టమట్లు"** అని కరుణశ్రీ వివరించారు

తెలుగులో జాతీయోద్యమ కవిత్వం అనగానే గరిమెళ్ళ సత్యనారాయణగారిని ప్రత్యేకంగా స్మరించాల్సి ఉంది. తెల్ల దొరల గుండెల్లో గుబులు పుట్టించిన తెలుగు వారిని జాగృతం చేసిన ఉత్తేజితలూగించిన వీరరస ప్రధానమైన ఆ గేయం ఇది.

**మా కొద్ది తెల్లదొర తనము**
**మా ప్రాణాలు పై పొంచి – మానాలు హరియించె** ॥మాకొద్దీ॥

**పన్నెండు దేశాలు – పండుచున్న గానీ**
**పట్టెడన్నమెలోపమండి**
**ఉప్పు ముట్టుకుంటే దోషమండీ**
**నోట మట్టి కొట్టి పోతారండి** ॥మాకొద్దీ॥

**నూటనలుబదినాల్గు – నాటికి తగిలించి మాటలాడవద్దంటాడు**
**మమ్ము పాట పాడవద్దాంటాడు**
**తనను దాటి వెళ్ళవద్దంటాడు**
**అయ్యో చేటు తెచ్చుకొమ్ము చెడిపోవమంటాడు** ॥మాకొద్దీ॥

అంటూ సాగే సుమారు 120 పంక్తుల గేయంలో తెల్లదొరల అకృత్యాలు, భారతీయుల కడగండ్లు విశదంగా కళ్ళకు కట్టినంటుంటాయి.

త్రిపురనేని రామస్వామి తన గేయ రచనలతో ప్రజలలో జాతీయోద్యమ చైతన్యాన్ని పురికొల్పారు. 1930లో ఉప్పు సత్యాగ్రహ ఉద్యమానికి మద్దతుగా

**"వీరగంధము దెచ్చినారము వీరుడెవ్వడో తెల్పుడీ**
**పూసి పోదుము మెడను వైతును పూలదండలు భక్తితో**

అంటూ సాగిన గేయం జాతీయోద్యమ యోధులకు ఉత్తేజాన్నిచ్చింది.

తెలుగు కవులు జాతీయోద్యమ స్ఫూర్తితో రచించి ప్రజల్లో దేశభక్తిని పాదుకొల్పెలా చేసిన ఈ కవిత్వం ఎప్పుడూ ఆదరణీయమే. నిజానికి ఈ సాహిత్యం స్వాతంత్ర్య చరిత్రకు సాక్ష్యం. వీటిలో చాలా గేయాలు విజ్ఞానప్రదాలు. జాతి మనుగడకు మోక్ష సాధనాలు. ఈ కవితలు ఉత్తమ లక్ష్యాలను అందిస్తాయి.

**<u>ఉపయుక్త గ్రంథసూచి</u>**

1. ఉద్యమ దర్శనం (1990) డా॥ముడిగొండ శివప్రసాద్
2. ఆంధ్రకవిత్వము – గాంధీ తత్త్వము (1980) డా॥ వి.అంకయ్య
3. ఆధునికాంధ్ర కవిత్వము–సంప్రదాయములు– ప్రయోగములు (1989) – డా॥ సి.నారాయణరెడ్డి
4. జాతీయ గీతాలు (1973) –సంపాదకుడు – గురుజాడ రాఘవశర్మ
5. తెలుగు ఉద్యమ గీతాలు – డా॥ ఎస్వీ సత్యనారాయణ
6. తెలుగులో జాతీయోద్యమ కవిత్వం (1982) డా॥ మద్దూరి సుబ్బారెడ్డి.
7. జాగృతి – వారపత్రిక

# తెలుగులో జాతీయోద్యమ నవలలు - గాంధీజీ ప్రభావం

**డా. హరీష్ కుమార్ శ్రీధర,** సహాయ ఆచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కోరుట్ల, జగిత్యాల
చరవాణి : 9491366356, 8919563503

సాహిత్యం సమాజానికి దర్పణం లాంటిది. సామాజికంగా జరుగుతున్న ప్రతి అంశంపై స్పందన ఏదో ఒక రూపంలో వ్యక్తీకరించబడుతుంది. అటువంటి పరిస్థితులలో వస్తువు సామాన్యమే అయినా వివిధ ప్రక్రియలు అదే వస్తువుని ఆశ్రయిస్తాయి. జాతీయోద్యమ కాలంలో 'స్వాతంత్ర్య కాంక్ష' వస్తువుగా తెలుగు సాహిత్యంలో కథలు, కవితలు, ఖండ కావ్యాలు, హరికథలు, నాటకాలు విరివిగా వచ్చాయి. అలాగే నవలలు కూడా.

సాంస్కృతిక పునరుజ్జీవన కాలం తర్వాత తెలుగు నాట విదేశీ రచనల అధ్యయనం ప్రారంభమైంది. క్రమంగా అనేక ప్రక్రియలు సాహిత్యంలోకి వచ్చాయి. అలాంటి ఒకానొక ప్రక్రియ నవల. డా॥ ముదిగంటి సుజాతారెడ్డి గారు తన 'నవలాను శీలనం' పుస్తకంలో నవల బీజాలు ప్రాచీన సాహిత్యంలోనే ఉన్నాయనీ, కథకు విస్తృతరూపమే 'నవల'గా అభిప్రాయపడినారు. ఇకపోతే తెలుగులో వచ్చిన మొదటి నవలను గురించిన చర్చ ఇంకా అలాగే ఉంది. కొక్కొండ గారు 'మహాశ్వేత' అంటే మరికొందరు నరహరి గోపాలకృష్ణమశెట్టి గారు రాసిన 'శ్రీరంగరాజ చరిత్ర'ను గుర్తించారు. మొదలి నాగభూషణ శర్మ, బొడ్డుపాటి వేంకట కుటుంబరావు, ఆచార్య జయధీర్ తిరుమలరావు గారు మరియు ఆరుద్ర తమ 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' కూడా మొదటి నవలగా 'శ్రీరంగరాజ చరిత్ర'నే గుర్తించారు.

మరికొందరు విమర్శకులు అంటే అక్కిరాజు రమాపతిగారు, పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు, ఆర్.ఎస్. సుదర్శనం మొ॥గు వారు కందుకూరి వీరేశలింగం గారు రచించిన "రాజశేఖర చరిత్ర"ను మొదటి నవలగా పేర్కొన్నారు. విమర్శకుల మధ్య ఏకాభిప్రాయం లేకున్నా సమన్వయంగా చెప్పాలంటే 'శ్రీరంగరాజ చరిత్ర' తొలి తెలుగు నవలా ప్రయత్నమని, 'రాజశేఖర చరిత్ర' తొలి తెలుగు నవలగా గుర్తించవచ్చని ఎక్కువ మంది అభిప్రాయం.

**<u>నవలా వికాసదశ :</u>**

తొలి తెలుగు నవల 1872 లోనే వచ్చినప్పటికీ సుమారు 1890 వరకు సాహిత్యంలో నవలా రచన పుంజుకోలేదనే చెప్పుకోవాలి. సత్యవతీ చరిత్ర, సత్యరాజా పూర్వదేశీయాత్రలు, చంద్రమతీ చరిత్ర ఇలా కొన్ని నవలలను కందుకూరి మాత్రమే రచించారు. 1891 లో 'చింతామణి' పత్రికను ప్రారంభించి నవలా పోటీలను నిర్వహించడం ద్వారా నవలా వికాసానికి కందుకూరి బాటలు వేశారు. చిలకమర్తి వంటి రచయితలు నాటకం నుండి నవలవైపు వడివడిగా అడుగులు వేసిన కాలం ఇదే. ఇరవయ్యో శతాబ్దం ప్రారంభం వరకు 'సంఘసంస్కరణ' ప్రధాన వస్తువుగా నవలలు వచ్చాయి.

**<u>జాతీయోద్యమ నవలలు :</u>**

1905 వందేమాతర ఉద్యమం దేశమంతా స్వాతంత్ర్య కాంక్షను పెంచింది. బిపిన్ చంద్రపాల్ గారి రాజమండ్రి పర్యటన అక్కడ చిలకమర్తి గారు చెప్పిన "భరత ఖండంబు చక్కని పాడియావు" పద్యం తెలుగులో జాతీయోద్యమ సాహిత్యానికి

బీజం వేసింది. తెలుగులో విజ్ఞాన చంద్రికామండలి దేశదేశాల చరిత్రలను, స్వాతంత్రోద్యమ చరిత్ర ప్రతులను ఈ మండలి ద్వారా అందించారు. ఇక్కడి నుండే వైవిధ్యమైన వస్తువులతో ప్రధానంగా 'స్వాతంత్ర్యకాంక్ష' వస్తువుగా నవలలు రావటం ప్రారంభమైంది.

చిలకమర్తి గారు పౌరాణికేతివృత్తాలతో నవలలు రాయటం, కొమ్మరాజు గారి హిందూ మహాయుగం, మహమ్మదీయ మహాయుగం, భోగరాజు నారాయణ మూర్తి ఆంధ్రరాష్ట్రము, కేతవరపు వేంకటశాస్త్రి గారి రాయచూరు యుద్ధము మొ॥గు రచనలు వచ్చాయి. బెంగాల్ విభజన వలన బెంగాల్ మీద ఆసక్తి తద్వారా బెంగాలీ నవలల అనువాదం ప్రారంభమైంది. వేంకట పార్వతీశ్వర కవులు బెంగాలీ నవలలను అనువదించారు. కపాలకుండల, ఆనంద మఠం, దుర్గేశ నందిని మొ॥నవి అనువదించబడిన నవలలు. అలాగే 'గోరా' (ఠాగూర్ గారి) కూడా అనువాదమయింది.

ఇదే సమయంలో శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, శివశంకర స్వామి, అక్కిరాజు ఉమాకాన్తం, విశ్వనాథ, వేలూరి శివరామశాస్త్రి ఇలా తదనంతరం పేరెన్నికగన్న ఎందరో రచయితలు తమ రచనావ్యాసంగాన్ని ఉద్ధృతంగా కొనసాగించారు. స్వతంత్ర రచనలుగా కొన్ని హాస్య రచనలు కొన్ని అయితే వ్యంగ్య, అధిక్షేప రచనలు మరికొన్ని. ఈ సందర్భంలో గాంధీజీ సిద్ధాంతాలైన అంటరానితనం నిర్మూలనను ప్రధానంగా చేసుకొని తల్లాప్రగడ సూర్యనారాయణ గారు 'హేలావతి', వేంకట పార్వతీశ్వర కవులు 'మాతృమందిరం' వంటి రచనలు వెలువడ్డాయి.

1920 నుండి భారత స్వాతంత్ర్యోద్యమంలో గాంధీజీ శకం ప్రారంభమైనట్లుగా చెబుతారు. 'సహాయ నిరాకరణోద్యమం' ప్రారంభం నుండి ఆసేతు హిమాచలం స్వాతంత్ర్యోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. సమాజానికి సాహిత్యం ప్రతిబింబం. అందుకే సాహిత్యంలో కూడా గాంధీజీ సిద్ధాంతాల ప్రభావం పడింది. స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా గత సంస్కృతీ, వైభవాలను, సంప్రదాయాలను స్మరించుకోవటం. స్త్రీ స్వేచ్ఛ, మనో విశ్లేషణ మొ॥గు అంశాలు నవలకు వస్తువులుగా మారాయి. ఉన్నవ లక్ష్మీనారాయణ, అడివి బాపిరాజు, నోరి నరసింహశాస్త్రి, కొడవటిగంటి, మొక్కపాటి, గోపీచంద్, బుచ్చిబాబు, జి.వి.కృష్ణారావు మొ॥గు రచయితల రచనలు ఈ వస్తువులతో వెలయించినవే.

ఏ రచయిత ఏ వస్తువుతో రచనను ప్రారంభించినా ఏదో ఒక సందర్భంలో పరతంత్రం వలన జరుగుతున్న హానిని గురించి చెప్పి చైతన్యవంతుల్ని చేసే ప్రయత్నం చేశారు. విశ్వనాథ, అడివి బాపిరాజు, చలం గార్లు నవలా వికాస యుగంలో త్రిమూర్తులుగా చెబుతారు. ముప్పరి ఆదర్శాలు, గమ్యాలు, గమనాలు వేరు. అయినా అద్భుతమైన ప్రతిభతో 'నవల'ను సుసంపన్నం చేశారు. నోరి నరసింహశాస్త్రి వంటి వారు రుద్రమదేవి, ధూర్జటి, నారాయణభట్టు వంటి చారిత్రక నవలల్ని వెలయించారు.

గాంధీజీ ప్రతిపాదించిన సత్యం, అహింస, హరిజనాభ్యుదయం వంటి ఆదర్శాలు ఎందరో సాహితీ వేత్తలకు స్ఫూర్తినిచ్చి వివిధ రూపాల్లో సాహితీ సృజనకు దోహదం చేశాయి. గాంధీ పేరున శతకాలు, దండకాలు, ఖండికలు, గేయాలు, కీర్తనలు, భజనలు ఇలా వివిధ ప్రక్రియలు ... నవల కూడా అందులో చేరింది.

**<u>ఓబయ్య – వేలూరి శివరామ శాస్త్రి :</u>**

వేలూరి శివరామశాస్త్రి గారు రచించిన 'ఓబయ్య' తొలి తెలుగు జాతీయోద్యమ నవలగా గుర్తించవచ్చు. ఈ నవలలో శివరామశాస్త్రి గారు జాతీయోద్యమ ఘట్టాలను అవి సామాన్యులపై చూపుతున్న ప్రభావాన్ని ప్రతిభావంతంగా చూపించారు. ఓబయ్య అసలు పేరు అహోబిలుడు. చదువు సరిగా రాదు. అయినా

తల్లి ప్రోత్సాహంతో చదువుకుంటున్న సమయంలో "సహాయ నిరాకరణోద్యమాని"కి గాంధీజీ గారు పిలుపునివ్వడం, దానిలో విదేశీ విద్యనభ్యసించే పాఠశాలలకు వెళ్ళక పోవడం ఉండటంతో బడిని బహిష్కరించినాడు. "బడిని బహిష్కరించిన వారిలో అహోబిలుడు ఆద్యుడయ్యెను" (2) అతడికి గాంధీజీతో ఏకీభావం.

అహోబిలుడి భార్య పేరు వసుమతి. ఆధునిక సమాజానికి ప్రతీక. చదువుపట్ల అమిత శ్రద్ధ, భక్తి గలది. అహోబిలుడి తల్లికి వసుమతి చదువుకోవడం నచ్చలేదు. అయినా అహోబిలుడు వసుమతి చదువునాపించలేదు. దీన్ని బట్టి స్త్రీల నిరక్షరాస్యత పట్ల రచయిత వ్యతిరేకమని చెప్పాడు. తనతో పాటు చదువుకునే ఇతరులతో చనువుగా ఉంటుందనే నెపంతో అహోబిలుడికి రెండో పెళ్ళి చేయాలని తల్లి భావిస్తుంది. కానీ కుదరలేదు. ఈ సంఘర్షణలో చాదస్తానికి, ఆధునికతల మధ్య వైవిధ్యాన్ని చూపిస్తాడు. ఊరిలో అనుకోకుండా అగ్నిప్రమాదం జరగడం వసుమతి తన స్నేహితుల వద్ద జమ చేసిన చందాను ఊరికి పంపటం గ్రామాభ్యుదయ సిద్ధాంతాల్ని చూపడం వసుమతి, అహోబిలుడు కలిసి ఉండటంతో నవల ముగుస్తుంది.

**<u>మాలపల్లి – ఉన్నవ లక్ష్మీనారాయణ :</u>**

జాతీయోద్యమ స్ఫూర్తితో వచ్చిన నవల 'మాలపల్లి'. రచయిత ఉన్నవ లక్ష్మీనారాయణ "సంగ విజయం" మరోపేరు. ఆర్.ఎస్. సుదర్శనం గారు అన్నట్లు " రాజకీయాల్లో గాంధీజీ గారు ఎంతటి విశిష్ట వ్యక్తో, తెలుగు సాహిత్యంలో మాలపల్లి అలాంటి ఉన్నత నవల" (3) నిజమే అనిపిస్తుంది. ఆధునిక మహేతిహాసం ఇది. తీసుకున్న ఇతివృత్తం, ఎంచుకొన్న భాష, బోధించిన సర్వమానవ సౌభ్రాతృత్వం, మానవతావాదం 'మాలపల్లి'కి 'సార్వకాలీనత'ను సంతరించి పెట్టాయి.

ఉన్నవ వారి అనుభవాలు, విద్వత్తు 'మాలపల్లి'ని అంత గొప్పగా మలచడానికి తోడ్పడినాయి. 'మంగళాపురం' గ్రామంలో రామదాసు కుటుంబం కథ ఈ నవల. రామదాసు భార్య మాలక్ష్మి, కొడుకులు వెంకటదాసు, సంగదాసు, రంగడు (చిన్నవాడు), అరంజోతి (కూతురు) ఇలా నలుగురు సంతానం వితంతువు చెల్లె సుబ్బలక్ష్మి ఆమె కొడుకు అప్పాదాసు, ఇవి ప్రధాన పాత్రలు.

మాదిగ వారిపై దౌర్జన్యంతో కథా ప్రారంభం. రామదాసు చెల్లెపై గడ్డి దొంగతనం నెపంతో కొట్టి చంపడం రామదాసు జీవితంలో మొదటిదెబ్బ. సంగదాసు సంఘ సంస్కరణ కార్యక్రమాలు భూస్వామి చౌదరయ్యకు కంట్లో నలుసైంది. ఆది ఆంధ్రమహాసభ సమావేశం నుండి వస్తూ చౌదరయ్య కొడుకు, సంగదాసు సహపంక్తి భోజనం చేయడం చౌదరయ్యకు నచ్చక ఏదో నెపంతో సంగదాసుని చంపుతాడు. చౌదరయ్య కోపం ఎంతమాత్రమూ తగ్గక పాతబాకీ కథల్ని తోడి రామదాసు కుటుంబాన్ని జైలు పాలు చేస్తాడు. ఈ క్రమంలో ఆరంజోతి మరణం, ఆమె వెంటే అప్పాదాసు ఆత్మార్పణం మన మనసుల్ని కలచివేస్తుంది. వేంకటదాసు జగ్గన్న గా మారడం, మాలక్ష్మి కంటపడటం తర్వాత వారిద్దరి మరణం ఇలా కుటుంబ సభ్యులంతా ఒక్కొక్కరుగా మరణిస్తున్నా రామదాసులో ఎలాంటి చలనమూ లేదు. జైలు నుండి విడుదలవుతాడు. విజయ కళాశాల కులపతి అవుతాడు. రామదాసు యతీంద్రుడు సర్వ సోదర భావాన్ని బోధిస్తూ "అస్తమయ సూర్యుని వలె బ్రహ్మ తేజము"తో ఉండగా కథముగుస్తుంది. (4)

సామాజికంగా అగ్రవర్ణాల ఆచారాలు, అస్పృశ్యత, ఆర్థికంగా భూస్వాములు, పేదల మధ్య సంఘర్షణ, రాజకీయంగా బ్రిటిష్ – ఇండియాల మధ్య ఘర్షణ, మతపరంగా మతాంతరీకరణ వ్యతిరేకత నైతికంగా స్త్రీ పురుషుల మధ్య సంబంధాలను గురించి... ఇలా ఐదు కోణాల్లో 'మాలపల్లిని' రచించారు.

**<u>హరిజన నాయకుడు ఆచార్య యన్.జి.రంగా :</u>**

ఆచార్య ఎన్.జి. రంగా గా ప్రసిద్ధి పొందిన గోగినేని రంగనాయకులు రచించిన నవల హరిజన నాయకుడు. హరిజనాభ్యుదయంలో మతాంతరీకరణలకు వ్యతిరేకంగా ఉంటూ స్వాతంత్రోద్యమంలో పాల్గొనడాన్ని చిత్రీకరిస్తాడు.

వేల్పూర్ గ్రామంలో గంగయ్య గూడెం పెద్ద ఆయన రెండో కుమారుడు లింగయ్య ఎవరో కొట్టగా చనిపోయి మళ్ళీ ముత్తయ్యగా పుడతాడు. ముత్తయ్యే బసవలింగయ్యగా హరిజన నాయకుడిగా ఎదుగుతాడు.

ఆ కాలంలో అన్ని ఊళ్లలో లాగానే ఆ ఊరిలో కూడా హరిజనుల స్థితి అధ్వాన్నంగా ఉంటుంది. ముత్తయ్య బస్తీకి వెళ్ళి చదువుకుంటాడు. ఈ క్రమంలో క్రైస్తవంలోకి మారవలసిందిగా ఒత్తిడి ఉంటుంది. అయినా తాను హిందువుగానే ఉండి హరిజనుల

అభ్యుదయానికి తోడ్పడతానని చెబుతాడు. ఉన్నత విద్యావంతుడౌతాడు. దేశ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఎందరో నాయకులను కలుసుకుంటాడు బసవ లింగయ్య అరుంధతి దేవి అనే క్రిష్టియన్‌ను వివాహం చేసుకుంటాడు. సైమన్ కమీషన్ వ్యతిరేక ఉద్యమంలో భాగంగా నల్ల జెండాల ప్రదర్శనను ఏర్పాటు చేస్తారు. ఆ నిరసనకు బసవలింగయ్య నాయకత్వం వహించాడనే నెపంతో ఒక సంవత్సరం పాటు జైలు శిక్ష విధిస్తారు. బసవ లింగయ్యకు జైలుశిక్ష విధించిన రోజే బయట అభినందనల తీర్మానం చేయడంతో నవల ముగుస్తుంది. (5) అంటే స్వాతంత్ర్యోద్యమకారుల పట్ల పాలకుల వైఖరిని, ప్రజల వైఖరిని అద్భుతంగా వివరించారు.

**వేయి పడగలు – విశ్వనాథ సత్యనారాయణ :**

జాతీయోద్యమ కాలంలో దేశభక్తిని పెంపొందించడంలో ఎంచుకొన్న మౌళిక సూత్రాల్లో ఒకటి గత వైభవ స్మరణ, పునరుద్ధరణ, విశ్వనాథ గారికి సంప్రదాయం మీద మక్కువ ఎక్కువ. అందుకే ప్రాచీన హైందవ సంప్రదాయాల్ని కాపాడటానికి తన వంతు ప్రయత్నం తాను చేయబూనారు. అదే సందర్భంలో జాతీయోద్యమ స్ఫూర్తితో కళాశాలల స్థాపన వంటి అంశాలను ప్రస్తుతించారు. కొందరు తిరోగమన వాదిగా పేర్కొన్నా, విశ్వనాథ గారు శ్రీశ్రీ గారు చెప్పినట్లు ఆంధ్రావారి గోల్డు నిబ్బు.

'వేయిపడగలు' కథ సుబ్బన్నపేట కేంద్రంగా, మూడు తరాలకు సంబంధించిన దీర్ఘకథ. దీనిలో కాలానుగణ మార్పులు, పాత్రల వ్యక్తిత్వాల్లో వచ్చే మార్పులను సందర్భోచితంగా చూపించారు. సందర్భానుగుణంగా అనేక శ్లోకాలు, పాటలు, పద్యాలున్నాయి. ఇదొక సంగ్రహ విజ్ఞాన సర్వస్వం. దీనిలో సంగీతం, నాటకం, నాట్యము, వైద్యము, ధ్యాన యోగము వంటి వాటి వివరాలు అనేకం ఉన్నాయి. (6)

గాంధీజీ ప్రబోధించిన జాతీయవాదంచే ప్రభావితుడైన విశ్వనాథ జాతి ఔన్నత్యాన్ని వివరించడమే కాకుండా ఆనాటి జాతీయోద్యమాన్ని మన కళ్ళకి కట్టేలా వివరించారు. సహాయ నిరాకరణోద్యమం, కారాగార శిక్షలు, జాతీయ కళాశాలల స్థాపన, రాఘవరావు వంటి ఉద్యమకారుల క్రియాపరత్వం ఈ నవలలో వర్ణించబడినాయి. ప్రధానపాత్రధారి అయిన ధర్మరావుకి కూడా దేశాభిమానం ఉండి గాంధేయవాదం ఖద్దరు కట్టడంతో ఆగిపోయినా, అతడి ఊహలు జాతి పునర్నిర్మాణంవైపు సాగాయి.

**నారాయణరావు, కోనంగి, నరుడు – అడివి బాపిరాజు :**

1934 లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహించిన పోటీలో గెలుపొందిన 'నారాయణరావు' నవలలో అడివి బాపిరాజు గారు ఆ కాలపు సాంఘిక, రాజకీయ పరిస్థితులను చక్కగా వివరించారు.

నవలలో ఆద్యంతమూ గాంధేయ వాద సిద్ధాంతాలు చర్చించారు. సత్యాగ్రహ, సహాయ నిరాకరణ, హరిజనాభ్యుదయం, స్త్రీ విద్య మొ॥గు అనేకాంశాలకు నారాయణరావు పాత్రను ప్రతినిధిగా చూపించారు.

"కోనంగి" నవలలో ప్రధానంగా రెండు అంశాలను పూర్తిగా చర్చించారు. మొదటిది కొత్తగా ధనవంతులుగా మారిన వారి జీవితాల్లో ఉన్న మార్పులు కాగా రెండోది కాంగ్రెస్ వంటి ఆనాటి రాజకీయ పార్టీలు – వాటి కార్యకలాపాలు, గాంధీజీ నేతృత్వం వహిస్తున్న స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలు. వీటి ద్వారా 'కోనంగి' పేద వాడి నుండి ధనవంతుడిగా ఎదిగే క్రమం, తర్వాత తాను, తన భార్య స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న విధానం అద్భుతంగా వివరించబడింది.

'నరుడు'లో కూడా హరిజనాభ్యుదయం ప్రధానంగా 'ఎలమంద' పాత్ర అట్టడుగు వర్గం నుండి చదువుకొని ఎదగడం జెన్నిఫర్‌ను పెళ్ళి చేసుకోవడం స్వాతంత్ర్య సముపార్జనకై దంపతులిరువురూ పాటు పడటం వర్ణనీయాలు.

పై మూడు నవలల్లో వేర్వేరు సాంఘిక స్థితులను తీసుకొని జాతీయోద్యమ అంశాలను అంతర్లీనంగా వివరిస్తూ తన ప్రతిభను గొప్పగా ప్రదర్శించారు.

పై నవలలతోపాటుగా అంతటి నరసింహం గారి 'ఆదర్శం' నవలలో కులాంతర వివాహాలు, సామ్యవాదం, 1930 నుండి 1948 వరకు ఉన్న రాజకీయ సామాజిక చిత్రణ ఉంది. అలాగే బుచ్చిబాబు గారి 'చివరకు మిగిలేది' లో కూడా స్వాతంత్రోద్యమ ఘట్టాలతో కొంత భాగం కొనసాగుతుంది.

**ఉపసంహారం :**

పైన చెప్పిన తొమ్మిది నవలలేకాకుండా జాతీయోద్యమ స్ఫూర్తిని గుండెల నిండా నింపుకున్న తెలుగు సాహితీ మూర్తులు తమ రచనల్లో వివిధ ప్రక్రియల్లో వెలయించి జాతీయోద్యమ సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. ❋

జైహింద్

**ఉపయుక్త గ్రంథాలు**

1. సమగ్ర ఆంధ్రసాహిత్యం – ఆరుద్ర
2. ఓబయ్య – భారతి (1932) – సంచిక 3
3. తెలుగు సాహిత్య చరిత్ర – ద్వా.నా.శాస్త్రి
4. మాలపల్లి – ఉన్నవ లక్ష్మీనారాయణ – ద్వితీయ సంపుటి
5. హరిజన నాయకుడు – ఎన్.జి. రంగా
6. తెలుగు సాహిత్య చరిత్ర – ద్వా.నా.శాస్త్రి

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 13 హైదరాబాద్ డిసెంబరు - 2022

# విరాట్ స్వరూపుడు

దామరాజు విశాలాక్షి, విశ్రాంత ఉపాధ్యాయిని, విశాఖపట్టణం, చరవాణి : 9398510499

ఏడు నిలువులఎత్తు ఎదిగి ఎటు వైపు నుండి చూసినా కనిపించే సాహితీమూర్తులు అరుదుగా కనిపిస్తారు. అందులో అగ్రశ్రేణి కవిగా జాషువా గారిని చెప్పవచ్చు. "క్రౌంచ పక్షి బాధకన్న వాల్మీకిలో కరుణ రసం పొంగి పొరలింది, రసముపొంగి పొంగి రామాయణం అయింది'. సామాజిక అసమానతలు నిర్భాగ్య జీవితాలు నిలువునా క్రుంగ దియ్యగా జాషువా గారి కలం కన్నీళ్లు కార్చి కవితలధారలను కురిపించింది. తను అనుభవించిన వేదన చవిచూసిన చేదు అనుభవాలు మనసును దహింప చేస్తూ ఉంటే. మనసు కొలిమిలో కాల్చివన్నె కెక్కిన బంగారంలాంటి వాసిగల రచనలు చేసిరాశిలో వాసిలో గణతికెక్కారు ఘనత పొందారు జాషువా'.

జాషువా గారు అనుభవించిన వేదన ఆయన ఎదుర్కొన్న చేదు అనుభవాలు ఆయన రచనల్లో సాక్షాత్కరిస్తాయి ఆయన రచించినన్ని ఖండకావ్యాలు సాహితీ ప్రక్రియలు ఎవరురచింపలేదేమో. ఆయనకు లభించిన సన్మానాలు సత్కారాలు బిరుదులు ఏ కవికీ లభించలేదేమో'. ఏది ఏమైనా కవిత్వం పట్ల నిబద్ధత పదాల పోహళింపు సామాజిక సమస్యల పట్ల అవగాహనపీడిత తాడిత జనాల పట్ల గల అక్కర ఆయన రచనల్లో ప్రస్ఫుటంగా కనబడతాయి. అన్ని ప్రక్రియలలో ఆరితేరి ఆర్తితో దుఃఖంతో కవిత్వం రాసి అట్టడుగు పొరలలో దాగిన కవిత్వాన్ని తపనతో పైకి తీసి తనదైన బాణీలో కవిత్వాన్ని అందించి ఎందరినో తరింపజేసే జాషువా కేవలం నిమ్న జాతుల పట్ల కాదు. నికృష్ట జీవితం గడుపుతున్న ప్రతి ఒక్కరి కన్నీళ్లు తుడిచి తన కవిత్వంతో ఓదార్చారు.

'శిశువు' నుండి 'స్మశాన' పద్యాలు వరకు వారు రాసిన కవిత్వంలో ఒక విధమైన తాత్వికత గోచరిస్తుంది. ఒక విషయాన్ని అందరూ చెప్పినట్లు కాకుండా విభిన్నంగా వర్ణించడం ఆయన ప్రత్యేకత. స్త్రీల సౌందర్యానికి అంగాంగ వర్ణనలకు పరిమితం అయిన కవిత్వాన్ని అబలలు ఆర్తులు నిరుపేదలు నిర్భాగ్యులు పట్టెడు మెతుకులకు కరువవుతున్న వైనాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించి సమాజంలో రుగ్మతలను అసమానతలను రూపుమాపడానికి విశేష కృషి చేశారు. పక్షులు ప్రదేశాలు మహాత్ములు ఇలావేటినీ వర్ణించడం వదిలిపెట్టలేదు. అందరూ హంసలు, చిలకలచే రాయబారాలు పంపిస్తే జాషువా మాత్రం విభిన్నంగా గబ్బిలం చేత రాయబారం పంపించి ఒక నిర్భాగ్య జీవితాన్ని కళ్లకు కట్టినట్లు చూపెట్టి / సభ్య సమాజం సిగ్గుతో తలవంచుకునే విధంగా చేశారు.

'వాని పాదధూళి సోకిసస్యరమ పండి పులకరిస్తుంది కానీ అతడి గాలి సోకితే కసిరి బుస కొడతాడట. నాలుగు పడగల హైందవ నాగరాజు' అని నాలుగు వర్ణాలవారి దురాగతాలను నిరసించారు. చమత్కారంలోనే చర్నాకోలతో కొట్టినట్లు చెళ్ళుమనిపించిన వారు, సంప్రదాయాన్ని కాకుండా సంప్రదాయం ముసుగులో జరిగే ఛాందస భావాలను తీవ్రంగా ఖండించారు. నిర్భయంగా ఉన్నది ఉన్నట్టుగా మాట్లాడడం జాషువా గారి నైజం. తనపట్ల ఉదారత చూపిన వ్యక్తుల పట్ల వినయంతో శిరస్సు వంచిన వారే, తనను విమర్శించే వారి ఎదుట హిమాలయ పర్వతంలా తల ఎత్తుకొని నిలబడ్డారు. స్వాతంత్రం సౌభాగ్యం జాషువా గారికి చాలా ప్రియమైనవి, జాషువా గారి

**'సగర మాంధాత్రాది షట్చక్రవర్తుల**
**యంకసీమల నిల్చినట్టి సాధ్వి**
**కమలనాభుని వేణుగానసుధాంబుధి**
**మునిగి తేలిన పరిపూతదేహ**
**కాళిదాసాది సత్కవికుమారుల గాంచి**
**కీర్తి గాంచిన పెద్దగేస్తురాలు**
**బుద్ధాది మునిజనంబుల తపంబున**
**మోద బాష్పముల్విడిచిన భక్తురాలు**
**సింధు గంగానదీ జలక్షీరమెపుడు**
**గురిసి బిడ్డల బోషించుకొనుచునున్న**
**పచ్చి బాలెంతరాలు మా భరతమాత**
**మాతలకు మాత సకల సంపత్సమేత'**

అనే పద్యంలో 'పచ్చి బాలెంతరాలు మా భరతమాత మాతలకు మాత సకల సంపత్సమేత' అనే పద్య పాదం భరతమాత పై ఆయనకున్న భక్తి గౌరవాలకు ప్రతీకగా కనబడుతుంది/ దేశ మాతనే పచ్చి బాలెంతరాలుతో పోల్చి స్త్రీ జాతి పట్ల అతనికి ఉన్న స్థిరమైన గౌరవాన్ని చాటుకునే విధానాన్ని తెలియజేస్తుంది. నికృష్ట స్త్రీల జీవితాలను వారు పరిశీలించినంత నిశితంగా ఎవరు పరిశీలించ లేదేమో అని నా భావన వారికి స్త్రీల పట్ల గల అంతులేని నిజమైన సానుభూతిని చాటిచెబుతాయ ఆయన కవిత్వంలో అనాథ అబల అత్యున్నత గౌరవాన్ని పొందారు. తాజ్‌మహల్ గురించి రాసినా క్రీస్తు గురించి రాసినా మహాత్మాగాంధీ గురించి రాసినా వారు బాధగా ద్రవించి మనసు అనే సిరాలో కలం నుంచి కరుణాకర్ధమైన కవితా ఖండికలుగా తీర్చిదిద్దారు.

'గిజిగాడు' అని ఒక చిన్న బంగారు పిచ్చుక కట్టుకున్న గూడును వర్ణించిన తీరు జాషువా గారికి గల ప్రకృతి పరిశీలన వారి శిల్పకళా రసజ్ఞతను మన కళ్లముందు సాక్షాత్కరింప చేస్తాయి. ఆ గిజిగాని గూటిలో అంతఃపురం శిల్పకళా నైపుణ్యం చూసి మొనగాడి దోయ్ అనిన జాషువా గొప్ప మొనగాడు అనిపిస్తుంది.

జాషువా గారి శిశువు పద్యాలు వినిన చదివిన చాలామందికి పసిపిల్లల పట్ల అనంతమైన ఆత్మీయత అనురాగం ఉదయిస్తాయి. అదేవిధంగా లేత ఇల్లాలి నల్లపూసలు మట్టిలో కలిసిపోయి, పారాణి పాదాలు స్మశాన భూమిలో సంచరిస్తూ ఉంటే కంటనీరు పెట్టని మానవుడు ఉన్నాడని అంటే నేను నమ్మను మహారాజైన మామూలు మనిషి అయినా స్మశానంలో అందరు సమానమే. అనే ఒక సునిశిత పరిశీలన సూదంటు రాయిలా హృదయాలకు తగులుతుంది. ఎంతటి పరిశీలన // ఎంతటి వేదన ఎంతటి విజ్ఞత. ప్రతి విషయంలో కూడా ఒకదానితో ఒకటి పోటీ పడి శిల్పసౌందర్యమునకు లోటు రానీయక ఉన్నత స్థానంలో నిలబెట్టడం నిదర్శనము. ఏమి ఈ కవి రచనా చమత్కృతి అనిపించకమానదు..

'ఒక కులం మీద ఓ మతం మీద ద్వేషం కంటే, వారి రచనల్లో సామాజిక దురాచారాల మీద దుమ్మెత్తి పోసే విధానం మూఢాచారాలను ప్రతిఘటించే ఒక ధైర్యం ఒక సంస్కర్త లక్షణాలుగా కనిపిస్తాయి.. ఆయన తన కవిత్వంతో వెన్నెలసృష్టించగలడు. వేడివేడి సెగలు తగిలించగలడు. ఆర్తితో కదిలించగలడు అగ్నిగుండాలలోనికి నెట్టగలడు. అవమానాలను అసమానతలను పరిగణనలోకి తీసుకొని అనుక్షణం రగిలిపోతూ కక్ష సాధింపు చర్యలతో కాలక్షేపం చేయకుండా విశాల విశ్వం ఏర్పడాలని ఉదాత్త భావనతో,' విశ్వనరుడ'నని ప్రకటించుకుని ప్రఖ్యాతి గాంచారు. జాషువా ఆర్తుల దీనులు అతివల అబలల ఆకలి దుఃఖం వేదన విలాపం వంటి వాటిని కవితా వస్తువులుగా తీసుకొని సాహితీ క్షేత్రాన్ని సుసంపన్నం చేశారు జాషువా.

జాషువ చమత్కారాలకి పెట్టింది పేరు. ఆ రోజుల్లో జంట కవులుగా అవధానం చేయడం ఒక ప్రత్యేకత. రచయిత ప్రతిభకు నిదర్శనం కూడా. తిరుపతి వెంకట కవులు కొప్పరపు కవులు ఇలా ఎందరో అవధానాలు చేశారు. జాషువా గారు కూడా దీపాల పిచ్చయ్య శాస్త్రి గారి తో కలిసి కొన్ని అవధానాలు చేశారట. తర్వాత విరమించుకున్నారు. ఎవరో పాత్రికేయులు అడిగారట. అదేమిటి /ఆయన శాస్త్రి. మీరు జాషువా వారికులం చూసి ఈ అవధానాలు చేయడం విరమించుకున్నారా ? అన్నారట. జాషువా గారు ఏ మాత్రం ఆలోచించకుండా, అదేమీ కాదు వారితో అవధానాలు చేసే విధానం బాగానే ఉంది. ఆయన శాస్త్రి అని నాకు ముందే తెలుసు. కానీ మా పేర్లే కుదరడం లేదు. ఎలా చూసినా ఈ అవధానాల వల్ల నాకే పిచ్చి వస్తోంది. అని ఒక పద్యం చెప్పారుట. ఆయన పేరు దీపాల పిచ్చయ్య శాస్త్రి నా పేరు గుర్రం జాషువా.' నా పేరు ముందు చెప్పిన పాపంబది ఏమో జాషువా పిచ్చి. నా పేరు వెనక పెట్టిన శాపంబది ఏమో, పిచ్చి జాషువా యగునని 'ఏ విధంగా చూసినా జాషువా పిచ్చి వస్తా ఉంది అని నిర్ణయించుకున్నాను. అందుకే విరమించుకున్నాను అని చెప్పారట.

జాషువా గొప్ప ఆత్మాభిమానం కలవారు ఒక పురస్కారం ఇచ్చినప్పుడు ఎవరో అడిగితే విశ్వనాథవారు వారు గుర్రాన్ని గాడిదను ఒకే రాటకు కట్టేసారు అని తను ఆత్మస్తుతి చేసుకున్నారు. అదే జాషువా గారిని అడిగితే ఆ మాట నిజమే. నేను గుర్రాన్ని కదా. ఆయనను నన్ను కలిపి ఒక రాటకు కట్టారు అని వ్యంగ్యంగా సమాధానమిచ్చారుట. చెప్పదలుచుకున్నది ఏదో ఎంతటివారితోనైనా స్పష్టంగా సూటిగా నిక్కచ్చిగా నిజాయితీగా చెప్పేవారు. జాషువా సంస్కరణ అభిలాషి.. ఆయన తను ద్వేషించే వారికి కవిత్వంతోనే సమాధానం చెప్పేవారు. అంతేగాని పెద్దవాళ్ళ వద్ద తన ఆధిక్యం ప్రదర్శింపలేదు.

అభివృద్ధి చెందడానికి అందరికంటే ఉన్నత స్థానంలో ఉండడానికి జీవితాంతం పోరాడాడు. ఆత్మగౌరవంతో తల ఎత్తుకొని ఉన్నతంగా నిలబడ్డారు, తనను విమర్శించిన వారి పై కక్షతో అందరినీ బాధపెట్టలేదు. తాను బాధ పడలేదు. ఆయన అంధ విశ్వాసాలతో పోరాడాడు గాని కులమతాలతో కాదు. ఆయన స్వతంత్రుడు సహజకవి. చల్లపల్లి వెంకట శాస్త్రి గారి వంటి మహానుభావుడు తన ఎడమ కాలిని పట్టుకొని గండపెండేరము తొడుగుతూ ఉంటే ఇది నాలో ఉన్న సరస్వతీదేవికి ఆయన చేస్తున్నసన్మానం అని సంతోషించారు గాని గర్వించలేదు. ఆ మహానుభావునికి శిరస్సువంచి ప్రణమిల్లారు. అదే చల్లపల్లి వెంకట శాస్త్రి గారికి ఆంధ్ర ప్రదేశ్ ఆస్థాన కవిగా పదవి వచ్చినప్పుడు అసూయ పడకుండా ఆయనపై అద్భుతమైన కవిత్వాన్ని చెప్పారు. అమ్మజాషువా' వరివెన్నువంగి ఉంటుంది గంటి వెన్ను నిలువుగా ఉంటుంది' అనే సామెత. వినయం గల వారిని చూసి మన పెద్దలుఅంటారు. అంత విలువైన మనిషి అయినా ఒదిగి ఉన్నాడు కాబట్టే జాషువా గారు అనేక ఉన్నత బిరుదులు సన్మానాలు పురస్కారాలు పొందారు. ఆయనకు అభాగ్య ప్రజల పట్ల పక్షపాత వైఖరి ఉన్నట్లు కవిత్వంలో చెప్పారు .. గాని కేవలం అగ్రవర్ణాలను అధిక్షేపించడం కోసం అధికారంలో ఉన్న వారిని అణగదొక్కడం కోసం తన పాండిత్యాన్ని ఉపయోగించలేదు ..

తన కవిత్వంతో కన్నీళ్లు తెప్పించారు. కన్నీళ్లు తుడిచారు. కళ్ళు తెరిపించారు . కామాంధులకు ధన అంధులకు బుద్ధి చెప్పారు. కల్లోల సమాజాల కుళ్ళు కడగడానికి ప్రయత్నించారు. కళాప్రపూర్ణ పద్మవిభూషణ్ అయినా ఆయన పసి పిల్లల మనస్తత్వం కూడా పరిశీలించి పరిశోధించి కవిత్వం రాశారు. నూతన పద ప్రయోగాలు చేశారు. తనకు చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి గారు గండపెండేరం కాలికి వేసినప్పుడు చెళ్ళపిళ్ళ సుప్రసిద్ధుడు ఆంధ్రుల శుభరత్న నాళముల రూపము నెత్తిన బ్రాహ్మణుడు నా పలుకుల రాణీ పాదముములు బంగారు గగ్గేరతో అలంకరించారని చెప్పారు.

ఆయన కవిత్వంలోని శబ్దాలు గుండెలను తాకుతాయి. ఆయన కవిత్వం అనే ఆయుధంతో సమాజంలో ఉండే దురాచారాలపై తిరుగుబాటు చేశారు. సాంఘిక దురాచారాలను సమూలంగా నాశనం చేయాలని కవిత్వాన్ని ఆయుధంగాచేసుకున్నారు. తెలుగు ప్రజల మనసుల కవితావిశారద, కవికోకిల, నవయుగ కవిచక్రవర్తివారు కళాప్రపూర్ణ పద్మ విభూషణ్ గుర్రం జాషువా గారు. ఆయన కవిత్వం విలక్షణం. అజరామరం అమృతతుల్యం అక్షర సత్యం అనితరసాధ్యం దోపిడి వర్గాలపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన విప్లవకవి. ఆయన మాటల్లో చెప్పాలంటే ఆయనకి ఇద్దరు గురువులు. ఒకరు అస్పృశ్యత. ఒకరు అసమానత. కవిత్వం

ప్రవాసిజీవితం వెన్నెలదారిలో నడిపించుకున్నారు. విభిన్న కులాలకు చెందిన తల్లిదండ్రులకు జన్మించిన జాషువా అనేక అవమానాలకు గురయ్యారు. కులపరంగా జాతిపరంగా వ్యక్తిపరంగా సంక్రమించిన వారసత్వ సంపదలైన సమస్యలను కవిత్వమయంచేశారు. సంగీత జ్ఞానం గల చక్కని కవి పద్యాలు పాడడానికి అనువుగా ఉంటూనే పాండిత్య ప్రకర్ష తెలియ చేశాయి. తన జీవితాన్ని అందమైన గిజిగాని గూడుగా నిర్మించుకున్న కవి. జీవితం తీర్చిదిద్దుకున్న అందమైన గొప్ప శిల్పి. బంగారు పిచ్చుకను గిజిగాడా గొప్ప మొగాడివోయి ఈ అన్నట్లు ఆయన కూడామొనగాడే. జీవితాన్ని గెలిచి నిలిచి చూపెట్టారు/ రాయలేదు కవిత్వంలో శిల్పాలు చెక్కినారు . కవిత్వంలో శిల్పంతీర్చిదిద్దిన ఒక ప్రసిద్ధ శిల్పి. ఆయన చేతిలో కవిత్వం శిలలా మలచబడింది.

గిజిగాడి గూడు లో అంతఃపుర వర్ణన ఎలా చేస్తారో, గబ్బిలంలో ఒక పేద నిరుపేద కుటీరాన్ని దైన్య స్థితిలో గల గుడిసె అదేవిధంగా చూపెట్టగలిగారు. తల్లి వేదన కన్నీరు, తన కవిత్వంలో చిత్రీకరించారు. ఉపాధ్యాయుడు,ఆయనగొప్ప రచయిత ఒక కవి, వ్యాఖ్యాత, నాటక ప్రయోక్త, ఒక శాసన సభ్యులు, చిరు ఉద్యోగి నుండి ఉన్నత ఉద్యోగం వరకు అనేక ఉద్యోగాలలో చేరి లోతుపాతులు చూశారు. జీవితం పూలబాట కాదు ముళ్ళపాన్పు కాదు' అని నిజీవిత సత్యాన్ని వెల్లడి చేసి భావితరాల కోసం బాటలు వేసి మాతృభాష అందాలను ఆస్వాదించి ఆస్వాదింప జేసి మహా నిష్క్రమణ చెందిన మరపురాని మనిషి జాషువా గారు. వారు చెప్పినట్లు 'కవిగా మరణించి గగనం ఎక్కారు' అక్కడ నుండి కాంతులు వెదజల్లుతూ ఉన్నారు.. ఆ ప్రాతఃస్మరణీయునికి వందనాలు అభినందన సుమచందనాలు. ❁

# ఆంధ్రప్రదేశ్‌లో జాతీయోద్యమ స్ఫూర్తి

**డా. సముద్రాల ప్రిస్కిల్ల,** సహాయ ఆచార్యులు, తెలుగుశాఖ, ప్రభుత్వ కళాశాల, రాజమండ్రి, చరవాణి : 7075091195

**ఉపోద్ఘాతం :**

భారతదేశంలో స్వాతంత్ర్యోద్యమాకాంక్షతో జాతీయోద్యమాలు చాలా జరిగాయి. 1885లో (INC) ఇండియన్ నేషనల్ కాంగ్రెసు ఏర్పడ్డాక అహింసాయుత పద్ధతిలో 1885-1905 వరకు మితవాదుల ద్వారా, 1919 వరకు అతివాదుల ద్వారా సాయుధ పోరాటంతోనూ, ఆ తరువాత గాంధియుగంలో సత్యాగ్రహరూపంలో జాతీయోద్యమం సాగి 1947లో స్వాతంత్ర్యం పొందేందుకు తత్కారణమయ్యింది.

**భారత దేశంలో జాతీయోద్యమ స్ఫూర్తి :**

భారత దేశంలో జాతీయోద్యమ స్ఫూర్తితో 1905 నాటికి స్వదేశీ ఉద్యమం, 1916 నాటికి హోంరూల్ లీగ్, 1917 నాటికి చంపారన్ సత్యాగ్రహం, ఖేదా సత్యాగ్రహం, 1920 నాటికి కిలాఫత్ నాన్‌కోపరేషన్ మూమెంటు, 1930 నాటికి సివిల్ డిసొబీడియంట్ మూమెంటు, 1942 నాటికి క్విట్టిండియా మూమెంట్లు జరిగాయి.

**ఆంధ్రప్రదేశ్‌లో జాతీయోద్యమ స్ఫూర్తి :**

ఆంధ్రప్రదేశ్‌లో జాతీయోద్యమ స్ఫూర్తిని గమనిస్తే మితవాదయుగంలో పార్ధసారథి నాయుడు అధ్యక్షతలో ఆంధ్రప్రకాశిక అనే రాజకీయ వారపత్రిక రావడం, 1891లో తొలి తెలుగు వ్యక్తిగా పి.ఆనందాచార్యులు నాగ్‌పూర్ కాంగ్రెసు సమావేశానికి అధ్యక్షత వహించడం, న్యాపతి సుబ్బారావు INC కి కార్యదర్శిగా ఉండడం, 1902లో కొండా వెంకటప్పయ్య కృష్ణాపత్రిక స్థాపన వంటి సంఘటనలు కార్యచరణలు కనిపిస్తున్నాయి.

అతి వాదయుగంలో వందేమాతరోద్యమ కాలంలో రాజమండ్రిలో బాలభారత్ సమితి ఏర్పడ్డం జరిగింది. బిపిన్ చంద్రపాల్ వందేమాతరోద్యమాన్నీ ఆంధ్రలో ప్రచారం చేయగా చిలకమర్తి లక్ష్మీ నరసింహం "భరత ఖండంబు చక్కని పాడి ఆవు" పద్యం ఆలపించారు. రాజమండ్రికళాశాల సంఘటనలో గాడిచర్ల హరిసర్వోత్తమరావు ఉద్యోగానికి అనర్హులుగా ప్రకటించారు. కాకినాడలో కొట్లాట కేసు జరిగింది. కోటప్పకొండ సంఘటనలో చిన్నపరెడ్డిని ఉరి తీశారు. హోంరూల్ ఉద్యమకాలంలో గాడిచర్ల హరిసర్వోత్తమరావు ఆంధ్రప్రాంతం నుండి కూడా ఈ ఉద్యమం నడిపించారు. 1918లో ప్రత్యేక ఆంధ్రసర్కిల్ ఏర్పాటు అయింది.

గాంధీయుగంలో సహాయనిరాకరణోద్యమ కాలంలో ఆంధ్రలో చీరాల -పేరాల ఉద్యమంలో దుగ్గిరాల గోపాల కృష్ణయ్య నాయకత్వంలో రామదండు వాలంటీర్ దళాన్ని ఏర్పాటు చేసినారు. పెదనందిపాడు పన్నుల నిరాకరణోద్యమంలో పర్వతనేని వీరయ్య చౌదరి నాయకత్వంలో శాంతిసేన అనే వాలంటీర్ దళాన్ని ఏర్పాటు చేసినారు. పుల్లరి సత్యాగ్రహంలోను నిర్వహించిన కన్నెగంటి హనుమంతును ఆంగ్లేయులు 1921లో మంచాల పాడు దగ్గర కాల్చి చంపారు. ఈ సంఘటనలన్నీ జాతీయోద్యమంలో

స్వాతంత్ర్యం కోసం జరిగాయి. రంప విప్లవంలో అడవి జీవనం సాగించేవారిపై అణచివేత విధానాలకు వ్యతిరేకంగా 1921–22లో అల్లూరి సీతారామరాజు గంటందొర, మలుదొర లాంటి అనుచరులతో పోరాడుతూ చింతపల్లి పోలీస్‌స్టేషన్‌పై దాడి చేశాడు. 1923లో స్వరాజ్యపార్టీలో ఆంధ్ర తరపు నుండి వి.వి.రామదాసు అధ్యక్షుడిగా ఉన్నవలక్ష్మీ నారాయణ కార్యదర్శిగా పని చేశారు.

సైమన్ కమిషన్ వ్యతిరేకోద్యమానికి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు నాయకత్వం వహించారు. ఉప్పు సత్యాగ్రహం జరిగే సమయంలో 24 రోజులు 375కిలోమీటర్లు జరిగిన యాత్రలో పాల్గొన్న "యేర్నేని సుబ్రహ్మణ్యం" ఏకైక ఆంధ్రుడు. 1930లో తూర్పు గోదావరి జిల్లాలో చొల్లంగి సత్యాగ్రహాన్ని దువ్వూరి సుబ్బమ్మ, బులుసు సాంబమూర్తి, తెన్నేటి విశ్వనాథం ప్రారంభించారు. కొండా వెంకటప్పయ్య నాయకత్వం వహించి ఆంధ్ర సహాయ నిరాకరణోద్యమాన్ని నడిపించారు.

క్విట్ ఇండియా ఉద్యమనినాదానికి "డూ ఆర్‌డై" ని కూడా ఆంధ్ర సర్క్యులర్ (కర్నూలు సర్క్యులర్) ఏర్పాటు అయ్యింది. తెనాలి, చీరాల, బాపట్ల, గుంటూరు, భీమవరం, పాలకొల్లు, మచిలీపట్నం, ప్రాంతాల్లో హింసాత్మక సంఘటనలు జరిగాయి. ఇన్ని జాతీయోద్యమాల నేపథ్యంతో 1947లో స్వాతంత్ర్యం ప్రకటితమైనది.

**తెలుగు సాహిత్యంలో జాతీయోద్యమ ప్రభావం :**

జాతీయోద్యమ స్ఫూర్తితో బిపిన్ చంద్రపాల్ దక్షిణ భారతదేశంలో ప్రేరణాత్మక ప్రసంగాలు చేసి ప్రజలను ఉత్తేజం చేసే సమయంలో ప్రముఖ కవి చిలకమర్తి లక్ష్మీనరసింహం బ్రిటిష్ ప్రభుత్వం చేసే దురాగతాలను ఎత్తి చూపి భారతదేశం యొక్క గొప్పదనము వివరించాడు. భరతమాత పాడి ఆవు అని, భారతీయ సంపద పాడిగానూ, హిందువులను లేగలుగానూ, భారతీయుల కష్టాలు లేగదూడల ఏడ్పుగానూ, ఆంగ్లేయుల కాఠిన్యం గడుసరి గొల్లవానిగానూ, మూతులు బిగియగట్టి అంటే ఇంకా స్వాతంత్ర్య రాలేదని, భారతదేశ దుస్థితిని వివరించారు.

**ఉదా:** **"భరత ఖండంబు చక్కని పాడియావు**
**హిందువులు లేగదూడలై ఏడ్చుచుండ**
**తెల్లవారను గడుసరి గొల్లవారు**
**పితుకుచున్నారు మూతులు బిగియగట్టి.**

గురజాడ అప్పారావు "దేశభక్తి" ఖండిక ద్వారా జాతీయ దృక్పథాన్ని, విశ్వ మానవ సౌభ్రాతృత్వాన్ని తెలియజేశాడు. దేశంపై అభిమానం మాకుంది అంటూ వొట్టి గొప్పలు చెప్పకుండా దేశం తరపున నిల్చి మేలు చేయమని కోరాడు.

**"దేశాభిమానం నాకు కద్దని**
**వొట్టిగొప్పలు చెప్పుకోకోయ్**
**కూడి ఏదైనాను**
**గట్టిమేల్ తలపెట్టవోయ్"**

రాయప్రోలు సుబ్బారావు తొలిసారిగా "తెలుగు తల్లి" పదాన్ని ఉపయోగించారు. ప్రబోధం అనే ఖండికలో 1914లో ఆంధ్రులు జాతీయోద్యమంలో సమైక్యతతో పోరాడాలని

**"ఏదేశమేగినా ఎందుకాలిడినా**
**ఏపీఠమెక్కినా ఎవ్వరెదురైనా**
**పొగడరా నీ తల్లి భూమి భారతిని**
**నిలుపరా నీ జాతి నిండు గౌరవము..."**

గరిమెళ్ళ సత్యనారాయణ "మా కొద్దీ తెల్లదొరతనం" గేయంలో తెల్లవారిని నిరసిస్తూ ప్రజలను ప్రబోధిస్తూ, తెల్లవారి దురాగతాలను ఎండగడుతూ రాయడం అటు ప్రజల్లో ప్రసిద్ధి ఇటు గాంధీజీ మెప్పు కూడా పొందింది.

ఇంకా విశ్వనాథ వారి "ఆంధ్రప్రశస్తి, ఆంధ్రపౌరుషం", జాషువా 'భరతమాత' ఖండిక, కరుణ శ్రీ, జంధ్యాల పాపయ్య శాస్త్రి యొక్క 'విజయ శ్రీ' కావ్యం, కొడాలి వారి 'హంపి క్షేత్రం', వేదుల వారి 'కాంక్ష' వంటి రచనల్లో దేశభక్తి, ఆంధ్రాభిమానం, స్వాతంత్ర్యాకాంక్ష, ఆంగ్లేయుల దురాగతాలు, ఆంధ్రయొక్క గతవైభవస్ఫూర్తి త్యాగధనుల ప్రశంసలు ప్రతిఫలిస్తాయి. ఈ విధంగా ఆంధ్రప్రాంతంలోనూ, సాహిత్యంలోనూ జాతీయోద్యమ స్ఫూర్తి ప్రభావం కన్పిస్తుంది.

**ఆధారాలు :**

1. భారతదేశ జాతీయోద్యమం – దేశ విభజన, స్వాతంత్ర్య 1939–47, నవంబర్ 24, 2021

2. జాతీయోద్యమం : సాక్షి; జనవరి 2016

3. జాతీయోద్యమాన్ని ప్రదీప్తం చేసిన తెలుగు కవులు; 30 మే2022

4. ఆంధ్రాలో జాతీయోద్యమం; 31-1-2021; ఈనాడు

5. జాతీయోద్యమ కవిత్వం; ఎం.మహేశ్వరనాయుడు, 28-12-2021 ఈనాడు

# నిషేధిత జాతీయోద్యమ సాహిత్యం - నేపథ్యం

**డా. టి. జాన్ కిరణ్ బాబు,** అకడెమిక్ ఆఫీసర్, కళాశాల విద్య కమీషనర్ వారి కార్యాలయం, విజయవాడ, ఆం.ప్ర.
చరవాణి : 9440382140, 9182324062

గ్రంథదహన, గ్రంథనిషేధ సంస్కృతి సాహిత్యక్షేత్రానికి చిరపరచితమైనదే. రాజకీయ కారణాల దృష్ట్యా, మత కారణాల దృష్ట్యా ఆయా కాలాల్లో, ఆయా దేశాల్లో సాహిత్య, మత గ్రంథాలను బహిష్కరించడం, దహనంచేయడం, నిషేధించడం వంటి చర్యలు అనాదికాలంగా అడపాదడపా జరిగినట్లు చరిత్రలో లిఖితమైన విభిన్న కథనాలు రుజువుచేస్తున్నాయి. తెలుగుగడ్డపై సైతం శివకవులయుగమైన 12వ శతాబ్దిలో శైవ-వైష్ణవ మతకలహాలలో గ్రంథదహనాలకు పాల్పడినట్లు, తద్వారా అమూల్యమైన తెలుగువారి చరిత్ర, శాస్త్రవైజ్ఞానిక వారసత్వసంపద ఎంతో కాలగర్భంలో కలిసిపోయి పూడ్చుకోలేనినష్టం సంభవించినట్లు చరిత్రకారులు ఘోషించారు. బమ్మెరపోతన ఆంధ్రమహాభాగవతాన్ని తనకు అంకితంచేయలేదన్న ఆగ్రహంతో రగిలిపోయిన సర్వజ్ఞసింగ భూపాల చక్రవర్తి ఆ గ్రంథాన్ని భూస్థాపితంచేయదలిచి పాతిపెట్టించగా చివరిస్కంధాలు ధ్వంసమైపోతే ఆయన శిష్యులు వాటిని పూరించారని కూడా పలురకాల ఐతిహ్యాలు వెల్లడిస్తున్నాయి. ప్రాచీనకాలంలో ఇటువంటి దుర్ఘటనలు ఎప్పుడో ఒకసారి ఎక్కడో ఒకచోట జరినట్లు వినవస్తుండేవి. అయితే పాశ్చాత్యుల దురాక్రమణ, జాతీయోద్యమతీవ్రత ఆంగ్లేయపాలకుల చట్టాలు ఈ నిషేధపరంపరను నిరంకుశంగా మితిలేకుండా కొనసాగించాయి.

జాతీయోద్యమం ముమ్మరంగా జరుగుతున్న కాలంలో కలంపట్టిన ప్రతీ పౌరుడూ తనవంతు కర్తవ్యంగా జాతీయోద్యమ స్ఫూర్తిని నాలుగు చెరగులా వ్యాపింపజేయడానికీ, ప్రతీభారతీయుడి గుండెల్లో చైతన్యం రగిలించడానికి చిత్తశుద్ధితో విభిన్న రూపాలలో ప్రయోగాలకు పూనుకున్నారు. ఆ ప్రయత్నంలో భాగంగా మేధావివర్గం మొదలుకొని అతిసామాన్యుడివరకూ చేరుకోగలిగే రీతిలో పాటలు, పద్యాలు, వ్యాసాలు, నాటకాలు, నవలలు, హరికథలు, బుర్రకథలు కోకొల్లలుగా వెలువడ్డాయి. చాపక్రింద నీరులా ప్రారంభమైన ఈ ప్రయత్నాలు వెల్లువలా వ్యాపించి లింగ వర్గ వయోభేదాలకతీతంగా స్వతంత్ర పోరాట యోధులు బ్రిటిష్ పాలకులపై విరుచుకుపడడం ప్రారంభమైంది. ఉద్యమతీవ్రతకు అప్రమత్తమైన ఆంగ్ల ప్రభుత్వం అప్పటికే అమలులో ఉన్న పలుచట్టాలను సవరిస్తూ, కొత్తచట్టాలను తయారుచేసి ప్రజావాణిపై ఉక్కుపాదం మోపడానికి విశ్వప్రయత్నాలు చేసింది. 1782లో బెంగాల్ గవర్నర్ వారన్ హేస్టింగ్స్ను విమర్శించిన కారణంగా బెంగాలెగెజిట్పత్రిక మూతపడింది. భారతదేశంలోని పత్రికల పరిస్థితిని అంచనా వేసే బాధ్యతను సర్ థామస్ మన్రోకి అప్పగించగా ఆంగ్లపత్రికలవల్ల ప్రమాదమేమీ లేకపోయినా స్థానిక భాషాపత్రికలవల్ల పెనుముప్పు పొంచివుంది కాబట్టి సెన్సార్ కొనసాగాలని బ్రిటిష్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ఆధారంగా రెగ్యులేషన్ ఆఫ్ యాక్ట్- 1823 చట్టం చేయబడింది. బ్రిటిష్ ప్రభుత్వం యిచ్చే లైసెన్సులేకుండా ఏ పత్రికనూ స్థాపించరాదనీ, ప్రచురించబడిన పత్రికలు, పుస్తకాలు ప్రభుత్వానికి దఖలు పరుచుకోవాలని ఈ చట్టం ఆదేశించిన నాటి నుండి 1823-35 మధ్యకాలమలో భారతీయ పత్రికలపై కఠినమైన ఆంక్షలు కొనసాగాయి. 1835లో గవర్నర్ జనరల్గా నియమితుడైన చార్లెస్ మెట్కాఫ్ పత్రికా స్వేఛను ప్రతిపాదించగా, అతని చర్యను ఖండిస్తూ బ్రిటిష్ ప్రభుత్వం అతన్ని వెనక్కి పిలిపించింది. 1835-57 మధ్యకాలంలో కొంతమట్టుకు స్వేచ్ఛను అనుభవించిన భారతీయ పత్రికలు సిపాయిల తిరుగుబాటుతో మళ్ళీ గడ్డుకాలాన్ని ఎదుర్కొన్నాయి. ఆ తర్వాత కొంతకాలం పాటు తాత్కాలికంగా ఆంక్షలు సడలింపబడినప్పటికీ అదంతా మూణ్ణాళ్ళముచ్చట వ్యవహారమైపోయింది.

ఆపై 1878లో లార్డ్ లిట్టన్ ప్రవేశపెట్టిన ప్రాంతీయభాషా పత్రికలచట్టం గాగింగ్యాక్ట్ (నోరు నొక్కేచట్టం)గా వినుతికెక్కింది. దీని ద్వారా ఈ చట్టం ప్రభుత్వాన్ని విమర్శించి రాసే పత్రికల యజమానులు ప్రభుత్వానికి ధరావతులు చెల్లించడం, ఆ పత్రికలకుచెందిన ఆస్తులను స్వాదీనం చేసుకునే హక్కును ప్రభుత్వానికి భుక్తం చేసింది. 1882లో లార్డ్ రిప్పన్ ఈ చట్టాన్ని రద్దుచేసి పత్రికలకు స్వేచ్ఛ కల్పించగా, బెంగాల్ విభజన కారణంగా పెల్లుబికిన వందేమాతర ఉద్యమ కాలంలో న్యూస్ పేపర్ చట్టం (1908) తెరమీదికి వచ్చి యుగాంతర్, సంధ్య, వందేమాతరం వంటి పత్రికల్ని రద్దుచేసింది. తదుపరి 1910లో వచ్చిన ఇండియన్ ప్రెస్ చట్టం కొత్తగా ఆబ్జెక్షనల్ మాటర్ అనే మాటను నిర్వచిస్తూ పత్రికలు చెల్లించవలసిన ధరావతును పెంచింది. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో నిర్దాక్షిణ్యంగా అమలుచేయబడిన ఈ చట్టం పరిధిలో 350 పత్రికలు శిక్షించబడగా, 300 పత్రికలనుండి 40,000 పౌండ్లు వసూలు చేయబడ్డాయి. అటుతరువాత 1930లో వచ్చిన ఇండియన్ ప్రెస్ ఆర్డినెన్స్ యాక్ట్ 'అఫెన్స్' అనే పదానికి విస్తృతార్థాన్నిచ్చింది. శాసనోల్లంఘన ఉద్యమాలకు సంబంధించిన పత్రికల పాత్ర మీద దెబ్బతీయడానికి 1931లో ఇండియన్ ప్రెస్ చట్టం చేయబడింది. ప్రభుత్వ వ్యతిరేక వార్తలు ప్రచురించినందుకు చెల్లించే జరిమానాను పెంచుతూ, ఆ పత్రికను నిలిపివేసే మరియు స్వాధీనం చేసుకునే అధికారాన్ని రాష్ట్రప్రభుత్వాలకు కట్టబెట్టింది. భారతదేశ సరిహద్దు దేశాలపట్ల బ్రిటిష్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను కొన్ని పత్రికలు విమర్శిస్తుండడంతో బ్రిటిష్ ఇండియా ప్రభుత్వానికీ-విదేశీ ప్రభుత్వాలకు మధ్య విభేదాలు సృష్టించే వార్తల ప్రచురణను రద్దుచేస్తూ 1932లో విదేశీ సంబంధాల చట్టం చేయబడింది. బ్రిటిషిండియాలోని పత్రిలకు స్వదేశీ సంస్థాన ప్రభుత్వాలను విమర్శించరాదని ఆదేశిస్తూ 1934లో స్వదేశీ సంస్థానాలచట్టం అమలులోకి వచ్చింది. ఆనాడు ఉప్పెనలా విరుచుకుపడుతున్న జాతీయోద్యమ సాహిత్యాన్ని నిర్దాక్షిణ్యంగా తొక్కిపెట్టడానికి, ఉరకలెత్తుతున్న కలాలను నిలువరించడానికి, నిప్పులు చెరుగుతున్న గళాలను నులిమేయడానికి ఈ చట్టాలన్నీ మూకుమ్మడిగా నిరంకుశంగా రచయితలపై, కళాకారులపై, పాఠకులపై కొరడా ఝుళిపించాయి. అయితే మొక్కవోని కర్తవ్యదీక్షతో దేశభక్తి పరవళ్లు తొక్కించిన చైతన్యదీప్తులను అవలోకిస్తే...

**నిషేధిత జాతీయోద్యమ నాటకాలు**

జాతీయోద్యమం ప్రారంభమై నాలుగు దశకాలు గడుస్తున్నప్పటికీ ఉద్యమవాహిని దూరంగా ఉన్న సామాన్య ప్రజానీకంలో స్వతంత్ర భారతావని ఆవశ్యకతను ప్రబోధిస్తూ ఉద్యమస్ఫూర్తిని నింపుటలో ప్రభావవంతమైన పాత్రపోషించినవి నాటకాలు. 1921 లో గుంటూరు తిలక్ నాటక సమాజంవారు ప్రదర్శించిన 'స్వరాజ్యసోపానం' నాటకం గ్రామీణప్రజల్లో కలవరాన్ని సృష్టించింది. ఈ అముద్రితనాటక కలకలం కృష్ణాజిల్లాకూ వ్యాపించి అక్కడకూడా ప్రదర్శన సాగిస్తుండగా మధ్యలో ప్రభుత్వం జోక్యం చేసుకుని 'నాటక ప్రదర్శనల చట్టం' క్రింద నిషేధం విధించింది. నాగపూర్ కాంగ్రెస్ మహాసభవరకు నడిచిన రాజకీయాలను వివరిస్తూ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారు రాసిన 'తిలక్ మహారాజనాటకం'(1921), గాంధీ విజయధ్వజ నాటకము (1924) 'గాంధీ మహోదయం', దామరాజు పుండరీకాక్షుడు రాసిన పాంచాల పరాభవము వంటి రాజకీయ నాటకాలను కూడా ప్రభుత్వం నిషేధించింది. ఇదే కోవలో కొడాలి ఆంజనేయులు గారి అముద్రిత నాటకం అవతార పరివర్తనం/ తిలక్ మహారాజు నాటకాన్ని, గరిమెళ్ళవారి చీరాల పేరాల గాంధీదాస నాటకం, స్వరాజ్యరథ నాటకాలను కూడా నాటి బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది.

దామరాజు పుండరీకాక్షుడు రాసిన గాంధీ విజయ ధ్వజనాటకం 1932 లో నిషేధానికి గురైంది. గుంటూరు కూలి సంరక్షణ సంఘం వారు కరపత్రం రూపంలో ప్రచురించిన 'ధన ప్రభావము' అనే నాటక కథాత్మకమైన రచనను సైతం 1934లో బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. "వొక్కో నాటక ప్రదర్శనను ప్రభుత్వం రద్దు పరుస్తుంటే, అవే సీన్లు కొంచం అటుయిటు మార్చి కొత్తకొత్త పేర్లుపెట్టి ప్రభుత్వం కళ్ళల్లో దుమ్ముకొట్టడానికి ప్రయత్నించేవారంటే అది వాళ్ళ రాజకీయ కమిట్‌మెంట్‌కు నిదర్శనం. ప్రభుత్వం మళ్ళీ వాటిని ఆపుచేయించి దమననీతి ప్రయోగించేది." (బంగోరె:38)

**హరికథలు :**

అలనాటి సుప్రసిద్ధ హరికథా కథకులు శ్రీ కుదురు నారాయణరాజు భాగవతులు ఆ కాలంలో బ్రిటిష్ ప్రభుత్వాన్ని నిరసిస్తూ, దేశ సంపూర్ణ స్వాతంత్ర సాధనే ధ్యేయంగా పౌరాణిక కథలను వాహికగా చేసుకుని దేశభక్తినీ, ప్రజల కర్తవ్యాన్నీ

రంగరించి ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించేవారు. ఆ కారణంగా నాటి బ్రిటిష్ ప్రభుత్వాధికారుల దృష్టిలో కుదురు నారాయణ భాగవతుల కుటుంబంపై ప్రభుత్వ వ్యతిరేక కుటుంబంగా ముద్రపడింది. 1923లో గుంటూరు వారైన దామరాజు పుండరీకాక్షుడు రాసిన గాంధీమహాత్ముడు లేక కలియుగ ప్రహ్లాదుడు అనే హరికథతో పాటు ఆత్మశిక్ష, నవోదయం, గాంధీ విజయం(1932), గాంధీమహాత్ముని నిర్భంధము వంటి రచనలను కూడా బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. (హరికథా సర్వస్వం: 197 – 198)

**ఉద్యమగీతాలు :**

అత్యంత వేగవంతంగా జనవాహినిలోకి చొచ్చుకుపోయి ప్రజానాలుకలపై నర్తనమాడిన జాతీయోద్యమగీతాలు ఈ కాలంలో కోకొల్లలుగా వచ్చాయి. వీటిపైకూడా బ్రిటిష్ ప్రభుత్వం కర్కశంగా వ్యవహరించింది. గుంటూరు జాతీయ కళాశాల ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్య భాగవతులు రాసిన భారతగీతములు, బాలకవి వడ్డాది సీతారామాంజనేయులు, పూడిపెద్ది కాశీవిశ్వనాథశాస్త్రి కలిసి రాసిన దండాలు దండాలు భరతమాత వంటి గీతాలు గల 'స్వరాజ్య గీతామృతం', గుంటూరు జిల్లా సిద్ధపల్లి బాలకవి దంటు వీరరాఘవయ్య రాసిన 'స్వరాజ్య కోలాటం', రామభజన ఫక్కీలో రాయబడిన 'రామదండు' పాట, మాకొద్దీ తెల్లదొరతనం వంటి గీతాలతో గరిమెళ్ల సత్యనారాయణకవి ప్రచురించిన 'స్వరాజ్యగీతాల'ను నిషేధించడంతో తృప్తిపడిపోకుండా ఆ గీత రచయితలను నిర్బంధించి బ్రిటిష్ పాలకులకు క్షమాపణ చెప్పించడానికి శతవిధాలా బెదిరింపులను ఎదుర్కొన్నారు. అయితే వీరత్వాన్ని దేశభక్తిని అణువణువునా నింపుకున్న ఈ గీతరచయితలు క్షమాపణ ససేమిరా చెప్పనని మొరాయించడమేకాక, కలెక్టరుకు ఎదురు సవాళ్ళు విసిరి, పోలీసులకు దొరకక కొంత కాలంపాటు రహస్యంగా ఉండి తప్పించుకోగలిగినా, అటుపై దొరికిన వారి మీద ప్రభుత్వం కఠినశిక్షలు విధించింది.

**పత్రికా వ్యాసాలు :**

కేసరి, మరాఠా పత్రికల్లో తీవ్రవాద వ్యాసాలు రాసినందుకు లోకమాన్య బాలగంగాధర తిలకన్‌ను నిర్బంధించినట్లే, 1908లో తెలుగుదేశంలో 'స్వరాజ్య' సంపాదకులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు 'అరేయ్ ఫరంగీ క్రూర వ్యాఘ్రమా' అని రాసిన వ్యాసానికి రాజద్రోహనేరం కింద అరెస్టుచేసి మూడేళ్ళు జెలుశిక్ష విధించింది తెలుగు పత్రికారంగం బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా చేసిన తొలి గర్జాఘోషగా ఈ వ్యాసం చరిత్రలో నిలిచిపోయింది (20 4). 'జమీన్ రైతు' పత్రికా స్థాపకుడిగా ప్రసిద్ధికెక్కిన నెల్లూరు వెంకట్రామానాయుడు ప్రకటించిన 'స్వప్నప్రయాణం', నెల్లూరు నుంచి రాళ్ళపల్లి రామసుబ్బయ్య సంకలనపరచి ప్రకటించిన 'సింహపురి స్వరాజ్య కోకిలము' ఈ రెండింటి కాపీలను ప్రభుత్వం స్వాధీనపర్చుకోమని కలెక్టర్ రిపోర్ట్ పంపితే ఒక పుస్తకాన్ని వదిలేసి మరోదాన్ని నిషేధించింది. (బంగోరె:40)

**మాలపల్లి నవలపై నిషేధం :**

మహాత్మాగాంధీ రాజకీయ రంగప్రవేశం చేసే కాలంనాటి భారతదేశ రాజకీయ సాంఘిక పరిస్థితులను చిత్రించిన ఈ నవలలో బొల్షివిక్ భావాలున్నాయనీ, ప్రజల్ని రెచ్చగొట్టి ప్రభుత్వంపై దాడి చేయించే విధంగా ఉందనీ భావించిన నాటి బ్రిటీష్ ప్రభుత్వం కమ్యూనిస్టు సిద్ధాంతాలు ప్రచారం చేయడం, కార్మికులను భూస్వాములకు వ్యతిరేకంగా రెచ్చగొట్టడం, ప్రభుత్వాన్ని విమర్శించడం అనే అభియోగాలపై 1923 ఏప్రిల్ 5వ తేదీన ఈ నవలపై నిషేధం విధించింది. మద్రాసు శాసనమండలిలో అయ్యదేవర కాళేశ్వరరావువంటి రాజకీయ ప్రముఖులచేత ఆ నిషేధంపై సభలో విస్తృతమైన చర్చ జరిగింది. నవలలో కొన్ని భాగాలు తొలిగించిన పిదప 1928లో తిరిగి ప్రచురించడానికి అనుమతి లభించింది. సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి హయాంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈ నవలను పాఠ్యగ్రంథంగా నిర్ణయించగా, మాలపల్లి నవలను పాఠ్యగ్రంథంగా తొలగించమని మద్రాస్ గవర్నర్ మరియు కలెక్టర్ తీవ్రమైన ఒత్తిడి తెచ్చినట్లు, దానికి రాధాకృష్ణన్ గారు నిరాకరించినట్లు నాడు వారి మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు వివరిస్తున్నాయి. (బంగోరె:44) 1936 మార్చి 7న మద్రాసు ప్రెసిడెన్సీ ప్రభుత్వం మరోసారి మాలపల్లి నవలపై నిషేధం విధించి పాఠ్యగ్రంథంగా తొలగించింది. 1937లో రాజగోపాలాచారి ఆధ్వర్యంలో కాంగ్రెసు ప్రభుత్వం మాలపల్లి పై నిషేధాన్ని రద్దుచేసింది.

**ఇతర ఉద్యమ సాహిత్య గ్రంథాలపై నిషేధం :**

విప్లవవీరుల జీవితచరిత్రలు, సామ్యవాద ప్రబోధ రచనలు కూడా ఈకాలంలో నిషేధాన్ని ఎదుర్కొన్నాయి. ముదిగంటి జగ్గన్నశాస్త్రి రచించిన రాజనీతిశాస్త్రము, వినాయక సావర్కార్ జీవితము, మాజినీ జీవితము, మానవ ధర్మాలు, నార్లగారు రచించిన నేటి రష్యా, కృష్ణాపత్రిక 1934 జూలై 4వ తేదీ సంచిక, గారిబాల్డీ జీవితము, సామ్యవాద సిద్ధాంతాలు, క్రొవ్విడి లింగరాజు మాక్సిమ్ గోర్కీ రాసిన నవలకు చేసిన అనువాదం అమ్మ, లెనిన్ వ్యాసానికి చేసిన తర్జుమా 'సామ్రాజ్యవాదము', గద్దెలింగయ్య తర్జుమా చేయగా ఆదర్శగ్రంథమండలి ప్రచురించిన కమ్యూనిస్ట్ మేనిఫెస్టో గ్రంథానికి అనువాదం 'కమ్యూనిస్టు ప్రణాళిక, సి. కృష్ణస్వామి శర్మగారి 'భగత్సింగ్ చరిత్ర', నంద్యాలలో అచ్చైన 'కార్మిక భజనావళి', గద్దెలింగయ్య యింట్లో పోలీసులు జరిపిన సోదాలో బయటపడిన దింటకుర్తి భాస్కరరాజు అముద్రితరచన 'ట్రాట్స్కీ జీవితము', ఇవేకాక హిందూదేశము – పూర్వ ప్రస్తుత పరిస్థితులు, భారతీయవిలాపం, సహాయనిరాకరణం వంటి రచనలను నాటి ఉద్యమతీవ్రతను అణిచివేయాలనే ఉద్దేశ్యంతో బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది.

**సాహిత్య గ్రంథాలపై నిషేధం :**

ఇంతటితో ఆగని ప్రభుత్వం కడపజిల్లా పర్లపాడు చెనికల చెన్నారెడ్డి రాసిన 'శాంత సారంగధర నాటకం'లో మితిమీరిన పచ్చి శృంగారాన్ని దట్టించాడనే నెపంతో ఆ నాటకాన్ని నిషేధించడమేగాన జమ్మలమడుగు కోర్టులో నాటకకర్త, పబ్లిషరు ప్రొద్దుటూరు శ్రేష్ఠి సోదరులపై కేసు పెట్టడం జరిగింది. ఇదేకాలంలో వావిళ్ళ రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వంటి పేరెన్నిక గన్న ముద్రణాలయాలు మొదలుకొని ఎన్నో ప్రచురణ సంస్థలు సైతం ప్రభుత్వ నిషేధాలను ఎదుర్కోవలసి వచ్చింది. శృంగార గ్రంథాలపై పెట్టిన విధి నిషేధాలను తొలగించమని మచిలీపట్నం శృంగారకావ్య గ్రంథ మండలివారు పెట్టుకొన్న దరఖాస్తును హోరీమ్ శాఖ 1936 జూన్ న త్రోసివేసి పునర్ముద్రణకు నిరాకరించింది.

స్వతంత్రభారత అమృతోత్సవాలలో భాగంగా కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సారథ్యంలో జాతీయోద్యమకాలంలో బ్రిటిష్ ప్రభుత్వం ద్వారా నిషేధానికి గురైన ఉద్యమగీతాలను వెలుగులోకి తెచ్చి నేటి ప్రజానీకానికి గత చరిత్రను తెలుసుకునేటందుకు వీలుగా అధికారిక వెబ్సైట్ నందు అనదుబాటులో ఉంచారు. ఆజాదీకా అమృతోత్సవ్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన అధికారిక కార్యక్రమంలో తెలుగు భాషకు చెందిన వడ్డాది సీతారామాంజనేయులు, పూడిపెద్ది కాశీ విశ్వనాథ శాస్త్రి రాసిన 'భరతమాతగీతా'న్నికేంద్ర పర్యాటక మరియు సాంస్కృతిక వ్యవహారాలశాఖమంత్రి కిషన్ రెడ్డి చదివి వినిపించారు. స్వతంత్రభారత అమృతోత్సవాలలో భాగంగా బ్రిటిష్ మరియు అమెరికన్ లైబ్రరీలలో మరుగునపడివున్న ఈ జాతీయోద్యమ నిషేధిత సాహిత్యాన్ని వెలుగులోసి తీసుకురావడానికి ముమ్మరమైన ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ❀

**ఆధారగ్రంథాలు**

1. ఉన్నవ మాలపల్లి నవలపై ప్రభుత్వ నిషేధాలు (1978) – బండిగోపాలరెడ్డి, స్వీయప్రచురణ, విశాలాంధ్ర, విజయవాడ.
2. హరికథా సర్వస్వం (1978) – తూమాటి దొణప్ప, మిలియన్ బుక్స్, యూనివర్సల్ లైబ్రరి
3. తెలుగు వారి జానపద కళారూపాలు (1992)–డా. మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, మిలియన్ బుక్స్, యూనివర్సల్ లైబ్రరి
4. తెలుగు నాటక వికాసము (1967) – డా. పోణంగి శ్రీరామ అప్పారావు, నాట్యమాల ప్రచురణ, హైద్రాబాద్
5. తెలుగులో జాతీయోద్యమకవిత్వం (1982) – మద్దూరు సుబ్బారెడ్డి, రాగసుధా ప్రచురణలు, 518, బాలాజీ కాలనీ, తిరుపతి.
6. Andhrapradesh Journalists Union Silver Jubilee Sovenir-2014
7. Development of Indian Press during British Rule in India (Open Source- wikipedia April6, 2020)
8. Azadi ka Amrit mahotsav, Ministry of Culture, Government of India official website amritmahotsav.nic.in

# భారతదేశ స్వాతంత్రోద్యమం - దేశభక్తి గేయాలు

**డా. జి. సుహాసిని,** మ్యూజిక్ టీచర్, ఎస్.వి. యూనివర్సిటి క్యాంపస్ స్కూల్, తిరుపతి, చరవాణి : 9494741514

ప్రపంచంలో ఏ ఉద్యమంలోనైన అణచి వేతకు లోనవుతున్న ప్రజలు తమను అణచివేస్తున్నవారి గురించి ప్రచారం చేయడంతోనే ఉద్యమం మొదలయింది. 18వ శ॥లో వచ్చిన ఫ్రెంచి విప్లవం 20వ శ॥ లో వచ్చిన రష్యన్ విప్లవం ఈ పంథాలో సాగినవే. ఈ ఉద్యమాలలో తమమీద జరుగుతున్న దురాగతాలను కళారూపాలైన సంగీతం, చిత్రలేఖనం, నాట్యం, హరికథలు, బుర్రకథలు, సాహిత్య రచనల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేసి సంఘటితం చేశారు కళాకారులు.

ఈ మార్గంలోనే మన భారతదేశంలో కూడా బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేయడంలో కళలు ముఖ్యంగా దేశభక్తిగేయాలు ప్రధాన పాత్ర పోషించాయి అనడంలో అతిశయోక్తికాదు. స్వాతంత్రోద్యమంలో స్వాతంత్ర యోధులు వారి ప్రసంగాల ద్వారా దేశ ప్రజలకు మార్గనిర్దేశం చేసినప్పటికీ, జనాదరణ పొందిన చిహ్నాలు, చరిత్ర మరియు ముఖ్యంగా ప్రజలలో దేశం పట్ల అంకిత భావాన్ని కలిగించి స్వతంత్ర్యకాంక్షను రగిలించి బ్రిటీషు పాలకులపై తిరుగుబాటు చేయటంలో దేశభక్తిగేయాలు లక్షలమందిని ముందుకు నడిపించాయి. ఒక విధంగా చూస్తే దేశభక్తిగేయాలు మన నాయకులను, ప్రజలను ఒక్కటి చేసే పనిని సులభతరం చేశాయని చెప్పవచ్చు.

స్వాతంత్ర్యం వచ్చిన 75 సం॥ల తరువాత కూడా ఈ దేశభక్తి పాటలు ఇప్పటికి ప్రజలను చైతన్యవంతులను చేస్తూ వారిలో దేశభక్తి భావాలను పెంపొందిస్తున్నాయి, విభిన్న భాషలు కలిగిన భారతదేశంలో వివిధ ప్రాంతాలలోని కవులు తెలుగు, తమిళం, కన్నడ, మళయాళం, హింది, మారాఠీ, బెంగాలి మొదలగు భాషలలో ఎన్నో దేశభక్తిగేయాలు రచించారు. అవి దేశప్రజలను చైతన్యవంతులను చేసి స్వాతంత్రోద్యమం వైపు నడిపించాయనుటలో సందేహంలేదు.

అటువంటి దేశభక్తి గేయాలలో నాటికి నేటికి ఎంతో జనాదరణ పొందిన “వందేమాతరం”, “విజయీవిశ్వ తిరంగా ప్యారా”, “సారే జహాసే అచ్ఛా” మరియు “జనగణమన” గేయాలు ముఖ్యపాత్ర వహించాయి. ఈ గేయాల ప్రత్యేకతను తెలుసుకోకపోవడం భారతదేశ స్వాతంత్రోద్యమ చరిత్ర అసంపూర్తిగా వుంటుందనుటలో సందేహంలేదు.

### 1. “వందేమాతరం” గీతం

కోట్లమంది భారతీయులలో అణువణువున దేశభక్తిని రగిల్చిన “వందేమాతరం” గేయాన్ని ప్రముఖ బెంగాలి రచయిత “బంకించంద్రఛటర్జీ” 1870లో సంస్కృతంలో రచించాడు. 1857 సిపాయిల తిరుగుబాటుకు ఆకర్షితుడైన బంకించంద్ర ఛటర్జీ తను బెంగాలీలో రచించిన “ఆనందమఠ్” అనే నవలలో పొందుపరచాడు. 19వ శ॥లో సిపాయిల తిరుగుబాటును అణచివేసిన బ్రిటీషుపాలకుల God Save the Queen (దేవుడు రాణిని కాపాడాలి) అనే పాటని భారతీయుల మీద రుద్దే ప్రయత్నం చేశారు. ఇది భారత జాతీయ వాదులకు ఏమాత్రం అంగీకారయోగ్యం కాలేదు. ఈ సమయంలోనే వచ్చిన వందేమాతర గీతం భారత స్వాతంత్రోద్యమాన్ని నడిపించే దేశభక్తి గేయంగా ‘ప్రాచుర్యం పొందింది. ఈ పాట మన దేశ ప్రజలను ఎంతగా ప్రభావితం

చేసిందంటే బ్రిటీషు ప్రభుత్వం చేసే అన్యాయమైన చట్టాలను వ్యతిరేకిస్తూ ఈ గీతాన్ని ఆలపించేవారు. దీనిని భరించలేని బ్రిటీషు పాలకులు వందేమాతర గీతాన్ని నిషేధించారు. ఈ గీతాన్ని ఆలపించడం అనేది చట్టవ్యతిరేక నేరం క్రింద పరిగణించి చెరసాలలో ఖైదు చేసేవారు. కేవలం వందేమాతరం గీతం పాడినందుకే ఎంతోమంది భారతీయులు దెబ్బలుతిన్నారు, చెరసాల జీవితం గడిపారు, యింకా ప్రాణాలుకూడా కోల్పోయారంటే వందేమాతర గీతం బ్రిటీషు వారి వెన్నులో వణుకు పుట్టించింది అనుటలో సందేహం లేదు.

1896 లో రవీంద్రనాథ్ ఠాగూర్ కలకత్తా కాంగ్రెస్ సమావేశంలో వందేమాతర గీతాన్ని స్వరపరచి ఆలపించారు. తరువాత స్వరాజ్య ఉద్యమంలో ఈ గేయం అంతర్భాగం అయింది. 1907 లో వందేమాతర గీతాన్ని మన జాతీయ గీతంగా చేయాలని భావించినా, మొహమ్మద్ అలీ జిన్నా వంటి నాయకులు వ్యతిరేకించడం వల్ల జరగలేదు. కాని వందేమాతర గీతం ఎప్పటికి మన దేశ ప్రజలలో దేశభక్తి భావాన్ని పెంపొందిస్తూనే వుంటుందనుటలో అతిశయోక్తి లేదు.

**"విజయీ విశ్వ తిరంగా ప్యారా"**

మహాత్మగాంధీ స్వాతంత్రోద్యమంలో నాయకత్వం తీసుకున్న తరువాత 1924 లో "శ్యామ్లాల్ గుప్త" మన జాతీయ జెండాను కీర్తిస్తూ 'విజయీవిశ్వ తిరంగా ప్యారా జెండా ఉంఛా రహేహమారా' అనే గేయాన్ని రచించాడు. ఇది మొదటిసారిగా 'ఖన్నాప్రెస్' కాన్పూర్ వారిచే ముద్రింపబడి 5000 ప్రతులు అమ్ముడుపోయాయి. తరువాత కాలంలో భారత జాతీయ కాంగ్రెస్ ఈ గేయాన్ని అధికారిక జెండా పాటగా స్వీకరించారు. 1924 ఏప్రెల్ 13 వ తేదిన ఈ పాటను మొదటిసారిగా జలియన్ వాలాభాగ్ అమరుల సంస్మరణ సభలో పండిత జవహర్లాల్ సమక్షంలో ఆలపించారు. తరువాత 1938 కాంగ్రెస్ సభలో సరోజిని నాయుడు, గాంధీ, నెహ్రూ, రాజేంద్రప్రసాద్ వంటి స్వాతంత్రోద్యమనాయకుల సమక్షంలో పాడబడింది. ఈ గేయాన్ని భారతీయులు జాతీయ జెండా మోస్తూ దేశభక్తి భావంతో పాడుకునేవారు. నేటికీ ఈ గేయాన్ని స్వాతంత్రదినోత్సవం నాడు, గణతంత్రదినోత్సవం నాడు జెండా ఎగురవేసే సమయంలో తప్పక ఆలపిస్తారు.

**"సారేజహాన్ సే అచ్చా"**

భారతదేశ స్వాతంత్రోద్యమంలో విశేషమైన ఆదరణ పొందిన మరొక గేయం 'సారేజహాసే అచ్చా' ఈ గేయాన్ని ప్రముఖ ఉర్దు కవి "మహమద్ ఇక్బాల్" బడిపిల్లలకోసం రాశాడు. 1906 ఆగష్టు 15న ఈ గేయం ఇత్తెహాద్ పత్రికలో ప్రచురితమైంది. ఇక్బాలే ఈ గేయాన్ని మొదటిసారి లాహెూర్ లోని ఒక ప్రభుత్వ కాలేజిలో పాడాడు. అచిరకాలంలోనే ఈ గేయం భారతదేశంలోని బ్రిటీష్ ప్రభుత్వాన్ని వ్యతిరేకించడానికి ప్రజలు పాడడం మొదలు పెట్టారు. పూణే జైలులో నిర్బంధంలో ఉన్నప్పుడు మహాత్మగాంధీ ఈ గేయాన్ని వందసార్లు పాడారని చెపుతారు అలా జైలులో ఉన్నపుడు తనకు ఈ పాట ఎంతగానో ప్రేరణ కలిగించిందని మహాత్ముడు చెప్పడం విశేషం. ఎంతోమంది భారతీయులు గర్వంగా ఈ పాటను పాడటం, పాఠశాలలో పిల్లలు ఈ పాటను ఆలపించడం నేటికి చూడవచ్చు. ఈ గేయం మనమందరం భారతీయులమని ఈ దేశ పౌరులమనే భావన కలిగించడంలో ఎంతగానో దోహదపడిందని చెప్పవచ్చు గణతంత్ర వేడుకల ముగింపు సమయంలో ఇప్పటికి ఈ గేయాన్ని తప్పకుండా పాడుతారు.

**"జనగణ మన"**

స్వాతంత్ర్య ఉద్యమంలో జనాధరణ పొందిన ఇంకొక గేయం, తరువాత కాలంలో మనజాతీయగీతంగా మారి చిరస్థాయిగా చరిత్రలో నిలచిపోయిన గేయం 'జనగణమన'. ఈ గేయాన్ని విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ 27, డిసెంబర్ 1911లో కలకత్తాలో జాతీయ కాంగ్రెస్ సభలో మొదటిసారి బెంగాలీలో ఆలపించాడు. ఈ గేయం చుట్టూ అనేక నిరాధారమైన వివాదాలు ఏర్పడ్డాయి. ఈ గేయాన్ని అప్పటి బ్రిటీష్ చక్రవర్తిని 'జార్జిలని' కీర్తిస్తూ అతనికి స్వాగతం పలకడానికి రాసిందని భావించినా తరువాత కాలంలో ఈ అపార్థాన్ని ఠాగూర్ ఖండించాడు. తాను భారత విధిరాతను మార్చి ఆ దైవస్వరూపాన్ని కీర్తిస్తూ రాశానని వివరణ యిచ్చాడు. ఈ గేయాన్ని 1912 లో ఠాగూర్ మేనకోడలు కాంగ్రెస్ ప్రముఖుల మధ్య పాడారు. బెంగాలు రాష్ట్రానికి వెలుపల మొదటిసారిగా

ఈ గేయం 1919 ఫిబ్రవరి 28న ఆంధ్రరాష్ట్రం మదనపల్లెలోని బిసెంట్ థియోసోఫికల్ కాలేజ్‌లోకి వచ్చి ఠాగూర్ ఆయనే స్వయంగా పాడారు. ఇక్కడ మొదటిసారిగా ఈ గేయాన్ని ఆయన ఆంగ్లములోకి అనువదించి స్వరపరిచారు. ఈ నోటెషనే నేటికి వాడుకలో ఉన్నది. తరువాత కాలంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 11 సెప్టెంబర్ 1942 లో జర్మన్ దేశం వెళ్లినప్పుడు. అక్కడ హెూటల్ అట్లాంటిక్ లో జనగణమన గేయాన్ని స్వతంత్ర భరతావని జాతీయగీతంగా ప్రకటించినాడు. తొలి నాళ్లలో ఈ గేయం అంత ప్రాచుర్యం పొందనప్పటికి. తరువాత బాగా ప్రాచుర్యం పొందింది.

ఈ గేయంలోని ఫంక్తులు భారతదేశ గొప్పతనాన్ని దేశంలోని పర్వతాలు రాష్ట్రాలు, నదులను వివరిస్తూ ఉండటం వలన యిది భారతీయులలో ఐక్యతాభావాన్ని పెంపొందించింది. స్వాతంత్రం వచ్చిన తరువాత ఈ గేయాన్ని అన్ని ముఖ్య సందర్భాలలో తప్పక ఆలపించడం అనవాయితీగా మారింది. ఈ గేయం మనదేశ ప్రజలను ఏకం చేస్తు జాతీయతా భావాన్ని కలుగచేస్తూ అజరామరంగా నిలిచిపోయింది.

**ముగింపు**

సంగీతం ఒక బలమైన సాధనంగా ఉద్యమాలు ఆవిర్భవించి ముందుకు నడిచాయి. ఈ కోవకు చెందినవే మన దేశభక్తి గేయాలు. ఈ పాటలు ప్రజలను ఏకం చేసి జాతీయ భావాలను రగిల్చి వారిని చైతన్య వంతులను చేసి ముందుకు నడిపాయి. అన్యాయానికి, అణచివేతకు, జాత్యహంకారానికి వ్యతిరేకంగా ప్రజలు పోరాడే విధంగా వారిలో ధైర్యాన్ని నింపాయి. స్వాతంత్ర యోధులు ఈ గేయాలను ఆధారంగా చేసుకుని పరాయి పాలకుల అణిచివేతకు వ్యతిరేకంగా ప్రజలను ఒకటి చేయగలిగారు. అందుకే దేశభక్తి గేయాలకు, భారతస్వాతంత్ర పోరాటానికి ఒక విడదీయలేని బంధం ఉందని అనుట అతిశయోక్తి కాదు. ఈ దేశభక్తి గేయాలు మన భారతీయ సంస్కృతిలో భాగమై అప్పటికి, ఎప్పటికి ప్రజలలో స్ఫూర్తిని నింపుతూ చిరస్థాయిగా నిలచి ఉంటాయి అనుటలో సందేహం లేదు. ❀

# జాతీయోద్యమ నవల - 'కొల్లాయి గట్టితేనేమి'

**డా. పలివెల చిరంజీవిరావు,** సహాయాచార్య, (తెలుగుశాఖ) ఐఐఐటి శ్రీకాకుళం,
ఆర్.జి.యు.కె.టి. చరవాణి : 9666360983

మహీధర రామమోహనరావుగారి కొల్లాయి గట్టితేనేమి? నవల చదవటం ఒక గొప్ప అనుభవం. నిర్దిష్ట స్థలకాలాలను, వాస్తవికతా దృక్పథంతో ప్రగతిశీల భావజాలంతో చిత్రించే ఏ మంచి రచన అయినా పాఠకుడికి ఒక గొప్ప అనుభవాన్ని ప్రసాదిస్తుందని చెప్పవచ్చు. 'కొల్లాయి గట్టితేనేమి?' నవల పాఠకుడి చారిత్రక, సామాజిక, సాంస్కృతిక అనుభవాలను కూడా విస్తృతం చేస్తుంది. ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారి 'మాలపల్లి' నవల చదివినప్పుడూ, ఉప్పల లక్ష్మణరావు గారి నవల అతడు–ఆమె చదివినప్పుడూ, కొడవగంటి కుటుంబరావు 'చదువు' చదివినప్పుడూ పాఠకుడు ఎలాంటి అనుభవాన్నీ, అనుభూతినీ పొందగలుగుతాడో అంతకుమించిన అనుభవాన్ని 'కొల్లాయిగట్టితేనేమి'? చదివినప్పుడు పొందగలుగుతాడు. వ్యక్తికీ, సమాజానికీ, సంస్కృతికీ, ఆధునికతకూ, చరిత్రకూ గల గాఢమైన అనుసంధానాన్ని చెప్పిన నవలగా 'కొల్లాయిగట్టితేనేమి'? మరొక మెట్టు ఉన్నత స్థానంలో ఉంటుంది.

ఫ్యూడల్ సమాజపు సాంస్కృతిక, రాజకీయ భావజాలాలకూ, ఆధునిక రాజకీయ సాంస్కృతిక భావజాలాలకూ మధ్య రగిలిన ఒక అనివార్యమైన సంఘర్షణను అక్షరీకరించిన నవల ఇది. సమీప గతంలోని ఒకనాటి చారిత్రక వాస్తవాన్ని, నాటి ఛాందస సంస్కారాన్నీ, నూతనంగా తలెత్తుతున్న భౌతికవాద దృక్పథాన్నీ, ఆధునిక దృష్టితో విశ్లేషించిన నవల ఇది. ఒక యుగసంధిలో జీవించేవాళ్లూ, పురోగమన భావజాలంతో ముందుకు అడుగువేసేవాళ్లూ, ఎలాంటి సంయోగాన్నీ, అంతర్మథనాన్ని అనుభవిస్తారో, గాఢంగా ప్రతిబింబించిన నవల. జాతీయోద్యమాన్ని కేవలం దేశభక్తి తత్త్వంతోగాక, గత కీర్తి పొగడ్తల పరాయణత్వంతో గాక, సంకుచిత హైందవీయ పునరుద్ధరణ భావజాల దృష్టితోగాక ఆధునిక భౌతికవాద సంస్కార దృక్పథం నుండి కళాత్మకంగా దృశ్యీకరించిన నవల 'కొల్లాయి గట్టితేనేమి?' మహీధర రామమోహనరావు గారు 1 నవంబరు 1909 నాడు తూర్పు గోదావరి జిల్లా ముంగండ అగ్రహారంలో జన్మించారు. ఆధునిక భావాలు గల వ్యక్తుల మధ్య, పరిసరాల మధ్య పెరగడం వలన రామమోహనరావు చదువుని మధ్యలోనే విడిచి జాతీయోద్యమంలో పాల్గొన్నారు. వారి గ్రామంలో రాజకీయ కార్యకలాపాలు ఉధృతంగా కొనసాగుతున్న రోజుల్లో ఆయన మొదట కాంగ్రెస్ లోనూ, ఆతర్వాత జయప్రకాశ్ నారాయణ్ పార్టీలోనూ చేరారు. తదుపరి కాలంలో కమ్యూనిస్టుగా మారిపోయారు. మానవత, వాస్తవికత ఆయన లక్ష్యాలుగా భావించారు. కుల, వర్గ రహిత సమాజాన్ని నిర్మించాలని ఆయన కలలు కన్నారు. ఆయన విలేఖరిగా పనిచేశారు. అత్యద్భుతమైన నవలలు రచించారు. రథచక్రాలు, దేశం కోసం, జ్వాలాతోరణం, ఓనమాలు, మృత్యువు నీడల్లో, కత్తులవంతెన వంటివి ఆయన సుప్రసిద్ధ రచనలు.

**జ్వాలా తోరణం**

'కొల్లాయి గట్టితేనేమి' తోనే ఈ నవలా రచన ఆగిపోలేదు. దీనికి కొనసాగింపుగా, దేశం కోసం, తోరణం అన్న నవలలు కూడా మహీధర రాశారు. దేశం కోసం నవల 1935–39 కాలాన్నీ, జ్వాలా తోరణం నవల 1939–45ల కాలాన్నీ చిత్రించిన నవలలు, కొల్లాయి గట్టితేనేమి నవలలోని ప్రధాన పాత్రలు. జ్వాలాతోరణం నవలవరకూ విస్తరించాయా అంటే ఈ

మూడు నవలలూ 1920 నుండీ 1945 వరకూ గల తెలుగు దేశపు రాజకీయ, సామాజిక, ఆర్థిక జీవితాల్ని చిత్రించటం ఉద్దేశంగా రాసినవి. కాబట్టే ఈ నవలలన్నీ రచయిత, సమకాలిక జీవితాన్ని ప్రదర్శించిన నవలలుగా మనం అర్థం చేసుకోవాలి.

ఈ నవలలో కథాకాలం 1920–22. రచయిత ఈ నవలను రాసిన కాలం 1964. అంటే 40 సంవత్సరాల వెనుకటి కాలం నాటి సామాజిక జీవితం ఇందులోని కథావస్తువున్నమాట. అయితే ఈ నవలలోని కథ నడిచేకాలం నాటికి ఆయన వయసు 13, 14 సంవత్సరాలు. అంటే ఆయన సమకాలం నవల. అప్పటికే తన దృష్టికి కనబడుతున్నకాలం. అందువల్ల రచయిత సమకాలికనవల ఇది. కొల్లాయి గట్టితేనేమి నవలను గురించి సమీక్షిస్తూ ఆర్.ఎస్. సుదర్శనం ఇలా రాశారు. బ్రిటిష్ వారిని బహిష్కరించి దేశం నుంచి వెడల నడిపే ఉద్దేశ్యంతో ప్రారంభమైన ఉద్యమం కాదు విప్లవం. భారతీయ సమాజంలో వ్రేళ్ళు పాతుకొని ఉండిన విశ్వాసాల్నీ సంప్రదాయాల్ని ఆచారాల్ని పద్ధతుల్ని యావజ్జీవన సరణినీ దాని మూలాధారాల్ని హెచ్చరికతో స్పృహతో రాయబడిన నవల యిది. అంటే రాజకీయ స్వాతంత్ర్యం రావటంతో విప్లవం ముగిసిపోలేదు. విప్లవం సాగుతూనే ఉంది. సాగుతూనే ఉంటుంది. అన్న ధ్వని యీ నవలకు విశిష్టత చేకూర్చింది. అదే ఈ నవలలో ఆధునికత కూడా" అన్నారు.

"1921 మార్చి 31 ఏప్రిల్ 1 ఆనాడు బెజవాడలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమీకరణం జరిగింది. ఆ తేదీని లక్ష్యంగా పెట్టుకొని ఆనాటి తెలుగు దేశపు రాజకీయ సామాజిక ఆర్థిక పరిస్థితులను చిత్రిస్తున్నది ఈ నవల. కథా నాయకుడు రామనాథం గాంధీ పిలుపు విని కాలేజీలో చదువుతున్న చదువుకి స్వస్తి చెప్పి ఇంటికి చేరుకోవటంతో ప్రారంభమై అతను స్వరాజ్యం అనే అమ్మాయిని వర్ణాంతర వివాహం చేసుకోవడంతో నవల ముగుస్తుంది. ఈ నవలలో పాత్రలు రామనాథం, స్వరాజ్యం, నారాయణమూర్తి (రామనాథం మామ) అబ్బాయి నాయుడు ఉన్నారు. ఈ పాత్రలు వారి వ్యక్తిత్వంతో తేజోమయంగా భాసిస్తాయి. ఈ పాత్రల సృష్టిలో రచయిత ప్రతిభ స్పష్టంగా కన్పిస్తుంది. ఈ నవలలోని ప్రత్యేకతల్ని గురించి పరిశీలించినపుడు, రచయిత చేపట్టిన సంవిధాన ప్రజ్ఞ అద్భుతమనిపిస్తుంది. ఈ నవలలో రచయిత కూడా ప్రేక్షకుడే. అతడు ఏ పాత్ర విషయంలోనూ ప్రత్యక్షంగా ప్రభావంగా పనిచేయడు. ఈ శిల్పం కొడవటిగంటి కుంటుంబరావు చదువు నవలలోనూ కన్పిస్తుంది. ఆయన తెలుగు సాహిత్యానికి చేసిన సేవ ఎనలేనిది. ఆయన మన మధ్య లేకున్నా ఆయన రాసిన నవలలుంటాయి. అవి అందించిన సందేశం ఉంటుంది. ఆయన రాసిన "కొల్లాయి గట్టితేనేమి?" నవలను రాచమల్లు రామచంద్రారెడ్డి "సంవేదన" 1968 ఏప్రిల్ సంచికలో సమీక్షించారు.

కొల్లాయిగట్టితేనేమి కథా వస్తువు 1920లో ప్రారంభమైంది. నవలలో రామనాథం ప్రధాన పాత్ర. నవల యావత్తు అతడి చుట్టూ నడుస్తుంది. గాంధీజీ పిలుపు మేరకు అతడు తన చదువుకు స్వస్తి చెబుతాడు. జాతీయోద్యమంలో పాల్గొనేందుకు సంకల్పిస్తాడు. అప్పటికి మొదటి ప్రపంచ యుద్ధం ముగిసింది. ఈ సమరం మిగిల్చిన విషాదమైన అనుభవాలు ఉన్నాయి. ధరలు పెరిగాయి. జాతీయోద్యమ తీవ్రత హెచ్చింది. జలియన్ వాలాబాగ్ దురంతం జరిగింది. సహాయ నిరాకరణోద్యమం ఆరంభమైంది. కాంగ్రెస్ పలుకుబడి విస్తరించింది. దేశంలో స్వాతంత్ర్య కాంక్షలు ఉధృతమయ్యాయి. ఖద్దరు వస్త్రాలు ధరించడం ఆరంభమైంది. రామనాథం వీటన్నిటితోనూ ప్రభావితుడయ్యాడు. తన స్వస్థలమైన ముంగండ గ్రామంలో గాంధీజీ మార్గంలో సంఘ సంస్కరణ చేయాలని గట్టిగా నిశ్చయించు కుంటాడు. దళితులకు తన తోట బావిలో నీటిని ఇస్తాడు. ఊర్లో వారు అతడిని వెలివేస్తారు. అయినా ధైర్యమే ఆయుధంగా సూత్రబద్ధమైన రీతిలో సంస్కరణ వాదానికి అంకితమవుతాడు. స్వరాజ్యంతో పరిచయం రామనాథం జీవితాన్ని మలుపు తిప్పింది. ఆమె ఆయన కులానికి చెందిన మహిళ కాదు. ఆమె తండ్రి అబ్బాయి నాయుడు. వీరేశలింగం అభిమాని. కుమార్తెను చదివించుకోవాలని అనుకుంటాడు. పెళ్ళి కూడా జరిపిస్తాడు. స్వరాజ్యం చదువు కోవడం ఆమె భర్తకూ అత్తగారికీ ఇష్టం ఉండదు. ఆమెను భర్త విడిచిపెడతాడు. ఇటు రామనాథానికి కూడా వివాహమైపోతుంది. అతడి మామ నిప్పువంటి పోలీస్ అధికారి. సహజంగానే బ్రిటిష్ రాజభక్తుడు కూడా. రామనాథం జాతీయోద్యమంలో పాల్గొనడం అతడికి ఎంతమాత్రం ఇష్టం ఉండదు. తన కుమార్తెను కాపురానికి పంపకుండా తన ఇంట్లోనే పెట్టుకుంటాడు. వైవాహిక జీవితం విఫలమైన స్వరాజ్యం, రామనాథం కొంతకాలం పాటు కలిసి పనిచేస్తారు. రామనాథం అందరికీ దూరంగా ఊరికి దూరంగా తోటలో పాక వేసుకొని తన ఆదర్శాలకు అనుగుణంగా పని చేస్తుంటాడు.

ఈ నవలలో గమనించదగిన విశేషాంశాలు ఉన్నాయి. రామనాథానికి చిన్నప్పుడే పెండ్లి అయింది. కానీఅతని భార్య కాపురానికి రానని అతనితో తెగతెంపులు చేసుకుంది. స్వరాజ్యానికి కూడా చిన్నప్పుడే పెండ్లి అయింది. కానీ, ఆమె భర్త మళ్ళీ పెండ్లిచేసుకొని స్వరాజ్యాన్ని పరిత్యజించాడు. బ్రహ్మసమాజపు విశ్వాసాలు గల అబ్బాయినాయుడు (స్వరాజ్యం తండ్రి) కూతురుకు పునర్వివాహం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నాడు. కులం ఏదైనా సరే విజ్ఞాన వివేకాలున్న వరుడు కావాలని మాత్రమే అతని కోరిక. కానీ స్వరాజ్యం తాను ప్రేమించిన రామనాథాన్ని పెండ్లి చేసుకుంటానన్నప్పుడు అబ్బాయినాయుడు తలమీద పిడుగు పడినట్లు బాధపడతాడు. కూతురును గద్దించి లొంగదీసుకోడానికి ప్రయత్నిస్తాడు. లాలించి నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తాడు స్వరాజ్యం ఆ ప్రయత్నాలన్నిటినీ ధిక్కరించి, రామనాథం పట్ల అతనికి గల అభ్యంతరమేమిటో చెప్పమంటుంది. నిజానికి అభ్యంతరమేమిటో అతనికే తెలియదు. కూతురుకేమని చెప్పగలడు!' రామనాథం అందగాడు, ఆరోగ్యవంతుడు, మంచి చదువుంది. సంఘ సంస్కరణ దృక్పథం వుంది. దేశం అంటే ప్రేముంది. నాయుడు అభిమానించే అన్ని లక్షణాలూ వున్నాయి. కాని అతనిని కూతురు వరుడుగా అంగీకరించలేకున్నాడు, చేతకావడం లేదు. ఆ అభ్యంతరమేమిటో మాటకు అందడంలేదు.'

ఆ అభ్యంతరం ఏమిటో మనకు తెలుస్తూనే వుంది. అది కేవలం అంతరాత్మకు సంబంధించింది. అంతరాత్మ అనేది మానవుని వ్యక్తావ్యక్త మనస్సులో (sub conscious mind) గూడు కట్టుకున్న విశ్వాసాల సంపుటి. ధర్మాధర్మాలకూ, నీతి అవినీతులకూ సంబంధించిన విశ్వాసాల సంపుటి. మానవుని చుట్టూ వున్న సమాజంలోని విశ్వాసాలే పసితనం నుండి అతని మనసులో ప్రవేశించి వయసు వచ్చేటప్పటికి స్థిరపడి అంతరాత్మ రూపం ధరిస్తాయి. వయసు వచ్చిన తర్వాత ఒక వ్యక్తి అర్జించే నూతన విద్యా విజ్ఞానాల ఫలితంగా ధర్మాలను గురించి అతని అభిప్రాయాలు మారవచ్చు. కానీ వ్యక్తావ్యక్త మనస్సులోని అతని విశ్వాసాల పట్టు సులభంగా సడలదు. అనగా, వ్యక్తి వివేకం యెదిగినంతగా అతని అంతరాత్మ యెదగదు. తత్కారణంగా వ్యక్తులకు అంతరాత్మ పీడనలూ, అంతస్సంక్షోభాలూ ఏర్పడుతుంటాయి. రామమోహన రావుగారీ అంశాన్ని చరిత్రకు అన్వయించిన తీరు ఆయన ఊహాశక్తికి గొప్ప నిదర్శనం మాత్రమేగాక, సమాజానికీ, వ్యక్తికీ గల నిగూఢ సంబంధాలను గురించి ఆయనకున్న గాఢ గంభీర పరిజ్ఞానాన్ని వెల్లడి చేస్తుంది.

ఫ్యూడల్, బూర్జువా ధర్మాలకు జరిగిన చారిత్రక ఘర్షణే ఇతివృత్తంగా గల ఈ నవలలో బూర్జువా ధర్మానికి రామనాథం ప్రతినిధి. బ్రాహ్మణ గ్రామమైన ముంగండను కథాస్థలంగానూ బ్రాహ్మణ యువకుడైన రామనాథాన్ని కథానాయకుడుగానూ రచయిత స్వీకరించినాడు. తెలుగుదేశంలోని వేలాది గ్రామాలకు ఒక బ్రాహ్మణ గ్రామం ప్రతినిధి కాజాలదని, తెలుగుదేశంలోని లక్షలాది యువకులకు ఒక బ్రాహ్మణ యువకుడు ప్రతినిధి కాజాలడని అనిపించవచ్చు. కానీ, ఫ్యూడల్ ధర్మాలకూ, బూర్జువా ధర్మాలకూ జరిగిన ఘర్షణను చిత్రించేటప్పుడు ఫ్యూడల్ వ్యవస్థను అత్యంత ఘనీభూతరూపంలో చిత్రిస్తే తప్ప ఆ ఘర్షణ తీవ్రతా, వ్యగ్రతా వ్యక్తం కావు. 1919-20 నాటి ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిస్థితులను చిత్రించే ప్రయత్నంలో శ్రీ మహీధర రామమోహనరావుగారు రచించిన నవల "కొల్లాయి గట్టితేమి?" ఈ కథా క్రమంలో కొల్లాయి గట్టితేనేమి? 1920 నాటి ఆంధ్రదేశ చారిత్రక పరిస్థితులు విపులంగా గాఢంగా, కన్నులకు కట్టినట్లు చిత్రితమవుతాయి. రచయిత దీన్ని కేవలం సాంఘిక నవలగా కాక, చారిత్రక నవలగా ఉద్దేశించినట్లు స్పష్టంగా తెలుస్తుంది. చారిత్రక నవలకుండవలసిన లక్షణాలన్నీ ఈ నవలలో కనిపిస్తాయి.

జాతీయోద్యమ కాలంలో ఒకవైపు స్వాతంత్ర్యపోరాటం మరోవైపు సంస్కరణోద్యమం చేతులుకలిపి సాగాయి. ఒకదానికొకటి ఎదురెదురయిన సందర్భాలూ ఉన్నాయి. ఈ రెండు వర్గాల మధ్యనా స్పష్టమయిన విభజనరేఖ లేకపోవడం ఒక విశేషం. పరమ సాంప్రదాయ వాదులయి కూడా ఇంగ్లీషు చదువులిచ్చే అధికారం కోసం అర్రులు చాచినవారు ఉన్నారు. మరోవైపు అప్పటి సంఘవ్యవస్థలో గౌరవం దక్కని వాళ్ళు కూడా సంప్రదాయాన్ని ధిక్కరించి ఇంగ్లీషు చదువులకి వెళ్ళినవాళ్ళూ ఉన్నారు. అలాగే భారతీయ సంప్రదాయాభిమానంతో పర సంస్కృతినీ, పరపాలననీ ధిక్కరించిన వారున్నారు. మరొకవైపు ఇంగ్లీషు చదువులిచ్చిన సంస్కారాభిలాషతో సంప్రదాయాలని ప్రశ్నిస్తూనే, మరోవైపు బ్రిటిష్ దౌర్జన్యపాలనని నిరసించిన వారూ ఉన్నారు. ఈ వైవిధ్యమంతా

చాలావరకూ యీ నవలలో మనకి స్పష్టంగా కనిపిస్తుంది. వీటిలోని అనేక ఛాయలు ప్రధానపాత్ర రామనాథంలో కనిపించడం చెప్పుకోదగ్గ విషయం. పాత్రచిత్రణలో రచయితకున్న నైపుణ్యానికి ఒక నిదర్శనం.

ప్రపంచ సాహిత్యంలోనే గొప్ప నవలల సరసన నిలవగలిగినది 'కొల్లాయి గట్టితేనేమి?'. ఈ నవలను సుప్రసిద్ధ విమర్శకుడు రాచమల్లు రామచంద్రారెడ్డి 'ఉత్తమ చారిత్రిక నవల'గా ఎంచి, కీర్తించారు. జార్జ్ లూకాష్ (గ్యోర్గియ్ లుకాచ్) సూత్రీకరించిన 'చారిత్రిక నవల లక్షణాలు' ప్రాతిపదికగా తీసుకుని ఆయన ఆ విమర్శ చేశారు. అంతర్జాతీయ స్థాయి సాహిత్య విమర్శ సూత్రాల గీటురాయిపై ఒక తెలుగు నవలను నిగ్గుతేల్చడం బహుశా అదే మొదలు. 1964లో వెలువడిన ఈ నవలకు నాలుగేళ్ల తర్వాత ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉత్తమ నవలా పురస్కారం అందచేసింది.

తెల్లవాళ్ళని తరిమికొట్టడమే కాకుండా ఉన్నవాళ్ళని సంస్కరించుకోవడం కూడా స్వాతంత్రోద్యమంలో భాగమే అని ఈ నవల మనకు తెలుపుతుంది. మనదేశంలోని బూర్జువా విప్లవం జాతీయ పోరాటరూపం ధరించిన ప్రధాన కారణం చేత, అందులోని అంతర్యుద్ధ స్వభావాన్ని మనం సరిగా గుర్తించడం లేదు. మొత్తం జాతినే రెండు శిబిరాలుగా చీల్చిన అంతర్యుద్ధం అంతటితో ఆగలేదు. అనేక లక్షల కుటుంబాలను ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలను కూడా రెండు శిబిరాలుగా చీల్చింది. జాతీయ పోరాటంలో పాల్గొన్న వాళ్ళూ, ఫ్యూడల్ నిరంకుశ శాసనాలనూ, వికృత సనాతన ధర్మాలనూ యెదిరించిన వాళ్ళూ, యెన్ని లక్షలమంది యువతీ యువకులు తమ తలిదండ్రులను ధిక్కరించవలసి వచ్చిందో, తమ ఆలుబిడ్డల సంక్షేమాన్ని తృణీకరించవలసి వచ్చిందో, తమ ఆత్మీయుల హృదయాలలో అగ్ని రగిలించవలసి వచ్చిందో, తత్ఫలితంగా తామే ఎంత మనోవేదనకు గురి కావలసి వచ్చిందో మనకు తెలుసు. చరిత్రకారులు చెప్పకపోయినా మనం ఊహించుకోగలం. మరి ఒక అంతర్యుద్ధానికి నవలారూపం ఇవ్వవలసి వచ్చినప్పుడు, ఒక చారిత్రక దశలో చారిత్రక కారణాల వల్ల స్త్రీ పురుషులలో కలిగిన హృదయ సంతాపాన్నీ, హృదయ సంక్షోభాన్ని ఈనాటి పాఠకులకు కళా పరిభాషలో అందజేయవలసి వచ్చినప్పుడు, కుటుంబాలనే అంతర్యుద్ధ రంగస్థలంగా చిత్రించక తప్పదు, చరిత్రను నాటకీకరించక తప్పదు.

జాతీయతాభావం గ్రామసీమల్లోకీ, సామాన్య జనంలోకి ప్రవేశిస్తున్నది. దీనికి చిహ్నంగా కాంగ్రెసు మీద గాంధీ ఆధిపత్యం బలపడుతున్నది. అంతవరకూ విద్యాధికుల సంస్థగా వుండిన కాంగ్రెస్ సామాన్య ప్రజల రాజకీయ సంస్థగా రూపాంతరం చెందుతున్నది. బ్రిటిష్ ప్రభుత్వంపట్ల సహాయ నిరాకరణకూ, విదేశీ వస్తు బహిష్కరణకూ గాంధీ నాయకత్వాన కాంగ్రెసు పిలుపు యిచ్చింది. సహాయ నిరాకరణలో భాగంగా విద్యార్థులు కాలేజీలు వదిలిపెట్టి జాతీయోద్యమంలో పాల్గొంటున్నారు. విదేశవస్తు బహిష్కరణలో భాగంగా విదేశ వస్త్రదహనం ఆవేశపూరితమైన ఉద్యమరూపం ధరించింది. ఖద్దరు ధారణ దేశభక్తి చిహ్నంగా, నూలు వడకడం పవిత్ర దీక్షా చిహ్నంగా, జైలుకు పోవడం రాజకీయ వీరకృత్యంగా చలామణిలోకి వచ్చినాయి. వాటి ఆర్థిక ప్రాముఖ్యం గురించి ఎపుడైనా ఏ రాజకీయ నాయకుడైనా మాట్లాడితే అది కేవలం మేధావి వర్గాలలో– రాజకీయంగా బ్రిటిష్ ప్రభుత్వంతో రాజీపడి, జాతీయోద్యమం పట్ల విశ్వాసంలేని మేధావి వర్గాలలో– దేశభక్తి, కాంగ్రెస్ నడిపే జాతీయోద్యమం పట్ల విశ్వాసమూ కలిగించడానికి చేసే ప్రయత్నం మాత్రమేనని చెప్పాలి.

**ముగింపు:**

ఆనాటి చారిత్రక వాస్తవాన్ని చిత్రించడంలో ఈ నవల సంపూర్ణంగా కృతార్థమైంది. ఆనాటి సాంఘిక దురాచారాలు, అంధ విశ్వాసాలూ, కరడు గట్టిన ఛాందస అజ్ఞానమూ, ప్రభుత్వ దమన నీతి, ప్రభుత్వ అధికార్లలోని బానిస తత్వమూ, వీరికి వ్యతిరేకంగా యువకులూ, దేశభక్తులూ, విద్యావంతులూ సాగించిన పోరాటాలూ, ఆ పోరాటాల ఫలితంగా ఏర్పడిన హృదయ తాపాలూ, మానసిక సంక్షోభాలు, కుటుంబ విచ్ఛేదాలు అన్నీ కళ్ళకు కట్టినట్టు చిత్రించారు. ఇవన్నీ పాఠకులకు ప్రత్యక్షానుభూతులుగా రూపు ధరించినాయి. ఆ నవల యీనాటికీ పునర్ముద్రణలు పొందుతూ తెలుగుదేశపు విశ్వవిద్యాలయల్లో పాఠ్య గ్రంథంగా మన్ననలు పొందుతూ వుంది. తెలుగుదేశపు విద్యావంతుల చారిత్రక పరిజ్ఞానానికి, ఆధునిక మనస్తత్వానికీ యింతకు మించిన

నిదర్శనం వుండబోదనుకుంటాను. తెలుగు చారిత్రక నవలను ఆవరించిన యీ గాఢాంధకారాన్ని చీల్చుకుంటూ యీనాటికి వేగుచుక్క లాగ ఉద్భవించింది. రామమోహనరావు గారి 'కొల్లాయి గట్టితేనేమి?'. అందువల్ల యీ నవలకు మన సాహిత్యంలో ఒక చారిత్రాత్మకమైన స్థానం ఉంటుంది. ❀

**ఆధార గ్రంథాలు:**

1. కొల్లాయి గట్టితేనేమి నవల
2. రాచమల్లు రామచంద్రారెడ్డి "సంవేదన" 1968 ఏప్రిల్ సంచికలో సమీక్ష
3. ఆంధ్రప్రభ దినపత్రిక – ప్రత్యేక వ్యాసం
4. పుస్తకం నెట్ – వ్యాసం
5. వన్ ఇండియా తెలుగు – కొల్లాయిగట్టితేనేమి
6. ఈ మాట – చారిత్రక నవల – కొల్లాయిగట్టితేనేమి

# తెలుగు నాటకాలు - జాతీయోద్యమం

**ఎం.ఎల్.ఎస్. కుమారి,** తెలుగు అధ్యాపకులు, ఎ.జి. & యస్.జి.యస్. డిగ్రీ కళాశాల,
ఉయ్యూరు, చరవాణి : 9848547022

నాటకం అనేది ఒక శ్రవణ దృశ్యరూపకం. జానపద కళలు విలసిల్లుతున్న రోజులలో, రాజుల పరిపాలనా కాలంలో ప్రజల వినోదం కోసం అత్యధికంగా ఆదరింపబడిన కళ నాటకం.

నాటకం, సంగీతం, పాటలు, నృత్యాలతో కూడుకొన్న ప్రక్రియ, యక్షగానానికి రూపాంతరమైన నాటకానికి సూత్రధారుడే ఆయువుపట్టు. ఇందులోని పాత్రలన్నీ తమను తామే పరిచయం చేసుకొంటూ రంగప్రవేశం చేస్తాయి. పదహారవ శతాబ్దంలో ప్రారంభమైన నాటక ప్రక్రియను చిందు భాగవతము, యక్షగాన నాటకం, వీధి భాగవతం అనీ పిలుస్తారు. వీధి నాటకాలను ఎక్కువ ప్రచారంలోకి తెచ్చినవారు కూచిపూడి భాగవతులు, కాకతీయుల కాలంలో ప్రదర్శించిన క్రీడాభిరామం కూడా ఒక నాటకమే. తెలుగు నాటకరంగ చరిత్ర, తెలుగులో ఆదికవిగా పేరుగాంచిన నన్నయ్య తన భారత అవతారికలో రసాన్విత కావ్యనాటకముల్ పెక్కుజూచితి అనడాన్ని బట్టి, నన్నయ కాలానికి నాటక ప్రదర్శనలుండేవని అర్థం చేసుకోవచ్చు.

భారత స్వాతంత్ర్యోద్యమ కాలంలో జరిగిన అనేక సంఘటనల్ని నాటక రచయితలు వివిధ నాటకాలుగా మలిచి ప్రజల్ని చైతన్యపరిచారు. ప్రజలు తాము నివసిస్తున్న నేలమీద అభిమానాన్ని ప్రకటించడం, స్వజాతి జనుల మీద ప్రేమను పెంపొందించుకోవటం జాతీయతలో కనిపించే కొన్ని ముఖ్యాంశాలు. తరతరాలుగా కొనసాగుతున్న స్థానిక సత్సంప్రదాయాలపై ప్రగాఢమైన అభిమానం; నిర్ధిష్ట పాలనా వ్యవస్థకి అనుగుణంగా మనుగడ సాగించే మానసిక స్థితిని కలిగి ఉండటం జాతీయత అనవచ్చు.

సర్వసాధారణంగా ప్రజలు తమ అస్తిత్వాలకు తీవ్రంగా భంగం కలుగుతుందని భావించినప్పుడల్లా ఈ జాతీయతా భావాలు ఉద్యమ రూపంలో కనిపిస్తుంటాయి. భిన్న జాతులు, మతాలు, సంస్కృతులు ఉన్నప్పటికీ భారతదేశంలోని ప్రజలంతా తరతరాలుగా కలిసిమెలసి జీవించేవారని చరిత్ర చెబుతుంది. బ్రిటీష్ వాళ్ళు వ్యాపారం కోసం వచ్చి, క్రమేపీ పాలనాధికారాన్ని చేజిక్కుంచుకోవడంలో వాళ్ళకు వ్యతిరేకంగా భారతీయుల్లో జాతీయతా స్ఫూర్తి అంకురించింది.

ఆది ఆంగ్ల విద్యాప్రభావంతో మరింతగా విస్తరిల్లింది. అనేక సాహితీ ప్రక్రియల్లో సాహిత్యం సృజనీకరించబడి ప్రజల్లో జాతీయతా భావాలు వేగంగా వ్యాపించాయి. ఈ పరిస్థితి అన్ని భాషల్లోనూ కనిపిస్తుంది. అలాగే తెలుగులోనూ జాతీయోద్యమ ప్రభావంతో భిన్న ప్రక్రియల్లో సాహిత్యం వెలువడింది. కవిత్వం, నవల, వ్యాసం, నాటకం వంటి సాహిత్య ప్రక్రియలు జాతీయోద్యమాన్ని వేగంగా ప్రసరించడంలో నిర్మాణాత్మకమైన పాత్రను నిర్వహించాయి.

జాతీయోద్యమ ముఖ్య లక్ష్యం పరదేశీయుల్ని పారద్రోలడమే ప్రధాన ధ్యేయమైనప్పటికీ, నాటకాల్లో నాడు జాతీయోద్యమం సామాజిక రంగంలో కనిపించే అనేక సమస్యల్ని పరిష్కరించేదిశగా పయనించిన కోణాన్ని వివరంగా పేర్కొన్నారు. వందేమాతరం, విదేశీవస్తు బహిష్కరణ, సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం మొదలైన చారిత్రక ఘట్టాలను తెలుగు నాటకాల్లో ప్రతిఫలించిన తీరు కనిపిస్తుంది.

కేవలం 1947 ఆగస్టు 15 వరకు మాత్రమే కాకుండా, 1948 సెప్టెంబరు 17న హైదరాబాదు రాష్ట్రం భారతదేశంలో విలీనం అయ్యేవరకూ చరిత్రను పరిగణలోకి తీసుకొన్నప్పుడు మాత్రమే, ఆంధ్రప్రాంతానికి సంపూర్ణ స్వాతంత్ర్యం సిద్ధించినట్లవుతుంది. తెలుగు నాటకాలపై చూపిన తెలంగాణా సాయుధ పోరాట ప్రభావాన్ని వివరించవచ్చు.

వేదాంతకవి 1948లో రాసిన ఛలో హైదరాబాద్, వాసిరెడ్డి భాస్కరరావు, సుంకర సత్యనారాయణలు కలిసి రాసిన 'మాభూమి' నాటకాలు చదివితే తెలంగాణాలో జరిగిన సాయుధ పోరాటం చాలా వరకూ అవగాహన కొస్తుంది. నిజాం నిరంకుశ పాలనలో అమీనులు, దేశ్‌ముఖ్‌లు సాగించిన దురంతాలపై నాటి సామాన్య ప్రజలు సహితం పోరాడిన సంఘటనలన్ని జాతీయోద్యమంలో భాగంగానే చూడాలనేది ఒక ప్రతిపాదన. తెలంగాణా సాయుధ పోరాటంలో స్త్రీల పాత్రను కూడా చిత్రించిన నాటకాలను, స్త్రీ చైతన్యాన్ని కూడా ఆయా నాటకాల్లో ప్రతిఫలించిన తీరు కనిపిస్తుంది.

నాటకాల్లో కనిపించే ప్రధానాంశాలు సంఘ సంస్కరణ, దేశభక్తి, సమగ్ర జాతీయతా భావం, మద్యపాన నిషేధం, విదేశీ వస్తు బహిష్కరణ శాసనోల్లంఘన, ఖద్దరు వస్త్రాలను ధరించడం, గాంధీజీ సూక్తులు పాటించడం, సత్యాగ్రహం, శాంతి సౌహార్ధభావం, అస్పృశ్యతా నివారణ వంటి వన్నీ జాతీయోద్యమంలో అంతర్భాగంగా కొనసాగిన సంస్కరణలు.

రెండవ అధ్యాయంలో జాతీయోద్యమ నాటక నేపథ్యాన్ని వివరిస్తూ పూర్వపరిశోధనల్ని పేర్కొంటూనే తనదైన ప్రతిపాదనలను పాఠకుల ముందుంచారు. దేశభక్తి పూరితాలైన తెలుగు నాటకాలను పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలుగా విభజిస్తూనే, స్వాతంత్ర్య సమరాన్ని ప్రత్యక్షంగా వ్యాఖ్యానించిన రాజకీయనాటకాలను విభజన కూడా చేస్తే బాగుంటుందన్నారు.

పౌరాణిక నాటకాల్లో ఆయా పాత్రల ద్వారా జాతీయ భావాలను ప్రభోదించారని నిరూపించారు. దౌల్తాబాదు గోపాల కృష్ణారావు 1932లో రాసిన సంపూర్ణ భారతం అనే నాటకంలో అర్జునుడు శివుడిని మెప్పించి పాశుపతాస్త్రం కోరతాడు. ఆ అస్త్రమే కోరడంలో గల ఆంతర్యాన్ని తెలపమన్న శివుడితో అర్జునుడు నిరంకుశ ప్రభువులను దండించి భారతీయుల దాస్యాన్నీ రూపుమాపటానికని చెప్తాడు.

తిరుపతి వేంకట కవుల రచించిన ప్రఖ్యాత నాటకం పాండవోద్యోగము (1938) లో ధర్మరాజు వంటి గుణ సంపన్నుడిగా గాంధీజీని కవులు వర్ణించారని చేసిన సమన్వయం బాగుంది. 'అలుగుటయే యెరుంగని మహామహితాత్ముడజాత శత్రువే అలిగిన నాడు...' అనే పద్యంలో ధర్మరాజు పాత్ర చిత్రణలో గాంధీజీ జాతీయోద్యమ స్వభావం ఉందని వ్యాఖ్యానిస్తున్నారు. ఊటకూరు సత్యనారాయణ గారి అభిమన్యు (1938) నాటకంలో భర్తపై ఉండే ప్రేమ కొద్దీ ఉత్తర అభిమన్యుణ్ణి యుద్ధరంగానికి పోవద్దన్నా, తానూ సారథియై వస్తానని పలకడం, భర్త వద్దన్నా, స్త్రీలు కూడా యుద్ధంలో పాలుపంచుకోవాలని వాదించడంలో నాటి స్వాతంత్ర్య సమరంలో స్త్రీలను చైతన్యపరచడమేనంటారు'.

చారిత్రక నాటకాల్లో మహమ్మదీయుల పాలనలో హిందూధర్మానికి జరిగిన హానిని ప్రస్తావిస్తూ వ్రాసిన నాటకాలు అధికంగా ఉన్నాయి. పౌరాణిక పురుషులకంటే చారిత్రక పురుషులు స్వాతంత్ర్య యోధులలో, ప్రజలలో మరింత ఉత్సాహాన్ని నింపారని, ఆ నాటకాలను సోదాహరణంగా వివరించడం జరిగింది.

ముత్తరాజు సుబ్బారావు "చంద్రగుప్త" (1932), శేషబాబు, అశోకరాజ్యము' (1945), ప్రభులింగాచార్యుల పల్నాటి వీరచరిత్రము' (1928), ఉన్నవ లక్ష్మీనారాయణ "నాయకురాలు' (1926), నండూరి బంగారయ్య "ఆంధ్రతేజము" (1938), వేదం వేంకటరాయశాస్త్రి "ప్రతాపరుద్రీయము" (1897), పోతుకూచి సుబ్బయ్య "ఆంధ్రవాణీ సామ్రాజ్యము" (1944), కోలాచలం శ్రీనివాసరావు "సుల్తాన్ చాంద్ బీ' (1900) కాళ్ళకూరి సాంబశివరావు "రంగరాయి కదన సమవాకారం' (1899), శ్రీపాద కృష్ణమూర్తి "బొబ్బిలి యుద్ధం" (1908), కొప్పరపు సుబ్బారావు "రోషనార' (1921), పడాల రామారావు 'అల్లూరి సీతారామరాజు' (1950) మొదలైన నాటకాల్లో దేశవ్యాప్తంగానూ, ఆంధ్రదేశంలోనూ ప్రజారంజకంగా పాలన అందించిన పాలకుల స్ఫూర్తినీ,

వారి పోరాట పటిమనీ, వారు మహమ్మదీయులు, విదేశీయులతో పోరాడిన చారిత్రక సంఘటనలను వర్ణించారన్నారు. ఇవన్నీ జాతీయోద్యమ ప్రభావంతో రాసిన నాటకాలేనని నిరూపించవచ్చు.

సాంఘిక, రాజకీయ నాటకాల్లో గాంధీజీ చేసిన ఉద్యమప్రభావం అత్యధికంగా కనిపిస్తుంది. గాంధీజీ ఒకవైపు స్వాతంత్ర్యం కోసం పోరాటాన్ని కొనసాగిస్తూనే, దేశం సమైక్యంగా ఉండాలంటే అంతర్గతంగా జరగాల్సిన వాటిని గుర్తించాలన్నారు. దీనిలో భాగమే ఆయన కొనసాగించిన హరిజనోద్యమం అనీ దీనికి నాటక కర్తలు ఎంతో ప్రభావితులయ్యారని ఆ నాటకాలను సోదాహరణంగా నిరూపించారు.

ఈ విధంగా నాటకం అనేది జాతీయోద్యమంలో తనదైన ముద్రవేసి గొప్పతనాన్ని చాటుకుందని చెప్పవచ్చు. ❋

**ఉపయుక్త గ్రంథాలు**

1) తెలుగు సాహిత్య ప్రక్రియలు, నాటకం – డా. తుందు కృష్ణ కౌండిన్య

2) క్రీడాభిరామం – బి.వి.సింగరాచార్యులు

3) వీధి నాటకాలు – తమ్మారపు వెంకటస్వామి

4) జాతీయోద్యమం – వికీపీడియా

5) నాటకాలు – వికీపీడియా

# జాషువా 'శివాజీ' కావ్యం - జాతీయోద్యమస్ఫూర్తి

**డా. చాట్ల కిషోర్,** తెలుగు శాఖాధిపతి, కే.వి.ఆర్ కళాశాల, నందిగామ, చరవాణి : 9866820524

**జాతీయ పౌరుషజ్వలన మా బాల్యంబు**
**సవరించు కావ్యరాజములు లేక**
**విక్రమక్రమశిక్ష వెన్నతోనిడు,**
**జిజియా వంటి మాతృదేవతలు లేక,**
**ఒక జట్టు, ఒక బొట్టు, ఒక కట్టుబడి**
**నేర్పిపాలింప జాలు దేవతలు లేక,**
**కులమెల్ల చెదరి తెంపులు తెంపులగు చున్న**
**వారించి కాపాడు ప్రభువు లేక,**
**బుద్బుదంబున కెనయైన మూడునాళ్ళ**
**పరువులకు ప్రతిష్ఠలకునై ప్రాకులాడి**
**నరుల నమ్మించుకొనలేక నమ్మలేక**
**చితికి యున్నవి మా జాతి జీవితములు,** – ఒక జాతి చైతన్యంతో తొణికిసలాడాలంటే జాతీయ భావస్ఫూర్తి నిరంతరాయంగా ప్రవహించాలంటే ఆ భావజాలాన్ని చిన్ని వయసులోనే బిడ్డలకు అందించాలంటాడు మహాకవి గుఱ్ఱం జాషువా. తమ దేశపు వీరగాథల్ని జాతికోసం పోరాడి ప్రాణాలర్పించిన వీరయోధుల త్యాగాల్ని ఉగ్గు పాలతో రంగరించి బిడ్డలకందించాలని అప్పుడే వారికి ఆ విక్రమ క్రమశిక్షణ అలవడుతుందంటారు జాషువా. అటువంటి ఒక యోధుడి కథ, శివాజీ దేశం మొత్తం పరాయిపాలకుల పాలన క్రింద మ్రగ్గుతూ, తమ సంస్కృతీ, మతం, వారసత్వపు మూలాల్ని కోల్పోయి, అనామకంగా మూలుగుతున్నప్పుడు సమస్త హిందూ ప్రజానికానికి ఆశాదీపంగా అవతరించిన వాడు ఛత్రపతి శివాజీ. హిందూ సామ్రాజ్యాన్ని నిర్మించిన యోధుడు. అటువంటి శివాజీ ఇతివృత్తాన్ని తెలుగు ప్రజలకందించాలనే దృఢ సంకల్పంతో జాషువా చేసిన ప్రయత్నం శివాజీ ప్రబంధం.

ప్రబంధశైలిలో జాషువా 1926లో ఈ కావ్యం రాశారు. ఈ కావ్యాన్ని శ్రీ శ్రీ రావూరి శ్రీశైలపతికి అంకితం ఇచ్చారు జాషువా. కానీ గ్రంథ ముద్రణ సమయానికి శ్రీ శ్రీ రావూరి శ్రీశైలపతి ఆర్థికంగా చితికిపోవడం, తర్వాత కొంతకాలానికే దివంగతులవ్వడం జరిగింది. ఆర్థిక క్లేశాల వల్ల ఒకరికి అంకితం ఇచ్చిన కావ్యాన్ని మరొకరికి ఇవ్వడం ఇష్టం లేని జాషువా ఈ కావ్యాన్ని ప్రచురించలేకపోయారు.

భారతదేశ చరిత్రలో శివాజీది ప్రత్యేకమైన చరిత్ర. సువిశాల మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించి హిందువుల పౌరుషాన్ని ప్రపంచానికి రుచి చూపించాడు. అటువంటి వీరుడి చరిత్రను కావ్యంగా మలచిన జాషువా, ఈ ప్రబంధాన్ని 5 ఆశ్వాసాలుగా విభజించుకొన్నారు. శివాజీ ఫిబ్రవరి 19, 1630 లో పూణే జిల్లాలోని జున్నార్ పట్టణానికి దగ్గర్లోని శివనేరికోటలో జన్మించారు. 1680 ఏప్రియల్ 3వ తారీఖున 50 యేండ్ల వయసులో రాయగడ్ కోటలో మరణించారు. తన 16 వ ఏట యుద్ధరంగంలోకి ప్రవేశించి షుమారుగా 390 పైగా విజయ యాత్రలు చేసిన యుద్ధవీరుడు శివాజీ. బీజపూరు అదిల్షాలను, మొగలాయి చక్రవర్తులను, నైజాం నవాబులను గడగడలాడించి హిందూ మత సంస్కృతులకు రక్షకుడుగా నిలచినవాడు శివాజి.

షుమారు 575 గద్య పద్యాలతో జాషువా ఈ ప్రబంధాన్ని రచించారు. శివాజీ జీవితంతో ముడిపడిన వ్యక్తులు, స్థలాలు అన్నీ మాతృభాషలో అందంగా ఒదిగిపోయేలా రాశారు జాషువా. "సుద్దులు చెప్పుచు అనే పద్యంలో చెప్పినట్లుగా వీర రసస్ఫోరకంగా 'మహారాష్ట్ర దేశలక్ష్మి' ని వర్ణిస్తూ కథను ప్రారంభించారు.

వింధ్యా, శాత్పూర పర్వత సానవుల్లో, అరేబియా సముద్రం ఆప్త బాందవుని, గంగా నదీమ తల్లి వీచికలు చెంతనే మ్రోగుచుండగా –

**సహ్యగిరి కానన విహార సరసపవన**
**పులకిత శరీర చలిత కుంతలయునగుచు**
**శత్రురాజుల కభ్ర పుష్పంబు భాతి**
**తేజరిల్లు మహారాష్ట్ర దేశలక్ష్మీ"** అంటారు. పుట. 303 – జాషువా సర్వలభ్య రచనల సంకలనం

ఈ ప్రథమాశ్వాసంలో శహాజీ, జిజియా దంపతులను పరిచయం చేశారు. శహాజీ బీజపూరు నవాబు కొలువులో ఉండుట.

**వ్రాలటులుండగా, తురక రాజుల గొల్చెడు భర్త మీదని**
**ల్లాలొకసారి లేతహృదయంబున జాలి వహించు, దేశక**
**ల్లోలములన్నియుందలపులో బ్రతిబింబితమై, భయంకర**
**జ్వాలికయై వెలుంగునొకసారి జిజా గిరిజా మనోహరా –**

పుట. 304 – జాషువా సర్వలభ్య రచనల సంకలనం

తురకల రాజును గొల్చె భర్త మీద జాలి పడుతూ దేశకల్లోలానికి బాధపడుతూ ఉంటుందంటూ వర్ణించారు.

యవనసేనను వదలి రావాలని భర్తను అనేక సార్లు కోరుతుంది.

'ఓర్తురే భారత జనయిత్రీ పుత్రికల్, వీరకాంతలు దేశ స్వమతాభిమానములు కుందన్ నీచదాస్యం వ్యథల్' అంటూ భారత స్త్రీల ఔన్నత్యాన్ని చాటాడు జాషువా. జిజియా గర్భం ధరించడం, శివాజీ జన్మించడం –

**ఆయమ గర్భవీధుల విహారము పూరితిజేసి విస్ఫుర**
**త్కాయముతో శివాజియవతారమునత్తె రహస్యమేల నా**
**థా! యవతారమెత్తితి నరాకృతినేనసుమా! యశశ్చవు**
**ల్గాయగశాలివాహనశక, క్షయ వత్సర మధ్యవేళలన్"** అంటూ

ఆ సందర్భంలో ఢిల్లీ సుల్తానుల యంతరంగములు అల్లకల్లోలములైనవని భావి భారత జయాల్లో సానికి నాందీసూచకంగా అంటారు. జిజియాబాయి కుమారుడు కల్గినా తన భర్త యవనులకు దాస్యం చేయడం వల్ల కలిగిన బాధ నుండి ఉపశమించలేదు. అందుకే కుమారుడికి ఉగ్గు పెడ్తూ

"భరత నందన. యవన సంపద హరించి,

నాఋణంబును దీర్చు మన్న" అంటూ ఉగ్గు పెడుతుందని "ఉగ్గు కాదది క్షాత్రం పుటగ్గిగాని" అంటాడు.

'వీర రసార్ద్రశబ్దపంక్తులు' జోల పాటలుగా పాడింది జిజా.

"అలదనంజయుని బాహుల గౌగిలించి, శోబిల్లి

ధర్మ సంభవుని నేత్రముల గంతుల బెట్టు పరకామినీ మాతృభావశక్తి భారతవీర రసము"

పరశురాముని మేటి పరశుధారల నెక్కి విశ్వసన్నుతి గన్న విజయధాటి

దేవతా విద్వాంసుభావరంగమును బెంపుగ నాట్యమాడిన బుద్ధి బలము

**పాలలో నుగ్గులో పొందుపరచి, తల్లి**
**యుదయసాయాహ్నములు బోయుచుండ బెరిగి**
**మెలగుచు శివాజి తప్పటడ్గులను వైచె**
**గలగి తురకలు తప్పటడ్గులను వేయ**

అర్జునునిలో వీరత్వం, ధర్మరాజులోని ధర్మనీతి, పరశురాముని పౌరుషం, బృహస్పతి బుద్ధిబలం-పాలలో, ఉగ్గులో కలిపి శివాజీకి తినిపించింది జిజాబాయి. అందుకే అతడు –

పాలు మఱచిన నాడే–

**"కరచి నాడఖిల విఖ్యాత గాథాపూత వరగీతికలు పాలు మఱచినాడు**
**యెఱిగినాడవని మాతృవ్యథాభారంబు, మురిపెంపుటుయ్యాల దొఱగినాడు,**
**యుడికినాడరివిజయోత్సహర్ఘటులకు బుడి బుడి కవచాలు దొడిగినాడు**
**కాంచినాడిల్లు చిక్కక స్రుక్కు కీర్తి నర్మిలి బొమ్మరిండ్లు నిర్మించినాడు.**

**యవన దుందుభి ద్వానంబు లాలకించి**
**పట్టుదట్టీలుకటి మీదంగట్టినాడు.**
**భావిమానవ విజయ ప్రబంధమునకు**
**దనరుగద శైశవంబుపోద్ఘాతమగుచు** పుట. 307

అని – శైశవ ప్రాధాన్యాన్ని వర్ణించాడు. బాధ్యతాయుతమైన శైశవం, జాతీయ భావాంకురానికి దోహదం చేస్తుందని జాషువా విశ్వాసం – అందుకే జిజాబాయి పాత్రను అమోఘంగా సృష్టించారు జాషువా.

**జనని వర్షించు దీవెనల గొజ్జగినీట నభ్యంజన స్నానమాచరించు,**
**తల్లి వల్లించు హైందవ వీర వర్ణనార్ణవములంబడి, శరీరంబు మఱచు,**
**జనయిత్రిసల్పు పూజాభోజనంబు, భోజనముగాగల్గి, భోజనము విడుచు,**
**అంబ చూపించు జన్య క్షేత్రముల మీద నడుగులుముద్ర వేయంగబారు"**

**తురకలను మాట, చెవిలోనుదూరినంత**
**జిన్నికత్తులు చేబూని చిందులాడు,**
**భారత కుమారుడౌర శివాజీ తేడు–**
**పిల్లమొనగాడు, నడయాడు పిన్ననాడు.** పుట. 307

అంటూ జాషువా కవిత్వం ఉత్తేజంతో కదను తొక్కింది.

ఇదే ఆశ్వాసంలో, జిజాబాయిని మొగలాయిలు బంధించిన సందర్భాన్ని కూడా జాషువా వర్ణించాడు. కారాగారం నుండి విముక్తి పొందిన జిజా

**"తనువున నంటె మ్లేచ్ఛ సరదారుల నీచకళంకపంకిలం**
**బని తలపోసి, చేరువ జలాశయ నిర్మల తోయమందు క**
**ట్టిన వసనంబుతో కదువడింబడి తానముసేయకుండ నిం**
**ట నడుగు బెట్టదయ్యెను పడంతి, మృడా! యది యేమి నీమమో!** పుట. 309

పరాయి పురుషుల చూపులు తాకినంతనే కళంకం సోకుతుందని భావించే భారత స్త్రీ మనస్తత్వాన్ని అత్యంత సహజంగా వర్ణించాడు.

శివాజీ పెరుగుతున్న తీరుని జాషువా

**మేటి మరాట భూమీవధూ మాణిక్యధమ్మిల్లనకు గుందనపు బూవు**
**దర్పితారాతి భూధవ ధార్తరాష్ట్ర సమూహంబునకు మొక్కవోని పిడుగు**
**యవన సామ్రాజ్య మహాసుధా సౌధవ ప్రస్థానములకు ఫిరంగి గుండు**
**ఆ సేతు హిమగిరి వ్యాపిత భరత కాంతా బాహు పంజరాంతపుచిలుక"** అంటూ వర్ణించాడు. పుట. 310

ఒకసారి నవాబు కొల్వులోనికి 'శహాజీ శివాజీని బలవంతంగా తీసికెళ్ళినపుడు జరిగిన ఘటన– యథాప్రకారంగా శహాజీ నవాబునకు సలాము చేశారు. దీనికి పిల్ల శివాజీ ఉగ్రుడై చూశాడు.

**శంతన కుమారునకు మున్ను జామదగ్ని**
**యస్త్రకళ నేర్పజూచు గంగమ్మ బోలి**
**యవని సురునొద్ద విద్యలనభ్యసించు**
**పట్టి నారసి యా జిజాబాయి మురియు** – అంటారు జాషువా. పుట. 312

పూనా నగరంలో శివాజీ దాదోజీ అనే గురువు దగ్గర విద్యలు నేర్చుకొనే సందర్భంలో దాదోజిని అభినవ ద్రోణుడుగా వర్ణించాడు.

శివాజీలో బాల్యం గతించిపోయి, యౌవనం ప్రాప్తించిన వైనాన్ని జాషువా చమత్కారంగా వర్ణించారు.

**స్థిర దిశాదంతుల చెవులు చిల్లులు వోవగొనయంబు ననయంబుగోటమీటు**
**మిన్నులక్ష్యము చేసి మెఱయు చుక్కలు రాల మొనలున్న కఱకుటమ్ములను వదలు**
**ముసలి తామేటి మూపుంజిప్ప కంపింప మేలైన నలని గుఱ్ఱాలనెక్కు**
**పగఱకు నెదల లోపల భీతితళుకొత్త శాంకరీ ఖడ్గాన సాముసేయు**

**సాముగరడీలలో పరిశ్రమము నోర్చి**
**నిలువజాలక చెమట కన్నీరు విడిచి**
**బాల్యము గతించిపోయి, సంప్రాప్తమైన**
**పసరు మిసమిసలాడు యౌవనపువేళ** పుట. 313

యవ్వనోదయవేళ శారీరక దార్ఢ్యము చాలా అవసరం. దానికి కఠినమైన పరిశ్రమ తప్పనిసరి. దానికి భయపడి బాల్యం దానంతట అదే కన్నీరు కారుస్తూ వెళ్ళిపోయిందని వర్ణించడం గొప్ప చమత్కారం.

దయారసం ప్రవహించే చూపులు, వీరత్వం ప్రకటించే మీసాలు, ఏకపత్నీ వ్రతాన్ని స్ఫురించే చిరు గడ్డం, విజయాన్ని తలపించే బాహువులు, తురకల నెత్తుటిలో తేలియాడాలనే ఉబలాటంతో ముంజేతి కత్తి, కలికి మిన్నల చూపులను సుంకాలుగా స్వీకరించే శివాజీ పడుచుదనాన్ని జాషువా అత్యంత రసవత్తరంగా వర్ణించాడు.

ఆ తర్వాత శివాజీ సైన్యాన్ని సమకూర్చుకొన్నాడు.

నిరతస్వామి ప్రియులు, బూరిబలులు, ఆశ్రితలు, రక్షామహిత మనస్కులు, సంగ్రామ భయంకరులు, గర్భదరిద్రులు అయిన మావళీల సేనను సమకూర్చుకొన్నాడు శివాజి. వారిని గురించి జాషువా చేసిన వర్ణన

“ఎదిరించి వచ్చిన మదపుటేనుగుల తొండములు తుండెములు గొట్టంగలారు అంటూ చేసిన వర్ణనలో శివాజి సైన్య విశ్వరూపాన్ని వర్ణించారు. ఆ మావళీల దివ్యాస్త్ర మహిమ వినుతికెక్కిన మన యర్జునునకు లేదు అంటాడు జాషువా.

వారి విక్రమమింక చెప్పంగనేల, కాననములెల్ల భీతిల్లి కట్టువడియె నంటాడు.

ఆ మావళీలను, రణరంగకళావేద్యులు దన బలంబులుగా గావించుకొన్నాడు.

మేటి బలవంతులైన ఆ ఆటవికులను వర్ణిస్తూ

చికిలి జేసిన కత్తుల చెలువు గనిరి యంటాడు.

ఈ మావళీలు చతురంగ బలాలను సమకూర్చుకొన్నారు.

**సాదికి వెన్నీయజాలి వైరుల వెన్నులందన్న దాటు నాలపు గుఱాలు,**
**మావతుసింగాల మన్నించి యెదిరి సింగాల మన్నింప లొంగని గజాలు**
**వెడద సింగాణుల విశ్రమింపక, శత్రు శిరముల విశ్రమించెడు శరాలు**
**తొలి పాపరాయని తలలూచి రధికునౌదలనూచని మహోన్నతపు రథాలు**

**చిక్కు చీకట్ల గమివసించెడు వనాలు,**
**పలువితములైన రాతికొండల బిలాలు**
**యనతి కాల పరిశ్రమంబున లభించె**
**మిదభంగురర విజయవత్సాధనాలు** పుట. 318

ఇవి చాలనట్టు కానన పురంధ్రి కూడా తురకరాజుల బాహుల త్రుప్పుదుల్చి మన శివాజీకి కంటకాలను, కందకాలను, లతలను, పథములను అందించిందంటాడు జాషువా. ఆ మ్లేచ్ఛ రాజుల మహా కలుషంబులు పండిపోవుటే శివాజీ కత్తి పట్టడానికి కారణం అంటాడు. భరత భూమిని కన్నుల కిప్పుడే కూరుకుపట్టుచున్నయిది. కొంచియిమితడు జన్మ మెత్తినన్ అంటాడు.

దుర్గ రాజాలను కట్టించుకొని, విజయశంఖాలను సమకూర్చుకొని, సమర పతకాల్ని సిద్ధం చేసికొని, యుద్ధానికి సిద్ధమైనాడు శివాజీ. మొత్తం మీద శివాజీ కావ్యంలో ప్రథమాశ్వాసాన్ని చూసినప్పుడు..

శహాజీ జిజాలను గురించి, జిజా యవనుల పట్ల వ్యతిరేకత, శివాజీ పుట్టుక, బాల్యం, నవాబు దర్శనం, విద్యాభ్యాసం, వివాహం, మావళీల వీరత్వం – శివాజీ వారిని యుద్ధోన్ముఖుల్ని చేయుట – ఈ ఆశ్వాసంలో కన్పిస్తాయి.

ముఖ్యంగా జిజా పాత్ర అత్యంత అద్భుతంగా చిత్రించారు జాషువా. అలాగే మావళీల వీర విన్యాసాలు – ఇవన్నీ జాతీయవాదాన్ని పెంపొందించేలాగా ఉన్నాయి. ఆటవికులైన మావళీల గుండెబలాన్ని, కండబలాన్ని వారి ఆటవిక విన్యాసాల్ని వీరరసాత్మకంగా చిత్రించారు జాషువా. అటువంటి వీరుల్ని యుద్ధోన్ముఖులుగా మార్చడం శివాజీ చేసిన తెలివైన పని. అలాగే శివాజీ ఒక బలమైన జాతీయవాదిగా మారడానికి కావలసిన భావజాలాన్ని చిన్నప్పుడు జిజియాబాయి నూరిపోసే ఘట్టాల్ని కూడా జాషువా బలంగా చిత్రించారు. అలాగే బాల శివాజీలోని తెగింపు, యవ్వన ప్రాంగణంలోనికి అడుగుపెట్టే సందర్భం, దాదోజీ గురువుగా నియమించబడటం ఇవన్నీ.

పురాతన ప్రబంధ పోకడలోనే ఈ కావ్యాన్ని జాషువా రచించారు. అయినా కథాకథన శిల్పంలో నూతనత్వాన్ని చూపి నవభావ చతురుడనిపించుకొన్నారు.

ఆయా సందర్భాల్లోని వర్ణనలు సమకాలీన ఉద్యమానికి తగిన విధంగా ఉన్నాయి. కావ్యం మొత్తంలో వీరరసం తొణికిసలాడటం మనం చూస్తాము.

ప్రథమాశ్వాసంలో పాత్రలు, వర్ణనలు, కథాకథనం అత్యద్భుతంగా ఉంటుంది. ఆయా పాత్రల మనోభావాలను జాషువా చిత్రించిన తీరు అసమానంగా ఉంటుంది. ముఖ్యంగా, జిజియాను ప్రత్యేక శ్రద్ధతో చిత్రించారు జాషువా. తురకలకు సేవ చేస్తున్న భర్తనువ్యతిరేకించే సందర్భంలో, బిడ్డను పోషించుకొనే సందర్భంలో జాషువా వర్ణనలు అసామాన్యం. అలాగే శివాజీ వర్ణన, మావళీల సాహస వర్ణనలు జాషువా పాండితీ పటిమను పతాకస్థాయికి చేర్చాయి. అలాగే వనాలు సైతం శివాజి ప్రయత్నానికి సహాయం చేశాయని చేసిన వర్ణన అద్వితీయంగా ఉంది. శివాజీ జన్మించిన తర్వాతనే భరత భూమికి ప్రశాంతంగా నిద్ర పట్టిందని వర్ణించడం శివాజీ గొప్పతనాన్ని తెలుపుతుంది.

ఈ విధంగా 'శివాజీ' కావ్యం ప్రథమాశ్వాసం మొత్తం వీరరసగుంఫితమై అలరారుతుంది.

ఇందులోని ప్రతి పాత్ర ఆనాటి సమాజానికి ప్రేరణగా నిలచి, పరాయి పాలకులపై పోరాడాలనే తీవ్రమైన ఆలోచనలను రేకెత్తించిందని చెప్పవచ్చు. ❋

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 13 హైదరాబాద్ డిసెంబరు - 2022

# జాతీయోద్యమం - మరువరాని మలుపులు స్వాతంత్ర్యపోరాటానికి క్రైస్తవుల తోడ్పాటు

**డా. ప్రత్తిపాటి మాథ్యు,** జాతీయ అనువాద సమితి, భారతీయ భాషల కేంద్రీయ సంస్థ, మానవ వనరుల అభివృద్ధిశాఖ, ఉన్నత విద్యా విభాగం, భారత ప్రభుత్వం, మానస గంగోత్రి, మైసూరు, చరవాణి : 9482989241

**కీలక భావనలు :** జాతీయోద్యమం, స్వాతంత్ర్యపోరాటం, క్రైస్తవుల తోడ్పాటు

భారతదేశ స్వాతంత్ర్యం 75 సంవత్సరాలను మనం జరుపుకుంటున్న సందర్భంలో, క్రైస్తవ సమాజం దేశ జాతీయోద్యమానికి అందించిన సహకారం గురించి చట్టబద్ధంగా గర్వపడదగిన కారణాలు అనేకం ఉన్నాయి. భారతదేశం స్వాతంత్ర్యం పొందటానికి ముందు దేశ జనాభాలో 2.3 శాతం మంది క్రైస్తవులు దేశ అభివృద్ధికి గణనీయమైన, విశిష్టమైన రీతిలో దోహదపడ్డారు. వాస్తవానికి ఈ సహకారం నాణ్యత, పరిమాణాల రెండింటిలోనూ దాని సంఖ్యలను మించి ఉంది. భారతదేశ అభివృద్ధి ప్రతి రంగంలో ముఖ్యంగా పేదల అభివృద్ధి రంగంలో చర్చి కీలక పాత్ర పోషించింది, ఇప్పటికీ పోషిస్తోంది కూడా. నిష్పక్షపాతంగా ఆలోచిస్తే భారతదేశ విషయంలో ఇది వాస్తవం. క్రైస్తవులు విద్య, వైద్య, సామాజిక సేవారంగాలలో చేస్తున్న కృషిని, వాస్తవాలను దాచలేము.

### సమాజ అభద్రత

స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాల తర్వాత విద్య, ఆరోగ్యం సామాజిక రంగాలలో దాని ప్రధాన సహకారం ఉన్నప్పటికీ, ద్వేషపూరిత రాజకీయాలు, తప్పుడు ప్రచారాల కారణంగా సమాజం అభద్రతలో ఉంది. దురదృష్టం ఏమిటంటే, సమాజంపై దాడి చేసే వారు భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో ఎప్పుడూ ముందంజలో లేరు. వీరు గిరిజనులు దళితుల అభివృద్ధి పోరాటాలలో లేకపోవడం గమనార్హం. క్రైస్తవ సమాజం దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారితో కలిసి చురుకుగాపనిచేసింది. క్రైస్తవ మతంపై అవాంఛిత ప్రచారం దేశం ఐక్యతకు, సమగ్రతకు ముప్పు కలిగిస్తుంది.

### క్రైస్తవం పాశ్చాత్యమా?

క్రైస్తవ మతం పాశ్చాత్య మతం అనేది ఆధారం లేని మరొక ఆరోపణ. జీసస్ జన్మస్థలం ఐరోపాలో కాదు, మధ్యప్రాచ్యంలో ఉంది. భారతదేశాన్ని క్రైస్తవ మతంలోకి మార్చడంలో క్రైస్తవులు బ్రిటిష్ వారితో జతకట్టారనే ఆరోపణకు వ్యతిరేకంగా, ప్రారంభ మిషనరీలు వలసవాదులకు ఎటువంటి సంబంధాలు లేవని వాదించవచ్చు. బ్రిటిష్ పాలకులు క్రైస్తవులేనా కేవలం పేరుకు మాత్రమేనా అనే అంశాన్ని పరిశోధించితెలుసుకోవలసిన ఉంది. వారు ఆర్థిక లక్ష్యంతో వచ్చారు, వారి లక్ష్యం మతం మార్చడం కాదు, ప్రపంచవ్యాప్తంగా కాలనీలను సృష్టించడం. ఆర్థిక లబ్దిని పొందటం. చర్చి ఆఫ్ సౌత్ ఇండియా లేదా భారతీయ క్రైస్తవులు బ్రిటిష్ వారి నుండి ఎలాంటి అనుగ్రహాన్ని పొందలేదు.

నిజానికి యు.కె. తో సహా పశ్చిమ దేశాలలో చర్చి, రాష్ట్రం విడివిడిగా ప్రకటించబడ్డాయి మొదటి నుండి వలసవాదులు మతాన్ని ప్రోత్సహించడానికి నిరాకరించారు. వారు మిషనరీ ప్రాజెక్ట్ తో జతకట్టవలసి వస్తే తమ ఆర్థిక లక్ష్యం విఫలమవుతుందని కూడా వారు ఆందోళన చెందారు. బ్రిటిష్ ఇతర వలసవాదుల ప్రధాన లక్ష్యం మతమార్పిడి కాదు. అలాగయితే, దేశంలో కేవలం

2.3 శాతం కంటే ఎక్కువ మంది క్రైస్తవులు ఉండాలి. సాధారణ పౌరులు ఇంత విస్తృతమైన, విపరీతమైన ప్రచారాన్ని ఎంతగా విశ్వసించారో అందరికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

**భారతదేశ క్రైస్తవ మత జాతీయవాదం**

చర్చికి ఇతర ప్రగతిశీల వర్గాల మాదిరిగానే జాతీయవాదం ఉంది. అన్ని ప్రగతిశీల అంశాలతో పొత్తు పెట్టుకుంది. వారు ఖచ్చితంగా వలసవాద కుట్రలో భాగం కాదు. వాస్తవానికి, క్రైస్తవ మతం ప్రారంభం నుండి విశ్వాసులను వారి జాతీయ భావనల నుండి బయటకు తీసుకురావడానికి ఎప్పుడూ ప్రయత్నించలేదు. కానీ క్రైస్తవ మతం పేదలకు, అణగారిన వారి కోసం పని చేయడంలో పరోపకార తత్వాన్ని ప్రస్ఫుటంగా చాటింది. పేదల కోసం పని చేసే ఈ మిషన్‌లోనే అనేక మంది క్రైస్తవులు భారతదేశ వనరులను దోచుకోవడాన్ని, ఇంకా వలసవాద తత్వాన్ని పూర్తిగా వ్యతిరేకించారు. తద్వారా క్రైస్తవులు భారతదేశ సమగ్రతకు కృషిచేశారు.

యూరోపియన్ మతాధికారులు కూడా వలసవాదుల దోపిడీ మిషన్‌తో కంపించలేదు. బ్రిటిష్ పాలనను వ్యతిరేకించిన మొదటి వ్యక్తి పూర్తిగా బ్రిటిష్ క్రైస్తవ మతగురువు, చార్లెస్ ఫ్రీర్ ఆండ్రూస్ (ఫిబ్రవరి 12, 1871 – ఏప్రిల్ 5, 1940), చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్ గురువు, ఒక మిషనరీ, విద్యావేత్త సంఘ సంస్కర్త. మహాత్మాగాంధీకి సన్నిహిత మిత్రుడు భారతదేశ స్వాతంత్ర్యానికి కారణం. గాంధీ పౌర హక్కుల పోరాటానికి నాయకత్వం వహిస్తున్న దక్షిణాఫ్రికా నుండి భారతదేశానికి తిరిగి వచ్చేలా గాంధీని ఒప్పించడంలో ఆయనదే బాధ్యత అని చెప్పబడింది. 1906 నాటికి ఈ గురువు భారత జాతీయ కాంగ్రెస్ కార్యకలాపాల్లో పాలుపంచుకున్నాడు. మద్రాసులో 1913 పత్తి కార్మికుల సమ్మెను పరిష్కరించడానికి ఆయన ఎంతగానో సహాయం చేశాడు.

బ్రిటీష్ వలస ప్రభుత్వ ఇబ్బందికీ ఆగ్రహానికి గురైే, జాతీయవాద కారణానికి పూర్తి మద్దతునిచ్చిన క్రైస్తవ మిషనరీలు ఎంతోమంది ఉన్నారు. ఈ మిషనరీలలో బాగా తెలిసిన పేర్లు : స్టాన్లీ జోన్స్ (Stanley Jones) జె.సి.విన్స్‌లో (J. C. Winslow) వారియర్ ఎల్విన్ (Varrier Elwin), రాల్ఫ్‌రిచర్డ్ కీథాన్ (Ralph Richard Keithahn) ఎర్నెస్ట్ ఫారెస్టర్-పాటన్ (Ernest Forrester-Paton) మొదలైనవారు. స్వాతంత్ర్య పోరాటానికి మద్దతు ఇచ్చినందుకు కొంతమంది మిషనరీలను భారతదేశం నుండి బహిష్కరించారు కూడా.

**స్వాతంత్ర్య పోరాటంలో బారిస్టర్ జార్జ్ జోసెఫ్, టైటస్**

మతాధికారులతో పాటు కౌంటీ అంతటా అనేక మంది క్రైస్తవులు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. 1887లో భారత జాతీయ కాంగ్రెస్ మద్రాసు సమావేశంలో 607 మంది ప్రతినిధులలో 35 మంది క్రైస్తవులు పాల్గొన్న వారిలో ఉన్నారు. కాంగ్రెస్ తదుపరి నాలుగు సమావేశాలలో భారతీయ క్రైస్తవ సమాజం కూడా ప్రాతినిధ్యం వహించింది. కాంగ్రెస్ సమావేశానికి భారతీయ క్రైస్తవ ప్రతినిధుల నిష్పత్తి జనాభాలో వారి నిష్పత్తి కంటే చాలా ఎక్కువ. ఈ కాలంలో కాంగ్రెస్‌లోని ప్రముఖ క్రైస్తవ నాయకులు, ఆర్.ఎస్.ఎన్. మద్రాసు నుండి ప్రముఖ న్యాయవాది సుబ్రమణియన్, బెంగాల్ నుండి కాళీ చరణ్ బెనర్జీ, లాహోర్ నుండి జి. జి. నాథ్, మద్రాసు నుండి పీటర్ పాల్ పిళ్లై ఒరిస్సా నుండి న్యాయవాది మధుసూదన్ దాస్, కేరళ నుండి బారిస్టర్ జార్జ్ జోసెఫ్ హోమ్ రూల్ ఉద్యమంలో చురుకుగా పాల్గొనేవారు. అన్నె బెసెంట్‌తో సన్నిహిత సంబంధం కలిగి ఉన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ తన ఆత్మకథలో ఆయనను గురించి ప్రస్తావించారు. అచ్చమ్మ చెరియన్ భారతదేశంలోని పూర్వపు ట్రావెన్‌కోర్ (కేరళ) నుండి స్వాతంత్ర్య సమరయోధురాలు. ఆమె ట్రావెన్‌కోర్‌కి చెందిన ఝాన్సీ రాణిగా ప్రసిద్ధి చెందింది. టైటస్జీ మరొక గాంధేయవాది. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని గాంధీజీని దండి మార్చ్ లో అనుసరించారు.

ఇటీవల రద్దు చేయబడిన 500 రూపాయల నోటులో 1930లో మహాత్మాగాంధీ చేసిన చారిత్రాత్మక దండి సాల్ట్ మార్చ్ చిత్రం కూడా ఉంది. ఇది బ్రిటిష్ వారి నుండి భారతదేశానికి విముక్తికి దారితీసిన విస్తృత శాసనోల్లంఘన ఉద్యమాన్ని ప్రేరేపించింది. శిల్పం గాంధీజీ శాసనోల్లంఘన నిరసనను అనుసరించి పది మంది భారతీయులను చూపిస్తుంది. భారతదేశ విధిని మార్చే

కవాతుల్లో శ్రీ తేవర్తుండియిల్ టైటస్ కూడా ఉన్నారు. టైటస్ సబర్మతి ఆశ్రమంలో మహాత్మాగాంధీని కలుసుకొని అందులో చేరాడు. ఆయన వివాహం తరువాత ఆయన భార్య అన్నమ్మ కూడా సబర్మతి ఆశ్రమంలో చేరింది. ఆశ్రమానికి తన బంగారు వివాహ ఆభరణాలను విరాళంగా ఇచ్చారు.

మహాత్మాగాంధీ ఉప్పు చట్టాన్ని ఉల్లంఘించాలని నిర్ణయించుకున్నప్పుడు, టైటస్ తనతో పాటు వెళ్లేందుకు ఎంచుకున్న 78 మందిలో ఒకరు. శాసనోల్లంఘన ఉద్యమంలో టైటస్ కొట్టాయంలో బ్రిటిష్ దుస్తులను (విదేశీ బట్టలు) కాల్చివేసి, వేలాది మంది కేరళీయులకు ఆవేశపూరిత ప్రసంగం చేశాడు. గాంధీజీ టైటస్ ఇంటికి కూడా వెళ్లారు. 1930–1940లలో ట్రావెన్‌కోర్‌లో జరిగిన స్వాతంత్ర్య ప్రజాస్వామ్య అనుకూల ఉద్యమంలో, ప్రముఖ క్రైస్తవ నాయకులు టి.ఎం. వర్గీస్, ఎ.జె. జాన్, అన్నే మస్కరెన్స్ అచ్చమ్మ చెరియన్ మార్గదర్శక దళాలు. ఫిలోపోస్ ఎలంజిక్కల్ జాన్ (1903–1955) ట్రావెన్‌కోర్ స్టేట్ కాంగ్రెస్‌లో మరొక ప్రముఖ సభ్యుడు.

**కుమారప్ప, పాల్ రామసామి, వెంకల్ టబ్స్**

స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న భారత సంతతికి చెందిన మరికొందరు విశిష్టమైన క్రైస్తవులు డా. కుమారప్ప ఒక ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు. ఆయన గాంధీ సన్నిహితులలో ఒకడు. గాంధీ సత్యాగ్రహానికి బలమైన మద్దతుదారుడు. జాతీయ ఉద్యమంలో క్రైస్తవ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాడు. యంగ్ ఇండియాకు రెగ్యులర్ రైటర్ అయిన ఆయన దాని సంపాదకుడిగా అడుగుపెట్టాడు. ఆయన రాసిన ఆవేశపూరిత రచనలు 1931లో ఆయనకు ఒకటిన్నర సంవత్సరాల కఠిన కారాగార వాసాన్ని అందించాయి. 'క్విట్ ఇండియా' ఉద్యమ సమయంలో, ఆయన తన కాంగ్రెస్ సహచరులతో కలిసి బొంబాయిలో భూగర్భ కార్యకలాపాలు, రహస్య విధ్వంసక చర్యల విషయాలు ఆయన అరెస్టుకు దారితీశాయి. మూడు అభియోగాల కోసం ఆయనకు రెండున్నర సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించబడింది. 1945 వరకు జబల్పూర్ సెంట్రల్ జైలుకు పంపడం జరిగింది.

1906లో జన్మించిన పాల్ రామసామి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న మరొక ముఖ్యమైన క్రైస్తవుడు. 1930లో ఉప్పు సత్యాగ్రహ రోజుల్లో స్వాతంత్ర్య ఉద్యమంలో చేరారు. తిరుచిరాపల్లిలోని బిషప్ హెబర్ కాలేజీని పికెటింగ్ చేశారు. ఆయన్ని అరెస్టు చేసి ఆరు నెలల జైలు శిక్ష విధించారు, తిరుచ్చిరాపల్లి, అలీపురం జైళ్లలో ఉంచారు.

వెంకల్ చక్కరాయ్ (1880) శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నారు. 1920లో సహాయ నిరాకరణ ఉద్యమం ప్రారంభమైనప్పుడు, అందులో పాల్గొన్న భారతీయ క్రైస్తవులు మొత్తం భారతదేశంలో ఉన్నారని ఆర్థర్ జయ కుమార్ చెప్పారు. 1922లో లక్నోలో జరిగిన ఆల్ ఇండియా కాన్ఫరెన్స్ ఆఫ్ ఇండియన్ క్రిస్టియన్స్ జాతీయ ఉద్యమంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించిన భారతీయ క్రైస్తవుల గురించిన ప్రస్తావన ఈ కాన్ఫరెన్స్ నివేదికలో ఉంది.

ఎన్. ఎచ్. టబ్స్ కలకత్తాలోని బిషప్ కళాశాల ప్రిన్సిపాల్, ఫిబ్రవరి 23, 1921 నాటి తన మిషన్‌కు ఒక రహస్య లేఖ రాశారు. "గత నెలల్లో చాలా ముఖ్యమైన లక్షణం గత నెలల్లో చాలా ముఖ్యమైన లక్షణం జాతీయ సహాయ నిరాకరణ ఉద్యమంలో క్రైస్తవ విద్యార్థుల ఎంతోఆసక్తిని కనబరచటం". 1930లో ది గార్డియన్ సంపాదకుడు అనేకమంది క్రైస్తవ యువకులు శాసనోల్లంఘన ఉద్యమంలో చేరారని చెప్పారు.

**నిరాద్ బిస్వాస్ బ్రహ్మబంధ్ ఉపాధ్యాయ**

నీరద్ బిశ్వాస్, తరువాత చర్చ్ ఆఫ్ ఇండియా, బర్మా సిలోన్ (CIBC) అస్సాం బిషప్‌గా మారారు. 1932లో కలకత్తా వెలుపల ఉప్పు తయారీలో జాతీయ ఉద్యమంలో చేరారు. కాథలిక్ సాధు వేదాంతవేత్త అయిన బ్రహ్మబంధ్ ఉపాధ్యాయ (1861–1907), స్వదేశీ ఉద్యమంలో ప్రముఖ పాత్ర. వహించారు. ఆయన 1904లో స్థాపించబడిన "సంధ్య" అనే జాతీయ పత్రికకు సంపాదకత్వం వహించారు. అది ప్రజలపై నిర్ణయాత్మక ప్రభావాన్ని చూపింది. ఎందుకంటే ఇది బెంగాలీలో సంపూర? భారతీయ జాతీయవాదాన్ని ధైర్యంగా సమర్థించే ఏకైక మాతృభాష పత్రిక.

స్వాతంత్ర్య పోరాటంలో కర్ణాటక కాథలిక్కుల పాత్ర

స్వాతంత్ర్య పోరాట చరిత్రలో జోచిమ్ అల్వా (1907–1979) మరొక విశిష్ట వ్యక్తి. మహాత్మాగాంధీ ఆశయాల ప్రభావంతో భారతదేశంలో యువజన ఉద్యమానికి మార్గదర్శకుడు. జాతీయోద్యమానికి హృదయపూర్వక భక్తి ప్రదర్శించాడు. స్వాతంత్ర్య పోరాటం కోసం తనను తాను అంకితం చేసుకోవడం కోసం, తన లాభదాయకమైన ఉద్యోగాన్ని కూడా వదులుకున్నాడు. ముఖ్యంగా తన ఫోరమ్ ద్వారా ఆయన స్వదేశీ మానవ సౌభ్రాతృత్వ భావనను తీవ్రంగా సమర్థించిన ఉన్నత స్థాయి పాత్రికేయుడు. శ్రీమతి వైలెట్ అల్వా (1908–1969) జాతీయవాద ఆసక్తిని కలిగి ఉన్న మరొక వ్యక్తి. స్వాతంత్ర్య ఉద్యమంలో అల్వాస్ ప్రమేయం గురించి ఇలా చెప్పబడింది: "వారు తమ సర్వస్వాన్ని పణంగా పెట్టారు, కానీ వారు తమ శక్తి మేరకు పూర్తి స్థాయిలో సేవ చేసారు."

మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో సౌత్ కెనరా జిల్లాకు ప్రాతినిధ్యం వహించిన జెరోమ్ సల్దాన్హా మహాత్మాగాంధీకి హృదయపూర్వక ఆరాధకుడయ్యాడు. 1927లో గాంధీజీ మంగళూరును సందర్శించినప్పుడు, జెరోమ్ సౌత్ కెనరా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా, మహాత్ముడు ప్రసంగించిన బహిరంగ సభకు అధ్యక్షత వహించాడు. జెరోమ్ రచనలలో, ముఖ్యంగా మంగళూరు పత్రికలో ఉచ్చారణ ద్వారా స్వాతంత్ర్య ఉద్యమానికి మద్దతు ఇచ్చాడు. స్వాతంత్ర్య ఉద్యమానికి మరొక మద్దతుదారు మారిస్ శ్రేష్ఠ, బ్రిటిష్ రాజ్ కింద ప్రభుత్వ ఉద్యోగి, ఆయన పోస్ట్ మాస్టర్ జనరల్, సిలోన్‌గా పదవీ విరమణ చేశాడు. పదవీ విరమణ తరువాత, ఆయన మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు ఎన్నికయ్యాడు. డాక్టర్ మైఖేల్ లోబో పేర్కొన్నట్లుగా "తన కెరీర్ మొత్తంలో, ఆయన భారతీయుడిగా గుర్తించబడాలని కోరుకున్నాడు ఆయన శ్రేష్ఠ (సంస్కృత పదం నుండి గొప్పది) అనే ఇంటిపేరును స్వీకరించాడు. ఇతర సివిల్ సర్వెంట్లు ఉన్న సమయంలో బ్రిటిష్ సివిల్ సర్వెంట్ కోసం సాహసోపేతమైన చర్య ఏదైనా ఉందంటే, వారి పేర్లను ఆంగ్లీకరించడానికి ప్రయత్నించటమే.

స్వాతంత్ర్య ఉద్యమానికి మరొక కెనరా కాథలిక్ మద్దతుదారుడు ఫెలిక్స్ అల్బుకెర్కీ పాయ్, మంగళూరులోని అల్బుకెర్కీ టైల్ ఫ్యాక్టరీ మాగ్నెట్. గాంధీజీ ప్రేరణతో, ఆయన బ్రిటిష్ చట్టాన్ని (1930) ధిక్కరించి ఉప్పును తయారు చేశాడు. 1933లో జవహర్‌లాల్ నెహ్రూ మంగళూరుకు వచ్చినప్పుడు, ఆయన మొదట బోలార్‌లోని అల్బుకెర్కీ నివాసంలో దిగి, తరువాత బహిరంగ సభ జరిగిన ఫల్నీర్‌కు ఊరేగింపుగా తీసుకెళ్లారు, రిసెప్షన్‌కు ఫెలిక్స్ పాయ్ ఆర్థిక సహాయం చేశారు. 1930లలో ముగ్గురు కెనరా జంటలు స్వాతంత్ర్య ఉద్యమంలోకి ప్రవేశించారు–థామస్ హెలెన్ అల్వారెస్, సిప్రియన్ ఆలిస్ అల్వారెస్ జోచిమ్ వైలెట్ అల్వా. థామస్ హెలెన్ అల్వారెస్‌లను మహాత్మ స్వయంగా స్వాతంత్ర్యం కోసం మార్చారు. వారు ఒకప్పుడు టీతో అలరించారు. వారు మహాత్మునికి ఎంతగానో ఆకట్టుకున్నారు. వారు తమ పిల్లలకు భారతీయ మొదటి పేర్లను పెట్టాలని నిర్ణయించుకున్నారు. హెలెన్ స్వయంగా అల్వా దేవి పేరును స్వీకరించింది. ఆమె సత్యాగ్రహం గొప్ప వోటర్ దానిని బహిరంగ ప్రసంగాల ద్వారా వ్యక్తీకరించారు. ఇతర జంట సిప్రియన్ ఆలిస్‌లలో, సిప్రియన్ 1930లో వాడాలా ఉప్పు సత్యాగ్రహం సమయంలో అరెస్టయ్యాడు. కొద్దిమంది స్వాతంత్ర్య సమరయోధులలో ఒకరు. అతని భార్య ఆలిస్ తన భర్తతో కలిసి క్విట్ ఇండియా ఉద్యమంలో చేరి అండర్ గ్రౌండ్ లోకి వెళ్లిపోయింది. కానీ వారిద్దరినీ నవంబర్ 1942లో అరెస్టు చేసి బొంబాయిలో ప్రత్యేక లాకప్‌లలో ఉంచారు.

1920ల ప్రారంభంలో స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ నాయకత్వం వహించిన వెంటనే, బొంబాయికి చెందిన మంగళూరు క్యాథలిక్ జాన్ ఫ్రాన్సిస్ పింటో, రాజకీయాలలో నిమగ్నమై ఉన్నాడు. గాంధీ పట్ల ఆయనకున్న అభిమానం, గాంధీ–టోపీ ధరించడం 1930లలో శాసనోల్లంఘన ఉద్యమంలో చురుగ్గా పాల్గొనడం వల్ల, ఆయన "గాంధీ పింటో" అనే మారుపేరును పొందాడు.

క్రైస్తవుల పట్ల అంతగా సానుభూతి లేని ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త కామత్, అనేక మంది క్రైస్తవులు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని తన ఆత్మకథలో అంగీకరించి సైప్రియన్ అల్వారెస్, జోచిమ్ అల్వా, మార్సెల్ ఎ.ఎమ్. క్రిస్టియన్

స్వాతంత్ర్య సమరయోధులుగా డిసౌజా. ఆయన ఇలా అంటున్నాడు: "నాకు వ్యక్తిగతంగా తెలిసిన చాలా మంది రోమన్ క్యాథలిక్‌లు స్వాతంత్ర్య ఉద్యమంలో జాతీయ ప్రధాన స్రవంతిలో చాలా మంది ఉన్నారని చెప్పడం అవసరం."

**భారత జాతీయ కాంగ్రెస్‌లో క్రైస్తవులు**

1885 నుండి భారత జాతీయ కాంగ్రెస్ వివిధ సమావేశాలలో క్రైస్తవుల ప్రభావం ఆకట్టుకుంది. రెవ. కాళీచరణ్ బెనర్జీతో పాటు జి.సి. లాహోర్ నుండి నాథ్ మద్రాస్ (ప్రస్తుత చెన్నై) నుండి పీటర్ పాల్ పిళ్లై 1888–1891 మధ్య జరిగిన నాలుగు కాంగ్రెస్ సమావేశాలలో భారతీయ క్రైస్తవులకు ప్రాతినిధ్యం వహించారు. కాంగ్రెస్ ఏర్పడిన తొలి సంవత్సరాల్లో కాంగ్రెస్‌లో ప్రముఖ నాయకుడయ్యారు. 1889లో భారతీయ ఉపాధ్యాయులు జాతీయ ఉద్యమాలలో పాల్గొనకుండా నిషేధించాలనే ఆలోచనను తీవ్రంగా నిరసించాడు.

1887లో జరిగిన కాంగ్రెస్ మూడవ వార్షిక సమావేశంలో, సెషన్‌లో పాల్గొన్న 607 మందిలో, 15 మంది క్రైస్తవులు. అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగించిన వారిలో మధు సూధన్ దాస్ (1848–1934, ప్రముఖంగా 'ఉత్కల్ గౌరబ్' అని పిలుస్తారు) ఒక బావి. –ఒడిశాలోని క్రైస్తవ సమాజానికి చెందిన ప్రముఖ నాయకుడు. కాంగ్రెస్ తదుపరి సమావేశాలలో భారతీయ క్రైస్తవుల సంఖ్య ప్రభావం ఆకట్టుకునేలా కొనసాగింది.

1889 కాంగ్రెస్ సమావేశంలో, పది మంది మహిళా ప్రతినిధులలో ముగ్గురు క్రైస్తవులు: పండిత రమాబాయి సరస్వతి (1858–1922), శ్రీమతి ట్రయంబక్ శ్రీమతి నికాంబే.

**స్వరాజ్ ఉద్యమంలో క్రైస్తవులు**

1930లో, బొంబాయిలో భారతీయ క్రైస్తవుల ప్రధాన సమావేశం జరిగింది, అక్కడ వారు అనేక తీర్మానాలను ఆమోదించారు; వారు ఆమోదించిన మొదటి తీర్మానం–భారతదేశం సంపూర్ణ స్వరాజ్యాన్ని గెలవాలనే కోరిక. 1931లో, మహాత్మా గాంధీ రౌండ్ టేబుల్ కానారేన్స్‌కు బయలుదేరే సందర్భంగా, వారు ఒక మెమోరాండంను సమర్పించారు– స్వరాజ్యానికి వారి నిర్వచనం– " అసలు రాజకీయ అధికారం బాధ్యత ఆలస్యం లేకుండా ప్రజల నుండి రిజర్వేషన్లు లేకుండా బదిలీ చేయబడాలనే జాతీయ డిమాండ్‌కు మేం హృదయపూర్వకంగా మద్దతు ఇస్తున్నాం. భారతదేశ ప్రజలకు ఇంగ్లాండ్. మేం పూర్తి స్వేచ్ఛ కోసం నిలబడతాం, అనియంత్రిత అధికారం కోసం, ఏ విధంగా అయినా, మా ఆర్థిక రాజకీయ వ్యవహారాల నిర్వహణను మేం కోరుకుంటున్నాం. అయినప్పటికీ, మన సార్వభౌమ హక్కులను లొంగదీసుకోకుండా, సంపూర్ణ సమానత్వ నిబంధనల ఆధారంగా ఇండో–బ్రిటీష్ సహకారాన్ని మేము స్వాగతిస్తాం.

1944లో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ చర్చిస్ ఇన్ ఇండియా సమావేశంలో, కౌన్సిల్ 'చర్చ్ అండ్ స్టేట్ ఇన్ యుద్ధానంతర భారతదేశంలో' అనే అంశంపై ఒక ప్రకటనను ఆమోదించింది: "క్రైస్తవ మనస్సాక్షికి, భారతదేశంలో ప్రభుత్వానికి పాలించే మధ్య ఉన్న ప్రస్తుత సంబంధం క్రైస్తవ ప్రమాణాల ప్రకారం ప్రాథమికంగా సంతృప్తికరంగా లేదు. ఈ సంబంధాలను సమూలంగా మార్చవలసిన సమయం ఆసన్నమైందని స్పష్టమవుతుంది. సామ్రాజ్యవాదాన్ని క్రైస్తవ మనస్సాక్షి ఖండించింది. భారతదేశంలో దానిని తక్షణమే అంతం చేయాలని అంగీకరించబడింది.

సహాయ నిరాకరణ ఉద్యమం (1920), శాసనోల్లంఘన ఉద్యమం (1930) 'క్విట్ ఇండియా' ఉద్యమం (1942) మొదలైన వాటిలో క్రైస్తవులు చురుకుగా పాల్గొన్నారు. 1920ల నుండి, అనేక క్రైస్తవ సంస్థలు స్వాతంత్ర్య ఉద్యమానికి పూర్తి సంఘీభావం తెలుపుతూ తీర్మానాలు చేశాయి. వారిలో కొందరు బ్రిటీష్ వలస ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ ప్రదర్శనలలో కూడా పాల్గొన్నారు. చర్చిలు స్థాపించిన ఉన్నత విద్యాసంస్థలలోని అనేక మంది విద్యార్థులు స్వరాజ్ ఉద్యమంలో చురుకుగా ఉన్నారు. ఈ సంస్థలు వారి విద్యార్థులకు పూర్తి మద్దతు ఇచ్చాయి.

## క్రైస్తవ మతం సంస్కరణ

సతి, అంటరానితనం, కుష్ఠురోగులను చంపడం పిల్లల బలితో సహా భారతదేశంలో కొనసాగుతున్న సాంఘిక దురాచారాల పట్ల మొదటి నుండి మిషనరీలు ఆశ్చర్యపడటంతోపాటుగా వ్యతిరిక్తతను వ్యక్తీకరించారు. విలియం కేరీ 1793లో వచ్చినప్పటి నుండి శిశుహత్య, సతి అంటరానితనం సమస్యలపై క్రైస్తవులు చురుకుగా పనిచేశారు. విలియం కేరీ ఒకవైపు అధికారంలో ఉన్నవారితో తనకున్న సంబంధాలను ఉపయోగించుకుంటూ, అలాంటి పద్ధతులను చట్టవిరుద్ధంగా ప్రకటించాలని ప్రచారం చేస్తూనే, మరోవైపు మానవతా ఆందోళనకు సంబంధించిన విషయాలపై ప్రజాభిప్రాయాన్ని తెలియజేయడానికి తన ప్రచురణలను ఉపయోగించుకున్నాడు. 1814 నాటికి రామ్ మోహన్ రాయ్ సతికి వ్యతిరేకంగా ప్రచారంలో విలియం కేరీ ఉన్నాడు. 438 వితంతువుల దహనానికి సంబంధించిన ఖాతాలతో సాయుధమై, విలియం కేరీ అతని సెరంపూర్ సహచరులు చట్టం ద్వారా ఆచారాన్ని నిషేధించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. మొదట్లో చాలా తక్కువ పురోగతి సాధించినప్పటికీ, ఉన్నతవర్గ హిందూ నాయకుల నుండి తీవ్ర వ్యతిరేకత కారణంగా, చివరికి ప్రజాభిప్రాయం సనాతన హిందువులకు వ్యతిరేకంగా మారింది. 1829లో లార్డ్ విలియం బెంటింక్ చివరకు ఈస్ట్ ఇండియా కంపెనీ ఆక్రమణలలో సతిని నిషేధిస్తూ ఒక ఉత్తర్వుపై సంతకం చేశాడు.

మానసిక వికలాంగుల కోసం చర్చి సంస్థలను ఏర్పాటు చేసింది. కాథలిక్, ప్రొటెస్టంట్ క్రైస్తవులు భారతదేశం అంతటా వదిలివేయబడిన, దుర్వినియోగం చేయబడిన దోపిడీకి గురైన వారి కోసం అనేక గృహాలను స్థాపించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా క్రైస్తవసంఘం పోరాడింది. చర్చి స్త్రీ విద్యను ప్రోత్సహించడం జరిగింది. 1929లో బాల్య వివాహాలపై నిషేధం విధించిన తర్వాత, చర్చి వితంతు పునర్వివాహానికి ఆమోదం తెలిపేందుకు గట్టి ప్రయత్నం చేసింది. క్రైస్తవ సంస్కరణ ప్రయత్నాలలో ట్యూబర్-క్యులోసిస్ (టి.బీ. ) రోగులకు కుష్టు వ్యాధి సోకిన వారి కోసం శానిటోరియంలను ఏర్పాటు చేయడం కూడా జరిగింది.

## గ్రామీణాభివృద్ధి

చర్చి ముఖ్యమైనదిగా భావించే మరొక ప్రాంతం గ్రామీణాభివృద్ధి. అలహాబాద్‌లో (అలహాబాద్ వ్యవసాయ కళాశాల) తమిళనాడులోని సేలం సమీపంలో రెండు వ్యవసాయ కళాశాలల స్థాపనతో "గ్రామీణ పునర్నిర్మాణం" కోసం ప్రయత్నాలు జరిగాయి.

బాసెల్ మిషన్, మంగుళూరులోని తన ప్రధాన కార్యాలయం నుండి తన పనిని ప్రారంభించింది. గ్రామ గృహ నిర్మాణాన్ని మెరుగుపరచడానికి చౌకైన టెర్రకొట్ట టైల్స్ ఇతర సంబంధిత ఉత్పత్తుల తయారీని భారతదేశంలోకి పరిచయం చేయడంలో ప్రసిద్ధి చెందింది. ఇటువంటి పలకలు ఇప్పటికీ ప్రసిద్ది చెందాయి. వాటిని ఎవరు ఉత్పత్తి చేసినా, మిషన్ టైల్స్‌గా పిలుస్తారు.

క్రైస్తవసమాజం స్త్రీ విద్యకు నాంది పలికింది. ఈ పనిలో ఎక్కువ భాగం ప్రారంభ మిషనరీల భార్యలు ఒంటరి మహిళా మిషనరీలు దీనిని చేపట్టారు. వీరిలో చాలా మంది ఉన్నారు. అనేక గ్రామాలలో అణగారిన వర్గాలకు విద్య ఉపాధి కల్పించడంలో క్రైస్తవులు మొట్టమొదటి వారుగా ఉన్నారు.

## ఆధునిక విద్యకు మూలకర్తలు

స్వాతంత్ర్యానికి ముందు తరువాత భారతదేశానికి చర్చి ఇతర ప్రధాన సహకారం ఏమిటంటే, తరతరాలుగా యువతీ యువకులు ఆధునిక విద్యను పొందారు. వీరిలో చాలా మందికి సేవా నిరతి, నిశ్చలత, ఆదర్శాలు ఉన్నాయి. ఎందుకంటే, యేసు ప్రేరణ ఆధారంగా ఈ సంస్థలు సమతావాదం మానవ సంఘంలో సభ్యులుగా ఉండే విద్యార్థులను కలిగి ఉన్నాయి. నేటికీ క్రిస్టియన్ కళాశాలలు దేశంలోని అత్యుత్తమ ర్యాంక్‌లను కలిగి ఉన్నాయి. నాణ్యమైన విద్యకు ప్రసిద్ధి చెందాయి. భారతదేశంలోని అనేక తరాల క్రైస్తవేతర, అలాగే క్రైస్తవులు, ఉన్నతవర్గాలు సామాన్యులకు విద్యను అందించాయి. పాఠశాలలకు తోడుగా ప్రింటింగ్

ప్రెస్‌లు వచ్చాయి. ఇవి అన్ని రకాల సాహిత్యం వ్యాప్తికి ఉపయోగపడ్డాయి. పాఠ్యపుస్తకాలు, నిఘంటువులు వ్యాకరణాల తయారీకి విద్యాభివృద్ధికి ఉత్సాహంగా కృషి చేసినందుకుగాను భారతదేశం మిషనరీలకు రుణపడి ఉంది.

**క్రైస్తవులు ఆరోగ్య సంరక్షణ**

భారతదేశ ఉమ్మడి సంక్షేమం కోసం క్రైస్తవులు గణనీయమైన కృషి చేసిన మరొక పరిధి వైద్య రంగం. పంతొమ్మిదవ శతాబ్దంలో భారతదేశం అంతటా వివిధ రకాల వైద్య సంస్థలు సృష్టించబడ్డాయి. దాదాపు ప్రతి మిషనరీ సొసైటీచే ఏర్పాటు చేయబడనప్పటికీ రెండు అంతర్జాతీయంగా గుర్తింపు పొందాయి. మొదటిది, క్రిస్టియన్ మెడికల్ కాలేజీ హాస్పిటల్, లూథియానా, 1893లో డాక్టర్ ఎడిత్ బ్రౌన్ చేత స్థాపించబడింది. మరొకటి, క్రిస్టియన్ మెడికల్ కాలేజ్ హాస్పిటల్, వెల్లూర్, డాక్టర్ ఇడా స్కడర్ రోడ్‌సైడ్ క్లినిక్‌ల నుండి అభివృద్ధి చెందింది. ఇది మొదట 1895లో ప్రారంభమైంది. కాలక్రమేణా ఈ రెండు ఆసుపత్రులు తమ సౌకర్యాలకు జోడించబడ్డాయి. స్త్రీలకు తరువాత పురుషులకు ప్రభుత్వ గుర్తింపు పొందిన మొదటి వైద్య కళాశాలగా అవతరించింది. చర్చి అనుబంధ సంస్థలచే ఏర్పాటు చేయబడిన ఈ ఆసుపత్రుల ద్వారా లక్షల మంది ప్రజలు రక్షించబడ్డారు. సాధారణ ఆరోగ్యాన్ని పునరుద్ధరించారు.

గ్రామాల స్థాయిలో, అనేక మారుమూల ప్రాంతాలలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కేంద్రాలతో జబ్బుపడిన వారిని బాధలను నయం చేసేందుకు చర్చి పని చేసింది. ఈనాటికీ దేశంలోని మారుమూలలలో ఉన్న చర్చి ఉనికిని యేసు స్వస్థత మిషన్‌ను కొనసాగించడం అందరూ చూస్తారు.

**క్రైస్తవులు గిరిజనులు**

క్రైస్తవులు గిరిజనులను విద్యావంతులుగా చేయడం వలన కారణంగా ఈశాన్య గిరిజనులు ఒక గౌరవాన్ని గుర్తింపును పొందారు. చర్చి, విద్యావంతులైన గిరిజనులు ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి, వాటిని పరిష్కరించటానికి ఎంతో తోడ్పడ్డారు.

**ముగింపు**

క్రైస్తవ సంఘం సంఖ్యాపరంగా చాలా తక్కువగా ఉన్నప్పటికీ, అనేక సామాజిక, వేదాంత, విద్యా విద్యా సంస్థల ద్వారా దేశ నిర్మాణానికి దాని సహకారం అపారమైనది. చర్చి సంస్థలు భారతదేశంలో ఆధునికతకు నాంది పలికాయి. చర్చి సంస్థలు చాలా వ్యవస్థీకృతమై ఉన్నాయి. వాటిలో చదివిన వారిని ఆధునీకరించడంలో ఇతరులు విఫలమైన చోట వారు విజయం సాధించారు. క్రైస్తవుల ప్రధాన సహకారం "నిజమైన ఆధునిక భారతీయులుగాను, హేతుబద్ధత మానవతా దృక్పథంతో నూతన భారతదేశ నిర్మాతల సృష్టిలో సమాజానికి ఖచ్చితంగా పాత్ర ఉంది.

సాయుధ దళాలు పౌర సేవలు, విద్య పోలీసు, సైన్స్ అడ్మినిస్ట్రేషన్, క్రీడలు వైద్యం, సామాజిక సేవ రాజకీయాలు – వివిధ సామర్థ్యాలు సేవలలో దేశానికి సేవ చేయడంతో పాటు, క్రైస్తవులు లేని ఏ రంగంలోనూ లేదు. సంఘం అనేక అట్టడుగు ఉద్యమాలు, పౌర సమాజం ప్రభుత్వేతర సంస్థలలో చురుకుగా పాల్గొంది. నిస్సందేహంగా పేదలకు నిర్మాణాత్మకంగా సేవ చేయడానికి అట్టడుగు వర్గాలకు అధికారం ఇవ్వడానికి చేసిన కృషికు చర్చి సేవను ప్రశంసించాల్సిన అవసరం ఉంది.

స్వాతంత్ర్యానికి ముందు చాలా వరకు క్రైస్తవ సామాజిక కార్యక్రమాలు విదేశీ మిషనరీలచే ప్రారంభించబడినప్పటికీ, భారతీయ క్రైస్తవులు స్వాతంత్ర్యం తర్వాత వారికి అందజేసిన వారసత్వాన్ని కొనసాగించారు. వాస్తవానికి, భారత జాతీయవాదం లక్ష్యాలను రూపొందించిన ప్రముఖ వ్యక్తులలో వారు ఉన్నారు. స్వాతంత్ర్యానంతరం లౌకికవాదం, సార్వత్రికవాదం సమతావాదం ఆలోచనలతో యువత విద్యలో సమాజం సమానంగా చురుకుగా ఉంది.

(డాక్టర్ ఆంబ్రోస్ పింటో ఎస్.జె. బెంగళూరులోని సెయింట్ అలోసియస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గారు ఇంకా ఈ అంశంపై లోతైన అధ్యయనంచేశారు. వారి రచనలలోని కొన్ని అంశాల అనువాదం మాత్రమే ఇక్కడ ప్రస్తావించటం జరిగింది)

## Reference


1. https://www.academia.edu/4481937/Indian_Christianity_ and_National_Movements
2. https://www.quora.com/Were-there-any-Indian-Christians-who-participated-in-Indias-freedom-struggle
2. https://www.quora.com/Were-there-any-Indian-Christians-who-participated-in-Indias-freedom-struggle
3. H. C. Perumalil and E.R. Hambye, Christianity in India: A History in Ecumenical Perspective (Alleppey: Prakasham Publications, 1972), 278..
4. Wikipedia.
5. https://www.quora.com/Were-there-any-Indian-Christians-who-participated-in-Indias-freedom-struggle
6. donboscoindia.com/English/resourcedownload.php?pno= 1&secid=238
7. http://wikivisually.com/wiki/Participation_of_Ma ngalorean_ Catholics_in_the_Indian_ Independence_Movement
8. https://www.facebook.com/media/set/?set=a. 1128128687275311. 1073741946. 107213699366820 & type=3
10. https://biblicalstudies.org.uk/pdf/ijt/46_099.pdf
11. https://www.outlookindia.com/magazine/story/why-christianity-failed-in-india/293895

# జాతీయోద్యమం - ప్రజల మనిషి నవల

**డా. ఎన్. నిశ్చల,** తెలుగు సహాయాచార్యులు, ఎన్.టి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల,
మహబూబ్‌నగర్, చరవాణి : 7680975761

ఎటువంటి తారతమ్యాలు లేకుండా ఏదైనా ఒక ప్రాంత ప్రజలు కుల, మత, జాతి, ధనిక, బీదలు కలిసి స్థానికంగా కానీ, జాతీయంగా కాని సంఘటితమై చేసే నిరంతర పోరాట రూపమే జాతీయోద్యమం.

భారతదేశంలో మొట్టమొదటి సారిగా జాతీయతను జాతీయ భావాలను వెదజల్లిన మహామనీషి రాజారామమోహనరాయ్, ఆంధ్రజాతిని తట్టి లేపిన మహానుభావుడు కందుకూరి వీరేశలింగం పంతులు. వీరు ఆంధ్రదేశంలో రాజారామమోహన్ రాయ్‌లాగా తన రచనల ద్వారా సంఘ సంస్కరణోద్యమాలను నడిపినటువంటి వాడు.

1857 తిరుగుబాటు తర్వాత ప్రజలలో జాతీయ చైతన్యం కలగడానికి రాజకీయ, ఆర్థిక, సాంఘిక మతకారణాలు, ప్రతికలు, మహాసభలు దోహదం చేసాయి. 1905 లో బ్రిటిష్ ప్రభుత్వం వంగరాష్ట్ర విభజన చేసింది. ఆ విభజన ప్రజల్లో అణిగి ఉన్న జాతీయతాభావాన్ని రగిలేటట్లు చేసింది. ఈ విభజనకు వ్యతిరేకంగా వందేమాతర ఉద్యమం భారతదేశమంతటా వ్యాపించింది. 1907లో ఆంధ్రదేశంలో బిపిన్ చంద్రపాల్ పర్యటించి ఉపన్యసించాడు. ఆ ఉపన్యాసాలతో ఆంధ్రులలో జాతీయ భావనకు బీజం పడింది. భారతదేశ స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా ఆంధ్రోద్యమం నడిచింది. గాంధీజీ దేశ స్వాతంత్ర్యోద్యమమే కాక హరిజనోద్ధరణ, వ్యసన నిర్మూలన, స్త్రీజనోద్ధరణ, జాతీయ విద్యా ప్రచారం, స్వదేశీ వస్తువుల మీద అభిమానం, రైతుజన సేవ వంటి ఎన్నో సమస్యలను ముందుండి నడిపించాడు. భారత స్వాతంత్రోద్యమం జాతీయోద్యమంగా పిలవడం మొదలయ్యింది. నైజాం పాలించే ప్రాంతంలో ఉర్దూ అధికారభాష కావటంతో, తెలుగు మాట్లాడేవారు కూడా కరువవుతున్న సమయంలో 1901లో ప్రజలను చైతన్యవంతుల్ని చేసేందుకు హైదరాబాద్‌లో శ్రీకృష్ణదేవరాయంధ్రభాషానిలయం స్థాపించారు. హైదరాబాద్‌లో 1921లో వివేకవర్ధిని హాలులో జరిగిన సమావేశంలో ఆలంపల్లి వెంకటరామారావుకు, తెలుగు భాషకు జరిగిన అవమానంతో తెలుగు తెలంగాణ పెద్దలు అందరూ కలిసి, తెలుగు భాషాపరిరక్షణ కోసం ఆంధ్ర జనసంఘాన్ని స్థాపించి, భాషా వ్యాప్తి కోసం, అనేక సమావేశాలు నిర్వహించి తెలుగు వారందరిలో భాషాపరమైన చైతన్యాన్ని లేవనెత్తారు. ఆంధ్రజనసంఘం – ఆంధ్ర జన కేంద్ర సంఘం. ఆంధ్ర మహాసభగా మారింది. ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో 13 వ ఆంధ్ర మహాసభ నిర్వహించి తెలంగాణ ప్రాంతమంతా అవగాహనను కల్పించారు. కవులు, రచయితలు ప్రేరణను పొంది పాటలు, కవిత్వం, వ్యాసాలు, నవలలు, నాటకాలు, వ్రాసారు.

ఆంధ్రదేశంలో దుగ్గిరాల రామచంద్రయ్య చౌదరి "విజయనగర సామ్రాజ్యం", కేతవరపు వేంకట శాస్త్రి, భోగరాజు నారాయణ మూర్తి "ఆంధ్ర రాష్ట్రం", చిలకమర్తి, ఉన్నవ లక్ష్మీనారాయణ "మాలపల్లి", విశ్వనాథ సత్యనారాయణ "వేయి పడగలు" అడవి బాపిరాజు "హిమబిందు, అడవి శాంతిశ్రీ, గోన గన్నారెడ్డి" నోరి నరసింహశాస్త్రి, మహీధర, కొడవటిగంటి కుటుంబరావు, రావిశాస్త్రి, వుప్పల లక్ష్మణరావు రచనలు చేశారు. జాతీయోద్యమం జరుగుతున్న కాలంలో, ఆ తర్వాత కూడా నవలా సాహిత్యం మీద చాలా ప్రభావం కన్పిస్తుంది. తెలంగాణలో జరిగిన స్వాతంత్ర్య పోరాటాన్ని చిత్రిస్తూ కూడా చాలా నవలలు వ్రాయబడ్డాయి.

భూస్వామ్యవ్యవస్థలోని అణచివేతలను, దోపిడీలను ఈ నవలలు బాగా చిత్రించాయి. నిజాం నిరంకుశ విధానాలకు, ప్రజల తిరుగుబాటుకు, త్యాగాలకు ఈ నవలలు అద్దం పట్టాయి. బొల్లిముంత శివరామకృష్ణ 'మృత్యుంజయులు', లక్ష్మీకాంతమోహన్, సింహగర్జన, వట్టికోట ఆళ్వారు స్వామి 'ప్రజల మనిషి', మహీధర 'ఓనమాలు, మృత్యువునీడల్లో' వట్టికోట మరో నవల గంగు. తెలంగాణ జాతీయోద్యమాన్ని ప్రతిబింబించే నవలలు. నవలలు జాతీయోద్యమాన్ని వివిధ కోణాల నుంచి అక్షరీకరించి పాఠకుల ఆదరణను పొందాయి. లోకమలహరి జగ్గనియిద్దె, తిరునగరి రామాంజనేయులు, 'సంగం', బి.ఎన్. శాస్త్రి 'విప్లవ జ్వాల', కందిమళ్ళ ప్రతాపరెడ్డి "బందూక్", సర్వల్లి కృష్ణారెడ్డి 'ఉప్పెన', దాశరథి రంగాచార్య చిల్లరదేవుళ్ళు, డా. ముదిగంటి సుజాతారెడ్డి "మలుపుతిరిగిన రథ చక్రాలు" నవల మొదలైనవి.

**రచనాల కాలం 1952**

తెలంగాణ సమాజంలో స్ఫూర్తినింపేందుకు అహర్నిశలు తపించిన తెలంగాణ వైతాళికుడు వట్టికోట ఆళ్వారుస్వామి. నిజాయితీ, నిబద్ధత, మానవత్వం, సంస్కరణాభిలాష ఆయనకు పెట్టని ఆభరణాలు. 'ప్రజలమనిషి' నవల అభ్యుదయయుగానికి చెందిన తెలంగాణ తొలి నవలగా చెప్పుకోవచ్చు. ఈ నవలా రచన 1955, ప్రచురణ 1955 అయినప్పటికి ఈ నవలలో 1938 స్టేట్ కాంగ్రెస్‌కు మొదలవక ముందున్న, తెలంగాణ ప్రజల జీవితమని ఆళ్వారుస్వామి చెప్పుకున్నారు. ఒకనాటి తెలంగాణలో ప్రజాజీవితానికి నిలువెత్తు సాక్ష్యం ఈ నవల. ఇందులో మొదటి నుండి పేరుకు తగ్గట్లు రచయిత కంఠీరవం పాత్రను తీర్చిదిద్దాడు. కంఠీరవం వైష్ణవ కుటుంబానికి చెందిన ఆండాళ్ళమ్మ, రఘునాథాచార్యుల రెండవ కుమారుడు. నవల మొదటి నుండి చివరి వరకు అన్యాయాన్ని ఎదిరిస్తూ న్యాయం కోసం, హక్కుల కోసం సింహగర్జన చేసినట్లు పోరాడతాడు. చివరి వరకు న్యాయపోరాటం చేస్తూ స్టేట్ కాంగ్రెస్ ప్రథమ సత్యాగ్రహంలో పాల్గొని నిర్బంధించబడ్డాడు. భూస్వామ్య వ్యవస్థలో పెత్తందారీతనానికి రామభూపాల్రావు పాత్ర నిలువుటద్దం. కోటయ్యది రైతుకుటుంబం, సనాతన సంప్రదాయానికి రఘునాథాచార్యుల జీవితం పరిమితం, వెంకటాచార్యులు కుటిలబుద్ధి, అహంకారం కలిగివాడు, నవలలో స్త్రీ పాత్రలు ఆండాళమ్మ, అన్నమ్మ, సీతమ్మ, తాయమ్మ.

'ప్రజల మనిషి' నవల ఒక పోరాటనవల. తెలంగాణ ప్రజల మనస్తత్వాలు ఈ నవలలో ప్రతిబింబిస్తాయి. ఇందులో ముఖ్యంగా రాజకీయ, మత సంబంధమైన పరిస్థితులు వాటివల్ల అమాయక ప్రజలు ఏ విధంగా దోపిడీకి గురి అయ్యేవారో ఆళ్వారుస్వామి కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు. ప్రతీపాత్ర సజీవంగా గోచరిస్తుంది.

దిమ్మెగూడెం అనే గ్రామపరిస్థితులను పరిశీలిస్తే నాటి తెలంగాణ నైజాం ప్రభుత్వ పనితీరు అర్థమౌతుంది. భారతదేశ స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపుకుంటున్న ప్రజలు ఒక వైపు పోరాటాలు సాగిస్తున్న కాలమది. నిజాం నవాబు భూస్వామ్య వ్యతిరేక భావాలు తెలంగాణ ప్రజల్లో అక్కడక్కడ అంకురించాయి. దాని ఫలితంగా చైతన్యం వైపు నడిపించే ప్రయత్నం ఈ నవల ఉద్దేశం.

నవల ప్రారంభం నుండి ప్రతి సంఘటన ఒక పోరాటమే. దొర ఇంట్లో పెండ్లికి ఊర్లో అందరూ సహాయం చేసేట్లు ఆజ్ఞాపించడం. దొర కూతురు అత్తారింటికి వెళుతుంటే గొడ్డు గోదా చివరికి ఇంటికి వచ్చిన చుట్టాలకు విస్తళ్లు కుట్టి ఇవ్వాల్సిన బాధ్యత గ్రామ ప్రజలదే కావడం. ఈ విధంగా పట్వారీ, దేశముఖ్ లాంటి వాళ్ళ పెత్తనాలు సాగించేవారు, పాతకాలపు ఆచారాలు, మర్యాద గౌరవాలు రానురాను తగ్గిపోతున్నట్లు రామభూపాల్రావు ప్రవర్తన నిరూపిస్తుంది. హైదరాలీ గుమస్తా పాత్రద్వారా లంచగొండిగా, మాముళ్ళు వసూలు చేసే వ్యక్తిగా తెలుస్తుంది. అమాయకత్వంతో ఉన్న ప్రజలను ఆసరాగా తీసుకొని మోసంతో భూములు ఆక్రమించుకోవడం, ఎదురు తిరిగితే కొరడా ఝుళిపించడం లాంటి సంఘటనలు కూడా కొమరయ్య జీవితంలో కనబడుతుంది.

అధికంగా ఈ కాలంలోనే మతమార్పిడులు జరిగినట్లు తెలుస్తుంది. మతమార్పిడి కార్యక్రమాలు అంజుమన్ ఇత్తెహదులు సల్మీన్ పక్షమున తీవ్రంగా జరుగుతుండేవి. మహమ్మదీయులుగా హరిజనులను మార్చి, గ్రామ ప్రజల్లో ఆశాంతి రేకెత్తించి, బడుగు వర్గాల ప్రజల జీవితాలను అతలాకుతలం చేసేవారు. అంజుమాన్ నాయకులు, హైదరాలీ నాయకత్వంలో దిమ్మెగూడెం

ప్రజలకు జుట్టు కత్తిరించడం, మొలతాడు కత్తిరించడం వంటివి చేసి మహమ్మదీయుల పేర్లు పెట్టేవారు. హైదరాలీ స్వయంగా గౌండ్ల ముసలికి జుట్టు, మొలతాడు కత్తిరించి "గులాం రసూల్" అనే నామకరణం అడిగాడు. కంఠీరవం ఈ మతమార్పిడులు ఏమిటి? ఎందుకిలా చేస్తున్నారు? అని ప్రశ్నించినందుకు, కొమరయ్య హైదరాలీ చేస్తున్నవన్నీ అన్యాయమే అన్నందుకు జైల్లో పెట్టారు.

రామభూపాల్రావులాంటి వాళ్ళు వాళ్ళ అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ఆర్యసమాజ నాయకులతో మాట్లాడి విజయదేవుడు అనే ప్రచారకుని తీసుకొని వచ్చి, తిరిగి శుద్ధి సంస్కారం చేసి ఒక్కొక్కరికి అయిదు శేర్ల బియ్యం ఇప్పించాడు. తనవైపు ప్రజలను మలుపుకొని అధికారం నిలబెట్టుకొనేందుకు మళ్ళీ ప్రయత్నం చేసాడు.

నిజాం ప్రభుత్వం అనుమతితోనే రాజకీయంగా కూడా ఏ సభనైనా జరుపుకోనే వీలు ఉంటుంది. ప్రభుత్వాన్ని ఆక్షేపించే మాటలు, సభలో భజనలు ఉండకూడదనీ, దానికి తగు పత్రాలు ముందుగానే, ప్రభుత్వానికి సమర్పిస్తే, మస్జిద్ పేష్ ఇమాంజనాబ్ ముర్తజాఖాన్ సాహెబ్ గారి యొక్క అంగీకారంపై ఆ విషయాలు పరిశీలించి పరిష్కరించబడతాయి. కంఠీరవం గ్రంథాలయ ఉత్సవాల సమయంలో ఇటువంటి విషయంపై ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి, అనుమతిని పొందాడు.

స్టేట్ కాంగ్రెస్, ఆంధ్రమహాసభలులాంటివి ఏర్పడకుండా నిజాం ప్రభుత్వం నిషేధించడం లాంటివి చేస్తుండేది. కంఠీరవం లాంటి పోరాట భావాలు గల వారి వెంట ప్రజలు నాటి మత, ఆర్థిక, సాంఘిక అసమానతలు, క్రూర నిరంకుశ ప్రభుత్వ పాలన, గ్రామాల్లో పెత్తందారీ తనం క్రింద నలిగి విసిగి వేసారి ముందుకు నడిచేప్రయత్నం చేసారు. అవిద్య, అమాయకత్వం, ఆత్మీయ భావాలే అధికంగా ఉండబట్టి అధికారుల ఆటలు సాగాయి. ప్రజలంతా ఎంత ఘోరంగా పీడింపబడి, నిస్సహాయులై బతుకులు వెళ్ళదీస్తున్నదీ, అలాంటి వారిలో చైతన్యం ఎలా అకురించిందీ ముఖ్యంగా భూసమస్య, మత మార్పిడులు, రాజకీయ చైతన్యం మొదలైన విషయాలు ఆధారంగా సాగిందీ "ప్రజల మనిషి" నవల.

ఈ విధంగా క్రూరనిరంకుశ దోపిడీ పాలనకు మారుపేరుగా నిలిచిన నిజాం సంస్థానానికి వ్యతిరేకంగా తెలంగాణ ఉద్యమం మొదలయింది. తెలంగాణ పోరాట చరిత్రలో ఇది ఒక ఉజ్జ్వల ఘట్టం. వట్టికోట ఆళ్వారుస్వామి 'ప్రజల మనిషి' నవలను విశిష్టనవలగా ఈ ఉద్యమ కాలానికి చెందిందిగా పేర్కొనవచ్చు. తన అనుభవాలనే రచయిత నవలలో వాస్తవంగా చిత్రీకరించాడు. ప్రజలనే పాత్రలుగా తీసుకొని రచించిన నవల ఇది. ప్రజల తిరుగుబాటే ఇతివృత్తంగా తీసుకోవడం జరిగింది. నాటి తెలంగాణ వాతావరణం ఈ నవలలో కనబడుతుంది. నిజాం నిరంకుశ దోపిడీ పాలన, గ్రామాల్లో ప్రభుత్వ అండదండలతో సాగించే పెత్తందారీతనం, సామాన్య ప్రజలు ఆర్థికంగా, సాంఘికంగా, సామాజికంగా ఎంత ఘోరంగా పీడింపబడ్డారో ఈ నవలలో చక్కగా విశదీకరించాడు. నిస్సహాయులైన ప్రజల్లో క్రమేపి చైతన్యం, తిరుగుబాటుతనం ఎలా వచ్చిందో ఈ నవలలో చిత్రించబడింది. ముఖ్యంగా భూమి సమస్యనే ప్రధానాంశంగా తీసుకున్నాడు రచయిత. కులమతాల అడ్డుగోడల్లో మానవ ప్రగతి ఎలా కుంటుబడుతుందో రచయిత చక్కగా వివరించాడు.

రామభూపాల్రావు తన గ్రామ ప్రజల నుండి ఏ విధంగా తన అవసరాలను ఆజ్ఞాపించి అధికారంతో నెరవేర్చుకొనేవాడో నవల ఆరంభంలోనే రచయిత తెలియజేసాడు. పసివయసులోనే కొమరయ్య, కంఠీరవం వంటి వారిలో తిరుగుబాటు ఆలోచనలు ప్రస్తావించాడు. ఆ ఆలోచనలే పెరిగి, అవి అణగారిన జీవితాల్లో చైతన్యం నింపి పోరాటయోధులుగా వారిని నిలబెట్టాయి. నవల చివరి వరకు ఒక కథా సంవిధానం కన్పిస్తుంది.

ఆనాటి సమాజంలో ప్రజల్లోని నిరక్షరాస్యత, ఆచార వ్యవహారాలు, మనిషి ఆలోచనలను పరిధుల్లో గిరిగీసినట్లు చేస్తాయి. అనాదిగా వస్తున్న పట్వారీల, దేశముఖ్ అధికారాన్ని ప్రశ్నించే దిశగా ఈ నవల నవచైతన్యాన్ని నింపుతుంది. రచయిత ఆత్మాశ్రయ భావాలకు తార్కాణం ఈ నవల. ఆంధ్రమహాసభ, గ్రంథాలయ ఉద్యమం మొదలైన అంశాలకు ప్రాధాన్యతను ఇస్తూ సాయుధపోరాటానికి మార్గం చూపినట్లు ఈ నవలను తీర్చిదిద్దాడు వట్టికోట ఆళ్వారుస్వామి. ❀

ఆధార గ్రంథాలు :

1. తెలుగు సీమలో సాంస్కృతిక పునరుజ్జీవనము - డా. దేవులపల్లి రామానుజరావు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, ఆగష్టు 1991.
2. హైదరాబాద్ సంస్థానంలో నిజాం దురంతాలు- డా. కసిరెడ్డి వెంకటరెడ్డి, జాతీయ సాహిత్య పరిషత్ భాగ్యనగర్ శాఖ, ఆంధ్రప్రదేశ్, డిసెంబర్ 1992.
3. మలుపు తిరిగిన రథచక్రాలు (నవల) - డా. ముదిగంటి సుజాతారెడ్డి, రోహణమ్ ప్రచురణలు, హైదరాబాద్, జులై 1994.
4. వివేచన పరిశోధన పత్రిక, ఆంధ్ర సంస్కృతి వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక, 50వ భారత స్వాతంత్ర్య స్వర్ణోత్సవ సంవత్సరం - సంపాదకులు. ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్, మార్చ్ 1998.
5. తెలంగాణ సాయుధ పోరాట సాహిత్యం డా. ఎస్వీ. సత్యనారాయణ, డా. చెలికాని రామారావు స్మారక కమిటీ, రామచంద్రాపురం, తూర్పు గోదావరి జిల్లా, మే 1999.
6. ప్రత్యేక తెలంగాణ ఉద్యమాల చరిత్ర - శోభాగాంధి, గాంధీ ప్రచురణలు, నవంబర్ 2002
7. షబ్నవీస్ తెలంగాణ పత్రికారంగ చరిత్ర (1886-1956) - సంగిశెట్టి శ్రీనివాస్, కవిలె తెలంగాణ రిసెర్చ్ & రిఫరల్ సెంటర్, హైదరాబాద్, అక్టోబర్ 2003.
8. సలాం హైదరాబాద్ (తెలంగాణ నవల) - పరవస్తు లోకేశ్వర్, గాంధీ ప్రచురణలు, హైదరాబాద్, జూలై 2005.
9. తెలంగాణ వైతాళికుడు వట్టికోట ఆళ్వారు స్వామి సార్థక జీవనం - సంగిశెట్టి శ్రీనివాస్, ఎన్. వేణుగోపాల్, కవిలె తెలంగాణ రిసెర్చ్ & రిఫరల్ సెంటర్, హైదరాబాద్, ఫిబ్రవరి 2006.
10. పిడికెడు ఆలోచనలు (సాహిత్య వ్యాసాలు) - డా. కొలకలూరి మధుజ్యోతి, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ పద్మావతి విశ్వవిద్యాలయం, తిరుపతి, 2009
11. పునర్మూల్యాంకనం (సాహిత్య వ్యాసాలు) - డా. దార్ల వెంకటేశ్వరరావు, సొసైటీ & ఎడ్యుకేషన్ ట్రస్టు, హైదరాబాద్, ఏప్రిల్ 2010.
12. హైదరాబాద్ సిర్ఫ్‌హమారా ! - సంగిశెట్టి శ్రీనివాస్, కవిలె తెలంగాణ రిసెర్చ్ అండ్ రిఫరల్ సెంటర్, ఏప్రిల్ 2011.
13. తెలంగాణ సాహిత్య వైశిష్ట్యం - ఆచార్య ఎస్వీ రామారావు, జయశంకర్ తెలంగాణ రీసెర్చ్ & డెవలప్మెంట్ సెంటర్, హైదరాబాద్, జనవరి 2013.
14. సమన్వయ (సాహిత్య వ్యాసాలు) - డా. ఎస్. రఘు, మనస్విని ప్రచురణలు, హైదరాబాద్ డిసెంబర్ 2017.
15. తెలుగు సాహితీ దుందుభి - డిగ్రీ మూడవ సంవత్సరం - ద్వితీయ భాష
16. ద్వితీయ భాష - సంపాదకులు, ఆచార్య సూర్యాధనంజయ్, తెలుగు అకాడమీ, హైదరాబాద్, 2021.

# మాకొద్దీ తెల్లదొరతనము - జాతీయోద్యమ గేయం అనుశీలన

డా. జి. అనిత, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, గజ్వేల్, చరవాణి : 9849272449

పన్నెండు దేశాలు పండుచున్నాగాని
పట్టెడన్నమె లోపమండీ
ఉప్పు ముట్టుకుంటే దోషమండి
నోట మట్టికొట్టి పోతాడండి
అయ్యో కుక్కలతో పోరాడి కూడు తింటా మండీ
–
మాకొద్దీ తెల్లదొరతనము దేవా
మాకొద్దీ తెల్ల దొరతనం

అంటూ భారతీయులను దాస్య శృంఖలాలనుండి విముక్తి చేయడానికి తాను రచించిన పాటనే ఆయుధంగా మలచి బ్రిటిష్ వారి గుండెల్లో గుబులు పుట్టించిన తొలి తెలుగు జాతీయ కవి శ్రీ గరిమెళ్ళ సత్యనారాయణ గారు.

భారత స్వతంత్ర వజ్రోత్సవాలలో ఈ కవిని మరొక మారు తలచుకునే అవకాశం రావడం మహాద్భాగ్యం.

గరిమెళ్ళ సత్యనారాయణ గారు 1893 జూలై 14 శ్రీకాకుళం జిల్లా గోనెపాడు గ్రామంలో సూరమ్మ వెంకట నరసింహం దంపతులకి జన్మించారు. వీరు బి.ఏ చదివారు. కొద్ది రోజులు ఉపాధ్యాయులుగా పనిచేశారు. తర్వాత గాంధీజీ గారు ప్రారంభించిన సహాయనిరాకరణోద్యమంలో పాల్గొనడానికి ఉద్యోగాన్ని వదిలి వేశారు.

1921లో వీరు రాసిన స్వరాజ్య గీతములలో భాగం ఈ గేయం. వీరు హరిజనుల పాటలు, ఖండకావ్యములు, అర్థత్రయ సర్వస్వము ప్రముఖమైనవి. వీరు ఇంగ్లీషులో "హార్ట్ ఆఫ్ నేషన్" అనే దేశభక్తి కావ్యం కూడా రాశారు.

మాకొద్దీ తెల్ల దొరతనము గేయాన్ని రాసి, సహాయ నిరాకరణోద్యమంలో భాగంగా ఉద్యమంలో ఈ గేయాన్ని పాడుతూ చురుకుగా పాల్గొన్నారు. తెలుగు ప్రాంతమంతా ఎక్కడ చూసినా జనం ఈ పాటను పాడుతూ బ్రిటిష్ వారి అరాచకాలను దుయ్యబట్టారు. ఆ రోజుల్లో ఈ పాటను ప్రజల వాణిగా వినిపించారు. ఈ ఒక్క పాటను మనం నిశితంగా పరిశీలిస్తే ఇంగ్లీషు వారి పరిపాలనలో మన కష్టాలన్నీ కళ్ళముందు నిలుస్తాయి.

ఏ కాలము సాహిత్య ప్రక్రియలైనా ఆకాలపు సమాజ స్థితిగతులను ప్రతిబింబిస్తాయి. గరిమెళ్ళ వారి ఈ గేయము అందుకు గొప్ప ఉదాహరణ. వీరు గేయ ప్రారంభాన్ని నిరసనతో "మాకొద్దీ తెల్లదొరతనము దేవా" అంటూ భగవంతున్ని వేడుకుంటూ ప్రారంభించారు.

బ్రిటిష్ వారు వర్తకం నెపంతో భారతదేశానికి వచ్చి, మననే బానిసలుగా చేసి, కోర్టులు పెట్టి ధన దాహాన్ని నేర్పించారు. బ్రిటిష్ పరిపాలకులను 'వాడు' అంటూ ధైర్యంగా బాహాటంగా దూషించాడు. ఇందుకుగాను బ్రిటిష్ పాలకులు అతన్ని జైలులో పెట్టారు, అయినా భయపడని ధీరుడు శ్రీ గరిమెళ్ళ వారు.

'నూట నలుబది నాలుగు' – నోటికి తగిలించి మాటలాడ వద్దంటాడు. 144 సెక్షన్ ను ప్రారంభించింది బ్రిటిష్ వాళ్లే. ఘోర శాసనాలు చేసి అది ఎవరైనా అతిక్రమిస్తే సంసారాలు కూల్చడం, స్త్రీలను చెరచడం, సంపాదన దోచుకోవడం మొదలగు అన్యాయాలను చేయడానికి వెనుకాడేవారు కాదు. దేశంలోని ధనవంతులను దగ్గరకి తీసి పేద ప్రజల పైకి వారిని ప్రయోగించేవారు.

డబ్బు కోసం కల్లు, సారా దుకాణాలను పెట్టి, పంటలు పండిన పండకపోయినా శిస్తు కట్టమని బాధించేవారు. రైతుల భూములను లాక్కుని వారి భూముల్లోనే కూలీలుగా పనిచేయాలని ఆర్డర్ వేసి అది పాటించని వారిని జైల్లో వేసేవారు.

గరిమెళ్ళ వారి ఈ గేయంలోని ప్రతిపాదమూ బ్రిటిష్ వారి దౌర్జన్యాలను ఉటంకిస్తూ రాయబడినదే, ఎక్కడా కల్పనలు, కల్లలు, అతి శయోక్తులు లేవు. కఠినమైన నిజాలు ఈ ప్రపంచానికి చాటి చెప్పాలంటే ఎంతో గుండె ధైర్యం కావాలి. మనో నిబ్బరం, దేశభక్తి, నిస్వార్థ ఉద్యమ స్ఫూర్తి కలిగిన గరిమెళ్ళ వారు తన పదునైన గేయ పాదాలతో ప్రజలందరినీ సమైక్యపరచడానికి పూనుకున్నాడని తెలుస్తుంది.

గాంధీ టోపీ పెట్టి పాఠశాలలకు – బోవరావద్దంటాడు
టోపీ తీసి వీపుల బాదుతారు
చూడి ఆవుల కడుపు – వేడివేడి మాంసం వాడికి బహు ఇష్టమట
మాచూడి యావుల మంద
–
సురిగి ఇంటికి రాదు...

అంటూ పాడి పశువులను కోయడం, ఇరుకు గదుల్లో దేశభక్తులందరినీ బందీలుగా పెట్టి కనీసం మంచినీళ్ళు కూడా ఇవ్వకుండా, గాలి దూరకుండా హింసించడం, దొంగలతో సమానంగా దేశభక్తులను ద్రోహులని శిక్షించడం మొదలగు విషయాలన్నీ ఈ గేయములో అక్షర రూపాన్ని సంతరించుకున్నాయి.

ఈ గేయమును మూడు భాగాలుగా విభజించవచ్చు, మొదటి భాగము బ్రిటిష్ వారి ఆగడాలను తెలిపితే, రెండవ భాగము జాతి నంతటిని సమైక్యపరచడం, అందరిని ఒక తాటి మీదకు తెచ్చే ప్రయత్నం. మూడో భాగం ధర్మదేవతను వేడుకోవడం, భగవంతునికి దేశ ప్రజల తరఫున మొరపెట్టుకోవడం కనిపిస్తుంది.

రెండవ భాగంలో

"తెల్ల దొరల సేవ – వల్ల బ్రతుకుట పెద్ద నల్లని మచ్చునియెంచరోయి
గుండు పట్టు కొమమ్మ – కూల్చవచ్చినగాని – కూర్చున్న చోటుల వీడము
ఎవరు ఎన్ని చెప్పినా హిందూ దేశ వాసు – లేక సోదరులే నండి

రాట్నె లక్ష్మీ నవ్వుతుంది – దొరల తేజస్సును కూల్చే జెండా మనకున్నది, కుంటి వాదనలు కట్టిపెట్టి చెడ్డ బోధనలకు లొంగకుండా, స్వేచ్ఛ అనే వధూమణి కారాగారంలో దేశభక్తుల కొరకు వేచి ఉందని, ఈ చచ్చు రాజ్యమును వీడి జైళ్ళకు రండి అంటే ఎదిరించండి, తత్ఫలితంగా జైలులో వేసిన బాధపడొద్దని సకల దేశస్థులారా అనగా భారతీయులంతా ఒక్కసారి స్వాతంత్ర్యం పైన దృష్టి సారించండి అని, ఇక నుండి హైందవులందరూ ఏకమవుతారని తొందరలోనే కొత్త దారి దొరుకుతుందని, ఎలాంటి దండన లెదురైనా మాకది నష్టం కాదని గొంతెత్తి తన పాట ద్వారా ప్రజలను చైతన్య పరిచారు.

ఇక మూడవ భాగంలో ధర్మదేవత ప్రత్యక్షమైంది. ధర్మ దేవుడే మాకు రక్ష. ప్రజల ప్రేమయే అందరికీ రక్ష . మేమందరము ఐకమత్యంగా ఉండి "నీదుచరణ ధ్యానమే విడువమయ్య" దొరల బాధలు మాకు తొలగించుమో తండ్రి" అంటూ తప్పకుండా మనకు స్వేచ్ఛ లభిస్తుంది అని కాంక్షిస్తూ గేయాన్ని ముగించారు గరిమెళ్ళ వారు.

ఈ వ్యాసంలో బి. కృష్ణకుమారి గారు అన్న మాటలు ఒక్కసారి స్మరించుకోవడం ముదావహం. గరిమెళ్ళ సత్యనారాయణ గారు రచించిన "మాకొద్దీ తెల్ల దొరతనము దండాలోయ్, మేముండ లేమండోయ్" మొదలైన పాటల్లో జాతీయోద్యమ కాలంలో దేశభక్తిని సృష్టించిన అపర కవిబ్రహ్మ కనిపిస్తాడు. (గరిమెళ్ళ వ్యాసాలు 1992 ముందుమాట సంకలనం, బి. కృష్ణకుమారి)

2008 సంవత్సరంలో డిగ్రీ విద్యార్థులకు ఈ గేయాన్ని పాఠ్యాంశంగా ఉన్నత విద్యా మండలి నిర్ణయించడం మనం తెలుగు వాళ్ళందరం గర్వించదగ్గ విషయం. భావితరాలకు జాతీయయోద్యమ స్ఫూర్తిని కలిగించడానికి వారధి లాంటిది ఈ గేయం. ❀

# జాతీయోద్యమం-గరిమెళ్ళ చైతన్యం

**షేక్ షానాజ్ బేగం,** తెలుగు అధ్యాపకురాలు, టి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
కందుకూరు, నెల్లూరు, చరవాణి : 9441442274

వ్యాపారం కోసం భారత దేశానికి వచ్చిన ఆంగ్లేయులు, స్థానిక రాజుల అనైక్యతను ఆసరాగా చేసుకొని, రాజకీయాల్లో జోక్యం చేసుకొని, చివరికి యుద్ధాల ద్వారా అధికారం హస్తగతం చేసుకున్నారు. 1857 నాటికి దాదాపు మొత్తం భారతదేశాన్ని ఆంగ్లేయులు ఆక్రమించారు. వివిధ యుద్ధాల ద్వారా మన రాజులను ఓడించి భారతదేశంలో స్థిరమైన సామ్రాజ్యాన్ని ఏర్పరచుకున్నారు. స్థిరమైన రాజ్యాన్ని ఏర్పరచుకొని భారతీయులను బానిసలుగా చూస్తూ ఇష్టారాజ్యంగా పరిపాలన చేయసాగారు. వారి కుటిల రాజకీయాలను తట్టుకోలేని భారతీయులందరూ కలిసి 1857 లో తిరుగుబాటు చేశారు. దీనినే జాతీయోద్యమ చరిత్రలో ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామమని, సిపాయిల తిరుగుబాటు అనే పేర్లు ఉన్నాయి. ఆనాటి నుండి అక్కడక్కడా తిరుగుబాట్లు జరిగినా ఎక్కడికక్కడ బ్రిటీష్ వారు అణచివేస్తూ వచ్చారు. అనాటినుండి ప్రతి ఒక్కరిలో స్వాతంత్ర్య కాంక్ష మొదలైంది. ప్రజలలో జాతీయోద్యమ స్ఫూర్తిని కలిగించాలనే తపనతో 1885 లో జాతీయ కాంగ్రెస్ ఏర్పడింది. అప్పడినుండి మితవాదులు, అతివాదుల నాయకత్వంలో ఉద్యమం కొనసాగింది. తర్వాత గాంధీగారి నాయకత్వంలో జాతీయోద్యమం నడిచింది.

అగాధమైన మహాసముద్రంలో అట్టడుగున దాగి ఉంటాయి మేలి ముత్యాలు. కఠిన శిలల మధ్య కనిపించకుండా దుమ్ము ధూళితో కప్పబడి ఉంటాయి వజ్రాలు. మట్టిలో పుట్టిన మాణిక్యాలు ప్రకాశిస్తూ ఉన్నట్లుగనే కొందరు మహాకవులు కూడా ఊరూ పేరూ లేకుండా అజ్ఞాతం నుండి పైకొచ్చి జీవమణుల్లా ప్రకాశిస్తూ ధృవతారలుగా నిలుస్తారు. అలాంటి పుణ్యచరితుల్లో గరిమెళ్ళ సత్యనారాయణగారు ఒకరు. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని కలిగించడానికి తన రచనల ద్వారా చైతన్యాన్ని కలిగించిన జాతీయ కవి గరిమెళ్ళ సత్యనారాయణ.

గరిమెళ్ళ అనగానే అందరికీ గుర్తుకొచ్చే పాట “మాకొద్దీ తెల్ల దొరతనం”. ఈయన ఈ ఒక్క గేయాన్నే కాదు అనేక గేయాలు సందర్భానుగుణంగా రచించారు. అవి ఎంతో మంది యువకుల్లో, మేధావులైన వారిలో జాతీయోద్యమ స్ఫృహను కలిగించాయనటంలో అతిశయోక్తి లేదు.

గరిమెళ్ళ సత్యనారాయణ శ్రీకాకుళం జిల్లా నరసన్న పేట గోనెపాడు గ్రామంలో సూరమ్మ, వెంకట నరసింహం దంపతులకు తొలి సంతానంగా జన్మించారు. ఈయనకు నలుగురు తమ్ముళ్ళు, ముగ్గురు చెల్లెళ్ళు, సత్యనారాయణ తన సొంత ఊరయిన ప్రియాగ్రహారంలో ప్రాథమిక విద్యను పూర్తి చేశారు. విజయనగరం, రాజమహేంద్రవరం మొదలయిన చోట్ల పై చదువులు చదివారు. స్నేహితుల ఆర్థిక సహకారంతో బి.ఏ. చదివారు. పిల్లలను మంచి ప్రయోజకులుగా చేయాలని నరసింహం గారు అప్పులు తెచ్చి మరీ చదివించడంతో వీరికి ఉన్న భూమి కరిగిపోయింది.

గరిమెళ్ళకు మొదటినుంది స్వేచ్ఛా భావనలు ఎక్కువ. ఆ కారణం వల్ల ఎక్కడా, ఏ ఉద్యోగంలోనూ పట్టుమని పది రోజులు కూడా ఉద్యోగం చేయలేకపోయారు. ఇలా ఉండగా 1920 సంవత్సరంలో సహాయ నిరాకరణ ఉద్యమములో పాల్గొని

జాతీయోద్యమానికి ప్రభావితులై ఉద్యమంలోకి దూకారు. "మాకొద్దీ తెల్లదొరతనం" అనే గేయాన్ని రాసి స్వయంగా పాడి ప్రజలను చైతన్యపరిచారు. ఈ విషయం తెలుసుకున్న బ్రిటిష్ వారు ఒక సంవత్సరం జైలు శిక్ష విధించారు. జైలునుండి విడుదల కాగానే మళ్ళీ పాటలు పాడి చైతన్యపరుస్తూ ఉంటే ఈయనపై రాజద్రోహం నేరం మోపి కాకినాడ మేజిస్ట్రేటు ముందు హాజరు పరిచారు. మేజిస్ట్రేట్ నీపై మోపబడిన నేరానికి నీ సమాధానమేమిటని ప్రశ్నిస్తే 'కూలి పోతున్నది కూలిపోతున్నది', 'మూల మట్టముల తోటి కూలిపోతుంది – కూకటి వేళ్ళతో కూలిపోతున్నది మూర్ఖ ప్రభుత్వం' అన్న సమాధానానికి రెండున్నర సంవత్సరాలు కారాగార శిక్షకు గురయ్యారు. జైలులో ఉన్నప్పుడు తమిళ, కన్నడ మొదలైన భాషలు నేర్చుకొని ఆ భాషలలో పాటలు రాశారు.

**రచనలు :** 1921లో స్వరాజ్య గీతములు అనే పుస్తకాన్ని రాశారు. గరిమెళ్ల జైల్లో ఉన్నప్పుడు ఆంగ్లంలో కూడా 'హార్ట్ ఆఫ్ ది నేషన్' అనే పద్యకావ్యాన్ని రచించారు. గరిమెళ్ళ మంచి అనువాదకులు కూడా. భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు రాసిన 'ది ఎకనామిక్ కాంక్వెస్ట్ ఆఫ్ ఇండియా' గ్రంధాన్ని 'భరతఖండముపై ఆర్థిక విజయం' అనే పేరుతో అనువదించారు. దీనిని బట్టి ఆయన బహుభాషా కోవిదులు అని, మంచి అనువాదకులు అని తెలుస్తోంది. జీవనోపాధి కోసం మద్రాసు చేరుకున్న ఈయన పలు పత్రికల్లో పనిచేశారు. కడు పేదరికాన్ని అనుభవిస్తూ దుర్భరమైన దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నా దేశభక్తి వీడలేదు. ఒక సందర్భంలో మహాత్ముని ఆదేశానుసారం దేశభక్తి గీతాలు ఆలపించిన రచయితలనందరిని సబర్మతి ఆశ్రమంలో మీ గీతాలు వినిపించండి అన్నారట. అందరూ వినిపించారు గరిమెళ్ళ వంతు రాగానే నేను పాడిన ఈ గీతానికి ఒక సంవత్సరం జైలు శిక్ష పడింది అని అంటే గాంధీ గారు పాడమన్నారు. గరిమెళ్ళ 'మాకొద్దీ తెల్లదొరతనం' గేయాన్ని పాడి వినిపించారు. గాంధీ గారు మెచ్చుకొని ఇతర భాషా రచయితలను అందరినీ తమ తమ భాషలలోకి అనువాదం చేయమన్నారు. త్రికరణశుద్ధిగా గరిమెళ్ళ గాంధీని తన గురువుగా ఎంచుకొని ఆయన సిద్ధాంతాలను పాటిస్తే తప్పకుండా మనకు జయం కలుగుతుందని క్రింది పద్యాన్ని ఎంత సరళంగా రాశారో అర్ధమవుతుంది. 'భారత భాగ్య చంద్రునకు బారెడు పోగు నొసంగు దంచు సం – సారపయోధి దాటిన విశాల మనస్కుడు గాంధీ చెప్ప'గా గాంధీ సిద్ధాంతాలపై అపార నమ్మకం ఉన్నవాడు కావడం వలన సంఘంలో గూడుకట్టుకొని ఉన్న అంటరానితనాన్ని గర్హించాడు.

హిందూ సంఘమురా మనది – ఎవ్వరూ కాదనురా
సందేహించిన వాడే వేరొక – సంఘంబై చెడురా
రామచరిత మనదీ దాని రచయిత మనవాడు

"భారతమ్ము మనది ధర్మవ్యాధుడు మనవాడు" అని రామాయణం రాసింది, బోయవాడయిన వాల్మీకి మనవాడేనని, ఎవరూ సమాజంలో తక్కువ వారు కారని అందరూ హిందువులేనని ప్రబోధించాడు. పంచమ జాతిని మనపక్షం చేర్చుకోవాలని" హరిజనులను ఉద్దేశించి హరిజనుల పాటలను ప్రబోధాత్మకంగా ఇలా తెలియజేశాడు.

'హరిజనులము మనము దుఃఖము లనుభవించగా మికను
సరిసమముగా తక్కిన జాతులతో – సంస్తుతినందుదము
స్నానము లాడుదము దేహము – స్వచ్ఛము చేయుదము
భయమును మానుదము, దేశ భక్తిని పూనుదము'

**శారద గ్రంథమాల :** గరిమెళ్ళ సత్యనారాయణది బహుముఖ ప్రజ్ఞ కలవాడు అందుకే ఈయన శారద గ్రంథమాలను స్థాపించాడు. ఈయన తన రచనల ద్వారా ప్రజలను ప్రభావితం చేయాలనే ఉద్దేశ్యంతో ఏడు పుస్తకాలను రచించారు. అవి భక్తి గీతములు, బాల గీతములు మాణిక్యము, నూతన జాతీయగీతములు, ఖండకావ్యము, అఖండకావ్యము, అర్థత్రయ సర్వసం 1వ భాగము. ఇది ప్రస్తుతం అలభ్యం. ఇవి ఈయన రచనలు. ఆంధ్ర జాతి అభివృద్ధి చెందాలనే దృక్పథంతో ఈ పుస్తకాలను ప్రచురించడానికి ఆయన ఆరు రూపాయిల ఖర్చుతో ముద్రించారు. అసలే ఆయనది చాలీచాలని జీతం. తన స్వంతగ్రామమైన ప్రియాగ్రహారంలో దీనిని

నిర్వహించేందుకు గరిమెళ్ళ వారు పడ్డకష్టం వర్ణనాతీతం. పుస్తకాలను అమ్మితే కొనేవారు లేక శ్రీమంతుల నాశ్రయించక తప్పదని వారి వద్దకు వెళ్ళినప్పుడు వారిని ఒక బిచ్చగాని వలె 'ఏమి వ్యవసాయము చేయరాదా ? ఏదైనా ఉద్యోగము చేయకూడదా? గాంధీ గారు పని చేసుకొని బ్రతకమన్నారు కానీ ఇలా పుస్తకాలు అమ్మి బ్రతకమని చెప్పలేదే ?' అని అంటుంటే అంత కష్టంగా శారదా గ్రంథమాల కోసం ఎందుకు పరితపించాడు అనే ప్రశ్నకు ఆయనే సమాధానమిచ్చుకున్నారు. నాలక్ష్యం ఆంధ్ర జాతి అభివృద్ధి. దాని కోసం ఎంతటి కష్టాన్నయినా చేయడానికి నేను సిద్ధమే అన్నారు. ఆ తర్వాత కొందరి ప్రోత్సాహంతో పుస్తకముద్రణ చేసిన సాహితీమూర్తి మన గరిమెళ్ళ.

హరిజనులను ఉద్దేశించి బ్రాహ్మణ బ్రహ్మణా పంచమ బ్రహ్మణా మొదలైన భేదభావాల్ని మంటగలిపి అంటు దోషాన్ని విడవమని ఉద్బోధించాడు. ఈయన గీతాలలో కనిపించే మరొక అంశం సామరస్యం. అన్నీ మతాల వారు కలిసిఉంటేనే విభిన్న మతాలకు ఆలవాలమైన మనదేశంలో శాంతి సోయగాలు వర్ధిల్లుతాయని గరిమెళ్ళ అభిప్రాయం. ఈయన గీతాలలో మనం గమనించవలసిన మరొక అంశం అనైక్యత. దీనిని తల్చుకొని ఆయన చాలా బాధపడ్డారు.

…. మా
రోతలు పోరులుం దెగని – రుగ్మతలం బడి కుళ్ళి కుళ్ళి ఆ
పాతకమే గదమ్మా – పలుభంగుల మమ్ము నీడ్చి కొట్టేడిన్

ఆనాడు గరిమెళ్ళ చెప్పిన అనైక్యతా అడుగడుగునా కనిపిస్తూనే ఉంది. గేయ రచనలు చేయడంలో గరిమెళ్ళ సిద్ధహస్తులు. సామాన్యుల భాషను ఆకళింపు చేసుకొని వారికే నచ్చే బాణీలలో గీతాలు రచించడం వలన అవి ఆబాలగోపాలాన్ని అలరించాయి. జన సామాన్యమైన భాషలో గేయ రచన చేయడంలో ఈయనను మించిన వారు ఉండరేమో !

"కంట గుడ్డను బెట్టి – కర్ణాన వేలెట్టి
వింటావటరా ఓరయ్యా ముంద రింటిలో జరిగిన చర్య
మొన్న మొన్ననె ముమ్ము – మూడు సంద్రాల్ దాటి శత్రువుల గెలిచొచ్చినారు. పాంచాల దేశములోని వారు
సత్యాగ్రహమని సర్వేశు పూజింప – కత్తితో తెగ నరికినారు
అయ్యో కటికడెందవు – తెల్లవారు" లాంటి పాటలు బహుళ జనాదరణ పొందాయి.

సాహిత్యంలో శ్రీనాథ కవికి, మన గరిమెళ్ళకు కొన్ని సౌమ్యాలున్నాయి. 15 వ శతాబ్దంలోనే శ్రీనాధుడు అనుభవించినన్ని సుఖాలు, దుఃఖాలు ఎవరు పొందలేదు. గరిమెళ్ళ సత్యనారాయణ కూడా తండ్రి బ్రతికి ఉన్నంతకాలం పెద్దగా కష్టాలను అనుభవించక పోయిన స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నప్పటినుండి ఆయన కష్టాలను తప్ప, సుఖం పొందినట్లు దాఖలాలు లేవు. శ్రీనాధుడు కవి సార్వభౌముడైతే గరిమెళ్ళ జాతీయ కవిసార్వభౌములు.

గరిమెళ్ళ మాకొద్దీ తెల్ల దొరతనం పాట జాతీయ స్ఫూర్తిని కలిగించింది. పండిత పామర భేదం లేకుండా అందరి నోటా నాట్యం చేసింది. గరిమెళ్ళ స్వయంగా పాడుతుంటే ఆనాటి కలెక్టర్ బేకన్ గరిమెళ్ళను పిలిపించి పాట పాడమంటే ఆయన పాడారు. అప్పుడు బేకన్ భాషరాని నాకే ఇంత గగుర్పాటు కలిగిందంటే భాష తెలిసినవారు ఎంత ప్రభావితులౌతారో అని కారాగారాశిక్షను విధించారు.

పన్నెండు దేశాలు – పండుచున్నాగాని
పట్టెడన్నమె – లోపమండి
ఉప్పు ముట్టుకుంటే – దోషమండి – నోట మట్టికొట్టి పోతాడండి
అయ్యో కుక్కలతో పోరాడి – కూడు తింటామండి – మా ప్రాణాలపై పొంచి – మానాలు హరియించె

ఈ గేయంలో గరిమెళ్ళ ప్రస్తావించిన అంశాలు ఆహార సమస్య, బ్రిటిష్ వారి రాక, 144 సెక్షన్, ఘోర శాసనాలు చేసి ప్రజలను ఇబ్బంది పెట్టడం. మద్యపాన పరిచయం, కోర్టులను పెట్టి, పార్టీలు పుట్టించి, ప్రజల ఆలోచనా విధానంలో చెడు భావనలు కలిగించడం, పన్నులను పెంచి ప్రజలను ఇబ్బంది పెట్టడం, పన్నులు ఎక్కువ కట్టించుకొని భూములను లాక్కోవడం, జాక్ జండాను గౌరవించమనడం, ప్రజలను అనేక రకాలుగా ఇబ్బంది పెట్టడం వంటి పలు అంశాలు కనిపిస్తాయి.

"చిత్తరంజనదాసు చిన్న కొమరుని చెయి విరచి చెరబెట్టినాడు అతని పెత్తనంబును బట్టినాడు – వారి ముత్తైదువుల పట్టినాడు వాడి సొత్తుకు నిలమీద చోటు లేదన్నాడు."

తర్వాత గాంధీ నాయకత్వం వంటి పలు అంశాలను జోడించి ఆవేశపూరితంగా ఈయన రచించిన గేయం పండిత పామర బేధం లేకుండా అందరినోటా తారకమంత్రమైనది. గరిమెళ్ళ వారు భక్తి గీతాలను అనేకం రచించినప్పటికిని రెండు గీతాలు మాత్రమే లభిస్తున్నాయి. వాటిలో కూడా మాతృదేశ భక్తి కనిపిస్తుంది.

**మాతృ స్తవం :** అందరు కవులవలె గరిమెళ్ళ సత్యనారాయణ కూడా కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు విస్తరిల్లిన భారతదేశ ప్రశస్తిని గానం చేసి భరతమాతను కీర్తించారు. అని కీర్తించారు.

"వందనమిదె గైకొనుమీ – భారత జననీ – భారత జననీ మా పాలిట రాణీ
వందనల బ్రోవుమీ – ఆనందదాయినీ – ఆనందదాయినీ ముని బృంద వందినీ"

**మద్యపాన నిషేధం :** మద్యపానాన్ని నిషేధించమని, ఈ మద్యాన్ని సేవించడం వల్ల ఎందరి కుటుంబాలో రోడ్డుపాలు అవుతున్నాయని "కల్లు మానండని" గీతాన్ని రచించారు.

"కల్లు తాగి నీ యిల్లునెల్ల గుల్ల చేయకు – నీ వళ్ళు రోగాల కెల్ల వడ్డి కియకు
పిల్లజెల్లలను తెచ్చి వీధి పెట్టకు – ముసలి తల్లిదండ్రుల ను బట్టి తన్ని కొట్టకు"

మద్యాన్ని సేవించడం వల్ల నాశనమే కాని బాగుపడటం జరుగదు. గుణాన్ని, ధనాన్ని, మానాన్ని అన్నిటిని కూల్చే మద్యపానం ఆర్థికంగా అణగారిన బడుగు జీవుల పాలిట శాపం. ఆ శాపంలోనుంచి బయటపడితే అందరికీ స్వాతంత్ర్యోద్యమ స్పృహ కలుగుతుందని భావించాడు గరిమెళ్ళ.

**సైతాను ప్రభుత :** బ్రిటీష్ వాళ్ళు భారతదేశానికి పట్టిన సైతానులని గరిమెళ్ళ భావన. వీరి కుటిల రాజనీతికి పాల్పడిన అస్వతంత్రతను, ఆనాటి పాలనను సైతాను ప్రభుత అనే ఒక్క మాటలో భావమంతా వచ్చే విధంగా రచించడం గరిమెళ్ళకే చెల్లింది.

**ముగింపు :** ఈ విధంగా స్వాతంత్రోద్యమ చైతన్యాన్ని కలిగించే విధంగా అడుగడుగునా అనేక గీతాలను రచిస్తూ దుర్భరమైన దారిద్రాన్ని అనుభవిస్తున్నప్పటికిని దేశభక్తిని విడవకుండా రచనలు చేసిన గొప్పకవి గరిమెళ్ళ. సాహిత్యంలో ఈయనకు రావలసినంత గుర్తింపు రాలేదనే చెప్పాలి. దేశం కోసం అహర్నిశలు తపన పడి నిస్వార్థంగా సేవ చేసి, అనారోగ్యంతో వైద్యానికి డబ్బులేక ఒక కంటిని పోగొట్టుకొని మరణించిన దేశభక్తుడు గరిమెళ్ళ. అంతటి సాహితీ సేవ చేసిన గరిమెళ్ళకు ప్రభుత్వం భూములిచ్చామని చెప్తున్నా వాటిని గురించి తమకేమీ తెలియదని తమ వారసులు చెప్తున్నారు. ఇంతటి నిస్వార్థ జీవులు లభించడం భారతదేశం చేసుకున్న పుణ్యఫలమని మనం చెప్పుకోవచ్చు. స్వార్థపూరిత లోకంలో నిస్వార్థమైన సేవను అందించి 1952 సం॥ డిసెంబర్ 18 తేదీన స్వర్గస్థులైన గరిమెళ్ళ వారి స్ఫూర్తి ఏ కొందరికి ఆదర్శమైనా దేశం బాగుపడుతుంది. జైహింద్...

**ఆధార గ్రంథాలు**

1. గరిమెళ్ళ సాహిత్యం – చల్లా రాధాకృష్ణశర్మ
2. జాతీయగీతాలు – గురజాడ రాఘవశర్మ
3. అంతర్జాలం

# గరిమెళ్ళ గేయాలు - జాతీయ చైతన్యం

**డా. గుండెమెడ శ్రీనివాసరావు,** తెలుగు శాఖాధ్యక్షులు, మోడల్ ప్రభుత్వ కళాశాల, కామవరపుకోట,
పశ్చిమ గోదావరి జిల్లా, చరవాణి : 8500284838

**నేపథ్యం :**

గన్ను కన్నా గొప్పది పెన్ను... ఈ విషయం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. కలంతో రాసే పదాలు ఎలాంటి వారినైన మేల్కొనేలా చేస్తాయి. భారతదేశాన్ని 200 సంవత్సరాలకు పైగా బ్రిటిష్ వారు పాలించారు. చివరకు స్వాతంత్ర్యం కోసం దశాబ్దాల పోరాటం తర్వాత, మన దేశం ఆగస్టు 15, 1947 న స్వాతంత్ర్యం పొందింది. బ్రిటిష్ వారి పాలనలో, పాలకులకు వ్యతిరేకంగా వందలాది మంది ప్రజలు నిరసనలు తెలిపిన అనేక ఉద్యమాలు ఉన్నాయి. దేశం కోసం ప్రాణాలర్పించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న కొంతమంది కవులు, రచయితలు ఎన్నో దేశ భక్తి గీతాలను, గేయాలను, కథలను, నవలను రాసి తమవంతు కృషిగా ఆనాటి ప్రజల్లో దేశ భక్తిని రగిలించారు.

మనమంతా ఒక్కటే అనే భావమే జాతీయత అవుతుంది. జాతీయ భావానికి మనసు ముఖ్యం. తమ మాతృదేశం ఒక్కటే, తాము అందరి కష్టసుఖాలను పంచుకోవాలి అనుకోవడం జాతీయత అవుతుంది. భిన్న జాతులు, భిన్న భాషలు ఉన్నా జాతీయత అలవడుతుంది అని భారతదేశం ప్రపంచానికి చాటి చెప్పింది. జాతీయ భావాలున్నవారికీ స్వాతంత్ర్య కాంక్ష తప్పనిసారిగా ఉంటుంది. స్వాతంత్ర్యం అనేది జన్మతః సంక్రమించే లక్షణం. అంటే జీవధర్మం. స్వాతంత్ర్యం నా జన్మ హక్కు అని ఎలుగెత్తి చాటాడు. మానవుని ఆర్థిక, సామాజిక, మానసిక, ఆత్మీయత, ఆధ్యాత్మిక స్వాతంత్ర్యాలే అసలైనవి. అందుకే బాలగంగాధర తిలక్ స్వాతంత్ర్యం నా జన్మ హక్కు అని ఎలుగెత్తి చాటాడు. స్వాతంత్ర్యంలేని మానవజీవితం ఒడ్డున పడ్డ చేప లాంటిది. జన్మభూమిని దాస్య సంకెళ్ళ నుండి విముక్తి చేయించాలని ఎందరో త్యాగాలు చేశారు. మాతృ ఋణం తీర్చుకున్నారు. జాతి విముక్తి కోసం, మాతృభూమి స్వేచ్ఛ కోసం కవులు కలాలు పట్టారు. అదే జాతీయోద్యమ కవిత్వంగా చెప్పవచ్చు.

జాతీయోద్యమ కవిత్వం ఆనాడు బలంగా రాసిన వారిలో ముఖ్యులు – రవీంద్రనాథ్ ఠాగూర్, సరోజినీ నాయుడు, శ్యామ్‌లాల్ గుప్తా, హస్రత్ మోహన్, శ్రీ అరబిందో, మఖన్‌లాల్ చతుర్వేది మొదలైన వారు జాతీయ స్థాయిలో పేరు పొందిన కవులు కాగా, ఆంధ్రదేశంలో కూడా ఎందఱో గొప్ప కవులు ఉన్నారు.

వారిలో చెప్పుకో దాగిన వారు – గురజాడ అప్పారావు, మంగిపూడి వెంకటరాయ శర్మ,తుమ్మల సీతారామమూర్తి రాయప్రోలు సుబ్బారావు, గుర్రం జాషువా, చిలకమర్తి లక్ష్మీ నరసింహం, పుట్టపర్తి నారాయణాచార్యులు, చెరుకువాడ వెంకట రామయ్య, దువ్వూరి రామిరెడ్డి, ఉన్నవ లక్ష్మీ నారాయణ, కరుణశ్రీ, గరిమెళ్ల సత్యనారాయణ తదితర 25కు పైగా కవులు అనేక రచనలు చేసి ప్రజలలో స్వాత్రంత్య కాంక్షను రగిలించడంతో పాటు స్వయంగా ఉద్యమంలో పాల్గొన్నారని వివరించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరుల గురించి, అస్పృశ్యత లాంటి సాంఘిక దురాచారాల గురించి రచనలు చేసి ప్రజలలో చైతన్య జ్వాలను రగిలించారు. అలాంటి వారిలో చెప్పుకోదగిన వారు గరిమెళ్ల సత్యనారాయణ గారు.

**గరిమెళ్ళ సత్యనారాయణ :**

దేశభక్తి కవితలు రాసి జైలుశిక్షను అనుభవించిన వారిలో ప్రప్రథముడు గరిమెళ్ళ. నిజాయితీకి, నిర్భీతికి మారుపేరుగా నిలిచిన ఈయన రాసిన మాకొద్దీ తెల్ల దొరతనం అనే పాట ఆనాడు ప్రతి తెలుగువాడి నోటిలోనూ మార్మోగేది. తెలుగునాట జాతీయ కవిత్వానికి ఒరవడిపెట్టిన మేటి కవి గరిమెళ్ళ. ఈయనలాగా ప్రసిద్ధి చెందిన జాతీయకవి ఆ రోజుల్లో మరొకరు లేరంటే అతిశయోక్తి కానేరదు.

ఆయన మన తెలుగువాడు. కవి, సత్యాగ్రహి. ఆయన కలం నుంచి వెలువడిన పాట స్వాతంత్ర్య గీతంగా మారింది. లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చింది. భారతదేశంలో బ్రిటిష్ పాలన నుండి స్వాతంత్ర్యం కోసం పోరాడిన సామాజిక, రాజకీయ చరిత్ర మనందరికీ తెలుసు. కానీ మన దృష్టిని అంతగా ఆకర్షించనిది ఆ కాలపు సాహిత్య చరిత్ర. నాటి కవులు, రచయితలు తమ తోటి భారతీయులను స్వాతంత్ర్యోద్యమం వైపుకు నడిపించారు. విదేశీ పాలన యొక్క బానిస సంకెళ్ల నుండి భౌతికంగానే కాక, మానసిక సంకెళ్లను కూడా త్రెంచడంలో ఆనాటి కవులు, రచయితలెందరో ముందు వరుసలో నిలిచారు. 200 సంవత్సరాల అణచివేత ప్రజలలోని ఆత్మా స్థైర్యాన్ని, సంకల్ప శక్తిని నాశనం చేసింది. కానీ కవిత్వం, పాట పరదేశీ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు తమ గొంతును విప్పడానికి దోహదపడింది. ఆనాటి కవుల, రచయితల కవిత్వము, పాట ప్రజలలో తిరుగుబాటును రగిలించటంలో కీలక పాత్ర పోషించాయి.

నాటి స్వాతంత్ర్యోద్యమ కవుల్లో గరిమెళ్ళ సత్యనారాయణది విశిష్టమైన స్థానం. స్వాతంత్ర్యోద్యమ కాలంలో శ్రీ గరిమెళ్ళ గేయాలు జాతీయ వీరరసంతో తొణికిసలాడుతూ పాఠక జనాన్ని ఉద్రూతలూగించాయి. ఆయన వ్రాసిన "మాకొద్దీ తెల్ల దొరతనము..." పాట సత్యాగ్రహులకు గొప్ప తెగువను, ఉత్తేజాన్ని కలిగించింది. అలాగే "దండాలు దండాలు భారతమాత" అనే గీతం కూడా ప్రజలను ఎంతగానో జాగృతం చేసి ప్రజలు పెద్దఎత్తున స్వాతంత్ర్యోద్యమంలోకి ఉరికే తెగువను కలుగజేసింది. దేశభక్తి కవితలు వ్రాసి జైలుశిక్ష అనుభవించిన వారిలో ప్రథముడు శ్రీ గరిమెళ్ళ సత్యనారాయణ. నిజాయితీకి, నిర్భీతికి మారుపేరుగా నిలిచారు. మాకొద్దీ తెల్ల దొరతనం పాట ఆనాడు ప్రతి తెలుగువాడి నోటా మార్మ్రోగేది. ఆయనంత ప్రసిద్ధినొందిన జాతీయకవి ఆ రోజుల్లో మరొకరులేరు. తెలుగునాట జాతీయ కవిత్వానికి నూతన ఒరవడిని సృష్టించిన కవి ప్రముఖుడు శ్రీ గరిమెళ్ళ.

గరిమెళ్ళ సత్యనారాయణ శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట తాలూకా గోనెపాడు గ్రామంలో 1893 జూలై 14న జన్మించారు. తల్లి సూరమ్మ, తండ్రి వేంకట నరసింహం. గరిమెళ్ళ ప్రాథమిక విద్య స్వగ్రామమైన ప్రియాగ్రహారంలో సాగింది. విజయనగరం, మచిలీపట్నం, రాజమహేంద్రవరం మొదలయిన చోట్ల పైచదువులు చదివారు. బి.ఏ. చేశాక గంజాం కలెక్టర్ కార్యాలయంలో గుమస్తాగా కొంతకాలం పనిచేశారు. ఆ తరువాత విజయనగరం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా కొంతకాలం పనిచేశారు. గరిమెళ్ళ చిన్నప్పుడే తన మేనమామ కూతుర్ని వివాహం చేసుకున్నారు. ఆయన స్వేచ్ఛాప్రియత్వం వల్ల ఎక్కడా ఎక్కువకాలం ఏ ఉద్యోగమూ చెయ్యలేకపోయారు.

**జాతీయోద్యమ స్ఫూర్తి:**

1920 డిసెంబర్‌లో కలకత్తాలో జరిగిన కాంగ్రెసు మహాసభలో సహాయనిరాకరణ తీర్మానం అమోదించబడింది. ఆ వీరావేశంతో ఉద్యమంలోకి దూకిన గరిమెళ్ళ ' మా కొద్దీ తెల్లదొరతనం పాటను వ్రాశారు. ఆనాటి రోజుల్లో రాజమండ్రిలో ఈ పాట నకలు కాపీలు ఒక్కొక్కటి బేడా (12 పైసలు) చొప్పున అమ్ముడు పోయేవట. ఆ రోజుల్లో కాంగ్రెసు స్వచ్ఛంద సేవకులు ఖద్దరు దుస్తులు ధరించి, గాంధీటోపి పెట్టుకుని, బారులు తీరి మువ్వన్నెల జెండా ఎగరవేసుకుంటూ.

మాకొద్దీ తెల్లదొరతనము – దేవ
మాకొద్దీ తెల్లదొరతనము...

అంటూ ఆకాశం దద్దరిల్లేలా పాడుతూ వీధుల్లో కవాతు చేసేవారట. ఆ తర్వాత సబర్మతీ ఆశ్రమంలో, గాంధీజీ ఈ పాటకు అనువాదము చేయించమని పురమాయించారు. టంగుటూరి ప్రకాశం పంతులు గారి "స్వరాజ్య" పత్రికలో ఇంగ్లీష్ లోకి అనువదించి ప్రచురించారు. ఎన్.జి. రంగా, గరిమెళ్ళను "ప్రజా పాటల త్యాగయ్య" అని ప్రశంసించారు.

ఆనోటా – ఈనోటా ఈ పాట గురించి ఆనాటి బ్రిటీషు కలెక్టరు బ్రేకన్ చెవినపడి ఆయన గరిమెళ్ళను పిలిపించి పాటను పూర్తిగా పాడమన్నారట. గరిమెళ్ళ కేవలం రచయితే కాదు, గొప్ప గాయకుడు కూడా. తన కంచు కంఠంతో ఖంగున పాటలు కూడా పాడగలడు. గరిమెళ్ళ పాట విన్న బ్రిటీషు కలెక్టరు తెలుగుభాష నాకు రాకపోయినప్పటికీ, ఈ పాటలో ఎంతట మహత్తర శక్తి ఉందో, సామాన్య ప్రజల్ని సైతం ఎలా చైతన్యపరచగలదో నేను ఊహించగలనన్నాడట. ఆ పాటను వ్రాసినందుకు గరిమెళ్ళకు ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష విధించారు.

ఈ అరెస్టు 9 ఫిబ్రవరి 1922 న జరిగింది. ఫిబ్రవరి 11 ఎడిషన్‌లో, ది హిందూ వార్తాపత్రిక గరిమెళ్ళ తన దేశ ప్రజలను ఉద్దేశించి వ్రాసిన ఒక లేఖను ప్రచురించింది:

"ప్రియమైన సోదర సోదరీమణులారా! నేను నా చిన్న పనిని పూర్తి చేశాను. ఇప్పుడిక విశ్రాంతి తీసుకోవడానికి వెళ్తున్నాను. బ్రిటిష్ పాలకులు నా కలాన్ని, గళాన్ని ఒక సంవత్సరం పాటు రద్దు చేయాలని నిర్ణయించుకున్నారు. నేను సమాజ శాంతికి, బ్రిటిష్ వారి ఉనికికి ప్రమాదకరమట. నేను నిజంగా అలాంటివాడినే అయితే, వారు నన్ను చాలా ఆలస్యంగా గుర్తించినట్లు లెక్క. నేను అందించగలిగిన, అత్యుత్తమమైన రచనలు నేను దేశానికి ఇచ్చాను. నా భౌతిక శరీరం బందీ కానుంది. కానీ నా ఆత్మ నా సాహిత్యం ద్వారా ప్రజల మధ్యనే స్వేచ్ఛగా ఉంటుంది. దానిని సేకరించి, ఏకీకృతం చేసి, పని చేయనివ్వండి. అది నా బలహీనమైన శరీరం కంటే ఎక్కువగా పనిచేస్తుంది. నేను ఇప్పుడు చాలా నిర్మల హృదయంతో ఉన్నాను. ఆ భగవంతుని కృపతో నేను స్వరాజ్య గీతాలను, మీ విజయ గీతాలనూ ఆలపించటానికి మళ్ళీ మీ మధ్యలోకి వస్తాను." అంటూ లేఖను రాశారు.

శిక్షపూర్తి చేసుకుని జైలు నుంచి విడుదలయిన గరిమెళ్ళ మళ్ళీ ప్రజల మధ్య గొంతెత్తి పాడసాగాడు. ప్రజల్ని ఎంతగానో ఆకట్టుకోసాగాడు. ఇది చూసి ప్రభుత్వాధికారులు భయపడ్డారు. గరిమెళ్ళ బయట వుండటం ప్రభుత్వానికి మంచిది కాదని భావించి ఆయనను అరెస్టు చేశారు. కాకినాడ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచారు. మేజిస్ట్రేట్ రెండు సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష విధించాడు.

గరిమెళ్ళ జైలులో వుండగా 1923 జనవరిలో ఆయన తండ్రి చనిపోయాడు. క్షమాపణ చెబితే వదులుతామని చెప్పారట. కానీ గరిమెళ్ళ క్షమాపణ చెప్పకుండా జైలులోనే ఉన్నారు. అంతటి దేశభక్తుడు ఆయన.

**గరిమెళ్ళ గేయాలు – జాతీయ చైతన్యం:**

1921 నాటికి, మహాత్మా గాంధీ స్వాతంత్ర్యోద్యమంలో తిరుగులేని నాయకుడిగా మారారు. ఆయన స్ఫూర్తితో, అన్ని వయసుల, తరగతుల ప్రజలు 'సత్యాగ్రహులు' అయ్యారు. బ్రిటిష్ వారు వారిని దేశద్రోహులుగా చిత్రీకరించారు. నిర్దాక్షిణ్యంగా వేధించారు. ఈ పరిస్థితిని గరిమెళ్ళ "మాకొద్దీ..." పాటలో వివరించారు.

1. మాకొద్దీ తెల్ల దొరతనము, దేవ
మాకొద్దీ తెల్ల దొరతనము
'మా' ప్రాణాలపై పొంచి
మానాలు హరియించె – మాకొద్దీ...

2. పన్నెండు దేశాలు పండుచున్నాగాని
పట్టెడన్నం లోపముండే
ఉప్పు ముట్టుకుంటే దోషమండే
నోట మట్టిగొట్టి పోతాడండే
అయ్యో! కుక్కలతో పోరాడి కూడూ తినమండీ. – మాకొద్దీ...

3. ధనము కోసము వాడు దారి చేసి చేసికొని
కల్లు సారాయమ్ముతాడు
మాదు మూటా ముల్లెలు దోచినాడు
ఆలి మెళ్లో పుస్తెలు తెంచుతాడు
మాదు కళ్లల్లో దుమ్మేసి కాటికి దరిచేసాడు – మాకొద్దీ...

4. గాంధీ టోపీ పెట్టి పాఠశాలకు బోవ
రావద్దు రావద్దంటాడు
రాట్నం బడిలో పెట్ట వద్దంటాడు
టోపి తీసి వీపులు బాదుతాడు
అయ్యో! రాజద్రోహమంత రాట్నంలో ఉన్నదంట – మాకొద్దీ...

అంటూ సాగే సుమారు 120 పంక్తుల గేయంలో తెల్లదొరల అకృత్యాలు, భారతీయుల కడగండ్లు విశదంగా కళ్ళకు కట్టినట్లుంటాయి.

స్వాతంత్ర్య సమరయోధులను అరెస్ట్ చేయడంలో ప్రభుత్వం చాలా తీవ్రంగా ఉంది కాబట్టి, గరిమెళ్ల ప్రజలు స్వచ్ఛందంగా కోర్టులో అరెస్ట్ కావాలని కోరారు. బయట బానిసలుగా జీవించడం కంటే జైళ్లను నింపి, స్వేచ్ఛగా ఉండాలని ప్రజలకు ఆయన సూచించారు. తాను బోధించిన వాటిని జీవితాంతం ఆచరించి చూపిన వ్యక్తి ఆయన.

'హెర్మెట్ ఆఫ్ ఇండియా' పేరుతో ఆయన ఆంగ్లంలో రచించిన తన మొదటి ఆంగ్ల రచనలో అది స్పష్టంగా కనిపిస్తుంది. అందులో, ఆయన బ్రిటిష్ వారి పట్ల విధేయత ప్రదర్శించే వారిని శిక్షించాలని ఉద్బోధించారు.

ఆంగ్లేయులు గోమాతల్ని సంహరించడంపై ఆయన ఎలుగెత్తారు. అలాగే హిందూ ధర్మంపై కొనసాగిస్తున్న సైద్ధాంతిక దాడిని కూడా ఆయన సూక్ష్మంగా గ్రహించగలిగారు. ఆ రోజుల్లో చాలామంది స్వాతంత్ర్య సమరయోధుల్లో, ముఖ్యంగా కాంగ్రెస్ కార్యకర్తలలో, పెద్ద పెద్ద నాయకులలో సైతం ఈ స్పృహ, దృష్టి ఉండేవి కావు. కానీ గరిమెళ్ళ వారు దానిని పసిగట్టగలిగారు. తన "మాకొద్దీ తెల్లదొరతనము." గేయంలో దానిని వెల్లడించారు.

"చూడియావుల కడుపు వేడి వేడి మాంసం వాడీకి బహు ఇష్టమంట
మాపాడీ మొదవుల కోస్తడంట ? మతము పాడూ చేసివేస్తడంట"

గరిమెళ్ళ వారి సూక్ష్మ దృష్టికి ఈ గేయంలోనే ఇంకొక తార్కాణముంది. ఆంగ్లేయులు హిందూ ధర్మాన్ని, సమాజాన్ని బలహీనపరచే తమ ప్రయత్నంలో భాగంగా హిందువులలో విభజన తీసుకొచ్చే ప్రయత్నాలు తమ వ్రాతల ద్వారా మొదలుపెట్టారు. చరిత్రను అన్ని విధాలా వక్రీకరించి హిందూ సమాజంలోని అంటరానితనం వంటి అన్ని రకాల వికృతులకూ బ్రాహ్మణులే కారణమని ప్రచారం మొదలుపెట్టారు. హిందూత్వం బ్రాహ్మణులకు మాత్రమే పరిమితమైనదనే భావనను కలిగించే ప్రయత్నం

చేశారు. తమిళనాడులో ఆ కారణం చేతనే ద్రవిడవాదం మొదలైంది. కొన్నిచోట్ల, ముఖ్యంగా దక్షిణభారతంలో కొన్నిచోట్ల బ్రాహ్మణేతరులు బ్రాహ్మణులను తీవ్రంగా ద్వేషించటం మొదలైంది. ఆంగ్లేయుల ఆ కుట్రను ఆయన ఆనాడే పసిగట్టి తన గేయం ద్వారా ప్రజలను మేల్కొలిపే ప్రయత్నం చేశారు. అదే సమయంలో కులభేదాలు పాటించేవారికి కూడా హితబోధ చేశారు.

బ్రాహ్మణాబ్రాహ్మణ
పంచమాబ్రాహ్మణ
భేదాల తెగులుమీకేలా
మీ వడిగొల్చ రేల
చెడ్డబోధనలకు లొంగిరేల
ఈ మాధూకరపువృత్తి మరగినారది యేల

ఎంతో లోతైన దృష్టి ఉంటే తప్ప ఆంగ్లేయుల ఆ కుట్రను గ్రహించటం సాధ్యం కాదనే చెప్పాలి. అంతేకాదు ఎవరెన్ని విధాలుగా మభ్యపెట్టజూచినా వితండ వాదం మాని మనమంతా సోదరులమని, మన మధ్య ఎలాంటి భేదభావమూ లేదని చాటుదాము రమ్మంటూ ఈ క్రింది చరణంలో ఆయన పిలుపునిచ్చారు.

ఎవరెన్ని చెప్పినా హిందూదేశ వాసులేక సోదరులమండి
అంటూ దోషాము మాకు లేదండీ
అంటూ చాటుదాము రండీ
మీకుంటి వాదనాలు గూటిలో పెట్టండి.
ఎన్ని కష్టాలెదురైనా మొక్కవోని స్వదేశీ, స్వధర్మ దీక్ష

గరిమెళ్ళవారు జైలులో ఉండగా గాంధీతత్వం బాగా వంటపట్టింది. విదేశీ విద్య, విదేశీ వస్తు బహిష్కరణ పిలుపును మనసారా నమ్మారు గరిమెళ్ళ. తన ముగ్గురు తమ్ముళ్ళను ఇంగ్లీషు చదువులు మాన్పించారు. తన చెల్లెల్ని ఇంగ్లీషు చదువు చదివిన వాడికిచ్చి పెళ్ళి చేయనని భీష్మించారు. ఆయన దేశభక్తి కుటుంబానికి శాపమైంది. ఉద్యోగాలు లేక కుటుంబం పేదరికంలోకి నెట్టబడింది. ఒక తమ్ముడు దేశాలుపట్టి వెళ్ళి పోయాడు. ఆస్తులు అమ్ముకుని పొట్టపోసుకోవటంతో అవీ హరించాయి. మధ్యమధ్యలో పోలీసుల కేసులు, జైలుశిక్షలు. దేశాన్ని ఏమి ఉద్ధరిస్తాడోగాని కుటుంబాన్ని నాశనంచేశాడన్న సూటిపోటి మాటలు. అయినా తాను ఎంచుకున్న మార్గంనుండి ఒక్క అంగుళం కూడా పక్కకు జరగలేదు.

కొంతమంది భారతీయ నాయకులు పాశ్చాత్య జీవన విధానాన్ని, ఆలోచనా విధానాలను కలిగి ఉండడం ఆయనకు నచ్చేది కాదు. ఆయన వ్రాసిన అనేక వ్యాసాలు, పాటలలో ఆ అనుభూతి వ్యక్తమయింది. రాజకీయ ప్రయోజనాల కోసం ఈ విధంగా రాజీ పడడం వల్ల ఎదురయ్యే ప్రమాదాల గురించి ఆయన నాయకులను అనేక విధాల హెచ్చరించారు.

"వినురా! నాప్రియసహోదరుఉడా – భారత భాగ్యశేఖరుడా!
గాంధి చెప్పిన త్రోవనడురా" – అంటూ గరిమెళ్ళ సందేశమిచ్చారు. బ్రిటిష్ ప్రభుత్వంపై గరిమెళ్ళ ఎంత ఉగ్రుడయ్యాడో "సైతాను ప్రభుత"అనే గేయం తెలియచేస్తుంది.

"దండాలండోయ్ – మేముండలేమండోయి బాబు
ఈ సైతాను ప్రభుతనింక – సాగనీమండోయి బాబు
వర్తకానికంటూ యింట్లో – పాదమెట్టినాడు బాబు
పాదంపెట్టి దొంగతనం ప్రారంభించాడండి బాబు"

అంటూ సాగే 60 పంక్తులగేయం ఉత్తేజితుల్ని చేస్తుంది.

గరిమెళ్ళ సత్యనారాయణ రాసిన గేయాలలో "కల్లు" అనే కింది గేయం కూడా బహుళ ప్రచారం పొందింది –

"కల్లు త్రాగినీయిల్లు నెల్లగుల్లచేయకు
నీవళ్ళురోగాలకెల్ల – వడ్డికీయకు
పిల్ల జెల్లలను తెచ్చి –
వీధి పెట్టకు
ముసలి తల్లితండ్రులను
బట్టి తన్ని కొట్టకు

తాను వ్రాసిన పుస్తకాలు, ఇతరుల పుస్తకాలు ప్రచురిస్తే బాగుంటుందని శారద గ్రంథమాల అనేది ప్రారంభించారు. దేశభక్తి తప్పించి మరో యుక్తి తెలియని గరిమెళ్ళకు భారీ ఆర్థిక నష్టమే మిగిలింది. ఆయన ఎక్కువగా రాజమండ్రి, విజయవాడ, మద్రాసులకు తిరుగుతూ వుండడంతో, వాటిని పట్టించుకోక పోవడం వల్ల వాటిని చెదలు తినేశాయి. ఎదురుగా కనిపించినప్పుడు తన కవిత్వాన్ని, తన పోరాట మార్గాన్ని ప్రశంసించిన వారే తన వెనకాల ఎటువంటి మాటలంటున్నారో ఆయనకు బాగా తెలిసింది.

1921లో శ్రీ గరిమెళ్ళవారి 'స్వరాజ్య గీతములు' పుస్తకం వెలువడింది. 1923లో హరిజనుల పాటలు, 1926లో ఖండకావ్యములు, భక్తిగీతాలు, బాలగీతాలు మొదలైన రచనలు వెలువడ్డాయి. గరిమెళ్ళ చాలాసార్లు జైలు శిక్ష అనుభవించారు. జైలులో వుండగా తమిళ, కన్నడ భాషలు కూడా నేర్చుకున్నారు. తమిళ, కన్నడ గ్రంథాలను తెలుగులోకి అనువదించారు. ఆంగ్లంలో కూడా గరిమెళ్ళ కొన్ని రచనలు చేశారు.

ప్రసిద్ధ తమిళ రచన తిరుక్కురళ్ ను తెనిగించారు. 'హర్ట్ ఆఫ్ ది నేషన్, మదర్ ఇండియా' మొదలైన ఇంగ్లీషు పద్యకావ్యాలను రచించారు. నాలాయిర్ వంటి ప్రసిద్ధ తమిళ పద్యాలను తెనిగించారు. తళ్ళికోట అనే కన్నడ నాటకాన్ని తెలుగులోకి అనువదించారు. ఆయన వ్రాసిన హరిజనోద్యమ గీతాలు, స్వరాజ్య గీతాలు తెలుగునాట ప్రతిధ్వనించాయి.

"కూలిపోతున్నది కూలిపోతున్నది
మూల మట్టముతోటి
కూలిపోతున్నది ప్రభుత్వం
కూకటివేళ్ళతో కూలిపోతున్నది

పర ప్రభుత్వం" అనే గేయాన్ని, అలా మరో గేయంలో –

"దండాలండోయ్ బాబు
మేముండలేమండోయ్ బాబు
సైతాను ప్రభుత్వాన్ని
సాగనీయమండోయ్ బాబు"

అంటూ సాగే 113 చరణాల దీర్ఘగేయాన్ని ఆయన రచించారు.

భారతదేశంలో వలస పాలకుల తీరును పరిశీలించడానికి బ్రిటన్ నుంచి వేల్స్ యువరాజు వచ్చినప్పుడు గరిమెళ్ళ 'ఏమయ్యా యువరాజా ఎందుకొచ్చావు?', అంటూ దొరల దోపిడీ పాలనను తీవ్రంగా నిరసించే గేయాన్ని వ్రాశారు. స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను శాశ్వతంగా హరించే పత్రికా ప్రభుత్వ ధిక్కారణ బిల్లులను, ప్రశ్నించే హక్కులను లేకుండా చేయాలని

ప్రయత్నించిన పాలకుల తీరుపై పోరు సాగించిన యోధుడుగా గరిమెళ్ళ చరిత్రలో మిగిలిపోయారు.

ఆంగ్లం నుంచి కొన్ని గ్రంథాలను తెలుగులోకి అనువదించారు శ్రీ గరిమెళ్ళ. భోగరాజు పట్టాభిసీతారామయ్య ఆంగ్లంలో వ్రాసిన ' ది ఎకనామిక్ కాంక్వెస్ట్ ఆఫ్ ఇండియా' అనే గ్రంథాన్ని తెలుగులోకి అనువదించారు. 1937లో 'చీనా–జపాన్' అనే పుస్తకాన్ని రచించారు. గరిమెళ్ళ జీవనోపాధి కోసం 1933లో మద్రాసు చేరుకున్నారు. అక్కడ 'గృహలక్ష్మి' పత్రిక సంపాదకులుగా ఉద్యోగంలో చేరారు. కొంతకాలం తరువాత అక్కడ మానివేసి ఆచార్య రంగాగారి 'వాహిని' పత్రికలో సహాయ సంపాదకులుగా చేరారు. కొద్ది రోజుల తర్వాత ఆంధ్రప్రభలో చేరారు. కొంతకాలం ఆనందవాణికి సంపాదకుడుగా పనిచేశారు. కొంత కాలం ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా జీవనం సాగించారు.

అభ్యుదయ రాజ్యాంగ విధానం, జవహర్లు మతం, పూర్వపు బానిసత్వం నేటి ధన బానిసత్వం, ధర్మమేవ జయతే, మాణిక్యం విచికము విరుగుడు, పాత కాంగ్రెస్ వర్కర్లు లోక సేవకులు కావాలి, తెల్లవాడు తొలగందె పండగేమిటి మనకి? కాంగ్రెస్ కు పట్టిన పిచ్చి ఆవేశం' మొదలైన వ్యాసాలు ఢంకా, ఆనందవాణి పత్రికల్లో వ్రాశారు.

ప్రముఖ రాజకీయ, సామాజిక వారపత్రిక 'జాగృతి' ప్రారంభమైన తొలినాళ్లలో గరిమెల్ల సత్యనారాయణ గారి వ్యాసాలకు అది వేదికగా ఉండేది. జీవితంలో ఎదురైన అనేక ఎదురు దెబ్బలతో ఒకరకంగా చెడి చెన్నపట్నం చేరారు గరిమెళ్ళ సత్యనారాయణ. 1933లో చెన్నపట్నం చేరిన తర్వాత ఆయన దాదాపు అజ్ఞాత జీవితమే గడిపారు.

తానెవరో గతంలో తెలిసినవారికి తప్పించి మరెవరికీ తాను ఫలానా అని చెప్పుకునే ప్రయత్నం చెయ్య లేదు. తనవల్ల దెబ్బతిన్న సోదరుడికి సహాయం చేసేందుకు చెన్నపట్నంలో వేల్పవేం అనే భోజన హొటల్ని ప్రారంభించారు. అదికూడా కలిసిరాకపోవడంతో భారీగా అప్పులు మాత్రమే మిగిలాయి.

చివరికి ఆ హొటల్ కి భవనం అద్దెకిచ్చినవారు తమ అద్దె బకాయిల కోసం గరిమెళ్ళను బయటకునెట్టి అక్కడి బల్లలు, తబేళాలన్నీ వేలం వేశారు. ఆ హొటల్ ముందు దీనంగా కళ్ళనీళ్ళు పెట్టుకుని బక్కచిక్కిన శరీరంతో మౌనంగా రోదించారు. అంతేకానీ నోరుతెరిచి తాను గరిమెళ్ళ సత్యనారాయణ అని ఒక్కసారి కూడా చెప్పుకోలేదు. ఆ మాట చెప్పినా లేక తాను వ్రాసిన "మాకొద్దీ తెల్లదొరతనం" అనేపాటను ఎత్తుకుని ఉన్నా చెన్నపట్నంలోని తెలుగువారు అప్పటికప్పుడు ఆయన్ని ఆదుకునే యత్నంచేసేవారేమో?

కానీ తాను దేశంకోసం పోరాటం చేశానేకానీ దాని వలన వచ్చిన పేరు ప్రఖ్యాతులను సొమ్ము చేసుకునేందుకు కాదనుకున్నారు. ఆర్థిక కష్టాలలో కొట్టుమిట్టాడుతున్న సమయంలోనే రెండవ భార్య కూడా మరణించింది. దహన కార్యక్రమాలు నిర్వహించేందుకు కూడా డబ్బులులేని దారిద్ర్యం. చివరికి ఇరుగుపొరుగులు ఆదుకుని ఆమెను సాగనంపాల్సి వచ్చింది.

గరిమెళ్ళ సత్యనారాయణది నష్టజాతకం అనుకోవాలో, స్వాతంత్ర్య పోరాటవీరులను మరచిపోయిన భారతీయులను నిందించాలో తెలీదు. 1947లో దేశానికి స్వాతంత్ర్యం లభించింది. గాంధీతత్వాన్ని పరిమితంగా వంటబట్టించుకున్న వారంతా పెద్ద పెద్ద పదవులు చేపట్టారు. కానీ గాంధీజీ మార్గమే జీవితం అనుకున్న గరిమెళ్ళలాంటి వారంతా ఆకలిబాధతో అలమటించటం మొదలెట్టారు. వారి త్యాగాలకు విలువలేదు. గరిమెళ్ళ గీతాల అవసరం ఎవరికీ లేకుండా పోయింది.

గరిమెళ్ళ తన చివరి రోజుల్లో దుర్భర దారిద్ర్యాన్ననుభవించారు. చుట్టూ తన గురించి తెలిసిన వారే. కానీ వారి మధ్యలో ఉన్నది తానేనని ఎవరికీ తెలియనివ్వని జీవితం. పట్టెడన్నం పెట్టేవారు లేక, ఆకలిబాధ తట్టుకోలేక చివరిరోజుల్లో చెన్నపట్నం వీధుల్లో బిచ్చమెత్తుకుంటూ తిరిగారు.

ఆయన చేతిలో పైసా విదల్చక విసుక్కున్న వారు ఆయన వ్రాసిన పాటలనే పాడుకుంటూ పోవటం, ఆ గేయ రచయిత గురించి ఘనంగా చెప్పుకోవటం విన్న గరిమెళ్ళ మనసు ఎటువంటి ఆవేదనకు గురైందో ఎవరికీ తెలియదు. తెలుసుకునే

ప్రయత్నం కూడా ఎవ్వరూ చెయ్యలేదు.

ఎందుకిలా? అని ఒక పరిచయస్తుడడిగితే "కొందరు త్యాగం చెయ్యాలి. కొందరు నశించి, నాశనమై పోవాలి. అప్పుడే దేశం బాగుపడుతుంది. దేశం బాగుకోరిన నేను ఇంతే" అన్నదే గరిమెళ్ళ సమాధానం.

శ్రీ గరిమెళ్ళ పేదరికం అనుభవిస్తున్న రోజుల్లో దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు కొంత సహాయపడ్డారు. వావిళ్ళ వేంకటేశ్వర శాస్త్రులు ప్రతినెలా ఆయనకు కొంత ఆర్థిక సహాయం చేసేవారు. వివిధ పత్రికలకు, ఆలిండియా రేడియోకి రచనలు చేసి కొంత గడిస్తున్నా ఆయన అవసరాలకు ఆ డబ్బు చాలలేదు. ఒకవైపు పేదరికం, మరోవైపు అనారోగ్యం ఆయనను బాగా దెబ్బతీశాయి. చివరిదశలో ఒక కన్ను పోయింది. పక్షవాతం వచ్చింది.

స్వాతంత్ర్యానంతరం మన పాలకుల వల్ల కూడా గరిమెళ్ళకు చెప్పుకోదగ్గ సహాయం లభించలేదు. దాంతో కొంతమంది మిత్రులు గరిమెళ్ళను ' మాకొద్దీ నల్ల దొరతనం ' అనే గేయం వ్రాయాలని అడిగారట. దేశభక్తుడు, స్వాతంత్ర్య పిపాసి అయిన గరిమెళ్ళ అందుకు అంగీకరించలేదుట.

ఆకలితో అలమటిస్తూ, దుర్భర పేదరికంలో డిశంబర్ 18, 1952న చెన్నపట్నంలో ఎవరికీ తెలియని వ్యక్తిగా గరిమెళ్ళ సత్యనారాయణ మరణించారు.

అంతకు రెండురోజుల ముందే పొట్టి శ్రీరాముల బలిదానంతో ఆంధ్రప్రాంతమంతా ఆందోళనలో ఉంది. అలాంటి సమయంలో ఆ ప్రజాకవిని ఒక అనామక శవంగా కొందరు ఇచ్చిన చందాలతో అంత్యక్రియలకు చేర్చారు. ఒక మహాకవి జీవితం అలా ముగిసిందన్న వాస్తవం తెలుగువారిలో చాలామందికి తెలీదు. ❁

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -25 : సంచిక - 13 హైదరాబాద్ డిసెంబరు - 2022

# జాతీయోద్యమంలో తెలుగు సాహిత్యం పాత్ర

**డా. నాయని మల్లికార్జున,** అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
చంచల్‌గూడ, హైదరాబాదు చరవాణి : 8985744426

ఒక సమాజ ఉన్నతికి ఒక ఆదర్శప్రాయుడైన ఒక వ్యక్తి లేదా కొంత మంది చేసే ప్రయత్నమే ఉద్యమం. ఆ ఉద్యమానికి ప్రధానమైన ఆయుధం సాహిత్యం. ఆ సాహిత్యం అనేక ప్రక్రియలలో వెలువడుతుంది. ఉద్యమ రూప కర్తలు తమ భావాలను ప్రజల్లోని తీసుకొని వెళ్లి ప్రజాభిమానంతో, బలంతో ప్రగతి పథంలోనికి చొచ్చుకొని వెళ్ళడానికి అనేక ప్రక్రియలలో అనగా పద్యం, గద్యం, వచన కవితలు, పాటలు, నాటకాలు, నవలలుగా ప్రచారంలో తీసుకొని వస్తారు. ఆ సాహిత్య రూప కర్తలు కవులే. 'కవులు ఎన్నుకోబడని శాసనకర్తల వంటి వారన్న' షెల్లీ అభిప్రాయం యదార్థం.

ఒక జాతి చరిత్రను నిర్మించడంలో కవుల పాత్ర మహత్తర మైనది. రూసో, వాల్టేర్ రచనలు ఫ్రెంచ్ విప్లవానికి దారితీసాయి. టాల్‌స్టాయ్, మాక్సింగోర్కి, డోస్టావిస్కీ ప్రభృతుల రచనలు రష్యా ప్రజల్లో అద్భుతమైన మార్పును తెచ్చాయి. ఆ సంఘటనల స్ఫూర్తితో తెలుగుకవులు కూడా పరాయి పాలనలోని భారత దేశాన్ని కాపాడటానికి, స్వాతంత్ర్య సాధనే లక్ష్యంగా తమ భావాలకు అనుకూలంగా తమ కలాలకు పదును పెట్టారు. తమ రచనల ద్వారా ప్రజల హృదయాల్లో జాతీయోద్యమ భావాలను ప్రేరేపించారు.

ప్రజలు తాము నివసిస్తున్న నేల మీద అభిమానాన్ని ప్రకటించడం, స్వజాతి జనుల మీద ప్రేమను పెంపొందించుకోవటం జాతీయతలో కనిపించే కొన్ని ముఖ్యాంశాలు. తరతరాలుగా కొనసాగుతున్న స్థానిక సత్సంప్రదాయాలపై ప్రగాఢమైన అభిమానం, నిర్దిష్ట పాలనా వ్యవస్థకి అనుగుణంగా మనుగడ సాగించే మానసిక స్థితిని కలిగి ఉండటం జాతీయత అనవచ్చు. సర్వసాధారణంగా ప్రజలు తమ ఆస్తిత్వాలకు తీవ్రంగా భంగం కలుగుతుందని భావించినప్పుడల్లా ఈ జాతీయతా భావాలు ఉద్యమ రూపంలో కనిపిస్తుంటాయి. భిన్న జాతులు, మతాలు, సంస్కృతులు ఉన్నప్పటికీ భారతదేశంలోని ప్రజలంతా తరతరాలుగా కలిసిమెలిసి జీవించేవారని చరిత్ర చెబుతుంది. బ్రిటీష్ వాళ్ళు వ్యాపారం కోసం వచ్చి, క్రమేపీ పాలనాధికారాన్ని చేజిక్కించుకోవడంతో వాళ్ళకు వ్యతిరేకంగా భారతీయుల్లో జాతీయతా స్ఫూర్తి అంకురించింది. ఆ స్ఫూర్తితో మన తెలుగు నేలపై వెల్లివిరిసిన సాహిత్యమును ఒక్కొక్క కవి, ప్రక్రియా పరంగా స్పృశించడం నా ఈ వ్యాసం యొక్క ఉద్దేశ్యం.

**1. ఖండ కావ్యాలు : –** అనేక మంది మహానుభావులు సామాన్య ప్రజల్లో జాతీయ భావాలను ప్రేరేపించడానికి తమ గళాలను, కలాలను ఏవిధముగా పదను పెట్టారో అనే విషయాలను ఈ శీర్షికలో స్పృశించడం జరుగుతుంది.

**(అ) చిలకమర్తి లక్ష్మీ నరసింహం :** తెలుగు నాట తొలి జాతీయోద్యమ కవి చిలకమర్తిగా పేర్కొనవచ్చు. బ్రిటీష్ వారు విభజించి పాలించే విధానంలో 1905లో బెంగాల్ను రెండు ముక్కలుగా విభజించడంతో భారతీయుల గుండెలు భగ్గుమన్నాయి. బిపిన్ చంద్రపాల్ దక్షిణ భారతదేశంలో ప్రముఖమైన పట్టణాల్లో ప్రేరణాత్మక ప్రసంగాలు చేసి, ప్రజలను ఉత్తేజపరచి, జాతీయోద్యమ స్ఫూర్తిని రగిలించారు. అందులో భాగంగా ఆంధ్రప్రదేశంలో మచిలీపట్టణం, విశాఖ పట్టణం, రాజమహేంద్రవరం వంటి

పట్టణాలలో ఉపన్యాసాలు చేశారు. 1907వ సంవత్సరం ఏప్రిల్ 5,6,7 తేదిల్లో రాజమండ్రిలో ఉత్తేజపూరితమైన ఉపన్యాసాలను చేయగా, వాటిని ప్రముఖ తెలుగుకవి చిలకమర్తి అనువదించారు. చివరి రోజు సభలో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వ దురాగతాలను, దోపిడీ విధానాన్ని జాతీయతా స్ఫోరకంగా, చైతన్య ప్రేరకంగా, ఆశువుగా ఈ క్రింది విధముగా పేర్కొన్నాడు.

**"భరత ఖండంబు చక్కని పాడి ఆవు**
**హిందువులు లేగదూడలై ఏడ్చుచుండ**
**తెల్లవారసు గడుసరి గొల్లవారు**
**పితుకుచున్నారు మూతులు బిగియగట్టి"**

అని చెప్పారు. చిలకమర్తి వారి ఈ పలుకులు తెలుగు ప్రజలను విపరీతంగా ఆకర్షించినవి. భారతమాతను పాడి ఆవుతో, భారతీయ సంపదను పాడితో, హిందువులను లేగలతో, వారనుభవించే కష్టాలను లేగదూడల ఏడ్పుతో వర్ణించారు. తెల్లవారిని గడుసరి గొల్లవారుగా అభివర్ణించి వారు నిర్ధాక్షిణ్యముగా, మన సంపదను కొల్లగొట్టడాన్ని సూచించారు. మూతులు బిగియగట్టి, అనే పద ప్రయోగముతో స్వాతంత్ర్య రహితమైన దుస్థితిని సామాన్యమైన ప్రజలకు అర్థమయ్యే విధముగా వ్యక్తపరిచారు. దానితో ఈ పద్యం తెలుగు ప్రజల నాలుకలపై నాట్యం చేసింది. ఇలా తొలి జాతీయోద్యమకవిగా చిలక మర్తి ఎందరో కవులకు స్ఫూర్తిని కలిగించారు. చిలకమర్తిగారి కంటే ముందటిదిగా ఒక అజ్ఞాత కవి వ్రాసిన గేయం ఒకటి కనిపిస్తుంది అది ఇలా ఉన్నది.

**"హిందువులారా! ఎన్నాళ్లీ గతి**
**మందమతులరై మాటికి జెడెదరో**
**నందనులగు మీరందరు స్రుక్కగ**
**యెందుకు నా బ్రతుకితరుల కోసమ**
**నా పంటను గల సారంబంతయు**
**నా వంతయు లేకే వెలికేగెను**
**చేవ చెడిన నేనే విధి బ్రతుకుదు**
**జీవించిన సార్థక్యంబేమిక**
**దూడనోరు గొట్టి ద్రోహంబు గొల్లలు**
**పాడి సమస్తము పరులకమ్ము గతి**
**కూడు లేని నా కొడుకుల గాదని**
**యేడకో నా ధనమెల్లను బోయెడి**
**చీము నెత్తురు చిక్కెనో లేదో**
**ఏమెయి బ్రతుకుదు – నీ దుర్దశతో**
**ప్రేమ జూపరే – ప్రేమ జూపరే**
**రామ! రామ! నా లావు చెడియెనిక**
**ఇకనైనను మీరెల్లరు సోదరులై ప్రకటింపుదు నాపై ప్రేమమ్మును'**

(ఆధునికాంధ్ర కవిత్వం పై జాతీయోద్యమ ప్రభావం డా. మద్దూరి సుబ్బారెడ్డి)

అంటూ సాగుతుంది ఈ గీతం. అనేక రకాలుగా ప్రత్యేకతలు సంతరించుకున్న గీతమిది. తెలియవస్తున్నంత వరకు జాతీయోద్యమ గీతాల్లో బహుశా తొలి తెలుగు ఉద్యమ గీతమిది. దీన్ని చిలకమర్తి వారే వ్రాసి ఉండవచ్చుననే భావన కూడా ఉన్నది.

ఇంకా చిలకమర్తి వారు దేశమాత కోసం సర్వస్వం త్యాగం చేయడానికి సన్నద్ధులు కావాలని ప్రభోదించాడు. మాతృభూమిని భక్తితో కొలిచే వారికి

**"చెరసాలలు పృధు చంద్రశాలలేయగున్, చేదోయి గిలించు న**
**య్య ర దండల్ విరిదండలయ్యెడున్, హేయంబైన చోడంబలే**
**పరమాన్నంబగు, మోటు కంబళులు దాల్పన్ పట్టు సెల్లాలగున్**
**స్థిరుడై యే నరు డాత్మదేశమున భక్తిగొల్చు నవ్వానికి**

**భరత ఖండంబె యొక పెద్ద బందె ఖాన**
**అందులో నున్న ఖైదీలు పొందు జనులు**
**ఒక్క గది నుంచి మార్చి వేరొక్క గదిని**
**బెట్టుటే కాక చెర యంచు వేర గలదె" !**

అంటూ బ్రిటీషు పాలనలో మొత్తం భారతదేశం బందిఖానాగా, హిందువులందరూ అందులో నున్న ఖైదీలుగానే అభివర్ణించాడు. ఆ రోజుల్లో రాజమండ్రిలో చిలకమర్తివారి పలుకులు వినబడని పెండ్లిగాని, సమావేశంగాని ఉండేదిగాదని ప్రతీతి.

**(ఆ) గురజాడ అప్పారావు :–** గురజాడ – దేశభక్తి ఈ రెండు మాటలను ఆధునిక తెలుగు సాహిత్యంలో విడదీసి చూడలేము. ఎక్కడ దేశభక్తి గురించి మాట్లాడుతామో అక్కడ గురజాడ గురించి ప్రస్తావన తప్పక వస్తుంది. అలాగే ఎక్కడ గురజాడ గురించి మాట్లాడుతామో అక్కడ దేశభక్తి ప్రస్తావన వస్తుంది. ఎందుకంటే సాహిత్యాన్ని సామాజిక ప్రయోజనానికి మాత్రమే ఉపయోగించిన మొదటి ఆధునిక తెలుగు కవి ఆయనే గురజాడ అప్పారావు దేశభక్తి ఖండిక ఆయన జాతీయ దృక్పథానికి, విశాల దృష్టికి, అభ్యుదయ కాముకతకు, విశ్వమానవ సౌభ్రాతృత్వానికి స్వర్ణ పతాక. ప్రజాకవిగా సరళమైన పదాలతో ముత్యాల సరాలు గేయ చంధస్సుతో జన సామాన్యానికి దేశభక్తి ప్రబోధం కలిగించారు.

**"దేశమును ప్రేమించుమన్నా**
**మంచి అన్నది పెంచుమన్నా**
**వొట్టి మాటలు కట్టిపెట్టవోయ్**
**గట్టిమేల్ తలపెట్టవోయ్ ......"**

**"దేశాభిమానం నాకు కద్దని**
**వొట్టి గొప్పలు చెప్పుకోకోయ్**
**పూని ఏదైనాను ఒక మేల్**
**కూర్చి జనులకు చూపవోయ్...."**

**"దేశమంటే మట్టి కాదోయ్**
**దేశమంటే మనుషులోయ్"**

ప్రజల్లో నిర్మాణాత్మకమైన గట్టిమేలు చేయడమే దేశాభిమానానికి నిదర్శనమని వొట్టి మాటలు కాదన్న ప్రబోధం ఈ జాతీయోద్యమ కవితలో కనిపిస్తుంది. గురజాడ ప్రయోగించిన ఈ వాక్యాలు ఎంతటి పదునైనవో ఇప్పటికి అనుభవంలోకి వస్తూనే ఉన్నది.

ఆనాటి పరిస్థితులలో మన దేశభక్తికి సంబంధించి రెండు అంశాలుగా చూడవలసి ఉండేది ఒకటి జాతీయ సమైక్యత, మరొకటి మత సహనం. ఇప్పటి రాష్ట్రాలు ఆనాడు వేర్వేరు దేశాలు, వాటన్నిటిని కలిపి ఉంచాలనుకోవడం దేశ సమైక్యత. మతం పేరుతో హిందుస్తాన్ – పాకిస్తాన్ అని భారతఖండం రెండుగా విడిపోకుండా చూడటం మతసహనం ఈ రెండు అంశాలపైనా గురజాడకు స్పష్టమైన అవగాహన ఉన్నది అందుకే ఆయన

**"చెట్టాపట్టాల్ పట్టుకొని దేశస్థులంతా నడువవలెనోయి**
**అన్నదమ్ముల వలెను జాతులు**
**మతములన్నీ మెలగవలెనోయి**
**మతం వేరైతేను యేమోయ్**
**మనసు లొకటై మనుషులుంటే**
**జాతీ యన్నది లేచి పెరిగి**
**లోకమున రాణించునోయి"**

అని ప్రబోధించాడు. కానీ ఆయన అనుకున్న రెండవది జరుగక తప్పలేదు.

**(ఇ) రాయప్రోలు సుబ్బారావు :–** రాయప్రోలు సుబ్బారావు భారత జాతీయాభిమాన స్ఫూర్తితో రచించిన జన్మభూమి గీతం ఇలా సాగింది.

**"ఏ దేశమేగినా ఎందుకాలిడినా**
**ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనిన**
**పొగడరా నీ తల్లి భూమి భారతిని**
**నిలుపరా నీ జాతి నిండు గౌరవము"**

అని జాతీయోద్యమ స్ఫోరకంగా దేశభక్తి తత్పరతను ప్రబోధించారు. జాతీయోద్యమంలో యువకుల్లో గొప్ప స్పందన కలిగించిన ఈ గీతం విపరీతమైన ప్రచారం పొందింది. అలాగే తమ్ముడా అనే గేయంలో భారతదేశ పురావైభవాన్ని ఇలా ప్రస్తావించారు.

**"శ్రీలు పొంగిన జీవగడ్డయి**
**పాలు పారిన భాగ్యసీమయి**
**వ్రాలినది ఈ భరతఖండము**
**భక్తిపాడర తమ్ముడా!**
**వేదశాఖలు పెరిగె నిచ్చట**
**ఆదికావ్యం బందె నిచ్చట"**

అంటూ వినిపించారు. రాయప్రోలు వారే ఆంధ్రాభిమానంతో తొలిసారిగా తెనుగుతల్లి పదాన్ని ప్రయోగించారు. జాతీయోద్యమంలో ఆంధ్రులు సమైక్యంగా పోరాడాలన్న కాంక్షతో 1914లో ప్రబోధం ఖండిక రచించారు. రాయప్రోలు వారి ఆంధ్రావళి కవితా సంపుటి" స్ఫూర్తితో విశ్వనాథ, దువ్వూరి, తుమ్మల, జాషువా, కరుణశ్రీ, కొడాలి వంటివారు ఆంధ్రాభి మాన కవిత్వ రచనకు పూనుకున్నారు. విశ్వనాథ వారి ఆంధప్రశస్తి, ఆంధ్ర పౌరుషం వంటి ఖండ కావ్యాలు దేశభక్తి ప్రదీప్తికి నిదర్శనాలు. జాషువా "భరతమాత" ఖండిక అత్యంత ప్రసిద్ధికెక్కిన దేశభక్తి కవిత.

**(ఈ) గరిమెళ్ళ సత్యనారాయణ :** "సుకవి జీవించు ప్రజల నాల్కలయందు" అనే జాషువా మాట గరిమెళ్ల సత్యనారాయణకు అక్షరాలా అతికినట్లుగా సరిపోతుంది. చిరకాలం ప్రజల నాల్కల మీద నర్తించే పాటను రాసి నారు గరిమెళ్ల సత్యనారాయణ. బ్రిటీష్ ప్రభుత్వ పాలనను గర్హిస్తూ, తెల్లవారిని నిరసిస్తూ, ప్రజలను ప్రబోధిస్తూ గేయాలు రాశారు. ఆయన గేయాల్లో ఆనాటి బ్రిటీష్ వారి దుండగాలను, దురాగతాలను కళ్ళకు కట్టినట్లు ఇలా వర్ణించారు.

**మా కొద్దీ తెల్లదొరతనము దేవ**
**మా ప్రాణాలపై పొంచి మానాలు హరియించె**
**పన్నెండు దేశాలు పండుచున్న గాని ॥ మాకొద్దీ ॥**
**పట్టెడన్నము లోపమండి ఉప్పు ముట్టకుంటె దోషమండి**
**నోట మట్టి కొట్టి పోతాడండి**
**అయ్యో కుక్కలతో పోరాడి కూడు తింటామండి ॥ మాకొద్దీ ॥**
**చూడి యావుల కడుపు వేడివేడి మాంసం**
**వాడికి బహు ఇష్టమంట**
**మాదు పాడి పశువుల కోస్తాడంట,**
**మా మతము పాడుచేస్తాడంట**
**మా చూడియావుల మంద సురిగి ఇంటికిరాదు ॥ మాకొద్దీ ॥**

ఇంకా దండా లండోయ్ / మేముండలేమండోయ్ బాబు / ఉప్పు పన్ను, పప్పు పన్ను / ఊరికెళితే పన్ను / సైతాను ప్రభుతనింక / సాగనీయమండోయ్ బాబు" మొదలగు కవితలతో తెల్లవారి పాలనలో ప్రజలకు కలిగిన బాధలను హృదయవిదారకంగా వర్ణించి నిరసించారు. సైతాను ప్రభుతలో 'సైతాను" పదప్రయోగం ఆ ప్రభుత్వ దుర్మార్గాన్ని సూచిస్తుంది. ఈ గేయం ఆనాడు గొప్ప ప్రచారంతో పాటు, గాంధీజీ మెప్పు పొందింది.

**(ఉ) త్రిపురనేని రామస్వామి చౌదరి :** ప్రజలను మేలుకొలిపే హేతువాద భావాలను వ్యక్తపరచడానికి సాహితీ రచనలను సాధనముగా త్రిపురనేని ఎంచుకున్నాడు. దేశభక్తి, హేతువాదం, సాంఘిక సంస్కరణ, ఆంధ విశ్వాసాల నిర్మూలన ఇలా ఏక కాలంలో పలు రంగాలలో అనితర సాధ్యమైన కృషి చేసినవారు త్రిపురనేని రామస్వామి. ఉబుసుపోకకో, రచయితగా కీర్తి కండూతితోనో ఆయన రచనలు చేయలేదు. ఆయన ప్రతి రచనకూ ఒక సామాజిక లక్ష్యం ఉంది. ఒక ప్రయోజనం ఉంది. ఆ లక్ష్యం, ఆ ప్రయోజనం ఆశించే ఆయన రచనలు చేశారు. ఆయన సాహిత్య కృషిని గుర్తించి, ఆంధ్ర మహాసభ ఆయనకు కవిరాజు అనే బిరుదునిచ్చి గౌరవించింది. ఆయన భావాలు ఎంత తీక్షణంగా ఉంటాయో, చెప్పే పద్ధతి అంత ఆసక్తికరంగా సాగుతుంది. గాంధీజీ మరణించినప్పుడు త్రిపురనేని రాసిన అనేక పద్యాల్లో మచ్చుకి ఒకటి". పూవులు తెప్పపై గదలిపోతివా యమునా తరంగిణీ పావన రాజఘట్టమున భౌతికదేహము గాల్చుకొంటివా..." ఆ కాలంలో త్రిపురనేని రామస్వామి చౌదరి వీర విప్లవవాదిగా పేరు తెచ్చుకున్నారు. అనీబిసెంట్ ప్రారంభించిన హెూమ్ రూల్ ఉద్యమానికి మద్ధతునిస్తూ, ప్రజల నుంచి మద్దతును ఆశిస్తూ రామస్వామి అనేక వ్యాసాలు రాశారు.

**వీరగంధము తెచ్చినారము**
**వీరుడెవ్వడో తెల్పుడీ**
**పూసిపోదుము మెడను వైతుము**
**పూలదండలు భక్తితో..."** అంటూ ఆయన రాసిన ప్రబోధాత్మక గీతం లక్షలాది ప్రజలను వెంటనే ఆకట్టుకుంది. ఇలా అనేక మంది కవులు తమ సాహిత్యముతో ప్రజల మనస్సుపై ప్రభావం కల్గించి భారత జాతీయోద్యమానికి దోహదం చేసినారు.

**2. నాటికలు :** గేయ సాహిత్యంతో పాటు నాటకములు ద్వారా కూడా జాతీయ ఉద్యమానికి ప్రేరేపణ కల్గించడానికి అనేక మంది నాటకములు రచించారు. ఎందుకంటే నాటకములు అతి సామాన్యుని కూడా కదిలిస్తాయి. అందులో కొని నాటికలు రచయితల పేర్లు పేర్కొనబడుతున్నది.

| | | |
|---|---|---|
| ముత్తరాజు సుబ్బారావు | ......... | "చంద్రగుప్త" (1932), |
| శేషుబాబు | ......... | అశోక రాజ్యము (1945) |
| ప్రభులింగాచార్యుల | ......... | పట్నాటి వీరచరిత్రము (1928) |
| ఉన్నవ లక్ష్మీనారాయణ | ......... | నాయకురాలు (1926) |
| నందూరి బంగారయ్య | ......... | ఆంధ్ర తేజము (1938) |
| వేదం వేంకటరాయశాస్త్రి | ......... | ప్రతాపరుద్రీయము (1897) |
| పోతుకూచి సుబ్బయ్య | ......... | ఆంధ్రవాణీ సామ్రాజ్యము (1944) |
| కోలాచలం శ్రీనివాసరావు | ......... | సుల్తాన్ చాంద్ బీ (1900) |
| కాళ్ళకూరి సాంబశివరావు | ......... | రంగరాయ కదన సమవాకారం (1899) |
| శ్రీపాద కృష్ణమూర్తి | ......... | బొబ్బిలి యుద్ధం (1908) |
| కొప్పరపు సుబ్బారావు | ......... | రోషనార (1921) |

మొదలైన నాటకాల్లో దేశవ్యాప్తంగానూ, ఆంధ్రప్రదేశంలోనూ ప్రజారంజకంగా పాలన అందించిన పాలకుల స్ఫూర్తినీ, వారి పోరాట పటిమనీ, వారు మహమ్మదీయులు, విదేశీయులతో పోరాడిన చారిత్రక సంఘటనలను వర్ణించారన్నారు. ఇవన్నీ జాతీయోద్యమ ప్రభావంతో రాసిన నాటకాలే.

**నవల :** జాతీయోద్యమములో గేయములు, పద్యములు, నాటికలతో పాటు నవలా సాహిత్యం కూడా తగిన స్థానం వహించింది. అనేక రచయితలు, సమాజోద్ధరణతో పాటు జాతీయ ప్రేరణ కలిగేలా నవలలు వెలువరించారు. అందులో సంఘ సంస్కర్త, స్వాతంత్ర్యయోధుడు, తెలుగు నవల సాహిత్య వైతాళికుడు అయిన శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ 1922 రచించిన 'మాల పల్లి' నవల అత్యంత ప్రాచుర్యం కల్గించింది. ఈ నవల పేరు వినగానే ఏదో ఒకే కులానికి చెందిన ఇతివృత్తము కలిగినదిగా అనిపిస్తుంది. కానీ ఇది సమానత్వం లేని చోట సమైక్యత సాధ్యము కాదని, ఇది సాధారణ జీవన సూత్రమని తెలియ చెప్పడానికి వ్రాసిన నవల ఉన్నవ లక్ష్మీనారాయణ (1877–1958) గుంటూరులో జన్మించారు. డబ్లిన్ యూనివర్సిటీ (ఐర్లాండ్)లో బారిస్టర్ చదువుతుండగా, అక్కడి ఐరిష్ హోమ్ రూల్ జాతీయ నాయకుడైన 'డీవాలేరా'తో ఏర్పడిన పరిచయం అతడిని ప్రభావితుణ్ని చేసింది. మద్రాసు హైకోర్ట్ చేపట్టిన న్యాయవాద వృత్తిని వదిలిపెట్టి తొలుత అతివాదిగా జాతీయోద్యమంలో ప్రవేశించినప్పటికి క్రమేణా గాంధేయవాదిగా మారారు. కాంగ్రెస్ వాది అయినప్పటికీ మత ప్రాతిపదికపై జరుగుతున్న ఖిలాఫత్ ఉద్యమాన్ని తను నమ్మిన విలువలకు కట్టుబడి నిర్మోహమాటంగా విమర్శించి సి.ఆర్. దాస్ వంటి నాయకుల మన్నన పొందారు. స్వాతంత్రోద్యమాలలో భాగంగా పల్నాడులో అటవీ నిబంధనాలకు వ్యతిరేకంగా జరిగిన పుల్లరి సత్యాగ్రహం (1921), ఉప్పు సత్యాగ్రహం (1931), క్విట్ ఇండియా ఉద్యమం (1942) లలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారు. జైలు పాలైన ఉన్నవ లక్ష్మీనారాయణ రాయవెల్లూరు జైలులో వుండగా ఈ నవలను దేశభక్తి పూరితంగా సంఘసంస్కరణాభిలాషతో రచించారు. ఈ మాలపల్లి నవల ప్రగతి శీలక తెలుగు సాహిత్య చరిత్రలో ఒక మేలిమలుపుగా, సామాజిక దృక్పథంలో ఒక ముఖ్య ఘట్టంగా, సంఘ సంస్కరణ సాహిత్యంలో ప్రామాణికంగా నిలిచింది. రాజకీయ వాతావరణాన్ని, గాంధీ మహాత్ముని ఆశయాల్ని, తెలుగువారి జీవన విధానాన్ని ప్రతిబింబించిన నవల మాలపల్లి. ఈ సాంఘిక నవలలో సాంఘీక దురాచారాలు, జాతీయ సత్యాగ్రహ ఉద్యమాలు, వర్ణ, వర్గ వ్యత్యాసాలు మొదలైన సమకాలీన పరిస్థితులను కన్నులకు కట్టినట్లు ఉన్నవ చిత్రించాడు. ఆనాడు హరిజనుల కుటుంబ గాథను ఇతివృత్తంగా ఎన్నుకొని నవల వ్రాయడమే సాహసం. ఇందులో కథానాయకుని పేరు సంగదాసు. ఈ పాత్ర ద్వారా ఉన్నవ ఆర్థిక, సాంఘిక, కుల వ్యత్యాసాలు

లేని సంఘ నిర్మాణ పునరుద్ధరణ చేయిస్తాడు. కాబట్టి ఈ నవలకు సంగవిజయం అనే పేరు కూడా సార్థకమయింది. తెలుగువారిపై 'మాలపల్లి' చూపించిన ప్రభావం బ్రిటీషు వారిని కలవరపరచి, ఈ నవలను నిషేధించేలా చేసింది. ఈ కోవలోనివే అడవి బాపిరాజు వ్రాసిన కోసంగి (1942–460), బుచ్చి బాబు వ్రాసిన చివరకు మిగిలేది (1946). కందుకూరి లింగరాజు గారు 'మాక్సిమ్ గోర్కి నవలను 'అమ్మ' పేరిట అనువాదం చేసి 1934లో ప్రచురించారు అయినప్పటికీ అది తెలుగు సాహిత్య కళాకారులను ఆకర్షించింది. అలాగే విశ్వనాథ సత్యనారాయణ రచించిన 'బద్ధన సేనాని', చిలకమర్తి – హేమలత నవలలు.

తెలంగాణలో ఒక ప్రత్యేక పరిస్థితి. దేశమంతా ఇంగ్లీష్ పరిపాలనను వ్యతిరేకిస్తే తెలంగాణలో మాత్రం ముష్కర నిజాం నవాబ్ పాలన కొనసాగడం ప్రజలు భరించలేకేపోయారు. రజాకార్ల ఆగడాలు, జాగీర్దార్, జమీందార్ల, భూస్వాముల ఫ్యూడల్ భావాలు, గ్రామాల్లో చిల్లర దేవుళ్ళుగా ఉన్న పటేల్, పట్వారీ, అమీన్సాబ్ల దోపిడిల వల్ల సామాన్య జనానికి ఒత్తిడులెక్కువైయ్యాయి. తెలంగాణ ప్రాంతంలో తెలుగు మాట్లాడే వారి సంఖ్య ఆధికంగా ఉన్నా ఉర్దూనే అధికార భాషగా మాధ్యమ భాషగా రుద్దబడింది. ఆంధ్ర జన సంఘము, ఆంధ్ర మహాసభ వంటి సంస్థలు ఏర్పడ్డాయి. ఉద్యమ బాటలోకి ప్రజలను పురికొల్పాయి. మాడపాటి హనుమంతరావు, కె.వి.రంగారెడ్డి, స్వామి రామానంద తీర్థ, కోదాటి నారాయణ రావు, పి.వి. నరసింహారావు, ఎమ్మెస్ రాజలింగం వంటి నాయకులు ఒక మార్గాన ఉద్యమిస్తే, రావినారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మద్దూమ్ మొహియుద్దీన్ వంటి నాయకులు మరో తోవలో సాయుధ పోరాటానికై ఉద్యుక్తులయ్యారు. ఇట్లా తెలుగు ప్రాంతమంతా స్వాతంత్ర్య సిద్ధికై సమర రంగంలో సాగుతున్న సమయాన సాహితీ రంగంలో సైతం జన జాగృతికై కలాలు కదలాడాయి. అవి తూటాలై, తుపాకులై తెల్లదొరలపై నైజాం ప్రభుత్వంపై ఎక్కుపెట్టబడ్డాయి. సామాన్యున్ని కదన రంగం వైపు కదిలింప సాగాయి. అయితే, అప్పటి సాహిత్యాన్ని సూక్ష్మ పరిశీలన చేస్తే మనకు జాతీయోద్యమం, ఆంధ్ర రాష్ట్ర సాధన, తెలంగాణ విముక్తి పోరాటం పాయలుగా కనిపిస్తాయి.

ఇలా జాతీయోద్యమంలో కవులు, రచయితలు, గేయాలు, నాటకాలు, నవలలు, కథలు విరివిగా వ్రాసి ఉద్యమస్ఫూర్తిని ప్రజల్లో రగిలించారు. స్వాతంత్ర్య సముపార్జనకు దోహదం చేశారు. వ్యాసం అతివ్యాప్తి దోషం కలిగించరాదని ముగించడమైనది. ❀

**ఉపయుక్త గ్రంథాలు :**

1. ఆంధ్రావళి ..... రాయప్రోలు సుబ్బారావు

2. తెలుగు త్రైమాసిక వైజ్ఞానిక పత్రిక ..... తెలుగు ఆకాడమి

3. గురుజాడ రచనలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

4. ఆధునికాంధ్ర కవిత్వంపై జాతీయోద్యమ ప్రభావం – డా. మద్దూరి సుబ్బారెడ్డి సిద్ధాంత వ్యాసం

5. అంతర్జాల సమాచారం.


తానా ప్రపంచ సాహిత్య వేదిక
సిలికానాంధ్ర
సిద్ధార్థ అకాడెమీ, విజయవాడ
రచయితల సంఘం ఆధ్వర్యంలో



# మూసీ ప్రత్యేక సంచిక

UGC Care List Approved Journals Under Arts and Humanities Category

## జాతీయోద్యమం - అనుభవాలు, జ్ఞాపకాలు, సాహిత్యం

## "National Movement – Experiences, Memories, Literature"

10 & 11 ఆగస్టు, 2022

